శ్రీకృష్ణరాయబారం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2018

SRIKRISHNA RAYABARAM
with Commentary

Commentary by
Vidwan Mudivarti Kondamacharyulu

T.T.D. Religious Publications Series No. 1289
© All Rights Reserved

First Print : 2018

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **“మహాభారతం”** అయ్యింది.

“యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్”

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలను వ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **శ్రీకృష్ణరాయబారం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

ఉద్యోగినం పురుషసింహ ముపైతి లక్ష్మీః అన్నారు. ఉద్యోగం అంటే ప్రయత్నం. పురుషుడు నిరంతరం ప్రయత్నశీలుడై ఉండాలి. కర్మణ్యేవాధికారస్తే అంటుంది భగవద్గీత. ఆ మాటకు కర్మయందు (పని లేదా ప్రయత్నం) మాత్రమే నీకు అధికారముందనే కాదు, కర్మయందు నీకు మాత్రమే అధికారమున్నది అని కూడ అర్థం. అంటే ఫలితాన్ని భగవంతునికి వదలాలి తప్ప పనినికూడ ఆయనకు వదిలెయ్యకూడదు. ధర్మరాజు ధర్మానికి బద్ధుడై 13 సంవత్సరాలు అరణ్య అజ్ఞాతవాసాలు చేశాడు తన తమ్ముళ్లతోను, భార్యతోను కలిసి. ఆ విధంగా అతడు ధర్మమనే పురుషార్థాన్ని సాధించాడు. ఇపుడు తన రాజ్యాన్ని తిరిగి సంపాదించుకోవాలి. అది అర్థమనే పురుషార్థం. రాజ్యసంపాదనవలన తాను తనను ఆశ్రయించుకొని ఉన్నవారు సుఖపడతారు. అది కామమనే పురుషార్థం. ఈ మూడు పురుషార్థాలు సాధించినవాడు మోక్షమనే పురుషార్థం పొందడానికి యోగ్యుడవుతాడు. తన ధర్మాన్ని అనుసరించి, అరణ్య అజ్ఞాతవాసాలు ముగించుకొని వచ్చాను కనుక దుర్యోధనుడు పిలిచి రాజ్యమిచ్చేస్తాడనుకొంటే అది కలలోకూడ జరిగేది కాదు. ఆ పెద్దమనిషికి అంతటి సౌజన్యమే ఉంటే మాయజూదం ఆడించి ధర్మరాజును వంచించి, అడవులకు పంపేవాడే కాదు. ఇవ్వకపోతే వాడి పాపాన వాడే పోతాడు అని ఊరుకోవడం పురుష లక్షణం కాదు. దేనికైనా ప్రయత్నం అంటూ ఒకటి ఉండాలి. యత్నేకృతే యది న సిధ్యతి కో త్ర దోషః అన్నారు. ప్రయత్నం చేసినా ఫలితం దక్కకపోతే దైవం అనుకూలించ లేదనుకోవచ్చు. అసలు ప్రయత్నమే చేయకపోతే ఆ నష్టానికి కారణం అతని సోమరిపోతు తనమే అని లోకం నిందిస్తుంది.

ఎక్కడ ధర్మబలం ఉంటుందో అక్కడ దైవబలం వెన్నంటి ఉంటుంది. దానికి నిదర్శనం అజ్ఞాతవాసం కాగానే రాజ్య పునస్సంపాదన విషయమై విరాటనగరంలో కృష్ణుడే ఆ విషయాన్ని కదుపుతాడు. అందరిలో వేడి పుట్టించాడు. ధర్మరాజు వెంటనే రాజ్యసంపాదన ఉద్యోగానికి పూనుకొన్నాడు. ద్రుపదపురోహితుని రాయబారిగా పంపించాడు. ధ్రుతరాష్ట్రుని గుండెలో గుబులు బయలుదేరింది. దుర్యోధనుడికి, ధ్రుతరాష్ట్రుడికి ఒక తేడా ఉంది. దుర్యోధనుడికి రాజ్యం ఇవ్వడం ఇష్టం లేదు. ఆ విషయం స్పష్టంగా చెప్పి, మీకు చేతనయింది చేసికోమంటాడు. ధ్రుతరాష్ట్రుడికి కూడా రాజ్యం ఇవ్వడం ఇష్టం లేదు. మొత్తం రాజ్యం తన కొడుకులకే కట్టబెట్టాలన్న దురూహతోనే ఉన్నాడు. కాని ఆ విషయం బయటకు చెప్పకుండగా, తన కొడుకులు తన మాట వినడం లేదు. వారిని ఒప్పించడంలో నేను అసమర్థుడిని అని చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేస్తాడు. ద్రుపద పురోహితునితో సరే మేము ఆలోచించుకొని కబురు చేస్తామని చెప్పి పంపించేస్తాడు. తరువాత సంజయుని రాయబారిగా పంపిస్తాడు ధ్రుతరాష్ట్రుడు. కఱ్ఱ విరగదు, పాము చావదు అన్న రీతిలో ఉంటుంది సంజయ రాయబారం.

"ధర్మరాజా! దుర్యోధనుడు మూర్ఖుడు. ఎవరు చెప్పినా మీకు రాజ్యం ఇవ్వడు. అలాగని యుద్ధానికిగాని సిద్ధపడతారేమో, అలాంటి పని మాత్రం చేయకు. ఎందుకంటే ధర్మరాజు ధర్మాత్ముడు, శాంతిప్రియుడు, అజాతశత్రువు అని లోకం కీర్తిస్తోంది నిన్ను. యుద్ధం చేయడం వలన ఆ మంచి పేరు పోతుంది. అశాశ్వతమైన రాజ్యం కోసం శాశ్వతమైన కీర్తిని పోగొట్టుకొంటావా! ఎలాగూ కొంతకాలం ముష్టి ఎత్తుకొని, కొంతకాలం అరణ్యవాసం చేసి, కొంతకాలం సేవక వృత్తిని ఆచరించి కాలం గడిపేశారు కదా! ఈ పైనికూడా అలాగే గడిపేస్తే జీవితం

వెళ్లకపోతుందా!" ఇదీ సంజయుడి రాయబారంలో ఫలితాంశం. అక్కడ ధర్మరాజు చెప్పిన సమాధానం మాత్రం సంజయునికి మతి పోగొట్టింది. "నేను శాంతి ప్రియుణ్ణి. యుద్ధం కోరుకోవడం లేదు. కాని మాకు రాజ్యం కావాలి. కాదంటే కనీసం ఐదుగురికి ఐదూళ్లయినా ఇమ్మను. దానికికూడ ససేమిరా అంటే మాత్రం యుద్ధం చేయడానికి వెనుకాడను. దానివలన నా కీర్తి పోతుందనుకోవడం లేదు. క్షత్రియులకు యుద్ధం ధర్మమే కదా! మా రాజ్యం మాకు ఇమ్మని మంచిమాటలతో చెప్పినా వినలేదు కాబట్టి యుద్ధానికి దిగి రాజ్యాన్ని కైవసం చేసికొంటే దానివలన కీర్తి వస్తుంది తప్ప అపకీర్తి రాదు. మా తమ్ముళ్ల బలం వారికి తెలియంది కాదు. ఆ పైని శ్రీకృష్ణుని తోడుపాటుకూడా మాకే ఉంది కనుక సమరం జరిగితే విజయం మాకు తథ్యం, అనవసరంగా కొడుకుల చావు కోరి తెచ్చుకోవద్దు" అని ధ్రుతరాష్ట్రునికి చెప్పమన్నాడు. తిరిగి వచ్చిన సంజయుడు ధ్రుతరాష్ట్రునితో 'ధర్మసూతి మెత్తని పులి' అని చెప్పాడు. దుర్యోధనుడు చిరుతపులిలాంటివాడు. ధర్మరాజు మెత్తని పులి. చిఱుతపులి మొండిగా దూసుకుపోతుంది. వేటగాడు సమర్థుడైతే వాడి చేతిలో హతమవుతుంది. మెత్తని పులి అంటే పిల్లిలాగా ఏమీ ఎఱుగనట్లు ఉంటుంది. ఆనుపాను చూసుకుంటుంది. సమయం చూసి పంజా విసిరితే ఎలాంటి వేటగాడైనా నేలకొరగాల్సిందే. ధర్మరాజు వ్యక్తిత్వం మొత్తం మెత్తని పులి అన్న చిన్న మాటలో కళ్లకు కట్టిన మహనీయుడు తిక్కన.

ఉద్యోగం పురుష లక్షణం అంటే స్త్రీలకు ఉద్యోగ శీలం (ప్రయత్న శీలం) ఉండక్కర లేదని అర్థం కాదు. వాఙ్మయంలో పురుష శబ్దం మానవ పర్యాయం. ధర్మార్థ కామమోక్షాలు పురుషార్థాలంటే స్త్రీలకు అవి అక్కర లేదని కాదుగదా! రామాయణంలో సుందరకాండలో హనుమంతుడు 'అమ్మా నీవు నా వీపుపై కూర్చో. నిన్ను రాముని దగ్గరకు తీసుకొనిపోతాను'

అని అన్నపుడు సీత ఆ పని చేసి ఉంటే రావణసంహారం జరిగేదే కాదు. రాముడు వచ్చి రావణుని చంపి నన్ను తీసుకు వెళ్లాల్సిందే అని పట్టుబట్టి, శత్రుసంహార ఉద్యోగానికి రాముని పురికొల్పింది సీత. ఇక్కడ చివరిగా శ్రీకృష్ణుడే రాయబారానికి బయలుదేరుతూ అందరి సందేశాలు అందుకొంటాడు. అప్పుడు ధర్మజాదులు ఐదుగురూ శాంతి వచనాలే పలికారు. అయితే అక్కడకూడ ధర్మరాజు మాటలలో శాంతి ప్రియత్వమే కనిపించింది తప్ప, దైన్యం కనబడలేదు. “సిరి నాకేలందునే గ్రాస వాసో దైన్యంబులు వచ్చు నా యరయు నీ చుట్టాలకున్” కాబట్టి యుద్ధం వద్దంటున్నాను తప్ప రాజ్యం అక్కర లేదనడం లేదు. ఒకవేళ యుద్ధం చేస్తే తప్ప రాజ్యం రాదు అనే పరిస్థితి వస్తే యుద్ధానికి కూడ వెనుకాడను నేను అన్నాడు. ఆ మాట కొంత ఊరట కలిగించింది ద్రౌపదికి. కాని సగం రాజ్యం కాకపోయినా కనీసం ఐదుగురికీ ఐదూళ్లిచ్చినా చాలంటూ క్రిందికి దిగిపోవడం ఆమెకు రుచించలేదు. పోనీలే! ఐదూళ్లే కదా వారడిగింది. ముష్టి వేసినట్లు ఆ ఐదూ ఇచ్చేస్తే పోలా అనుకొని తీరా దుర్యోధనుడు ఇచ్చేస్తే? తనకు జరిగిన పరాభవానికి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ద్రౌపది మనసు కుదుటబడుతుందా? అందుకని తన భర్తతో విభేదించినట్లు కాకుండా అన్న గారికి తన గోడు వెళ్లబోసికొన్నట్లుగా ఆమె మాట్లాడిన మాటలు ఏమైనా శ్రీకృష్ణుడు సమరానికే సై అనేటట్లుగా రాయబారం నెరపే విధంగా ఉన్నాయి.

వరమున బుట్టితిన్ భరతవంశము జొచ్చితి నందు బాండు భూ
వరునకు గోడలైతి జనవంద్యుల బొందితి నీతి విక్రమ
స్థిరులగు పుత్రులన్ బడసితిన్ సహజన్ముల ప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిట బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్॥
(ఉ.3-108)

నా పుట్టినిల్లు గొప్పది, మెట్టినిల్లు గొప్పది, నా మామగారు గొప్పవారు, భర్తలు గొప్పవారు, కుమారులు గొప్పవారు, సోదరులు గొప్పవారు.

ముఖ్యంగా సాక్షాత్తు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన నీవే నా సోదరుడివి. ఇంతకంటె భాగ్యం లోకంలో ఏ స్త్రీకైనా దక్కుతుందా? అటువంటి నాకే నిండు కొలువులో అంత దారుణమైన పరాభవం జరిగిందంటే అటువంటి నీచుల పరిపాలనలో సామాన్య స్త్రీలు తల ఎత్తుకొని తిరుగగలరా? కాబట్టి స్త్రీజన సంరక్షణకోసమైనా వారిని ఉంచాలో త్రుంచాలో ఆలోచించు అని చెప్పక చెప్పింది ద్రౌపది. అంతటితో ఆగలేదు.

నివు సుభద్రకంటె గడు నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయుదిట్టి నను బంకజనాభ! యొకండు రాజసూ
యావబృథంబునందు శుచియై పెనుపొందిన వేణి బట్టి యీ
యేవురు జూడగా సభకు నీడ్చె గులాంగన నిట్లొనర్తురే?
(ఉ.3-110) అంది.

రెండు పద్యాలలోను సరసిజనాభ, పంకజనాభ అని సంబోధించింది, అంటే నిన్ను సాక్షాత్తు విష్ణుమూర్తిగానే భావిస్తున్నాను. అంతటివాడి వైయుండి నీ చెల్లెలికింతటి ఘోర పరాభవం జరిగితే పోనీలే అని ఊరుకొంటావా? అని పౌరుషాన్ని రేకెత్తించింది. ధార్తరాష్ట్రసంహారం పాండవులకు చేసే సాయంగానే కాక, తన కర్తవ్యంగా కూడా శ్రీకృష్ణుడు భావించేలా ప్రేరేపించింది ద్రౌపది.

ఇవి దుస్ససేను వ్రేళ్ళం
దవిలి సగము ద్రెవ్విపోయి తక్కినయవి కౌ
రవులకడ దీఱుమాటల
యవసరమున దలపవలయు నచ్యుత! వీనిన్॥ (ఉ.3-118)

తన విరబోసికొన్న జుట్టు చూపించి, ఇవి దుశ్శాసనుడు పట్టుకొని బలవంతంగా ఈడ్చినపుడు తెగిపోగా మిగిలిన వెంట్రుకలు కౌరవులతో

మాట్లాడే సమయంలో వీటిని కాస్త గుర్తుకు తెచ్చుకో అంటూ రెచ్చగొట్టింది. పైగా అప్పుడుకూడా అచ్యుతా! అంటూనే సంబోధించింది. నీవు తలచుకోవాలే గాని ఏదీ నీ చేతినుండి జారిపోదు. ఏం తలచుకోవాలో ఆలోచించుకో అన్న గాఢత ఆమె మాటలలో కనిపిస్తుంది. 'కేశపక్షం వరారోహా గృహ్య వామేన పాణినా' అని మూలంలో కూడ ఈ సన్నివేశం ఇలా ఆవేశపూరితంగానే నడిచింది. (సం.5-80-34)

నా జుట్టు పట్టుకొని సభలోకి ఈడ్చిన దుశ్శాసనుడి శరీరం సమరాంగణంలో ముక్కలు ముక్కలుగా చెల్లాచెదరై పడి ఉండడం నా కళ్లారా చూస్తేనే గాని నా మనసు చల్లారదు. ధర్మరాజు నేను ఆ దుర్యోధనుడి శవాన్ని కళ్లారా చూడకపోతే ఇంత పెద్ద గద పట్టుకొని తిరిగే భీముడి బాహుబలం ఎందుకు. గాండీవమనే పెద్ద వింటిని చేతబట్టి తిరిగే 'కట్టి విక్రమంబు కాల్పనే' (ఉ.3-117) అని చాల కటువుగా మాట్లాడి శ్రీకృష్ణుని రక్తాన్ని ఉడుకెత్తించింది. ఆ విధంగా భారతంలో ధార్తరాష్ట్ర సంహారోద్యోగంలో ద్రౌపదిదే కీలకమైన పాత్ర.

ఇక ఉద్యోగ పర్వానికి కర్త కర్మ క్రియ అన్నీ తానై నడిపించిన వాడు శ్రీకృష్ణుడు. ద్రౌపది మాటలు విని ఆమెను ఓదారుస్తూ

లలనా! యుడుగుము నీ యే
డ్పుల కొలదియె కురునృపాల పుత్ర కళత్రం
బుల యేడ్పులింక వానిం
గలకల నవ్వుచు వినంగ గాలంబయ్యెన్॥ (ఉ.3-121)

ద్రౌపదీ! ఊరుకో. నీవెంత ఏడ్చావో అంతగాను ధ్రుతరాష్ట్రుని కోడళ్లు ఏడ్చే కాలం సమీపించింది. వారలా ఏడుస్తున్నప్పుడు నీవు వాటిని కల కల నవ్వుతూ వినే కాలం సమీపించిందిలే. అంటాడు కృష్ణుడు. అంటే రాయబారంలో ఏమి జరుగబోతోందో ముందుగానే ఉప్పందించేశాడు.

శ్రీకృష్ణుని రాయబార ఘట్టం జగత్ప్రసిద్ధం. ధృతరాష్ట్రునికి, ధార్తరాష్ట్రులకు ఎన్నో విధాలుగా ఎంతగానో నచ్చజెప్పాడు. కాని పోగాలము దాపురించినవారు కనరు వినరు మూర్కొనరు అన్న చందాన చెవిటివాని ముందు శంఖం ఊదినట్లయింది కృష్ణుడు చేసిన హితబోధ.

గ్రుడ్డివాడిననో, వృద్ధుడిననో, అసమర్థుడననో, నీ పిల్లలు నీ మాట వినడం లేదనో ఏదో వంక పెట్టి తప్పించుకొందామని అనుకొంటున్నావేమో, కాని ఆ పాపం మాత్రం నిన్ను విడిచిపెట్టదు.

సారపు ధర్మమున్ విమల సత్యము బాపముచేత బొంకుచే
బారము బొందలేక చెడబారినదైన యవస్థ దక్షులె
వ్వారలుపేక్ష సేసిరది వారల చేటగు గాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్॥
(ఉ.3-273)

ధర్మానికి, సత్యానికి హాని జరుగుతున్నపుడు చూస్తూకూడ సమర్థులైనవారు తమకెందుకులే అని ఉపేక్ష వహిస్తే వారే పాడవుతారు తప్ప ధర్మసత్యాలు ఎప్పుడూ క్షేమంగానే ఉంటాయి మహారాజా! ఇప్పటికైనా నోరు విప్పు అని హెచ్చరించాడు.

యత్ర ధర్మోహ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః॥ (సం.5-93-48)

పాండవులకు దగిన పాలు మేదిని బంచి యిచ్చుకంటె గార్యమెద్ది గలదు? వారి తండ్రిపాలు వారికి నిచ్చి నీ పాలు నీవు బుత్ర పౌత్ర చయము ననుభవించి సుఖులరై యుండుడు ఎఱుగవె యజాత శత్రుని నెఱియును ధర్మంబు సత్యనిష్ఠయు?

వారలు శాంతశూరులు భవచ్చరణంబులు గొల్వబూని యు
న్నారటుగాక మీకది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు భూవర! రెండు దెఱంగులందు నీ
కారయ బథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా॥
(ఉ.3-284)

అంటూ రాజ్యం ఇవ్వను పొమ్మంటే కయ్యానికి కాలు దువ్వినట్లే. వారు యుద్ధానికి సిద్ధంగానే ఉన్నారు అన్న అసలు విషయాన్నికూడ చెప్పేశాడు. అంతవరకు రాజ్యం ఇవ్వనంటే నోరు మూసుకుని కూర్చుంటారు తప్ప ధర్మజుడు యుద్ధానికి సిద్ధపడడనే నమ్మకం ధ్రుతరాష్ట్రునిది. అది కాస్త వమ్మయిపోయింది. కంగారు పుట్టింది. జామదగ్న్యుడు, కణ్వుడు, నారదుడు మొదలగువారెందరో ఎన్ని విధాలుగానో నచ్చజెప్పారు దుర్యోధనునికి. అతగాడు పెడచెవిన బెట్టాడు. విధివ్రాత ఎలా ఉంటే అలాగే జరుగుతుంది. కాని రాజ్యం ఇవ్వడం మాత్రం కుదరదు. సమరానికే సిద్ధం అన్నాడు. మీరెవరూ నాకు చెప్పనక్కరలేదని అంతటి మహామునులను అమర్యాదగా తిరస్కరించాడు. అపుడు కృష్ణుడు అందుకొని, ఎవరి అండ చూసికొని నీవు సమరానికి సై అంటున్నావో

వీర కారు పాండవేయుల బోర మా
ర్కొన సురాసురులకు గొలది గాదు
కాన వారితోడ కయ్యంబునకు నిర్ణ
యింపవలదు సంధి పెంపుజేయు॥ (ఉ.3-336)

ఈయున్న రాజులందరు
వాయుసుతునకొక్క యెత్తు వాడలిగిన శూ
లాయుధుడు వడకు నా కౌం
తేయులతో బెనగు టుడుగు ధీరవిచారా! (ఉ.3-337)

ఒక కార్యము సెప్పెద మీ
సకల బలమునందు సవ్యసాచి కెదురుగా
నొకరుడు గలిగిన గయ్యము
నకు బూనుడు రిత్త బహుజనక్షయమేలా? (ఉ.3-338)

అని భీమార్జునుల బలాన్ని ఒకసారి గుర్తు చేశాడు అచ్యుతుడు. అయినా వినలేదు. భీష్మద్రోణాదులు ఎన్నో విధాలుగా చెప్పారు. తండ్రి ధ్రుతరాష్ట్రుడుగూడ బతిమిలాడాడు. అయినా దుర్యోధనుని మనసు మారలేదు.

ఏమును వారు బంచికొని యేలుట గల్గదు పల్కుకుండుమిం
కేమియు వాడి సూది మొన యించుక మోపిన యంతమాత్రమున్
భూమి యొనర్చి పాండునృప పుత్రులకిత్తునె, యెవ్వరైన సం
గ్రామమునన్ జయంబు గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్॥
(ఉ.3-363)

అంటూ కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు. తల్లిమాటైనా వింటాడేమోనని గాంధారిని కొలువుకు రావించారు. ఆమెకూడ చెవినిల్లు కొట్టుకొన్నట్లుగా ఎంతగానో బతిమిలాడింది. ఏమాత్రమూ చలించలేదు సుయోధనుడు. సరికదా దుర్మంత్రంబునకు పూనుకొన్నాడు. కర్ణాదులతో కలిసి కృష్ణునే బంధించాలని పన్నాగం పన్నారు. అశక్త దుర్జనత చూపించాలనుకొన్నారు. పరమాత్మను బంధించడం ఎవరివల్లనవుతుంది. వెంటనే కృష్ణుడు విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ధ్రుతరాష్ట్రుని ప్రార్థన మేరకు ఆ సమయంలో దృష్టిని ప్రసాదించాడు స్వామి. అబ్బురపడుతూ ఆనందపడుతూ ఆ దివ్యమంగళ స్వరూపాన్ని కనులార దర్శించి, నీ విశ్వరూపాన్ని చూచిన ఈ పుణ్యనేత్రాలతో తిరిగి ఈ పాడు లోకాన్ని చూడలేను దృష్టిని ఉపసంహరింపమని కోరాడు ధ్రుతరాష్ట్రుడు. అలాగే చేశాడు వాసుదేవుడు.

ఉద్యోగపర్వంలో ఈ రాయబార ఘట్టం తలమానికం. తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగ విజయాలు నాటకంలోకూడ ఈ ఘట్టానికి ఏర్పడిన ప్రసిద్ధి ఇంతా అంతా కాదు. నాటకం మొదలయిన దగ్గరనుండి రాయబారం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తారు. అది అయిపోయాక చాలమంది ప్రేక్షకులు లేచి వెళ్లిపోయాక కొద్దిమంది మాత్రమే మిగిలిన నాటకాన్ని ఆస్వాదిస్తారు.

తమ్ముని కొడుకులు సగపాలిమ్మనిరి, పతితులు గారు నీయెడల భక్తులు, చెల్లియొ చెల్లకో తమకు చేసిన, అలుగుటయే యెఱుంగని మహామహితాత్ముడు, జెండాపై కపిరాజు, సంతోషంబున సంధి సేయుదురె వంటి పద్యాలు తెలుగునాట నిరక్షరాస్యులకుకూడ నోటికి వచ్చుంటే ఉద్యోగ పర్వం, అందునా, రాయబార ఘట్టం తెలుగువారి గుండెలలో గూడుకట్టుకొందనడానికి ఇంతకంటే ప్రబల తార్కాణం ఏమి కావాలి.

ఈ శ్రీకృష్ణదౌత్య సన్నివేశంతో మూడవ ఆశ్వాసం ముగుస్తుంది. నాల్గవ ఆశ్వాసంలో కుంతీ కృష్ణ సంవాదం, కృష్ణ కర్ణ సంవాదం, కృష్ణుడు ధర్మరాజును కలిసికొని జరిగిన విషయం చెప్పడం, ఇరుపక్షాల వారు యుద్ధానికి సన్నద్ధులు కావడం, కౌరవ పక్షంలో అతిరథ మహారథాది నిర్ణయం, అంబోపాఖ్యానం, భీష్మ పరశురామ యుద్ధం, శిఖండి యక్షుని వలన పురుషత్వాన్ని పొందడం, స్థూలకర్ణునికి కుబేరునివలన స్త్రీత్వం కలుగుట అనే వృత్తాంతాలతో నడుస్తుంది. అక్కడితో ఉద్యోగ పర్వం పరిసమాప్తమై యుద్ధపర్వాలు ప్రారంభమవుతాయి. ఈ నాలుగాశ్వాసాల ఉద్యోగపర్వం ఒక్కటీ ఒక ప్రత్యేక ప్రబంధంగా కనిపిస్తుంది. వీరరసానికి స్థాయిభావమైన ఉత్సాహం పొంగి పొర్లుతుంది ఈ పర్వంలో. విశ్వరూప సందర్శనయోగంలో అద్భుతరసం ఆవిష్కృతమయింది. ద్రౌపది నివేదనలో

కరుణ వీర రసాలు జంటనదులు లాగ ప్రవహిస్తాయి. నాలుగాశ్వాసాలలో సామ దాన భేద దండోపాయాలు నాలుగూ కనిపించడం తిక్కన అసాధారణ కావ్యనిర్మాణ దక్షతకు నిదర్శనం.

ద్రౌపది తన జుట్టును వాసుదేవునికి చూపించి పరుషోక్తులు పలికే సందర్భంలో నాటకీయతా నైపుణ్యం ఆవిష్కృతమవుతుంది. వెరసి ఉద్యోగ పర్వం ఉత్సాహపర్వమై చదువరులకు అడుగడుగునా అలరిస్తుంది. ఉత్కంఠా పర్వమై కౌతూహలాన్ని పెంచుతుంది. రాజనీతి స్వరూపం వ్యక్తమవుతుంది ఈ పర్వంలో. భారతమంతా ఒక ఎత్తు. ఉద్యోగ పర్వం ఒక ఎత్తు. మానవుడు ఎలా బ్రతకాలి, ఎలా బ్రతకకూడదు అనేది ఈ పర్వంలో విశదమవుతుంది. పెద్దలు చెప్పిన మాట వినకపోతే ఎలా చెడిపోతారో, మొండితనం ఎంత ప్రమాదకరమో, శాంతగుణం ఎంత కీర్తిదాయకమో యువతరానికి తెలియాలంటే ఉద్యోగపర్వం చదివి అవగాహన చేసికోవాలి. మంచితనాన్ని చేతకానితనంగా భావించేవాడు కౌరవులలాగ చెడిపోతారు, తగిన సమయం వచ్చేవరకు తొందరపడ కుండగా ఎదురుచూడగలిగేవారు పాండవులలాగ విజయావహులవుతా రన్న సత్యాన్ని ఉద్యోగ పర్వం లోకానికి అందిస్తుంది. దేనికీ తొందరపడ కూడదు, అలాగని మొత్తానికి మిన్నకుండకూడదు. 13 ఏండ్లు ఎదురు చూసి, పడవలసిన కష్టాలన్నీ అనుభవించి, అటుపైనికూడ దారికి వస్తారేమో అని శత్రువులకు ఒక అవకాశం ఇచ్చి, చివరిగా యుద్ధానికి సిద్ధపడిన ధర్మరాజు లోకానికి ఆదర్శం.

అయినదానికి, కానిదానికి కయ్యానికి కాలుదువ్వడమూ మంచిది కాదు, అలాగని అసలు పోరాట శీలమే లేకుండాను పోకూడదు. సహనము, పోరాటము ఈ రెంటినీ సమన్వయం చేసికో గలిగినవాడు

ధర్మరాజులాగ జీవితంలో నాయకుడౌతాడు. తన బలము నెదిరి బలమును గమనించ కుండగా మొండిగా ముందుకు పోతే దుర్యోధనునిలా చెడిపోతాడు, కేవలం శాంతి సహనం అంటూ కూర్చుంటే అసమర్థుడిగా మిగిలిపోతాడు అనే గొప్ప సందేశాన్ని రసవంతంగా లోకానికి అందించడంలో కవిబ్రహ్మ తిక్కన సోమయాజి తిరుగులేని కవి అనిపించుకొన్నాడు ఉద్యోగపర్వం ద్వారా.

గురుసహస్రావధాని
- **డా॥ కడిమిళ్ళ వరప్రసాద్,**
3-6-50, యళ్ళమిల్లివారి వీధి
నరసాపురం-534275
పశ్చిమగోదావరి జిల్లా. ఆం.ప్ర.
చరవాణి:9247879606

శ్రీకృష్ణరాయబారం

తే. సంజయుఁడు దన్ను వీడ్కొని చనిన ధర్మ
సుతుఁడు మఱునాఁడు దమ్ముల సుతుల నిష్ట
భృత్యవరులఁగొలువునకుఁ బిలువఁ బనిచి
యెల్లవారలు వినుచుండ నిట్టు లనియె. 1

ప్రతిపదార్థం: సంజయుఁడు= ధృతరాష్ట్రుడి దగ్గర నుండి దూతగా వచ్చిన సూత పుత్రుడైన సంజయుడు; తన్నున్= తనను (ధర్మపుత్రుడిని); వీడ్కొని= వదలి; చనినన్= (హస్తినాపురికి) వెళ్ళగా; ధర్మసుతుఁడు= యముని కుమారుడైన ధర్మరాజు; మఱు నాఁడు= మరుసటిదినం; తమ్ములన్= తమ్ములను; సుతులన్= కొడుకులను; ఇష్ట భృత్యవరులన్= తనకు ప్రీతిపాత్రులైన సేవకులను; కొలువునకున్= ఆస్థానానికి; పిలువన్+పనిచి= పిలుచుకొనిరండని పరిచారకులను పంపి; ఎల్లవారలు= అందరును; వినుచున్+ఉండన్= ఆలకిస్తూ ఉండగా; ఇట్టులు+అనియెన్= ఈ ప్రకారంగా అన్నాడు.

తాత్పర్యం: ఉపప్లావ్య పట్టణంలో ఉన్న తనను వదలి సంజయుడు హస్తినాపురికి వెళ్ళిన తరువాత ధర్మనందనుడు ఆ మరుసటిరోజు తన తమ్ముళ్ళనూ, కొడుకులనూ, సామంతరాజులనూ చెంతకు పిలిపించుకొని, వారంతా వింటుండగా ఇట్లా అన్నాడు:

విశేషం: సంజయుడి రాయబారం వలన పాండవులకు ఒరిగినదేమీ లేదు. అందువలన శ్రీకృష్ణుడి రాయబారం అవసరమైనది. దానికి శ్రీకారం చుట్టుతూ పాండవ నాయకుడైన ధర్మరాజు కాలయాపనం జరుగకుండా మరునాడే యత్నం ప్రారంభించాడు. తన స్వంత కొలువులో ఆత్మీయులనూ, సన్నిహితులనూ సమావేశపరిచాడు. అది ఒక విధంగా ఆత్మీయసభ, ఆంతరంగిక సభ, అత్యవసర సమావేశం. రాజు తనంతటతాను పిలిచిన సభ. నాటకీయంగా ఇదొక చిన్నరంగం

వంటిది. సభలో సభ్యులు కూర్చున్నట్లూ, వారందరూ వినేటట్లుగా ధర్మరాజు సమావేశ ప్రయోజనాన్ని వినిపించనున్నట్లూ ఒక నిండైన దృశ్యం ఈ తేటగీతిలో ప్రత్యక్షమయింది. (సంపా.)

క. 'మనము జనార్దను పాలికిఁ ।
జని కౌరవసభకు నతనిఁ జనుమని ప్రార్థిం
చిన మేలు బంధు హిత గురు ।
జనములతో రణము గాక సంప్రీతి యగున్.' 2

ప్రతిపదార్థం: మనము= మన మందరమూ; జనార్దను పాలికిన్= శ్రీకృష్ణుడి వద్దకు; చని= వెళ్ళి; కౌరవ సభకున్= ధృతరాష్ట్రుడి కొలువుకూటానికి; చనుము+అని= పొమ్మని; అతనిన్= ఆ శ్రీకృష్ణుడిని; ప్రార్థించినన్= వేడుకొన్నచో; మేలు= మంచిది; బంధు హిత గురుజనములతోన్= చుట్టాలు, మేలుకోరేవారు, గురువులు అయినట్టివారితో; రణము కాక= యుద్ధం జరగకుండ; సంప్రీతి+అగున్= సంతోషం కలుగుతుంది.

తాత్పర్యం: 'మన మంతా కలిసి మాధవుడి దగ్గరకు వెళ్ళి కౌరవసభలో మన విషయాలన్నీ చర్చించవలసినదిగా ఆయనను వేడుకొందాము. అట్లా చెయ్యటంవలన మనకెంతో మేలు కలుగుతుంది. ఎందుకంటే చుట్టాలతో, హితులతో, గురువులతో మనకు పోరు తప్పుతుంది. ఆనందం కలుగుతుంది.'

విశేషం: సభలో ముక్తసరిగా మూడు ముక్కలతో తాత్పర్యం తేటపడేటట్లు మాటలాడే ధర్మజుడి నేర్పు ఈ పద్యంలో స్పష్టం. ఇందులో రెండు వాక్యాలున్నాయి. రెండూ మిశ్ర సమ్మితంగా ఉన్నాయి. వాటిలో వాడిన పదాల వరుస కూడా కార్యక్రమ సూచకంగా ఉండటం విశేషం. 'అందరూ కలిసి జనార్దనుడి దగ్గరకు పోవాలి. ఆ తరువాత కౌరవ సభకు ఆయనను పొమ్మని ప్రార్థించాలి. అట్లా చేయటం శుభం. మనకు మేలు జరుగుతుంది. ఆ మేలు ఎటువంటిదంటే బంధువులతో, స్నేహితులతో చివరకు పెద్దలతో యుద్ధం

తప్పుతుంది. సంతోషం కలుగుతుంది' అని అన్నాడు. కార్యాన్నీ, ఫలాన్నీ ఒక్కసారి దర్శించగల వాక్యం. చమత్కార మేమంటే - ఈ వాక్యాలు సున్నితమైన ఆదేశాలు, నిపుణమైన నిర్ణయాలు, తీర్చిదిద్దిన తీర్మానాలు. రాజు ఒక సంగ్రహ ప్రకటన చేయటం, దాని నందరూ ఏకగ్రీవంగా అంగీకరించటం ఈ సన్నివేశ చాతుర్యం. ధర్మజుడి సర్వామోద నాయకత్వం ఈ సన్నివేశం ధ్వనింపజేస్తున్నది.

2. శ్రీకృష్ణుడే స్వయంగా 'కురుసభకు వచ్చి శాంతివచనాలు ధృతరాష్ట్రుడితో పలుకుతా'నని సంజయుడి రాయబారపు సందర్భంగా చెప్పాడు (ఉద్యో-1-360). ధర్మరాజు దానిని వ్యవస్థీకరించే ప్రయత్నం చేస్తున్నాడు. ఈ రచనలో శబ్దార్థగుణమైన ప్రసాదం పోషించబడింది. (సంపా.)

వ. అని పలికి వార లందఱు బలసి చనుదేర మాధవు మందిరంబున కరిగి యతని చేత సత్కృతుండయి సమస్త పరిజనంబులుం బరివేష్టింప నొక్క పార్శ్వంబునం బాంచాలియు సముచిత పరివార పరివృతయై యుండ నతండునుం దానును సుఖాసీనులై యుండి యతనితో నిట్లనియె: 3

ప్రతిపదార్థం: అని పలికి= అలా ధర్మరాజు వచించి; వారలు+అందఱున్= సోదరులు, కుమారులు, సామంతులు, ఇష్టభృత్యులు; బలసి= చుట్టుకొని; చనుదేరన్= తన వెంట రాగా; మాధవు మందిరంబునకున్= శ్రీకృష్ణుడి భవనానికి; అరిగి= పోయి; అతనిచేతన్= వాసుదేవుడి చేత; సత్కృతుండు+అయి= సమ్మానించబడి; సమస్త పరిజనంబులున్= పరివారమంతా; పరివేష్టింపన్= తన చుట్టూ చేరగా; ఒక్క పార్శ్వంబునన్= ఒకవైపు; పాంచాలియున్= పాంచాల దేశాధిపతి పుత్రికఅయిన ద్రౌపది; సముచిత పరివార పరివృత ఐ= తగిన పరిజనంతో చుట్టబడినదై; ఉండన్= ఉండగా; అతండునున్= ఆ శ్రీకృష్ణుడునూ; తానును= ధర్మరాజున్నూ; సుఖ+ఆసీనులు+ఐ+ఉండి= హాయిగా కూర్చుండినవారై; అతనితోన్= హరితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: అట్లా పలికి ధర్మజుడు తనవారంతా వెనువెంట రాగా శ్రీకృష్ణుడున్న చోటికి వెళ్ళాడు. అక్కడ ఆయన ఆదరణలు అందుకొన్నాడు. పరివారమంతా తనను సేవిస్తుండగా, తగిన పరిజనంతో ద్రౌపది ఒక ప్రక్క నుండగా ధర్మరాజు కృష్ణుడితోపాటు హాయిగా కూర్చున్నాడు. ఆ తరువాత ఇట్లా అన్నాడు :

విశేషం: ఇందులోనిది మాధవుడి మందిరంలోని రంగం, ఆ రంగంలో పాత్రలు కూర్చున్న రంగపరికల్పనం ప్రత్యక్షం. సామూహికంగా అందరూ కలిసి మాధవుడి మందిరానికి పోయారు. క్రమశిక్షణతో మెలగారు. విశేష మేమంటే పరివారంతో పాంచాలి కూడా అక్కడికి వచ్చింది. ఆమె పరిజనంతో కూడి ఒక ప్రక్కన కూర్చున్నది. మిగిలిన వారందరూ మరొక ప్రక్కన కూర్చున్నారు. ఉభయ పార్శ్వాలకు నడుమ ఉన్నతాసనాలమీద శ్రీకృష్ణుడు, ధర్మరాజు అభ్యర్థి కాబట్టి అతడే సంభాషణ మొదలు పెట్టాడు. అంటే మరొక రంగం ప్రారంభమైనదన్నమాట. రంగ పరికల్పన శిల్పంలో తిక్కన అందెవేసిన చేయి. (సంపా.)

క. 'ఆపదఁ గడవం బెట్టఁగ ।
నోపి శుభంబైనదాని నొడఁగూర్పను మా
కీ పుట్టువునకుఁ బాండు ।
క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా! 4

ప్రతిపదార్థం: మహాత్మా!= మహానుభావా!; ఆపదన్= కష్టాన్ని; కడవన్+పెట్టఁగన్= దాటించుటకు; ఓపి= సమర్థుడై; శుభంబు+ ఐనదానిన్= మేలు గూర్చునట్టిదానిని; ఒడఁగూర్పను= కలిగించుటకు; మాకున్= తన కుమారులమైన మాకు; ఈ పుట్టువు నకున్= ఈ జన్మకు; పాండుక్ష్మాపాలుఁడు= పాండు మహారాజు; నిన్నున్+చూపి= నిన్ను దిక్కుగా మాకు కనబరచి; చనియెన్= స్వర్గం చేరాడు.

తాత్పర్యం: 'మహానుభావా! కష్టాలను తొలగించటానికీ, శుభాలను సమకూర్చటానికీ సమర్థుడవైన నిన్ను ఈ జన్మకు మాకు దిక్కుగా చూపి, మా తండ్రి పాండుమహారాజు వెళ్ళిపోయాడు.

విశేషం: అలం: హేతువు. 1.ధర్మజుడి ధర్మనీతికి కీర్తిధ్వజం వంటి ఉపన్యాసానికి ఈ పద్యం నాందీ వాక్యం వంటిది.

2. 'మహాత్మా!' అనే సంబుద్ధి ధర్మరాజు శ్రీకృష్ణుడిలో దేవుడినీ, పూజ్యుడినీ, స్నేహితుడినీ, మార్గదర్శకుడినీ దర్శిస్తున్నాడని ధ్వని.

3. 'తండ్రి తరువాత తండ్రి వంటివాడవు నీవే' అని చెప్పే భావాన్ని 'మా తండ్రి పోతూ నిన్ను చూపించి వెళ్ళాడు' అనటం తెలుగు జాతీయం. అంటే- పాండవులు తండ్రి లేని బిడ్డలనీ, వారిని తండ్రిగా రక్షించి, పోషించి దీవించవలసిన బాధ్యత ఆయనదే అనీ పలికాడు ధర్మజుడు. ఈ జన్మకు నీవే మా తండ్రివి - అనటం శరణాగత భావానికి ప్రతీక.

4. కష్టాలనుండి గట్టెక్కించేవాడూ, శుభాలు కలిగించేవాడూ భగవంతుడు. లేదా మహాత్ముడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ విధుల వంటివవి. వాటిని పాండవులకు సదా సమకూర్చే పరమాత్మ శ్రీకృష్ణుడని ధర్మజుడు భగవద్భక్తి విశేష చిత్తవృత్తిని ప్రదర్శించాడు. 5. శ్రీమన్నారాయణుడైన శ్రీకృష్ణుడు స్నేహభక్తి భావవశుడై పాండవుల యోగక్షేమాలు చూడటం ప్రసిద్ధం.

6. ఉద్యోగపర్వంలో పాండవులను యుద్ధమనే ఆపద నుండి గట్టెక్కించటం, రాజ్యలాభమనే శుభాన్ని కలిగించటం శ్రీకృష్ణుడి కర్తవ్యాలని ధ్వని. తనంతట తానే హస్తినాపురానికి వెళ్ళి శాంతియత్నం చేయబూనటం - ఆపద గడవం బెట్టటం. ఫలిత మేమైనా పాండవులకు విజయాన్ని చేకూర్చి కౌరవనాశనం చేయటం శుభఫలం. ఈ రెండూ శ్రీకృష్ణుడి అంటే భగవంతుడి అధీనంలో ఉన్నాయనటం, ఆ భగవద్రూపుడైన శ్రీకృష్ణుడే తల్లి, తండ్రి, దైవం, రక్ష అని నివేదించుకొనటం ధర్మజుడి భక్తియుక్తమైన ధర్మనీతి వర్తనకు నిదర్శనం. ప్రార్థనకు శుభారంభం. ఇందులోని గుణం ప్రసాదం. (సంపా.)

తే. సమయ మిది మిత్త్రకార్యంబు చక్కఁ జేయ ।
నీ కతంబున నే మవినీతుఁ డైన
యా సుయోధను తోడి పోరాట దక్కి ।
యనుభవింతుము మా యంశమగు ధరిత్రి. 5

ప్రతిపదార్థం: మిత్త్ర కార్యంబున్= స్నేహితుల యొక్క పనిని; చక్కన్+చేయన్= సరిచేయటానికి; సమయము+ఇది= ఇది తగిన వేళ; నీ కతంబునన్= నీ మూలాన; ఏము= మేము; అవినీతుఁడు+ఐన= అవిధేయుడైనట్టి; ఆ సుయోధనుతోడి పోరాట= ఆ దుర్యోధనుడి తోడి కలహం; తక్కి= మాని; మా+అంశము+అగు ధరిత్రిన్= మా వంతు భూమిని; అనుభవింతుము= మేము అనుభవించగలం.

తాత్పర్యం: కృష్ణా! మిత్రులమైన మా పనిని చక్కబెట్టడానికి నీ కిది తగిన తరుణం. నీవు రాయబారానికి వెళ్ళితే అయోగ్యుడైన ఆ దుర్యోధనుడితో మేము యుద్ధం చేయవలసిన అవసరం రాదు. మా పాలికి వచ్చే రాజ్యాన్ని మేము అనుభవించగలం.

విశేషం: దివ్యాదివ్యుడైన శ్రీకృష్ణుడికి సూటిగా చేసిన ప్రార్థన ఇది. ఇందులో రెండంశాలు స్పష్టమవుతున్నాయి.

1. కురుపాండవుల వివాదం మిత్రకార్యంగా భావించుమని వేడికోలు. మిత్రకార్యమైతేనే మిత్రసమ్మితమైన ప్రబోధం నిర్వహించటానికి వీలవుతుంది. హితబోధకు అవకాశ మేర్పడుతుంది. ఇరువైపులా సమయ మెరిగి మందలించటానికి అనువుగా ఉంటుంది.

2. కౌరవపక్షంలో ప్రధానుడు దుర్యోధనుడు. అతడు నీతియుతుడు కాకపోగా అవినీతిపరుడు. అతడిని మిత్రవాక్యాలతో ఒక త్రోవకు తేవటం తేలికైన పనికాదు. అతడు రాజ్యపిపాసి. అందువలన యుద్ధం కాకుండా అతడు రాజ్యభాగమీయటం అసంభవం.

3. అటువంటి దుర్యోధనుడితో, అతడి తండ్రితో మంతనాలు సలిపి, హితవు చెప్పి పాండవులకు న్యాయంగా రావలసిన రాజ్యభాగాన్ని తిరిగి ఇప్పించటానికి శ్రీకృష్ణుడు కృషి చేయాలి.

4. ఈ పద్యం 6వ పద్యానికి అనుబంధం. అది సూత్రం. ఇది ఉదాహరణం. అది శ్రీ కృష్ణుడి దక్షతను తెలిపేది. ఇది ఆ దక్షత వలన సాధించదగిన అసాధ్యకార్యాన్ని నిర్దేశించేది.

5. ఇందులో ధర్మరాజు శాంతియుతంగా తనకు రావలసిన నేల వాటాను మాత్రమే కోరు తున్నాడు. దానికి దుర్యోధను డంగీకరించడు. సగమిస్తే పూర్తిగా జయించగల పరాక్రమం పాండవులకున్నదని అతడికి తెలుసు. ధర్మజుడు భాగం అడుగుతున్నాడు. కాదంటే మొత్తం రాజ్యాన్నే ఆక్రమిస్తాడు. భావి వ్యూహమంతా 'పోరాట దక్కి యనుభవింతుము మా యంశమగు ధరిత్రి' అనే వాక్యంలో బీజప్రాయంగా నిక్షిప్తం చేయబడి ఉన్నది.

6. కాబట్టి ఈ పద్యం భావి యుద్ధోద్యోగ బీజతుల్యం. గుణం ప్రసాదం (సంపా.)

వ. నీకు మేము ప్రద్యుమ్నాది కుమారుల తోడివారము, మమ్ము దురితంబులు వొరయకుండ నరసి రక్షింపు' మనవుడు వాసుదేవుండు 'నీ పంచిన యట్ల చేయంగలవాఁడ; నెయ్యది తలంపు? సెప్పు' మనిన నజాతశత్రుండు 'నీవు కరినగరంబున కరిగి కౌరవులతోడం దగిన మాటలాడి తెఱంగు సేయవలయు' నని ప్రార్థించి, యతని నియ్యకొలిపి యిట్లనియె: 6

ప్రతిపదార్థం: నీకున్= నీకు; మేము= పాండవులం; ప్రద్యుమ్న+ఆది కుమారులతోడి వారము= ప్రద్యుమ్నుడు మొదలైన నీ పుత్రులతో సమానులం; మమ్మున్= మమ్ములను; దురితంబులు= పాపములు; పొరయక+ఉండన్= చెందకుండేటట్లుగా; అరసి= విచారించి; రక్షింపుము= కాపాడుము; అనవుడున్= అని ధర్మరాజు వేడిన మీదట; వాసుదేవుండు= వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడు; నీ పంచిన+అట్లు+అ= నీవెట్లా చేయుమని చెపుతావో ఆ విధంగా; చేయన్+కలవాఁడన్= చేయగలను; ఏ+అది+తలంపు+చెప్పుము= నీ ఉద్దేశ మేమిటో నాకు తెల్పుము; అనినన్= అని శ్రీకృష్ణుడు పలుకగా; అజాతశత్రుండు= విరోధులే లేని ధర్మరాజు;

నీవు కరినగరంబునకున్+అరిగి= నీవు హస్తినాపురికి వెళ్ళి; కౌరవులతోడన్= ధృతరాష్ట్రుడు మొదలైనవారితో; తగిన మాటలు+ఆడి= ఉచితములైన పలుకులు పల్కి; తెఱంగు+ చేయవలయున్= ఒక దారి నేర్పరచాలి; అని ప్రార్థించి= అని వేడుకొని; అతనిన్= శ్రీకృష్ణుడిని; ఇయ్యకొలిపి= సమ్మతింప జేసి; ఇట్లు+అనియెన్= మళ్ళీ ఈ ప్రకారం పలికాడు.

తాత్పర్యం: కృష్ణా! ప్రద్యుమ్నుడు మొదలైన నీ కుమారులు నీకు ఎట్లాంటివాళ్ళో మేము కూడా అట్లాంటి వాళ్ళమే. మాకు పాపాలు సోకకుండే టట్లు ఆలోచించి మమ్మల్ని కాపాడుము' అంటూ ధర్మనందనుడు ప్రార్థించాడు. అంతట శ్రీకృష్ణుడు 'నీవు ఏమి చేయుమని ఆదేశిస్తావో అట్లా చేస్తాను. నీ అభిప్రాయ మేమిటో చెప్పు' మన్నాడు. అప్పుడు ధర్మజుడు కృష్ణుడితో 'నీవు హస్తినాపురికి పోయి కౌరవులతో తగుమాటలాడి ఒకదారి నేర్పరచాలి' అని అర్థించి, అందు కాయనను అంగీకరింపజేసి మళ్ళీ ఇట్లా పలికాడు :

విశేషం: 1. రక్షించుమని ధర్మరాజు శ్రీకృష్ణుడిని - దేవుడిని ప్రార్థించినట్లు ప్రార్థిస్తున్నాడు. ఆ రక్షా విధానం పితాసుత సంబంధ బంధురమై ఉండాలని తమను ప్రద్యుమ్నాదులతో పోల్చుకొన్నాడు. అంటే శ్రీకృష్ణుడిని పాండవుల కపికిశోర న్యాయంతో రక్షించుమని వేడుతున్నారని భావం. పాండవ యత్నం లేకుండా భగవంతుడైన శ్రీకృష్ణుడి యత్నమే కార్యంగా సాగాలని వేడుకొన్నాడు. అంటే, పాండవుల భారమంతా శ్రీకృష్ణుడిపై ఉంచారన్నమాట.

2. పాండవులకు పాపాలు సోకకుండా కార్యం నిర్వహించుమని మరొక వేడికోలు. ఇది ధర్మజుడి ధర్మనీతి వర్తనాన్నీ, భగవంతుడికి ప్రీతిపాత్రమైన ప్రవృత్తినీ వ్యంజింపజేస్తున్నది. ఉద్యోగంలో రాజనీతి ప్రవర్తిల్లినా, అది ధర్మహాని కలిగించి పాండవులకు అపకీర్తిని, పాపఫలితాన్ని కలిగించకూడదు. అర్థం కంటె ధర్మమే ధర్మరాజుకు ప్రీతి. అది దేవుడు మెచ్చే గుణం.

3. ధర్మరాజు ప్రార్థిస్తున్నాడు. శ్రీకృష్ణుడు 'నీ ఆదేశాన్ని అక్షరాలా పాటిస్తా'నని అంటున్నాడు. ఇక్కడ ఒక రాజనీతి ధర్మసూత్రం ఉన్నది. శ్రీకృష్ణుడు తానే హస్తినాపురానికి పోవాలని నిశ్చయించాడు. దానికి ధర్మజుడి అనుమతిని కోరలేదు. అయితే ధర్మజుడు ఆ ప్రతిపాదనను నిండుసభలోనే సమ్మతించాడు. కాగా, శ్రీకృష్ణుడు కురుసభలో స్వతంత్ర ప్రతిపత్తితో మాట్లాడతాడు. అందువలన ఆ మాటలాడేటప్పుడు ఏ పక్షానికీ అతడు ప్రాతినిధ్యం వహించక ధర్మదేవతలవలె పలుకవచ్చును. కాబట్టి, ముందుగానే తన వాదాన్ని శ్రీకృష్ణుడి ముందు నివేదించుకొనటానికి ధర్మరాజు పూనుకొన్నాడు. శ్రీకృష్ణుడు మనసు విప్పి, ధర్మరాజు ఏది ఆజ్ఞాపిస్తే దానినే చేస్తానని చెప్పి, తాను పాండవపక్షాననే హస్తినకు వెళ్ళుతున్నట్లు ప్రకటించాడు. దానితో ప్రభువు ధర్మరాజనీ అతడి పంపున వెళ్ళుతున్న రాయబారి శ్రీకృష్ణుడనీ భావించే అవకాశం కలిగింది. దానిని ధర్మరాజు చక్కగా వినియోగించుకొని 'నీవు హస్తినాపురానికి పోయి కౌరవులతో తగు మాటలాడి న్యాయం చేయు'మని కోరాడు. అంటే- మొదట శ్రీకృష్ణుడు స్వీయ సంకల్పంతో పోదలచాడు. ఇప్పుడు పాండవ ప్రార్థనకు అనువుగా పోవనిశ్చయించాడు. శ్రీకృష్ణుడు ఎంత స్వతంత్రుడో, అంతటి భక్తపరతంత్రుడని రాజనీతిపరంగా కూడా ప్రదర్శించటం ఈ సన్నివేశ విశేషం. (సంపా.)

సీ. **'మా తండ్రి తలఁపును నాతని నందను ।**
చందంబు నిన్న నా సంజయుండు
పలికిన పలుకులఁ దెలిసెఁగదా నీకు; ।
వారి చిత్తము భంగి వాఁ డెఱుంగుఁ;
బాలు పంపనియీక మేలిమాటలన మ ।
మ్మలుక దీర్చెదరు తా; రధిక దుష్క
రంబైన యాసమయం బేము పదుమూఁడు ।
వత్సరంబులు సల్పి వచ్చియుండఁ

**ఆ. గులము పాడి నడపఁ దలఁపడ; పతి సెడఁ ।
దలఁచెనేనిఁ గొడుకు వలచినట్టి
వాఁడు గాన యతని వక్రత మాన్పలేఁ; ।
డింతకంటెఁ గలదె యెడరు మాకు? 7**

ప్రతిపదార్థం: మా తండ్రి తలఁపును= మా నాయనగారైన ధృతరాష్ట్రుడి ఉద్దేశం; ఆతని నందను చందంబున్= ఆయన కొడుకైన దుర్యోధనుడి తీరూ; నిన్న= నిన్నటి దినం; ఆ సంజయుండు పలికిన పలుకులన్= దూతగా వచ్చిన సంజయుడు మాటలాడిన మాటల వలన; నీకున్= నీకు; తెలిసెన్+కదా!= తెలిసింది కదా!; వారి చిత్తము భంగిన్= ఆ కౌరవుల మనోవైఖరి; వాఁడు+ఎఱుంగున్= ఆ సంజయుడికి తెలుసు; పాలుపంపు+ అని+ఈక= మీ భాగమునకు వచ్చిన భూమి ఇంతని ఇయ్యక; మేలి మాటలన్+అ= తియ్యని పలుకులతోనే; తారు= ఆ కౌరవులు; మమ్ము+అలుక+తీర్చెదరు= మేము అలుగకుండ బుజ్జగిస్తారు; అధిక దుష్కరంబు+ఐన= చేయుట కేమాత్రం శక్యం కాని; ఆ సమయంబున్= ఆ ప్రతిజ్ఞను; ఏము= మేము; పదుమూఁడు వత్సరంబులు సల్పి= పన్నెండేళ్ళరణ్యావాసం; ఒకయే డజ్ఞాతవాసం చేసి; వచ్చియుండన్= రాగా; పతి= ధృతరాష్ట్రుడు; కులము పాడి నడపన్= వంశధర్మం సాగించుటకు; తలపఁడు+అ= అనుకొనకున్నాడు; చెడన్+తలఁచెనేనిన్= చెడిపోదలచు కుంటే; కొడుకున్ వలచినట్టివాఁడు= దుర్యోధనుడిమీద దురభిమానం చూపువాడవు తున్నాడు; కానన్= కాబట్టి; అతని వక్రతన్+మాన్పన్+ లేఁడు= కొడుకు కుటిలబుద్ధిని తొలగించలేకున్నాడు; ఇంతకంటెన్= ఈ విషమ స్థితికంటె; మాకున్= అన్నదమ్ములమైన మాకు; ఎడరు= ఆపద; కలదె?= మరొకటున్నదా? (లేదని భావం.)

తాత్పర్యం: 'నిన్న సంజయుడు మాట్లాడిన మాటల వలన మా తండ్రి ధృతరాష్ట్రుడి ఉద్దేశ మేమిటో, అతడి కుమారుడైన దుర్యోధనుడి తీరు ఎటువంటిదో నీకు తెలిసింది కదా! ఆ తండ్రి కొడుకుల చిత్తవృత్తులు ఎట్లాంటివో సంజయుడికి తెలుసు. మా రాజ్యభాగం మాకియ్యకుండా, మాకు కోపం రాకుండా, కల్లబొల్లి మాటలతో బుజ్జగిస్తున్నారు. చెప్పిన ప్రకారం మేము ఏమాత్రం చేయశక్యంకాని అరణ్యాజ్ఞాతవాసాలు పదమూడేళ్ళు చేసి వచ్చిఉండగా ధృతరాష్ట్రుడు వంశధర్మం పాటించకున్నాడు. చెడదలచియే అతడు కొడుకు దారి ననుసరిస్తున్నాడు. అతడికి కొడుకుపట్ల వల్లమాలిన దురభిమానం కాబట్టి, సుయోధనుడి కుటిలత్వం మాన్పలేకున్నాడు. ఇంతకంటె మాకు విపత్తు మరేముంటుంది?

విశేషం: 1. ధర్మజుడు మహావక్త. విషయ స్వభావాన్ని బట్టి దానిని ఆతడు ప్రపంచించే తీరు మారుతూ ఉంటుంది. శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి పరిష్కరించవలసిన సమస్యలోని ప్రధానాంశాన్ని మొదట సవిస్తరంగా, సమర్థవంతంగా ప్రతిపాదించా డీ పద్యంలో. 'ఇంతకంటెఁ గలదె యెడరు మాకు?' అన్నది ప్రధానాంశంలోని ప్రాణం. 'ఆపదఁ గడవం బెట్టగ నోపెడి' శ్రీకృష్ణుడికి తన కేర్పడిన ఆపద (ఎడరు)ను పేర్కొన్నాడు.

2. సంజయుడి రాయబారం వలన దుర్యోధన ధృతరాష్ట్రుల మనోగతం తెల్లమైపోయింది. రాజ్యభాగమీయకుండా మాయమాటలతో పాండవుల కోపం చల్లార్చే సాంత్వన వచనాలు పలుకుతున్నారు. పాండవులు దుష్కరమైన అరణ్యాజ్ఞాతవాసాలు నియమంతో గడపినా వంశ మర్యాదను పాటించి కౌరవులు రాజ్యభాగమిచ్చే ఆలోచన చేయరు. దుర్యోధనుడు దుర్మార్గుడై నాశనం కావటానికి సిద్ధమైనా, అది తెలిసిన ధృతరాష్ట్రుడు తన కొడుకు వక్రబుద్ధిని మాన్పలేదు. కొడుకును కాదనలేని ధృతరాష్ట్రుడి చిత్తవృత్తియే పాండవులకు అడ్డువచ్చిన పెద్ద సమస్య. దీనిని తీర్చి కార్యాన్ని శాంతంగా సాధించుకొనటమే శ్రీకృష్ణుడి ముందున్న సమస్య - అని ధర్మరాజు పండు ఒలిచి చేతిలో పెట్టినట్లు చెప్పాడు.

3. 'పాలుపంపని యీక.....తారు' - అనేది సంజయుడి రాయబారపు సారాంశం. దీనికి మూలం. "అప్రదానేన రాజ్యస్య శాంతి మస్మాసు మారతి" (సం. 5-70-80) యుద్ధోన్ముఖులు కాకుండా శాంతి పరచటానికే. (సంపా.)

క. జననియు సమస్త బాంధవ ।
జనములుఁ బ్రియమంద, వారి శాంతులఁగాఁ జే
యను, నెమ్మిగ నొక్కటియై ।
మననుం దెలఁగేది యునికి మా పౌరుషమే? 8

ప్రతిపదార్థం: జననియున్= మా తల్లిఅయిన కుంతీదేవి; సమస్త బాంధవ జనములున్= చుట్టాలందరున్నూ; ప్రియము+అందన్= సంతోషం చెందగా; వారిన్= దుర్యోధనాదులను; శాంతులన్+కాన్+చేయను; నెమ్మిగన్= కూర్మితో; ఒక్కటి+ఐ+మననున్= కౌరవులున్నూ మేమూ కలసి మెలసి జీవించటానికీ; తెలఁగు+ఏది+ఉనికి= దారి దోచక ఇట్లా పడిఉండటం; మా పౌరుషమే?= మాకు మగతనం అవుతుందా?

తాత్పర్యం: మా తల్లీ, చుట్టపక్కాలూ హర్షించేటట్లూ, దుర్యోధనాదులందరూ యుద్ధంమాట ఎత్తకుండా శాంతించేటట్లూ, కౌరవులూ మేమూ కలసి మెలసి ఒద్దికగా జీవించేటట్లూ మార్గం తెలియక ఇట్లా బ్రతకటం మాకు మగతనం కాదు.

విశేషం: ఎడరు తీరటంవలన రెండు ఫలితాంశాలు కలగాలని ధర్మరాజు స్పష్టం చేస్తున్నాడు.

1. ప్రస్తుతం ఉన్న స్థితి ఇట్లాగే కొనసాగటానికి వీలులేదు. అట్లా కొనసాగటం పాండవ పౌరుషానికే తలవంపులు. కాబట్టి పరిష్కారం త్వరగా జరగాలి.

2. అయితే ఆ పరిష్కారం తల్లికీ బంధువులకూ సంతోషంతోపాటు ఊరట కలిగించేదిగా ఉండాలి. కౌరవ పాండవులు కలిసి కలకాలం జీవించేటట్లుండాలి. (సంపా.)

క. ఇచ్చటి బంధులు నీవును ।
నచ్చెరువడి వినుచునుండ నయిదూళ్ళును మా

కిచ్చినను జాలు నంటిని ।
బొచ్చెముగా దింతవట్టు పూర్ణము సుమ్మీ! 9

ప్రతిపదార్థం: ఇచ్చటి బంధులు= ఇక్కడనున్న చుట్టాలూ; నీవును= నీవూ; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; వినుచున్+ఉండన్= వింటూండగా; మాకున్= అన్నదమ్ములమైన మాకు; అయిదు+ఊళ్ళును= ఐదు గ్రామాలను; ఇచ్చినను= ఇచ్చినప్పటికీ; చాలున్+అంటిని= సరిపోతుందని సంజయుడితో అన్నాను; పొచ్చెము+కాదు= తక్కువ కాదు; ఇంతవట్టు= నేనాడిన ఈమాత్రపు మాట; పూర్ణము సుమ్మీ!= చాలు సుమా!

తాత్పర్యం: కృష్ణా! ఇక్కడున్న చుట్టాలూ, నీవు విస్మయంతో వింటుండగా- 'సక్రమంగా మాకు అర్ధరాజ్యం పంచియివ్వటానికి మా తండ్రికి మనసొప్పకపోతే ఇంద్రప్రస్థం, కుశస్థలం, వృకస్థలం, వాసంతి, వారణావతం చాలు. అందుకూ అతడిష్టపడకపోతే ఎక్కడైనా మేము తలదాచుకొనటానికి ఐదూళ్ళిచ్చినా చాలు' నని సంజయుడితో ఇంతవరకూ నే చెప్పిన మాటలలో కపటం లేదు. అంతా యథార్థం సుమా!

విశేషం: 1. ఆ ఫలితాంశాల సాధనలో ధర్మజుడు ఇంతకు పూర్వమే ఒకదారి చూపించాడు. అర్ధరాజ్యం బదులు అయిదూళ్ళు ఇస్తే చాలునని నిండుమనసుతో ఉన్నాడు. నిజానికి అది దానోపాయ ప్రయోగ నైపుణ్యం. దానివలన బంధువులతో పాటు కృష్ణుడు కూడా ఆశ్చర్యపోయాడు. అంతటి ఔదార్యం కూడా దుర్యోధన ధృతరాష్ట్రుల ప్రవర్తన వలన బూడిదలో పోసిన పన్నీరై పోయింది - అని ధర్మరాజు మనవి చేశాడు. అంతకంటె మంచి ఉపాయం మరేదైనా ఉంటుందా? అని ఆలోచించాలని సమస్యలోని మరొక ముడి విప్పి చెప్పాడు.

2. ధర్మరాజడిగిన అయిదూళ్ళ పేర్లు మూలంలో ఇట్లా ఉన్నాయి. అవిస్థలం, వృకస్థలం, మాకంది, వారణావతం మరింకేదైనా ఒక ఊరు. తెలుగులో అవిస్థలం, మాకంది పట్టణాలకు బదులు కుశస్థలం, వాసంతి పేర్కొనబడ్డాయి. (చూడు. ఉద్యో. 1.377). (సంపా.)

శా. ఆ దుర్యోధనుఁ డంతమాత్రయును జేయంజాలఁడో కాని, పెం
పేదం గ్రూరత కోర్వరాదు; సిరి నా కేలందునే, గ్రాసవా
సోదైన్యంబులు వచ్చు నా యరయు నీ చుట్టాలకుం; గావునన్
మోదంబందుట గల్గుఁ గౌరవులు నేముం బొంది శ్రీ నొందినన్. 10

ప్రతిపదార్థం: ఆ దుర్యోధనుఁడు= ఆ సుయోధనుడు; అంతమాత్రయును+చేయన్+చాలఁడో కాని= కడకు నేను కోరిన ఐదూళ్ళైనా ఇస్తాడో ఇవ్వడో తెలియదు గాని; పెంపు+ఏదన్= గౌరవం నశించేటట్లు; క్రూరతకున్+ఓర్వన్ రాదు= క్రూరకర్మలు కావించటానికి సహించలేను; సిరి= రాజ్యసంపద; నాకున్+ఏల+అందునేన్= నా కెందు కని తలంచితినేని; నా+అరయు= నేను చూచే; ఈ చుట్టాలకున్= ఈ బంధు జనాలకు; గ్రాసవాసస్(ః)+దైన్యంబులు వచ్చున్= తిండికీ, బట్టకూ కరువేర్పడుతుంది; కావునన్= అందుచేత; కౌరవులున్= ధార్తరాష్ట్రులూ; ఏమున్= మేమూ; పొంది= కూడి; శ్రీన్+ఒందినన్= సంపద పొందితే; మోదంబు+అందుట+కల్గున్= సంతోషం పొందటం జరుగుతుంది.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు కడకు నే నడిగిన ఐదూళ్ళయినా ఇస్తాడో ఇవ్వడో తెలియదు. కాని, గౌరవం చెడేటట్లు క్రూర కార్యాచరణానికి నా మనసు ఒప్పుకోదు. పోనీ, రాజ్యసంపద నా కెందు కని వారిని అడగటం మానితే, నన్నాశ్రయించుకొనిఉన్న నా బంధుజనులకు కూటికీ, గుడ్డకూ దైన్యం ఏర్పడుతుంది. కనుక కౌరవులూ, మేమూ ఒద్దికగా ఉండి రాజ్యసంపద పంచుకొంటే ఉభయులకూ సంతోషం సమకూరుతుంది.

విశేషం: 1. ధర్మజుడు ఈ పద్యంలోని వాక్యాలను భావోద్వేగంతో పలికినట్లు తిక్కన రచించాడు. ఇందులో నాలుగు వాక్యాలున్నాయి. అవి భిన్న భావావస్థలను వ్యక్తం చేసేవి. 'దుర్యోధను డీమాత్రం కూడా చేయలేడా?' అన్నది ఆవేశంతో, ఆవేదనతో గొంతెత్తి పలికే రోషవాక్యం. ఆ వాక్యం తరువాత కొంత విరామం

అభినయంగా స్ఫురిస్తుంది. ఉదాత్త స్థాయిలో పలికిన ఆ వాక్యం నుండి తన గొంతును మంద్రస్థితికి తెచ్చుకొనటానికి 'కాని' అనే పదం తోడ్పడింది. ఈ వాక్యానికీ తరువాతి వాక్యానికీ ఉన్న అంతరం తెలియచెప్పింది. 'పెంపేదం గ్రూరత కోర్వరాదు' అనే వాక్యంలో ధర్మజుడి అభిమానం ద్యోతకమైనది. అప్పటి తన దీనస్థితిని స్ఫురింపచేసింది. దీనికి రెండు మూడు రకాల అర్థాలు చెప్పవచ్చును. (1) దుర్యోధనుడి పరంగా-అయినా, ఆ విధంగా ఔన్నత్యాన్ని వీడి క్రూరత్వాన్ని చేపట్టటం సహించరాదు- అని చెప్పవచ్చును. (2) ధర్మరాజుపరంగా- అతడు ఐదూళ్ళు కూడా ఇవ్వలేదని నా గౌరవాన్ని దిగజార్చుకొని నన్ను నేను క్రూరంగా కించపరచుకొనటం సహించరాని స్థితి. (3) దుర్యోధనుడు అయిదూళ్ళు ఇవ్వలేదనే నెపంతో గౌరవం చెడేటట్లు క్రూరకార్యానికి పూనుకొనటానికి నా మనసు ఒప్పుకోదు. సందర్భశుద్ధి గలిగిన మూడంచుల అర్థాలతో ముచ్చట కొలిపే ఈ వాక్యం ఒక్కటే మంద్రస్థాయిలో అనే వాక్యం. ఆ తరువాత కొంత విరామం ఉంటుంది. 'సిరి నాకేలందునే?' - ఈ వాక్యం సంజయుడి రాయబారంలోని తాత్పర్యాన్ని మనసులో తలచుకొని గూఢమైన బాధతో, దెబ్బతిన్న ఆత్మాభిమానంతో, ఆలోచిస్తూ, గంభీరంగా అనే వాక్యం. ధృతరాష్ట్రుడు 'పాండవులకు రాజ్యం వద్దు, యుద్ధం కూడదు, ప్రశాంతంగా బ్రాహ్మణుల వలె జీవించటం ఉచిత'మని సంజయుడి ద్వారా సూచించాడు. ఆ ఆదేశాన్ని అనుసరించి ధర్మరాజు తనకు సంపద ఎందుకులే? అని అనుకొన్నా- అది పొసగని పని అని భావం. దీనిని మరొక విధంగా అన్వయించవచ్చును. 'ఒకవేళ దుర్యోధనుడు ఐదూళ్ళు కూడా ఇవ్వకపోతే ధర్మరాజుకు సిరి సంపదలకు ఆలవాలమైన రాజ్యం అసలు ఉండదు. అయినా, ధర్మరాజు సిరిని కోరకుండా వైరాగ్య జీవితం గడపటానికి అతడు విపుల సంసారి. అందువలన అది సాధ్యం కాదు. మరి సిరి ఎందుకు? అంటే.. 'నా అరయు చుట్టాలకు - గ్రాసవాసోదైన్యం వస్తుం'దని ధర్మజుడి సమాధానం. ఇది తన స్థితిని చెప్పుకొనటమే కాక కౌరవులను వ్యంగ్యంగా ఎత్తిపొడవటం కూడా, నూరుగురు కొడుకులు, బంధువులు ఉన్న పెద్ద సంసారం ధృతరాష్ట్రుడిది. వారి కొరకే అత డీ రాజ్యాన్ని హరించింది. వారి పోషణ వారి కెంత ముఖ్యమో

తనవారి పోషణ తనకంత ముఖ్యమని ధర్మజుడి ఎత్తిపొడుపు. అంతేకాదు. తనది కూడా క్షత్ర గార్హస్థ్య జీవితమనీ, బ్రాహ్మణ సన్న్యాస జీవితం కాదనీ హెచ్చరిక! ఈ వాక్యం ధర్మరాజు నిక్కచ్చిగా, నిష్ఠురంగా, నిండుగా, గండుగా అన్నాడు. ఈ మూడు వాక్యాలే ధర్మజుడి వాదనలో మూడు బలమైన అంశాలు. వాటి ఫలితాలు శ్రోత ఊహించాలని గ్రహించాలి. అంటే, అయిదూళ్ళయినా ఇవ్వని క్రూరత్వం ఏర్పడితే, మా అయిదుగురి బంధువులనూ పోషింప దగినంత రాజ్యాన్ని మేము గ్రహించక తప్పదు. అప్పుడు యుద్ధం తప్పదు. 'కౌరవ నాశనం తప్పదు. ఇవన్నీ ఊహించగలిగితే ధర్మరాజు 'కావునన్' అనటంలో ఉన్న గడుసుదనం గోచరిస్తుంది. 'కౌరవ పాండవులు కలిసి రాజ్యసంపదను పంచుకొంటే ఉభయులూ సంతోషాన్ని పొందే స్థితి ఏర్పడుతుంది' అని ధర్మజుడు తేల్చి చెప్పాడు.

2. తిక్కన ధర్మరాజు యొక్క ఉపన్యాస శిల్పంలో కొన్ని శైలీ స్వభావాలను రచనలో ప్రవేశపెట్టాడు. అవి (1) ఒక పద్యాన్ని ఒక విధమైన భావావస్థకు ఆలోచనాత్మకమైన అభివ్యక్తిగా మలచటం. ఈ వాక్యంలో ధర్మరాజు ఉభయులూ సంపద పంచుకొనటం ఉచితం అనే తాత్పర్యాన్ని చెప్పటానికి కావలసిన మానసికావస్థను ప్రకటించాడు. (2) పద్యాన్ని వాక్యమండలిగా రూపొందించటం. (3) వాక్యానికీ వాక్యానికీ మధ్య కొంత విరామం ఉన్నట్లు, అభినయం సాగుతున్నట్లు, ఒక భావం నుండి మరొక భావానికి మరలుతున్నట్లు స్ఫూర్తిని కలిగించటం. వాక్యాలను పలకటంలో ఉండే ఉదాత్తాను దాత్తస్థితులను ధ్వనింప జేయటం. (4) వాచికాభినయ ద్యోతకమైన నాటకీయ పద్య రచనను సంతరించటం. (5) వాదాంశాలను క్రమంగా ఆవిష్కరించి పద్యం చివర ప్రతిపాద్యాంశ ఫలితాంశాన్ని ప్రకటించటం. ఈ లక్షణాలన్నీ ఒక మహావక్త, రాజనీతివేత్త మాట్లాడే ఉపన్యాసంలో గోచరించే అంశాలు.

3. తిక్కన రచించిన మంచి పద్యాలలో ఇది ఒకటి. ధర్మజోపన్యాసంలో తిక్కన వివిధ అర్థగుణాలను సార్థకంగా వాడాడు. ఇందులో అజరరత్వం, అపారుష్యం అనే లక్షణాలు గల సౌకుమార్యం సంతరించబడింది. (సంపా.)

ఉ. అక్కట! లాఁతులైనఁ బగతైనను జంపన కోర నేల? యొం
డొక్క తెఱంగు లేదె? యది యొప్పదె? బంధు సుహృజ్జనంబు లా
దిక్కున నున్నవారు; గణుతింపక సంపదకై వధించి దూ
ఱెక్కుట దోషమందు టను నీ దురవస్థల కోర్వవచ్చునే?' 11

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లాఁతులు+ఐనన్= పరాయివారైనా; పగఱు+ఐనను= శత్రువులే అయినా; చంపన్+అ+కోరన్+ ఏల= చంపాలనే ఎందుకు కోరాలి?; ఒండు+ ఒక్క+తెఱంగు లేదే?= యుద్ధం కంటె మరొకమార్గం లేదా?; అది+ఒప్పదె?= ఆ మార్గం తగింది కాదా?; ఆ దిక్కునన్= ఆ కౌరవుల పక్షంలో; బంధు సుహృద్ జనంబులు= చుట్టాలు, మిత్రులు; ఉన్నవారు= ఉన్నారు; గణుతింపక= ఆ వైపున ఉన్న మా బంధుమిత్ర వర్గాన్ని లెక్కించక; సంపదకై= సిరికై; వధించి= (వారిని) చంపి; దూఱు+ఎక్కుట= నిందలపాలవటం; దోషము+అందుట= పాపం మూటగట్టుకొనటం; అను= అనునట్టి; ఈ దుర్+అవస్థలకున్= ఈ దుర్దశలకు; ఓర్వన్+వచ్చునే?= సహింప శక్యమగునా? (కాదని భావం.)

తాత్పర్యం: అయ్యో! వారు ఇతరులే అగుదురుగాక! విరోధులే అగుదురుగాక! వారిని చంపవలెననే ఎందుకు కోరాలి? పోరాటంకంటే మరో మంచిదారి లేదా? ఆ మార్గం మంచిది కాదా? కౌరవుల పక్షంలో మా చుట్టాలు, మిత్రులు ఉన్నారు. వారిని లెక్కించక రాజ్యసంపదకై సంహరిస్తే నిందలపాలుగాక తప్పదు. పాపాలు మూటగట్టుకొనక తప్పదు. ఇట్లా ఇహపరాలు రెంటికీ దూరం చేసే దుర్దశను నేను భరించలేను.

విశేషం: 1. రారాజు రాజ్యభాగ మీయడు కాబట్టి యుద్ధం చేసి రాజ్యాభాగం పొందటమే కర్తవ్యం- అని భావించే వారి తలపులను మనస్సులో ఉంచుకొని ధర్మరాజు యుద్ధం కంటే వేరే మరొక మార్గాన్ని అన్వేషించవలసిన అవసరాన్ని ఈ పద్యంలో నొక్కి చెపుతున్నాడు. పైపద్యంలో రాజ్యభాగం యొక్క అవసరాన్ని చెప్పి, దానిని సాధించే మార్గాన్ని గురించి తన ఆలోచనా విధానాన్ని ఈ పద్యంలో ఆవిష్కరించాడు.

2. ఈ పద్యం 'అక్కట!' అనే మాటతో మొదలవుతున్నది. అది విచారాన్నీ, ఆశ్చర్యాన్నీ తెలిపే వాచికాభినయ వాచకం! ఆమాట అనే ముందు ధర్మజుడి భావనలో యుద్ధమే కర్తవ్యమనే యోచన మెదలిన సంగతి ధ్వని. ఇట్లా అభినయాంశాలతో, అభినయ వాచకాలతో మనోగత భావాలను ధ్వనింప చేయటం నాటకీయ శిల్పంలో రసధ్వని.

3. చంపవలసి వస్తే లోకంలో పరాయివారినీ, శత్రువులనూ ఎన్నుకొనటం సహజం. వారితో స్నేహ సంబంధాలుగాని, రక్త సంబంధాలుగాని, భావజాల సంబంధాలు కాని ఉండవు కాబట్టి. అయినా వారిని కూడా రాజ్యం కొరకు చంపాలనుకొనటం అహింసాధర్మం కాదు. మానవ మూల్యమైన దయాధర్మం కూడా కాదు. అది యుద్ధనీతి ఔతుందేమో కాని, ధర్మనీతి కాదు. ఆ అంశాన్ని ఈ వాక్యంలో ధర్మజుడు చెప్పాడు. ఇది సాధారణ శాంతిసూక్తం.

4. 'ఒండొక్క తెఱంగు లేదె?' ఇది ఆలోచనాముద్రతో వేస్తున్న ప్రశ్న. ఎదుటివారిని 'ఆలోచించండి' అని అడుగుతున్న నాట్యముద్ర. దీని వెనుక రాజనీతి కూడా ఉన్నది. చతుర్విధోపాయాలలో చివరిది. సామ, దాన, భేదోపాయాలు విఫలమైపోయిన తరువాత దండోపాయాన్ని తప్పనిసరి పరిస్థితులలో ప్రయోగించాలి కాని, ముందుగానే తొందరపడి యుద్ధం చేయరాదు. అయితే, యుద్ధానికి ప్రత్యామ్నాయమైన ఉపాయం ప్రప్రథమ కర్తవ్యం. దానిని ధర్మజుడు సూచిస్తున్నాడు.

5. 'అది యొప్పదె?' - అట్లా చెయ్యటం న్యాయం కాదా? అని ప్రశ్నిస్తున్నాడు. ధర్మజుడి దృక్పథంలో అదే న్యాయం. సభ్యులు కూడా తన అభిప్రాయంతో అంగీకరించేటట్లు చేసే నేర్పుతో కూడిన ప్రశ్న. ఈ ప్రశ్న వేసి ధర్మరాజు కొంత విరామం పాటించి ఉంటాడు. ఆయన నిజానికి ఏ పరాయివారినో, శత్రువులనో ఉద్దేశించి మాట్లాడటం లేదు. హస్తినాపురంలో ఉన్న బంధు మిత్రులను గురించే భావిస్తున్నాడు. ఆ ఆలోచన నుండి తరువాతి వాక్యం వెలువడింది.

6. 'బంధు సుహృజ్జనంబు లా దిక్కున నున్నవారు'. ఇది పాండవు లను కొనవలసిన మాట. కౌరవు లెట్లాగూ పాండవులు బంధువులని భావించటం లేదు. ధర్మరాజు దయామూర్తి కాబట్టి ఈ ధర్మనీతి పద్ధతిలో ఆలోచిస్తున్నాడు. పగవారినే చంపగూడదని లోకనీతి చెప్పుతుండగా బంధు మిత్రులను చంపటం న్యాయమా? అని యుద్ధోద్యోగానికి విరుగుడుగా ఈ అంశాన్ని పేర్కొన్నాడు.

7. ఈ ధర్మనీతిని లెక్కచేయకుండా సంపద కొరకు బంధుమిత్రులను యుద్ధంలో చంపితే రెండు దుర్దశలు కలుగుతాయట! అవి- అపకీర్తి, పాపం. ఈ రెండూ ధర్మవీరుడి జీవితానికి ఇహపరాలు లేకుండా చేసే దుర్దశలు. అపకీర్తి వలన ఈ జన్మలో మృత్యువు పాలైనట్లే, పాపంవలన జన్మ జన్మలలో సద్గతి కోల్పోయినట్లే. కాబట్టి కౌరవులను యుద్ధంలో చంపితే పాండవు లిహపరాలకు చెడుతారని ధర్మరాజు నిశ్చయం.

8. 'ఈ దురవస్థల కోర్వవచ్చునే?' సంపద లేకపోయినా బ్రతుక వచ్చునుగాని, అపకీర్తితో పాపంతో బ్రతకటం అసాధ్యమని ధర్మజుడి నీతిసూక్తం.

9. ఈ పద్యం ముగిసేసరికి రెండు విరుద్ధాంశాలు ధర్మజుడు ప్రతిపాదించాడు. (1) రాజ్యభాగం కావాలి. అందరూ కలిసి ఉండాలి. (2) యుద్ధం జరుగకూడదు. ఈ రెండూ జరిగేవి కావని స్పష్టం. కాని, ఆ దిశలో యత్నం జరగాలని ధర్మజుడి ఆశయం.

10. ఈ విషయాన్ని సభ మననం చేసికొనటానికి ధర్మరాజు కొన్ని క్షణాల విరామం ఇచ్చాడు. అది నాటకీయంగా అవసరం.

11. ఈ పద్యంలో శ్లేషమనే శబ్దార్థోభయ గుణాలు సంతరించబడ్డాయి. రచనలో మసృణత్వం, పదవాక్య సంవిధానంలో ఘటన ఈ పద్య రచనకు ప్రాణం.

12. తిక్కన తీర్చిదిద్దిన ఉపన్యాస శిల్ప పద్యాలలో ఇది కూడా ప్రశస్తి చెందింది. నేటికీ తెలుగువారి మాటలలో సంధి యత్నాల పట్ల ఈ పద్యం పల్లవిగా వినిపిస్తుంది. (సంపా.)

వ. అని పలికి పాండవాగ్రజుండు వెండియు. **12**

తాత్పర్యం: అట్లా ధర్మజుడు పలికి మరల ఇట్లా అన్నాడు :

విశేషం: ఉపన్యాసఘట్టంలో తిక్కన నడుమ నడుమ రచించే చిన్న చిన్న వచనాలను అభినయ వ్యంజకాలుగా రూపొందించటం నాటక శిల్పం. పాండవాగ్రజుడు అనే విశేషణం సార్థకం. అతడి మాట పాండవ స్కంధావారంలో ముక్తకంఠంతో వినపడుతుం దని ధ్వని. 'వెండియు' - అనేది కొన్ని క్షణాల విరామానంతరం అనే కాలసూచిక. (సంపా.)

ఆ. క్షత్త్రధర్మ మింత కష్టమగునె? పెఱ ।
ధర్మ మాచరింపఁ దగ దటండ్రు
గాన శస్త్రజీవికయ తగియున్నది; ।
యైన వంశనాశ మనభిమతము. **13**

ప్రతిపదార్థం: క్షత్త్రధర్మము= రాజధర్మము; ఇంత కష్టము+అగునె?= ఇంతటి కష్టంతో కూడుకొన్నది గదా!; పెఱ+ధర్మము= (క్షత్రియులు) అన్యధర్మము; ఆచరింపన్+ తగదు+అటండ్రు= అనుష్ఠించరాదని పెద్దలు చెప్పుతారు; కానన్= కాబట్టి; శస్త్రజీవిక+ అ+తగి+ఉన్నది= మాకు ఆయుధోపజీవనమే యుక్తమై ఉన్నది; ఐనన్= అయినప్పటికీ; వంశనాశము= కులనిర్మూలనం; అనభిమతము= నాకు ఇష్టం కాదు.

తాత్పర్యం: ఔరా! క్షత్రియ ధర్మపాలనం ఎంతో కష్టంతో కూడుకొన్నది. అన్య ధర్మాచరణం రాజులకు తగదని పెద్దలంటారు. కనుక ఆయుధాలను చేతబట్టి బ్రదకటమే వారికి యోగ్యమైన పని. కాని, రాజ్యానికై కులనిర్మూలనం చేయటం నాకు సమ్మతం కాదు.

విశేషం: 1. అజాతశత్రువు యొక్క అంతర్మథనానికి ఈ ఆటవెలది అచ్చమైన అభినయ వాచికం. ఈ పద్యానికి మూలం గమనిస్తే దీని ముచ్చట మరీ బాగుంటుంది.

"పాపః క్షత్రియ ధర్మోఽయం నయంచ క్షత్రబాంధవాః,
స నః స్వధర్మోఽధర్మో వా వృత్తి రన్యా విగర్హితా". (సం. 5-70-46)

"క్షత్రియ ధర్మం ఎంత పాపం!' అని మూలంలో అంటే. 'ఎంత కష్టం?' అని తెలుగులో అన్నాడు. 'మనమేమో క్షత్రియ బంధువుల' మని మూలంలో ఉంటే. తిక్కన దానిని వదలివేశాడు. ఈ విషయం వాచ్యం చేయవలసిన అవసరం లేదు. 'అది మనకు స్వధర్మం. ధర్మమైనా పరధర్మం నిందకు పాత్రమౌతుంది' - అని మూలం. దీని వరుస మార్చి - 'పెఱ ధర్మమాచరింపఁ దగ దటండ్రు' అని మొదట పలికాడు తెలుగులో. ఆటవెలది ఉత్తరార్ధం అన్వయ సుందరంగా తెలుగులో అమరింది. క్షత్రియులైన పాండవులకు 'శస్త్రజీవికయే' స్వధర్మమై తగి ఉన్నది. అట్లని యుద్ధం చేసి కార్యం సాధించటమే కర్తవ్యం కాదు. వంశనాశనం జరుగకుండా కార్యసాధనం చేయటం కర్తవ్యం. క్షత్రధర్మానికీ, అహింసకూ సంఘర్షణ వచ్చినపుడు యుద్ధేతర మార్గంలో కార్యాన్ని లోకహితంగా సాధించటం కూడా ధర్మమే. దానినే ధర్మనీతివర్తనం అంటారు. ధర్మరాజు ఆ మార్గాన్ని సూచించాడు.

2. ఆటవెలది పాదాలు నాలుగూ నాలుగు వాక్యాలు. విరుద్ధ ధర్మ సూచికలు. అయినా అన్వయసుందరాలు.

3. ఇందులో అర్థవ్యక్తి అనే శబ్దార్థ గుణాలు పోషించబడ్డాయి. (సంపా.)

వ. అదియునుంగాక. **14**

తాత్పర్యం: ఇంతేకాక.

ఆ. కలహ మగుట లక్ష్మిఁ గావించుఁ, బ్రాణహా ।
నియును జేయు; నింత నిక్కువంబు;
పలువు రొకని కోడి పాఱుట, బల్లిదు ।
లనదచేతఁ జెడుటయును ఘటించు. **15**

ప్రతిపదార్థం: కలహము+అగుట= యుద్ధం రావటం (సంభవించటం); లక్ష్మిన్= సంపదను; కావించున్= లభింపజేస్తుంది; ప్రాణహానియును+ చేయున్= ప్రాణనష్టం గూడ కలిగిస్తుంది; ఇంత నిక్కువంబు= (ధనసంప్రాప్తి, ప్రాణనష్టం, యుద్ధం వలన జరగటం) యథార్థం; పలువురు= అనేకులు; ఒకనికిన్+ఓడి= ఒక్కడి చేతిలో అపజయం పొంది; పాఱుట= పరుగిడి పోవటం; బల్లిదులు= బలవంతులు; అనదచేతన్= దుర్బలుడి చేత; చెడుటయును= నశించుటయున్నూ; ఘటించున్= కలుగజేస్తుంది.

తాత్పర్యం: యుద్ధం జరిగితే సంపదలు సంప్రాప్తిస్తాయి. ప్రాణహాని కూడా సంభవిస్తుంది. ఇందులో సందేహం లేదు. పెక్కుమంది ఒక్కడి చేతిలో ఓడిపోయి పరుగెత్తిపోవటం, బలవంతులు బలహీనుడి చేజిక్కి సమసిపోవటం కూడ జరుగుతుంది.

విశేషం: యుద్ధం వలన లాభనష్టాలు మొదట చెప్పాడు ధర్మజుడు. సంపద కలగటం లాభం. ప్రాణహాని నష్టం. యుద్ధంలో జరిగే అబ్బురాలను రెండింటిని తరువాత పేర్కొన్నాడు. ఒకే మహావీరుడి చేతులలో పలువురు పారిపోవచ్చును. ఒక్కొక్కసారి అసమర్థులైన వారు గుంపు కట్టి బలవంతులను చంపవచ్చును. మొదటి దానికి అర్జునుడు, భీష్ముడు ఉదాహరణలు కావచ్చును. కౌరవులు చంపిన అభిమన్యుడు, ఘటోత్కచుడు మొదలైనవారు రెండవ పద్ధతికి ఉదాహరణలు. ఇవి అసహజమైనవి. అదృష్టంమీద, అవకాశం మీద ఆధారపడిన ఇటువంటి సంఘటనలను ఆధారంగా చేసికొని జయాపజయాలను ముందే నిశ్చయించటం కష్టం. జయాపజయాలు దైవాధీనాలు. ఈ వాస్తవం - యుద్ధోపాయం విశ్వసనీయం కాదని సూచిస్తున్నది. (సంపా.)

క. జయమగు నోడుదు మను ని।
శ్చయ మొక్కఁడు లేదు; వినుము! సమరమునఁబరా
జయము మరణంబు కంటె హృ।
దయపుట భేదనము సేయుఁ దథ్యం బనఘా! 16

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్య పురుషా!; వినుము= నా మాట లాలకించుము; సమరమునన్= యుద్ధంలో; జయము+అగున్= మనకే విజయం లభిస్తుంది. ఓడుదుము= మనమే అపజయం పొందుతాము; అను నిశ్చయము= అనే నిర్ణయం; ఒక్కఁడు లేదు= ఒకటీ లేదు; పరాజయము= అపజయం; మరణంబుకంటెన్= మృతికంటె కూడా; హృదయపుట భేదనము+చేయున్= దొప్పవంటి గుండెను పగులగొట్టుతుంది; తథ్యంబు= ఇది నిజం

తాత్పర్యం: కృష్ణా! యుద్ధంలో మనమే గెలుస్తాం, లేదా ఓడిపోతాం అని నిశ్చయంగా చెప్పటానికి వీలులేదు. సంగ్రామంలో అపజయమే సంప్రాప్తమైతే అది మరణంకంటె గుండెను బ్రద్దలు చేసి, దుస్సహమైన వేదనను కలిగిస్తుంది. ఇది నిజం.

విశేషం: 'విజయం తథ్యం కాని యుద్ధం కంటె మరణం మే'లని ధర్మరాజు పేర్కొని సభ్యులు, యుద్ధేతర మార్గాలలో కార్యసాధన మేలని తలంచేటట్లు చేస్తున్నాడు. యుద్ధం చేయాలనే భీమాదుల వాదాలను తర్కబద్ధమైన ప్రతివాద చాతుర్యంతో నియమిస్తున్నాడు. (సంపా.)

క. కాన నవశ్యముఁ బెనఁకువ।
గాని యుపాయమునఁ బగఱఁ గడతేర్చు ధృతిం
బూని నడచు నెవ్వఁడు డెం।
దానం జెయివెట్టికొని యతఁడు నిద్రించున్. 17

ప్రతిపదార్థం: కానన్= కాబట్టి; అవశ్యమున్= తప్పక; పెనఁకువ కాని= కయ్యం జరగని; ఉపాయమునన్= వెరవు చేత; పగఱన్= శత్రువులను; కడతేర్చు ధృతిన్+పూని= అణచునట్టి ధైర్యం వహించి; ఎవ్వఁడు నడచున్= ఎవడు మెలగునో; అతఁడు= అట్టివాడు; డెందానన్= గుండెమీద; చెయి+పెట్టికొని= చేతిని ఉంచుకొని; నిద్రించున్= హాయిగా నిద్రపోతాడు.

తాత్పర్యం: యుద్ధం అన్ని అనర్థాలకు మూలమవటంచేత కయ్యం చేయకుండానే ఉపాయంతో విరోధులను అణచివేయగలననే ధైర్యం వహించి ఎవడు ప్రవర్తిస్తాడో వాడు గుండెమీద చేయి వేసుకొని నిశ్చింతగా నిదురిస్తాడు.

విశేషం: యుద్ధోపాయాన్ని ప్రయోగించే అవసరం రాకుండానే సామదాన భేదోపాయాలతోనే కార్యఫలాన్ని సాధించటం ఉత్తమమని ధర్మజుడు తేల్చిన ఫలితాంశం. ఇది శాస్త్ర సమ్మతమైన ధర్మనీతి. ఈ పద్యంతో ఒక ప్రతిపాదన ముగిసింది. అందుకే 'కాన' అని పద్యం మొదలైంది. ధర్మరాజు తన ఉపన్యాసంలో ప్రతిపాద్యాంశ పరిసమాప్తిని సూచించే వాక్యాన్ని 'కావున' అని మొదలు పెడుతూ ఉంటాడు. అది ఆయన వాక్యశిల్పం. (సంపా.)

ఆ. పగయ కలిగె నేనిఁ బాము న్న యింటిలో ।
నున్న యట్లుకాక యూఱడిల్లి
యుండు నెట్లు చిత్త మొకమాటుఁ గావున ।
వలవ దధిక దీర్ఘ వైరవృత్తి. 18

ప్రతిపదార్థం: పగ+అ+కలిగెనేనిన్= విరోధమే ఏర్పడితే; పాము+ఉన్న+ ఇంటిలోన్= సర్పమున్న గృహంలో; ఉన్న+అట్ల కాక= ఉన్నట్లే ఉంటుందిగాని; ఒకమాటున్= ఒకసారి అయినా; చిత్తము= హృదయం; ఊఱడిల్లి= ఊరటపొంది; ఎట్లు+ఉండున్?= ఎట్లా ఉండగలదు?; కావునన్= కాబట్టి; అధికదీర్ఘవైరవృత్తి= చిరకాలం విరోధంతో మెలగటం; వలవదు= కూడదు.

తాత్పర్యం: శత్రుత్వమే ఏర్పడితే పామున్న యింటిలో కాపురమున్నట్లే ఉంటుందిగాని ఒక తడవైనా మనస్సు నిమ్మళంగా ఉండదు. కనుక ఎవరితోనూ దీర్ఘకాలం విరోధంతో ప్రవర్తించటం తగదు.

విశేషం: అలం: ఉపమ. ఇది గొప్ప నైతిక సూక్తి, సుభాషితం. మూలం:

"సుఖం ప్రశాన్తః స్వపితి హిత్వా జయపరాజయౌ ॥
జాత వైర శ్చ పురుషో దుఃఖం స్వపితి నిత్యదా ।

అనివృత్తేన మనసా స సర్ప ఇవ వేశ్మని ॥
ఉత్సాదయతి యః సర్వం యశసా స విముచ్యతే ।" (సం. 5-70-59,60,61)

జయాపజయాలను పట్టించుకొనని ప్రశాంతచిత్తులు సుఖంగా నిద్రిస్తారు. పగపట్టిన పురుషుడు ప్రతిదినం దుఃఖంతో పడుకొంటాడు. పగ వలన సుఖం లేని వాడు పామున్న ఇంటిలో ఉన్నవాడి వలె సర్వాన్నీ పాడుచేసికొంటాడు. వాడికి పూర్వమున్న కీర్తి కూడా తరిగిపోతుంది- అని మూల తాత్పర్యం. తిక్కన మూలాన్ని సందర్భోచితంగా చికిలిపెట్టి నాడుకొన్నాడు.

సంస్కృతంలో వైరం అనే పదానికి తెలుగు-పగ. ఈ పదం తెలుగులో బాగా ప్రచారంలో ఉన్నది. పాముకూ పగకూ కవి సమయం వంటి అనుబంధం ఉన్నది. అందువలన తిక్కన పగ కలిగిన చిత్తం పాము పుట్ట వంటిదనీ, అటువంటి చిత్తవృత్తిగల వ్యక్తి పాముపుట్ట ఉన్న ఇల్లనీ ఉపమించాడు. వ్యాస హృదయానికి వన్నెపెట్టాడు.

పగ ఒకసారి ప్రవేశిస్తే శాంతి ఉండదు కాబట్టి దానిని తగ్గించటం, తొలగించటం తప్ప మార్గాంతరం లేదు. అంటే ఎక్కువ కాలం పగను మనసులో ఉంచుకొనకుండా నిర్మూలించుకొనటమే యుద్ధనివారణకు తరణోపాయమని ధర్మజుడి భావన.

యుద్ధానికి మూలం పగ. ఎడతెగని పగయే యుద్ధోన్మాదంగా మారుతుంది. మాయాద్యూతంలో వంచించి రాజ్యాన్ని కాజేశారనే పగతో పాండవులలో యుద్ధజ్వాల రగులుతున్నది. బలవంతులైన పాండవులు బ్రతికి ఉంటే ప్రభుత్వం దక్కదని అసూయాపరులైన కౌరవులు వారి మీద పగతో యుద్ధానికి కూడా సిద్ధమవుతున్నారు. ఇది ఉభయులకు వర్తించే నీతి. పగ తగ్గితే యుద్ధ ప్రవృత్తి సహజంగానే సమసిపోతుంది. యుద్ధేతరోపాయాలలో ఇది ఉత్తమం, నైతికం, ఆధ్యాత్మికం. కాని, అది సాధ్యమా? అన్నది హిమాలయమంత ప్రశ్న. (సంపా.)

చ. పగ యడఁగించు టెంతయు శుభం; బది లెస్స; యడంగునే పగం
బగ? వగ గొన్న మార్కొనక పల్కక యుండఁగ వచ్చునే? కడుం

దెగ మొదలెత్తిపోవఁ బగ దీర్పఁగ వచ్చినఁ గ్రౌర్య మొందు; నే
మిగతిఁ దలంచినం బగకు మేలిమి లేమి ధ్రువంబు గేశవా! 19

ప్రతిపదార్థం: కేశవా!= శ్రీకృష్ణా!; పగ+అడఁగించుట= విరోధాన్ని రూపుమాపటం; ఎంతయున్+ శుభంబు= మిక్కిలి శ్రేయస్కరం; అది లెస్స= అది మంచిపని; పగన్= విరోధంచేత; పగ+ అడంగునే= విరోధం శమిస్తుందా? (అంటే శమించదు); వగ+కొన్నన్= (ఒకరి) పగవలన (మరొకరు)బాధపడితే; మార్కొనక= అతడిని ఎదిరించక; పల్కక+ ఉండఁగన్+వచ్చునే= ఊరకుండటం శక్యమా? కాదు; కడున్+తెగన్= పరమ సాహసంతో; మొదలు+ఎత్తిపోవన్= తుదముట్టేటట్లు; పగన్+తీర్పఁగన్+వచ్చినన్= వైరాన్ని నిర్మూ లించటానికి సిద్ధపడితే; క్రౌర్యము+ ఒందున్= క్రూరకృత్యములకు తాను ఒడిగట్టవలసి వస్తుంది; ఏమిగతి+తలంచినన్= ఏ విధంగా ఆలోచించినా; పగకున్= విరోధానికి; మేలిమి లేమి= ఆధిక్యం లేకుండుట; ధ్రువంబు= నిజం.

తాత్పర్యం: విరోధాన్ని అణచివేయడం ఎంతో శ్రేయస్కరం. అది మంచి పని. విరోధం వలన విరోధం సమసిపోదు. ఒకడు వైరం వహించి మరొకరికి బాధ కలిగిస్తే, బాధపెట్టిన వాడితో తలపడక ఊరకుండటం శక్యం గాదు. పరమ సాహసంతో తుదముట్ట పగను నిర్మూలించటానికి పూనుకొంటే దారుణ కృత్యాలకు ఒడిగట్టవలసివస్తుంది. కనుక, ఎన్ని విధాల ఆలోచించినా పగవలన కీడేగాని ప్రయోజనం శూన్యం. కృష్ణా! ఇది నిజం.

విశేషం: 1. పగ వలన కలిగే అనర్థాన్ని చెప్పే గొప్ప సూక్తి ఇది. తెలుగువారి నిత్య వ్యవహారంలో నిత్యంగా నిలిచే సత్యం వంటి పద్యం. తిక్కన రచించిన మేటి పద్యాలలో ఒకటి.

2. ధర్మరాజు తర్కబద్ధంగా ఆలోచిస్తాడు. ఆలోచిస్తూ మాట్లాడుతాడు. ఆ పాత్ర స్వభావానికి అనుగుణంగా ఈ పద్యాన్ని చిన్న చిన్న వాక్యాల పొందికైన రచనతో చేశాడు తిక్కన. చిన్న వాక్యం ఆలోచనాతరంగం. శాంతి పొందటం

కర్తవ్యం. 'దానికి భంజకం పగ' అని చెప్పాలి. దానినే పగను గురించి వివరించి, 'అది లేకపోతేనే శాంతి, అది కర్తవ్యం' అని ధర్మరాజు చెప్పాడు. కూడనిది ముందు చెప్పితే కూడేదాని ప్రతిపాదనకు బలం వస్తుంది. దీన్నే తర్కంలో నేతి నేతి వాదం అంటారు. ధర్మరాజు దానిని పాటించాడు.

3. ధర్మరాజు మౌలికంగా శాంతి కాముకుడు. ధర్మనీతి వర్తనుడు. కౌరవులు రాజ్యభాగ మీయరని సంజయుడి రాయబారం వలన తేలిపోయింది. అది కౌరవుల పగ సాధింపు చర్య. అయితే, ఆ పగల వలన కలిగే ఫలమేమిటి? అని జిజ్ఞాసువైన ధర్మరాజు ఆలోచించాడు. శ్రీకృష్ణుడి రాయబారానికి మూలకారణం పగలేకుండా చేయటమే అని బలంగా ఈ పద్యంలో ప్రతిపాదిస్తున్నాడు.

4. పగ ఉన్న మనసు పాము పుట్ట ఉన్న ఇల్లు వంటిది. అందులో శాంతి ఉండదు- అని చక్కని దృష్టాంతాన్ని నిత్య జీవితంలో నుండి తీసికొని పూర్వపద్యంలో చెప్పి, ఈ పద్యాన్ని ఎన్నుకొనటంలో మంచి పూర్వరంగం తయారు చేసి, ప్రతిపాద్యాంశాన్ని చెపుతున్న వాద కౌశలం ప్రకటిత మౌతున్నది.

5. పగను అణచటం ఎంతైనా శుభం. శుభం అనే మాటకు బదులు మేలు, మంచిది, హితవు వంటి అర్థాలు వచ్చే పదాలు వాడవచ్చును. తెలుగు పలుకుబడిలో 'శుభం' పదాని కున్న వాడుక శక్తి మరో పదానికి లేదు. 'అది లెస్స' అనే చిన్నవాక్యం- తెలుగువారు తాను చెప్పిన దాన్ని స్థిరంగా నమ్ముతున్నారని ధ్రువీకరించే పద్ధతికి ప్రతినిధి. 'నిజం. నా మాట నమ్ము- సత్యం' మొదలైన పలుకుబడులకు అది సమానం. ధర్మరాజు చెప్పింది తాను గట్టిగా నమ్మి చెప్పిందే అని అర్థం. తెలుగు పలుకుబడి గల వాక్యాలకు ఈ తిక్కన పద్యం రత్నాల పేటి.

6. పగను గురించి చెప్పే ఈ పద్యంలో ధర్మరాజు- (పాండవులు) - భవిష్యత్తులో అనుసరించబోయే కార్యాచరణ పద్ధతి ఈ పగమీదే ఆధారపడి ఉంటుందని హెచ్చరిక చేశాడు. పగ వలన వగగొన్నవారు తిరగబడకుండా ఊరుకొనబోరట! సంజయుడు- పాండవులు శాంతించాలని చెప్పాడు. దానికి తిరుగు సమాధాన

మిది. కౌరవుల పగకు తగిన సమాధానం చెప్పటమే పగగొన్న పాండవుల సహజ కార్యాచరణం. అయితే, ఒకసారి పగసాధింపుకు దిగితే ఇక దయాదాక్షిణ్యాలకు తావుండదు. సంధి వచనాలకు అవకాశముండదు. దారుణమైన క్రూరవృత్తితో శత్రు సంహారమే సాగుతుంది. కౌరవనాశనం తప్పదు. కాబట్టి ఎన్ని రకాలుగా ఆలోచించినా పగను తొలగించక పోతే ఎటువంటి మంచీ ఏర్పడదు. చివర 'ధ్రువంబు కేశవా!' అనే వాక్యం కూడా - ఇది నిశ్చయం, ఇది జరిగి తీరుతుంది. నా మాట అయి తీరుతుంది. ఇది నిజం- ఇన్ని అర్థాలనిస్తుంది. వాద ప్రతిపాద్యాంశంలోని నిత్యత్వాన్ని స్థాపించే తర్కరహస్యం ఈ పద్య నిర్మాణ మర్మం.

7. పూర్వరంగాన్ని ముందు పద్యంలోనూ, తాత్పర్యాన్ని తరువాతి పద్యంలోనూ చెప్పిన తిక్కన ఛందస్సుల మధ్య తర్కంతో వంతెన కట్టాడు. 'కావున శాంతి పొందుటయ కర్జము' అనే నిశ్చితాంశం తరువాతి పద్యం ఎత్తుగడలోని వాక్యం.

8. తిక్కన నాటకీయ సంభాషణ శిల్పంలో ఉపన్యాస రచన- లేదా - దీర్ఘ సంభాషణ ఒక విశిష్టాంశం. సందేశమిచ్చే ముఖ్యపాత్రలూ, దూతలూ మాత్రమే ఈ దీర్ఘసంభాషణలు చేస్తారు. భారతంలో ధర్మజుడి ఉపన్యాస ఖండికలలో ఉద్యోగపర్వంలోని ఈ భాగం ప్రసిద్ధమైనది. అందులో ఈ పద్యం శిరోమణి వంటిది.

9. ఈ పద్యంలో వాడిన తెలుగు పదాల పొందిక గమనిస్తే సంస్కృత భారతంలోని భావాలను తెలుగులో ఎంత ఆత్మీయం చేసికొని, జాతీయంగా తెలుగు పలుకుబడికి ప్రాణంగా తిక్కన రచించాడో స్పష్టమవుతుంది. విశేషించి - పగ, శుభంబు, లెస్స, వగ, మార్కొనక, కడుందెగ మొదలెత్తిపోవ, మేలిమి, ధ్రువంబు మొదలైన పదాలు సార్థకాలు, శబ్ద ప్రయోగౌచిత్యానికి పద్యమంతా ఉదాహరణమే.

10. 'వగ గొన్న మార్కొనక' - అనే పాఠానికి 'పగగొన్న మార్కొనక', 'తెగగొన్న మార్కొనక' అనే పాఠాంతరాలు కనపడుతున్నాయి.

11. ఈ పద్య రచనకు సహకరించిన మూలశ్లోక మిది-

"న చాపి వైరం వైరేణ కేశవ వ్యుపశామ్యతి,
హవిషాగ్నిర్యథా కృష్ణ, భూయ ఏవాభివర్ధతే". (సం. 5-70-63)

కేశవా! పగతో పగ ఎప్పటికీ చల్లారదు. హోమ పదార్థా లుంచిన కొద్దీ హోమాగ్ని ఎట్లా ప్రజ్వరిల్లుతుందో పగవలన పగ మరల మరల రగిలి పెచ్చుపెరుగుతుంది. తిక్కన ఈ ఉపమానాన్ని గ్రహించలేదు. యజ్ఞోపకరణాన్ని పగకు ఉపమానంగా వాడక పోవటం వలన ఔచిత్యం పోషించబడింది. మూలంలో కంటె తిక్కన పద్యం వస్తువులో, రచనలో, జిగి బిగి ప్రదర్శిస్తున్నది.

12. తిక్కన ధ్వనిమార్గంలో కవిత రచించాడు. అందులోనూ రసధ్వని ఆయన ప్రత్యేక రంగం. వాచికాభినయ ప్రధానమైన ఈ ఘట్టంలో మాటలు పాత్రల స్వభావాలనూ, స్వభావాలు ప్రకరణ భావాలనూ, ధ్వనింపజేసి, నాయకుడైన ధర్మజుడి ధర్మనీతి వర్తనంలోని ఉత్సాహదీప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ధర్మజుడి ధర్మవీరం తిక్కన కవితలో రసోల్లాసం.

13. తిక్కన శబ్దగుణానికి అర్థగుణాన్ని వన్నెగా నిలుపుతాడు. ఈపద్యం అటువంటి శిల్పానికి ఉదాహరణం. పదబంధంలోని మసృణత్వమే శబ్దగుణమైన శ్లేష లక్షణం. బహుపదా లున్నప్పటికీ ఏకపదం వలెనే భాసించటం దాని స్వభావం. అర్థగుణమైన శ్లేష అర్థఘటనకు సంబంధించింది. అనేకభావా లున్నప్పటికీ వాటికి ఐక్యఘటనాన్ని మార్చేదిగా అర్థగుణశ్లేష రాణిస్తుంది. శ్లేషలో క్రమం, కౌటిల్యం, అనుల్బణత్వం ఉపపన్నమై ఉండాలని వామనుడు పేర్కొన్నాడు. ఈ మూడు లక్షణాలూ ధర్మజుడి వాక్యఘటనలో అర్థగుణ సిద్ధిని పొందాయి. ధర్మరాజు మాటల పొందికలో ఎంత మన్నిక ఉంటుందో, వాక్యాల కూర్పులో అంత అర్థ సంఘటన ఉంటుంది. మాటలను అతకటం శబ్దగుణం, ఊటగా ఊరే భావాలను బహు వాక్యాలలో ప్రయాణింపజేసినా ఏకధారను అర్థస్ఫూర్తియందు సంఘటింపజేయటం అర్థగుణం. తిక్కన రచనలో శబ్దగుణమైన శ్లేష అర్థగుణమైన శ్లేషకు ఊడిగం చేస్తుంది. వాక్యవిన్యాసంలో ఏకసూత్రంగా ఉండే ఆలోచనాక్రమం ఒక్కొక్కప్పుడు వక్రతతో కూడి ఉన్నా, అనుల్బణత్వాన్ని ఆద్యంతమూ ఆదరిస్తుంది. ఇది తిక్కన సంభాషణ శిల్పంలోని ఆయుస్సూత్రం. ఈ పద్యంలోని ధర్మజుడి వాక్యరచన అర్థగుణమైన శ్లేషకు శీర్షప్రాయమైన ఉదాహరణం.

14. ఈ పద్యంలో అలంకారం లేదు. కాని, నాటకీయత ఉన్నది. సమాసాలు లేవు కాని, వాక్య విన్యాసం ఉన్నది. ఆడంబరం లేదు. కాని, ఆలోచన ఉన్నది. తిక్కన పద్యరచన ఆలోచనామృతం. (సంపా.)

ఉ. కావున శాంతిఁ బొందుటయ కర్జము; దా నది యట్టులుండె; శ్రీ
గావలె నంచుఁ, బోరితము గామియుఁ గోరెద; మెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము పుట్టుటయున్ వెలిగాఁగ నొండుమై
నే విధినైనఁ జక్కఁబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా! 20

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; శాంతిన్+పొందుట+అ= శాంతి వహించటమే; కర్జము= చేయవలసిన పని; తాన్+అది+అట్టులు+ ఉండెన్= ఆ విషయం అట్లా ఉండనీ; శ్రీ+కావలెన్+అంచున్= సంపద కావలెననీ; పోరితము+కామియున్= యుద్ధం జరగ కుండ ఉండవలెననీ; కోరెదము= మేము వాంఛిస్తాము; ఎల్ల సొమ్ములున్= ఉన్న సమస్త ధనాలూ; పోవుటయున్= నశించటమూ; కులక్షయము పుట్టుటయున్= వంశనాశం కలగటమూ; వెలి కాఁగన్= ఈ రెండునూ జరగకుండా; ఒండుమైన్= వేరొక్క విధంగా; ఏ విధిన్+ఐనన్= ఏ ప్రకారంగా నైనా; చక్కన్+పడుట= బాగుపడటం; ఎంతయున్+ఒప్పున్+చుమీ!= మిక్కిలి తగును గదా! (ఎంతో బాగుంటుంది కదూ!); జనార్దనా!= శ్రీకృష్ణా!.

తాత్పర్యం: వైరం వలన ప్రయోజనం శూన్యం. కలత లేక నిమ్మళంగా ఉండటమే తగిన పని. కృష్ణా! ఆ విషయమట్లా ఉండనీ. నేను సంపద కావాలనీ, యుద్ధం జరగకుండ ఉండాలనీ కోరుకొంటున్నాను. యుద్ధం వలన ధననష్టం, వంశనాశనం జరుగుతుంది. ఈ రెండూ జరగని ఉపాయంతో ఎట్లాగయినా బాగు పడటం మిక్కిలి సముచితం కదా!

విశేషం: 1. పాండవోద్యోగ సారసర్వస్వ మనదగిన పద్యం ఇది. ఉద్యోగపర్వానికి గుండెకాయవంటిది.

2. కావున- అనే నిశ్చితార్థంతో మొదలు కావటం రచనాశిల్పం.

3. యుద్ధం లేకుండా శాంతి పొందటం ప్రస్తుత కర్తవ్యం - అని ఫలితాంశ ప్రతిపాదనం.

4. దూతకార్యంలో లక్ష్యం శాంతి. ఆ శాంతిని సాధించే మార్గంలో రక్షించబడవలసిన మూల్యాలు మూడు. అవి: (1) రాజ్య సంపద కావాలి. (2) కాని, యుద్ధం జరగకూడదు. (3) సంపద నష్టం కాకుండా, కులక్షయం కాకుండా మరే మార్గంలోనైనా, ఏ పద్ధతిలో నయినా కార్యం చక్కబడాలి.

ఈ ప్రణాళిక ధర్మజుడి ఉద్యోగంలోని ధర్మనీతి. ఇంతటితో ధర్మజుడి ప్రధాన ప్రతిపాదనం ముగిసింది. (సంపా.)

చ. మనమునఁ బక్షపాతగతి మాదెస మానుము ధర్మనీతి వ
ర్తనముల రెండు దిక్కుల హితంబును బెంపును గల్గునట్టి చొ
ప్పున విదురాది సజ్జనుల బుద్ధికి రా నుచితంబుతోడి మె
ల్పునఁ బరుసందనంబునను భూపతులెల్ల నెఱుంగ నాడుమీ! 21

ప్రతిపదార్థం: మనమునన్= నీ హృదయంలో; మా దెసన్= మా విషయమై; పక్ష పాతగతిన్= అభిమానం చూపటం; మానుము= వదలి పెట్టుము; ధర్మనీతి వర్తనములన్= ధర్మంతో నీతితోకూడిన నడవడికలతో; రెండు దిక్కులన్= ఇరు పక్షాలకూ; హితంబును= మేలును; పెంపును= అభివృద్ధియు; కల్గునట్టి చొప్పునన్= సమకూడే రీతిలో; విదుర+అది= విదురుడు మొదలైన; సజ్జనుల బుద్ధికిన్+రాన్= సత్పురుషుల మనసునకు సమ్మతమయ్యేటట్లుగా; ఉచితంబుతోడి మెల్పునన్= అనువైన మెత్తబాటు తోనూ; పరుసందనంబునను= కరకుదనంతోనూ; భూపతులు+ఎల్లన్= కురు సభలోని రాజులందరూ; ఎఱుంగన్= తెలిసికొనేటట్లు; ఆడుమీ= పలుకుము.

తాత్పర్యం: కృష్ణా! మా విషయంలో పక్షపాతం చూపవద్దు. ధర్మం, నీతి-నీటి ననుసరించి ఇరుపక్షాలకున్నూ మేలు, అభివృద్ధి సమకూరే రీతిలో,

విదురుడు మొదలైన సత్పురుషుల మనసులకు సమ్మతమయ్యేటట్లుగా తగినంత మెత్తదనంతోనూ, కఠినమైన మందలింపులతోనూ కురుసభలో రాజు లందరూ గ్రహించేటట్లు మాట్లాడుము.

విశేషం: ఇంతవరకూ దౌత్య కార్య లక్ష్యాన్నీ, ప్రయోజనాన్నీ నిర్దేశించిన ధర్మరాజు ఈ పద్యం మొదలుకొని 26వ పద్యం వరకు దూత వర్తనాన్ని గురించి తన అభిప్రాయాలను తెలుపుతున్నాడు. ఇవి పరోక్షంగా ఉత్తమదూత సాధారణ లక్షణాలుగా కూడా అన్వయిస్తాయి. అవి 1. మనస్సులో పక్షపాతగతి మానాలి. 2. ధర్మనీతి పథంలో తప్పకుండా నడవాలి. 3. ఉభయ పక్షాలకూ మేలూ, అభ్యుదయం కలిగేటట్లు మాట్లాడాలి. 4. సభ్యులలో విదురాది సత్పురుషులకు సమ్మతమయ్యేటట్లు మాట్లాడాలి. 5. అవసరాన్ని బట్టి మెత్తగానూ, కఠినంగానూ, మందలిస్తున్నట్లుగా సంభాషణ నిపుణంగా సాగించాలి. 6. సభలోనున్న రాజులందరూ పాండవుల ఉద్యోగాన్ని సక్రమంగా, సమగ్రంగా తెలిసికొన గలిగేటట్లు మాట్లాడాలి. మహాభారతంలో- దూతలకు ఉండదగిన ఈ లక్షణాలన్నీ చెప్పింది ధర్మజుడు. ఆచరించి చూపింది శ్రీకృష్ణుడు. (సంపా.)

చ. తగవునఁ బోక రాజు బెడిదంబులు వల్కినయేని సైఁచి యొ
ప్పుగ నిలుమీ; గురుత్వముఁ బ్రభుత్వమునుం గల పెద్దవారి మా
ట గొనమి యా సుయోధను కడన్ నిలువన్ మన మెల్ల గారవం
బుగఁ గురువృద్ధ పల్కుఁ దలఁపుం జన నిచ్చిన మెచ్చరే జనుల్? 22

ప్రతిపదార్థం: రాజు= దుర్యోధనుడు; తగవునన్+పోక= న్యాయమార్గాన నడువక; బెడిదంబులు= కఠినవాక్యాలు; పల్కిన+ఏనిన్= మాట్లాడినట్లయితే; సైఁచి= సహించి; ఒప్పుగన్+నిలుమీ= చక్కగా నిలబడుము; గురుత్వమున్= పెద్దరికం; ప్రభుత్వమునున్= రాచరికమున్నూ; కల= కలిగిన; పెద్దవారిమాట= వృద్ధుల వచనం; కొనమి= ఆదరించ కుండటం; ఆ సుయోధను కడన్+నిలువన్= ఆ దుర్యోధనుడి దెసనుండగా; మనము+ ఎల్లన్= మనమందరమూ; గారవంబుగన్= మర్యాదతో; కురువృద్ధ పల్కున్= కౌరవులలో పెద్దవారైన భీష్మాదుల మాటను; తలఁపున్= ఉద్దేశమును; చనన్+ఇచ్చినన్= సాగనిస్తే; జనుల్= లోకులు; మెచ్చరే?= మనలను పొగడకుందురా?

తాత్పర్యం: న్యాయ మెంచక దుర్యోధనుడు పరుష వాక్యాలు పల్కితే సహించవలసింది. తొందరపాటున సభ విడిచి రావద్దు. పెద్దరికం, రాచరికంగల పెద్దలమాట సుయోధనుడు వినలేదనే నింద వాడి తలపై వేయవలసింది. మనం గౌరవంగా కురువృద్ధులైన భీష్మాదుల మాటనూ, ఉద్దేశాన్నీ సాగనిస్తే లోకులు మనలను మెచ్చుకొంటారు.

విశేషం: ఈ పద్యంలో ధర్మరాజు కురుసభలో ఏర్పడే సంఘటనలను బుద్ధిబలంతో ఊహించి ఆయా సందర్భాలలో శ్రీకృష్ణుడు వ్యవహరించవలసిన తీరులను నిర్దేశించాడు.అవి-

(1) దుర్యోధనుడు అన్యాయంగా, అసభ్యంగా, పరుషంగా పలికినా, వ్యవహరించినా వాటిని సహించి సభలో నిగ్రహంతో ఉండాలి. తొందరపడి సభ వెలువడి రావద్దు. ఇది కీలకాంశం.

(2) సభలోని పెద్దలు దుర్యోధనుడి దుష్ప్రవర్తనాన్ని వారిస్తారు. నిందిస్తారు, అతడికి హితవులు బోధిస్తారు. అతడు వారి మాటలు వినడు. ఆ నింద అతడికి నిండు కొలువులో ఏర్పడేటట్లు నిబ్బరంగా నిలిచి నిర్వహించాలి.

(3) ధృతరాష్ట్రుడు పెద్దలు చెప్పిన మాటలు విని, వారికి అనుకూలంగా మాట్లాడి, కొడుకును వారించవచ్చును. ఆ పరిస్థితిని గమనించి, ధృతరాష్ట్రుడి ఆనతిని మనం గౌరవిస్తున్నట్లు వ్యవహరించి, అతడి మాట సాగేటట్లు చేయాలి. అంటే దుర్యోధనుడి మాట కాదని పాండవులకు ధృతరాష్ట్రుడు రాజ్యభాగం ఇచ్చే పరిస్థితులను కలిగించి ఫలప్రాప్తిని సాధించాలి.

(4) దీనినే సామభేదోపాయాల నిపుణ ప్రయోగమంటారు రాజనీతిలో. దీనివలన యుద్ధం లేకుండానే పాండవులకు రాజ్యభాగం దక్కే అవకాశా లేర్పడతాయి. (సంపా.)

మ. సుతువాఁడై వినయంబు సేకొనక యేచొప్పున్ దగం జెప్ప కా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రాదంచు వే
గ తెగంబాఱకు తెంపుసేయునెడ లోకంబెల్ల మెచ్చం బ్రకా
శిత ధర్మస్థితి నొంది మా మనము నిశ్చింతంబుగాఁ జేయుమీ! 23

ప్రతిపదార్థం: ఆ ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; సుతువాఁడు+ఐ= కుమారుడి పక్షం వహించినవాఁడై; వినయంబు చేకొనక= విధేయత చూపక; ఏ చొప్పున్= ఏ మార్గమునూ; తగన్+చెప్పక= యుక్తంగా తేల్చక; అవినీతిన్ చేసినను= అవినీతితో వర్తించినట్లయితే; సంధింపంగన్+రాదు+అంచున్= సంధి చేయటం పొసగదని; వేగ= వెంటనే; తెగన్+పాఱకు= సాహస కార్యానికి పూనవద్దు; తెంపు+చేయు+ఎడన్= సాహసానికి పూనుకొనవలసినప్పుడు; లోకంబు+ఎల్లన్+మెచ్చన్= జనులందరూ కొని యాడునట్లుగా; ప్రకాశిత ధర్మస్థితిన్+ఒంది= ప్రకటితమైన ధర్మంలో నెలకొన్నవాడవై; మా మనమున్= మా హృదయాన్ని; నిశ్చింతంబుగాన్+చేయుమీ= నిర్విచారంగా ఉండే టట్లు కావించవలసింది.

తాత్పర్యం: ఆ ధృతరాష్ట్ర మహారాజు కుమారుడి పక్షం వహించి వినయం వీడి ఏ అభిప్రాయం వెల్లడించక అవినీతితో మెలగినప్పుడు ఇక నేమాత్రం సంధి పొసగదని వెంటనే సాహసించవద్దు. సాహసం చేయవలసివస్తే జనులంతా కొనియాడేటట్లు ప్రకటిత ధర్మమందు నిలిచిన వాడవై మా మనసు విచారరహితంగా ఉండేటట్లు చేయవలసింది.

విశేషం: 1. ఒకవేళ- అనుకొన్నట్లు ధృతరాష్ట్రుడు వ్యవహరించక దుర్యోధనుడి దుర్నీతిని సమర్థించి అవినీతితో ప్రవర్తించి, రాజ్యభాగాన్ని ఇవ్వదలచకపోతే సంధికార్యం చెడిపోయిందని వెంటనే సభను వదలిపెట్టి రావద్దు.

2. సాహసించి నిండు కొలువులో నిలబడి ప్రజలందరూ గ్రహించేటట్లు పాండవుల ధర్మస్థితి ప్రకటితమయ్యేటట్లు గంభీరంగా ఉపన్యసించుము. ప్రజలు పాండవ ప్రయత్నాలు తెలిసికొని సత్యధర్మస్థితిని సమర్థిస్తే చాలు. రాయబారం

సఫలమైనట్లే. అంటే సామదాన భేదాల ప్రయోగాన్ని కౌరవులు తిరస్కరించి యుద్ధోపాయానికి దారిచూపినట్లే ఔతుంది. (సంపా.)

ఆ. ఇన్ని సంకటముల నిబ్భంగి నెంతయు ।
నొగులు చిత్తవృత్తి నొవ్వు దీర్ప
వెజ్జ వీవకావె! వేయేల? యేగతి ।
నడపఁ దలఁచి తదియ నాకుఁ బ్రియము.' 24

ప్రతిపదార్థం: ఇన్ని సంకటములన్= ఇన్ని చిక్కులతో; ఈ+భంగిన్= ఈ విధంగా; ఎంతయున్= మిక్కిలి; నొగులు= వికలమౌతున్న; చిత్తవృత్తి నొవ్వు= మనో వ్యాపారము యొక్క వేదనను; తీర్పన్= తొలగించటానికి; వెజ్జవు= వైద్యుడవు; ఈవు+అ+కావె!= నీవే కదా!; వేయి+ఏల= పలుమాట లెందుకు?; ఏ గతిన్= ఏ రీతిగా; నడపన్+తలఁచితి(వి)= మమ్ములను ముందుకు నడిపించ దలచుకొన్నావో; అది+అ= అదే; నాకున్+ప్రియము= నాకిష్టం.

తాత్పర్యం: కృష్ణా! ఇన్ని చిక్కులతో ఈ ప్రకారంగా నా మనస్సు వికలమై వేదన చెందుతున్నది. నా మనో బాధను తొలగించుటకు తగిన వైద్యుడవు నీవుకాక మరెవ్వరు? ఇన్ని మాటలెందుకు? నీవు మమ్ము ఏ మార్గాన నడిపించ నెంచావో ఆ మార్గంలో నడవటమే నాకు సమ్మతం.'

విశేషం: 1. ధర్మరాజు తన చిత్తం చిక్కులతో ఈ విధంగా వేదనపడుతున్నదని చెప్పాడు. అంటే ఆయన తన మనసులోని బాధనే వెళ్ళగ్రక్కాడన్న మాట. అంటే శ్రీకృష్ణుడికి తన బాధను నివేదించుకొన్నాడన్నమాట! ఆయనది ఆదేశం కాదనీ, నివేదనమనీ నిపుణంగా చెప్పాడు. ఇది వాస్తవంగా గోచరించే రాజనీతి. ఆ సంగతి శ్రీకృష్ణుడికి తెలుసు.

2. ధర్మరాజు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించవలసిన విధానాలు, ఫలితాంశాల అంచనాలు సంక్లిష్టంగా ఉన్నాయి. అఘటనా ఘటన సామర్థ్యం ఉంటేనే అవి సాధ్యాలవుతాయి.

3. నొవ్వు తీర్చే వైద్యుడు శ్రీకృష్ణుడని ధర్మరాజు సాభిప్రాయంగా అన్నాడు. ఆ నొవ్వేమిటి? ఆ మందేమిటి?

(1) కౌరవులమీద నిందపడకుండా తాను యుద్ధం ప్రకటించవలసి వస్తుందేమోనని ధర్మజుడి బాధ. ఆ బాధను తొలగించే మందు రాయబారం.

(2) దుర్యోధనుడి దుర్నయాన్ని ధృతరాష్ట్రుడు పుత్రవ్యామోహంతో సమర్థిస్తూ సంధి కార్యాన్ని భగ్నం చేస్తే తప్ప యుద్ధం ధర్మనీతియుక్తం కాదు. కౌరవసభలో దాని కనుగుణంగా కథ నడిపే కథానాయకుడుగా ఒక మహావ్యక్తి కావాలి. అది నెరవేరాలని ధర్మజుడి బెంగ. దానిని తీర్చగలిగిన మానసిక వైద్యుడు శ్రీకృష్ణుడు.

(3) దుర్యోధన ధృతరాష్ట్రులు దుర్నీతి ప్రదర్శించినా, భీష్మాదులు, రాజులు, మిత్రులు, ప్రజలు, పాండవ యత్నాన్ని విని హర్షించి కౌరవులను నిందించి, పాండవోద్యోగాన్ని సమర్థించాలి. ఆ విధంగా శత్రు శిబిరంలో భేదోపాయాన్ని ప్రయోగించాలని ధర్మజుడి చింత. ఆ చింతను, వంతను తీర్చగలవాడు శ్రీకృష్ణుడు.

(4) రోగి తన రోగ లక్షణాలను తన బాధను వైద్యుడికి చెప్పుతాడు. బాధానివారణ వైద్యుడి కర్తవ్యం. కాని, చికిత్స విధానం ఆయనదే ఔతుంది. శ్రీకృష్ణుడు మహాత్ముడైన దివ్య పురుషుడు. సాక్షాత్ నారాయణుడు. అతడి సంకల్పం ప్రకారమే కార్యం నడుస్తుంది, నడుస్తున్నది. అయితే, నారాయణుడు భక్తవత్సలుడు. మొరపెట్టుకొన్న వారిని రక్షిస్తాడు. వారికి ప్రియం చేకూరుస్తాడు. 'మ్రొక్కిన వరమిచ్చు వేల్పు' శ్రీకృష్ణుడు. అందుకే వేయేల? ఏగతి నడపఁ దలఁచితి, అదియ నాకుఁ బ్రియము' అని 'అన్యథా శరణం నాస్తి' అని వేడుకొంటూ దైవసంకల్పమే తన సంతోషంగా పేర్కొని ముగించాడు.

(5) 'ఆపదఁ గడవం బెట్టఁగ' (6వ పద్యం) అని మొదలు పెట్టి 'ఇన్ని సంకటముల నిబ్బంగి' అని ముగించే ఈ పద్యాల ఎత్తుగడలలో ఒకే విధమైన మనఃస్థితి ఉండటం, శ్రీకృష్ణుడిని దివ్యాత్ముడిగా భావించే భక్తిభావం ప్రకటితం కావటం గమనిస్తే తిక్కన పూర్వాపరకావ్య కథార్థ సమన్వయ శిల్పం స్పష్టమవుతుంది. (సంపా.)

వ. అని చెప్పి తలంచికొని వెండియు నిట్లనియె : 25

తాత్పర్యం: అని పలికి, ఏదో భావం మనసుకు రాగా, మళ్ళీ ఇట్లా అన్నాడు:

విశేషం: 'తలంచికొని' - అభినయ విశేష వ్యంజకం. పాదరసం వంటి బుద్ధిగల ధర్మరాజు - శ్రీకృష్ణుడు కురుసభకు పోతే ఏయే సన్నివేశాలు జరుగవచ్చునో, ఏయే విపరీత పరిస్థితులు శ్రీకృష్ణుడు ఎదుర్కొనవలసి వస్తుందో ఊహించాడు. బహుశః దుర్యోధనాదులు శ్రీకృష్ణుడిని ఒంటరివాడిని చేసి బంధించవచ్చును, సంహరించవచ్చును. ఒకవేళ అటువంటి గడ్డు పరిస్థితినే ఎదుర్కొనవలసి వస్తే యుద్ధ ప్రయోజనాల కొరకు శ్రీకృష్ణుడిని నిష్ప్రయోజనంగా బలిపెట్టుకొనవలసి వస్తుందేమో-అనే భావం ధర్మజుడి మనసులో మెరసినట్లుంది. మరల మాట్లాడటం మొదలు పెట్టాడు. ఆలోచనాముద్రలో ఉన్న ధర్మజుడిని గమనించి, అత డింకా మాట్లాడే అవకాశమున్నదని ఎవరూ పలకటానికి ముందుకు రాలేదు. ఇవన్నీ నిశ్శబ్దంగా ధ్వనింపబడే తిక్కన నాటకరంగ సూచనలు. (సంపా.)

క. 'నీవు సుయోధను పాలికిఁ ।
బోవఁగ వలదనియు నొక్కబుద్ధి వొడమెడున్;
గోవింద! యతఁడు మంత్రులుఁ ।
గావరమునఁ జక్క వినరు కార్యవచనముల్. 26

ప్రతిపదార్థం: గోవింద= కృష్ణా!; నీవు= నీవు; సుయోధనుపాలికిన్= దుర్యోధనుడి దగ్గరకు; పోవఁగన్+వలదు= వెళ్ళవద్దు; అనియున్= అనికూడ; ఒక బుద్ధి పొడమెడున్= ఒక తలంపు కలుగుతున్నది; అతఁడు= ఆ సుయోధనుడు; మంత్రులున్= ఆతడి సచివులు; కావరమునన్= పొగరుబోతుతనంతో; కార్యవచనముల్= సంధి మాటలు; చక్కన్+వినరు= శ్రద్ధగా ఆలకించరు.

తాత్పర్యం: 'కృష్ణా! నీవు దుర్యోధనుడి దగ్గరకు వెళ్ళటం సముచితం కాదని కూడా నాకొక తలంపు కలుగుతున్నది. అతడూ, ఆతడి మంత్రులూ పొగరుబోతులు. వారు నీ సంధివచనాలు శ్రద్ధగా చెవులబెట్టరు.

తే. కుటిలమతు లవినీతులు క్రూరకర్ము;।
లట్టి నీచుల కడకు ని న్ననుపఁజాల;
నీవు సంకటపడియెడు దేవపదవి ।
యైన నే నొల్ల; నొంటి యం దరుగు టుడుగు.' 27

ప్రతిపదార్థం: కుటిలమతులు= కుచ్చితపు బుద్ధిగలవారు; అవినీతులు= అడకువ లేనివారు; క్రూరకర్ములు= ఘోరకృత్యాలు చేసేవారూ అయిన; అట్టి నీచుల కడకున్= అటువంటి తుచ్ఛులైన కౌరవుల వద్దకు; నిన్నున్= నిన్ను; అనుపన్+చాలన్= పంపలేను; నీవు సంకటపడియెడు= నీవు శ్రమల పాలు కావలసిన; దేవపదవి+ఐనన్= స్వర్గరాజ్యమైనా; నేను+ఒల్లన్= నేనిష్టపడను; ఒంటిన్= ఒంటరిగా; అందున్+ అరుగుట+ ఉడుగు(ము)= అక్కడికి వెళ్ళటం మానవలసింది.

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనాదులు వక్రబుద్ధి గలవారు, వినయరహితులు, దారుణకృత్యాలకు పాల్పడేవారు. అట్లాంటి తుచ్ఛుల దగ్గరికి నిన్ను పంపలేను. నిన్ను చిక్కులపాలు చేసే ఇంద్రపదవిని సైతం నేను వాంఛించను. కనుక కౌరవుల కడకు నీవు ఒంటరిగా వెళ్ళటం మానుకో.'

విశేషం: 1.28, 29 పద్యాలలో ధర్మజుడు శంకించినవన్నీ ఊహలుగా అనిపించినా, అతడు శంకించినట్లుగానే అవి జరుగబోతున్నాయి. అంటే ధర్మరాజు ఆగామిని అంత నిర్దిష్టంగా దర్శించగల ప్రజ్ఞావంతు డన్నమాట!

2. త్రిలోకపదవికంటె శ్రీకృష్ణుడి క్షేమం ధర్మజుడికి ప్రియం- అనే వాక్యం పాండవుల అనన్యభక్తికి ప్రత్యక్షర సాక్ష్యం.

3. దీనికి మూలం : "నహినః ప్రణయే ద్ద్రవ్యం, నదేవత్వం కుతః సుఖమ్ । న చ సర్వామరైశ్వర్యం తవరోధిన మాధవ!'' (5.70.84). 'ఒంటి యం దరుగుటుడుగు' అనే మాట అమూలకం. అయినా ప్రకరణోచితం'' (సంపా.)

చ. అనవుడుఁ గృష్ణుఁ డిట్లనియె 'నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ త
త్తనయుఁడ యేల; నీ పలుకు తథ్యము; నీ తలఁ పే నెఱింగితి;
న్మనమున శంక దక్కుము; వినన్ వలతే విను; మేను నిక్క మ
ళ్గిన నచటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁడేనియున్? 28

ప్రతిపదార్థం: అనవుడున్= ధర్మజుడు అట్లా పలుకగా; కృష్ణుఁడు= వాసుదేవుఁడు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; తత్+తనయుఁడ+ఏల?= అతని కుమారుడైన సుయోధను డొక్కడే యేమి?; ఆ ధృతరాష్ట్రుఁడున్+అట్టివాఁడు+అ= ఆంబికేయుడును అట్లాంటివాడే; నీ పలుకు తథ్యము+అ= నీమాట నిజమే; నీ తలఁపు= నీ భావం; ఏను+ఎఱింగితిన్= నేను తెలిసికొన్నాను; మనమునన్= నీ హృదయంలో; శంక+ తక్కుము= అనుమానం మాను; వినన్ వలతేన్= నా మాటలు వినగోరితే; వినుము= వినుము; ఏను= నేను; నిక్కము= నిజంగా; అల్గినన్= నిజంగా ఆగ్రహిస్తే; అచటన్= ఆ కురుసభలో; రణకేళికిన్= యుద్ధ క్రీడకు; మార్కొనన్= ఎదిరించటానికి; ఒక్కఁడు+ ఏనియున్= లెక్కకు ఒక్కడైనా; కలండె?= ఉన్నాడా?

తాత్పర్యం: ధర్మజుడి మాటలకు శ్రీకృష్ణుడు ఇట్లా బదులు పలికాడు. 'సుయోధను డొక్కడేయేమి, ఆతడి తండ్రి ధృతరాష్ట్రుడుగూడ నీవు పల్కిన తీరువాడే. నీ మాట సత్యం. నీ భావ మేమిటో నేను గ్రహించాను. నీవు మనసులో సందేహించ వద్దు. నా మాటలు వినదలిస్తే వినుము. నేను నిజంగా ఆగ్రహిస్తే అక్కడ యుద్ధంలో న న్నెదిరించగలవాడు ఒక్కడైనా ఉన్నాడా?

విశేషం: 1. ఒంటరిగా కురుసభకు వెళ్ళటం మానుమని స్నేహ పురస్సరంగా ధర్మరాజు అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు ఆర్ద్రుడయ్యాడు. ధర్మజుడి మనసులో ఉన్న శంక తొలగించాలని ఈ పద్యంలోని మాటలన్నాడు. ధర్మజుడివలెనే శ్రీకృష్ణుడు చిన్న చిన్న వాక్యాలతో తన మనోభావాన్ని తెలిపాడు. దుర్యోధన ధృతరాష్ట్రుల స్వభావా లటువంటివే అని ఒప్పుకొన్నాడు. ధర్మజు డనిన మాటలన్నీ

నిజాలనీ (నిజాలౌతాయనీ) చెప్పాడు. 'నీతలఁ పే నెటింగితి'- అనే వాక్యం బహుళార్థకం. ధర్మజుడు తన ఉపన్యాసంలో కోరుతున్న తాత్పర్యాన్ని, అంతరార్థాన్ని అవగాహనం చేసికొన్నానని ఒక అర్థం. కురుసభకు పోతే ఏర్పడే అపాయాన్ని గురించి శంకిస్తున్న ధర్మజుడి ఆత్మీయతను గ్రహించానని మరొక అర్థం. మనస్సులో శంకను మానేయమన్న వాక్యం - రెండర్థాలకూ వర్తిస్తుంది. 'వినవలతేన్ వినుము'-అనే వాక్యం శ్రీకృష్ణుడి అభిమానోక్తి, వీరోక్తి, ఒంటరిగా వెళ్ళినా, ఎంద రెదిరించినా, నిజంగా కోపించి యుద్ధానికి దిగితే శ్రీకృష్ణుడికి ఎదురైన వాడు కురుసభలో లేడని చెప్పి, 'నే నొక్కడినే, నావలె మరొక్కడున్నాడా?' అని వీరోక్తి పలికాడు. ఒక్కడు - అంటే ఒంటరివాడు అని ఒక అర్థం. ఏకైక వీరుడు అని మరొక అర్థం. శ్రీకృష్ణు డొక్కడైనా ఏకైక వీరుడని ధ్వని. ఇవి సంభాషణ చమత్కారాలని భావించినా, శ్రీకృష్ణుడి మాటలు కూడా కురుసభలో సత్యాలు కాబోతున్న భావికథార్థ ధ్వనులవలె వెలుగొందుతున్నాయి. ఈ పద్యంలో శ్రీకృష్ణుడి దివ్యాదివ్య స్వభావం ధ్వని.

2. ఇందులో అర్థవ్యక్తి అనే గుణం భాసిస్తున్నది. శ్రీకృష్ణ స్వభావ స్ఫుటత్వం ఇందులోని అర్థగుణదీప్తి. (సంపా.)

క. పనుపుము కౌరవసభ; కేఁ ।
జను టెట్లును మేల; యర్థ సంసిద్ధియగున్;
మన కొకటం బాపము రా ।
కునికికిఁ గతమైన పలుకు లొండెను గలుగున్.' 29

ప్రతిపదార్థం: కౌరవసభకున్= కౌరవుల కొలువు కూటానికి; పనుపుము= నన్ను పంపుము; ఏన్= నేను; చనుట= అచటికి వెళ్ళటం; ఎట్లును+మేలు+అ= ఏ విధంగా ఆలోచించినా అది మంచిదే; అర్థ సంసిద్ధి+అగున్= మన ప్రయోజనం నెరవేరుతుంది; మనకున్= మనకు; ఒకటన్= ఏ రకంగానూ; పాపము రాక+ఉనికికిన్= దురితం రాకుండటానికి; కతము+ఐన= కారణమైన; పలుకులు+ఒండెను= మాటలైననూ; కలుగున్= కలుగుతాయి.

తాత్పర్యం: నన్ను కౌరవ సభకు పంపుము. నేనచటికి వెళ్ళటం ఎంతైనా మంచిది. మన కార్యం నెరవేరుతుంది. లేదా మనకు పాపం సంభవించని పలుకులైనా పలకడానికి వీలవుతుంది.'

విశేషం: ఈ పద్యం ధర్మరాజు హృదయాన్ని పూర్తిగా తెలిసికొన్న దూత పలికినట్లుండటం విశేషం. ప్రతి వాక్యం ప్రయోజనాత్మకం.

(1) 'నన్ను కౌరవసభకు పంపుము'- శ్రీకృష్ణుడు స్వతంత్రుడుగా కౌరవసభకు పోయినట్లు కాకుండా ధర్మజుడి రాయబారిగానే వెళ్ళుతున్నట్లు సూచించి, ధర్మరాజ ప్రభుత్వాన్ని గౌరవించాడు, మన్నించాడు.

(2) 'నేను వెళ్ళటం అన్ని విధాలా మంచిది'- ఈ మాట నిజం. ధర్మజుడు సామదాన భేదోపాయాలను ప్రయోగించి, అవన్నీ కౌరవులవలననే భంగమయ్యాయని నిరూపించగల వ్యక్తిని కోరుతున్నాడు. అతడి ఆశయాల నన్నింటిని నెరవేర్చటమే కాక, చూచి రమ్మంటే కాల్చి వచ్చే సమర్థుడు శ్రీకృష్ణుడు. కర్ణుడితో సాగించిన మంతనాలవంటివి శ్రీకృష్ణుడే చేయగలడు. అవెంతో మేలు చేశాయి. అందువలన సర్వసమర్థుడైన రాయబారి శ్రీకృష్ణుడని స్పష్టం.

(3) ధర్మరాజు కోరినట్లు అర్థసిద్ధి అయ్యేటట్లు, పాపం రానట్లు, కీర్తి కలిగేటట్లు మాట్లాడతానని శ్రీకృష్ణుడు పలకటం ధర్మరాజుకు పరిపూర్ణ సంతృప్తి నిచ్చింది. అర్థమంటే సంపద, ప్రయోజనం అని రెండర్థాలు. ఇక్కడ మొదట సంధి ప్రయోజనసిద్ధి, ఆ తరువాత యుద్ధ విజయసిద్ధి అని గ్రహించవచ్చును. ధర్మజుడి విస్తృతోపన్యాస సారాంశం ఒక కంద పద్యంలో అందంగా చెప్పాడు కృష్ణుడు. ధర్మజుడు గడుసుగా మాట్లాడగలడు. ఒడుపుగా మాట్లాడగలడు. (సంపా.)

వ. అని పలికిన యుధిష్ఠిరుం డిట్లనియె: 30

తాత్పర్యం: శ్రీకృష్ణుని మాటలకు ధర్మనందనుడు ఇట్లా అన్నాడు:

ఆ. 'మేలుగాక నీకుఁ బోలినట్లయిన నం ।
దరిగి యేము వారు నర్థిఁ బొంది

యుండునట్లుగాఁగ నొడఁబాటు గావింపు ।
మెల్లభంగి మనకు నిదియ లెస్స. 31

ప్రతిపదార్థం: మేలుగాక!= శుభమగుగాక;! నీకున్= నీకు; పోలిన+అట్లు+ అయినన్= యుక్తమని తోస్తే; అందున్+అరిగి= కౌరవసభకు వెళ్ళి; ఏము= మేము; వారు= కౌరవులు; అర్థిన్= ప్రీతితో; పొంది+ఉండునట్లు కాఁగన్= కూడిఉండేటట్లు; ఒడఁబాటు కావింపుము= అంగీకారం కుదుర్చుము; ఎల్లభంగిన్= అన్ని విధాల; మనకున్= మనకు; ఇది+అ లెస్స= సంధియే మేలు.

తాత్పర్యం: 'కృష్ణా! మంచిది. కురుసభకు వెళ్ళటం నీకు యుక్తమని తోస్తే వెళ్ళి మేమూ, వారూ కలసి మెలసి ఉండేటట్లుగా సంధి కుదుర్చుము. అన్ని విధాలా వారితో సంధి కుదుర్చుకొనటమే మనకు మంచిది.

క. మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు ।
నెమ్మి యెఱుఁగు దర్థసిద్ధి నెఱి యెఱుఁ గుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు ।
పో మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్. 32

ప్రతిపదార్థం: మమ్మున్+ఎఱుఁగుదు(వు)= మేమెట్లాంటి వాళ్ళమో ఎరుగుదువు; ఎదిరిన్+ఎఱుఁగుదు(వు)= కౌరవు లెట్టివారో ఎరుగుదువు; నెమ్మిన్+ఎఱుఁగుదు= కూర్మిఅనగా ఎటువంటిదో ఎరుగుదువు; అర్థసిద్ధినెఱి+ఎఱుఁగుదు(వు)= కార్యసాధన విధాన మెట్టిదో ఎరుగుదువు; వాక్యమ్ముల పద్ధతిన్+ఎఱుఁగుదు(వు)= మాటలాడే తీరు ఎట్టిదో ఎరుగుదువు; నీకున్+బుద్ధులు+చెప్పన్= నీకు ఉపాయాలు బోధించటానికి; నేను+ఎవ్వఁడన్= నేనేపాటివాడిని; పొమ్ము= హస్తినాపురికి వెళ్ళిరమ్ము.

తాత్పర్యం: కృష్ణా! పాండవులూ, కౌరవులూ ఎట్లాంటివారో ఎరుగుదువు. కూర్మి అంటే ఎట్టిదో ఎరుగుదువు. కార్యసాధన విధాన మెట్టిదో ఎరుగుదువు.

మాటలాడు తెరగెట్టిదో ఎరుగుదువు. నీకు ఉపాయాలు చెప్ప నేనే పాటివాడిని?, హస్తినకు వెళ్ళి రమ్ము.'

విశేషం: 1. ఈ పద్యం పైకి ప్రశంసావాక్యం, లోన దూతలక్షణవివేకం.

2. ధర్మరాజు చేసిన ఉపన్యాసంలోని లోగుట్టులు తెలిసిన వ్యక్తి శ్రీకృష్ణుడే. మిగిలిన వారికి చూచాయగా మాత్రం గోచరమై ఉండవచ్చును. శ్రీకృష్ణుడు ఆవులిస్తే ప్రేవులు లెక్క పెట్టగలవాడని అతడి సమాధానం బైటపెట్టింది. దానికి లోలోన సంతోషించి ముసి ముసి నవ్వులతో ప్రశంసల జల్లులు కురిపించాడు ధర్మరాజు. 'ఎఱుగుదు(వు)' అనే క్రియను అయిదుసార్లు వాడాడు. ఆరవసారి వాచ్యం చేయకుండా ధ్వనిమయం చేసి సర్వజ్ఞత్వాన్ని సూచించాడు.

3. శ్రీకృష్ణుడిని 'దివ్యుడిగా సర్వజ్ఞుడిగా ప్రశంసించిన తాత్పర్యం ఇది. మమ్ములను గురించి తెలుసు. ఆపైన ఎదుటి వారిని గురించి తెలుసు అనటంలో పాండవాధిక్యాన్ని తెలిసినవాడివని భావం. శ్రీకృష్ణుడిని రాయబారిగా ప్రశంసించిన తాత్పర్యంలో 'నీకు ఉభయ పక్షాలూ తెలు'సని భావం. 'ఇరువురికి ఉన్న అనుబంధ మెటువంటిదో తెలుసు. వాక్య రచనా పద్ధతులు తెలుసు. ఇన్ని తెలిసిన సర్వజ్ఞుడైన నీకు ధర్మనీతులు చెప్పటానికి నేనెంత వాడను?' అని ఒక అర్థం. 'నీకు ఉపాయాలు చెప్పేటంత వాడినా నేను?'- అని మరొక అర్థం. అన్ని వాక్యాలూ ఒక ఎత్తు; చివరివాక్యం ఒక్కటీ ఒక ఎత్తు. ముగింపు వాక్యాన్ని మెరిపించిన వాడే మహావక్త. ఈ పద్యంలో చివరి వాక్యం- తెలుగుదనం పుక్కిట పట్టిన వాక్యం. అప్యాయతకు అచ్చమైన నిదర్శనం. ముచ్చటైన ముగింపు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్ణయంబు సెప్పుట (సం. 5-71-1)

సీ. అనిన ముకుందుఁ డిట్లనియె; 'సంజయుని మా ।
టలును నీవన్న పల్కులును వింటి;
నీమది ధర్మైకనిష్ఠమై నున్నది; ।
వైరంబు విడువరు వారు; ద్రోణ

భీష్ములు గలరని బిరుదులై యున్న వా;।
రగునె రాజన్యుల కడఁగి కుడువ?
నక్లేశవృత్తి రాజ్యము చవి గొన్న వా।
రేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ!

తే. ధార్తరాష్ట్రులు సడికి నధర్మమునకు।
నలుక రెన్నఁడు; విడువు దైన్యంబు; పోడువు
కయ్య మరివర్గ జయమునఁ గలుగు నిహ ప।
రములుఁ జిరకీర్తియును బాండురాజతనయ! 33

ప్రతిపదార్థం: అనినన్= ధర్మజుడు అట్లా పలుకగా; ముకుందుఁడు= మోక్షప్రదాతయగు శ్రీకృష్ణమూర్తి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా మాట్లాడాడు; పాండురాజ తనయ!= పాండురాజు పుత్రుడవైన ధర్మజా!; సంజయుని మాటలును= సంజయు డాడిన వాక్యాలూ; నీవు+అన్న పల్కులును= నీవు మాట్లాడిన మాటలూ; వింటిన్= ఆకర్ణించితిని; నీ మది= నీ హృదయం; ధర్మ+ఏకనిష్ఠమైన్+ఉన్నది= ధర్మమునందే ముఖ్యంగా నెల కొని ఉన్నది; వారు= కౌరవులు; వైరంబున్+విడువరు= విరోధాన్ని మానరు; ద్రోణ భీష్ములు= గురుడూ, పితామహుడూ; కలరు+అని= తమ పక్షంలో ఉన్నారని; బిరుదులు+ఐ= శూరులై; ఉన్నవారు= ఉన్నారు; రాజన్యులకున్= క్షత్రవంశజులకు; అడఁగి= విధేయులై; కుడువన్= భుజించటం; అగునె?= తగునా?; అక్లేశవృత్తిన్= ఎట్టి కష్టం లేకుండా; రాజ్యము చవికొన్నవారు= రాజ్యం యొక్క రుచి చూచినవారు; నీకున్= నీకు; పాలు= రాజ్యభాగం; ఏల+ఇత్తురు చెపుమ!= ఎందుకిస్తారో చెప్పుము; ధార్త రాష్ట్రులు= ధృతరాష్ట్రుడి కొడుకులు; సడికిన్= నిందకు; అధర్మమునకున్= అన్యాయానికి; ఎన్నఁడున్= ఎప్పుడూ; అలుకరు= భయపడరు; దైన్యంబు= దీనతను; విడువు(ము)= వదలిపెట్టుము; కయ్యము పోడువు(ము)= పోరు సల్పుము; అరివర్గ జయమునన్= శత్రు సమూహాన్ని జయించటంవలన; ఇహపరములున్= ఇహపరసుఖాలునూ; చిరకీర్తియున్= శాశ్వత యశమున్నూ; కలుగున్= నీకు లభించగలవు.

తాత్పర్యం: ధర్మనందనుడి మాటలు విని శ్రీకృష్ణు డిట్లా అన్నాడు. 'పాండురాజపుత్రా! సంజయు డాడిన మాటలూ, నీవు పల్కిన పల్కులూ విన్నాను. నీ మనస్సు ధర్మంలో పూర్తిగా నెలకొని ఉన్నది. కౌరవులు పగ మానరు. భీష్మ ద్రోణులు తమ పక్షంలో ఉన్నారని శూరులై నిక్కుతున్నారు. రాజులకు అణగిమణగి యాచించి భుజించటం తగదు. అనాయాసంగా లభించిన రాజ్యం రుచి మరిగిన కౌరవులు పుడమిలో పాలు పంచి నీ కెందు కిస్తారో నీవే చెప్పుము. దుర్యోధనాదులు నిందకూ, అధర్మానికీ ఎన్నడూ జంకరు. నీవు దైన్యం వదలిపెట్టుము. యుద్ధం సలుపుము. శత్రు సమూహాన్ని జయించటం వలన ఇహపరసుఖాలు సమకూరుతాయి. శాశ్వత కీర్తి లభిస్తుంది.

విశేషం: 1. ఇంతవరకు శ్రీకృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళే రాయబారిగా మాట్లాడాడు. ప్రభువైన ధర్మరాజు నిర్దేశించిన ప్రయోజనాలను సాధిస్తానని నిస్సంశయంగా పలికాడు. ఇక ఇప్పుడు శ్రీకృష్ణుడు మిత్రుడుగా, హితవరిగా, సచివుడుగా పాండవులు నమ్మిన భగవంతుడుగా మాట్లాడుతున్నాడు. ధర్మరాజు ఉపప్లావ్యనగరంలో ఎట్లా వ్యవహరించుకొనాలో చెప్పుతున్నాడు. ఇది పాండవులకు వాసుదేవుడు చెప్పే హితవు.

2.'మ మ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు' అని ధర్మరాజు చేసిన ప్రశంసకు అనుగుణంగా శ్రీకృష్ణుడు తా నెఱిగిన అంశాలను ఈ పద్యంలో నివేదించాడు. 'ధర్మజుడి మనస్సు ధర్మైక నిష్ఠం. ధార్తరాష్ట్రులు నిందకూ, అధర్మానికీ ఎన్నడూ జంకరు' అని తేల్చి చెప్పాడు. "తన ధర్మాశ్రితా బుద్ధిః । తేషాం వైరాశ్రితా మతిః" (5-71-2) అని మూలం. ధర్మాధర్మాలకు సంధి కుదురుతుందా? అన్న ప్రశ్న లేవనెత్తాడు మాధవుడు. సంధి సందిగ్ధం కాబట్టి పాండవులు సమర

సన్నాహం మానకూడదని హితవు చెప్పాడు. ధర్మజుడు చేస్తున్న శాంతి యత్నానికి, పాండవ యుద్ధ సన్నాహం విరుద్ధం కాదని ప్రకటించాడు. శ్రీకృష్ణుడి హితవు అనుష్ఠాన రాజనీతి.

3. తిక్కన మూలంలోని భావాలను సందర్భోచితంగా మార్చి రచించటం సర్వసామాన్యం. దానికి ఉదాహరణగా ఇక్కడ ఒక విషయం చెప్పుకొనవచ్చును. కౌరవులను గురించి చెప్తుతూ శ్రీకృష్ణుడు -

"అతి గృద్ధాః కృతస్నేహా దీర్ఘకాలం సహోషితాః
కృత మిత్రాః కృతబలా ధార్తరాష్ట్రాః పరంతప". (సం. 5-71-6)

అని అన్నాడని మూలం. 'ధార్తరాష్ట్రులు మిక్కిలి పిసినిగొట్టువారు. అయినా మీరు చాలాకాలం వారితో స్నేహం చేశారు, కలిసి మెలసి ఉన్నారు. మైత్రి పెంపొందించుకొన్నారు. బలాన్ని కూడా పెంపొందించుకొని ఉన్నారు' అనే ఈ మాటలను తిక్కన స్వీకరించక. 'అక్లేశవృత్తి రాజ్యము చవిగొన్న వారేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ?' అని అనిపించాడు. ఈ వాక్యం సన్నివేశౌచిత్యాన్ని పెంచింది.

4. ఎత్తుగీతి తిక్కన పాత్రోచిత సంభాషణ కెత్తిన పతాక! ధర్మజుడి శాంతిప్రయత్నంతో పాండవ స్కంధావారంలో ఉత్సాహం కొంత మందగించినట్లు కనపడింది. అది భావి కార్యసాధనకు పోషకం కాదు. శ్రీకృష్ణు డా సమయంలో పగనూ, సమరోత్సాహాన్నీ, వీరరౌద్రరసస్ఫూర్తినీ పాండవవర్గంలో జాగృతం చేసి రసోల్లాసాన్ని కలిగించదలచాడు. అందువలననే ఎత్తుగీతిలో నినాద కవిత్వం చెప్పాడు. అందులో అంతర్గత తర్కం కూడా ఇమిడ్చాడు. 'కౌరవులు నిందకు భయపడరు కాబట్టి నీవు దైన్యాన్ని వదలిపెట్టుము: వాళ్ళు అధర్మానికి జంకరు కాబట్టి నీవు యుద్ధానికి జంకక వారిమీద దాడి చేయుము' అని రెచ్చగొట్టాడు. శత్రువులను జయించటం వలన ఇహపర సుఖాలూ, చిరకీర్తీ వస్తాయని ధర్మజుడి చిత్తవృత్తికి హత్తుకొనేటట్లు పలికాడు.

5. దూతగా శ్రీకృష్ణుడు శాంతినీ, హితుడుగా యుద్ధాన్నీ అనుసరిస్తూ ద్విముఖ పాత్ర నిర్వహిస్తున్నట్లు కనపడుతున్నా, ధర్మజుడు సాధించ దలచుకొన్న ధర్మనీతికి అది విరుద్ధం కాదని తెలిపే సంభాషణ ఇక ముందు శ్రీకృష్ణుడు సాగించటం గమనార్హం.

6. 'పాండురాజతనయ!' అనే సంబుద్ధి సార్థకం. చిరకీర్తీ, ఇహపరాలూ పాండురాజు పుత్రుడైతేనే కోరుకొంటాడని భావం.

7. ధర్మైకనిష్ఠమై ఉన్న ధర్మరాజు చిత్తవృత్తిని యుద్ధైక నిష్ఠం చేయటానికి శ్రీకృష్ణుడు ప్రయోగించిన ప్రథమ వాఙ్మయోపాయం ఈ పద్యం. (సంపా.)

మ. గురుభీష్మాదులు సూచుచుండ సభ మీకుం గీడు నాఁ డట్లు ము
ష్కరులై చేసిరి; యంతసేసియును బశ్చాత్తాపముం బొంద నో
పర వా రెన్నఁడు; నట్టిచోటఁ గృపయున్ బంధుత్వముం దక్కుఁ మె
వ్వరుఁ గోపింపరె యా దురాత్మకుల గర్వక్రౌర్యముల్ సూచినన్. 34

ప్రతిపదార్థం: గురు భీష్మ+ఆదులు= ఆచార్యుడైన ద్రోణుడు; పితామహుడైన భీష్ముడు మున్నగువారు; చూచుచున్+ఉండన్= వీక్షిస్తూఉండగా; సభన్= కొలువులో; మీకున్= మీకు; కీడు= అపకారం; నాఁడు= అప్పుడు; అట్లు= ఆ విధంగా; ముష్కరులు+ఐ= నీచులై; చేసిరి= చేశారు; అంత చేసియును= అంతటి కీడు చేసికూడా; వారు= కౌరవులు; ఎన్నఁడున్= ఒకనాడైనా; పశ్చాత్తాపమున్+పొందన్+ఓపరు+అ= చేసిన తప్పును గూర్చి తరువాత చింతించినవారు కారు; అట్టిచోటన్= అట్టివారి విషయంలో; కృపయున్= కారుణ్యమునూ; బంధుత్వమున్= చుట్టరికాన్నీ; తక్కుము= మానుము; ఆ దురాత్మకుల గర్వ క్రౌర్యముల్= ఆ దుష్టచిత్తుల యొక్క పొగరుబోతుతనం, క్రూరత్వం; చూచినన్= పరికిస్తే; ఎవ్వరున్+కోపింపరె?= ఎంతటి సాధువులైనా కోపగించక మానుతారా?

తాత్పర్యం: గురుడు, భీష్ముడు మొదలైన పెద్దలు చూస్తుండగా, సభలో తుచ్ఛులైన కౌరవులు మీకు ఆనాడు అపకారం చేశారు. అంతటి అపకారం చేసికూడా ఆ తరువాతనైనా, వారు చేసిన తమ తప్పుకు ఎన్నడూ పశ్చాత్తాపం ప్రకటించనేలేదు. అట్టి వారి విషయంలో కారుణ్యం, బంధుభావం విడిచిపెట్టుము. ఆ దుష్టచిత్తులయొక్క పొగరు, క్రౌర్యం చూస్తే ఎవరైనా వారిపై కోపపడకుంటారా?

విశేషం: 1. 'పగ యడగించుటెంతయు శుభంబు'- అన ధర్మరాజుఅభిమతం. అది రాజకీయానికి పనికి వచ్చే శాంతి సూక్తం. కాని, పాండవ స్కంధావారానికి అప్పు డది పనికిరాదు. కురుసభలో పగ సెగలు క్రక్కుతున్న వాస్తవం గమనించి కూడా పాండవులు పగను చల్లార్చుకొనటం సబబుకాదు. అందువలన పగకు మూలమైన కౌరవ దుష్కృత్యాన్ని శ్రీకృష్ణు డిందులో పేర్కొన్నాడు. అందులోనూ ఆ చెప్పే తీరులో ఒక క్రమోన్మీలనం గోచరిస్తుంది. శ్రోతను భావోద్వేగస్థితికి చేర్చే మాటల పొందిక కనబడుతుంది. అది శ్రీకృష్ణుడి ప్రబోధ వాక్యరచనా శిల్పం.

2. కౌరవులు వస్తుతః దురాత్ములు, పైపెచ్చు గర్విష్ఠులు, క్రూరులు. ఈ మూడు గుణా లున్నవారిని లోకంలో ఎవరైనా కోపిస్తారు! గర్హిస్తారు. దురాత్ములు అనటానికి - ద్రోణ భీష్మాదులు చూస్తూ ఉండగా నిండుసభలో పాండవులకు నీచంగా కీడు చేయటమే సాక్ష్యం. ఒకవేళ ఆవేశంలో ఆ తప్పు చేసినా, వారు గర్వాంధులు కాబట్టే చేసిన తప్పుకు పశ్చాత్తాపం కూడా ప్రకటించలేదు. ఇప్పటికీ క్రూరులై మీకు కీడే తలపెట్టుతున్నారు. అటువంటి వారిమీద దయాదాక్షిణ్యాలు కాని, బంధుత్వ మిత్రత్వాలు కాని తగవు. కాబట్టి యుద్ధం వలన బంధునాశన మవుతుందని నిర్వేదం చెందవలసిన అవసరం లేదని హితవు చెప్పాడు. కోపంతో పగసాధించటమే కర్తవ్యమని బోధించాడు.

3. 'ఎవ్వరు కోపింపరె?' అనే ప్రశ్నార్థకం వ్యంగ్యగర్భితం. 'ఎవరు కోపించరు? నీ వొక్కడివి తప్ప' అని భావం. లోకమంతటిదీ ఒకదారి, నీవొక్కడిదీ ఒకదారి - అని సున్నితమైన అధిక్షేపం. కరుడుకట్టుకొన్న భావాలను కరిగించటానికి

ప్రశ్నార్థక వాక్యాలు వేడి తూటాల వంటివి. శ్రీకృష్ణుడికి వాటిప్రయోగం బాగా తెలుసు. (సంపా.)

వ. కపటపు నెత్తంబు నెపంబుగా మిమ్ము వెడలనడుచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు పుయిలోట దక్కి కలకల నవ్వుచుం బలికిన పలుకు లుగ్గడింపవచ్చునే? వాని విని సమస్త జనంబులు ధృతరాష్ట్రు నిందించుచు మీరు బలవంతులరయి యుండియు సత్యంబు వాటించి యూరకపోక సూచి యచ్చెరు వాటుతో నుమ్మలించుచుండిరి; తిట్టువాట్లం బోయెడువారు దైవోపహతులై మున్న చెడియుండుదురు గావున వారలం జంపనుం జెఱుపనుం జులుకన క్రూరాత్ములగు కౌరవులెల్లవారికి వధ్యులుగాఁ దగుదురు; నీకేల యవధ్యులైరి? పాపాత్మకులగు హింసకులం బాముల నెట్లట్ల నిర్విచారంబుగా వధియించుట కర్తవ్యంబు. 35

ప్రతిపదార్థం: కపటము నెత్తంబు= మోసపు జూదం; నెపంబుగాన్= మిషగా; మిమ్మున్= మిమ్ములను; వెడలనడుచు+అప్పుడు= అడవులకు పంపేటప్పుడు; దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు= దుర్యోధనుడు, దుస్సేనుడు, శకుని, సూతపుత్రుడైన కర్ణుడు; పుయిలోట+తక్కి= సంకోచం వీడి; కలకల నవ్వుచున్= పకపక నవ్వుతూ; పలికిన పలుకులు= మాట్లాడిన మాటలు; ఉగ్గడింపన్+వచ్చునే?= పలుక దగినవా?; వానిన్+విని= ఆ మాటలు విని; సమస్త జనంబులు= ప్రజలందరు; ధృతరాష్ట్రున్+ నిందించుచున్= ధృతరాష్ట్రుడిని దూషిస్తూ; మీరు బలవంతులరు+అయి+ఉండియున్= మీరు బలశాలులై ఉండికూడా; సత్యంబు+పాటించి= సత్యము నవలంబించి; ఊరకపోక+చూచి= తలవంచుకొని అడవులకు వెళ్ళటం చూచి; అచ్చెరు+ పాటుతోన్= ఆశ్చర్యం పొందుటతో; ఉమ్మలించుచున్+ఉండిరి= దుఃఖపడుచుండిరి; తిట్టువాట్లన్+ పోయెడు వారు= నిందల పాలైనవారు; దైవ+ఉపహతులై= దైవముచే చెరుపబడినవారై; మున్ను+అ= ముందుగానే;

చెడి+ఉండుదురు= చెరుపబడినవారౌదురు; కావునన్= కనుక; వారలన్= కౌరవులను; చంపనున్= సంహరించటానికీ; చెఱుపనున్= చెరచటానికీ; చులుకన= తేలిక; క్రూర+ఆత్ములు+అగు= కఠినచిత్తులైన; కౌరవులు= దుర్యోధ నాదులు; ఎల్లవారికిన్= అందరికిని; వధ్యులు కాన్+తగుదురు= చంప దగినవారౌతారు; నీకున్= నీకు మాత్రం; ఏల+అవధ్యులు+ఐరి?= ఎందుకు చంపకూడనివారైనారు? పాప+ ఆత్మకులు+అగు= పాపంతో కూడిన చిత్తంగల; హింసకులన్= ఘాతుకులను; పాములన్+ఎట్లు= సర్పాలను ఎట్లా వధిస్తారో; అట్లు= ఆ ప్రకారం; నిర్విచారంబుగాన్= ఆలోచించకుండా; వధియించుట కర్తవ్యంబు= చంపటమే చేయదగినపని.

తాత్పర్యం: ధర్మజా! కపట ద్యూతంలో మిమ్ము ఓడించి అడవులకు పంపేటప్పుడు దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు సంకోచం లేకుండా పకపక నవ్వుతూ ఆడిన మాటలు నోటితో వెల్లడించరానివి. ఆ మాటలన్నీ విని ప్రజలంతా ధృతరాష్ట్రుడిని దూషిస్తూ, మీరు బలవంతులై ఉండికూడా సత్యమునకు తల ఒగ్గి తలవంచుకొని ఊరక అడవులకు వెళ్ళటం చూచి ఆశ్చర్యపడుతూ దుఃఖించారు. నిందాపాత్రులైనవారు దైవంచేత ముందుగానే చెరుపబడి ఉంటారు. కనుక అటువంటివారిని చంపటం, చెరచటం చాల తేలిక. దుష్టచిత్తులైన కౌరవులు అందరికీ చంపదగిన వారైనప్పుడు నీకు మాత్రం చంపదగనివారైనారా? పాపహృదయులైన హింసాస్వభావులను పాముల నెట్లా ఆలోచించక వధిస్తారో అట్లా వధించడం తగిన పని.

విశేషం: అలం: ఉపమ: అర్థాంతరన్యాసం. పాపాత్ములను, హింసాత్మకులను పాములను నిర్దాక్షిణ్యంగా చంపినట్లు చంపాలి- అనేది ప్రతిపాద్యాంశం. పాముల కున్న విషలక్షణాలు కౌరవులయందు నిరూపించటం ఇందులోని అలంకార శిల్పం.

1. కపట ద్యూత సభలోనూ, అడవులకు పంపేటప్పుడూ పాండవులను దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణు లాడిన పరిహాసోక్తులు పాములు వేసే కాట్లవంటివి. పాముల కాట్లతో చంపబూనినా భీముడు వాటిని నిగ్రహించి బ్రతికిన ఘట్టాలు జ్ఞాపకం వస్తాయి. దుర్యోధనాదుల పరిహాస వాక్యాలు పాండవులకు విషబాధను కలిగించిన మాట వాస్తవం. బాధ కోర్చి సత్యవ్రతాన్ని సహనంతో పాటించిన పాండవుల ఉత్తమప్రవృత్తి ప్రజాదరణం పొందింది. కౌరవులను జనులు నిందించారు. వారి క్రౌర్యానికి కన్నీరు పెట్టారు. శ్రీకృష్ణుడు వాటిని మృత్యుదంష్ట్రల కాట్లగా అభివర్ణించాడు. పాము కాటుకు విరుగుడున్నది కాని, చావు కాటుకు తిరుగు లేదు. ఈ నీతితో కౌరవులు దైవోపహతులు. వారు తమ పాపకార్యాలతో ధార్మికంగా, నైతికంగా హతులైనారు. చనిపోయినవారిని భౌతికంగా చంపటమే మిగిలి ఉన్నదన్నాడు. ఈ మాటలంటున్న శ్రీకృష్ణుడిలో భగవద్గీతాచార్యుడు ప్రత్యక్షమవు తున్నాడు. అందుకే పాండవులను కౌరవుల వధకు ప్రేరేపించాడు.

2. పగ కలిగి ఉన్న మనసు పాముల పుట్టలున్న ఇల్లు వంటిదని ధర్మరాజన్నాడు. (3.20) దానికి శ్రీకృష్ణు డిస్తున్న ప్రచ్ఛన్న ప్రత్యాఖ్యానం.

ధర్మరాజు మనసులో పుట్టపెట్టుకొని ఉన్న పాము లెవరో కాదు- కౌరవులే. ఆ పాములను చంపకపోతే శాంతి ఎట్లా కలుగుతుంది? అని ఎదురు ప్రశ్న వేస్తున్నాడు. కాబట్టి 'వధించుట కర్తవ్యంబు' అని తర్కబద్ధంగా తేల్చి ఫలితాంశాన్ని నిర్దేశించాడు. శ్రీకృష్ణుడి తర్కానికి తట్టుకొనటం సామాన్యులకు సాధ్యం కాదు. (సంపా.)

క. మీ తండ్రికి భీష్మునకుం।
జేతోముద మొదవ భక్తి సేయన తగు నీ;
కా తలకు నేనుఁ జని వి।
ఖ్యాతంబుగ నీదు వినయ మభివర్ణింతున్. 36

ప్రతిపదార్థం: మీ తండ్రికిన్= మీ జనకుడైన ధృతరాష్ట్రుడికీ; భీష్మునకున్= తాతయగు భీష్ముడికీ; చేతస్(ః)+ముదము= హృదయానికి సంతోషం; ఒదవన్= కలుగునట్లు; నీకున్= నీకు; భక్తి చేయన్+అ తగున్= భక్తి చూపటమే

యుక్తం; నేనున్= నేను; ఆ తలకున్= అక్కడికి; చని= వెళ్ళి; విఖ్యాతంబుగన్= వెల్లడిఅయ్యేటట్లు; నీదు వినయము= నీ అడకువను; అభివర్ణింతున్= పొగడుతాను.

తాత్పర్యం: ధర్మజా! మీ తండ్రి ధృతరాష్ట్రుడికీ, తాత భీష్ముడికీ, హృదయానందం కలిగేటట్లు భక్తి చూపటమే నీకు ఉచితం. నేనా కురుసభకు వెళ్ళి నీ వినయగుణాన్ని అందరికీ తేటపడేటట్లు లెస్సగా వర్ణిస్తాను.

విశేషం: కురుసభలో ధృతరాష్ట్రుడు మెచ్చుకొంటే సాహసించి రాజ్యంలో సగభాగం ఇవ్వవచ్చును. భీష్ముడు సంతోషిస్తే ధృతరాష్ట్రాదులకు హితవు చెప్పి పాండవులకు న్యాయం జరిగేటట్లు చూడవచ్చును. లేదా యుద్ధమే జరిగితే స్వేచ్ఛామరణశక్తి ఉన్న ఆ పితామహుడు స్వీయ వధోపాయాన్ని పాండవులకు చెప్పవచ్చును. వారి మనసులలో అట్టి సాముఖ్యాన్ని కలిగించాలంటే కురుసభలో శ్రీకృష్ణుడు ధర్మజుడి వినయాది గుణాలను ప్రస్తుతించటం రాజనీతి. ఇది భేదోపాయంలో ఒక భాగం. (సంపా.)

క. చెలులుం జుట్టలు దేశం ।
బులరాజులు వినఁగ నీదు పుణ్యచరిత్రం
బులు నీవు ధర్మమార్గము ।
దలఁచుటయుం దెలియఁబలికెదం గురుసభలోన్. 37

ప్రతిపదార్థం: చెలులున్= మిత్రులూ; చుట్టలున్= బంధువులూ; దేశంబుల రాజులున్= నానా దేశాధిపతులూ; వినఁగన్= వింటూ ఉండగా; నీదు పుణ్య చరిత్రంబులు= నీ పవిత్రమైన నడవడులు; నీవు ధర్మమార్గము తలఁ చుటయున్= నీవు న్యాయ మార్గాన్ని ఎంచుకొన్న తీరూ; కురు సభలోన్= కౌరవుల కొలువులో; తెలియన్+పలికెదన్= స్పష్టంగా వక్కాణిస్తాను.

తాత్పర్యం: మిత్రులూ, బంధువులూ, నానా దేశాల రాజులూ ఆలకించగా నీ పావనమైన ప్రవర్తననూ, నీవు ధర్మమార్గం అవలంబించే తీరూ కౌరవుల సభలో అందరికీ తెలిసేటట్లుగా మాట్లాడుతాను.

విశేషం: కురుసభలో సంధికార్యం ఫలించినా ఫలించకపోయినా సభ్యులైన బంధుమిత్రులైన రాజులందరూ పాండవుల ధర్మనీతి వర్తనాన్ని మెచ్చుకొని, కౌరవులను నిందించి నిరసించేటట్లుచేయటమే ధర్మజ వ్యూహం. దానిని సఫలంగా నిర్వహిస్తానని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. (సంపా.)

వ. దానికి దుర్యోధనుం డియ్యకొనక తెఱంగుమాలిన మాట లాడుటయుఁ దండ్రి యతని వారింప నేరమికిఁదో డుపేక్షకుం డగుటయుఁ జూచి, మీ తొల్లింటిపాట్లునుం దలంచి యెల్లవారును వారిన గర్హింతు; రింతియ కాక మనకు నొండేమి వలయు? నా యోపినంతయుఁ బెక్కు భంగుల సంధియ కావింపఁజూచెద; నవ్విధంబు సిద్ధించిన మేలుగాదె! యట్లుగాకతక్కిన నచ్చోటి యుత్సాహంబు చందంబును, నందుఁ జేయంగలవారి వర్తనంబులుఁ గొలందులు నెఱింగి నీకు విజయంబగు విధంబునం జనుదెంచెద. 38

ప్రతిపదార్థం: దానికిన్= నా పలుకులకు; దుర్యోధనుండు+ఇయ్యకొనక= సుయోధను డంగీకరించక; తెఱంగు మాలిన మాటలు+ఆడుటయున్= న్యాయం తప్పిన పలుకులు పలకటమున్నూ; తండ్రి= జనకుడైన ధృతరాష్ట్రుడు; అతనిన్= దుర్యోధనుడిని; వారింపన్ నేరమికిన్+తోడు= అడ్డగించలేనందుకు తోడుగా; ఉపేక్షకుండు+అగుటయున్= ఉదాసీనుడు కావటమున్నూ; చూచి= కనుగొని; మీ తొల్లింటి పాట్లునున్+తలంచి= మీరు మునుపు పడిన కష్టాలను స్మరించి; ఎల్లవారును= సభలోని వారందరూ; వారిన్+అ= ఆ కౌరవులనే; గర్హింతురు= నిందిస్తారు; ఇంతియకాక= ఇంతకంటెను; మనకున్+ఒండు+ ఏమివలయున్?= మనకు మరేమి కావలెను?; నా+ఓపినంతయున్= నా శక్తి కొలది; పెక్కు భంగులన్= అనేక రీతుల; సంధి+అ కావింపన్+చూచెదన్= సంధి చేయటానికే యత్నిస్తాను; ఆ విధంబు సిద్ధించినన్ మేలు+కాదె!= అట్లా సంధికార్యం నెరవేరితే మంచిదే

కదా! అట్లు కాక తక్కినన్= అట్లా సంధి కార్యం నెర వేరకపోతే; అచ్చోటి+ఉత్సాహంబు చందంబును= ఆ కౌరవుల యొక్క ప్రయత్నాల తీరునూ; అందున్+చేయన్+కలవారి వర్తనంబులున్= అక్కడ యుద్ధం చేయగలవారి యొక్క ప్రవర్తనలనూ; కొలందులున్= వారి వారి శక్తియుక్తుల పరిమాణములనూ; ఎఱింగి= గ్రహించి; నీకున్= నీకు; విజయంబు+అగు విధంబునన్= గెలుపు చేకూరే పద్ధతిలో; చనుదెంచెదన్= మరలివస్తాను.

తాత్పర్యం: నేను సభలో పలికిన పలుకులకు దుర్యోధనుడు సమ్మతించక న్యాయం విడిచి ప్రసంగించటం, ధృతరాష్ట్రుడు అతడి మాటలు తిరస్కరించక పోవటమే కాక తాను ఉదాసీన వైఖరి వహించటం కనులారా చూస్తూ, మీరింతకుముందు అనుభవించిన కష్టాలన్నిటినీ స్మరించి సభలోనివారంతా ఆ కౌరవులనే చీకొడతారు. ఇంతకు మించి మనకు కావలసింది ఏముంది? నా శక్తి కొలది బహు విధాల సంధికే ప్రయత్నిస్తాను. సంధి కుదిరితే మంచిదే. ఒకవేళ కుదరకపోతే ఆ సభలోని వారి ప్రయత్నాలు ఎట్లా ఉన్నవో, యుద్ధం చేయగల అచటివారి ప్రవర్తనలూ, వారి సామర్థ్యాలూ ఏపాటివో గ్రహించి, నీకు విజయం సమకూడేవిధంగా మరలివస్తాను.

విశేషం: ఒక రాయబారివలన సాధించబడే ఉపాయాలన్నీ సాధించగలనని శ్రీకృష్ణుడు మాట ఇచ్చాడు. ధర్మరాజు చెప్పని మరొక విశేషం కూడా పలికాడు. శత్రు బలాబల రహస్యాలు తెలిసి కొనిరావటం రాయబారంలో ఔపచారికాంశం. ధర్మరాజుకు విజయం కలిగేటట్లు తిరిగి రావటం రాజనీతి పరాకాష్ఠ. దానిని కూడా శ్రీకృష్ణుడు సాధిస్తే 'చూచి రమ్మంటే కాల్చిరాగల' ప్రతిభను ప్రదర్శించినట్లవుతుంది. (సంపా.)

తే. ఆ సుయోధను ముక్కున నావి గలుగఁ ।
బుడమి నీ కీఁడు గావునఁ బోర కలుగు,
నేను గయ్యపు శకునంబు లెన్నియేనిఁ ।
గంటి; నీ వనుత్సాహివి గాఁగ వలదు. 39

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి ముక్కులో శ్వాస ఉన్నంతకాలం అతడు నీకు రాజ్యభాగం ఇవ్వడు. యుద్ధం తప్పదు. పోరు జరిగే శకునాలు నేనెన్నో చూచాను. కాబట్టి (ఈ తరుణంలో శాంతి, సంధి - అంటూ) యుద్ధోత్సాహాన్ని మాని(శాంతమూర్తివై) ఉండవద్దు.

విశేషం: 'ముక్కున నావి గలుగ' - చక్కని తెలుగు నుడికారం, 'నీ వనుత్సాహివి గాఁగవలదు' అన్నది శ్రీకృష్ణుడి ఉపన్యాస పరమ తాత్పర్యం. (సంపా.)

వ. చతురంగ బలంబుల నాయితంబు గావించుచు దొరలం బురికొల్పికొనుచు నాలస్యంబులేక సమరంబునకు సన్నాహంబు సేయుచుండవలయునని పలికిన విని వృకోదరుండు దామోదరున కిట్లనియె: 40

ప్రతిపదార్థం: చతురంగబలంబులన్= రథ గజ తురగ పదాతులను; ఆయితంబు+ కావించుచున్= సంసిద్ధం చేస్తూ; దొరలన్= రాజులను; పురికొల్పికొనుచున్= యుద్ధానికి ప్రేరేపిస్తూ; ఆలస్యంబు లేక= జాగుచేయక; సమరంబునకున్= యుద్ధానికి; సన్నాహంబు+ చేయుచున్+ఉండన్+వలయున్= ప్రయత్నాలు చేస్తూ ఉండాలి; అని పల్కినన్= అని శ్రీకృష్ణుడనగా; విని; వృకోదరుండు= భీముడు; దామోదరునకున్= శ్రీకృష్ణునకు; ఇట్లు+అనియెన్= ఇలా చెప్పాడు.

తాత్పర్యం: ధర్మజా! రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాలిబంటులు అనే నాలుగు రకాల సేనా విశేషాన్ని సంసిద్ధం చేసికొని, దొరలను యుద్ధానికి ప్రేరేపిస్తూ ఆలస్యం జరగకుండా కదనానికి సన్నాహాలు సాగించు అని శ్రీకృష్ణు డన్నాడు. ఆ మాటలు విని భీమసేనుడు శ్రీకృష్ణుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. చతురంగ బలాలు= రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతులు అనే సైన్యంలోని నాలుగు అంగాలు.

2. **"సాంగ్రామికం తే యదుపార్జనీయం । సర్వం సమగ్రం కురు తన్నరేంద్ర!' (సం.5-71-36)** అనే మూలశ్లోకానికి ఈ వచనం వివరణం. ఇది భావికథార్థ

సూచన. శ్రీకృష్ణుడు కర్ణుడితో - యుద్ధం రాబోయే అమావాస్య నాడు ప్రారంభమవుతుందని ప్రకటించి రాబోతున్నాడు. అందువలన ఏ క్షణంలోనైనా యుద్ధయాత్ర సాగించే యత్నంలో ఉండాలని శ్రీకృష్ణుడు ధర్మరాజును హెచ్చరించాడు. (సంపా.)

క. 'సమరంబు గలుగు ననుచును।
మము వెఱపింపంగ వలదు మాధవ! నీ వా
కుమతి యగు ధార్తరాష్ట్రుఁడు।
శమించు కార్యంబు నడపు సౌజన్యమునన్.' 41

ప్రతిపదార్థం: మాధవ!= శ్రీకృష్ణా!; నీవు= నీవు; సమరంబు కలుగున్+ అనుచును= యుద్ధం సంభవిస్తుందని పలుకుతూ; మమున్= మమ్మల్ని; వెఱపింపంగన్+వలదు= భయపెట్టవద్దు; ఆ కుమతి+అగు= ఆ చెడుబుద్ధి కల్గిన; ధార్తరాష్ట్రుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు; శమించు కార్యంబు= అణగి మణగి ఉండే పనిని; సౌజన్యమునన్= మంచితనంతో; నడపు(ము)= ప్రవర్తింపజేయుము.

తాత్పర్యం: 'లక్ష్మీవల్లభా! యుద్ధం జరుగుతుందని చెప్పుతూ మమ్మ భయపెట్టవద్దు. దుష్టచిత్తుడైన ఆ దుర్యోధనుడు అణగి మణగిఉండే పనిని సద్భావంతో సాధించుము.'

విశేషం: 1. ఈ పద్యం నాటకీయతకు చక్కని ఉదాహరణం.

2. 'సమరానికి సన్నాహం చేయు'మన్న శ్రీకృష్ణుడి వాక్యానికి భీముడు స్పందించి, 'సమరంబు గలుగు ననుచు మము వెఱపింపవలదు' అని పలకటం నాటకీయం. ఒక రకమైన ప్రయోగాతిశయం.

3. తన అభిప్రాయం ఎవ్వరూ అడుగకుండానే భీముడు సంభాషణ మొదలుపెట్టి తన ఆవేశ స్వభావాన్నీ, అన్నగారి మాటను శ్రీకృష్ణుడు కాదంటున్నాడని భ్రమించి

తొందరపడటంలో ధీరోద్ధతనూ ప్రదర్శించాడు. అయితే అతడు నిష్కల్మషుడు కావటం చేత ఎవరూ అపార్థం చేసికొనరు.

4. భీముడి మాటల వలన అతడు శ్రీకృష్ణుడిని దివ్యుడిగా కంటే, అదివ్యుడైన దూతగానే భావిస్తున్నట్లుగా స్పష్టం. (సంపా.)

వ. అని వెండియు. 42

తాత్పర్యం: అని మళ్ళీ భీమసేనుడు (ఇట్లా అన్నాడు).

శా. 'పాపాత్ముండు మదాంధుఁ డా తులువ నీపంపెట్లునుం జేయఁగా
నోపం; డడ్డము సెప్ప రెవ్వరును; మానోద్రేకమున్ గర్వముం
గోపంబుం దనుఁ ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పోనిత్తురు; గాన ని న్నతఁడు జాలింబెట్టెడుం జూడుమీ! 43

ప్రతిపదార్థం: ఆ తులువ= ఆ కుత్సితుడైన దుర్యోధనుడు; పాప+ఆత్ముండు= దురితచిత్తుడు; మద+అంధుఁడు= మదముచేత కన్నుగాననివాడు; నీ పంపు= నీ ఆజ్ఞ; ఎట్లునున్= ఏ విధంగానూ; చేయఁగాన్+ఓపండు= చేయలేడు; ఎవ్వరును= ఏ ఒక్కరైనను; అడ్డము చెప్పరు= అతడిని ఎదిరించి మాట్లాడరు; మాన+ఉద్రేకమున్= అహంకారము యొక్క ఆటోపమునూ; గర్వమున్= పొగరుబోతుతనమునూ; కోపంబున్= క్రోధమునూ; తనున్+త్రిప్పన్= తనను ఆడిస్తుండగా; ఆప్తజనులన్= ఆత్మీయులైనవారిని; కుందించుటన్= దుఃఖపెట్టటం చేత; పోయినట్లే పోనిత్తురు= అతడు వెళ్ళే దారినే చూస్తూ ఊరకుంటారు; కాన= కాబట్టి; నిన్నున్= నిన్ను; అతఁడు= ఆ దుర్యోధనుడు; జాలిన్+పెట్టెడున్= చింతల పాలు చేయగలడు; చూడుమీ= గ్రహింపుమా! (చూస్తూ ఉండుము)

తాత్పర్యం: 'మాధవా! ఆ దుర్యోధనుడు కలుషాత్ముడు. మదంచేత కన్ను మిన్ను కాననివాడు. కుత్సితుడు. నీ ఆదేశం మన్నించడు. ఒక్కరైనను అతడి

మాటకు అడ్డు చెప్పలేరు. అహంకారం, గర్వం, కోపం తనను పట్టి ఆడిస్తుండగా ఆప్తులను సైతం అతడు దుఃఖపెట్టుతున్నాడు. అత డేమైపోయినా తమకేమి లెమ్మని అందరూ మిన్నకుండటం చేత ని న్నతడు సంకటపరుస్తాడు సుమా!

విశేషం: హస్తినాపురాన్ని తలచుకొంటే భీముడికి పాపాత్ముడైన దుర్యోధనుడే జ్ఞాపకం వస్తాడు. అతడు చేసిన అపకారాలు గుర్తుకు వస్తాయి. కోపోద్రేకం కలుగుతుంది. ఆవేశంలో అతడిని నిందిస్తాడు. ఇది భీమ స్వభావం. ఆ సహజ స్వభావానికి ఈ పద్యం అద్దం పట్టుతున్నది. దుర్యోధనుడు పాపాత్ముడనీ, మదాంధుడనీ, తులువ అనీ, నోరారా తిట్టితేతప్ప అతడికి తృప్తి ఉండదు. అతడిలో దురహంకారం, గర్వం, కోపం అనే దుష్ట గుణాలు ఉంటాయనీ, వాటి వలన పరులను, ఆత్మీయులను బాధపెట్టుతాడనీ, పెద్దల మాటలు వినడనీ, భీముడిని తిప్పలు పెట్టుతాడనీ పేర్కొంటాడు. శత్రువైన దుర్యోధనుడిని గురించి భీముడికి ఎంత స్పష్టమైన అవగాహన ఉన్నదో ఈ పద్యం స్పష్టం చేస్తున్నది. (సంపా.)

ఉ. చొచ్చిన చోన చొచ్చి తెగఁ జూచెద నంచుఁ గడంగుచుండు; న
న్మెచ్చఁడు బాహుగర్వమున; నీచు సుయోధనుఁ; డట్టివానితోఁ
బొచ్చెములేక కూడి మనఁ బోవక పోవఁగరాదు నాకు వి
వ్వచ్చుఁడు రాచవారుఁ గురువంశము చేటున కోపకుండుటన్. 44

ప్రతిపదార్థం: నీచు సుయోధనుఁడు= తుచ్ఛుడైన దుర్యోధనుడు; చొచ్చిన చోన్+అ= నేను ప్రవేశించినచోటనే; చొచ్చి= తానూ ప్రవేశించి; తెగన్+ చూచెదన్+అంచున్= నన్ను చంపుతా నంటూ; కడంగుచున్+ఉండున్= పూనిక వహిస్తూ ఉంటాడు; బాహు గర్వమునన్= భుజవిక్రమంలో; నన్+మెచ్చఁడు= నన్ను లెక్కించడు; వివ్వచ్చుఁడు= బీభత్సుడు (అర్జునుడు); రాచవారున్= ప్రభువైన ధర్మరాజు; కురువంశము చేటునకున్= కురువంశముయొక్క వినాశానికి; ఓపక+ఉండుటన్= సహింపకుండటంచేత; అట్టి వానితోన్= అటువంటి (అల్పుడైన) దుర్యోధనుడితో; నాకున్= నాకు; పొచ్చెములేక= కపటంలేక; కూడి= కలసి; మనన్+ పోవక= జీవించనెంచక; పోవఁగన్+రాదు= తప్పు కొనటానికి వీలులేకుండా ఉన్నది.

తాత్పర్యం: నేను ప్రవేశించిన చోట తానూ ప్రవేశిస్తూ నన్ను చంపటానికి యత్నిస్తుంటాడు. భుజ విక్రమంలో నన్ను లెక్కించడు. ఆతడు వట్టి తుచ్ఛుడు. ఫల్గునుడూ, ప్రభువైన ధర్మజుడూ కురువంశ వినాశానికి సమ్మతించ కుండటం వలన ఆ దుర్యోధనుడితో నిష్కపటంగా కలసి మెలసి జీవించడం నాకు తప్పేటట్లు లేదు.

విశేషం: భీముడి ఆత్మాభిమానమే కాక, అమాయకత్వం కూడా బైటపడుతున్నది. (సంపా.)

ఉ. పాండవ కౌరవుల్ గలసి పాలును నీరును బోలె నెమ్మిమై
నుండఁగ దుష్టచేష్టల సుయోధనుఁ డింతలు సేసె; నాతఁ డొ
క్కండ కులక్షయంబునకుఁ గారణమం; డ్రది దప్పు; డైన నీ
వొం డన నేల యా బిరుదు నోపిన యంతయుఁ దీర్పు నేర్పునన్.45

ప్రతిపదార్థం: పాండవ కౌరవుల్= పాండవులూ, కౌరవులూ; పాలును నీరును+పోలెన్= పాలూ నీరూ వలె; కలసి= (విడదీయటానికి వీలు లేనట్లుగా) కలిసిపోయి; నెమ్మిమైన్= ప్రేమతో; ఉండఁగన్= జీవిస్తూ ఉండగా; దుష్టచేష్టలన్= దుండగపు పనులతో; సుయోధనుఁడు; ఇంతలు+చేసెన్= ఇట్టి దుర్ణయాలు కావించాడు; ఆతఁడు+ఒక్కఁడు+అ= అతడొక్కడే; కులక్షయంబునకున్= వంశ వినాశనానికి; కారణము+అండ్రు= హేతువని పెద్దలు చెప్పుతారు; అది+తప్పదు= ఆ మాట వృథా కాదు; అయినన్= అయినప్పటికినీ; నీవు; ఒండు+అనన్+ఏల?= నీవు వేరొక మాట పలుకుటెందుకు?; ఆ బిరుదున్= ఆ శూరుని; ఓపిన+అంతయున్= శక్తిఉన్నంత వరకూ; నేర్పునన్= చాతుర్యంతో; తీర్పు(ము)= చక్కబఱచుము.

తాత్పర్యం: పాండవులూ, కౌరవులూ పాలూ నీరూవలె కలసి మెలసి ప్రేమతో జీవిస్తుండగా దుర్యోధనుడు తన దుండగపు పనులతో ఒద్దిక చెరచివేశాడు. అతడే ఈ కురువంశ వినాశానికి కారణమని పెద్దల మాట ఆ మాట ఎన్నటికినీ తప్పదు. ఐనప్పటికీ నీవు నేర్పుతో శక్తి కలిగినమేరకు ఆ జగజెట్టిని దారిలో పెట్టజూడుము.

విశేషం: 1. అలం: ఉపమ, క్రమం. పాండవులూ కౌరవులూ పాలూ, నీరూ వంటివారు. ఉపమాన ఉపమేయాలను ఆ వరుసలోనే గ్రహించాలి. కాబట్టి క్రమాలంకారం. పాండవులు పాలవంటివారు. కౌరవులు నీళ్ళవంటివారు. అంటే నీళ్ళకంటె పాలు చిక్కన. కౌరవులకంటె పాండవులు బలవంతులు అని ధ్వని. ఇందులో మరొక విశేషం కూడా ఆలోచిస్తే స్ఫురిస్తుంది. పాలతో కలిసి ఉంటేనే నీటికి గౌరవం. నీళ్ళతో పాలు కలిపిస్తే పాలకు విలువ లేదు. పాలూ నీరూ కలిసి ఉన్నప్పుడు వాటిని వేరు చేసేది హంస. కాని, దుర్యోధనుడు హంస కాదు. కాకి. అతడు చేసింది నీరక్షీర వివేకం కాదు. కలిసి వున్న పాలనూ నీళ్ళనూ కలుషితం చేశాడు. కలిసి ఉన్న గుణం కలిగించేది కులవృద్ధి. దానిని పాడు చేయటం కులక్షయం. పాడైపోయిన పాలు ఏ ప్రయోజనాన్నీ పొందలేవు. ఈ తాత్పర్యం మరొక వ్యంగ్యార్థం.

2. ఈ మాటలంటున్న భీముడు ధర్మరాజుతమ్ము డనిపించుకొన్నాడు. అయితే ధర్మజుడు తన భావాన్ని గూఢంగా నిపుణంగా చెప్పగలడు. భీముడు బయటపడి ఘాటుగా చెప్పగలడు. ధర్మరాజుకూ సంధిమీద నమ్మకం లేదు. అయినా అంతకంటె మించిన రాజనీతి ప్రయోజనాల కొరకు, భేదోపాయాన్ని ప్రయోగించటం కొరకు శ్రీకృష్ణుడిని రాయబారిగా పంపుతున్నాడు. ఆ సంగతి అందరికీ తెలిసేటట్లు చెప్పాడు. కాని, భీముడికి ఆ వ్యూహరహస్యాలు తెలియవు. దుర్యోధనుడిని కులక్షయ కారకుడిగా నిరూపించటానికే శ్రీకృష్ణుడి రాయబారం పనికి వస్తుందని భావించాడు. భావాభివ్యక్తితో ఈ రెండు పాత్రల తారతమ్యం పరమ రమణీయం.

3. భీముడికి దుర్యోధనుడు ఆగర్భశత్రువు. ఆ దుర్మార్గుడు భీముడిని చంపటానికి చేసిన కుతంత్రాలు ఇన్నీ అన్నీ కావు. భీముడు లేకపోతే పాండవులు లేనట్లే అని సుయోధనుడి అంచనా. అతడంటే భీముడికి అమితకోపం. దుర్యోధనుడు పుట్టినప్పుడే అతడు కులక్షయకారకుడని ఆకాశవాణి పలికింది. ఆ తరువాత వ్యాసమహర్షి చెప్పాడు. అయినా, ధృతరాష్ట్రుడు వాటిని పట్టించుకొనలేదు. దుర్యోధనుడి దుష్టచేష్టలన్నీ క్రమంగా కులక్షయానికే దారితీస్తున్నాయి. సంధి యత్నం సాగుతుందనే నమ్మకం భీముడికీ లేదు. అయినా, శ్రీకృష్ణుడు రాయబారం చేయవలసిందే, ధర్మజుడి ఆనతి పాటించవలసిందే- అని భీముడి అభిప్రాయం.

4. ఈ పద్యంలో 'దుష్టచేష్టలు', 'ఇంతలు సేసె' 'అది తప్పదు', 'నీవు ఒండన నేల?', 'ఆ బిరుదు' అనే పదాలు తెలుగు పలుకుబడిని పుక్కిటబట్టాయి. అంత, ఇంత, ఎంత అనే అవ్యయాలకు తెలుగులో ఎంతటి శక్తి ఉన్నదో అంతటిశక్తి 'ఇంతలు సేసె' అనే వాక్యంలో ఉన్నది. జరిగిన కథంతా అందులో ధ్వనిస్తుంది. శబ్దప్రయోగౌచిత్యానికి ఇవి ప్రమాణాలు.

5. తిక్కన నాటకీయతలో పాత్రోచిత సంభాషణ ఒక ప్రత్యేకత. భీముడు లౌకిక వాది. అతడికి భుక్తియందున్న ఆసక్తి భక్తియందు లేదు. అందుకే 'పాలు నీరు' ఉపమానం తీసికొన్నాడు. పరమాత్ముడైన హరిని రాయబారిగానే మన్నిస్తాడు. అతడిలోని దివ్యత్వం ఇతడికి కనపడదు. భీమపాత్రోచితమైన సంభాషణ ఇది. ఇట్లాగే ఈ సన్నివేశంలో ధర్మజ, అర్జున, నకుల, సహదేవులూ, ద్రౌపదీ, శ్రీకృష్ణుడూ, చేసే సంభాషణలలో వారి వారి సంస్కారాలు గుబాళిస్తుంటాయి. ఇటువంటి రచన రసధ్వనిలోని ఒక మెళకువ; నాటకీయ రచనాశిల్పంలోని ఒక రహస్యం. (సంపా.)

6. ఈ సందర్భంలో భీముడు కులక్షయ కారకులైన అసురవంశ రాజులను పదునెనిమిది మందిని పేర్కొన్నట్లు మూలంలో ఉన్నది. వారు- 1. హైహయవంశజుడైన ముదావర్తుడు 2. నీప కులానికి చెందిన జనమేజయుడు 3. తాలజంఘ వంశజుడైన బహుళుడు 4. క్రిమి కులోద్భవుడు వసువు

5. సువీరవంశజుడు అజబిందువు 6. సురాష్ట్ర కులజుడు రుపర్ధికుడు 7. బలీహ వంశజుడు అర్కజుడు 8. చీనీయ వంశం వాడైన ధౌతమూలకుడు 9. విదేహ వంశీయుడైన హయగ్రీవుడు 10. మహౌజ క్షత్రియ వంశజుడు పరాయువు 11. సుందరవంశీయుడు బాహువు 12. దీప్తాక్షకులజుడైన పురూరవుడు 13. చేది మత్స్య వంశీయులలోని సహజుడు 14. ప్రవీర వంశంలోని వృషధ్వజుడు 15. చంద్రవత్స కులజుడు ధారణుడు 16. ముకుట వంశీయుడు విగాహనుడు 17. నందివేగ కులోద్భవుడు శముడు 18. చంద్ర వంశజుడైన దుర్యోధనుడు. (వివరాలకు చూడు: సం. 5-72-11 నుండి 18).

చ. తన పారిపోవునంతకు నుదగ్రతయుం గపటంబు మాన నే
ర్చునె ధృతరాష్ట్ర సూనుఁడు? యశోభరితంబగు భారతాన్వయం
బున కొక నిందవచ్చు ననుబుద్ధి దురాత్మున కేలకల్గు? నా
యనమెయిఁబోయి హీనగతినైన ఘటించిన నెంత యొప్పునో! 46

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రసూనుఁడు= ధృతరాష్ట్రుడి కొడుకైన దుర్యోధనుడు; తన పారిపోవునంతకున్= తాను చచ్చేవరకూ; ఉదగ్రతయున్= క్రౌర్యమునూ; కపటమున్= మోసమునూ; మానన్+నేర్చునె?= విడువగలడా?; యశోభరితంబు+అగు= కీర్తితో నిండిన; భారత+అన్వయంబునకున్= భరతుడు జన్మించిన వంశానికి; ఒక నింద వచ్చున్= అపకీర్తి కల్గుతుంది; అను బుద్ధి= అనే తలంపు; దుర్+ఆత్మునకున్= దుష్టహృదయుడైన ఆ దుర్యోధనుడికి; ఏల+కల్గున్?= ఎందుకు జనిస్తుంది?; ఆయన మెయిన్+పోయి= అతడి తలంపు ననుసరించి; హీనగతిన్+ఐనన్= నీచస్థితితో నైనను; ఘటించినన్= సంధి కుదుర్చుకొంటే; ఎంత+ఒప్పునో!= ఎంత బాగుంటుందో కదా!

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు తాను చచ్చేవరకూ తన క్రౌర్యాన్నీ, మోసమునూ విడిచిపెట్టడు. కీర్తిమంతమైన భరతవంశం అపకీర్తి పాలవుతుందే అనేతలంపు ఆ దుష్టచిత్తుడికి కలుగనే కలుగదు. ఆ సుయోధనుడి మనోవైఖరి ననుసరించి నీచత్వానికి దిగజారిఅయినా మనం సంధి కావించుకొంటే అదెంతో మేలుగా ఉంటుంది.

విశేషం: 1. 'ఆయన మెయిన్+పోయి'= మా అన్న ధర్మజుడి తలంపు ననుసరించి - అనిన్నీ, నాయన మెయిన్+పోయి= తండ్రి అయిన ధృతరాష్ట్రుడి తలంపు ననుసరించి - అనిన్నీ అన్వయం చెప్పటానికి వీలుంది.

2. విరాటోద్యోగ పర్వాలలో భీముడు తన సహజమైన ఔద్ధత్యాన్ని తగ్గించుకొని ఉదాత్తుడి వలె వ్యవహరించాడు. ఈ పద్యం అట్టి ప్రవృత్తికి చక్కని ఉదాహరణం. ఇది భీముడికి అలంకారం కాదనీ, కార్యసాధకం కాదనీ శ్రీకృష్ణుడు భావించి అతడిని యుద్ధోత్సాహ పూరితుడినీ, ఉద్ధతుడినీ చేయాలని యత్నిస్తాడు. (సంపా.)

వ. అని పలికి, మాకును వారికిఁ బితామహుండగు భీష్ముండు వినుచుండ సుయోధనుతోడం గురుకులేశ్వరు నాస్థానంబున నా వచనంబులుగా నిట్లనుము. 47

ప్రతిపదార్థం: అని, పలికి; మాకును, వారికిన్= (పాండవులకూ, కౌరవులకూ); పితామహుండు+అగు= తండ్రియొక్క తండ్రి (తాత); అయిన; భీష్ముండు; వినుచున్+ఉండన్= వింటూ ఉండగా; కురుకుల+ఈశ్వరు+ఆస్థానంబునన్= ధృతరాష్ట్రుడి నిండు కొలువులో; సుయోధను తోడన్= దుర్యోధనుడితో; నా వచనంబులుగాన్; నా మాటలుగా; ఇట్లు+అనుము= ఇట్లా చెప్పుము.

తాత్పర్యం: కృష్ణా! మాకూ, కౌరవులకూ తాతఅయిన భీష్ముడు వింటుండగా ధృతరాష్ట్ర మహారాజు కొలువులో నా మాటలుగా సుయోధనుడితో ఇట్లా చెప్పుము.

తే. అన్నదమ్ములమై యుండి యకట! మనల।
నొరులు దలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగ నేటికి? నీ నేల పెద్దవారి।
బుద్ధి విని పంచి కుడుచుట పోల దొక్కొ? 48

ప్రతిపదార్థం: అకట!= అయ్యో!; అన్నదమ్ములము+ఐ+ఉండి= సోదరులమై జన్మించికూడా; మనలన్= మనలను; ఒరులు= ఇతరులు; తల+ఎత్తి+ చూడన్= ఆశ్చర్యంతో కనుగొనగా; ఒండొరుల తోడన్= ఒకరితో మరొక్కరు; పెనఁగన్+ఏటికిన్?= పోట్లాడుకొనటమెందుకు?; ఈ నేలన్= ఈ భూమిని; పెద్దవారి బుద్ధి విని= పెద్దలు చెప్పిన నీతులు ఆలకించి; పంచికుడుచుట= పంచుకొని అనుభవించటం; పోలదు+ ఒక్కొ!= యుక్తము కాదా!

తాత్పర్యం: మనం అన్నదమ్ములమై ఉండి కూడ లోకులు తలయెత్తి చూచి పరిహసించగా మనలో మనం ఒకరితో నొకరు పోట్లాడుకొనటం మంచిది కాదు. హస్తినాపుర సామ్రాజ్యాన్ని పెద్దల మాట ప్రకారం పంచుకొని హాయిగా అనుభవించటం ఎంతో మేలుగదా!

క. అని యెవ్విధమున నైనను ।
వనజోదర! సంధి సేయవలయుం దగ నే
ముసు వారును గలయుట భూ ।
జనులకునెల్లను హితంబు సౌఖ్యకరంబున్.’ 49

ప్రతిపదార్థం: అని= అనుచు; వనజ+ఉదర!= పద్మనాభా!; ఏ విధమునన్+ ఐనను= ఏ రీతిగానైనా; సంధిచేయన్+వలయున్= సంధి సమకూరేటట్లు చేయవలసింది; తగన్= చక్కగా; ఏమును వారును కలయుట= మేమూ, కౌరవులూ ఒకటిగా చేరటం; భూజనులకున్+ఎల్లన్= పుడమిలోని ప్రజలందరికీ; హితంబు= మేలు; సౌఖ్యకరంబున్= సుఖాన్ని కలుగజేస్తుంది.

తాత్పర్యం: పద్మనాభా! నా మాటలుగా కురుసభలో అట్లా చెప్పి, ఎట్లాగైనా సంధి పొసగేటట్లు ప్రయత్నించుము. వారూ మేము కలసిమెలసి వర్తించటం పుడమిజనులకు ఎంతో మేలు. సుఖకరంగానూ ఉంటుంది.’

చ. అనుటయుఁ బిన్ననవ్వు నగి యంబుజనాభుఁడు వల్కు ‘నెన్నఁడున్
విననివి భీముపాలఁ గడు వింతలు వింటిమి మాట; లగ్గి చ

ల్లనగుట భూరిభూధరము లాఘవ మొందుటఁ గాదె యివ్విధం
బున నితఁ డిప్డు మార్దవముఁ బొందుట; యింకిటఁ జెప్ప నేటికిన్? 50

ప్రతిపదార్థం: అనుటయున్= భీమసేను డట్లా వచించగా; అంబుజనాభుఁ డు= కమలం నాభియందుగలవాడు- శ్రీకృష్ణుడు; పిన్న నవ్వు నగి= చిన్నగానవ్వి; పల్కున్= ఇట్లా మాట్లాడాడు. ఎన్నడున్= ఎప్పుడునూ; విననివి= మేము ఆలకించనట్టివి; భీము పాలన్= భీమసేనుడి దగ్గర; కడున్ వింతలు మాటలు వింటిమి= మిక్కిలి వింత (విస్మయం) కలిగించే పలుకులు విన్నాము; ఈ+విధంబునన్= ఇట్లా; ఇతఁడు= భీముడు; ఇప్డు= ఈ సమయంలో; మార్దవము పొందుట= మృదుత్వం వహించటం అన్నది; అగ్గి చల్లన+అగుట= నిప్పు చల్లబడటం; భూరిభూధరము= గొప్ప పర్వతం; లాఘవము+ ఒందుట కాదె= తక్కువతనం పొందటమే అవుతుంది; ఇంకన్+ఇటన్+చెప్పన్+ ఏటికిన్?= మరిఇక్కడ పలుకవలసిన దేమున్నది?

తాత్పర్యం: భీమసేనుడి మాటలకు పద్మనాభుడు చిరునవ్వు నవ్వి ఇట్లా అన్నాడు: మునుపెన్నడు విననట్టి మాటలు ఇపుడు భీముడి నోటినుండి విన్నాను. మఱి చెప్పవలసిన దేముంది? ఈ విధంగా వృకోదరుడు ఇపుడు మెత్తబడటం చూడగా అగ్ని చల్లదనం పొందినట్లుగా, గొప్ప పర్వతం తేలిక అయిన చందంగా ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

1. శ్రీకృష్ణుడు భీముడి మాటలను విని చిరునవ్వు నవ్వాడు. వికృతి వలన హాసం పుట్టుతుంది. భీముడు సహజంగా ఉద్ధతుడు, కాని, ఉదాత్తుడివలె మాట్లాడుతున్నాడు. దుర్యోధన స్మరణ మాత్రం చేతనే కోపోద్రేకంతో ఉగ్రరూపం తాల్చి, అతడిని అంతం చేయటమే తనకు సంతోషదాయకమని భావించే భీముడు అతడిపై అన్నదమ్ముల ప్రేమను, ఐక్యభావాన్ని ఒలకబోస్తూ అతడితో కలిసి జీవించటం కర్తవ్యమంటున్నాడు. శ్రీకృష్ణుడిని ఏ విధంగానైనా సరే అతడిని ఒప్పించి సంధి చేయుమని అడుగుతున్నాడు. ఇది భీముడిలోని స్వభావ విశ్రుతి. దీనిని అలంకారంతో ధ్వనింపచేయటం రచనా శిల్పం.

2. వికృతి వలన ఆశ్చర్యం కలిగిందని వాచికాభినయంతో శ్రీకృష్ణుడి పాత్ర మాటల వలన ధ్వనింపజేసింది. 'ఎన్నడున్ విననివి', 'కడువింతలు' అనే మాటలు తెలుగుదనం మూటకట్టినట్లున్నాయి. మూలంలో- "ఏత చ్ఛ్రుత్వా మహాబాహుః కేశవః ప్రహసన్నివ- అభూతపూర్వం భీమస్య మార్గవోపహితం వచః" (సం. 5-73-1) అని ఉన్నది. శ్రీకృష్ణుడు మూలంలో పెద్దగా నవ్వాడు. తెలుగులో చిరునవ్వు నవ్వాడు. ప్రహసనం చేస్తే భీముడు నొచ్చుకొంటాడనీ, కోపిస్తాడనీ తెలుగులో తిక్కన భావించి ఈ మార్పు చేసి ఉండవచ్చును. 'అభూతపూర్వం' అనే మాటకు తెలుగులో చక్కని వ్యాఖ్యానమిచ్చాడు తిక్కన.

3. భీముడు మెత్తబడటం అగ్గి చల్లబడినట్లూ, మహాపర్వతం తేలిక పడ్డట్లూ ఉన్నదట! భీముడు శాంతి సూక్తం పలకటం శత్రువులను దహించే అతడి క్రోధభావం శాంతించినట్లున్నదని భావం. శత్రువులకు తలవంచని సమున్నత ఆత్మాభిమానం వదలి బంధుత్వాన్ని భావించి కలసి ఉండాలని తలంచటం పర్వతం తేలికపడటం వంటిది. ఈ రెండంశాలూ భీముడి స్వభావానికి విరుద్ధమైనవి. అయినా, ధర్మరాజుమీది భక్తిగౌరవాలచేత భీముడు మెత్తపడ్డాడు. ఇది వింతగా ఉన్నదని శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు.

4. 'ఇం కిటఁ జెప్ప నేటికిన్?' అనే వాక్యం ఆశ్చర్య భావముద్రను వ్యక్తం చేస్తున్నది. భీముడిని ఆ విధంగా నేను చూడలేను. అతడు సహజస్వభావంతో ఉంటేనే బాగుంటుందని సూచన అందులో వినబడుతుంది. పఠితలు ఆ వాక్యంతో తాదాత్మ్యం పొందుతారు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోడి యుద్ధమునకుఁ బురికొల్పుట (సం. 5-73-1)

తే. అని సహోదరు లాజి నాయాసపడుట ।
కోర్వమియుఁ గౌరవులఁ జంప నొల్లమియును,
గలుగు నెయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రుఁ ।
డైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి. 51

ప్రతిపదార్థం: అని= అలా వచించి; ఆజిన్= యుద్ధంలో; సహోదరులు= తోబుట్టువులు; ఆయాసపడుటకున్= శ్రమ చెందటానికి; ఓర్వమియున్= సహించలేకుండుటయున్నూ; కౌరవులన్= దుర్యోధనాదులను; చంపన్+ ఒల్లమియున్= చంపుటకు ఇష్టపడ కుండటమున్నూ; కలుగు నెయ్యంబు పెంపునన్= మనసులో కలిగే ప్రేమాధిక్యం చేతనున్నూ; కరుణన్= దయారసముచేత; ఆర్ద్రుఁడు+ఐన= కరగిపోయిన; పవనజున్= వాయు పుత్రుడైన భీముడిని; పురికొల్పన్= రెచ్చగొట్టటానికై; ఆత్మన్+తలఁచి= మనసులో సంకల్పించి. (తరువాతి వచనంతో అన్వయం).

తాత్పర్యం: తన తోబుట్టువులు యుద్ధంలో కష్టపడటానికి సహించలేనందుననూ, కౌరవులను సంహరించటానికి ఇష్టపడనందుననూ, కలిగిన స్నేహాధిక్యం చేతనున్నూ పొంగిన కరుణచేత వాయునందనుడు కరగిపోయాడు. అతడిని యుద్ధానికి రెచ్చగొట్టవలెనని మనసులో సంకల్పించి.

విశేషం: భీముడు ఎందుకు, ఎట్లా మెత్తబడ్డాడో చెప్పి, అతడి మానసిక స్థితిని వ్యాఖ్యానించే చక్కని పద్యం ఇది. సహోదరులు యుద్ధం చేయటం వలన పొందే శ్రమను భావించి, వారి కా శ్రమ లేకుండా చేద్దామనే స్నేహాతిశయం మొదటి కారణమట! కౌరవులను చంపటం వలన వంశనాశన మవుతుందనే కరుణాభావం రెండవ కారణమట! క్రోధభావం స్నేహభావం వలన మెత్తబడుతుంది. కరుణ వలన ఆర్ద్రమవుతుంది. ఈ క్రమాన్ని భావించిన శ్రీకృష్ణుడు ఇంగితజ్ఞుడు, రసజ్ఞుడు. ఇప్పుడు స్నేహ, కరుణ భావాలకు విరుగుడు పెట్టి ఆర్ద్రత నుండి ఆగ్రహాన్ని ప్రజ్వలింపచేసి, యుద్ధానికి భీముడిని పురికొల్పటం శ్రీకృష్ణుడి సంకల్పం. రాబోయే పద్యంలో ఈ పరిణామ క్రమం గోచరిస్తుంది. (సంపా.)

వ. మురమర్దనుం డతనితో నిట్లనియె : 52

ప్రతిపదార్థం: మురమర్దనుండు= మురాసురుని సంహరించినవాడు, శ్రీకృష్ణుడు; అతనితోన్= భీమునితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు భీముడితో ఇట్లా అన్నాడు.

ఉ. 'యుద్ధము మీఁది వేడ్కయు మహోగ్ర విరోధుల నల్కఁజేయు ద
ర్పోద్ధతియున్ సుయోధనుని యున్నతి సైఁపని యేపు రాజ్యసం
సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం
బద్ధములైన వాక్యములు వల్కుట యొప్పునె కీచకాంతకా!' 53

ప్రతిపదార్థం: కీచక+అంతకా!= కీచకుడినీ, ఉపకీచకులనూ మట్టుపెట్టిన వాయుపుత్రా!; యుద్ధము మీఁది వేడ్కయున్= సంగ్రామం సల్పుటలోని అభిలాష; మహా+ ఉగ్ర విరోధులన్= మిక్కిలి భయంకరులైన శాత్రవులను; అల్కన్+చేయు= భయపెట్టే; దర్ప+ ఉద్ధతియున్= గర్వాటోపమునూ; సుయోధనుని+ఉన్నతిన్= దుర్యోధనుడి గొప్పతనమును; సైఁపని+ఏపున్= సహించనట్టి విజృంభణమునూ; రాజ్యసంసిద్ధిన్= రాజ్యలాభమును; నిజ+అగ్రజన్మునకున్= నీ అన్నఅయిన ధర్మపుత్రుడికి; చేయుతలంపును= కలిగించే ఉద్దేశమునూ; కల్గు నీవు= ఉన్నట్టి నీవు; అసంబద్ధములు+ఐన= పొందికలేని వైన; వాక్యములు= పలుకులు; పల్కుట+ఒప్పునె?= చెప్పుట తగునా? (తగదని భావం.)

తాత్పర్యం: కీచకుడి రూపుమాపిన భీమసేనా! సంగ్రామం సల్పటంలో కుతూహలమూ, పరమ దారుణ శాత్రవులను గడగడ వణకించే శౌర్యాటోపమూ, దుర్యోధనుడి గొప్పతనము సహించని ఔద్ధత్యమూ, అన్నఅయిన ధర్మజుడికి రాజ్యప్రాప్తి కలిగించే సంకల్పమూ కలిగిన నీవు ఇపుడు పొంతన లేని మాటలు మాట్లాడటం తగదుసుమా!'

విశేషం: 1. ఈ పద్య ప్రాణం 'నీ వసంబద్ధములైన వాక్యములు పల్కుట యొప్పునె?' అనే వాక్యం. అసంబద్ధాలు అంటే పొందిక లేనివనీ, సందర్భానికి తగినవి కానివనీ, అనరాని మాటలనీ, వ్యర్థపదాలనీ అర్థాలున్నాయి. ఆ నాలుగర్థాలూ సార్థకమయ్యేటట్లు శ్రీ కృష్ణుడు వ్యాఖ్యానించటం విశేషం.

2. ఇందులో భీముడి సహజ లక్షణాలు నాలుగు చెప్పబడ్డాయి. 1.యుద్ధం మీద ఎప్పుడూ ఉండే ప్రీతి. 2.భయంకర శత్రువులను సైతం లెక్క చేయని గర్వోన్నతి. 3.దుర్యోధనుడి ఆధిక్యాన్ని సహించని ఉద్ధతి. 4.ధర్మరాజుకు రాజ్యం కట్టబెట్టాలన్న సంకల్పం. యుద్ధప్రీతి కలవాడు 43, 50, 51 పద్యాలు మాట్లాడడు. శత్రుభావం కౌరవులపట్ల ఉన్న భీముడు 45, 46, 47 పద్యాలు పలకడు. దుర్యోధనుడి మీది పగగల భీముడు 48 పద్యం చెప్పడు. కాని, ఇప్పుడు అన్నాడంటే భీమ స్వభావం తెలిసినవారికి అవి పొందిక లేని మాటలుగా తోస్తాయి.

3. యుద్ధం చేసి శత్రువర్గాన్ని చంపి విజయాన్ని సాధించవలసిన ఆ తరుణంలో భీముడు అనదగిన మాటలు కావు ఇవి. నిజానికి భీముడి మాటలు కార్యరూపం తాల్చేవి కావు కాబట్టి వ్యర్థమైనవని కూడా తోచవచ్చును. అందువలన అసంబద్ధ శబ్దం సార్థకం.

4. ఆర్ద్ర హృదయం యుద్ధోత్సాహంతో కరడు కట్టుతుంది. శత్రువుల ధిక్కార స్మరణం వలన ఆగ్రహంగా మారుతుంది. సోదరుడైనా తనను చంపజూచిన దుర్యోధనుడి స్మరణ చేత స్నేహం పగగా మారుతుంది. చివరకు 'కీచకాంతకా!' అనే పిలుపుతో ద్రౌపదికి కౌరవులు చేసిన అవమానం జ్ఞాపకం వచ్చి అతడిని చంపినట్లే చంపాలనే క్రోధోద్రేకం పొంగులువారుతుంది. అంటే ఈ పద్యం భీముడిని అతడి సహజ స్వభావంతో వెలుగొందటానికి చేసిన వాఙ్మయ ప్రేరణ మన్నమాట. ఇది రసధ్వని. (సంపా.)

వ. అని యంత నిలువక. 54

తాత్పర్యం: అని అంతటితో ఆగక.

క. 'వెఱ పెట్టిదియో యెన్నఁడు।
నెఱుఁగని నీ యట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడ।
గఱపినవా' రనుచు శౌరి గలకల నవ్వెన్. 55

ప్రతిపదార్థం: వెఱపు+ఎట్టిదియో= భయమంటే ఎటువంటిదో; ఎన్నఁడున్= ఏనాడును; ఎఱుఁగని= తెలియని; నీ+అట్టివానికిన్= నీవంటి బలశాలికి; ఈ పిఱికితనము; ఇంత+అలవడన్= ఇంతగా అభ్యాసమయేట్లు; కఱపినవారు= బోధించినవారు; ఎవ్వరు+ఒకో= ఎవరో కదా!; అనుచున్= అంటూ; శౌరి= శ్రీకృష్ణుడు; కలకల నవ్వెన్= పకపకమని నవ్వాడు.

తాత్పర్యం: 'భయమంటే ఏమిటో ఎప్పుడూ తెలియని నీవంటి ధీరుడికి ఈ పిరికితనం ఇంతగా అలవాటయ్యేటట్లు చేసినవారు ఎవరో?' అని హరి పకపక నవ్వాడు.

విశేషం: భయ మెరుగని భీముడికి పిరికితనం నూరిపోసిం దెవ్వరు? -అని ప్రశ్న వేయటం ఒక ఎత్తు, కలకలనవ్వటం మరొకయెత్తు. భీముడి వాక్యాలు అనునయవాక్యాలే కాని భయపడినవాడి మాటలు కావు. కాని, శ్రీకృష్ణుడు వాటికి భయం రంగు పులుముతున్నాడు. అతడిది వక్రోక్తి, జల్పోక్తి. అయినా లోకం భీముడు పిరికివాడని అనుకొనే ప్రమాదముందని హెచ్చరించాడు. అతడిని సంకటస్థితిలో పెట్టాడు. 'దీని కేమి సమాధానం చెప్తుతావు?' అన్నట్లు హాస్యంగా నవ్వాడు. ఈ నవ్వు కవ్వింపు నవ్వు, చనువుతో చుఱ్రెక్కించే నవ్వు, పిరికివాళ్ళను చూస్తే లోకం ఇట్లాగే నవ్వుతుంది అని ఎగతాళి చేసే నవ్వు. అందుకే శ్రీకృష్ణుడు కలకలనవ్వినా భీముడికి పెళపెళ కోపం రాలేదు. పైపెచ్చు ఆప్యాయంగా ఆ పరిహాసానికి ప్రతిస్పందనగా భీముడు ఒక చిరునవ్వును చిందించాడు. (సంపా.)

వ. దానికి దరహసితవదనుం డగుచు భీమసేనుండు వసుదేవసూనున కిట్లనియె: 56

ప్రతిపదార్థం: దానికిన్= శౌరి వచనాలకు; దరహసిత వదనుండు+అగుచున్= చిరునవ్వుతో కూడిన ముఖం కలవాడై; భీమసేనుండు= భీముడు; వసుదేవసూనునకున్= వసుదేవుడి పుత్రుడైన శ్రీకృష్ణుడికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా సమాధాన మిచ్చాడు.

తాత్పర్యం: శౌరి మాటలకు భీముడు చిరునవ్వు తన మోమున నిండగా వాసుదేవుడితో ఈ విధంగా అన్నాడు.

ఉ. 'బంటుతనంబు మాటలకుఁ బాఱకు; పాండునృపాలుపాలు గై
కొంటయ చాలునన్న నృపకుంజరు పల్కుల కడ్డమాడ రా
కుంట యెఱుంగవే; మును సుయోధను చందముఁ జూపి యప్పు డే
మంటి యుపేంద్ర! న న్నని రణాగ్రమునన్ నిను మూదలించెదన్.57

ప్రతిపదార్థం: ఉపేంద్ర!= మాధవా!; బంటుతనంబు మాటలకున్+పాఱకు= పౌరుష వచనాలు పలకటానికి పూనవద్దు; పాండు నృపాలు పాలు= పాండు మహారాజుయొక్క రాజ్యభాగం; కైకొంటయ చాలున్= గ్రహించుటయే మనకు చాలు; అన్న నృపకుంజరు పల్కులకున్= అని పలికిన రాజోత్తముడైన ధర్మజుడి మాటలకు; అడ్డము+ఆడన్+ రాకుంట= వ్యతిరేకంగా పలుక లేకుండటం; ఎఱుంగవే= నీకు తెలుసు గదా; మును= మున్ముందు; సుయోధను చందమున్+చూపి= దుర్యోధనుడు పడే పాట్లు కనబరచి; అప్పుడు= దౌత్యం కావింప కురుసభకు వెళ్ళే సమయంలో; నన్నున్= నన్ను; ఏమంటి= ఏమని పల్కితివి; అని= అంటూ; రణ+అగ్రమునన్= అని మొనలో; నినున్= నిన్ను; మూదలించెదన్= హెచ్చరించుకొంటాను.

తాత్పర్యం: 'కృష్ణా! మగసిరి మాటలు నా దగ్గర మాట్లాడవద్దు. మన తండ్రి రాజ్యభాగమే మనకు చాలునని ప్రభువగు ధర్మరాజు పలికిన మాటలకు మేము బదులు చెప్పలేకుండటం నీకు తెలుసు. జరుగబోయే సంగ్రామంలో దుర్యోధనుడు పడే పాట్లు చూపి ఆనాడు కురుసభకు వెళ్ళేటప్పుడు ఉపప్లావ్యపురిలో నన్నేమంటివో జ్ఞప్తికి తెచ్చుకొమ్మని యుద్ధముఖంలో నిన్ను హెచ్చరించకపోనులే.

విశేషం: 1. భీము డీ పద్యంలో శ్రీకృష్ణుడితో రసికవీరుడుగా పరిహాసోక్తులు మాట్లాడాడు. 'కృష్ణా! నీ వేమీ నాకు పౌరుషం నూరిపోసేపని లేదులే. ధర్మరాజు

రాజ్యభాగం తీసికొంటే చాలులే అన్నందువలననే నే నిట్లా మాట్లాడాను. కాని, ఆనాడు కురుసభలో దుర్యోధనుడి తీరు చూచి నేను ప్రతిజ్ఞ చేసిన మాటలు నీకు తెలియవా? వాటిని రణరంగంలో చేసి చూపిస్తాను. అంటే దుర్యోధనుడి తొడలు విరుగగొట్టి నేను పిరికివాడిని కానని నీ ఎదుట నిరూపించుకొంటాను' అని భీముడు సరసంగానే పౌరుషంగా మాట్లాడాడు. నవ్వుతూ మాట్లాడితే కలిగే ఫల మది. భీముడు సంధి జరిగితే సౌమ్యుడు; యుద్ధం జరిగితే యముడు.

2. ఏమంటి యుపేంద్ర - 'అంటివి' అనునది మధ్యమపురుషక్రియ. 'లిడ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు.' అనే సూత్రంచేత, వకారానికి లోపం వచ్చి 'అంటి' అయినది. 'మధ్యమపురుషక్రియలయం' 'దిత్తునకు సంధి యగు' అనే సూత్రంచేత, సంధి నిత్యంగా రావలసి యుండగా, ఏమంటి యుపేంద్ర - అని యడాగమము వచ్చుట విశేషం. ఏమంటి వుపేంద్ర- అన్నచో సరిపోయెడిది. (సంపా.)

క. నా కొలఁది విచారింపక ।
నీ కిట్లనఁ దగునె? మిన్ను నేలయు నిమ్మెఁ
గాక తిరుగంగఁ బడినం ।
బో కే ముంజేతు లొడ్డి పోవఁగఁ ద్రోతున్. 58

ప్రతిపదార్థం: నా కొలఁది= నా శక్తి ఏపాటిదో; విచారింపక= ఆలోచించకుండ; నీకున్+ఇట్లు+అనన్+తగునె?= నీకు ఇట్లా పలకటం న్యాయమా?; మిన్నున్= ఆకాశమూ; నేలయున్= భూమియు; ఇమ్మెన్+కాక= ఇప్పుడున్నట్లుండక; తిరుగంగన్+ పడినన్= తార్మారైనప్పటికీ; పోక= వెనుకాడక; ఏన్= నేను; ముంజేతులు+ఒడ్డి= ముంజేతులు అడ్డముపెట్టి; పోవఁగన్+త్రోతున్= వాటి వాటి స్థానాలకు నెట్టివేస్తాను.

తాత్పర్యం: బావా! నా శక్తిసామర్థ్యాలు ఏపాటివో ఆలోచించక ఇట్లా నీవు మాట్లాడటం న్యాయం కాదు. నేలా, నింగీ ఇప్పుడున్నట్లు కాక తలక్రిందు

లైనప్పటికీ వెనుదీయక నేను ముంజేతులు ఒడ్డి వాటిని పాటుకు తోస్తాను సుమా!'

విశేషం: 1.అలం: అత్యుక్తి. "అత్యుక్తి రద్భుతా తథ్య శ్యార్యౌదార్యాది వర్ణనమ్''. శ్రీకృష్ణుడి పరిహాసానికి భీముడి అత్యుక్తి సమతౌల్యాన్ని తెచ్చింది. మూలశ్లోకం ఇట్లా ఉన్నది.

"యది మే సహసా క్రుద్ధే సమేయాతాం శిలే ఇవ,
అహ మేతే నిగృహ్ణీయాం బాహుభ్యాం సచరాచరే". (సం. 5-74-8)

భూమ్యాకాశాలు పరస్పరం రాపిడి పడితే విడదీస్తానని అనటం సంస్కృతంలో జాతీయం కావచ్చును. కాని, నేలా నింగీ తిరగబడితే సరిగా త్రోయటం తెలుగువారికి దగ్గరగా ఉండే జాతీయం. 2.శ్రీకృష్ణుడి మాటలకు భీముడికి అభిమానం పొడుచుకొని వచ్చింది కాని, ఆగ్రహం ప్రజ్వరిల్లలేదు. ఈ సందర్భంలో కొందరు కవులు భీముడికి నిజంగా పట్టరానంత కోపం వచ్చినట్లు, అతడు శ్రీకృష్ణుడిని తూలనాడినట్లూ చిత్రిస్తారు. వారు వ్యాసుడి వద్దా, తిక్కన వద్దా ఔచిత్యపాఠాలు నేర్చుకొనాలి. ఇక్కడ భీముడు ఉచితజ్ఞుడు. (సంపా..)

ఉ. నావుడు 'నవ్వుటాల కనినం బవనాత్మజ! యింత యేటికిం?
గేవల యోధవే? పరుల కిల్బిషముల్ దలపోయ కిమ్మెయిన్
జావడమైనఁ జూచి యిది చందము గాదని యంటిఁగాక, నీ
చేవయు లావు నీవు మును చేసిన భంగులు నే నెఱుంగనే? 59

ప్రతిపదార్థం: నావుడున్= భీమసేను డట్లా పలుకగా; పవన+ఆత్మజ!= వాయునందనా!; నవ్వుటాలకున్= ఎగతాళికి; అనినన్= నేనట్లా అంటే; ఇంత+ఏటికిన్?= ఇంత ఎందుకు?; కేవల యోధవే?= నీవు సామాన్య వీరుడవా?; పరుల కిల్బిషముల్= శత్రువు లొనర్చిన పాతకములు; తలపోయక= మదినెంచక; ఈ+మెయిన్= ఈ విధంగా; జావడము+ ఐనన్= అపౌరుషవృత్తి నవలంబించగా; చూచి= గమనించి; ఇది చందము+కాదు= ఇది సుక్షత్రియుడి పద్ధతి కాదు; అని+అంటిన్+కాక= అని పల్కితినే తప్ప;

నీ చేవయున్= నీ సారమూ; లావు= బలమూ; నీవు+మును+చేసిన భంగులు= నీవు పూర్వం చేసిన వీరవిహారాలూ; ఏన్= నేను; ఎఱుంగనే!= తెలియనటయ్యా!

తాత్పర్యం: భీముడి మాటలు విని వాసుదేవుడు 'పవనపుత్రా! నే నేదో పరిహాసానికై పలికిన మాటలకు ఇంత రాద్ధాంతమా? నీవు అసామాన్య వీరుడివి. ఇట్లాంటివాడివి దుర్యోధనాదులు మునుపు మీకు చేసిన అపకారాలను స్మరించక పౌరుష హీన వాక్యాలు పల్కటం చూచి, ఇది నీవంటి రాచబిడ్డకు యుక్తం కాదన్నానేగాని మరేమీ కాదు. నీ భుజసారం, శక్తీ, నీవు పూర్వం చేసిన సాహసకృత్యాలు- హిడింబాసుర, బకాసుర, కీచక, జరాసంధాది వధలు నాకు తెలియనివి కావు గదా!'

విశేషం: భీముడిలో క్రోధాగ్ని చల్లారలేదని తెలిసికొన్న శ్రీకృష్ణుడు తనవి పరిహాస వచనాలని ఊరటపలికి, భీముడి బలపరాక్రమాలను ప్రశంసించి, అతడిలో యుద్ధోత్సాహాన్ని స్థాయిగా నిలిపాడు. (సంపా.)

వ. అని చెప్పి మాధవుండు మఱియును. 60

తాత్పర్యం: ఇట్లా వచించి శ్రీకృష్ణుడు మళ్ళీ భీముడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్ ననుఁ గోరి యెంతయుం
బ్రార్థన సేసె; దాని కనురాగము నొందితి నేను గాన యు
ద్ధార్థులమైన మాకు నిను నాసపడం దగదే? యశంబు నా
నార్థములున్ విరోధి విజయంబునఁ దక్కఁగ నొంటఁ గల్గునే?' 61

ప్రతిపదార్థం: పార్థుఁడు= కుంతీపుత్రుడైన అర్జునుడు; పోరన్= యుద్ధంలో; తనకున్= తనకు; తేరు+కడపన్= రథం తోలటానికి; ననున్+కోరి= నన్ను అభిలషించి; ఎంతయున్+ప్రార్థన చేసెన్= మిక్కిలి వేడుకొన్నాడు; దానికిన్= అర్జునుడి వేడికోలుకు; నేను+అనురాగము+ఒందితిన్= నేను ఆసక్తి వహించాను; కానన్= కనుక; యుద్ధ+ అర్థులము+ఐన మాకున్= యుద్ధం చేయవలెనని కాంక్షిస్తున్న మా ఇద్దరికీ; నినున్= నిన్ను; ఆస+పడన్+తగదే?= కోరుకొనటం యుక్తమే గదా!; యశంబున్= కీర్తి; నానా+అర్థములున్= బహుళ ప్రయోజనాలూ; విరోధి జయంబునన్+తక్కఁగన్= శత్రువులను గెల్చుటచేగాక; ఒంటన్= మరొక్క విధాన; కల్గునే?= లభింపగలవా? (లభించవని అర్థం.)

తాత్పర్యం: 'ఫల్గునుడు యుద్ధంలో తనకు రథసారథ్యం చేయవలసిందిగా నన్ను మిక్కిలి కోరుకొన్నాడు. అందుకు నేను సమ్మతించాను. కనుక యుద్ధం అభిలషిస్తున్న మాకు కదనంలో నీ తోడ్పాటు ఎంతో అవసరం. కీర్తి, సకల ప్రయోజనాలూ శాత్రవులను గెలవటంవలన కాక మరో విధంగా సమకూడవు గదా!'

విశేషం: ఈ పద్యంలోని వాక్యప్రవృత్తిని గురించి తిక్కన 66వ వచనంలో- పరిహాసంతో పని సాధించే సరస వాక్యాలని సూచించాడు. ఇంతవరకూ పరిహాసంతో పని సాధించే మాటలయ్యాయి. ఇప్పుడు సరస వాక్యాలు ఇక్కడ మొదలయ్యాయి. సరస వాక్యం వినోద పర్యవసాయిగా ఉంటుంది. నవ్వుతో చిగురిస్తుంది. ఉద్ధతుడైన భీముడికి ఇతరులు తనకంటె గొప్పవారంటే మండిపడతాడు. ప్రత్యేకించి కౌరవవీరులంటే అసలు సహించలేడు. శ్రీకృష్ణుడు పాండవులలోనే సారథిగా తన సహాయం పొందిన అర్జునుడి ప్రస్తావన చేసి, వారిద్దరూ కలసి భీముడి సహాయాన్ని కోరతామని వ్యంగ్యంగా అన్నాడు. ఇందులో కాకువులో రెండర్థాలు స్ఫురించవచ్చును.

1. మేమిద్దరం కలిసి యుద్ధం చేసినా విజయం సాధ్యం కాకపోవచ్చును. కాబట్టి నీసహాయం మాకు అవసరం అని. అంటే భీముడి సహాయమే విజయమూలమని ప్రశంస. కృష్ణార్జునుల కంటె భీముడే అధికుడని తాత్పర్యం. 2.అసలు యుద్ధం చేసేది కృష్ణార్జునులే. వారి బలపరాక్రమాలే విజయ హేతువులు. అయినా, భీముడి సహాయం కూడా విజయానికి తోడ్పడుతుందని మరొక అర్థం. ఈ భావంలో భీముడు కృష్ణార్జునులకు సహాయకుడు, ఉపాంగతుల్యుడు. భీముడు

రెండో అర్థాన్ని గ్రహిస్తే ఉద్రిక్తుడు కావచ్చును. కాని, ఆ వాక్యం శ్రీకృష్ణు డాడుతున్న సరస వాక్యంగా గ్రహించటం చేత కోపం తెచ్చుకొనకుండా సరితూకంగా తానూ పరిహాసోచిత వీరసరసం మాట్లాడగలిగాడు. భీముడిని సరైన బాటలో పెట్టిన శ్రీకృష్ణుడి సరసవాక్య మిది. (సంపా.)

వ. అనవుడు. **62**

తాత్పర్యం: అని అనగా.

శా. 'ఏమీ! పార్థుఁడు నీవు దండిమగలై యీవచ్చు కౌరవ్య సం
గ్రామక్షోభము బాహుదర్పమునఁ దీర్పం బెద్ద మిట్టెక్కి మి
మ్మే మెల్లన్ వెఱఁగంది చూచెదముగా; కీసారెకుం బోయి రా
భీముం డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండుసూ పెంపఱన్.' **63**

ప్రతిపదార్థం: ఏమీ!= ఎట్టెట్టూ!; పార్థుఁడున్= అర్జునుడూ; నీవున్= నీవూ; దండిమగలు+ఐ= మేటి శూరులై; ఈ వచ్చు= ఇప్పుడు రానున్న; కౌరవ్య సంగ్రామ క్షోభమున్= కురు సంతతి యొక్క యుద్ధంవలని కలతను; బాహుదర్పమునన్= భుజ గర్వంతో; తీర్పన్= తొలగిస్తుండగా; ఏము+ఎల్లన్= తక్కిన మేమందరమూ; పెద్ద+ మిట్టు+ఎక్కి= ఎత్తైన మిట్టమీద నిలిచి; వెఱఁగు+అంది= ఆశ్చర్యంపొంది; చూచెదము గాక= తిలకిస్తాము లెమ్ము; ఈ సారెకున్= ఈ తడవకు; పోయిరా= సంధికి వెళ్ళిరమ్ము; భీముండు= ఈ భీమసేనుడు; ఈ+తఱిన్= ఈ సమయంలో; రిత్త మాటలకున్= వ్యర్థ వచనాలకు; పెంపు+ అఱన్= గౌరవం చెడేటట్లు; కోపింపండు సూ!= కోపము వహించడు సుమా!

తాత్పర్యం: ఎట్టెట్టూ? అర్జునుడూ నీవూ మేటిశూరులై రానున్న కురు సంగ్రామ క్షోభను మీ భుజశక్తితో నివారిస్తుంటే మేమందరమూ చేతులు ముడుచుకొని పెద్ద మిట్ట నెక్కి ఆశ్చర్యంతో మిమ్ము చూస్తుంటాంలే. నీవు

ఈ సారికి కురుసభకు వెళ్ళి రావయ్యా! ఇట్లాంటి సమయంలో భీముడు గౌరవం చెడేటట్లు వ్యర్థ వచనాలకు కోపం చెందడు.'

విశేషం: ఇది వ్యంగ్య సరసోక్తి. భీముడు గూఢాభిమానం తొంగి చూచేటట్లు మాట్లాడాడు. 'ఏమీ!' - ఆశ్చర్యార్థకం. కాకువులో పరిహాసార్థకం 'దండి మగలై' - తెలుగుదనం గుబాళించే సమాసం. మేటి వీరులై అని అర్థం. భీముడికంటె గొప్పవారుగా రణరంగంలో రాణించే వారై అని భావం. భీము డీ మాటలు ఎగతాళిగా కూడా అనే అవకాశం ఉన్నది; గౌరవంగా కూడా చెప్పే అవకాశం ఉన్నది; అందువలన ఎదుటివా రేమీ అనలేరు. శ్రీకృష్ణుడు రెండు రకాల అర్థాలు వచ్చే సరసవాక్యాలు ఎట్లా మాట్లాడాడో భీముడూ వాటికి దీటుగా మాట్లాడాడు. 'మిట్టలెక్కి మీ పరాక్రమాన్ని మేము భయపడుతూ చూస్తాంలే' అనే మాట మనసులో దెబ్బతిన్న అభిమాని ఎదుటివారి మనసు దెబ్బతినకుండా నవ్వి ఊరుకొనేటట్లు మాట్లాడిన సరసవ్యంగ్యోక్తి. ఇవన్నీ ఒక ఎత్తు. 'ఈ సారెకుం బోయిరా!' అనే వాక్యం మరొక ఎత్తు. 'ఎప్పుడో జరుగబోయే యుద్ధంలో సారథ్యాన్ని నిర్వహిస్తానని బడాయిలు కొట్టటం ఎందుకు? యుద్ధం చేయటం కంటె సంధి చేయటం తక్కువైనదేమీ కాదు. నీనేర్పు ఈ సంధి సారథ్యంలో మొదట బైటపడుతుంది. ఇక్కడ నీవు నెగ్గితే యుద్ధం సంగతి ఆ తరువాత గమనిద్దాం' అని ఆ వాక్యంలో స్ఫురించే వ్యంగ్యార్థం. 'భీముఁ డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండు సూ పెంపఱన్' - ఈ వాక్యం వినయ వివేకంతో పలికిన వీరవాక్యం. తనపేరు తానే చెప్పుకొనటం, అహంకార సూచకమైన ప్రథమ పురుష ప్రయోగం కాక, వినయసూచకమైన ప్రథమపురుష కావటం విశేషం. శ్రీకృష్ణుడు 'అసంబద్ధ వాక్యా'లని భీముడిని ఎత్తిపొడిచిన దానికి, భీముడు 'రిత్తమాటల'ని శ్రీకృష్ణుడి పట్ల ప్రయోగించాడు. కోపం రేకెత్తించాలని శ్రీకృష్ణుడు మేలమాడిన సంగతి గుర్తించి 'నీ యత్నాలు ఫలించవు' నేను గంభీరుడను, ధీరుడను, వివేకుడను, ఉదాత్తుడను అని కన్నులెగరేస్తూ పరిహాసంగా భీముడు పలికాడు. (సంపా.)

వ. అని పలికి యివ్విధంబున గోపాలదేవు మేలంపు మెయివడి కార్యవచనంబు లకుం దగం దానును దోడ్తో సరసం బాడుటయకా మఱు మాటలాడి యంతటఁ దనివోవక బకమర్దనుం డతనితో నిట్లనియె: 64

ప్రతిపదార్థం: అని పలికి= అంటూ మాట్లాడి; ఈ+విధంబునన్= ఈ రకంగా; గోపాలదేవు= శ్రీకృష్ణస్వామియొక్క; మేలంపు మెయివడి కార్యవచనంబులకున్= పరిహాసంతో కూడిన కార్యానుకూలాలైన మాటలకు; తగన్= ఒప్పిదంగా; తానును= తాను గూడ; తోడ్తోన్= వెంటనే; సరసంబు+ఆడుట+అ కాన్= సరసమాడటమేకాగా; మఱుమాటలు+ఆడి= ప్రతివచనాలు పలికి; అంతటన్+తని+పోవక= ఆ మాటలతోనే తనివి తీరక; బకమర్దనుండు= బకాసురుడిని చంపినవాడు- భీముడు; అతనితోన్+ ఇట్లు+అనియెన్= కృష్ణుడితో ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీము డీవిధంగా గోపాలకృష్ణుడి పరిహాస చతురాలైన పని సాధించే మాటలకు యుక్తంగా వెంటనే తానుగూడ సరసపు మాటలతోనే సమాధానం చెప్పి, అంతటితో తృప్తిపడక మళ్ళీ ఇట్లా అన్నాడు:

ఉ. 'కయ్యము గల్గినట్లయిన గంధ గజ ప్రకరంబు కుంభముల్
వ్రయ్యఁ దురంగ పంక్తులు ధరం బడఁ దేరిగముల్ బడల్పడన్
డయ్యమి కీవు వెక్కసపడన్ గదపండువు సేయఁగోరు నా
దయ్యము నెత్తికోలు దుది దాఁకుటగాదె భుజంగభంజనా! 65

ప్రతిపదార్థం: భుజంగభంజనా!= కాళీయుడిని మర్దించిన కృష్ణా!; కయ్యము+కల్గినట్లు+ అయినన్= పోరాటం జరిగితే; గంధగజ ప్రకరంబు కుంభముల్= మదించిన ఏనుగుల గుంపుల యొక్క తలలు; వ్రయ్యన్= బ్రద్దలు కాగా; తురంగ పంక్తులు= గుఱ్ఱాల బారులు; ధరన్+పడన్= భూమిపై కూలగా; తేరిగముల్= రథాల మొత్తాలు; బడల్ పడన్= శిథిలాలుకాగా; డయ్యమికిన్= నేను అలసట చెందకున్నందుకు; ఈవు= నీవు; వెక్కసపడన్= దుస్సహత్వము చెందగా; గద పండువు+చేయన్+కోరు= నా హస్త మందలి గదకు ఉత్సవం చేయనెంచుతున్న; ఆ దయ్యము+ ఎత్తికోలు= ఆ దైవం యొక్క ఉద్యమం, ఆ విధియొక్క విజృంభణం; తుది+తాఁకుట గాదె!= కడముట్టుటయే (నెరవేరటమే) అగును సుమా!

తాత్పర్యం: యుద్ధం జరిగితే మదించిన యేనుగుల తలలు బ్రద్దలు చేస్తాను. గుఱ్ఱాల బారులను భూమిపై కూలుస్తాను. రథ సమూహాలను నుగ్గు నుగ్గు చేస్తాను. ఇంత చేసికూడా బడలిక చెందని నన్ను చూచి నీవు ఆశ్చర్యపడక మానవు. నా గదతో పండుగ చేయగోరుతున్న దైవసంకల్పం అప్పుడే కదా సఫలమయ్యేది!

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం. లోకోక్తి. అర్జునుడికి గాండీవ పాండిత్యం ఎంత పేరు తెచ్చిందో భీముడికి గదాయుధం అంత కీర్తి తెచ్చింది. గదాయుద్ధంలో భారత వీరులలో అతడు మేటి. 'దయ్యము నెత్తికోలు దుది దాకుట కాదె'. ఇది లోకోక్తి. (సంపా.)

చ. అన విని దేవకీతనయుఁ డాతని కిట్లనుఁ 'జెప్పినంత కం
టెను మిగులంగఁ జేయుదు గడింది మగండవు నిన్నుఁ దెప్పగాఁ
గొని పలుమాఱు నాపదలకున్ భయమొందక దుఃఖవార్ధు లీఁ
దిన మము నెల్ల నిక్కొఱఁత దీర్చి సుఖాత్ములఁ జేయు పావనీ! 66

ప్రతిపదార్థం: అనన్+విని= భీముడట్లా పలుకగా విని; దేవకీతనయుఁడు= దేవకీదేవి కుమారుడైన కృష్ణుడు; ఆతనికిన్= భీముడికి; ఇట్లు+అనున్= ఈ రీతిగా చెప్పాడు; పావనీ!= వాయుకుమారా!; చెప్పిన+అంతకంటెను= చెప్పినదానికన్న, మిగులంగన్+ చేయుదు(వు)= ఎక్కువగా చేస్తావు; కడింది మగండవు= నీవు మేటి వీరుడివి; నిన్నున్= నిన్ను; తెప్పగాన్+కొని= నౌకగా చేసికొని; పలుమాఱున్= పెక్కుసారులు; ఆపదలకున్= కష్టాలకు; భయము+ ఒందక= వెరపు చెందక; దుఃఖవార్ధులు+ఈదిన= దుఃఖాలనే సాగరాలను దాటిన; మమున్+ఎల్లన్= మమ్ములనందరినీ; ఈ కొఱఁతన్+తీర్చి=ఇప్పు

డేర్పడిన ఆపదను బాపి; సుఖ+ఆత్ములన్+చేయు!= సుఖంతో గూడిన హృదయం కలవారినిగా చేయవయ్యా!

తాత్పర్యం: భీముడు పలికిన పలుకులు విని శ్రీకృష్ణుడు 'వాయునందనా! నీవు చెప్పినదానికంటె ఎక్కువగానే చేస్తావు. నీవు గొప్ప వీరుడివి. నిన్ను తెప్పగా చేసికొని కడగండ్లకు భయపడకుండా మేము దుఃఖమనే సముద్రాలీది గట్టెక్కినాము. ఇప్పు డేర్పడిన సంకటం తొలగించి మమ్ము సుఖపెట్టవలసింది.

విశేషం: అలం: రూపకం. సంధియత్న సమయంలో ధర్మరాజు యుద్ధోత్సాహాన్ని మానకుండా ఉండటానికి భీమాదులలో పౌరుషాన్ని ప్రజ్వలింపజేస్తున్న శ్రీకృష్ణుడి వ్యూహాశక్తికి ఈ పద్యం ఒక తార్కాణం. భీముడు పైకి చల్లారినట్లున్నా, లోన మండుతూనే ఉన్నాడని పాండవ పక్షానికి ప్రదర్శింపజేసి చూపించాడు. 'పావనీ!' - సార్థక సంబోధనం. దుఃఖవార్ధులు దాటేవారికి భీముడు తెప్పయేకాదు, తెప్పను ముందుకు త్రోసి ఒడ్డుకు చేర్చే పవనకుమారుడు (పిల్లగాలి) కూడా అని చమత్కారం. (సంపా.)

క. ఇదె పోయెదఁ గౌరవ్యులఁ ।
బదనికి రాఁ బలికి సంధి వాటించెద; నా
కది యొప్పదె! కాని తుదిం ।
గుదురింతకు నీవ కావె గుణరత్ననిధీ!' 67

ప్రతిపదార్థం: గుణరత్ననిధీ! -సద్గుణాలనెడు రత్నాలకు నిలయమైనవాడా!; ఇదె= ఇప్పుడే; పోయెదన్= కురుసభకు వెళ్తాను; కౌరవ్యులన్= కురువంశసంభవులను; పదనికి రాన్+పలికి= పాకానికి వచ్చేటట్లు మాట్లాడి; సంధి పాటించెదన్= సంధి సమకూరుస్తాను; నాకున్= నాకు; అది+ఒప్పదె?= అట్లా సంధి కుదుర్చుట సమ్మతమే; కాని; తుదిన్= చివరకు సంధి కుదురని పక్షంలో; ఇంతకున్+కుదురు= అన్నింటికినీ; ఆధారము; నీవు+అ, కావె!= నీవే సుమా!

తాత్పర్యం: గుణరత్న నిధివైన భీమా! నే నిపుడే కురుసభకు వెళ్ళుతాను. పాకానికి వచ్చేటట్లు వారితో మాట్లాడి సంధి పొసగే టట్లు చూస్తాను. అట్లా యత్నించటం నాకు సమ్మతమే. ఒకవేళ సంధి కుదరని పక్షంలో మాకు అన్నింటికీ ఆధారం నీవే సుమా!'

విశేషం: 1. 'ఈ సారెకుం బోయిరా' అని 65వ పద్యంలో భీముడన్న మాటలకు ప్రతిధ్వని ఈ పద్యం.

2. ఒక దీర్ఘసంభాషణను ముగించే తరుణంలో పాటించే నిర్వహణ శిల్పం తిక్కన రచనలో గమనించదగింది. ఈ పద్యం శ్రీకృష్ణుడు భీముడితో చేసిన సంభాషణకు సముచితమైన ముగింపు.

3. 'తుదిన్ కుదు రింతకు నీవకావె గుణరత్ననిధీ' - కుదుటపరిచే వాడు, ఆధారమైన వాడు భీముడు అనే మాట సాధారణార్థంలో సరసంగా ఉన్నది. భావికథార్థ వ్యంజకంగా కూడా ఉన్నది. మహాభారత యుద్ధంలో చిట్టచివర దుర్యోధన సంహారమే విజయనిర్ధారకంగా నిలిచే అంశం. దానిని విజయవంతంగా ముగించి భారత యుద్ధంలో విజయానికి ఒక కుదురుగా నిలిచేవాడు భీముడే కదా! శ్రీకృష్ణుడు సత్యవాక్కు. 'గుణరత్ననిధీ' ప్రశంసకు పరాకాష్ఠ. (సంపా.)

అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దన యభిప్రాయంబు సెప్పుట (సం. 5-76-1)

వ. అనిన వాసుదేవున కర్జునుం డిట్లనియె : 68

తాత్పర్యం: అని పలికిన కృష్ణుడితో అర్జునుడు ఇట్లా అన్నాడు :

తే. 'చెప్పఁ గల యంతవట్టును జెప్పె నీ క ।
జాత శత్రుండు; వింటి వీ వా తెఱంగు;
మాకు నెల్లను బలుకంగ మాట లొండు ।
గలవె? యైనను జెప్పెదఁగన్నయంత. 69

ప్రతిపదార్థం: అజాతశత్రుండు= ధర్మరాజు; నీకున్= నీకు; చెప్పన్+కల+అంతవట్టును+చెప్పెన్= చెప్పగలిగినంతవరకు చెప్పాడు; ఈవు= నీవు; ఆ తెఱంగు వింటివి= ఆయన పలుకుల చందం విన్నావు; మాకున్+ఎల్లను= మాకందరికీ; పలుకంగన్= చెప్పటానికి; మాటలు= పలుకులు; ఒండు+కలవె?= వేరే ఉన్నవా?; ఐనను= లేనప్పటికీ; కన్న+అంత= ఎరిగినంతవరకూ; చెప్పెదన్= పలుకుతాను.

తాత్పర్యం: 'ధర్మనందనుడు నీకు చెప్పవలసినదంతా చెప్పాడు. ఆయన మాటలన్నిటినీ నీవు విన్నావు. ప్రత్యేకంగా మేము చెప్పవలసిన మాటలు లేవు. అయినా నాకు తోచిన మాటలు నేనూ చెపుతాను.

విశేషం: భీముడు సూటిగా మాట్లాడితే అర్జునుడు సున్నితంగా మాట్లాడతాడు. చెప్పవలసినదంతా 'అజాతశత్రుడు' చెప్పాడట. ఆ విశేషణం సార్థకం. ధర్మజుడి మాటలు శత్రువులు కూడా కాదన లేని రీతిలో ఉన్నాయి. అతడు మాట్లాడిన తరువాత ఎవరికైనా మాటలు మిగులుతాయా? అనటం ఔపచారికార్థం. అతడి అభిప్రాయం కంటె వేరైన నిశ్చయం మాకు ఉంటుందా? అని మరొక అర్థం. అయినా చెప్పుతున్నాను వినుమని అంటున్న అర్జునుడు పెద్దలను కాదనని స్వీయ అస్తిత్వం కల అభిమానధనుడని స్పష్టమవుతున్నది. (సంపా.)

మ. ధృతరాష్ట్రుం డతిలోభదూషితుఁడు ధాత్రీభాగ మీ నేర్చునే
సుతుఁడుం గష్టుఁడు సంధి యేల యగునంచున్ మున్న కైపెక్కిన
ట్టితలం పచ్యుత! నీకుఁ గల్గినది; గాండీవంబు దివ్యాస్త్ర సం
తతియుం బెట్టినయట్లయుండ మముఁ జింతం బాపరాదో కదే! 70

ప్రతిపదార్థం: అచ్యుత!= శ్రీకృష్ణా!; ధృతరాష్ట్రుండు= ధృతరాష్ట్ర మహారాజు; అతి లోభదూషితుఁడు= మిక్కిలి దురాశచేత నిందింపదగినవాడు; ధాత్రీ భాగము= పుడమిలో పాలు; ఈన్+నేర్చునే= ఇచ్చుటకు సమ్మతిస్తాడా?; సుతుఁడున్= అతని కుమారుడైన సుయోధనుడు; కష్టుఁడు= కర్కశుడు;

సంధి+ఏల+అగున్+అంచున్= సంధి ఎట్లా కుదురుతుందని; మున్ను+అ= ముందుగానే; కైపు+ఎక్కినట్టి తలంపు= సందేహంతో కూడిన ఆలోచన; నీకున్+కల్గినది= నీకు పుట్టింది; గాండీవంబున్= నా ధనుస్సును; దివ్య+అస్త్ర సంతతియున్= దివ్యములైన బాణ సమూహమును; పెట్టిన+అట్ల+ఉండన్= వానికేమాత్రం పనితగులకుండ ఉన్నచోటనే అవి ఉండగా; మమున్= మమ్ము; చింతన్+పాపరాదో+కదే?= విచారం పాలుగాకుండా చేయగూడదా యేమి?

తాత్పర్యం: కృష్ణా! ధృతరాష్ట్రుడు పరమ దురాశాపరుడు. అతడు మాకు రాజ్యభాగ మివ్వటానికి అంగీకరించడు. అతడి కొడుకు గూడా మిక్కిలి కర్కశుడు. మరి సంధి కుదరటం అసంభవమని ముందుగానే నీకు సందేహం కలిగింది. నా గాండీవం, దివ్యబాణ పరంపర పనిమాని ఊరక ఉన్నచోటనే ఉండగా మేము ఏ విచారం లేకుండా ఉండే మార్గం చూపించలేవా?

విశేషం: అర్జునుడు గూఢాభిమాని. ధృతరాష్ట్రుడు దుర్యోధనుడు సంధి పడనీయరని అతడి దృఢ విశ్వాసం. శ్రీకృష్ణుడు కూడా అటువంటి అభిప్రాయాన్ని ఆవేశంతో అనటం కూడా జరిగింది. (చూడు పద్యాలు 1.352; 3.41). అంటే అర్జునుడికున్న అభిప్రాయమే కృష్ణుడి కున్నదన్నమాట! శ్రీకృష్ణుడు అచ్యుతుడు, అన్న మాట నుండి జారి పోయేవాడు కాదు. అయినా సంధి యత్నం చేస్తున్నాడు. ఇందులో సహజ విరోధాభాసం ఉన్నది. జగన్నాటక సూత్రధారి సాగించే రాజనీతి ఉన్నది. దానిని మనసులో పెట్టుకొని ఎత్తిపొడుపుగా 'నా గాండీవం, దివ్యాస్త్రాలూ ఉన్నవి ఉన్నట్లుగానే ఉండగా మా దిగులు తీరేటట్లు చేయు'మని అనటం వ్యంగ్యోక్తి. అర్జునుడి రథసారథిగా కృష్ణుడు కుదిరింది గాండీవి పరాక్రమాన్ని ప్రపంచానికి చాటటానికే. అదీ శ్రీకృష్ణు డన్నమాటే. ఇపుడు సంధి చేస్తే ఆమాట నిలువదు. అచ్యుత బిరుదం పొసగదు. కాబట్టి ఘటనాఘటన సమర్థుడైన శ్రీకృష్ణుడిలోని దివ్యత్వాన్ని భావిస్తూ 'అన్న మాటలన్నీ నిలబెట్టుకొని అచ్యుతత్వాన్ని కాపాడుకొ'మ్మని పార్థుడు సున్నితమైన వ్యంగ్యోక్తిని పలికాడు. (సంపా.)

ఉ. నీ వొనరింపఁ బూనిన పనిం గమలోదర! కీడు పుట్టునే?
కా వనినట్ల యుండి యవుఁ గార్యము; లట్లగుటం బ్రయత్న సం

భావనసేఁత పౌరుషము పద్ధతి తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడన్ వలయుఁ; దథ్యము రెండును నీ వినోదముల్. 71

ప్రతిపదార్థం: కమల+ఉదర!= ఓ పద్మనాభా!; నీవు+ఒనరింపన్+పూనిన పనిన్= నీవు చేయనెంచిన పనికి; కీడు+పుట్టునే?= హాని కలుగుతుందా? (కలుగదనిభావం); కార్యములు= నీవు సంకల్పించిన పనులు; కావు+అని నట్లు+అ+ఉండి= నెరవేరనట్లే కనిపించినప్పటికీ; అవున్= నెరవేరుతాయి; అట్లు+అగుటన్= అందువలన; ప్రయత్న సంభావన+చేఁత= కార్య మొనర్చుటకు పూనుకొనటం; పౌరుషము పద్ధతి= పురుష లక్షణం; తద్+ఫలసిద్ధి+పొందుచోన్= ఆ కార్యం యొక్క ఫలమును పొందే విషయంలో; దైవము తోడ్పడన్ వలయున్= దైవము సాయపడాలి; రెండును= కార్యం అనుకూలించటం, అనుకూలించకపోవటం, అనేవి, పౌరుషమూ దైవమూ అనేవి; నీ వినోదముల్= నీ ఇచ్ఛకు లోబడి ఉంటాయి; తథ్యము= ఇది నిజం.

తాత్పర్యం: స్వామీ! నీవు చేయ నెంచిన పనికి హాని ఎప్పుడూ కలుగదు. కొన్ని పనులు ఫలించనట్లే ముందు కనిపించినా చివరకు ఫలిస్తాయి. కాబట్టి కార్యానికి పూనుకొనటం పురుష లక్షణం. కార్యఫలం తనకు సమకూరటంలో దైవ సహాయం అవసరం. కనుక పురుషయత్నం, దైవానుకూల్యం. కార్యం అనుకూలించటం, అనుకూలించకపోవటం అనేవి రెండున్నూ నీ సంకల్పానికి లోబడి ఉంటాయి. ఈ మాట వాస్తవం.

విశేషం: 1. నరనారాయణ మహర్షులే భూతలం మీద అర్జునుడుగా, శ్రీకృష్ణుడుగా జన్మించారు. అర్జునుడు శ్రీకృష్ణుడి పట్ల స్నేహభక్తిని ప్రసరిస్తూ ఉంటాడు. నరుడు భక్తుడు, నారాయణుడు భగవంతుడు. అందువలన శ్రీకృష్ణుడిని దైవస్వరూపుడుగా, పురుషకారదైవానుకూల్య శక్తిస్వరూపుడుగా భావించి పలుకుతున్నాడు. అతడి దృష్టిలో కృష్ణుడు దూత కాడు; ఘటనాఘటన సమర్థుడైన పరమాత్ముడు. ఆ భావానికి ఈ పద్యం అద్దం.

2. దైవ సంకల్పానికి వికల్పం లేదు. అయితే, కృష్ణుడు సంధిని కోరుతున్నాడా? యుద్ధాన్ని కోరుతున్నాడా? అన్నది అసలు ప్రశ్న. అది ఫలాన్ని చూచి తెలిసికొనవలసిన సత్యం. ఆ కార్యం ఏదైనా జయం మాత్రం తథ్యం - అని అర్జునుడి విశ్వాసం.

3. ఈ పద్యం భక్తిభావ వ్యంజకంగా ఉన్నది. ఎత్తుగడలో, ముగింపులో, నిర్వహణలో సమత అనే గుణం కనపడుతున్నది. వాక్య నిర్మాణంలో ఆ గుణం ప్రతిఫలిస్తున్నది. అది భక్తుడైన అర్జునుడి మనస్సులోని నిర్మలత్వాన్ని సమత్వాన్ని సూచిస్తున్నది.

4. తిక్కన రచనలోని నాటకీయతలో పాత్రోచిత సంభాషణ ప్రవృత్తికి ఈ పద్యం ఉదాహరణం.

5. వాక్య విన్యాసంలో భక్తిభావాన్ని ధ్వనింపచేయటం తిక్కన రసధ్వనిశిల్పం.

6. 'కమలోదర!' సార్థక శబ్ద ప్రయోగం. శ్రీకృష్ణుడిలో విష్ణువును దర్శించే భావన ధ్వని. 'తథ్యము' 'నీ వినోదముల్' అనే పదాలు సమానమైన దైవలీలా విలాసాన్ని ధ్వనింపజేస్తున్నాయి. తేటతెనుగుకు తిక్కన శైలి ప్రసిద్ధి. దాని కిది ఉదాహరణం. (సంపా.)

ఉ. వేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యులన్న నె
వ్వారికిఁ బోలదే సుజనవత్సల! నీ విటులంట వారు మ
మ్మీరసమెత్తి కీడ్పఱిచి యింతలుసేసినదాన నీ మదిం
గూరిన నొవ్వుసొంపునను గోపము పెంపునఁ గాదె యారయన్.72

ప్రతిపదార్థం: సుజన వత్సల!= సత్పురుషులందు ప్రేమగల కృష్ణా!; వేరిమిన్= శత్రుభావంతో; ధర్మజున్= ధర్మపుత్రుడిని; పరిభవించిన ద్రోహులు= అవమానపరచిన ఘాతుకులు; వధ్యులు= చంపదగినవారు; అన్నన్= అనగా; ఎవ్వారికిన్+పోలదే= ఎవరికైనను యుక్తమే; నీవు+ఇటులు+అంట= యుద్ధంలో కౌరవులను జయించి రాజ్యభాగం గైకొనుట సమంజసమని నీవు పల్కటం; ఆరయన్= నిజం పరికిస్తే; వారు= ఆ కౌరవులు; ఈరసము+ఎత్తి= ద్వేషం

వహించి; మమ్మున్= మమ్ములను; కీడ్పఱిచి= కష్టపెట్టి; ఇంతలు చేసిన దానన్= ఇంతటి దురవస్థల పాలు కావించిన కారణాన; నీ మదిన్= నీ హృదయంలో; కూరిన= నిండిన; నొవ్వుసొంపునను= బాధాతి శయం వలననూ; కోపము పెంపునన్+కాదె!= క్రోధవిజృంభణం వలననేకదా!

తాత్పర్యం: శత్రుభావంతో జూదంలో ధర్మజు నోడించి అవమానించిన ఆ ఘాతుకులు వధార్హులని ఎవరైనా చెప్పగలరు. నీవు సత్పురుషుల యందు వాత్సల్యం కలవాడవు కనుక ఆ కౌరవులు మా యెడ ద్వేషం పూని, మమ్ములను బాధించి, ఇంతటి దుఃస్థితి పాలుగావించిన కారణాన నీ హృదయంలో నెలకొన్న మిక్కుటమైన బాధ చేతనున్నూ, అగ్గలమైన కోపం చేతనున్నూ వారిని సంగ్రామంలో నిర్జించి, రాజ్యభాగం గైకొనటం యోగ్యమని చెప్పావుగాని మరేమీ కాదు.

విశేషం: అలం: కావ్యలింగం. 'సమర్థనీయ స్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్'. 'అజాతశత్రువైన ధర్మరాజుపై శత్రుభావం పూని అవమానించిన ద్రోహులైన కౌరవులు వధ్యులు అని ఎవరికైనా అనిపిస్తుంది. సుజనవత్సలా! నీకు కూడా అనిపించింది. అది సహజమే' అని తన ఊహను ఉపపత్తితో సమర్థించుకొంటున్నాడు అర్జునుడు. పగబూని పాండవులను పరిపరివిధాల బాధించినందుకు శ్రీకృష్ణుడి మనసు నొచ్చి కోపం వచ్చి ఉంటుందని సమర్థించాడు. అట్లా కోపం రావటానికి కారణం పాండవులు సుజనులు కావటం. శ్రీకృష్ణుడు సుజన వత్సలుడు కావటం. ఈ మాటలో తన మనోభావాలనే శ్రీకృష్ణుడిపై ఆరోపించి చెప్పే వైఖరి కూడా తోస్తుంది. నరనారాయణుల అభేద ప్రవృత్తి ఇందులో వ్యంగ్యంగా స్ఫురిస్తుంది. (సంపా.)

ఉ. ఐనను జిత్తగింపు; ద్రుపదాత్మజ నాసభ నట్లు సేసినన్
దానికి సైఁప లెస్సయని దైన్యముఁ బొందుట కోర్చి యమ్మెయిం
గాననభూమికిం జనుట కారుణికోత్తమ! నీ వెఱుంగవే?
కాన సహించి పాండవులఁ గౌరవులం దగఁ గూర్పు నేర్పునన్.73

ప్రతిపదార్థం: కారుణిక+ఉత్తమ!= దయావంతులలో శ్రేష్ఠుడా!; ఐనను= ఇనప్పటికినీ; చిత్తగింపు= మా మాటలు అవధరించవలసింది; ద్రుపద+ ఆత్మజన్= పాంచాలిని; ఆ సభన్= ఆనాటి ఒడ్డోలగంలో; అట్లు+చేసినన్= తలవెంట్రుకలు పట్టి ఈడ్చి వలువలు ఒలిచినమా; దానికిన్= ఆ దుండగాలకు; సైఁపన్+లెస్స+అని= సహించియుండటం మంచిదని; దైన్యమున్+పొందుటకున్+ఓర్చి= దీనదశ పాలవటానికి సహించి; ఆ+ మెయిన్= ఆ విధంగా; కానన భూమికిన్+చనుట= అరణ్య ప్రదేశాలకు వెళ్ళుట; నీవు+ఎఱుంగవే?= నీకు తెలియదా?; కానన్= ఇన్నిటినీ నీ వెఱిగి ఉన్నందువలన; సహించి= ఓర్చుకొని; పాండవులన్ కౌరవులన్= కౌరవ పాండవులను; నేర్పునన్= సామర్థ్యంతో; తగన్+కూర్పు(ము)= ఒకటిగా చేయవలసింది.

తాత్పర్యం: పరమ కృపాశాలివగు కృష్ణా! కౌరవులను ఏమి చేసినా దోషం లేనప్పటికీ నా మాటలు ఆలకించవలసింది. ఆనాడు నిండు సభలో పాంచాలిని కొప్పుపట్టి ఈడ్చి, వలువ లొలిచిననూ మంచిదని మిన్నకున్నాం. దైన్యస్థితి పొందుటకున్నూ ఓర్చి, తలవంచుకొని అడవులకు పోయాం. ఇదంతా నీవెఱుగుదువు. కావున వారి దుండగాలన్నింటినీ మన్నించి, నేర్పుతో కౌరవ పాండవుల నొకటిగా ఉండేటట్లు కావించుము.

విశేషం: 1. అర్జునుడి మాటల కన్నిటికీ కీలకం వలె ఉండేది సంబుద్ధి. 'కారుణికోత్తమా!' అని శ్రీకృష్ణుడిని సంబోధించాడు. ఇతరుల కష్టసుఖాలను తనవిగా భావించి ఆర్ద్రుడయ్యే వారిలో అగ్రగణ్యుడు శ్రీకృష్ణుడట! అందువలన అలనాడు కౌరవసభలో ద్రౌపదికి చేసిన అవమానాలకు సైతం ఓర్చి అరణ్యాజ్ఞాతవాసాలు చేసి కష్టాలు పడిన పాండవుల దీనస్థితిని శ్రీకృష్ణుడు తానే అనుభవించినట్లు భావించి క్రోధోద్రిక్తుడు కావటం అతడి నైజగుణం. అటువంటి వాడు కౌరవ సభలో ఆ దైన్యాన్ని స్మరించి కోపానికి వశుడై సంధి యత్నాన్ని విఫలం చేస్తాడేమో! అని అర్జునుడు సహనాన్ని ప్రబోధిస్తున్నాడు.

ఇది తన మానసిక స్థితిని శ్రీకృష్ణుడియందు ఆరోపించటమే, పైపెచ్చు సంధి ప్రయత్నాల సమయంలో పాండవులు పడిన బాధలు మరచిపోవద్దనటం వ్యతిరేక వ్యంగ్యధ్వని. పార్థుడిక్రోధం హృదయంలో గూఢంగా ధ్వనిస్తున్నది. (సంపా.)

2.'ద్రుపదాత్మజ నా సభనట్లు సేసినన్' - ద్రౌపదికి కౌరవులు చేసిన అవమానం పైకి చెప్పరాని దనుట.

తే. అలవి యెఱుఁగక ధార్తరాష్ట్రులు గడంగి।
మమ్ముఁ బఱచిన పాటులు మానసమునఁ
జవుటఁబెట్టిన విత్తుల చందమొంది।
యంకురింపక చెడిపోయె నంబుజాక్ష! 74

ప్రతిపదార్థం: అంబుజ+అక్ష!= కమలాల వంటి కన్నులు గల శ్రీకృష్ణా!; అలవి+ఎఱుఁగక= తమశక్తి ఏపాటిదో తెలిసికొనక; ధార్తరాష్ట్రులు= కౌరవులు; కడంగి= పూనుకొని; మమ్మున్= మమ్ములను; పఱచిన పాటులు= పెట్టిన బాధలు; మానసమునన్= మా హృదయంలో; చవుటన్+పెట్టిన= చవిటి నేలలో విత్తిన; విత్తుల చందము+ఒంది= గింజల తీరై; అంకురింపక= మొలకెత్తక; చెడిపోయెన్= నశించాయి.

తాత్పర్యం: పుండరీకాక్షా! తమ శక్తి ఏపాటిదో తెలిసి కొనక దుర్యోధనాదులు పూనుకొని మమ్మ నానావిధ బాధలకు గురి చేశారు. చవిటి నేలలో విత్తిన విత్తులు మొలకెత్తక నశించిన విధంగా ఆ తలంపులన్నీ మా హృదయంలోనే అణగారిపోయాయి.

విశేషం: అలం: ఉపమ. 1.అర్జునుడి మనస్సులో ఉన్న గూఢామర్షకు ఈ పద్యం అద్దం పట్టుతున్నది. బాధ పొందిన హృదయక్షేత్రాలు పగ సాధింపు చర్యతో సారవంతమౌతాయి. కాని, పాండవ హృదయాలు ధర్మజశాంతి ప్రబోధం చేత శమభావాన్ని పొంది యుద్ధబీజాలు మొలకెత్తని చవిటి నేలలుగా తయ్యారయ్యాయి. దానితో వారి ఆశలు, ఆకాంక్షలు మొలకెత్తని విపరీతస్థితికి

గురి అయ్యాయి. ఇది ఆత్మనిర్వేదాన్ని భగవంతుడితో చెప్పుకొంటున్న తీరు. యుద్ధ వాంఛను గూఢంగా వ్యక్తం చేస్తున్న వైఖరి. వ్యతిరేక వ్యంగ్య స్ఫూర్తి ధ్వనించే విధంగా మాట్లాడే ఈ తీరు సుకుమార వైఖరి అంటారు. (సంపా.)

2. దుర్యోధనాదులు మాకు కలిగించిన కష్టాలు నా మనస్సులో చవిటినేలలో చల్లిన విత్తులవలె మొలకెత్తకుండా చెడిపోయాయి - అని తెలుగులో ఉండగా, మూలంలో - 'సనామ సమ్య గ్వర్తేత పాండవేష్విత మాధవ, నమే సంజాయతే బుద్ధిః బీజ ముప్తమి వోష'(సం. 5-76-19) - చవిటి నేలలో చల్లిన విత్తనంవలె, దుర్యోధనుడు పాండవుల విషయంలో సరిగా ప్రవర్తిస్తాడని నాకు అనిపించటంలేదు. అని మూలంలో ఉంది. (సంపా.)

వ. అమ్మొఱకుల నెమ్మెయి నయినను. 75

తాత్పర్యం: ఆ మూర్ఖులను ఏ విధంగానైనా

క. ఒడఁబఱిచి మాకు వారికిఁ।
బుడమి సగము గాఁగఁ జేసి పొంది పొసఁగియుం
డెడు నట్టి తెఱఁగు సేయుట।
కడు మే; లది గౌరవము సుఖంబును జేయున్. 76

ప్రతిపదార్థం: ఒడన్+పఱిచి= సమ్మతింపజేసి; మాకున్ వారికిన్= మాకున్నూ, కౌరవులకున్నూ; పుడమి సగము గాఁగన్+చేసి= భూమిలో చెరిసగము వచ్చునట్లొనరించి; పొంది పొసఁగి+ఉండెడు+అట్టి= కలిసి మెలసి జీవించే; తెఱఁగుచేయుట= విధానం రూపొందించటం; కడున్+మేలు= మిక్కిలి మంచిది; అది= ఆ ఏర్పాటు; గౌరవమున్= గౌరవాన్ని; సుఖంబును= సౌఖ్యాన్ని; చేయున్= కలిగిస్తుంది.

తాత్పర్యం: కృష్ణా! ఆ మూర్ఖుల నెట్లాగయినా సంధి కొప్పించి మాకూ, వారికీ రాజ్యంలో చెరిసగం వచ్చేటట్లుగా చేసి, ఉభయులం కలిసి మెలసి

ఒద్దికగా జీవించే ఏర్పాటు కావించటం చాలా మంచిది. ఆ ఏర్పాటు వలన మాకు గౌరవమూ, సౌఖ్యమూ లభిస్తాయి.

క. నీ కిట్టిది చిత్తమునకు ।
రాకున్నది యేని వలదు రం డిమ్మెయి మీ
రీకార్యము సేయుం డని ।
మా కానతి యిమ్ము కంసమర్దన! తెలియన్. 77

ప్రతిపదార్థం: కంసమర్దన!= కంసుడిని నిర్మూలించినవాడా!; నీకున్= నీకు; ఇట్టిది= ఇటువంటి సంధి విధానం; చిత్తమునకున్+ రాక+ఉన్నది+ఏనిన్= మనసునకెక్కని పక్షాన; వలదు= అక్కరలేదు; మీరు రండు= మీరు రండి; ఈ+మెయిన్= ఈ విధంగా; ఈ కార్యము చేయుండు+అని= మీరీపని చేయండని; తెలియన్= మేము గ్రహించి అనుసరించేటట్లుగా; మాకున్+ఆనతి+ ఇమ్ము= మాకు ఆజ్ఞ దయచేయుము.

తాత్పర్యం: కృష్ణా! కౌరవులతో మేము సంధి చేసికొనుట మీ దివ్యచిత్తానికి సరిపడకపోతే - ఆ పద్ధతి మీకు తగదు, మీరు ఈ రకంగా ఈ పని చెయ్యండి అని స్పష్టంగా మాకు ఆజ్ఞ నివ్వండి.

మ. హిత మిబ్భంగిది మాకు ధర్మము తెఱం గిట్లుండునం చేను నీ
మతి బోధింప వలంతినే? హితము ధర్మంబున్ విచారించి చూ
చి తగున్‌బొమ్మని యేది పంచి తది నిశ్చింతంబునంజేసి యు
న్నతిఁ బొందంగలవారమై యునికి కృష్ణా! నేఁడుగా వచ్చెనే! 78

ప్రతిపదార్థం: కృష్ణా!= శ్రీకృష్ణా!; మాకున్= మాకు; హితము+ఈ భంగిది= మేలుగల్గించు పద్ధతి ఇటువంటిది; ధర్మము తెఱంగు= న్యాయసరణి; ఇట్లు+ఉండున్+అంచున్= ఈరీతిగా ఉండునని; ఏను= నేను; నీ మతి బోధింపన్= నీ మదికి గోచరింపచేయటానికి; వలంతినే= సమర్థుడనా? (కానని అర్థం); హితమున్, ధర్మంబున్= హితమునూ, ధర్మమునూ; విచారించి చూచి= ఆలోచించి నిర్ణయము ఒనర్చి; తగున్+పొమ్ము+అని= ఈ దారిలో చక్కగా సాగుమని; ఏది+పంచితి(వి)= ఏమి సల్పుటకు ఆజ్ఞాపింతువో; అది= దానిని; నిశ్చింతంబునన్+చేసి= నిర్విచారంగా కావించి; ఉన్నతిన్+పొందన్+ కలవారము+ఐ+ ఉనికి= ఔన్నత్యం వహించి జీవించే స్థితి; నేఁడుగా+వచ్చెనే?= ఈ నాడు వచ్చిందా? కాదని భావం.

తాత్పర్యం: కృష్ణా! మా కిది మేలు కలిగిస్తుంది; ధర్మస్వరూప మిటువంటిది- అని నీకు తెలియజెప్పుటకు నేను ఏపాటివాడిని? ఏది హితమో, ఏది న్యాయమో నీవే ఆలోచించి నిర్ణయించి ఈ దారిని పొమ్మని నిర్దేశిస్తే ఆ మార్గాన్ని అవలంబించి నిర్విచారంగా నీవు చెప్పినట్లు చేసి ఉన్నతస్థితికి రాగలం. అట్టి స్థితి నేడు క్రొత్తగా ఏర్పడింది కాదుకదా!

విశేషం: 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అన్న గీతాకారుడి వాక్యానికి అనుగుణంగా అర్జునుడు పాండవుల అనన్య భక్తి విశేషాన్ని పేర్కొని, శ్రీకృష్ణు డేది చెప్పితే అదే హితవు. అదే ధర్మం అని భావించే శరణాగత ప్రవృత్తిని, నిరహంకార చిత్తవృత్తినీ ఈ పద్యంలో ప్రదర్శించి భక్తు డనిపించుకొన్నాడు. 78, 79, 80 పద్యాలు అర్జునుడి త్రికరణశుద్ధిని ప్రదర్శిస్తున్నాయి. (సంపా.)

వ. అనిన విని కృష్ణుండు విజయున కిట్లనియె : 79

తాత్పర్యం: అనగా విని కృష్ణుడు అర్జునుడితో ఇట్లా అన్నాడు :

ఉ. వెరవున లావునం గృషికి వేయు విధంబుల మేలొనర్చినం
దొరకొనునే ఫలంబు? తతితోఁ దగు వర్షము లేకయున్నఁ నె
ప్పరుసున లెస్స సేసినను బౌరుషముల్ ఫలియించు టెల్ల నా
దరణమునం బ్రసన్నమగు దైవముచేఁతన చూవె ఫల్గునా! 80

ప్రతిపదార్థం: ఫల్గునా!= (ఉత్తర ఫల్గునీ నక్షత్రాన జన్మించిన) అర్జునా!; వెరవునన్= ఉపాయంతో; లావునన్= శక్తితో; కృషికిన్= సేద్యానికి; వేయు విధంబులన్= బహు ప్రకారాల; మేలు+ఒనర్చినన్= దోహదం చేసినప్పటికినీ; తఱితోన్= అదనులో; తగు వర్షము లేక+ఉన్నన్= తగినంత వాన కురియకపోతే; ఫలంబు దొరకొనునే?= పంట లభించగలదా?; ఏ+పరుసునన్= ఏ విధంగా నైనను; లెస్స+చేసినను= చక్కగా పనులు గావించిననూ; పౌరుషముల్ ఫలియించుట+ఎల్లన్= పురుష యత్నాలు సఫలం కావటం అన్నది; ఆదరణమునన్= ప్రేమతో; ప్రసన్నము+అగు= అనుగ్రహం చూపు; దైవము చేతన్+అ చూవె= దైవం యొక్క తోడ్పాటు వల్లనే సుమా!

తాత్పర్యం: ఉపాయంతో శక్తితో శ్రమించి సేద్యానికి పలు రకాల దోహదం చేసినప్పటికీ సమయానికి తగినంత వర్షం లేకుంటే పంట చేతికందదు. అట్లాగే ఎన్నో విధాల పరిశ్రమ చేసినప్పటికినీ ప్రేమతో దైవం ప్రసన్నమైనప్పుడే పురుషయత్నాలు సఫలమౌతాయి.

విశేషం: 1. అలం: దృష్టాంతం, అప్రస్తుత ప్రశంస, అర్థాంతరన్యాసం. "చేద్ బింబప్రతిబింబత్వం దృష్టాంత స్తదలంకృతిః". రెండు వాక్యాలకు బింబప్రతిబింబ భావం వర్తించబడితే దృష్టాంతం. ఈ పద్యంలో పద్యపూర్వార్ధంలోని వాక్యానికి ఉత్తరార్ధంలోని వాక్యం దృష్టాంతం. "అప్రస్తుత ప్రశంసా స్యాత్ సా యత్ర ప్రస్తుతాశ్రయా". అప్రస్తుత కథనం వలన ప్రస్తుతం స్ఫురిస్తే అప్రస్తుత ప్రశంస. ఇక్కడే సేద్యం, సకాలవర్షం లేక ఫలం చేతికందకపోవటం అనే అప్రస్తుత కథనం వలన ప్రస్తుత కథాంశం స్ఫురించబడుతున్నది కాబట్టి అప్రస్తుత ప్రశంస.

2. 'పురుషకారం, దైవానుకూల్యం అనేవి రెండూ నీ లీలలే కృష్ణా!' అని అర్జునుడు శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని కీర్తించగా, శ్రీకృష్ణుడు తాను దివ్యుడు కానట్లు, లౌకిక వ్యక్తి అయినట్లు, దైవం ప్రత్యేకంగా ఉన్నట్లూ మాట్లాడిన మాటలివి. 'దైవం మానుష రూపేణ.'

3. ఎన్ని పాట్లు పడి వ్యవసాయం చేసినా తగిన సమయంలో పడిన వర్షం వలననే పంట పండుతుంది. అట్లాగే ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ఆ సమయానికి దేవుడు ప్రసన్నుడైతేనే అవి ఫలిస్తాయి- అనే ఈ తాత్పర్యంలో అర్థాంతర న్యాసాలంకారం కూడా సార్థకంగా ఔచిత్యవంతంగా ప్రయోగించ బడింది. అర్థాంతరన్యాసంలో సామాన్యం విశేషం చేత కాని, విశేషం సామాన్యం చేతకాని సమర్థించబడాలి. ఇందులో సామాన్యం విశేషం చేత సమర్థించబడింది. ఇటువంటి అర్థాంతరన్యాసం తక్కువగా కవులు వాడుతుంటారు. విశేషాన్ని సామాన్యంతో సమర్థించే పద్ధతిని మార్చి చెప్పిన ఈ వాక్యం శ్రీకృష్ణుడి స్వభావాన్ని ధ్వనింవజేస్తున్నది. అతడు నిజంగా దివ్యుడే. కాని, అదివ్యుడనని సమర్థించుకొనబోతున్నాడు. ఇది నిజానికి వ్యత్యస్తమే. దానిని అలంకార ధ్వనితో తిక్కన ప్రదీప్తం చేశాడు.

4. శ్రీకృష్ణు డీ సందర్భంలో చెప్పిన ఈ పద్యం, రాబోయే పద్యం, ఈ రెండూ - ధర్మరాజు పలికిన రెండు పద్యాలకు ప్రతి రూపాలుగా కనపడతాయి. ఉదా.

ధర్మ: పగయడగించు టెంతయు శుభంబు... (3.21)
శ్రీకృష్ణ: వెరవున లావునం గృషికి వేయువిధంబుల ... (3.82)
ధర్మ : కావున శాంతి బొందుటయ కర్జము ... (3.22)
శ్రీకృష్ణ: కావున సంధికిం బురుషకార మొనర్చెద ... (3.83)

తిక్కన పద్యరచనలో సందర్భోచితంగా, పాత్రోచితంగా ఇటువంటి సంవాద శిల్పాలను ప్రదర్శిస్తాడు. శ్రీకృష్ణ పాత్రోచిత పద్య మిది. పద్యం సంబుద్ధితో అంతమైనప్పుడు ప్రతిపాద్యాంశంమీద శ్రోత సమాహితాన్ని నిలిపే సూచన గోచరిస్తుంది.

6. తెలుగు - పదాల పొందికకు ఈ పద్యం హృద్యమైన ఉదాహరణం. (సంపా.)

ఉ. కావున సంధికిం బురుషకార మొనర్చెద నోపినంతయున్
దైవముచేత యెట్లగునొ దాని నెఱుంగ సుయోధనుండు సం

భావనసేసి పా లొసఁగు పాడియ కల్గిన బాల్యమాదిగా
నేవిధి నైననుం జెఱుప నింతలు పాపము లాచరించునే? 81

ప్రతిపదార్థం: కావునన్= కనుక; సంధికిన్= సంధికి; ఓపిన+అంతయున్= శక్తి ఉన్నంతవరకూ; పురుషకారము+ఒనర్చెదన్= పురుష ప్రయత్నం చేస్తాను; దైవము చేఁత+ఎట్లు+అగునొ?= దైవ మేమి చేయదలం చాడో; దానిన్+ఎఱుంగన్= ఆ విషయం తెలియలేను; సుయోధనుండు= దుర్యోధనుడు; సంభావన+చేసి= మనమాట నాదరించి; పాలు+ఒసఁగు= భాగమిచ్చునట్టి; పాడియ కల్గినన్= న్యాయబుద్ధి గలవాడైతే; బాల్యము+ఆదిగాన్= చిన్నతనం నుండి; ఏ+విధిన్+ఐననున్= ఏ రకంగానైనను; చెఱుపన్= మిమ్ము నాశనం చేయటానికి; ఇంతలు పాపములు= ఇంతటి పాపపుపనులు; ఆచరించునే?= చేస్తాడా? (చేయడని అర్థం-)

తాత్పర్యం: నేను మాత్రం నా శక్తికొద్దీ సంధి సమకూర్చటానికే ప్రయత్నిస్తాను. దైవం ఏమి చేయదలచాడో చెప్పలేను. దుర్యోధనుడు ఆదరంతో రాజ్యభాగమిచ్చే న్యాయబుద్ధికలవాడైతే చిన్నతనంనుండి ఎన్నో విధాల మిమ్మల్ని పాడు చెయ్యటానికి ఇన్ని దుష్కృత్యాలు కావిస్తాడా? (కావించడని తాత్పర్యం.)

విశేషం: మూలాన్ని సందర్భోచితంగా మలచే నేర్పరితనానికి ఈ పద్యం చక్కని ఉదాహరణం. మూల శ్లోకా లివి-

“అహం హి త త్కరిష్యామి పరం పురుషకారతః ।
దైవంతు న మయా శక్యం కర్మ కర్తుం కథంచన ॥ (సం. 5-77-5)

యత్తు వాచా మయా శక్యం కర్మణా చాపి పాండవ ।
కరిష్యే తదహం పార్థ న త్వాశంసే శమం పరైః ॥ (సం. 5-77-18)

మూలంలో కృష్ణుడు విధి ప్రస్తావన చేశాడు. తెలుగులో అది లేదు. సంధి జరిగే నమ్మకం, ఆశా తనకు లేదని మూలంలో శ్రీకృష్ణుడు అన్నాడు. తెలుగులో

పురుషయత్నం చేస్తాను కాని దైవానుకూల్యం ఎట్లా ఉంటుందో తెలియదన్నాడు. అంటే ఉండదనే ధ్వని. ఇది అర్జునుడి అంతరంగాన్ని ఊరట పరిచే వాక్యం. చిన్ననాటినుండి దుర్యోధనుడు ప్రదర్శించే ప్రవర్తనను పేర్కొని, అందులో మార్పు లేదు కాబట్టి సంధి జరగటం అసంభవమని ప్రత్యక్ష ప్రమాణాల నాధారంగా ప్రతిపాదించటం విశేషం. పద్య ఉత్తరార్థం తరువాతి కథార్థాల కనుగుణంగా మలచబడటం విశేషం. (సంపా.)

వ. అది యెల్ల నట్లుండె; నిచ్చట విరాటు పసులన్ బెట్టింప నీవు వోయిన యప్పుడు భీష్ముండు దుర్యోధనుతోఁ జెప్పిన తెఱంగు. 82

ప్రతిపదార్థం: అది+ఎల్లన్+అట్లు+ఉండెన్= ఆ సంగతి అట్లా ఉండగా; ఇచ్చటన్= మత్స్యనగరంలో; విరాటు పసులన్+పెట్టింపన్= విరటుడి గోవులను మరలించటానికి; నీవు పోయిన+అప్పుడు= నీవు వెళ్ళిన సమయంలో; భీష్ముండు= పితామహుడు; దుర్యోధను తోన్+చెప్పిన తెఱంగు= దుర్యోధనుడితో వచించిన విధ మిది:

తాత్పర్యం: ఆ విషయం అట్లా ఉంచుము. మత్స్యనగరంలో విరటుడి గోవులను కౌరవులు తోలుకొనిపోతుండగా, వాటిని మళ్ళించుకొనిరావటానికి నీవు వెళ్ళినప్పుడు భీష్ముడు దుర్యోధనుడితో పలికిన పలుకులివి:

ఉ. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వనేర్చునే?
హెచ్చగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్క మెయి నిత్తఱిఁ బొందగుచేఁతయుం దగున్.83

ప్రతిపదార్థం: వచ్చినవాఁడు= గోవులను మరలించటానికై అరుదెంచినట్టివాడు; ఫల్గునుఁడు= అర్జునుడు; అవశ్యమున్= తప్పక; గెల్తుము+అనంగన్ రాదు= మనమే జయించగలమని చెప్ప వీలుగాదు; రాలచ్చికిన్+ఐ= రాజ్యలక్ష్మికొరకు; పెనంగినన్= పోరాడితే; బలంబులు రెండును= ఇరుసైన్యాలూ; గెల్వన్+

నేర్చునే?= జయించగలవా? (జయించలేవని అర్థం); హెచ్చుగున్= ఒకటి మించుతుంది; కుందు+అగున్= మరొక్కటి తగ్గుతుంది; తొడరుట= ఎదిరించటం; ఎల్లవిధంబులకున్+ఓర్చుట= జయాపజయాలను భరించుటే ఔతుంది; అట్లు+కాక= జయాపజయాలను కలిగించే పోరాటానికి దిగకుండా; ఇచ్చన్+తలంచి= మనసులో యోచించి; ఒక్క మెయిన్= ఒక రీతిని; ఈ+తఱిన్= ఈ సమయంలో; పొందు+అగు+చేఁతయున్+తగున్= పొత్తు సమకూడే పనికి పూనుకోవటమే యుక్తం.

తాత్పర్యం: ఆవులను మరలించుకొని పోవుటకై వచ్చినవాడు అర్జునుడు! తప్పక యుద్ధంలో మనమే గెలుస్తా మనటానికి వీలుగాదు. రాజ్యలక్ష్మి కొరకు సైన్యాలు తలపడితే ఇరుపక్షాలు జయం పొందగలవా? ఒకరిది పైచేయి, మరొకరిది క్రిందిచేయి అవుతుంది. జయాపజయాలను భరించటానికి సమ్మతమైతేనే సంగ్రామానికి దిగవలె. అట్లాకాకుండా ఆలోచించి ఏదో ఒక విధంగా సంధి కావించుకొనటం మంచిది.

విశేషం: 1. కృష్ణుడు మహావక్త. ప్రతిపాద్యాంశాలకు దృష్టాంతాలను పేర్కొంటూ మాట్లాడటం తర్కబద్ధ వాక్యవాదికి సహజగుణం. శ్రీకృష్ణుడు అర్జునుడితో చెప్పదలచుకొన్న అంశం- దుర్యోధనుడు సంధికి అంగీకరించడని. దానికి తార్కాణంగా ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడు పలికిన ఈ పద్యాన్ని (విరా. 4.234) పేర్కొని, దానికి దుర్యోధనుడిచ్చిన సమాధానాన్ని చెప్పాడు. అది - 'మనకూ పాండవులకూ ఎట్లా పొత్తు కలుగుతుంది? నేను వారి రాజ్యభాగం తిరిగి ఇవ్వను. యుద్ధం చేసి పరాక్రమంతో వారిని జయించటమే మార్గం. ఇది నా నిశ్చయం.' (విరా. 4.235)

2. యుద్ధంలో జయాపజయాలు అనిశ్చితాలని చెప్పే భీష్ముడి అభిప్రాయం లోకనీతి వాక్యమే. యుద్ధం వద్దనే వారూ, శాంతిని కోరేవారూ ఈ అంశాన్ని పేర్కొని, సంధి అనుసరణీయమని చెప్పుతారు. ఉద్యోగపర్వంలో ధర్మరాజు కూడా ఇటువంటి అభిప్రాయాలే వ్యక్తం చేశాడు. (3.18). యుద్ధంలో జయమో, ఓటమో నిశ్చయంగా చెప్పలేం. యుద్ధంలో ఓడితే మరణం కంటె దుర్భరమైన

మనోవేదన పడాలి. కాబట్టి, సంధి మేలంటాడు ధర్మరాజు. ధర్మరాజూ, భీష్ముడూ ఒకే రకంగా, శాస్త్రీయంగా, లోకహితంగా, అచరణయోగ్యంగా ఆలోచిస్తున్నారని ఇక్కడ స్పష్టం. ఒకసారి ఇట్లాంటి యత్నం చేసి భీష్ముడు విఫలుడు కాగా, ఇప్పుడు ధర్మరాజు సఫలుడౌతాడా? అనే ప్రశ్న శ్రీకృష్ణుడు రేకెత్తించాడు.

3. 'వచ్చిన వాడు ఫల్గునుఁడు'- తిక్కనగారి ఈ వాక్యం తెలుగువారి జాతీయమైపోయింది. ఫల్గునుడు అంటే ఫల్గుని నక్షత్రంలో పుట్టినవాడు. పిడుగులు పడేటప్పుడు 'అర్జునః ఫల్గునః'' అని తలచుకొంటాం. పిడుగు పడి చనిపోతామన్న భయం కలిగే సమయంలో తలచుకొనే ఈ పేరు పిడుగుపాటు వంటి వాడు అనే అర్థంలో తెలుగువారి నోట రూఢికెక్కింది. ఎవడో అసాధ్యుడు వస్తున్నాడనే అర్థంలో తెలుగు వ్యవహారంలో రూఢి కెక్కింది. ఆ పలుకుబడికి ఈ పద్యం మూలం.

4. అచ్చమైన తెలుగు పదాలను దేశీయంగా వాడటం, ద్విత్వచకారప్రాస పద్యం ఎత్తుగడలో ఆశ్చర్యం, ముగింపులో హితబోధ అచ్చు గుద్దినట్లు కనపడుతున్నాయి.

5. పాత్రోచిత, సందర్భోచిత సంభాషణలకు తిక్కన పెట్టింది పేరు. భీష్ముడు శాంతి కాముకుడు. కాని, మహావీరుడు. అతడి దృష్టిలో అర్జునుడు అతిలోకవీరుడు. దానికి కారణం అతడు సాధించిన పాశుపతాస్త్రం, ఇంద్రాది దేవతలిచ్చిన అస్త్ర సంపద. 'విద్వానేవ విజానాతి విద్వజ్జన పరిశ్రమమ్' అని లోకోక్తి. పండితుడే పండితుడిని అంచనా వేయగలడు. ఈ మాట ఈ పద్యంలో అక్షర సత్యం.

6. ఈ పద్యంలో అర్జునుడి పరాక్రమం ధ్వని. దానిని ధ్వనింపజేసి కౌరవ పాండవుల మధ్య సంధి కుదిరించాలన్న భీష్ముడి శాంతి సంకల్పం ధ్వని. కవిత్రయం ధ్వని ప్రస్థానానికి సంబంధించిన వారు. తిక్కన రసధ్వని మార్గంలో సాగాడు. శబ్దవాక్య ప్రయోగంలో తిక్కన ఔచిత్య పాలనం చేస్తాడు. శబ్దగుణాల కంటె అర్థ గుణాలను ఎక్కువగా పోషిస్తాడు. ఈ పద్య రచనలో ప్రసాద గుణం ఉన్నది. బంధ శైథిల్యం అర్థ వైమల్య పోషకంగా నిలవటం ఇందులో విశేషం.

7. తిక్కన తన రచనలో కొన్ని పద్యాలను సందర్భోచితంగా పునరుక్తం చేశాడు. అట్లా చేసిన వాటిల్లో ఈ పద్యం, తరువాతి పద్యం కూడా ఉన్నాయి. కథలో కీలకపాత్ర నిర్వహించే ఈ రెండు పద్యాలూ వస్తుగత ప్రాధాన్యం కలవి. (సంపా.)

వ. అనియె దానికతం డుత్తరం బిచ్చిన తెఱంగు. 84

ప్రతిపదార్థం: అనియెన్= అని భీష్ముడు చెప్పాడు; దానికిన్= అందుకు; అతండు= దుర్యోధనుడు; ఉత్తరంబు+ఇచ్చిన తెఱంగు= సమాధానం చెప్పిన విధం ఇది:

తాత్పర్యం: భీష్ముడి పలుకులకు దుర్యోధనుడు ఇట్లా సమాధాన మిచ్చాడు:

ఆ. మనకుఁ బాండురాజతనయవర్గమునకు।
నెట్లు వొందు గలుగు? నేను రాజ్య
భాగ మీను; సమరభంగిక విక్రమ।
నిరతిఁ బూను టిదియ నిశ్చయంబు. 85

ప్రతిపదార్థం: మనకున్= మనకూ; పాండురాజు తనయ వర్గమునకున్= పాండురాజు యొక్క కుమార సమూహానికీ; ఎట్లు+పొందు+కలుగున్?= ఎట్లా పొత్తు కుదురుతుంది?; నేను రాజ్యభాగము+ఈను= నేను రాజ్యంలో భాగం పంచి వారి కివ్వను; సమర భంగికిన్+అ= యుద్ధపద్ధతికే; విక్రమ నిరతిన్+పూనుట= యుద్ధమునందు ఆసక్తి వహించటం; ఇది+అ= ఇదియే; నిశ్చయంబు= నా నిర్ణయం.

తాత్పర్యం: మనకూ పాండవులకూ పొత్తెలా పొసగుతుంది? నేను రాజ్యంలో వారికి భాగం పంచి ఇవ్వను. పరాక్రమంతో సమరం సాగించి రాజ్యమంతా ఏలుకొనటానికే నిర్ణయించుకున్నాను.

వ. అని పలికె; నది యంతయుఁ బదంపడి మనమెల్ల వింటిమ కాదె! యా మాటల ఫలం బప్పుడ కనియు నా కష్టాత్ముండు వెండియుఁ దెలియండు. 86

ప్రతిపదార్థం: అని పలికెన్= అని చెప్పాడు; అది+అంతయున్= ఆ సంగతంతా; పదంపడి= తరువాత; మనము+ఎల్లన్= మనమందరమూ; వింటిమి+అ కాదె!= విన్నాంగదా!; ఆ మాటల ఫలంబు= ఆ మాటల వలన కలిగిన లాభమేమిటో; అప్పుడు= ఆ ఉత్తర గోగ్రహణ యుద్ధంలో; ఆ కష్ట+ఆత్ముండు= ఆ కఠినచిత్తుడైన దుర్యోధనుడు; కనియున్= చూచి కూడా; వెండియున్= ఆ తరువాతనైనా; తెలియండు= గ్రహించలేకున్నాడు.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడు భీష్ముడితో చెప్పిన మాటలు ఆ తర్వాత మనమంతా విన్నాం. ఆ మాటల ఫలమేమిటో ఉత్తర గోగ్రహణ యుద్ధంలో అతడు చవి చూచాడు. రణంలో నీచేత పరాజితుడైన తర్వాతకూడా ఆ దుష్టచిత్తుడు తన మూర్ఖపు పట్టు విడువలేకున్నాడు.

తే. అతని గుణదోషముల చంద మట్లయుండె;।
నాకు ధర్మజు బుద్ధిన నడపవలయు
నిత్తెఱం గాచరింపంగ నేఁగి యచట।
నెల్ల తెఱఁగును నేర్పడ నెఱిఁగివత్తు.' 87

ప్రతిపదార్థం: అతని గుణదోషముల చందము= ఆ దుర్యోధనుడి గుణావగుణముల తీరు; అట్లు+అ+ఉండెన్= ఆవిధంగా ఉండనీ; నాకున్= నాకు; ధర్మజుబుద్ధిన్+అ= ధర్మరాజు తలపుజాడలోనే; నడవన్+వలయున్= మెలగవలసి ఉన్నది; ఈ+తెఱంగు+ ఆచరింపఁగన్+ఏఁగి= సంధి సమకూర్చటానికి కురుసభకు వెళ్ళి; అచటన్= అక్కడ; ఎల్ల+తెఱఁగును= ఉన్న విధమంతా; ఏర్పడన్= విశదంగా; ఎఱిఁగి వత్తున్= తెలిసికొని వస్తాను.

తాత్పర్యం: ఆ దుర్యోధనుడి గుణదోషాలు అట్లా ఉండనీ. నేను ధర్మరాజు కోరిన చందంగా రాయబారం నడపటానికి కురుసభకు వెళ్ళవలసి ఉన్నది. పొత్తు కుదర్చటానికి వెళ్ళి, అక్కడ వారి వర్తనాలెలా ఉన్నాయో తేటతెల్లంగా తెలిసి కొని తిరిగి వస్తాను.'

విశేషం: అర్జునుడితో పలికిన ఈ చివరి పద్యం రాయబారపు రహస్యం చెప్పే రాజనీతి మంత్రం. దుర్యోధనాదులు ఎట్లా వర్తించినా శత్రు రహస్యాలను తెలిసికొనటం, భేదో పాయాన్ని నిపుణంగా ప్రయోగించటం, విజయావకాశాలను మెరుగు చేసికొనటం - అనేవి శ్రీకృష్ణుడి హస్తినాపుర ప్రయాణ ప్రయోజనాలలోని రహస్యం. ధర్మజుడు కోరేదీ అదే. దానిని మనసు విప్పి అర్జునుడితో చెప్పిన ముగింపు పద్యం. (సంపా.)

చ. అనిన ముకుందుతో నకులుఁ డల్లన యిట్లను 'నీకు ధర్మజుం
డును బవనాత్మజుండు నరుఁడుం దగఁ జెప్పుట రిత్తగాదు; మా
మనము లరణ్యవాసమున మత్స్యమహీపతిపాల నున్నయ
ద్దినముల భంగి గావు; కృపఁ దీవ్రతఁ గుందిన చంద మయ్యెడున్.88

ప్రతిపదార్థం: అనిన ముకుందుతోన్= అని పల్కిన కృష్ణుడితో; నకులుఁడు; అల్లన= తిన్నగా; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నాడు; నీకున్= నీకు; ధర్మజుండును= ధర్మరాజూ; పవన+ఆత్మజుండున్= భీమసేనుడూ; నరుఁడున్= అర్జునుడూ; తగన్+చెప్పుట= ఒప్పిదంగా తెలపటం; రిత్తకాదు= వట్టిమాటలు కావు; మా మనములు= మా మనసులు; అరణ్యవాసమునన్= అడవులలో నివసించేకాలంలో; మత్స్యమహీపతి పాలన్+ఉన్న= విరాట మహారాజు దగ్గర నివసిస్తున్న; ఆ దినముల భంగిన్+కావు= ఆ రోజులలో ఉన్నవిధంగా లేవు; కృపన్= దయ చేత; తీవ్రతన్= తీవ్రతచేత; కుందిన చందము+అయ్యెడున్= కొరతపడినట్లు ఉన్నవి.

తాత్పర్యం: సంధికార్యం సాధించటానికై కురుసభకు వెళ్ళి వస్తానన్న శ్రీకృష్ణుడితో నకులు డిట్లా అన్నాడు: నీకు ధర్మనందనుడూ, భీమసేనుడూ,

అర్జునుడూ చెప్పినవి వట్టి మాటలు కావు. మా మనస్సులు అప్పుడరణ్యావాసకాలంలో, విరాట మహారాజు దగ్గర గడపిన అజ్ఞాత వాసకాలంలోని రోజులలో వలె ప్రతీకారేచ్ఛతో ఇప్పుడు లేవు. కౌరవులపట్ల కారుణ్యాతిశయంతో తీవ్రత తగ్గినట్లు ఉన్నాయి.

విశేషం: నకులుడు ధర్మజుడివలె వక్రోక్తులు కాక, భీముడివలె సూటిమాటలు కాక, అర్జునుడి వలె సున్నితంగా కాక, ఋజువాదిగా మాట్లాడతాడు. అందరికంటె ఆశావాదిగా కనపడతాడు. భీమాదులందరిలో కంటె సంధికి సుముఖంగా పలికిన అమాయకుడు నకులుడు. తాము ప్రతీకారేచ్ఛతో కాక కారుణ్యాతిశయంతో ఉన్నామని చెప్పటం అట్లా ఉండగా, ధర్మరాజాదులందరూ అటువంటి చిత్తవృత్తితోనే ఉన్నారని అంటున్నాడు. భీముడికంటె అమాయకుడివలె మాట్లాడాడు. అతడు అందగాడు. అతడి చిత్తం ఆర్ద్రం. అది ఈ పద్యంలో ప్రతిఫలించింది. (సంపా.)

క. కడవఁగ నొకళ్ళు పసరము ।
నడిచిన నొక్కళులుఁ బెయ్య నడువ వలయునే?
చెడుతెరు వా కౌరవ్యుల ।
కడ నిలుచుంగాక మనకుఁ గ్రౌర్యం బేలా? 89

ప్రతిపదార్థం: కడవఁగన్= ముందు మిగిలి; ఒకళ్ళు= ఒకరు; పసరమున్= ఆవును; అడిచినన్= కొట్టగా; ఒక్కళులు= మరొక్కరు; పెయ్యన్= దూడను; అడువన్+వలయునే?= కొట్టవలెనా?; చెడు తెరువు= చెడ్డదారి; ఆ కౌరవ్యుల కడన్= ఆ ధార్తరాష్ట్రులవద్దనే; నిలుచున్+కాక= ఉండుగాక; మనకున్= మనకు; క్రౌర్యంబు+ ఏలా?= ఆ క్రూరత్వం ఎందుకు?

తాత్పర్యం: కృష్ణా! ముందుగా తొందరపడి ఒకడు గోవును కొట్టితే మరొకడు దాని దూడను కొట్టాలా? ఆ పని మంచిది కాదు. ఆ దుర్యోధనాదులు చెడుమార్గం అనుసరిస్తే అనుసరించనీ. మనం మాత్రం క్రూరులమై ఎందుకు మెలగాలి?

విశేషం: అలం: ప్రతివస్తూపమ. "వాక్యయో రేక సామాన్యే ప్రతివస్తూపమా మతా." రెండు వాక్యాలకూ ఒకే సమానధర్మముండి అది భిన్న శబ్దాల చేత చెప్పబడితే ప్రతివస్తూపమాలం కారం. 'ఒకడు ఆవును కొడితే మరొకడు దాని దూడను కొట్టాలా'- అనేది తెలుగు సామెత. కౌరవులు పాండవులను కష్టాల పాలు చేస్తే, తిరిగి పాండవులు కౌరవులను హింసించాలా? అని సాధువర్తనుడివలె మాట్లాడాడు నకులుడు. పై పద్యంలో మెత్తబడిన హృదయం ఈ పద్యంలో కరుణతో జాలువారింది. (సంపా.)

సీ. గోగ్రహణంబునఁ గోలె నెంతయు మెత్తఁ ।
బడకుండుదురె వారు పద్మనాభ!
నీ యనుగ్రహమున నెమ్మిమైఁ గూడిన ।
బలము లేడక్షౌహిణులును,దొరలుఁ,
బాంచాల యాదవ పాండ్య కేకయ మాత్స్య ।
లొకతెంపు నెఱుఁగకయున్నవారె
భీమార్జునుల లావు పెంపును నీ సహా ।
యంబును గలుగుట కలుక రెట్లు?

ఆ. గురుఁడుఁ గృపుఁడు బాహ్లికుఁడు భీష్ముఁడును బుద్ధి ।
సెప్పి వారిఁ జక్కఁ జేయరెట్లు?
కార్య మీవు చెప్పఁగా విదురుండు వి ।
నంగ నెట్లు గాదనంగ వచ్చు? 90

ప్రతిపదార్థం: పద్మనాభ!= కృష్ణా!; గోగ్రహణంబునన్+కోలెన్= తమ్ము ఓడించి విరటుడి పశువులను ఏకాంగవీరుడై అర్జునుడు మరలించుకొని వచ్చినప్పటినుండి; వారు= కౌరవులు; ఎంతయున్= మిక్కిలి; మెత్తన్+పడక+ ఉండుదురె= మునుపటి కాఠిన్యము తగ్గి మెత్తబడకుంటారా? (మెత్తబడి ఉంటారని భావం); నీ అనుగ్రహమునన్= నీ దయచేత; నెమ్మిమైన్= ప్రేమ చేత; కూడిన= మన పక్షంలో చేరిన; బలములు+ ఏడు+ అక్షౌహిణులును= ఏడక్షౌహిణుల సైన్యాలునూ; దొరలున్= ప్రభువులూ; పాంచాల, యాదవ, పాండ్య, కేకయ, మాత్స్యులు= ద్రుపద సాత్యకుల యొక్కయూ; పాండ్య కేకయ భూవల్లభుల యొక్కయూ; విరాట మహారాజు యొక్కయూ; ఒక తెంపున్+ఎఱుఁగక+ఉన్నవారె?= విశిష్టమైన సాహస ప్రవృత్తిని తెలియజాల కున్నారా?; (తెలియుదురని భావం); భీమ+అర్జునుల లావు= భీమార్జునుల యొక్క శక్తి; వెరవు= ఉపాయం; నీ సహాయంబును= నీ యొక్క తోడ్పాటున్నూ; కలుగుటకున్= ధర్మరాజునకు లభించ టానికి; ఎట్లు+ అలుకరు?= ఎందుకు జంకరు?; (జంకుదురని భావం); గురుఁడున్= ద్రోణాచార్యులూ; కృపుఁడున్= కృపాచార్యులూ; బాహ్లికుఁడున్= బాహ్లికుడూ; భీష్ముఁడును= పితామహుడూ; బుద్ధి చెప్పి= నీతి బోధించి; వారిన్= కౌరవులను; ఎట్లు+చక్కన్+చేయరు= ఎందులకు చక్కబరచకుంటారు?; (చక్కబరుస్తారని భావం); ఈవు= నీవు; కార్యము చెప్పఁగాన్= కర్తవ్యం ఉపదేశించగా; విదురుండు వినంగన్= విదురుడు వినగా; ఎట్లు= ఏవిధంగా; కాదు+అనంగన్ వచ్చున్?= కాదనటానికి వీలౌతుందా? (శక్యం కాదని భావం).

తాత్పర్యం: వీరాధి వీరులైన తమ్మందరినీ నిర్జించి అర్జును డొక్కడే విరటుడి పశువులను మళ్ళించుకొని వచ్చిననాటి నుండి కౌరవులు మునుపటి కరకుదనం వదలి మెత్తబడి ఉంటారు. నీ కృపవలన కూర్మితో ఏడక్షౌహిణుల సైన్యం వాటి అధిపతులూ, ధర్మరాజు పక్షాన చేరటం వారెరుగరా? పాంచాల యాదవ పాండ్య మత్స్య దేశాల రాజుల సాహస ప్రవృత్తు లెట్టివో వారికి తెలియదా? భీమార్జునుల బల విక్రమాలు, గొప్పతనం, నీ తోడ్పాటు ధర్మపుత్రుడికి ఉన్నాయని వారు భయపడకుండా ఉంటారా? ద్రోణ కృపాచార్యులు, బాహ్లికుడు, భీష్ముడు, నీతి బోధించి ఎట్లాగైనా వారిని చక్కబరచకుండా ఉంటారా? విదురుడు వింటుండగా, నీవు చేసే కర్తవ్య బోధను తిరస్కరించటం వారికి ఎట్లా సాధ్యమౌతుంది?

విశేషం: ఈ పద్యం పాత్ర స్వభావోచిత సంభాషణకు అచ్చమైన ఉదాహరణం. నకులుడు తన వలెనే పరులు కూడా ఉంటారని భావించే ఋజుభావుకుడు. అందువలననే పరిస్థితులనుండి గుణపాఠాలు నేర్చికొని దుర్యోధనుడు మారి, సంధి కంగీకరిస్తాడని భావించాడు. శ్రీకృష్ణు డంతటివాడు పోయి మాట్లాడితే కౌరవులు భయభక్తులతో ఆయన మాట నంగీకరిస్తారని అంచనా వేశాడు. నకులుడి మాటలకు శ్రీకృష్ణు డేమీ మాట్లాడడు. బహుశః అతడి అమాయకత్వానికి పైకి కనపడని కడుపులోనే నవ్వుకొని ఉంటాడు - పరితవలె. (సంపా.)

వ. అట్లుంగాక నీవు దమపాలికిం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండ వెఱవరే? నీ పోయినప్పుడ యీ కార్యంబు చక్కనగు' ననిన విని సహదేవుండు వాసుదేవున కిట్లనియె: 91

ప్రతిపదార్థం: అట్లున్+కాక= అంతేకాక; నీవు తమ పాలికిన్+పోవుట= నీవు తమ దగ్గరకు విచ్చేయటం; ధార్తరాష్ట్రులు+ ఆదరింపక+ఉండన్+ వెఱవరే= దుర్యోధనాదులు గౌరవించకుండ ఉండటానికి జంకరా?; నీ పోయినప్పుడు+అ= నీవు వెళ్ళినవెంటనే; ఈ కార్యంబు చక్కన్+అగున్= ఈ సంధికార్యం నెరవేరుతుంది; అనినన్ విని= నకులు డట్లా పలుకగా విని; సహదేవుండు వాసుదేవునకున్+ఇట్లు+అనియెన్= సహదేవుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! నీవు తమ దగ్గరకు వస్తే దుర్యోధనాదులు నిన్ను అనాదరించటానికి భయపడతారు. నీవు వెళ్ళిన వెంటనే కార్యం సఫలమవుతుంది' అని నకులు డన్నాడు. ఆ పిదప సహదేవుడు శ్రీకృష్ణుడితో ఇట్లా చెప్పాడు:

ఉ. 'రక్కెస మాట లాడెదరు రాజును దమ్ములు; వానిలోన నీ
వొక్కటియైనఁ గాదనక యూఁ కొనుచుండుట యంతకంటె మే;
లక్కట! యిట్లు వేఁడికొననైనను బోయెదువో; సుయోధనుం
డెక్కడ? భూమిలోన సగమిచ్చుట యెక్కడ? దానవాంతకా! 92

ప్రతిపదార్థం: దానవ+అంతకా!= రాక్షసులను అంతమొందించినవాడా!; కృష్ణా!; రాజును= ప్రభువగు ధర్మజుడునూ; తమ్ములున్= ఆయన తమ్ములునూ; రక్కెస మాటలు+ఆడెదరు= అయుక్తములైన పల్కులు పల్కుతున్నారు; వానిలోనన్= వారు చెప్పిన మాటలలో; నీవు= నీవు; ఒక్కటి+ఐనన్= ఒకమాటనైనను; కాదు+అనక= కాదనకుండ; ఊఁ కొనుచున్+ఉండుట= ఊఁకొట్టుతూ ఉండటం, అంగీకరించటం; అంతకంటెన్ మేలు= వారు పల్కిన దానికంటె బాగున్నది; అక్కట!= అయ్యో!; ఇట్లు వేఁడికొనన్+ఐనను+పోయెదువో= ఈ రీతిగా వారిని బిచ్చమడగటానికి సైతం వెళ్ళుతావా?; సుయోధనుండు+ఎక్కడ?= దురాత్ముడైన ఆ దుర్యోధను డెక్కడ?; భూమిలోనన్= పుడమిలో; సగము+ఇచ్చుట+ఎక్కడ?= అర్ధ భాగ మివ్వటం ఎక్కడ?

తాత్పర్యం: 'ఔరా! ధర్మపుత్రుడూ, ఆతడి సోదరులూ తగని పల్కులు పల్కుతున్నారు. వాటిలో ఒక మాటనైనా తిరస్కరించక అన్నిటికీ నీవు ఊకొట్టటం అంతకన్న బాగుంది. రాక్షసులను విధ్వంసం చేసిన నీవు కురుసభకు బిచ్చమడగటానికి సైతం పోతావన్నమాట? దుష్టచిత్తుడైన దుర్యోధను డెక్కడ? రాజ్యంలో మనకు సగం పంచి ఇవ్వటం ఎక్కడ? అది కల్ల.

విశేషం: 1. పాండవులలో చిన్నవాడైన సహదేవుడు చిచ్చిండ్రీ వంటివాడు. అభిమానధనుడు. పౌరుషోపేతుడు. సంధి మాటలు అతడికి సరిపడవు. అందువలన ధర్మరాజాదుల అభిప్రాయాన్ని కాదంటున్నాడు. ఇతడివి వీరోక్తులు, పౌరుషోక్తులు.

2. అభిప్రాయం నచ్చకపోతే ఎంతటి దగ్గరి వారైనా ఇతడికి పరాయివారుగా కనపడతారు. అందుకే ఇతడి దృష్టిలో ధర్మరాజూ, అతడి తమ్ములూ అయోగ్యమైన మాటలు మాట్లాడేవారట! సహదేవుడు ధర్మజుడి తమ్ముడు కాడా? నకులుడు తమ్ముడైనప్పుడు అతడు కాడా? ప్రశ్న అది కాదు. ధర్మజుడి మాటకు 'తందానతాన' పలికి తమ్ములనిపించుకొంటున్న నీడలు భీమాదులు.

సహదేవు డా స్థితిని కోరటం లేదు. అందువలన వారికంటె తనను వేరు చేసి చెప్పుకొన్నాడు. ఇది కోపపరుల స్వభావం.

3. చేటతోపాటు పరుగు కూడా ఎండుతుందట. అట్లాగే ధర్మరాజాదులతోపాటు శ్రీకృష్ణుడు కూడా దైన్యస్థితికి రావలసి వచ్చిందట! ఎందుకంటే- తనవలె కాక ఆయన ధర్మజుడి తమ్ములతో చేరిపోయాడట! అందుకే దానవాంతకుడు ఇప్పుడు బిచ్చగాడివలె కౌరవసభకు పోతున్నాడట! వ్రతం చెడినా ఫలం దక్కదని అధిక్షేపించాడు యువకిశోరమైన సహదేవుడు.

4. ఇది సహదేవ పాత్రోచిత పద్యం. రంగస్థల ప్రదర్శనకు పనికివచ్చే నాటకీయ రచన.

5. 'రక్కెసమాట లాడెదరు' వంటి మాటలు అతడి కసిని బైట పెట్టుతున్నాయి. ప్రకరణౌచిత్యంతో ప్రకాశిస్తున్నాయి.

6. పౌరుషోపేతుడైన సహదేవుడి మాటలు సాత్యకి వంటి ఆవేశపరులను ఆకర్షిస్తాయి. ధర్మరాజు మాటలలోని లోతులు తెలియని వెలితి పఠితకు తెలుస్తుంది. విశేషమేమంటే- ధర్మరాజు కాని, భీమార్జునులు కాని, శ్రీకృష్ణుడు కాని అతడిమీద ఏ విమర్శా చేయరు. సంధిప్రయత్నం జరుగుతున్నా, ధర్మజుడి స్కంధావారంలో యుద్ధాగ్ని చల్లారకూడదు. సవన యజ్ఞానికి ధర్మజుడింట నున్న త్రేతాగ్నులు-భీముడు, అర్జునుడు, సహదేవుడు. ఈ అగ్నులు చల్లారకుండటమే ఔచిత్యం. ధర్మజ వాసుదేవాదులు కోరేది కూడా అదే. (సంపా.)

మ. తలఁపం గూడునె యింత లేసి దొర లీ దైన్యంబు? చుట్టంబులుం
జెలులుం దిట్టరె? లాఁతిరాజులకు మెచ్చే యి వ్విధం' బిట్టిదిం
గలదే? వేఁడఁగ ధర్మజుం డడుగఁ బోఁగాఁ గృష్ణుఁ డా ధార్తరా
ష్ట్రులు పాలీక చలంబునం బెనఁగ నిట్లుం గూడు దీపయ్యెనే? 93

ప్రతిపదార్థం: ఇంతలు+ఏసి దొరలు= ఇంతటి శక్తిమంతులైన ప్రభువులు- ధర్మజ భీమార్జున నకులులు; ఈ దైన్యంబు= ఒకరిని యాచించే దీనత్వం; తలఁపన్+కూడునె?= తలచనైనా తలచవచ్చునా?; చుట్టంబులున్= బంధువులూ; చెలులున్= మిత్రులూ; తిట్టరె?= మనలను నిందించరా?; లాఁతి రాజులకున్= ఇతర రాజులకును; ఈ+విధంబు= ఇట్టి చందం; మెచ్చే?= మెప్పు గలిగిస్తుందా?; ఇట్టిదిన్+కలదే= లోకంలో ఇంత విడ్డూరం ఉంటుందా?; ధర్మజుండు+వేఁడఁగన్= పాలివ్వండని ధర్మరాజు యాచించగా; కృష్ణుఁడు+అడుగన్+పోఁగాన్= శ్రీకృష్ణుడు రాజ్యభాగం అడగటానికివారి వద్దకు వెళ్ళగా; ఆ ధార్తరాష్ట్రులు= ఆ కౌరవులు; పాలు+ఈక= భాగమీయకుండా; చలంబునన్= ఈర్ష్యతో; పెనఁగన్= పోరాటం సాగించగా; ఇట్లున్= ఇన్నివిధాల బాధపడి సంపాదించే; కూడు= తిండి; తీపు+అయ్యెనే?= అంత రుచికరం అయిందా?

తాత్పర్యం: ధర్మజాదుల వంటి దొడ్డదొరలు ఇంతటి దైన్యానికి దిగజారటం ఊహించని విషయం. ఇందుకు బంధువులూ స్నేహితులూ నిందించక మానరు. యుద్ధ సన్నద్ధులై వచ్చిన పాంచాలాది మహీపతులకు ఈ తీరు మెప్పు కలిగించదు. లోకంలో ఇట్టి విడ్డూరం మరొకటి ఉంటుందా? ధర్మరాజు రాజ్యభాగం యాచించటం, దానిని పరమ పురుషుడైన శ్రీకృష్ణుడు అడగబోవటం, లోభదూషితులైన కౌరవులు భాగమివ్వక ఈర్ష్యతో పోరాడటం గమనిస్తే-ఇంతటి హీనమైన తిండి కూడా ఇంత ఇంపయిందా?

విశేషం: సహదేవుడు పాండవుల ఆత్మాభిమానం ఉట్టిపడేటట్లు మాట్లాడిన ఈ పద్యంలో అన్నీ ప్రశ్నార్థకాలే. పద్యం చివర 'ఇట్లుం గూడు దీపయ్యెనే?' అనే ప్రశ్న ఈ భావావస్థకు పరాకాష్ఠ. ఇట్లున్- అని చెప్పబడే దీనావస్థను నిరూపించేవి మిగిలిన ప్రశ్నలన్నీ. ధర్మరాజు చక్రవర్తి అయి కూడా యాచించటం మొదటి దైన్యం. దానివలన బంధుమిత్రులు తమను తేలికగా చూడటం రెండవ దైన్యం. లోకంలో మిగిలిన రాజులు కూడా దీనిని గర్హించటం మూడవ దైన్యం. ఈ విధంగా తనకు తాను తేలిక కావటం, బంధుమిత్ర రాజసంస్థానాలలో తేలిక

పడటం కంటె అభిమానధనుడైన ప్రభువుకు హీనమైన స్థితి మరొకటి ఉండదని సహదేవుడి అభియోగం. పోగా, ఇంతటి దైన్యంతో ధర్మరాజు శ్రీకృష్ణుడిని హస్తినాపురికి పంపినా పని చక్కపడుతుందా అంటే- ఆ ఆశ కూడా లేదు. పైపెచ్చు ధర్మజ శ్రీకృష్ణుల ప్రతిపాదనలను కౌరవులు లోభంతో ఈర్ష్యతో త్రోసిరాజని పోరుకు దిగితే ఎంత పరువు పోయినట్లు? పరులచేత ఛీ అనిపించుకొంటూ పొందే తిండి రుచిగా అనిపించిందా? అని నిష్ఠురంగా మాట్లాడాడు. 'కూడు రుచిస్తుందా' అనేది తెలుగు జాతీయం. ఇక్కడ జీవన భృతికై రాజ్యాన్ని యాచించటం అనుసరణీయమైన విధానం కాదని భావం. సహదేవుడి మాటలు రోషావేశంతో కూడి అభిమాన స్ఫోరకాలుగా ఉన్నా, రాజనీతిలోని లోతులు తెలిసికొన్నవిగా కనపడవు. అందుకే శ్రీకృష్ణుడు అతడి మాటల నంత పట్టించుకొన్నట్లు లేదు. (సంపా.)

ఉ. వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగనాడి రేనియు
న్వారలు దాని కియ్యకొనినన్ విను మచ్యుత! యట్టిసంధి పెం
పారఁగ నేర్చునే? యుచితమైనది కయ్యము; వంకమాట లే
నేరఁ గురుప్రవీరుసభ నిశ్చయ మిట్టిద కాఁగఁ జెప్పుమీ! 94

ప్రతిపదార్థం: వీరలు= ధర్మజాదులు; ధర్మమార్గమునన్= న్యాయసరణిలో; సవిస్తరతన్= విపులంగా; తగన్+ఆడిరి+ఏనియున్= ఒప్పిదంగా చెప్పినప్పటికిన్నీ; వారలు= కౌరవులు; దానికిన్+ఇయ్యకొనినన్= అందులకు సమ్మతించి ఏదో కొంత ఇచ్చినను; అచ్యుత= శ్రీకృష్ణా!; వినుము= నా మాటలు వినుము; అట్టి సంధి= ఆ విధంగా కుదుర్చుకొన్న సంధి; పెంపు+ఆరఁగన్+ నేర్చునే?= గౌరవాన్ని కలిగించగలుగుతుందా?; కయ్యము+అ= యుద్ధమే; ఉచితము+ఐనది= యోగ్యమైనది; వంక మాటలు= కృత్రిమ వచనాలు; ఏన్+నేరన్= చెప్పటం నాకు తెలియదు; కురుప్రవీరుసభన్= ధృతరాష్ట్రుడి ఓలగంలో; నిశ్చయము= మా నిర్ణయము; ఇట్టిది కాఁగన్= ఇదేఅని; చెప్పుమీ!= పలుకుము.

తాత్పర్యం: అచ్యుతా! మావారు న్యాయమార్గ మెట్టిదో విపులంగా చర్చించినప్పటికీ, అందుకు కౌరవు లంగీకరించి ఏదో కొంత మా కిచ్చినప్పటికీ, ఈ పొత్తు పెంపు వహించదు. మాకు యుద్ధమే తగినది. వంకర మాటలు నాకు తెలియవు. కాబట్టి ఆ ధృతరాష్ట్రుడి నిండు కొలువులో నా నిశ్చయం ఇటువంటిదిగా చెప్పుము.

విశేషం: సంధికుదిరి కౌరవపాండవులు గతాన్ని మరచి కలసి స్నేహంతో జీవించటం అసంభవం. ఈ నిజం తెలిసి కూడా ఈ సంధి ప్రయత్నాలు దేనికి? అని ప్రశ్నించి ధర్మరాజాదుల పలుకులన్నీ 'వంక మాటలు'- వక్రోక్తులు అని అధిక్షేపించాడు సహదేవుడు. తనకు వంకమాటలాడటం చేతగాదన్నాడు. కాబట్టి తన అభిప్రాయం భిన్నమైనదని చెప్పడం అతడి ప్రత్యేకత. తెగించి మాట్లాడే స్వభావం ఈ పద్యంలో స్పష్టం. (సంపా.)

మ. తుది రాజ్యమ్ము సగమ్ము గొ; మ్మడవియందుం, బేరు వంచించియుం,
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగిరాఁ బాలీకపోవచ్చునే?
యది గాదేఁ దెగి బంటవై యఱుము మాయల్వన్ను నేర్పింకఁ జె
ల్లదుసూ నీ కని యా సుయోధనుని యుల్లం బుచ్చిపోనాడుమీ!'95

ప్రతిపదార్థం: తుదిన్= చివరకు; రాజ్యమ్ము సగమ్ము+కొమ్ము= పాండు మహారాజు గడించిన రాజ్యంలో సగం తీసికొమ్ము; అడవియందున్= అరణ్యాలలో పన్నెండేళ్ళూ; పేరు వంచించియున్= పేర్లు మాటుపరచుకొని ఒక యేడూ; పదుమూఁడు+ ఏఁడులు= ఇట్లా పదమూడేళ్ళు; తిరిగి రాన్= మేము సంచరించి మరలిరాగా; నీవునున్= నీవునూ; పాలు+ఈక= భాగమొసగక; పోన్+ వచ్చునే?= తప్పించుకొనటానికి వీలవుతుందా?; అది+కాదు+ఏన్= అట్లా రాజ్యమొసగ వైతివేని; తెగి= సాహసించి; బంటవు+ఐ= వీరుడవై; అఱుము= యుద్ధంలో మమ్ము ఎదుర్కొని నశించుము; మాయల్+పన్ను నేర్పు= కపటం పన్నటంలోని చాతుర్యం;

ఇంకన్= ఇకమీదట; నీకున్ చెల్లదుసూ+అని= నీకు సాగదుసుమా అని; ఆ సుయోధనుని+ఉల్లంబు+ఉచ్చిపోన్= ఆ దుర్యోధనుడి మనసుకు గ్రుచ్చుకొనేటట్లు; ఆడుమీ!= పలుకుము.

తాత్పర్యం: మా తండ్రి పాండురాజు గడించిన రాజ్యంలో ఎట్టకేలకు నీవు కూడ సగం తీసికో. పన్నెండేళ్ళు అరణ్య వాసం, మారుపేర్లతో ఒరులెరుగకుండ ఒక యేడు అజ్ఞాతవాసం ఇట్లా పదమూడేళ్ళు గడపి మేము ప్రాణాలతో మరలిరాగా రాజ్యంలో పాలుపంచి మాకివ్వక నీకు తప్పుతుందా? నీ వట్లా రాజ్యభాగం ఇవ్వటానికి ఇష్టపడకపోతే శూరుడవై సాహసంతో మమ్మెదుర్కొనుము. ఇకమీదట నీ టక్కుటమారాలు సాగవు - అని దుర్యోధనుడి హృదయానికి సూటిగా గ్రుచ్చుకొనేటట్లు నీవు మాట్లాడుము.'

విశేషం: 1. మూలభారతంలో సహదేవుడి ఈ మాటలు లేవు. అందులో ఎంతసేపూ సంధివద్దు, యుద్ధం వచ్చేటట్లే వ్యవహరించుమని చెప్పినట్లే ఉన్నది.

2. ఇది వీరోచిత భాషణం. అతడి వాదంలో అసలు రాజ్యాధికారం పాండురాజుదే. అతడు దయతో ఇస్తే - సగం పొందతగినవారు కౌరవులు. కాగా, 'అరణ్యాజ్ఞాతవాసాలు మాట ప్రకారం పూర్తి చేసి వచ్చిన తరువాత కూడా మా సహజ రాజ్యాన్ని మాకివ్వటానికి దుర్యోధనుడు కాదనటమేమిటి? అతడి కేమి హక్కున్నది? రాజ్యభాగం ఇవ్వకపోతే దుర్యోధనుడు దురాక్రమణం చేసిన వాడౌతాడు. దండార్హుడౌతాడు. మా దాడికి యోగ్యుడౌతాడు. ఇదీ అసలు వ్యవహారం. దీనిని కాదని మాయలూ మర్మాలూ చేస్తే చెల్లేది లే దని నిష్ఠురసత్యం. గుండె బ్రద్దలయ్యేటట్లు చెప్పు'మన్నాడు. 'పాండురాజు దయాభిక్షగా ఇచ్చిన రాజ్యం తింటున్నది దుర్యోధనుడు. దానిని గుర్తించకపోవటం అన్యాయం, అహంకారం, అక్రమంగా ఆక్రమించిన పాండవ భాగాన్ని ఇవ్వకపోవటం లోభగుణం, క్రౌర్యం, రెండు విధాలా తప్పు చేసింది కౌరవులే. వారు వధ్యులుకాని, యాచించదగినవారు కా'దని సహదేవుడి అభిప్రాయం. ఇట్లా విశిష్టంగా

మాట్లాడటం పాండవులలో సహదేవుడికే చెల్లింది. అందుకే సజాతీయ ప్రవృత్తిగల సాత్యక్యాదుల మెచ్చుకోలు వెంటనే అతడికి లభించింది. (సంపా.)

3. ఈ పద్యాన్ని విమర్శకులు మరికొన్ని విధాలుగా వ్యాఖ్యానించారు. వాటిని 'జనహిత' వ్యాఖ్య ఇట్లా సమీకరించింది.

"సంస్కృత మహాభారతంలో వ్యాసఘట్టాలు ప్రసిద్ధాలు. తిక్కన కూడా కొన్ని పద్యాలు అలా వ్రాశాడు. వాటిల్లో ఇది ఒకటి. దీనికి కొంత మంది విజ్ఞులు ఎలా అర్థాలు చెప్పారో పరిశీలిద్దాం.

(i) "తిక్కన రచనలో రెండు మూడు ప్రౌఢ రచనావిన్యాసములు గూడ గనఁబడును'' అని చెప్పి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రిగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన ఉద్యోగపర్వం పీఠికలో ఈ పద్యం ఉదాహరించారు.

అర్థం: "అడవి యందున్= అరణ్యములోను; పేరు వంచించియున్= మారుపేరులు పెట్టుకొనియు; పదుమూఁడేఁడులు= పదమూడు సంవత్సరములు; ఉండి యను క్త్వార్థక మధ్యాహారము; తుదిన్= చివరను; రాజ్యమ్ము సగమ్ము గొమ్ము= అర్ధరాజ్యమును స్వీకరించుము (అని); నీవు= నీవు (దుర్యోధనుడని యర్థము); అనన్= (ధర్మరాజుతో) అనగా; (అట్లుచేసి); తిరిగి రాన్= తిరిగి రాగా; పాలీక పోవచ్చునే?= భాగమీయకుండుట న్యాయమా?; అది కాదేన్= అది నీయిష్టము కాకున్న; తెగి= సాహసించి; బంటవై= వీరుడవై; అఱుము= ఆక్రమించుము (గెలువుము); మాయల్ పన్ను నేర్పు= మాయలను గల్పించు తెలివి; ఇంకన్= ఇకమీద; చెల్లదుసూ= పనికి రాదు సుమా; నీకని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు= డెందంబు; ఉచ్చిపోన్= డస్సిపోవునట్లుగా; ఆడుమీ= పల్కుమా.

తాత్పర్యం: వనవాసాజ్ఞాతవాసములు రెండును బదుమూడేడులు సలిపి, తుది రాజ్యమ్ము సగమ్ముగొమ్మని నీవనగా, ధర్మరాజు తిరిగిరా పాలీయకుండుట న్యాయమా? అట్లిష్టపడవేని సాహసించి వీరుడవై యుద్ధమున గెలువుము. మోసగించి సంపాదించు నేర్పింక నీకు సాగదు సుమా! యని

యాసుయోధనుని యుల్లంబుచ్చిపోవునట్లు వచింపుమా! యని సహదేవుడు శ్రీకృష్ణునితో జెప్పెనని తాత్పర్యము. (చూ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక; సంపుటి 17, సంచిక-5, పుట= 253).

(ii) "శ్రీ చంద్రాభట్ట రామమూర్తిగారు 'నీవనన్' అని సవరించి చెప్పిన యర్థము సముచితముగా కనిపించుచున్నది" అని తిక్కన కావ్య శిల్పము అనే సిద్ధాంత గ్రంథంలో డా॥ కేతవరపు వేంకట రామకోటిశాస్త్రిగారు భావించారు.

అర్థం: "నీవునున్= నీవు కూడ; తుదిన్= మాకు బంచియిచ్చిన పిమ్మట; రాజ్యమ్ము సగమ్ము= అర్ధరాజ్యమును; కొమ్ము= పుచ్చుకొనుము; అడవి యందున్= అరణ్యమునందును; పేరు వంచించియున్= అజ్ఞాతమునందును; పదమూడు వత్సరములు; తిరిగిరాన్= తిరిగిరాగా; పాలు+ఈకన్= భాగం ఇవ్వకుండా; పోవచ్చునే?= ఉండవచ్చునా?; అదికాదు+ఏన్= అది పొసఁ గనిచో; తెగి= తెగించి; బంటవు+ఐ= వీరుడవై; అఱుము= ఎదుర్కొని నశింపుము; మాయల్+పన్ను= మోసములను పన్నునట్టి; నేర్పు= కౌశలము; నీకున్= నీకు; చెల్లదు+సూ(సుమీ); అని; ఆ సుయోధనుని= ఆ దుర్యోధనుని యొక్క; ఉల్లంబు= మనస్సు; ఉచ్చిపోన్= దూరిపోవునట్లుగా; ఆడుమీ= పల్కుము.

తాత్పర్యం: 'తొలుత మాకు సగము రాజ్యము పంచి యిచ్చి మిగిలిన దానిని నీవు పుచ్చుకొమ్ము. పదమూడు వత్సరము లరణ్యముల నజ్ఞాతమున గడపి వచ్చిన తరువాత రాజ్యభాగ మీయకపోవచ్చునా? అది పొసఁగనిచోఁ దెగించి వీరుడవై యుద్ధమునకు వచ్చి మమ్మెదుర్కొనుము. మాయలు పన్ను నీనేర్పు ఇక చెల్లదు సుమీ! యని యా దుర్యోధనుని హృదయమున గాటముగా గుచ్చుకొని పోవునట్లు పలుకుము.' (శ్రీ వావిలాల సోమయాజులు).

భీమార్జున నకులులు ధర్మరాజు అభిప్రాయాన్ని కాదనలేకా, ఔను అనటం ఇష్టం లేకా, ఎటూగాని మాటలు మాట్లాడారు కాని సహదేవుడు

జంకు లేకుండా తన పైవాళ్ళు చెప్పలేని దానిని సూటిగా చెప్పాడు. పాండవులలో ముగ్గురు ఒకే మాట మీద ఉన్నట్లు, ఒక్కరు అందుకు భిన్నంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కాని, తరువాత ద్రౌపది చెప్పబోయే మాటలకు సహదేవుని ఈ మాటలు ఉపోద్ఘాతంలాగా ఉన్నాయి. పాండవ పక్షంలో సంధికి అనుకూలత కంటే వ్యతిరేకతే ఉందని ఇక్కడి నుండి స్పష్టమవుతుంది' (ఉద్యోగపర్వము జనహిత వ్యాఖ్య. పు. 373-375).

(iii) శ్రీ పార్థసారథి రచించిన ఉద్యోగపర్వము - ఆమ్నాయకళానిధి వ్యాఖ్యలో ఇట్లా ఉన్నది.

అర్థం: "తుదిన్= కడపటి పక్షమగు; రాజ్యమ్ము సగమ్ము కొమ్ము; అడవియందున్= వనవాసమునను; పేరు వంచించియున్= మారు పేరులతోడ నజ్ఞాతవాసమునను; పదుమూఁడేఁడులు, తిరిగి రాన్; నీవు; పాలు= భాగమైనను; ఈక= ఇయ్యక; పోవచ్చునే; అది; కాదేని= ఇచ్చుట కాకపోయినన్; బంటవై= శూరుడవై; అఱుము= యుద్ధమునఁ జచ్చిపొమ్ము; మాయల్ పన్ను నేర్పు= మోసములు చేయు గట్టితనము; ఇంకన్= ఇఁట మీఁద; చెల్లదు సూ= జరుగదు సుమా; నీకున్; అని; సుయోధనుని యుల్లంబు= వాని మనసు; ఉచ్చిపోన్= నాటునట్లుగా; ఆడుమీ= భాషింపుమా!

తాత్పర్యం: న్యాయముగా రాజ్యమంతయు మాదైనను, గడపటి పక్షమున సగము రాజ్యమునైనను నీవు తీసికొని సగము మాకిమ్ము. మేమడవులందు బంద్రెండేళ్ళు తిరిగి మాఱుపేరులు పెట్టుకొని యజ్ఞాతవాసమున నొక్కయేఁడు వసించి తిరిగి వచ్చినపుడు మారాజ్యమంతయు నిచ్చుట యటుండ నీవు సగభాగమైన నియ్యకపోవచ్చునా? అట్లు నీ మనసు రాని యెడల శూరుడవై యుద్ధమునకుం దిగుము. లోఁగడవలె టక్కు చేసి రాజ్యముం గొనుట యింక ననుకూలింపదు సుమా!" అని దుర్యోధనుడి మనంబున నాటునట్లు పలుకుము.' (పు.279) (సంపా.).

(iv) కొందరీ క్రింది విధంగా అర్థం చెప్పుతారు.

అర్థం: అడవియందున్= పన్నెండేళ్ళు అడవిలోనూ; పేరు వంచించియున్= మారుపేర్లు పెట్టుకొని; ఒక యేడు అజ్ఞాతంగానూ; (ఈ విధంగా) పదుమూఁడు+ఏఁడులు= పదమూడు సంవత్సరాలు; నీవునున్= (మావలెనే) నీవుకూడా; తిరిగి రా= తిరిగి రమ్ము; తుదిన్= చివర; రాజ్యమ్ము సగమ్ము= సగం రాజ్యభాగం; కొమ్ము= తీసికొమ్ము; పాలు+ఈక పోవచ్చునే?= (నీకు) భాగం ఇవ్వకుండా ఉండటానికి (మాకు) వీలవుతుందా?; అట్లాగే- అనుకొన్న విధంగా పదమూడేళ్ళు కడపి తిరిగి వచ్చిన మాకు నీవు కూడా భాగం ఇవ్వకుండా ఉండటానికి వీలులేదు; అది కాదు+ఏన్= ఆ రీతిగా ఇవ్వటానికి ఇష్టం లేకపోతే; తెగి= సాహసించి; బంటవు+ఐ= వీరుడవయి; అఱుము= నశించుము; (ఒప్పందం ప్రకారం మా భాగం మాకు ఇవ్వాలి లేకపోతే వీరోచితంగా యుద్ధంలో చావాలి అనటం); (అంతేకాని) - మాయల్- పన్ను నేర్పు= వంచనా శిల్పం; ఇంకన్= ఇకమీద; నీకున్; చెల్లదు, సూ= సాగదు సుమా; అని, ఆ - సుయోధనుని; ఉల్లంబు= మనస్సు; ఉచ్చిపోన్= దూసుకొని పోయేటట్లు; ఆడుమీ= మాటాడుము.

తాత్పర్యం: నీవు కూడా మా వలెనే పదమూడేళ్ళు తిరిగిరా, చివర సగం రాజ్యం తీసుకో. మేము వాటా పెట్టకుంటే నీవు ఒప్పుకుంటావా? అట్లాగే ఒప్పందం ప్రకారం పదమూడేళ్ళు కడపి తిరిగి వచ్చిన మాకు రాజ్యభాగం ఇవ్వకుండా ఉండటానికి నీకు వీలులేదు. అట్లా కాకపోతే యుద్ధంలో చావుము. (మా వాటా మాకు ఇచ్చి తీరాలి లేదా చచ్చి తీరాలి.) ఇంక నీకు మాయలు పన్నే నేర్పు సాగదు - అని ఆ దుర్యోధనుడి మనస్సు దూసుకొనిపోయే విధంగా మాటాడుము.

మ. అనినన్ సాత్యకి ప్రీతుఁడై 'యితఁడు లెస్సై యుండఁబల్కెం; బ్రయో
జనముం గల్గదు గౌరవంబుఁ జెడు దుశ్చారిత్రకుం డా సుయో
ధను బోధింపఁగఁ బోయినన్; సరభసోత్సాహంబుమై నున్న వీ
రనికాయంబున కెల్లనుం బ్రియము సంగ్రామంబు మే లెమ్మెయిన్.'96

ప్రతిపదార్థం: అనినన్= అని సహదేవుడు పలుకగా; సాత్యకి= కృష్ణుడి తమ్ముడు; ప్రీతుఁడు+ఐ= సంతోషించినవాడై; ఇతఁడు= సహదేవుడు; లెస్స+ఐ+ఉండన్+పల్కెన్= చక్కగా మాట్లాడాడు; దుస్+చారిత్రకుండు= చెడువర్తనములు గల; ఆ సుయోధనున్= ఆ దుర్యోధనుడిని; బోధింపఁగన్+పోయినన్= మంచి తెలియ జెప్పుటకు యత్నించిననూ; ప్రయోజనమున్+ కల్గదు= లాభం కూడా ఉండదు; గౌరవంబున్+చెడున్= మన పరువుకూడా పోతుంది; సరభస+ఉత్సాహంబుమైన్+ఉన్న= సంతోషంతో కూడిన యుద్ధ యత్నంతో ఉన్న; వీర నికాయంబునకున్+ఎల్లనున్= వీరుల సమూహాని కంతటికినీ; ఏ+మెయిన్= ఏ విధంగా యోచించిననూ; సంగ్రామంబు ప్రియము= యుద్ధమే ఇష్టమైనది; మేలు= శ్రేయస్కరం కూడ.

తాత్పర్యం: సహదేవుడి మాటలకు సాత్యకి సంతోషించి ఇట్లా అన్నాడు: 'ఈతడు యుక్తంగా మాట్లాడాడు. దుర్యోధనుడు దుష్టవర్తనుడు. అతడికి నీతులు చెప్పబోతే ప్రయోజనముండదు. అంతే కాదు. మన గౌరవం కూడ ఊడిపోతుంది. సంతోషోత్సాహాలతో ఉన్న ఈ వీరులందరికీ యుద్ధమే ఇష్టం. ఏ విధంగా ఆలోచించినా మనకు సంగ్రామమే మంచిది.'

వ. అనిన విని రథికవరు లందఱు 'సహదేవుం డింత యొప్పనాడునే? సాత్యకి పలుకు లిట్లుండునే? తక్కటివి యెక్కడి మాటలు? పగవారి నడిగికొనంబోవుట యుచితంబఁట! కయ్యంబు కర్జంబుగాదఁట! భంగంబు నీఁగికొనం దగదఁట! యనునిది మొదలుగా ననేకు లనేక ప్రకారంబుల వీరాలాపంబులం గొలువెల్ల నొక్క మ్రోఁతగాఁ జెలంగిన యెలుంగులు నింగి ముట్టెఁ దదనంతరంబ. 97

ప్రతిపదార్థం: అనినన్ విని= సహదేవ సాత్యకుల మాటలు విని; రథికవరులు+అందఱున్= రథమెక్కి యుద్ధం చేసే వీరాగ్రేసరులంతా; సహదేవుండు+ఇంత+ఒప్పన్+ ఆడునే!= సహదేవు డింత ఒప్పిదంగా

పల్కునా!; సాత్యకి పలుకులు+ ఇట్లు+ ఉండునే!= సాత్యకి మాటలింత బాగుంటాయా?; తక్కటివి= మిగిలినవారు చెప్పినవి; ఎక్కడి మాటలు?= ఏమి పలుకులు?; పగవారిన్+అడిగి కొనన్+పోవుట= శత్రువులను యాచించటానికి వెళ్లటం; ఉచితంబు+అఁట!= యోగ్యమట!; కయ్యంబు కర్జంబు+ కాదు+అఁట!= యుద్ధం చేయటం తగదట!; భంగంబున్+ఈఁగి కొనన్+తగదు+ అట!= అవమానం బాపుకొనుట తగదట!; అనునివి మొదలుగాన్= అనునిటువంటి మాటలతో; అనేకులు= పలువురు; అనేక ప్రకారంబులన్= పలు రకాల; వీర+ఆలాపంబులన్= వీరోక్తులతో; కొలువు+ఎల్లన్= సభఅంతా; ఒక్క మ్రోఁతగాన్= ఒకే ధ్వనితో నిండినదికాగా; చెలంగిన+ఎలుంగులు= చెలరేగిన కంఠధ్వనులు; నింగిన్+ముట్టెన్= అంబరం అంటాయి; తత్+అనంతరంబు+అ= ఆ పిదప.

తాత్పర్యం: సహదేవుడూ, సాత్యకీ చెప్పిన మాటలు విని రథికశ్రేష్ఠులందరూ 'ఆహా! సహదేవు డెంత చక్కగా పలికాడు. సాత్యకి మాటలు ఎంత బాగా ఉన్నాయి! తక్కినవారి మాటలు ఏమి మాటలులే. విరోధులను యాచించటానికి వెళ్లటం మంచిదట! యుద్ధం చేయడం తగదట! వారు చేసిన అవమానానికి ప్రతీకారం కూడదట!' అంటూ అక్కడ అనేకులు అనేక విధాల వీరోక్తు లాడుతుండగా కొలువుకూటంలో ఒకే రొద చెలరేగింది. వారి కంఠధ్వనులు ఆకాశాన్ని తాకాయి. ఆ తరువాత.

విశేషం: ధర్మజుడు పలికిన రాజనీతి వాక్యాలకు సభ నిశ్శబ్దంగా ఉండి పోయింది. భీమార్జున నకులులు పల్కిన మాటలకు మారుపల్కకుండా ఊరుకొన్నది. సహదేవుడి మాటలకు ఉబ్బితబ్బిబ్బయిపోయింది. మనసులలో ఉన్న యుద్ధోత్సాహాన్ని మాటలలో బైటపెట్టింది. సభ్యుల వీరాలాపాలు గమనిస్తే పాండవ స్కంధావారమంతా యుద్ధాన్నే కోరుతున్నదని ప్రకటితమైనది. దీనిని పోషించటమే శ్రీకృష్ణుడి సంకల్పం. అందుకే వారిని వారించని వైనం. (సంపా.)

ద్రౌపది కృష్ణునితోఁ దన మున్ను పడిన భంగపాట్లు సెప్పుట (సం. 5-80-1)

తే. ధర్మనందను పలుకులు దనకు హృదయ।
తాప మొనరింప మోమున దైన్య మొంద
నున్న పాంచాలి యిట్లని యొయ్యఁ బలికెఁ।
గనలి శౌరితో గద్గదకంఠి యగుచు. 98

ప్రతిపదార్థం: ధర్మనందను పలుకులు= ధర్మజుడాడిన మాటలు; తనకున్= తనకు; హృదయతాపము+ఒనరింపన్= మనస్సునకు వ్యథ కలిగించగా; మోమునన్= ముఖంలో; దైన్యము+ఒందన్= దీనత తోపగా; ఉన్నపాంచాలి= అక్కడఉన్న ద్రౌపది; కనలి= కోపించి; శౌరితోన్= శ్రీకృష్ణుడితో; గద్గద కంఠి+అగుచున్= డగ్గుత్తిక పడిన గొంతుగలదై; ఇట్లు+అని= ఈ రీతిగా; ఒయ్యన్+పలికెన్= తిన్నగా మాట్లాడింది.

తాత్పర్యం: ధర్మపుత్రుడి వాక్కులు తన హృదయానికి వేదన కలిగించగా, తన ముఖంలో దైన్యం నెలకొనగా; అందరి మాటలు వింటూ అక్కడున్న ద్రౌపది కోపించి, శ్రీకృష్ణుడిని చూచి డగ్గుత్తికతో మెల్లగా ఇట్లా అన్నది.

విశేషం: 1. తిక్కన ద్రౌపది పాత్రను ఈ ఘట్టంలో సమున్నతంగా సహజంగా చిత్రించాడు. పాండవులు యుద్ధనీతిని అనుసరించి మాట్లాడుతారు. ఆమె హృదయ నీతిని పాటించి మాట్లాడుతుంది. ఆమెలో ఆవిర్భవించే భావకదంబాన్ని ఆమె చేష్టలు అభినయ దర్పణాలుగా వ్యాఖ్యానిస్తాయి. తిక్కన నాటకీయ రచనా శిల్పం ఈమె హావభావాలలో ఆయువు పోసికొన్నది.

ఆమెకు ధర్మరాజు మాటలు మనస్తాపాన్ని కలిగించాయి. దాని వలన ఆమె ముఖం చిన్నబుచ్చుకొన్నది. ఇది మనస్తాపానికి అనుభావం. ఆమెకు కోపం వచ్చింది. 'కనలు' అనే పదం సార్థకం. ఆపాదమస్తకం కోపంతో ఎర్రబడింది. ఇది సాత్త్విక భావం. గద్గద కంఠంతో నెమ్మదిగా మాట్లాడటం మొదలుపెట్టింది.

గాద్గద్యం తన పరితాపానికి అనువైన వాచికాభినయంతో కూడిన సాత్త్వికభావం. మెల్లగా మాట్లాడటం మనస్తాప వ్యంజకం.

2. మూలంలో ద్రౌపది ధర్మజాదుల పలుకులకు ప్రతిస్పందించిన వివరాలు కూడా ఇవ్వబడ్డాయి.

"రాజ్ఞస్తు వచనం శ్రుత్వా ధర్మార్థ సహితం హితమ్
కృష్ణా దాశార్హ మాసీన మబ్రవీచ్ఛోకకర్శితా॥

మతా ద్రుపదరాజస్య స్వసితాయత మూర్ధజా
సంపూజ్య సహదేవం చ సాత్యకిం చ మహారథమ్॥

భీమసేనం చ సంశాన్తం దృష్ట్వా పరమదుర్మనాః
అశ్రుపూర్ణేక్షణా వాక్య మువాచేదం మనస్వినీ॥" (సం. 5-80-1,2,3)

ధర్మార్థ సహితంగా మాట్లాడిన ధర్మరాజు మాటలు విని ద్రౌపది శోకంతో కుమిలిపోయి శ్రీకృష్ణుడితో పలికింది. సహదేవుడిని, సాత్యకిని ప్రశంసించింది. చల్లబడిన భీముడిని చూచి గుండెలో కుమిలిపోతూ కళ్ళల్లో నీళ్ళు నిండగా ఆ అభిమానవతి ఇట్లా అన్నది. తిక్కన ధర్మరాజు ప్రసక్తిని చెప్పి మిగిలిన విశేషాలు వదలాడు. భీమాదులేమన్నా, ఎన్ని అన్నా ధర్మజుడి మాటను కాదనలేరు. శ్రీకృష్ణుడూ అంతే. అయినా ఆతడు స్వతంత్రుడు కాబట్టి తాను నమ్మింది చెప్పగలడు. చెప్పింది చేసి చూపించగలడు. అందువలన తిక్కన ద్రౌపది ధర్మజుడి మాటనే లెక్కలోకి తీసికొంటుంది. మిగతావారిని గురించి మాట్లాడకుండా ఉండటం ఇక్కడ ప్రకరణౌచిత్యం. తిక్కన ఔచిత్య పోషణ కిది తార్కాణం.

3. వ్యాసుడు మహర్షి. ధర్మరాజు పలికిన మాటలు ధర్మార్థ సహితాలైనా అవి ఆమెకు శోకం కలిగించాయని వ్యాఖ్యానం చేశాడు. అది సత్యమే అయినా ఆమె అవివేకాన్ని బైటపెట్టినట్లుంటుందని తిక్కన ధర్మార్థ ప్రసక్తి తీసికొని రాలేదు. ఆమెకు అంతస్తాపం కలిగిందని చెప్పాడు. వ్యాసుడు చిత్రించిన ద్రౌపది

శోకమూర్తి. అశ్రుపూర్ణ నయన. మూలంలో అనుభావ సంచారిభావాలు వర్ణించబడ్డాయి. తిక్కన ద్రౌపది కన్నీటి వరకు రాలేదు. మొగం చిన్నబుచ్చుకొన్నది. మనసులో బాధపడుతున్నది. ఆ తాపానికి శరీరమంతా (మొగమంతా) నల్లబడిపోయింది. గొంతు బొంగురుపోయింది. అంటే కన్నీళ్ళు గొంతుకలోనే ఉన్నాయి కాని, ఇంకా కళ్ళల్లోకి పొంగలేదు. తిక్కనది క్రమదశావికాసస్ఫూర్తిగల అభినయ శిల్పం. రసాభ్యుదయ శిల్పంలో అది భాగం. (సంపా.)

ఉ. అంతలు సేసి పోనడిచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె? యిట్టి యూఱట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళు లేవురకు నైదు సుయోధనుఁ డిచ్చు నొక్కొ? యీ
కంత కృపావిహీనమతి నాతఁడు నొంచునె యన్నదమ్ములన్? 99

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; అంతలు+చేసి= అన్ని దుండగా లొనర్చి; పోన్+అడిచి= అడవులకు తరుమగొట్టి; సంజయు చేతన్= సంజయుడితో; చెప్పి పుత్తెంతురె?= ఉపచార వాక్యాలు చెప్పి పంపుతారా?; ఇట్టి+ఊఱటన్= ఇటువంటి ఓదార్పు మాటలచేత; యుధిష్ఠిరుండు= ధర్మజుడు; మదిన్+ప్రియము+అందెన్= మనసులో సంతోషించాడు; సుయోధనుఁడు= ఆ దుర్యోధనుడు; తాను; అంతన్+అ= అంత తేలికగా; ఏవురకున్= అన్నదమ్ములైదుగురకూ; ఊళులు+ఐదు= ఐదు గ్రామాలను; ఇచ్చును+ఒక్కొ?= ఇస్తాడా?; ఈక= ఇవ్వక; అంత కృపావిహీనమతిన్= అంత నిర్దయమైన చిత్తంతో; అతఁడు= సుయోధనుడు; అన్నదమ్ములన్= సహోదరులను; నొంచునె?= బాధిస్తాడా?

తాత్పర్యం: కౌరవులు అంతటి అకృత్యాలు చేసి, అడవులకు తరిమివేసి, నేడు సంజయుడిచేత ఊరడింపు మాటలు చెప్పిపంపుతారా? ధర్మనందనుడు ఆ మాటలకు మనసులో ఎంతో ఉబ్బిపోగా, సుయోధనుడు తనకై తాను

మనసొప్పి ఐదుమంది అన్నదమ్ములకు ఐదూళ్ళు ఇస్తాడా? ఇవ్వక దయారహిత బుద్ధితో అత డింకా ఇట్లా అన్నదమ్ములను బాధిస్తాడు కాబోలు!

విశేషం: 1. ద్రౌపది తనకు కలిగిన మనస్తాపానికి గల హేతువులను ఒక్కొక్క దానిని పేర్కొంటూ తన అభిప్రాయాన్ని శ్రీకృష్ణుడికి నివేదించుకొనటం ద్రౌపది ఉపన్యాసశిల్పంలోని మొదటి ముఖ్యాంశం. అందులో ఈ పద్యం మొదటిది.

2. ఇందులో అయిదూళ్ళడిగిన ధర్మరాజు దైన్యాన్నీ, అవి కూడా ఇవ్వని దుర్యోధనుని దౌష్ట్యాన్నీ పేర్కొంటూ 'కౌరవుల వలన పాండవులకు ఇంకా బాధలు తప్పవు కాబోలు' అని తన మనోవేదనను ప్రదర్శించింది. ఇందులో వ్యంగ్యంగా ధర్మజుడి అయిదూళ్ళ ప్రతిపాదనను ద్రౌపది గర్హిస్తున్నది. కౌరవులకు కాళ్ళిస్తున్నట్లు బాధపడుతున్నది. ఇది మనస్తాపానికి మొదటి కారణం.

3. ఈ పద్యం ప్రతిపద సార్థకం. 'అంతలు చేసి' అంటే- చెప్పలేనన్ని బాధలు పెట్టి అని భావం. 'పోనడచి' అన్నప్పుడు అన్యాయంగా రాజ్యం నుండి వెళ్ళగొట్టిన ఆ కాఠిన్యం వ్యంగ్యం. 'అక్కట!' ఇది జాలిని తెలిపేది కాదు. కౌరవుల నీతిలేని తనానికి అబ్బురపాటు వ్యక్తం చేసిన మాట. అంత చేసి, మరల సిగ్గు లేకుండా రాయబారం పంపుతారా? అని భావం. 'చెప్పి పుత్తెంతురె?' రాయబారం పంపుతారా? అని సామాన్యార్థం. కాని, కౌరవులే స్వయంగా వచ్చి క్షమాభిక్ష కోరి రాజ్యభాగం ఇవ్వవలసింది ఇవ్వకపోగా, సంజయుడితో కబురంపుతారా? అది ఆహ్వానం కాదు ప్రచ్ఛన్నమైన అపకారం. సంజయుడి రాయబారం వట్టి కన్నీటి తుడుపు. అతడి మాటలు శుష్కప్రియాలూ, శూన్య హస్తాలు, వాటికి ధర్మరాజు అమాయకుడై ఉబ్బితబ్బిబ్బయిపోయి, అయిదూళ్ళ బేరానికి దిగాడు. ఈ వరుసను ఇట్లా చెప్పటం వలన పై సన్నివేశాల కన్నిటినీ ధర్మజుడి వర్తనమే కారణమని ధ్వని. దానివలన ముఖ్యంగా ద్రౌపది హృదయతాపాన్ని పొందిందని భావం. (సంపా.)

4. ఇందు 'ఇట్టె యూఱట మదిం బ్రియమంది యుధిష్ఠిరుండు ---' అనేది అసమాపకం. తరువాతి తలంపు పైకొనటంచేత ఆ వాక్య మంతటితో ఆగింది. సహజమైన మాట వరస పాటించి చూపినాడు తిక్కన. 'సంజయుచేతఁ జెప్పి పుత్తెంతురె?' అనేచోట 'సంజయుచేత' అనే మాటలో ఊతమున్నది. ధర్మరాజును మోమాటపెట్ట గల నేర్పరిని -సంజయుడిని పంపినారే అని వారి సమయాభిజ్ఞతకూ, స్వభావగ్రహణ కౌశలానికీ, కుటిల ప్రయోగానికీ వింతపాటు. 'ఇట్టెయూఱట-యుధిష్ఠిరుండు' అనే వాక్యంలో వెక్కసపాటు. అంతలో 'తానంతనె---సుయోధనుఁ డిచ్చునొక్కొ?' అనిన సందియపాటు. 'అన్నదమ్ములన్' అనుటలో ఎత్తిపొడుపు. సహజసిద్ధమైన వాక్యరచన!' ఈ కంత కృపావిహీనమతి ---అన్నదమ్ములన్' అనుటలో ఎత్తిపొడుపు! తిక్కన రచనలో ఇటువంటి అసమాపక వాక్యాలు గల పద్యాలు ఉంటాయని, వాటిలో ఇది ఒకటనీ విమర్శకులంటారు. 'ప్రియమందె' అని ఉంటే అన్వయం సుకరం.

చ. తన మును బడ్డ బన్నములుఁ దమ్ములపైఁ గల కూర్మి పేర్మి నీ
జనపతి సైఁపకున్నె? యది సక్కన; రాజ్యము పాలులేక తీ
ఱున కొడఁబాటు గల్గిన నెఱుంగమి వెట్టరె? 'చాలరైరి వీ'
రన రొకొ? నానలేమి యని యాడరె లోకమువారు కేశవా? 100

ప్రతిపదార్థం: కేశవా!= శ్రీకృష్ణా!; ఈ జనపతి= ఈ ప్రభువైన ధర్మజుడు; తన మునుపడ్డ బన్నములున్= తా నింతవరకు పొందిన పరాభవాలు; తమ్ములపైన్+కల= తమ్ముళ్ళైన కౌరవుల మీద ఉన్న; కూర్మిపేర్మిన్= అనురాగాతిశయంచేత; సైఁపక+ ఉన్నె?= సహించకుండా ఉంటాడా? (సహిస్తాడని భావం); అది+చక్కన= అట్లా సహించటం మంచిదే; రాజ్యము పాలులేక= రాజ్యంలో భాగం లేకుండా; తీఱునకున్= సంధికి; ఒడఁబాటు+ కల్గినన్= అంగీకారం కుదిరితే; లోకమువారు= ప్రజలు; ఎఱుంగమి పెట్టరె?= పాండవులు తెలివిమాలినవారని పల్కరా?; వీరు చాలరు+ఐరి+అనరు+ ఒకొ?= వీరు యుద్ధం చేయటానికి సమర్థులు కారని అనరా?; నానలేమి+

అని+ఆడరె?= సిగ్గులేనివారని నిందించకుండ ఉంటారా?

తాత్పర్యం: కృష్ణా! ప్రభువగు ధర్మజుడు తమ్ములైన దుర్యోధనాదులైన కౌరవులమీద తనకున్న ప్రేమాతిశయంవలన తా నింతవరకు పొందిన అవమాన పరంపరలు సహించిన సహించుగాక! మంచిదే. కాని రాజ్యంలో భాగం తీసికొనకుండా వారితో పొత్తుకు అంగీకరిస్తే మాత్రంలోకులు పాండవు లెంత అవివేకులు! ఎంత అసమర్థులు! ఎంత సిగ్గులేనివారు! అని నిందించరా?

1శా. పెంపేదన్ దమకిట్టి తక్కువలు రూపింపంగ నేలా? విచా
రింపన్ వారిక మేలు సంధి; దము వారిం జూచినం దారు సా
ధింపం జాలరొ? కాక పోరఁ దగ మర్దింపం దలంపేని శం
కింపం బట్టొకొ? వారు బ్రాహ్మణులె యే కీడైన సైరింపఁగన్? 101

ప్రతిపదార్థం: పెంపు+ఏదన్= గౌరవం చెడేటట్లు; తమకున్= తమకు; ఇట్టి తక్కువలు= ఇంతటి హీనత్వములు; రూపింపంగన్+ ఏలా?= తామే నిరూపించుకొనటం ఎందుకు?; విచారింపన్= తర్కించగా; సంధి= పొత్తు; వారికిన్+అ మేలు= కౌరవులకే లాభం; తమున్ వారిన్ చూచినన్= తమనూ కౌరవులనూ పోల్చుకొన్నప్పుడు; తారు= కౌంతేయులు; సాధింపన్+చాలరొ?= కార్యం నెరవేర్చుకొనలేరా?; కాక= అట్లా పని సాధించుకొనలేకపోతే; పోరన్= రణంలో; తగన్= చక్కగా; మర్దింపన్+తలంపు+ఏనిన్= దండించే ఉద్దేశం ఉంటే; శంకింపన్+పట్టు+ఒకో!= సందేహానికి తావున్నదా? ఏ కీడు+ ఐనన్+సైరింపఁగన్= ఎట్టి దోషమైనా సహించి విడిచిపెట్టటానికి; వారు= ఆ దుర్యోధ నాదులు; బ్రాహ్మణులె?= భూసురులా?

తాత్పర్యం: గౌరవం చెడిపోయేటట్లు తాము తక్కువవార మని ఏల నిరూపించు కొనవలె? బాగా ఆలోచిస్తే సంధి కౌరవులకే లాభం. తా మెంత మాత్రమో, కౌరవు లెంతమాత్రమో పోల్చి చూచుకొంటే కౌంతేయులు కార్యం

సాధించలేరా? సంధి పొసగనప్పుడు పోరిలో వారిని దండించే తలపు వీరికి ఉంటే గెలవటంలో అనుమానానికి అవకాశమే లేదు. ఏ తప్పు చేసినా మన్నించి విడిచిపెట్టటానికి దుర్యోధనాదులు బ్రాహ్మణులా ఏమి?

విశేషం: 1. ద్రౌపది తన మనోవేదనకు గల మూడవ కారణం చెప్పుతున్నది. ఈ మనోవేదన ధర్మజుడి మాటల వలన ఏర్పడింది. ధర్మరాజు రాజ్యభాగం అర్థించటంలో తనను తాను తక్కువ పరచుకొన్నాడు. అందుకే ఆమె బాధ. కులక్షయం కాకుండా సంధి చేసికొనదలిస్తే అది పాండవులకంటె కౌరవులకే ఎక్కువ లాభం. వారందరూ ఎన్ని దుర్మార్గాలు చేసినా ప్రాణాలతో బ్రతుకుతారు. బలాబలాలతో పోల్చి చూచుకొంటే వారందరికంటె పాండవులే శ్రేష్ఠులు కదా! యుద్ధంలో ఎవరికి అపజయం కలుగుతుందో చెప్పలేమని భయపడి ఎందుకు సంధి చేయాలి?- అని ఆమె మనోవేదన. అసలు ధర్మరాజుకు యుద్ధం చేసి వారిని శిక్షించాలన్న తలపే మనస్సులో లేదు. ఉంటే ఇన్ని అనుమానాలూ, ఆలోచనలూ ఉంటాయా? అసలు సమస్య ధర్మజుడి శాంతికాముకత్వమే. అయితే, ధర్మజుడి శాంతి గుణాన్ని చూచి దుర్యోధనాదులు హర్షిస్తారా? గౌరవిస్తారా? అట్లా చేయటానికి వారు బ్రాహ్మణులు కారు కదా! - అని ద్రౌపది అధిక్షేపించింది. పాండవులు క్షత్రియుల వలె కాక బ్రాహ్మణులవలె వర్తించి తమ గౌరవాన్ని తామే జారవిడుచుకొంటున్నారని ద్రౌపది మనస్సులో వేదన పడుతున్నది. తమ ఉపాయంతో పాండవులు తమకే అపాయం తెచ్చుకొంటున్నారని ఆమె వేదన.

2. ఆత్మన్యూనతా భావం గల పాండవులకు వారి అతి సమర్థత గుర్తు చేస్తున్నది ద్రౌపది. 'విచారింపన్ వారికమేలు సంధి.' అనటంలో పాండవుల తెలివి మాలినతనాన్నీ, దూరదృష్టి రాహిత్యాన్నీ ఒక పనివల్ల కలిగే లాభాలాభాలను బేరీజు వేసికొనలేని అసమర్థతనూ వెక్కిరిస్తున్నది ద్రౌపది. తము వారిం జూచినం దారు సాధింపం జాలరొ?' -- పాండవుల ఆత్మ సామర్థ్యజ్ఞతా రాహిత్యాన్ని ఈసడిస్తున్నది. 'శంకింపం బట్టొకొ?' -- కౌరవ మర్దనమెంత ధర్మబద్ధమో నిరూపిస్తున్నది. 'వారు బ్రాహ్మణులె- సైరింపఁగన్' బ్రాహ్మణుడెంతటి పాపి

అయినా 'బ్రాహ్మణో నహంతవ్యః', అనే ధర్మసూక్ష్మాన్ని చెప్పి క్షమించటానికి వారు బ్రాహ్మణులు కారు గదా అని అడుగుతున్నది. ద్రౌపది పాండవులను కౌరవ నాశనానికి పురికొల్పేవిధం ఆమె వాక్చాతుర్యాన్ని, హేతుబద్ధతనూ నిరూపిస్తున్నది. (సంపా.)

ఉ. ఓట యొకింత యేనియు సుయోధను చిత్తమునందు లేదు; నీ
మాటలఁ బోవునే దురభిమానమ యెక్కుడు పూనుఁగాక; య
చ్చోటన సంగరంబు లగు చొప్పులు పుట్టిననైనఁ బాండవుల్
పోటున కిచ్చగింతురొకొ! పోదురొ కానల నుండ నచ్యుతా! 102

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీకృష్ణా!; ఓట= భయం; ఒకింత+ఏనియున్= రవ్వంతైనా; సుయోధను చిత్తమునందున్= దుర్యోధనుడి మనస్సులో; లేదు= లేదు; నీ మాటలన్= నీ హితవచనాలను; పోవునే= అనుసరిస్తాడా?; దురభిమానము+అ= చెడ్డ అహంకారమునే; ఎక్కుడు పూనున్+కాక= మిక్కిలి వహిస్తాడు; ఆ+చోటన్+అ= ఆ కురుసభలోనే; సంగరంబులు+అగు చొప్పులు= యుద్ధం జరిగే సూచనలు; పుట్టినన్+ఐనన్= సంభవించి నప్పటికిన్నీ; పాండవుల్= కౌంతేయులు; పోటునకున్= పోరాటానికి; ఇచ్చగింతురు+ఒకొ!= ఇష్టపడతారంటావా?; కానలన్+ఉండన్= అడవులలో నివసించ టానికి; పోదురొ!= వెళ్ళుదురో ఏమో తెలియదు.

తాత్పర్యం: కృష్ణా! సుయోధనుడి మనసులో భయం ఒకింతైనా లేదు. నీ హితవచనాలను అనుసరిస్తాడా? అంతకంతకూ దురహంకారమే ప్రదర్శిస్తాడు. ఆ కురుసభలో యుద్ధం జరిగే సూచన లేర్పడితే అప్పటికైనా పాండవులు కదనానికి సిద్ధపడతారో? వనాలలోనే వసించటానికి వెళ్ళుతారో ఏమో?

విశేషం: సుయోధనుడు రాజ్యభాగ మీయనని పరుషంగా మాట్లాడి శ్రీకృష్ణుడికి కీడు తలపెట్టినా సభను వీడిరాకుండా ఓర్పుతో నిలబడి పాండవుల సత్ప్రవర్తన సభలోనివారికి తెలిపేటట్లు మాట్లాడి రమ్మని ధర్మజు డంటున్నాడు. ఆమాటలు

ఆమెకు బాధ కలిగించాయి. దుర్యోధనుడికి 'ఓట' లేదట! లజ్జ, సిగ్గు, భయం, మొగమోటం, జంకు, గొంకు, భయం, భక్తి అనే భావాలు ఈ మాటలో స్ఫురిస్తాయి. వాటికి సంబంధించిన కొద్దిపాటి సంస్కారం కూడా లేని కరడు కట్టిన దురహంకారి దుర్యోధనుడు. అతడు మంచి మాటలతో వింటాడా? మరీ కొండెక్కి కూర్చుంటాడు. అతడు పాండవులు పనికిరానివారని భావించి యుద్ధానికి కాలుదువ్వుతాడు. అప్పుడైనా పాండవులు పౌరుషంతో యుద్ధానికి సిద్ధమవుతారా? లేదా, వంశనాశనమవుతుంది యుద్ధం వద్దని మేము ముందే అన్నాము కదా అని మాట నిలబెట్టుకొనటానికి అడవులకు పోతారా? - అని ద్రౌపది మనోవేదనతో ప్రశ్నించింది. అలనాటి కురుసభలో ప్రదర్శించిన మనః ప్రవృత్తినే ఇప్పుడు కూడా ప్రదర్శించి ధర్మరాజు రాజ్యావకాశాన్ని చేజేతులా జారవిడచుకొని మరల శాంతికై అడవులకు పోతాడేమోనని ఆమె వేదన! దీనితో ధర్మరాజు ప్రవర్తనయే ఆమె వేదనకు హేతువని తేలింది. (సంపా.)

ఉ. ఏ నిటులంటి నా వలవ; దింకను నీవును రాజుఁ దమ్ములుం
గా నుచితంబు చూచి మన కార్యము మీసుజనత్వముం జెడం
గా నొకభంగి సేయక తగం గురువర్గము తోడి సంధి మీ
కైన తెఱంగునన్ వలచినట్టుల చేయుఁడు నేర్పు లేర్పడన్. 103

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇటులు+అంటిన్+నాన్+వలవదు= నేనిట్లా మాట్లాడానని అనుకొనవద్దు; ఇంకను= మరియు; నీవును; రాజున్= ధర్మజుడూ; తమ్ములున్+కాన్= తమ్ములునూ కూడి; ఉచితంబు చూచి= తగిన పద్ధతిని పరికించి; మన కార్యమున్= మన పనియు; మీ సుజనత్వమున్= మీ మంచితనమును; చెడంగాన్= చెడిపోయేటట్లు; ఒక భంగి+చేయక= ఏదో విధంగా సరిపెట్టుకొనక; తగన్= యుక్తంగా; కురువర్గముతోడి సంధి= కౌరవులతో పొత్తు; మీకున్+ఐన తెఱంగునన్= మీకు శక్యమైన రీతిలో; వలచినట్టులు+అ= మీకిష్టమైన పద్ధతిలో; నేర్పులు+ఏర్పడన్= మీ చాతుర్యాలు వెల్లడి అయ్యేటట్లు; చేయుఁడు= చేయవలసింది.

తాత్పర్యం: అన్నా! నే నిట్లన్నానని వేరుగా తలంచవద్దు. ఇంకా నీవూ, ధర్మజుడూ, అతని తమ్ముళ్ళూ కలసి, ఏది యుక్తమో పరికించి, మన పనీ, మీ మంచితనమూ చెడేటట్లు, ఏదో ఒక విధంగా కాకుండా ఒప్పిదంగా ఉండేటట్లు, శక్యమైనంతలో మీకిష్టమైనట్లు, మీ నేర్పు తేటపడేటట్లుగా కౌరవులతో పొత్తు కుదుర్చుకొనండి.

విశేషం: ఇవి ద్రౌపది యొక్క గూఢామర్షోక్తులు. విపరీతవ్యంగ్యోక్తులు. మగవారు తన గోడు పట్టించుకొనకుండా తమకు తోచిన పనులు నిరంకుశంగా చేసికొంటూ పోతూంటే, తన మాట సాగదని తెలిసి కూడా, వ్యంగ్యోక్తులతో మెత్తని నిష్ఠురాలాడే అభిమానవతి పలికే కాకూక్తు లివి. ద్రౌపది అనే మాటలకు అర్థాలు విపరీతంగా ఉంటాయి. అట్లా ఉండేటట్లు మాట్లాడటమే కాకువు.

1. నేనిట్లా అంటున్నానని మీరేమీ అనుకొనవద్దు- అంటే ధర్మరాజు చేస్తున్న సంధి యత్నాన్ని కాదన్న దానికి తప్పుపట్టబోకండి, నిరసించబోకండి. కాని, మాటలలోని వాస్తవాన్ని, నా మనసులోని బాధను గమనించండి. నా మాటలు నా మనసుకు తేటలు. వాటిని పట్టించుకొనటం కనీస కర్తవ్యం - అని భావం.

2. ఇంకను- మరింకొకమాట. ఇది నా సొంత గోడని అనుకొంటారేమో. అయినా నేను అనుకొంటున్న విషయాన్ని మీకు తెలుపుతున్నాను వినండి.

3. కృష్ణా! ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నం నీవూ, పాండవులూ కలిసి రాజనీతికి ఉచితంగా చేస్తున్న కార్యం. కాదనటానికి నేనెవరిని? ఏమైనా, మీరు చేసే కార్యంలో మీ మంచితనంతో అందరూ మెచ్చుకొనే పద్ధతినే అవలంబిస్తారు కాని, నేను పడ్డపాట్లు మీకు జ్ఞాపకముండవు. అయినా, మీమీ ప్రయోజనాలు చెడకుండా కౌరవులతో సంధిని మీ నేర్పరితనం వాసికెక్కేటట్లు, మీకు కావలసినట్లు చేసి కొనటమేగా నేను కోరేది? - అని ద్రౌపది నిష్ఠురంగా మాట్లాడింది. ఈ సంధి ప్రయత్నం వలన పాండవులు మంచివార నిపించుకొంటారేమో కాని, నేను మాత్రం వారు మంచిపని చేస్తున్నారని అనలేను. నే ననకపోయినంత మాత్రాన ఎవరికి కావాలి? - అని ఎత్తిపొడుపు మాటలంటూ

తన అభిప్రాయానికి కూడా తగినంత విలువ ఇవ్వటం కనీస కర్తవ్యమనీ, అది ఇంతవరకు పాండవుల మనసులలోకే రాలేదనీ, ఆత్మీయుడైన శ్రీకృష్ణుడితో మనవి చేసికొంటున్నది ద్రౌపది. గూఢాధిక్షేపోక్తులతో గూఢాభిమానాన్ని ప్రదర్శించిన గొప్ప పద్యం ఇది. ఇంతవరకు ధర్మజుడి సంధి యత్నాన్ని నిరసించింది. ఇకపై తన మనస్తాపాన్ని పరిగణనంలోకి తీసికొనని పరిస్థితికి పరితాపాన్ని వ్యక్తం చేస్తున్నది.

4. ద్రౌపది తన ఒక్కతెపైనా పూర్తి బాధ్యతను పెట్టుకొనటంలేదు. ఏదయినా జరగకూడనిది జరిగితే, నింద తన ఒక్కతె మీదనే పడుతుంది. ద్రౌపది గడుసరి మాటనేర్పూ, వ్యవహారజ్ఞానమూ అద్భుతాలు. తమ కార్యమూ చెడకూడదు. వారి మంచితనమూ, పౌరుషమూ చెడకుండా సంధికార్యాన్ని నిర్వహించాలట! తాను కర్తవ్యబోధ చేస్తూనే, మీకు నచ్చినట్లు, నేర్పుతో చక్కబెట్టండి అంటోంది. ఆమె వాక్చైపుణ్యం ప్రశంసనీయం.

వ. అని మఱియు నిట్లనియె. 104

తాత్పర్యం: అని ఇంకా ద్రౌపది ఇట్లా మాట్లాడింది :

ఉ. ఆఱడిఁ బోకయున్ ఫలము నందుటయుం గని పల్కనేరమిన్
మాఱట నోరి దాననయి మాటలు చిత్తమునందు నిల్ప కేఁ
గాఱులు ప్రేలెదన్; వినుఁడు; కర్జము నెగ్గును గాన నల్కమై,
వీఱిఁడి యైన మానిసికి వెండి వివేకము గల్గనేర్చునే? 105

ప్రతిపదార్థం: ఆఱడిన్+పోకయున్= నిందలపాలగుటయు; ఫలమున్+ అందుటయున్= ప్రయోజనం సిద్ధించటమూ; కని= చూచికూడా; పల్కన్+ నేరమిన్= (భర్తలు) మాటాడకపోవటం చేత; మాఱటనోరిదానన్+అయి= ఆడినమాటనే ఆడెడి దాననయి; చిత్తము నందున్= మనస్సులో; మాటలు నిల్పక= మాటలు దాచుకొనక; ఏన్= నేను; కాఱులు ప్రేలెదన్= ఏమిటో వదరుతున్నాను; వినుఁడు= నా మాట లాలకించండి; అల్కమైన్= కోపంచేత;

కర్జమున్+ఎగ్గున్, కానన్= చేయవలసిన దానిని, హానిని తెలియలేను; వీఱిఁడి+ఐన+మానిసికిన్= వెఱ్రిపట్టిన మనిషికి; వెండి= మరల; వివేకము= యుక్తాయుక్తపరిజ్ఞానం; కల్గన్+నేర్చునే?= సమకూడగలదా?

తాత్పర్యం: నేను అల్లరి పాలవటమూ, తత్ఫల మనుభవించటమూ చూచి కూడా 'పల్కనేరమి'కి కర్త నేను అనటం కంటె, పాండవులనటమే మేలు. నా భర్తలు మాటాడక పోవటంచేత, ఆడినమాటనే మళ్ళీ మళ్ళీ ఆడే దాననయి, మాటలను మనస్సులోనే నిల్పలేక, నేను ఏదో నోటికి వచ్చినట్లు మాటాడుతున్నాను. వినండి. కోపోద్రేకం చేత ఏది కార్యమో, ఏది అకార్యమో తెలియకున్నాను. అవివేకి అయిన మానిసికి మళ్ళీ వివేకం కలుగుతుందా? (ఈ మాటలు మూలంలో లేవు.)

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. 1. తన బాధను గాని, మాటనుగాని పట్టించుకొనని ధర్మజుడి వైఖరిమీద ద్రౌపది వ్యంగ్యమైన వాఙ్మయాస్త్రాలు ప్రయోగిస్తున్నది. అన్నీ విపరీత వ్యంగ్యార్థక కాకువులు.

2. కార్యాకార్య వివేకుడై ధర్మరాజు ఆచితూచి మాట్లాడుతాడు. ఆమాట బైటికి అనకుండా 'నాకు మంచీ చెడులూ తెలిసికొని మాట్లాడటం చేతకా'దని ద్రౌపది అంటుంది. అంటే. ఆమెకు చేతకాదని కాదు, చేతకాదని ధర్మరాజాదులు అనుకొంటారు కాబట్టి, తన మాటలు పట్టించుకొనరు కాబట్టి ఆ మాట అన్నది. పైకి వినయంగానూ లోన వేదనగానూ వినపడుతుం దీ వాక్యం.

3. మాట దాచుకోలేక పైకి బడబడ మాట్లాడే మనిషట ద్రౌపది! ఇది ధర్మరాజు ప్రవృత్తికి సాక్షాత్ విరుద్ధం. అదే అందులోని అధిక్షేపం. ధర్మజుడు బైటపడడు, ద్రౌపది బైటపడుతుంది. ఆమె చెడ్డదనిపించుకొంటుంది. అసలు మౌనంగా చేసేది ధర్మరాజే అని ఆమె ఆక్షేపం.

4. ఇటువంటి దాననైనా నామాట కాస్త వినండి-అని నిష్ఠురమాడింది. నామాట త్రోసివేయదగింది కాదని మందలింపు అందులో ధ్వని.

5. నాకు మంచి చెడ్డలు తెలియవు అనటం కూడా గడుసరిదనమే. మంచిచెడ్డలనేవి పురుష ప్రమాణంతో నిర్ణయించేవి కావనీ, అవమానాల పాలైన తనను దృష్టిలో ఉంచుకొని నిశ్చయించండనీ ద్రౌపది మనవి చేసింది.

6. 'కోపంతో వెఱ్రిదాన్ని అయిపోయిన నావంటి మనసున్న దానికి వివేకం ఉంటుందా?' అని అర్థాంతరన్యాసాలంకారం వలె మాట్లాడింది. ఆమె మాటలు అరణ్య రోదనలుగా మారటానికి గల కారణం ఆమె మనసులోని మాటను మన్నించకపోవటమే అని తన మనోవేదనను వ్యక్తం చేసింది.

7. 'కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ' అని కదా న్యాయం. సంధి విషయంలో పాండవ పత్ని అయిన ద్రౌపది యొక్క సలహా అడగలేదని అభిమానంతో అన్నమాట ఇది! ధర్మజుడి నిర్ణయమే అందరి నిర్ణయమన్న నిరంకుశ వైఖరిని ఆమె ఆత్మన్యూనతాభావ ద్యోతకమైన వ్యంగ్యాధిక్షేపోక్తులతో నిందించటం ఇందులోని సంభాషణ శిల్పం. (సంపా.)

8. మూలం: పునరుక్తంచ వక్ష్యామి విశ్రమ్భేణ జనార్దన- కాతు సీమన్తినీ మాదృక్ పృథివ్యా మస్తి కేశవ- "మాఱట నోరి దానవయి -----

చ. వరమునఁ బుట్టితిన్, భరత వంశముఁ జొచ్చితి, నందుఁ బాండుభూ
వరునకుఁ గోడలైతి, జనవంద్యులఁ బొందితి, నీతి విక్రమ
స్థిరులగు పుత్త్రులం బడసితిన్, సహజన్ముల ప్రాపు గాంచితిన్
సరసిజనాభ! యిన్నిటఁ బ్రశస్తికి నెక్కినదాన నెంతయున్. 106

ప్రతిపదార్థం: వరమునన్+పుట్టితిన్= దేవతా వరప్రసాదాన జన్మించాను; భరత వంశమున్+చొచ్చితిన్= భరతుడు మూల పురుషుడుగా గల కురు వంశమునందు మెట్టాను; అందున్= ప్రసిద్ధమైన ఆ కురువంశంలో కూడ; పాండు భూవరునకున్= పాండు మహారాజునకు; కోడలు+ఐతిన్= కోడల నైనాను; జనవంద్యులన్= ప్రజలచేత నమస్కరించదగినవారిని; పొందితిన్= పతులుగా పడశాను. నీతి విక్రమస్థిరులు+అగు= రాజనీతిలో, పరాక్రమం

లోనూ చలించనివారైన; పుత్త్రులన్+పడసితిన్= కొడుకులను కన్నాను; సహజన్ముల ప్రాపు+కాంచితిన్= సోదరుల యొక్క అండగలదాన నైనాను; సరసిజనాభ!= (కమలము నాభియందుగల) శ్రీకృష్ణా!; ఇన్నిటన్= ఇన్ని విధాల; ఎంతయున్= మిక్కిలి; ప్రశస్తికిన్+ఎక్కినదానన్= ప్రఖ్యాతి పొందాను.

తాత్పర్యం: కృష్ణా! నేను దేవతావర ప్రసాదం వలన జన్మించాను. భరతవంశం మెట్టాను. భరతకుల ప్రసిద్ధుడైన పాండు మహారాజుకు కోడలినైనాను. జనులచేత నమస్కరించదగిన భర్తలను పొందాను. రాజనీతి లోనూ, శౌర్యంలోనూ చలించని ఉత్తమ పుత్త్రులను కన్నాను. తోబుట్టువుల తోడు నాకున్నది. ఇన్ని విధాల నేను ప్రఖ్యాతి గడించాను.

విశేషం: 1. ధర్మరాజు ద్రౌపది చింతను పరిగణనంలోనికి తీసికొనటం లేదని ద్రౌపది మనోవేదన. దానిని మరింత మండించే లక్షణం ఆమె అస్తిత్వాన్నీ, వ్యక్తిత్వాన్నీ లెక్కించక పోవటం. అందుకని ఇంత అవజ్ఞకు గురి అయిన తనను గురించి తానే చెప్పుకొంటున్నది. ఇది అహంకారంతో చెప్పుకొనేది కాదు. తనంతట తానే చెప్పుకొని ఎదుటివారి మన్ననల కొరకై పాటుపడవలసిన దైన్యాన్ని ఎత్తిచూపి, ఎదుటివారిని ఎత్తిపొడవటానికి వాఙ్మయాస్త్రంగా ప్రయోగించటానికి అన్నది. అప్పటి రాజనీతిలో తన మనోభావానికి కూడా తగినంత గౌరవస్థానం ఇవ్వాలని ఒత్తిడి తేవటానికి ఈ పద్యం అన్నది. ఇది మానోక్తికి మధురోదా హరణం.

2. ఉత్తమ ఇల్లాలికి గౌరవ ప్రమాణాలు ఆరు. (1) పుట్టుక (పుట్టింటి) గౌరవం, (2) మెట్టినింటి గౌరవం. (3) అత్తామామల గౌరవం (4) భర్త గౌరవం, (5) సంతాన గౌరవం, (6) పుట్టింటి సహకార గౌరవం. ఈ షడ్గౌరవాలు పరిపూర్ణంగా గలది ద్రౌపది అని వరుసగా పేర్కొన్నది.

3. ద్రౌపది వాక్కులలో అహంకారం కంటె అభిమానం అధికంగా ధ్వనిస్తున్నది. (సంపా.)

4. పైపెచ్చు ఆమె అయోనిజ. ద్రుపద మహారాజు తపఃఫలం. వరమున పుట్టిన పుణ్యవతి. అట్టి సహధర్మచారిణి అభిప్రాయాన్ని, సలహాలను అవజ్ఞ చేయటం అసమంజసం. పాండవులు ఆ పొరపాటు చేశారని ఈ పద్యంలో చెప్పింది. శ్రీకృష్ణుణ్ణికూడా అటువంటి పొరపాటు చేయవద్దని తరువాత పద్యంలో హెచ్చరించబోతున్నది.

5. దీనికి మూలము.

సుతా ద్రుపదరాజస్య వేదిమధ్యాత్ సముత్థితా,
ధృష్టద్యుమ్నస్య భగినీ తవ కృష్ణ ప్రియా సఖీ ॥

ఆజలాఢ కులం ప్రాప్తా స్నుషా పాణ్డోర్మహాత్మనః,
మహిషీ పాణ్డు పుత్రాణాం పఞ్చేంద్ర సమవర్చసామ్ ॥

సుతా మే పఞ్చభి ర్వీరైః పఞ్చ జాతా మహారథాః
అభిమన్యు ర్యథా కృష్ణ తథా తే తవ ధర్మతః, ॥ (సం.3-80-21,22, 23)

వ. అట్లుంగాక. 107

తాత్పర్యం: అంతమాత్రమే కాకుండా.

ఉ. నీవు సుభద్రకంటెఁ గడు నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు; దిట్టి ననుఁ బంకజనాభ! యొకండు రాజసూ
యావభృథంబు నందు శుచియై పెనుపొందిన వేణి వట్టి యీ
యేవురుఁ జూడఁగా సభకు నీడ్చెఁ; గులాంగన ని ట్లొనర్తురే? 108

ప్రతిపదార్థం: పంకజనాభ!= పద్మము నాభియందు కలవాడా, శ్రీకృష్ణా! నీవు సుభద్ర కంటెన్= నీ చెల్లెలైన సుభద్ర కంటెను; కడున్= మిక్కిలి; నెయ్యమున్= స్నేహమూ; గారవమున్= గౌరవమూ; తలిర్పన్= అతిశయించగా; సంభావన చేయుదు(వు)= నన్ను ఆదరిస్తావు; ఇట్టి ననున్= నీ మన్ననకు పాత్రురాలనైన నన్ను; ఒకండు= నోటితో ఉచ్చరించరానివాడైన

దుశ్శాసనుడు; రాజసూయ+అవభృథంబునందున్= రాజసూయ యాగదీక్షానంతరం చేసే మంగళ స్నానంచే; శుచి+ఐ= పవిత్రమై; పెనుపు+ ఒందిన= మహిమ గాంచిన; వేణిన్+పట్టి= నా జడను పట్టుకొని; ఈ ఏవురు+చూడఁగాన్= ఈ భర్త లైదుగురూ చూస్తూ ఉండగా; సభకున్+ ఈడ్చెన్= సభలోని కీడ్చి తెచ్చాడు; కుల+అంగనన్= ఇల్లాలిని; ఇట్లు+ ఒనర్తురే?= ఇంతటి అవమానానికి గురిచేస్తారా?

తాత్పర్యం: పద్మనాభా! నీవు నన్ను నీ చెల్లెలు సుభద్రకంటె మిక్కిలి స్నేహ గౌరవాలతో ఆదరిస్తావు. ఇట్లాంటి నన్ను రాజసూయ యజ్ఞదీక్షానంతరం కావించిన మంగళ స్నానంతో పావనమై, మహిమ గాంచిన నా జడ పట్టుకొని ఒకానొకడు నా పతులైదుగురూ చూస్తుండగా కొలువులోనికి ఈడ్చి తెచ్చాడు. ఇల్లాలిని ఇట్లా పరాభవిస్తారా? నీవే చెప్పుము.

విశేషం: 1. శ్రీకృష్ణుడితో ఆత్మీయత ఉట్టిపడేటట్లు ద్రౌపది పలికిన గొప్పపద్య మిది. రసధ్వని రమణీయం. ప్రతిపదసార్థక రచన.

2. శ్రీకృష్ణుడు సుభద్రకంటె ప్రేమగా, ఆదరంగా ద్రౌపదిని చూచేవాడట. అది నిజం. సుభద్ర స్వంత చెల్లెలు. ఆమె యోగక్షేమాలన్నీ శ్రీకృష్ణుడే చూచాడు. రహస్యంగా అర్జునుడికిచ్చి వివాహం కూడా చేశాడు. అయినా, ఆయనకు ద్రౌపదంటే అంతకంటె ప్రేమ. కురుసభలో ఆమెను అవమానం నుండి రక్షించాడు. ఆమెను కనురెప్పవలె కాపాడుతూ ఆమెను గౌరవంగా మర్యాదలిచ్చి మన్నిస్తాడు. పాండవులకంటె శ్రీకృష్ణుడికి ఆమెయందు ఆదరణం అధికం. పాండవు లామె కష్టనిష్ఠురాలను పట్టించుకొనరు కాని, శ్రీకృష్ణుడు వాళ్ళవలె ఉండడు, ఉండకూడదు అని ఆమె అభిమతం. శ్రీకృష్ణుడికి అభిమాన పాత్రురాలు కావటం ఆ తరంలో గొప్ప అదృష్టం. గొప్ప యోగ్యత. అందుకే 'పంజకనాభ! అట్టి నన్ను' అని అనగలిగింది సార్థకంగా, సాభిమానంగా, చనువుగా.

3. అట్టి ఆమెను ఒకడు జుట్టుపట్టి సభకు లాగికొని తెచ్చాడని అన్నది. ఒకడు అనే మాటకు అల్పుడు, ఏకాకి, పేరుచ్చరించరాని పాపి - అనే అర్థాలు ఈ ప్రకరణంలో సరిపోతాయి. శ్రేష్ఠుడనే అర్థం ఉన్నా ఇక్కడ అది పొసగదు. ఆ ఒకడు దుశ్శాసనుడు.

4. ఒక అల్పుడు - మహాపరాక్రమవంతులైన 'ఈ యేవురు' (అని పాండవులవైపు చూపించి అనే అభినయాత్మక వాచకం) ఏమీ చేయలేక కళ్ళప్పగించి చూస్తూ ఉండగా, ఆమె కేశపాశాన్ని పట్టి లాగాడట! ఆ కేశపాశం సామాన్యమైనదా! రాజసూయయాగం చేసి, పరిసమాప్తిలో పవిత్రమైన అవభృథ స్నానం చేయడం చేత పవిత్రమైనది. సమ్రాజ్ఞి అర్హత పొందిన ఆ కేశం ఆమె సుమంగళీత్వానికి చిహ్నం. దాన్ని కించపరిచేటట్లు దుశ్శాసనుడు లాగాడని జ్ఞాపకం చేసింది. ఆ చేష్ట వెనుక ఉన్న కౌరవుల క్రౌర్యం తల పోసింది. పాండవుల నిస్సహాయ స్థితికి నిట్టూర్చింది. కృష్ణుడి దయకు ధ్వనిమయంగా కృతజ్ఞత చెప్పింది. 'ఇల్లాలిని ఇట్లా చేస్తారా?' అని ప్రశ్నించింది. 'ఇట్లు' అనే మాట చాలా విలువైనది. కౌరవులు పరుల ఇల్లాలిని ఇట్లా అవమానిస్తారా? అని, పాండవులు తమ ఇల్లాలిని అట్లా అగచాట్ల పాలుపడనిస్తారా? అని ఉభయులను మందలించింది. అసలు ఇల్లాళ్ళను ఇటువంటి అవమానాల పాలు చేసే వారితో పాలు పంచుకోబోతారా? అని అందరినీ ప్రశ్నించింది. దాని సమాధానం కొరకు శ్రీకృష్ణుడివైపే చూచింది. ఇది మానసిక వేదనను పతాక స్థానాన్ని చేర్చే ప్రశ్న.

5. సంధి వద్దని నేరుగా చెప్పక, ద్రౌపది ఈ విధంగా మాటాడటం వలన సంధిగాక యుద్ధమే అవశ్యం జరగాలని ఆమె అభిప్రాయంగా శ్రీకృష్ణుడు గ్రహించగలడు. 'నీ చెల్లెలు సుభద్రకే ఇటువంటి అవమానం జరిగితే నీవు ఊరుకొంటావా? మరి నీవు నన్ను అంతకంటె మిన్నగా ఆదరిస్తావు కదా! నా విషయంలో ఉపేక్షించవచ్చా?' అని ఆమె హృదయం.(సంపా.)

ఉ. ఆ సభ కేకవస్త్ర యగు నట్టి ననుం గొనివచ్చి నొంచు దు
శ్శాసనుఁ జూచుచుం బతు లసంభ్రములై తగుచేష్ట లేక నా

యాసలు మాని చిత్రముల యాకృతి నున్న యెడన్ ముకుంద! వి
శ్వాసముతోడ నిన్ గొలువ వచ్చె మనం; బదియుం దలంపవే. 109

ప్రతిపదార్థం: ముకుంద!= కృష్ణా!; ఆ సభకున్= ఆ కురుసభలోనికి; ఏకవస్త్ర+అగునట్టి ననున్= రజస్వలనైన నన్ను; కొని వచ్చి= ఈడ్చి తెచ్చి; నొంచు= బాధిస్తున్న; దుశ్శాసనున్+చూచుచున్= దుస్ససేనుడి దుండగం చూస్తూ; పతులు= నా భర్తలు; అసంభ్రములు+ఐ= తొట్రుపాటు చెందనివారై; తగుచేష్ట లేక= తగిన చర్య గైకొనక; నా+ఆసలు మాని= నాపై తమ ఆశలు వదలుకొని; చిత్రముల+ఆకృతిన్= బొమ్మల ఆకారంతో - నిశ్చేష్టులై; ఉన్న+ఎడన్= ఉన్నట్టి సమయంలో; విశ్వాసము తోడన్= నమ్మికతో; మనంబు= నా హృదయం; నిన్+కొలువన్+వచ్చెన్= నిన్ను సేవించటానికి వచ్చింది; అదియున్+తలంపవే= ఆ విషయాన్ని కూడా స్మరించుము.

తాత్పర్యం: ముకుందా! ఆ నాడు కురుసభకు ఒంటి చీరతో ఉన్న (బైటచేరి ఉన్న) నన్ను బలాత్కారంగా లాగితెచ్చి దుశ్శాసనుడు బాధిస్తుంటే నా భర్తలు దిగ్భ్రాంతి పొంది ఏమీ చెయ్యలేక నా మీది ఆశలు వదలుకొని చిత్రాలవలె కదలక మెదలక ఉండగా నమ్మికతో నా మనస్సు నిన్ను భజించటానికి పూనుకొన్నది. ఆ విషయాన్ని నీవు సంధి కుదిర్చేవేళ జ్ఞప్తికి తెచ్చుకో!

విశేషం: 1. సభానీతి లేక రాజనీతిని గురించి పై పద్యంలో మాట్లాడి, కుటుంబ నీతికి వెలియైన రాజనీతిని గురించి ఇక్కడ పేర్కొంటున్నది ద్రౌపది. ఏకవస్త్ర (ముట్టయిన) అయిన స్త్రీని పురుషుడు తాకరాదు. ఆమెను బాధపెట్టరాదు. ఇది కుటుంబ నీతి, గృహనీతి. దీనిని రాజనీతితో ధ్వంసం చేయటం అవినీతి. దుశ్శాసనాదులు చేసిన అవినీతి దండార్హం. అయినా, దానిని పాండవులు చూస్తూ, ఎటువంటి ప్రతిస్పందన లేకుండా, ఆశలు వదలుకొని, బొమ్మలవలె కూర్చున్నారు. చక్కని నాటకీయ సన్నివేశ స్ఫూర్తి. అట్టి దయనీయ సమయంలో విశ్వాసంతో తలచినంతమాత్రంలోనే శ్రీకృష్ణుడు ఆమెను కాపాడాడు. దానిని గుర్తుంచుకొనమంటున్నది ద్రౌపది.

2. 110వ పద్యంలో శ్రీకృష్ణుడికి తనపై నిజసోదర నిర్విశేషమైన ఆదరం ఉందని చెప్పి, యిప్పుడు ఈ పద్యంలో తనకు శ్రీకృష్ణుడిపై ఎంత విశ్వాసమో చెప్తుతోంది ద్రౌపది. ఆ సమయంలో నిజ భర్తలకు తన యెడగల ఉపేక్షాభావం చేత, ఆమె నిస్సహాయత ఎవరికైనా జాలి కలిగిస్తుంది. 'అదియుం దలంపవే' - సంధి కుదిర్చేటప్పుడు అవన్నీ మనసులో పెట్టుకొని ప్రయత్నిస్తే, అది ఎట్లాగూ కుదిరేది కాదు. శ్రీకృష్ణుడికే సంధి కుదర్చటం ఇష్టంకాదు. అది అతని పూర్వపు మాటలలో తెల్లమైంది. ఇప్పుడు ద్రౌపదికి కూడా సంధి ఇష్టం కాదని స్పష్టమౌతున్నది.

3. ఇందులో చక్కని ధ్వని ఉన్నది. 'ప్రస్తుత సంధి ప్రయత్నంలో కూడా- కౌరవుల చేత అవమానించబడిన నేను పరోక్షంగా- అదే స్థితిలో నేటికీ ఉన్నాను. సంధి చేయటం నన్ను నిండుకొలువులో అవమానించడం వంటిదే' అని ధ్వని. ఆనాడు మిన్నక కూర్చున్నారు పాండవులు. ఈ రోజు కూడా తనను పట్టించుకొనక, తనను అవమానం నుండి రక్షించక, తమ మంచితనం కొరకు దుర్మార్గులతో స్నేహం చేయబోతున్నారు. వారితో కలిసి బ్రతకాలని భావిస్తున్నారు. ఈ పరిస్థితులలో ద్రౌపది ఆనాటి వలెనే శ్రీకృష్ణుడితో తన మొర చెప్పుకొంటున్నది. ఆనాడు శ్రీకృష్ణుడు ఆమెను ఎట్లా ఆదుకొన్నాడో, అట్లాగే ఇప్పుడూ అట్టి ప్రేమతో ఆదుకొనవలెనని ప్రార్థిస్తున్నది. ఆనాటి సభకూ ఈనాటి సభకూ చక్కని సామ్యాన్ని ధ్వనింపచేసిన ద్రౌపది వాక్కులు ఆలోచనామృతాలు.

4. అర్థవ్యక్తి అనే శబ్దార్థగుణ స్వభావాలు ఈ పద్యంలో హృద్యంగా రాణిస్తున్నాయి. (సంపా.)

చ. అరయమిఁ జేసి కోడ లన కప్పుడు దాసిగఁ జేసి; నమ్మహా
పురుషుని పాలికిం బతులు వోవఁగ వీరలతోన యేను జె
చ్చెరఁ జని కోటరంబు దగఁ జేయుదునో? యటుఁగాక పాడిమై
వరవుడ మోపి చేయుదునొ వారికి మాధవ! నిశ్చయింపుమా!' 110

ప్రతిపదార్థం: మాధవ!= లక్ష్మీవల్లభా!; అరయమిన్+చేసి= ముందు వెనకలు విచారించక; కోడలు+అనక= కోడలు అని కూడా భావించక; దాసిగన్+చేసెన్= నన్ను ఊడిగపుదానిగ చేశాడు; ఆ+మహాపురుషుని పాలికిన్= ఆ దొడ్డ మనిషి ధృతరాష్ట్ర మహారాజు కడకు; పతులు పోవఁగన్= నా భర్తలు వెళ్ళగా; వీరలతోన్+అ= వీరి వెంటనే; ఏను= నేను; చెచ్చెరన్+చని= శీఘ్రముగా పోయి; వారికిన్= ఆ పెద్దలకు; కోటరంబు= కోడరికము; తగన్+చేయుదునో= చక్కగా చేయవలెనో; అటుఁగాక= అలా కాకుండా; పాడిమైన్= న్యాయముతో; వరవుడము= దాస్యము; ఓపి= సహించి; చేయుదునొ= చేయవలెనో; నిశ్చయింపుమా= నీవే నిర్ణయించవలసినది.

తాత్పర్యం: అన్నా! ముందు వెనుకలు ఆలోచించక కోడలని కూడా భావించక అప్పుడు నన్ను దాసిని గావించిన ఆ పెద్దమనిషి ధృతరాష్ట్ర మహారాజు దగ్గరకు నా భర్తలు వెళ్ళగా, వారి వెంట నేను కూడా వెళ్ళి ఆ పెద్దలకు కోడరికము చేయాలో లేక న్యాయప్రకారం వారికి దాస్యమే చేయాలో నీవే నిర్ణయించి చెప్పుము.'

విశేషం: 1. ఈ పద్యం ఒక కీలకాంశం. ద్రౌపది సమయోచిత ప్రతిభకు మచ్చుతునక. సభాపర్వంలో 'మున్ను తన్నోడి ఆపైన నన్నోడెనా? నన్ను మున్నోడి విభుఁడు ఆమీద తన్నోడెనా?' అని అడిగిన చిక్కుముడి ప్రశ్నవంటిది.

2. హస్తినాపురంలో జరిగిన మాయా ద్యూతంలో ధర్మజాదులు ఓడి దాసులయ్యారు. ద్రౌపదిని దాసిగా భావించి కౌరవులు అవమానించారు. దానిని ధృతరాష్ట్రుడు గమనిస్తూనే కిమ్మనకున్నాడు. ఆపైన రాజ్యాన్నిచ్చాడు. పాండవులు ప్రభువులైనారు. ద్రౌపది రాణి అయింది. ఆపైన పునర్ద్యూతంలో ఓడి అరణ్యాజ్ఞాతవాసాల పాలయ్యారు. ఆ పరిస్థితులకూ ధృతరాష్ట్రుడు సాక్షిగా నిలిచాడు. 'ఒకవేళ ఇప్పుడు హస్తినాపురికి పోతే పాండవుల స్థితి ఏమిటి? రాజ్యాన్ని వదలిపోయిన పాండవులకు రాజ్యమున్నట్లా? లేనట్లా? దుర్యోధన ధృతరాష్ట్రులు ఇస్తేనే ఉన్నట్లా? ఇవ్వకపోతే లేనట్లా? ఒకవేళ రాజ్యభాగం ఇవ్వకపోయినా, వారితో కలిసి ఉండే సంధి కుదిరితే ధృతరాష్ట్రుడి సమ్ముఖంలో పాండవుల అధికారమేమిటి? రాజ్యంలేని రాజులా? ఇచ్చిన రాజ్యాన్ని కోల్పోవటం ద్వారా వారు దాసులుగానే పరిగణించబడతారా? రాజ్యం స్వీయాధికారం వలన ఏర్పడేదా? కౌరవుల దయాభిక్షవలన కలిగేదా? ఇంతటి సందిగ్ధావస్థలో పాండవులు ధృతరాష్ట్రుడి మందిరానికి పోతే వారెట్లా మెలగుతారో, మెలగరాదో వారికే ఏమైనా నిశ్చితాభిప్రాయం ఉన్నదో లేదో నాకు తెలియదు. కాని, నేను ధృతరాష్ట్రుడికి కోడరికం చేయాలా? దాస్యం చేయాలా? అన్నది నీవే నిశ్చయించి చెప్పు'మని శ్రీకృష్ణుడిని వేడింది. స్వాభిమానాన్ని సర్వనాశనం చేసే సంధిని ఆమె అంగీకరించదు. ఆమె మనోవేదన పాండవులకు పట్టదనీ, దానిని శ్రీకృష్ణుడే పట్టించుకొని తగిన పరిష్కారం చూపించాలనీ ఆమె పరితాపం. (సంపా.)

వ. అని యట్లుగ్గడించి. 111

తాత్పర్యం: అట్లా పలికి.

ఉ. ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి, వెండ్రుకల్
దా వలచేతఁ బూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాద రోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై. 112

ప్రతిపదార్థం: ద్రోవది= ద్రౌపది; బంధురంబు+అయిన= ఒప్పిదమైన; క్రొమ్ముడిన్= క్రొత్త సిగముడిని; గ్రమ్మన= శీఘ్రంగా; విడ్చి= విప్పి; వెండ్రుకల్= శిరోజాలు; తాన్= తాను; వలచేతన్+పూని= కుడిచేతపట్టుకొని; అసిత+ఛవిన్= నల్లని కాంతితో; పొల్చు= ఒప్పు; మహాభుజంగమో= గొప్ప సర్పమేమో; నాన్= అన్నట్లు; విలసిల్లి= ప్రకాశించి; వ్రేలఁగన్= వ్రేలాడుతుండగా; మనంబునన్= తన హృదయంలో; పొంగు= అతిశయిస్తున్న; విషాదరోషముల్= దుఃఖమూ కోపమూ; కావఁగన్+లేక= అణచుకొనలేక;

బాష్పములు= కన్నీరు; క్రమ్మఁగన్= కన్నులలో ఆవరించగా; ఆర్త+ఐ= దుః ఖితురాలై; దిగ్గనన్+లేచి= తటాలున లేచి.

తాత్పర్యం: ద్రౌపది తన ఒప్పిదమైన అప్పుడే వేసుకున్న కొప్పును గ్రక్కున విప్పి, శిరోజాలను కుడిచేతదాల్చి నల్లని రంగుతో నిగనిగలాడే పెద్ద పామువలె ప్రకాశిస్తూ వ్రేలాడుతుండగా తన హృదయంలో చెలరేగు దుఃఖాన్నీ, క్రోధాన్నీ ఆపుకొనలేక కనులలో అశ్రువులు నిండగా విలపిస్తూ తటాలున లేచి దుః ఖితురాలై. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: 1. అలం: ఉత్ప్రేక్ష. శ్రీకృష్ణుడి ఎదుట ద్రౌపది తన మనోగత వేదనను ప్రదర్శించిన మాటలతో పాటు ఆమె చేష్టలను కూడా వర్ణించిన పద్యాలలో ఇది ఆణిముత్యం.

2. ద్రౌపది ఉపన్యాసంలో తిక్కన చేసిన వర్ణనగా నిలిచిన పద్యం ఇది ఒక్కటే. మిగిలినవన్నీ ద్రౌపదీ సంభాషణలే. ఈ పద్యం నాటకీయతలోని ఆంగిక, ఆహార్య, సాత్త్వికాభినయాల సంపుటి. అందువలన అభినయం రీత్యా ఒక ప్రత్యేక స్థానం దీనికి ఉన్నది. తెలుగు సాహిత్యంలోని మంచి పద్యాలలో ఇది ఒకటిగా ఆంధ్రులు భావిస్తారు.

3. ద్రౌపది కురుసభలో పొందిన అవమానానికి ప్రత్యక్ష ఉద్దీపన విభావం ఆమె దీర్ఘ శిరోజవేణి. ఆమె శిరోజాలు అవభృథస్నానపూతమైనవి. అవి దుశ్శాసనుడి కరస్పర్శతో అపవిత్రమయ్యాయి. ఆ అవమానానికి తగిన ప్రతీకారంకొరకు ఆమెహృదయంలో పగ అనే చిచ్చు మండుతున్నది. ఆ అగ్నినుండి రేగిన పొగలా అన్నట్లున్నాయి ఆమె శిరోజాలు. అంతేకాదు. అవి కౌరవులను కాటందాలని బుసలు కొట్టుతున్న కాలమహాభుజంగమా అన్నట్లున్నాయి. కౌరవ నాశాన్ని కోరే ప్రతీకార వాంఛకు ప్రతీక ఆమె శిరోజ మంజరి.

4. ఇందులోని ఉత్ప్రేక్షాలంకారం సార్థకం. ఉపమాన ధర్మసంబంధం చేత ఉపమేయాన్ని ఉపమానంగా భావించటం (లేదా ఊహించటం) ఉత్ప్రేక్ష. ఇందులో ద్రౌపది శిరోజవేణి ఉపమేయం. అది 'అసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో' అన్నట్లు ఇందులో భావింపబడుతున్నది. అలంకారం సార్థకం కావటంతో అలంకారౌచిత్యం ఏర్పడింది. అలంకార స్వభావంతో భావికథార్థ ధ్వని ప్రతీయమానం ఔతున్నది.

5. పాండవ యుద్ధనీతిలో కీలకస్థానం వహించవలసిన అంశం ద్రౌపది జడ. అది అపవిత్రమైనది. పవిత్రం కావాలంటే మార్గమేమిటి? ఆలోచించండని సూచిస్తున్నది. అక్కడ ఆమె ప్రదర్శించిన అభినయం ఆమె భావాలకు ఆంగిక వ్యాఖ్యానం. ఆమె శిరోజాలను తన కుడిచేతిమీద ఉంచింది. శ్రీకృష్ణుడు తోబుట్టువు కాబట్టి కుడిచేతిమీద ఉంచి భారమంతా ఆయనమీద ఉండునట్లు చేసింది. ముడి విప్పటంలో ఆత్రుత ప్రకటించింది. మాటలు వెలువడటానికి ముందే మనోవేదన వెలికి తీసికొని వస్తున్నది. తన శిరోజాల విషయంలో తనకు ఊరట కలిగించే ఉపాయం ఎవ్వరూ ఊహించక పోవటంతో విషాదం మొదట తలయెత్తింది. తనంతట తాను ఆ విషయం శ్రీకృష్ణాదులకు జ్ఞాపకం చేయవలసి వచ్చినందుకు రోషం పొంగివచ్చింది. ఆ అవమాన వేదన స్మరణ చేత దుఃఖం పెల్లుబికి కన్నీళ్ళు క్రమ్మాయి. ఇక ఆలస్యం పనికి రాదని పగ వగను వెనకకు త్రోసి తానే ముందుకు వచ్చింది. దానితో ఆమె దిగ్గున లేచింది. అదుపులో పెట్టుకొనలేని దుఃఖం ఆర్తిగా మారింది. గుండెలో కరడు గట్టిన వేదన మాటలతో బైటపడాలంటే అంతవరకూ అడ్డుగా నిలిచిన దుఃఖం ఆర్తిగా మారి త్రోవ ఇవ్వాలి. లోతైన అభినయ రహస్యాలను ద్రౌపది పాత్రయందు సంగ్రహ సుందరంగా వర్ణించి తిక్కన రసాభ్యుదయ శిల్పాన్ని ప్రదర్శించాడు.

6. ఏడుస్తూ ద్రౌపది శిరోజాలను శ్రీకృష్ణుడి ముందు ఉంచటం ఈ నాటకీయతలోని పరాకాష్ఠ. తీరని సమస్యను దేవుడి ముందుంచి వేడుకొన్న స్ఫూర్తి ఇందులో ఉన్నది. ఎదుట లేని శ్రీకృష్ణుడిని అప్పుడు తలచింది. ఎదుట నున్న మాధవుడి ముందు ఇప్పుడు తన గోడు వినిపించింది. అప్పు డాదుకొన్నాడు కృష్ణుడు. ఇప్పుడూ ఆదుకోక తప్పదు.

7. ఈ పద్యానికి మూల మిట్లున్నది -

"ఇత్యుక్త్వా మృదుసంహారం వృజినాగ్రం సుదర్శనమ్,
సునీల మసితాపాఙ్గీ సర్వగంధాధివాసితమ్ ॥

సర్వలక్షణసంపన్నం మహాభుజగవర్చసమ్,
కేశపక్షం వరారోహా గృహ్య వామేన పాణినా ॥

పద్మాక్షీ పుణ్డరీకాక్ష ముపేత్య గజగామినీ,
అశ్రుపూర్ణేక్షణా కృష్ణా కృష్ణం వచనమబ్రవీత్ ॥ (సం. 5.80.33-35)

మూలంలో ద్రౌపది 'వామేన పాణినా' అని జడను ఎడమచేత పట్టినట్లున్నది. తిక్కన 'వలచేత' అని కుడిచేతికి మార్చాడు. మూలంలో 'అశ్రుపూర్ణేక్షణా' అని ఉండగా తెలుగు 'విషాదరోషముల్ గావఁగలేక' అని ఉన్నది. విషాదరోషాలను ఆపుకొనలేకపోతే బాష్పాలు క్రమ్మటం తప్పదు. (సంపా.)

వ. గోవిందు ముందటంబెట్టి యిట్లనియె : 113

తాత్పర్యం: కృష్ణుడి ఎదుట తలవెండ్రుకలను పారబట్టి ఇట్లా అన్నది :

క. 'ఇవి దుస్ససేను వ్రేళ్ళం ।
దవిలి సగము ద్రెవ్విపోయి దక్కినయవి; కౌ
రవుల కడఁ దీఱుమాటల ।
యవసరమునఁ దలఁపవలయు నచ్యుత! వీనిన్. 114

ప్రతిపదార్థం: అచ్యుత!= శ్రీకృష్ణా!; ఇవి= ఈ వెంట్రుకలు, దుస్ససేను వ్రేళ్ళన్+తవిలి= దుశ్శాసనుడి వ్రేళ్ళలో చిక్కుకొని; సగము= అర్ధభాగం; త్రెవ్విపోయి= తెగిపోయి; తక్కిన+అవి= మిగిలినట్టివి; కౌరవులకడన్= దుర్యోధనాదుల దగ్గర; తీఱుమాటల+ అవసరమునన్= సంధి వచనములాడే సందర్భంలో; వీనిన్= ఈ శిరోజాలను; తలఁపన్+వలయున్= నీవు యోచించవలెను.

తాత్పర్యం: 'కృష్ణా! ఈ శిరోజాలు దుశ్శాసనుడు నన్ను బలాత్కారంగా సభకీడ్చి తెచ్చేవేళ అతడి చేతివ్రేళ్ళలో చిక్కుకొని సగం తెగిపోగా మిగిలినవి.

నీవు కౌరవుల దగ్గర సంధి వచనములాడే సందర్భంలో వీటిని జ్ఞప్తిలో ఉంచుకొనాలి.

విశేషం: 1. 114వ పద్యంలో ద్రౌపది మనస్సులో పొంగిన భావాలలో విషాదం మొదటిది. దానికి సంబంధించిన వాచికాభినయం ఇది. ఇందులో వాడిన పదాలు దీప్తరసత్వాన్ని వ్యంజింపజేస్తూ కాంతిగుణంతో రాజిల్లుతున్నాయి.

2. దీనికిమూలం :

'అయం తే పుణ్డరీకాక్ష దుశ్శాసనకరోద్ధృతః
స్మర్తవ్యః సర్వకార్యేషు పరేషాం సంధిమిచ్ఛతా॥" (సం. 5.80.36)

అని మాత్రమే ఉండగా, తెలుగున తిక్కన - 'ఇవి దుస్ససేను వేళ్ళం, దవిలి సగము త్రెవ్విపోయి దక్కినయవి'' - అనటం వినటానికీ చూడటానికీ మరింత బాధాకరం. (సంపా.)

సీ. ఈ వెండ్రుకలు వట్టి యీడ్చిన యాచేయి ।
దొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింత లింతలు దునియలై చెదరి రూ ।
పఱియున్నఁ గని యుడుకాఱుఁగాక!
యలుపాలఁ బొనుపడునట్టి చిచ్చే యిది;।
పెనుగద వట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ ।
మను నొక విల్లెప్పుడును వహించు

ఆ. కత్తి విక్రమంబు గాల్పనే? యిట్లు బ ।
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగుఁ గన్నారఁ ।
గానఁ బడయమైతిమేనిఁ గృష్ణ! 115

ప్రతిపదార్థం: కృష్ణ!= శ్రీకృష్ణా!; పోరిలోన్= యుద్ధములో; తొలుతగాన్= ప్రప్రథమంగా; ఈ వెండ్రుకలు+పట్టి= ఈ శిరోజాలను ఒడిసిపట్టి; ఈడ్చిన= లాగిన; ఆ చేయి= ఆ దుశ్శాసనుడి హస్తము; దుస్ససేను తనువు= దుశ్శాసనుడి శరీరం; ఇంతలు+ఇంతలు+ తునియలు+ఐ= ఇంతింత ముక్కలై; చెదరి= చెల్లా చెదరై; రూపు+అఱి+ఉన్నన్= రూపు చెడియుండగా; కని= చూచి; ఉడుకు+ఆఱున్+కాక= నామనస్తాపం చల్లారును గాని; అలుపాలన్= స్వల్పకార్యాలతో; ఇది; పొనుపడునట్టి చిచ్చే?= అణగారే అగ్నియా?; ఇట్లు= ఈ విధంగా; బన్నములు+పడిన= భంగపాటులొందిన; ధర్మనందనుండున్= ధర్మజుడూ; నేనున్= నేనున్నూ; రాజరాజు పీనుంగున్= దుర్యోధనుడి శవమును; కన్నారన్+కానన్+పడయము+ఐతిమి+ఏనిన్= కనులార చూచే భాగ్యానికి నోచనిచో; పెనుగద+పట్టిన= పెద్ద గదను ధరించిన; భీమసేను బాహు బలంబును= వాయునందనుని భుజశక్తీ; పాటించి= ఆదరించి; గాండీవము+ అను+ఒక విల్లు= గాండీవం అనెడు ఒక చాపమును; ఎప్పుడున్= ఎల్లవేళల; వహించు= తాల్చు; కట్టివిక్రమంబు= అర్జునుడి పరాక్రమమూ; కాల్పనే?= తగుల బెట్టటానికా?

తాత్పర్యం: యుద్ధంలో ప్రప్రథమంగా నా తలవెండ్రుకలను పట్టి సభలోని కీడ్చి తెచ్చిన ఆ దుశ్శాసనుడి హస్తం, అతని దేహం ఇంతింత ముక్కలై చెల్లాచెదరుగా నేలబడి రూపు మాసిఉండగా చూచినప్పుడే నా మనస్తాపం చల్లారగలదు. అల్పకార్యాలతో చల్లారే అగ్ని కాదిది. ఆ విధంగా పరిభవముల పాలైన ధర్మనందనుడూ, నేనూ దుర్యోధనుడి శవాన్ని కనులార చూడటానికి నోచుకొనకపోతే, కొండంత గదను మూపున వేసికొని తిరిగే భీమసేనుడి భుజబలమూ, ఆదరంతో గాండీవమనే పేరుగల దొడ్డ వింటిని ధరించే పాండవమధ్యముడి శౌర్యమూ తగులబెట్టనా?

విశేషం: 1. ఈ పద్యంలో ఉన్న సొగసు మూలంలో లేదు. దుశ్శాసనుడి శరీరమంతటిలోను, ప్రప్రథమంగా తన వెండ్రుకలు పట్టి యీడ్చిన ఆ చేయి

రూపఱవలెనట. ద్రౌపదికాతని చేయి యన్న అంతటి ప్రత్యేకమైన కోపము! 'తొలుతగా' అను పదం చాల ముఖ్యమైనది. ఇది మూలంలో లేదు. 'దుశ్శాసన భుజం శ్యామం సంభిన్నం పాంసుగుణ్ఠితమ్' అని మాత్రమే ఉన్నది. ఆతని తను వింత వింతలు దునియలై చెదరవలయు ననుట మూలంలో లేనే లేదు. పెచ్చరిల్లిన అచ్చమైన ఆమె కోపం అచ్చ తెనుగు పదములలో ప్రదర్శింపబడటం మెచ్చదగినది. ఏడ్చుచున్న ద్రౌపదిని పఠితల కన్నుల యెదుట సాక్షాత్కరింప జేసినాడు తిక్కన. ఆతడి నాటకీయ రచనలో, పాత్రల ప్రత్యక్షీకరణ మొక అంశం. 'పెనుగద పట్టిన భీమసేను ----- కట్టి విక్రమంబు గాల్పనే' --- అనే మాటలు మూలంలో లేవు. "ఇత్యుక్త్వా బాష్పరుద్ధేన కణ్ఠే నాయతలోచనా, రురోద కృష్ణా సోత్కమ్పం సస్వరం బాష్పగద్గదమ్, స్తనౌ పీనాయతశ్రోణీ, సహితా వధివర్షతీ'' - అనేది తెలుగులో లేదు.

2. 114వ పద్యంలోని ద్రౌపది రోషభావానికి అనుగుణమైన వాక్యాలివి. దుశ్శాసన దుర్యోధనులపై ఆమె కెంత కసి కడుపులో మండుతున్నదో ఈ దీర్ఘమైన సీసపద్యం సాక్ష్యంగా తిక్కన చిత్రించాడు. శత్రుసంహారమే ఆమె కడుపు మంటకు చల్లార్పు. ఆ ఉపశమనం చేయలేనప్పుడు 'భరించేవాళ్ళు భర్తలం' అని చెప్పుకొనే వారిలో బలవంతులమనుకొనే భీముడిగదా, అర్జునుడి గాండీవం తగుల బెట్టనా? అని నిష్ఠురమాడింది. ధర్మజుడి మాటలకు తల ఊపుతున్న వారిద్దరిమీద నిప్పులు కురిపించింది. ఈ పద్యం ఆమెలోని ప్రతీకారాగ్ని జ్వాలల భుగభుగలను మూర్తికట్టించింది. (సంపా.)

ఉ. నెట్టన యిట్టియల్క మది నిల్పితి రక్కెస తాల్మిఁ జిచ్చొడిం
గట్టిన యట్లు పెద్దయును గాలము దీనికి నాఱు టెన్నఁడుం
బుట్టదు దుష్టనిగ్రహము పూని జగంబులు గాచునట్టి తోఁ
బుట్టువు తీవ్ర తేజమునఁ బొల్చిన భర్తలు గల్గ నచ్యుతా!' 116

ప్రతిపదార్థం: అచ్యుతా!= శ్రీహరీ!; దుష్ట నిగ్రహము పూని= దుర్మార్గులను శిక్షించటానికి పూనిక వహించి; జగంబులు= లోకాలు; కాచునట్టి= కాపాడే;

తోఁబుట్టువు= అన్నవైన నీవూ; తీవ్ర తేజమునన్= మిక్కిలి ప్రతాపంతో; పొల్చిన భర్తలున్= ఒప్పుతున్న పతులూ; కల్గన్= నాకుండగా; నెట్టన= అనివార్యంగా; ఇట్టి+అల్కన్= ఇటువంటి క్రోధాన్ని; చిచ్చు+ఒడిన్+కట్టిన+ అట్లు= నిప్పును ఒడిలో ఉంచుకొన్నట్లు; పెద్దయును+కాలము= బహుకాలం; రక్కెస తాల్మిన్= దుస్సహమైన ఓర్పుతో; మదిన్+నిల్పితిన్= మనసులో భరించాను; దీనికిన్= ఈ అవమానాగ్నికి; ఆఱుట= శమించటం; ఎన్నఁడున్ పుట్టదు= ఏనాడూ కలుగదు.

తాత్పర్యం: దుష్టులను శిక్షించటానికి లోకాలను రక్షించటానికి పూనుకొనిఉన్న నీవంటి తోడబుట్టువూ, మిక్కుటమైన పరాక్రమంతో దీపించే భర్తలు కలిగి కూడా నేను ఇంతటి పరాభవ జనిత క్రోధాగ్నిని, నిప్పును ఒడిలో నుంచుకొన్న చందాన రాక్షస సహనంతో భరిస్తున్నాను. ఈ పరిభవానలం శమించటం ఏనాడూ కలుగదు.

విశేషం: అలం: ఉపమ, హేతువు.

1. కోపాన్ని చిచ్చుతో పోల్చటం విశిష్టం. పదమూడేళ్ళుగా కోపాన్ని గుండెల్లో దాచింది ద్రౌపది. అది చిచ్చును ఒడిలో మూటకట్టి పెట్టుకొన్నట్లున్నదట! ఒడిలోని చిచ్చు ఒడలెల్ల కాలుస్తుంది. గుండెలోని చిచ్చు అంతరంగాన్నే దహిస్తుంది. అయినా 'రక్కెసతాల్మి'తో ఆమె సహించింది. 'రాక్షసమైన ఓర్పు' అనే అర్థాన్నిచ్చే తెలుగు పలుకుబడి రక్కెసతాల్మి. అల్క, చిచ్చు ఒడి, రక్కెస తాల్మి అనే తెలుగు మాటలు ఇక్కడ సార్థకాలు. గుండెలు కాల్చే భావచిత్రం చిచ్చు అనే పదంతోనే ఏర్పడుతుంది. అట్లాగే మిగతావి కూడా. ఉపమానం ఉజ్జ్వలం.

2. ఆమె గుండెలోని చిచ్చు - తోబుట్టువు. భర్తలూ అండగా ఉన్నా, ఆరేటట్లు కనపడటం లేదని ఆమె వేదన. అన్న దుష్టశిక్షణ, శిష్టరక్షణ వ్రతంతో అవతరించిన మహాత్ముడు. ఎదురు లేని పరాక్రమం కలవారు పాండవులు. అయినా ఆమె

వేదన ఆరదు - అని హేత్వలంకారంలో పలికింది. హేతువునూ హేతుమంతాన్నీ ఒకే వాక్యంలో వర్ణించటం హేత్వలంకారం. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ద్రౌపది నూరార్చుట (సం. 5-80-43)

వ. అనుచు నెలుంగు రాలుపడ నేడ్చిన యాజ్ఞసేనిం గృపాయత్త చిత్తుండయి నారాయణుం డూరార్చి కూర్చుండ నియమించి కన్నీరు దుడువను బెన్నెఱివేణి ముడువనుం దగువారి నియోగించి య మ్మానినితో నిట్లనియె: 117

ప్రతిపదార్థం: అనుచున్= అని; ఎలుంగు రాలుపడన్= కంఠధ్వని కంపించగా; ఏడ్చిన= విలపించిన; యాజ్ఞసేనిన్= ద్రౌపదిని; కృపా+ఆయత్త చిత్తుండు+అయి= దయకు అధీనమైన మనస్సుకలవాడై; నారాయణుండు= శ్రీకృష్ణుడు; ఊరార్చి= ఓదార్చి; కూర్చుండన్+నియమించి= కూర్చుండుమని తెలిపి; కన్నీరు తుడువను= కన్నీరు తుడవటానికీ; పెన్నెఱి వేణి ముడువను= అందమైన పెద్ద కొప్పును ముడివేయటానికీ; తగువారిన్= తగిన స్త్రీలను; నియోగించి= నియమించి; ఆ+మానినితోన్= ఆత్మాభిమానం కల్గిన ఆ ద్రౌపదితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా కంఠస్వరం కంపిస్తుండగా పాంచాలి విలపించింది. శ్రీకృష్ణుడు ఆమెను ఊరడించి కూర్చుండు మని చెప్పి ఆమె కన్నీటి నొత్తడానికి, చెదరిన చక్కని పెద్ద కొప్పును ముడవటానికి తగినవారిని నియమించి, ఆ మానవతితో ఇట్లా అన్నాడు:

విశేషం: తిక్కన అభినయ క్రమాన్ని శిల్పమయం చేశాడు. ద్రౌపది 100వ పద్యంలో గద్గద కంఠంతో నెమ్మదిగా మాట్లాడటం ప్రారంభించింది. 114వ పద్యంలో మనస్సులో విషాదరోషాలు పొంగగా కళ్ళలో నీళ్ళు నిండగా దిగ్గన లేచి దుఃఖించింది. ఈ పద్యంలో కంఠస్వరం కంపించగా ఏడ్చింది

(బావురుమన్నది). అది పరాకాష్ఠ బావురుమని విలపించటంతో ఆమె మాట లయిపోయినవని సూచన. అంతవరకు మధ్యలో ఆమెతో మాట్లాడకుండా ఉండటం మాధవుడి మనోవిజ్ఞానశాస్త్రపాండిత్యం. (సంపా.)

ఉ. 'మ్రుచ్చిర నేల యేఁ గలుగ? ముద్దియ! నాకు వృకోదరుండు వి
వ్వచ్చుఁడుఁ దోడుగాఁగ జనవంద్యుఁడు ధర్మసుతుండు పంప నీ
మెచ్చుగ శత్రు సంక్షయము మేకొని చేసెదఁగాక! వేఱొకం
డచ్చుపడంగ నేర్చునె? దురాత్ములు కౌరవు లుర్వి యిత్తురే? 118

ప్రతిపదార్థం: ముద్దియ!= ఓ ముద్దరాలా! ద్రౌపదీ; ఏన్+కలుగన్= నేనుండగా; మ్రుచ్చిరన్+ఏల= శోకించుటెందుకు?; నాకున్= నాకు; వృకోదరుండున్= భీముడూ; విబ్బచ్చుఁడున్= సవ్యసాచి; తోడు కాఁగన్= సహాయులు కాగా; జనవంద్యుఁడు= జనులచేత నమస్కరించదగిన; ధర్మసుతుండు= ధర్మరాజు; పంపన్= ఆజ్ఞాపించగా, నీ మెచ్చుగన్= నీకు ప్రీతి కలిగేటట్లు; మేకొని= సమ్మతించి; శత్రు సంక్షయమున్= శాత్రవ నిర్మూలనం; చేసెదన్+కాక!= చేస్తాను సుమా!; వేఱు+ఒకండు= మరొకదారి; అచ్చుపడంగన్+ నేర్చునె?= అలవడటానికి వీలుందా? (వీలులేదు); దురాత్ములు= దుష్టచిత్తులైన; కౌరవులు= ధార్తరాష్ట్రులు; ఉర్విన్+ఇత్తురే?= భూమిని పంచి మనకిస్తారా?

తాత్పర్యం: పాంచాలీ! నేనుండగా ఎందుకు శోకిస్తావు? నాకు భీమార్జునులు సాయపడగా, జనవినుతుడైన ధర్మజుడు ఆజ్ఞాపించగా, నీవు సంతోషించేటట్లు శాత్రవులను నిర్మూలిస్తాను. మరొక మార్గం లేదు. దుష్టచిత్తులైన కౌరవులు భూమిని పంచి మన కిస్తారా? (ఇవ్వరని భావం).

విశేషం: 1. ద్రౌపది 'అచ్యుతా' అని (పద్యం 118) ఎలుగెత్తి పిలిచింది. ఆ పిలుస్తున్నప్పుడు ఆమె కంఠధ్వని కంపించింది (ప.119). ఆ పిలుపు 'అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ!' అన్న భక్తుడి పిలుపువలె ఉన్నది. గజేంద్రుడి కేకవలె తోచింది. 'అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్'- అని ప్రతిజ్ఞచేసిన శ్రీకృష్ణుడిలోని భగవదంశ ప్రబుద్ధమయింది. దివ్యాదివ్యుడివలె వెలుగొందే ఆ వాసుదేవుడు కృపాయత్తచిత్తుడయ్యాడు. ఆ స్థితిలో ఆయన సాక్షాత్ 'నారాయణుడు'గా వెలుగొందాడు. అతడి మాటలు భక్తరక్షణ కళాప్రావీణ్యంతో ప్రతిధ్వనించాయి. ఈ పద్యం ఆ ప్రతిధ్వనులలో మొదటిది.

2. ఇందులోని ప్రతి వాక్యం సార్థకం. పదాల పొందిక కూడా సాభిప్రాయం. అనునయించటం కూడా ఒక కళగా తెలిసిన మహానుభావుడు శ్రీకృష్ణుడు. 'ఏడుస్తావెందుకమ్మా నేనుండగా పిచ్చితల్లీ?' అన్న వ్యవహార వాక్యానికి మొదటి వాక్యం పద్యాకృతి. ముందు దుఃఖాన్ని విడువుమన్నాడు. నే నున్నానని నమ్ముమన్నాడు. ఆ నమ్మిక దుఃఖాన్ని తొలగిస్తుందన్నాడు. నన్ను నమ్మికూడా, నన్నడిగి కూడా ఇంకా ఎందుకు దుఃఖిస్తావు? నీ భక్తి నా మనస్సు కెక్కింది. నే నెప్పుడూ నీకు ప్రసన్నుడనే. ఈ సంగతి తెలిసి కూడా దుఃఖించే నీవు ఎంత అమాయకురాలవు! - అనే భావం ఏర్పడే ఆ మాటలు తీవ్ర దుఃఖాన్ని తగ్గిస్తాయి. తన మాట విని ఆదుకొనే దేవుడివంటి అన్న ఉన్నాడన్న ధైర్యం ఏర్పడుతుంది. మొదటి వాక్యమే కాదు అందులోని పదాల వరస కూడా మార్చటానికి వీలు పడనివి కావటం విశేషం.

3. యుద్ధంలో శ్రీకృష్ణుడు ద్రౌపది మెచ్చేటట్లు శత్రువులను సంహరిస్తాడట! పాండవులు తన దుఃఖాన్ని తీర్చలేదని శ్రీకృష్ణుడిని వేడుకొంటున్న ద్రౌపదిని ఊరట పరచే వాక్యమిది. యుద్ధం చేస్తాననీ, ఆ చేయటం నీకు పూర్తిగా సంతోషం, తృప్తీ కలిగించటానికే అనీ అనటంతో ద్రౌపదికి హామీ దొరికింది. ఆమె నిశ్చింతురాలు కాగలిగింది ఆ వాక్యంతో. అయితే ఆ వాక్యంలో అనుబంధాలు రెండున్నాయి. 1. భీమార్జునులు తోడుపడతారట. 117వ పద్యంలో 'భీమసేను బాహుబలంబును, నొక విల్లెప్పుడును వహించు కట్టి విక్రమంబు కాల్పనే?' అని అధిక్షేపించిన దానికి ఇది పరోక్ష సమాధానం. యుద్ధంలో శ్రీకృష్ణుడికి భీమార్జునులు అండగా నిలిచి ద్రౌపది ఆశలను చిగురింప చేస్తారని ధ్వని. ఆ తరువాత 'జనవంద్యుడు ధర్మసుతుడు ఆజ్ఞాపించగా' అనటం

సాభిప్రాయం. ద్రౌపది కోపమంతా ధర్మజుడి మాటల మీదనే. అతడు సంధి మాటలు మాట్లాడినందుకే. సంధి కోరే ధర్మరాజే సమరాన్ని చేయండని ఆజ్ఞాపిస్తాడనీ, అతడి ఆజ్ఞతోనే యుద్ధం సాగుతుందనీ చెప్పి ద్రౌపది మనోవేదనకు మూలమైన అనుమానాన్ని తొలగించాడు. పరిస్థితులను అట్లా మార్చే బాధ్యత శ్రీకృష్ణుడు స్వీకరించాడు.

4. 'మరొకం డచ్చు వడంగ నేర్చునె?' అనే వాక్యం జరుగబోయే శత్రుసంహారాన్ని ధ్రువీకరించే వాక్యం. దానివలన విశ్వాసం గట్టిపడుతుంది. దుఃఖం ఉపశమిస్తుంది.

5. రాయబారం జరిగినా దురాత్ములు రాజ్యభాగ మివ్వరని - చివర చెప్పిన వాక్యం కొసమెరుపు. 112వ పద్యంలో ద్రౌపది లేవనెత్తిన కీలకమైన ప్రశ్నకు కీలెరిగి చెప్పిన సమాధానం, సంధి ఫలవంతం కాదని సూచన. ద్రౌపది దిగులుపడవలసిన దేమీ లేదని భావం. భావి కథంతా ద్రౌపదిని సంతోష పెట్టటానికే సాగుతుందనీ, దానినంతా శ్రీకృష్ణుడే సూత్రధారుడై నడుపుతాడనీ, నమ్మకం కలిగి ఉండుమనీ శ్రీకృష్ణుడు ద్రౌపదికి అభయహస్తం ఇచ్చాడు.

6. పాండవుల వలెనే పాండవపత్ని కూడా శ్రీకృష్ణుడిని పరమాత్మగా భావించే సంస్కృతినీ, భక్తజనావన బిరుదాంకితుడైన నారాయణుడి స్వభావాన్ని ప్రకటిస్తున్న అవతార పురుషుడని భావించే సంస్కృతీ ఈ పద్యంలో బింబ ప్రతిబింబభావంతో ప్రకటితం కావటం వస్తుధ్వని. (సంపా.)

క. లలనా! యుడుగుము నీ యే ।
డ్పుల కొలఁదియె కురునృపాల పుత్త్ర కళత్రం
బుల యేడ్పు; లింక వానిం ।
గలకల నవ్వుచు వినంగఁ గాలం బయ్యెన్. 119

ప్రతిపదార్థం: లలనా!= ఓ వనితా, ద్రౌపదీ; ఉడుగుము= దుఃఖించటం మానుము; కురునృపాల పుత్త్ర కళత్రంబుల+ఏడ్పులు= కురురాజయిన ధృతరాష్ట్రుని కొడుకుల భార్యల యొక్క రోదనములు; నీ+ఏడ్పుల కొలఁదియే= నీ యేడ్పుల పరిమాణం కలవే; ఇంకన్= ఇక; వానిన్= వారి

శోకాలను; కలకలనవ్వుచున్= నీవు పకపక నవ్వుతూ; వినంగన్= వినటానికి; కాలంబు+అయ్యెన్= సమయం వచ్చింది.

తాత్పర్యం: అమ్మా! దుఃఖం మాను. నీ వెంత విలపించావో దుర్యోధనాదుల భార్యలుగూడ అంత విలపిస్తారు. వారి యేడ్పులు నీవు పకపక నవ్వుతూ వినే సమయం సమీపించింది.

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనా ననురూపయోః ". అననురూపాలైన వాటికి సంబంధాన్ని వర్ణించటం విషమాలంకారం. కౌరవుల భార్యల విలాపాలకూ ద్రౌపది కలకలనవ్వటానికీ ఇందులో సంబంధం చెప్పబడింది కావున విషమం.

2. అనునయంలో పాటించే మెలకువలకు శ్రీకృష్ణుడు పెట్టింది పేరు. ద్రౌపదికి దుఃఖాన్ని కలిగించింది కౌరవులు. వారి భార్యాపుత్రులు ఆమెవలె దుఃఖిస్తే ఆమెకు ఉపశాంతి. పరదుఃఖం ఉపశమనమే కాదు ఉల్లాసం కూడా కలిగిస్తుందన్న మానసిక సూత్రం తెలిసిన విజ్ఞుడు శ్రీకృష్ణుడు. అందుకు విషమాలంకారం అర్థవంతంగా ఉంటుందని తిక్కన తీర్పు. (సంపా.)

క. యమ మహిష ఘంటికా నా ।
దము వినఁ గౌతూహలంబు దళుకొత్తెడు చి
త్తములు గల కౌరవుల కి ।
ష్టము లగునే సంధికార్య శాంతవచనముల్? 120

ప్రతిపదార్థం: యమ మహిష ఘంటికా నాదమున్= యముడి వాహనమైన దున్నపోతు యొక్క మెడగంటల చప్పుడును; వినన్= వినటానికి; కౌతూహలంబు= ఉబలాటము; తళుకొత్తెడు= అతిశయిస్తున్న; చిత్తములుకల= మనస్సులు కల్గిన; కౌరవులకున్= ధార్తరాష్ట్రులకు; సంధికార్య శాంతవచనముల్= సంధికి సంబంధించిన శాంతంతోడి మాటలు; ఇష్టములు+అగునే?= సమ్మతాలౌతాయా? (కానేరవు.)

తాత్పర్యం: అమ్మా! యముని దున్నపోతు మెడలోని గంటల సవ్వడి వినటానికి మిక్కిలి ఉబలాటపడుతున్న కౌరవులకు సంధికి సంబంధించిన సౌమ్య వాక్యాలు సమ్మతాలు కావు.

విశేషం: అలం: అప్రస్తుతప్రశంస. మహిషం యముడి వాహనం. యము డా వాహనాన్ని ఎక్కి వడివడిగా వస్తున్నప్పుడు దాని మెడలోని లోహఘంటలు మ్రోగుతాయి. అవి వినబడితే మరణం ఆసన్నమైనదని ధ్వని. మరణాన్ని మనసారా కోరుకొంటున్న కౌరవులకు బ్రతకటానికి వీలున్న సంధి వాక్యాలు రుచించవనటం- వారికి త్వరలో మరణం తథ్యమని ధ్వని. నిజానికి శ్రీకృష్ణుడు హస్తినకు పోవటానికీ, యమ మహిష ఘంటానాదం వినబడటానికీ ఉన్న సాజాత్యాన్ని ఊహిస్తే ఆలోచనామృతం. (సంపా.)

క. మొదల విధినియతియును న।
ట్టిద యందురు పెద్ద; లది ఘటింపకపో దే
మదిఁ జూచి చెప్పినను ద।
ప్పదు మేరువు దిరిగెనేనిఁ బాంచాలసుతా! 121

ప్రతిపదార్థం: పాంచాల సుతా!= పాంచాల రాజపుత్రీ!; పెద్దలు= తెలిసిన వారు; మొదలన్= తొలుతనే; విధి నియతియును= విధి నిర్ణయం కూడా; అట్టిది+అ+అందురు= కురుపాండవులకు పొత్తు కుదరదనీ కౌరవులకు చావు మూడిందనే చెపుతారు; అది ఘటింపక పోదు= అలా జరగకుండాపోదు; ఏన్= నేను; మదిన్+చూచి= బుద్ధిలో ఊహించి; చెప్పినను= వాకొన్నచో; మేరువు తిరిగెను+ఏనిన్= మేరు పర్వతం తల్ల క్రిందైనను; తప్పదు= నా వచనం వ్యర్థంగాదు.

తాత్పర్యం: అసలు దైవ నిర్ణయ మిదే అని పెద్దలు చెపుతున్నారు. ఇంతకు అదే జరుగుతుంది. నేను బుద్ధిలో ఊహించి చెప్పిన మాట మేరు పర్వతం తలక్రిందైనను తప్పదు సుమా!

విశేషం: అలం: అతిశయోక్తి. శ్రీకృష్ణుడే కాలపురుషుడని ధ్వనింపజేసే పద్యం ఇది. ఆతడి దివ్యాదివ్య స్వభావం మాటలలో వ్యంగ్యం. పెద్దలంటున్నారన్నప్పుడు అదివ్యుడు. నేను మదిఁ జూచి చెప్పెదను అన్నప్పుడు దివ్యుడు. మేరుపర్వతం తలక్రిందైనా నామాట తప్పదంటున్న శ్రీకృష్ణుడు విధిస్వరూపుడు. భక్తప్రసన్నుడైన భగవంతుడు దివ్యరూపంతో మాట్లాడుతున్న అనుభూతి నందించే పద్య మిది. (సంపా.)

తే. పూని పలికెద వినుము రిపు క్షయంబుఁ।
జేసి యుజ్జ్వల పుణ్యలక్ష్మీ సమేతు
లైన పాండు కుమారుల యధిక విభవ।
మీవు సూచెదు; తడవులేదు; దిది నిజంబు! 122

ప్రతిపదార్థం: పూని పలికెదన్= నొక్కి చెపుతున్నాను; వినుము= నా మాటలు వినుము; రిపుక్షయంబున్+చేసి= విరోధులను నాశముచేసి; ఉజ్జ్వల పుణ్యలక్ష్మీసమేతులు= ప్రకాశించే పుణ్యమనెడు సంపదతో కూడినట్టి; పాండు కుమారుల= పాండవుల యొక్క; అధిక విభవము= గొప్ప ప్రాభవము; ఈవు= నీవు; చూచెదు(వు)= చూడగలవు; తడవు లేదు= ఇందుకు ఆలస్యం లేదు; ఇది నిజంబు= నా మాట సత్యం.

తాత్పర్యం: ద్రుపదపుత్రీ! శపథం చేసి చెపుతున్నాను. నా పలుకు లాలకించుము. విరోధులను విధ్వంసం చేసి, ప్రకాశమానమైన పుణ్యసమృద్ధితో కూడిన పాండురాజ తనయుల యొక్క మిక్కుటమైన వైభవాన్ని నీవు దర్శించగలవు. ఇందుకు అట్టే ఆలస్యం లేదు. నా మాట నిజం.'

విశేషం: ఈ మాటలు విశ్వరూప ప్రదర్శనం చేస్తూ పరమాత్ముడు పలుకుతున్న అద్భుత వాతావరణం స్ఫురింపజేస్తున్నవి. శ్రీకృష్ణుడి వాక్కు భగవన్నిర్ణయమని స్పష్టమవుతుంది. ఊరడింపు కిది పరాకాష్ఠ. ద్రౌపది హృదయతాపం చల్లారింది అని ధ్వని. (సంపా.)

క. **అని యూఁ ఊడిలఁగఁ బలికిన ।**
విని యంకిలి దేఱు చిత్తవృత్తిగలుగు నం
గన యే డ్పుడిగెం; దగ ఫ ।
ల్గునుఁ డిట్లని పలికె నపుడు గోవిందునితోన్. 123

ప్రతిపదార్థం: అని+ఊఱడిలఁగన్= అంటూ ఊఱడిల్లేటట్లు; పలికినన్= శ్రీకృష్ణుడు చెప్పగా; విని; అంకిలి తేఱు+చిత్తవృత్తి కలుగు= కలతనుండి ప్రసన్నత కాంచిన మనోవ్యాపారంగల; అంగన= ద్రౌపది; ఏడ్పు+ఉడిగెన్= విలపించటం మానింది; తగన్= ఒప్పుగా; ఫల్గునుఁడు= అర్జునుడు; అపుడు= ఆ సమయాన; గోవిందునితోన్= గోపాల దేవుడితో; ఇట్లు+అని పలికెన్= ఈ విధంగా వచించాడు.

తాత్పర్యం: జనార్దను డిట్లా ద్రౌపదిని సాంత్వనవచనాలతో ఊరడించాడు. ఆమె కలత వీడి ప్రసన్నత నొందిన మనసుగలదై యేడ్పు మానింది. పిదప పార్థుడు గోపాలకృష్ణుడితో ఇట్లా అన్నాడు.

తే. **'పాండవులు ధార్తరాష్ట్రులుఁ బుండరీక ।**
నేత్ర ! చుట్టరికంబున నీకు నొక్క
రూప; కావునఁ గోరి యేరూపునందు ।
నుభయపక్షంబులకుఁ జేయు ముచితహితము. 124

ప్రతిపదార్థం: పుండరీక నేత్ర!= తెల్ల దామరల వంటి కన్నులు గల కృష్ణా!; నీకున్= నీకు; చుట్టరికంబునన్= బంధుత్వం చేత; పాండవులున్= పాండుపుత్రులమైన మేము; ధార్తరాష్ట్రులున్= ధృతరాష్ట్రుడి కుమారులగు దుర్యోధనాదులు; ఒక్క రూప= ఒకే విధమైనవారం; కావునన్= కనుక; కోరి= వాంఛించి; ఏ రూపు+అందున్= ఎట్లాగయినా; ఉభయ పక్షంబులకున్= రెండు వర్గాలకు ఉచిత హితము+చేయుము= తగిన మేలు చేయుము.

తాత్పర్యం: 'కమల పత్రాక్షా! బంధుత్వమును బట్టి కురుపాండవులు నీకు సమానులే. కనుక ఏ విధంగానైనా ఆసక్తితో ఇరువర్గాలకూ తగిన మేలు గావించు.

విశేషం: 124లో విరోధుల విధ్వంసాన్ని గురించి మాట్లాడిన శ్రీకృష్ణుడు దివ్యత్వస్థాయిలోకి వెళ్ళి మాట్లాడినట్లుండగా, అర్జునుడు అతడిని వాస్తవ స్థితిలోనికి తెచ్చాడు. బంధుత్వం అనే సమాన గుణంతో ఉభయులకూ మేలు చేయుమన్నాడు. (సంపా.)

క. **ధర్మార్థ సంగతంబుగ ।**
ధర్మతనయు చెప్పినట్ల తగఁ బల్కఁగ నా
దుర్మతులు కౌరవులు స ।
త్కర్మమునకుఁ జొరకయున్న దైవమ యెఱుఁగున్. 125

ప్రతిపదార్థం: ధర్మ+అర్థ సంగతంబుగన్= ధర్మార్థాలతో కూడేటట్లుగా; ధర్మతనయు చెప్పినట్లు+అ= ధర్మనందనుడు తెల్పినట్లుగా; తగన్= ఒప్పిదముగా; పల్కఁగన్= నీవు కురుసభలో మాట్లాడితే; ఆ దుర్మతులు= ఆ చెడుబుద్ధి కలిగిన; కౌరవులు= దుర్యోధనాదులు; సత్కర్మమునకున్= మంచి పనికి; చొరక+ఉన్నన్= నడుము కట్టనిచో; దైవము+అ+ఎఱుఁగున్= ఆవల దేవుడే పని చక్కబెట్టగలడు.

తాత్పర్యం: కృష్ణా! ధర్మార్థయుక్తంగా ధర్మపుత్రుడు చెప్పినట్లు కౌరవ సభలో చక్కగా హితోక్తులు పలుకవలసింది. దుర్బుద్ధిగల కౌరవులు మంచి చేయటానికి పూనుకొనకపోతే దైవమున్నాడు. ఆ దేవుడే అన్నీ చక్కబెట్టగలడు.'

విశేషం: శ్రీకృష్ణుడు ధర్మజుడికి ఇచ్చిన మాటను జ్ఞాపకం చేసి, కౌరవసభలో సముచిత విధానంలో వ్యవహరించుమన్నాడు. దైవం మీద భారముంచి ప్రయత్నించటం పురుషకారం. తగిన ఫలాన్ని అందించేది దైవానుకూల్యం. దూతగా శ్రీకృష్ణుడు పురుషకారం చేస్తాడు. దైవంగా ఆయనే ఫలాన్ని అందిస్తాడు

- అని అర్జునుడు ధర్మ కర్మ యోగాన్ని ప్రదర్శిస్తూ పలికాడు. నరుడు నారాయణుడికి సన్నిహితుడు కావటంతో ఆ చనువు తీసికొనగలిగాడు. (సంపా.)

క. అన విని 'కౌరవులకు మీ ।
కును హితముఁ బ్రియంబుఁ జేయఁ గోరియ కుంతీ
తనయాగ్రజుపని ధృతరా ।
ష్ట్రుని కడకుం బోయెదను గడుం బ్రీతిమెయిన్. 126

ప్రతిపదార్థం: అనన్ విని= అర్జునుడిట్లా పలుకగా ఆలించి; కౌరవులకున్= దుర్యోధనాదులకూ; మీకును= మీకున్నూ; హితమున్= మేలు; ప్రియమున్= స్నేహమునూ; చేయన్+కోరి+అ= చేయటానికి కోరికొనియే; కుంతీ తనయ+ అగ్రజుపనిన్= ధర్మనందనుడి పనిమీద; కడున్+ప్రీతిమెయిన్= మిక్కిలి సంతోషంతో; ధృతరాష్ట్రుని కడకున్= ఆంబికేయుని దగ్గరకు; పోయెదన్= వెళ్ళుతాను.

తాత్పర్యం: పార్థుడి పలుకులు విని శ్రీకృష్ణుడు - 'అర్జునా! కౌరవులకూ మీకూ ఇష్టమైనదానిని, మేలుగూర్చే దానినీ చేయవలెనని తలంచి కుంతీపుత్రులలో పెద్దవాడైన ధర్మజుడి పనిమీద ధృతరాష్ట్రుడి దగ్గరకు మిక్కిలి సంతోషంతో వెళ్ళుతున్నాను.'

విశేషం: పైకి చూస్తే ద్రౌపదికి తగిన మాటలు ఆమె వద్దా, అర్జునుడికి తగిన మాటలు అతడి వద్దా శ్రీకృష్ణుడు పలికినట్లుంటుంది కాని, శ్రీకృష్ణుడి మాటలలో వైరుధ్యం లేదు. ఎట్లాగంటే - ధర్మజుడి వాక్యాలు యుద్ధానికి పూర్వార్థం; ద్రౌపదికి ఇచ్చిన మాటలు యుద్ధానికి ఉత్తరార్థం. ఆ వరుసలో నిర్వహించే శ్రీకృష్ణుడు కార్యపరమార్థం. (సంపా.)

క. అని పలికిన హరి ధర్మ వ ।
చనముల తెఱఁగున కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి 'యట్ల చేయుము ।
మన నిశ్చయ మిదియ దీని మఱవకు మనఘా!' 127

ప్రతిపదార్థం: అని పలికిన= ఈ విధంగా వచించిన; హరి= శ్రీకృష్ణుడి యొక్క; ధర్మవచనముల తెఱఁగునకున్= న్యాయంతో కూడిన వాక్యాల పద్ధతికి; అజాతశత్రుఁడు= ధర్మజుడు; చిత్తంబునన్+పొంగి= మనస్సులో ఉబ్బి; అనఘా!= పుణ్యపురుషా!; అట్లు+అ చేయుము= అట్లే కావించుము; ఇది+అ మన నిశ్చయము= ఇదే మనయొక్క నిర్ణయం; దీనిన్= ఈ మాటను; మఱవకుము= మరిచిపోవద్దు.

తాత్పర్యం: త్రివిక్రముడి ధర్మయుక్తమైన మాటల తీరునకు ధర్మరాజు మనసులో పొంగిపోయాడు. 'మహానుభావా! నీ వన్నట్లే చేయవలసింది. మా తలపు కూడ అదే. ఈ విషయం మరచిపోవద్దు.'

విశేషం: ద్రౌపదితో శ్రీకృష్ణుడు మాట్లాడిన తరువాత ధర్మజుడు అడుగవలసిన మాటలు అర్జునుడే అడిగాడు. శ్రీకృష్ణుడు ధర్మజుడి వ్యూహానికి అనుగుణంగా మాట్లాడాడు. దానికి ధర్మజుడు పొంగిపోయాడు. శ్రీకృష్ణుడితో మూడు మాట లన్నాడు. 'అట్లాగే చేయుము; మన నిశ్చయం ఇదే. ఓ పుణ్యాత్మా! దీనిని మరచిపోకుము'. ఈ మూడూ కార్యనిర్ణాయక మంత్రాలు. మొదటివాక్యం అధికారికం. రెండవ వాక్యం నిశ్చయాత్మకం. మూడవ వాక్యం ఔపచారికం. (సంపా.)

వ. అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం జూచి 'నీ నక్షత్రంబు రోహిణిగదా యెల్లి రేవతి నీకుఁ జంద్ర తారాబలంబులు గలవు; గమనంబునకు రేపకడయ మేలు; పయనం బగుట లెస్స'యని చెప్పిన నప్పలుకుల కతండు సగౌరవంబుగా నియ్యకొనినం బాండవాగ్రజుండు కొలువుం గలయం గనుంగొని యెల్లవారును విన నది యట్లకాక యని పలికి తదనంతరంబ తానునుం దమ్ములుఁ బాంచాలియుఁ బరివారంబును నుచిత ప్రకారంబున నిజనివాసంబులకుం జనిరి; మఱునాఁ డరుణో దయంబునఁ గృష్ణుండు గాలోచిత కృత్యంబులు నిర్వర్తించి సూర్యోపాస్తి సేసి యగ్ని సమారాధనం బాచరించి ధరణిసురులం బ్రణామపూర్వకంబుగాఁ బ్రయాణ దాన ప్రముఖ పూజావిశేషంబులం బ్రీతులం గావించి వారల యిచ్చు

నాశీర్వాదంబులును సమంత్రాక్షత దూర్వాంకురాదులునుం గైకొని యుచిత ప్రదేశంబున నుండి సాత్యకి రావించి. 128

ప్రతిపదార్థం: అని= అని ధర్మరాజు పలికి; కార్యంబు నిశ్చయించి= చేయవలసిన పనిని తీర్మానించి; దినశుద్ధి నిరూపించి= మంచి రోజు నిర్ణయించి; నారాయణున్+ చూచి= కృష్ణుడిని చూచి; నీ నక్షత్రంబు రోహిణి కదా= నీ జన్మనక్షత్రం రోహిణి కదా; ఎల్లి= రేపు; రేవతి= రేవతీ నక్షత్రము; నీకున్ చంద్ర తారాబలంబులు+ కలవు= నీకు చంద్రబలమున్నది. తారా బలమున్నది; గమనంబునకున్= ప్రయాణానికి; రేపకడయ= ఉదయమే; మేలు= మంచిది; పయనంబు+అగుట లెస్స= ప్రయాణమై వెళ్ళటం బాగు; అని చెప్పినన్= అని చెప్పగా; ఆ+పలుకులకున్= ధర్మజుడి మాటలకు; అతండు= శ్రీకృష్ణుడు; సగౌరవంబుగాన్= ఆదరంతో; ఇయ్యకొనినన్= అంగీకరించగా, పాండవ+అగ్రజుండు= ధర్మనందనుడు; కొలువున్= సభను; కలయన్+కనుంగొని= తేరిపారచూచి; ఎల్లవారును వినన్= అందరూ వినేటట్లుగా; అది+అట్లు+అ+కాక= అది అట్లే అగుగాక!; అని పలికి; తద్+అనంతరంబు+అ= అటు తరువాత; తానున్= తానూ; తమ్ములున్= అనుజులూ; పాంచాలియున్= ద్రౌపదియూ; పరివారంబును= భృత్యవర్గమునూ; ఉచిత ప్రకారంబునన్= తగు విధంగా; నిజనివాసంబులకున్+చనిరి= తమ తమ నివాస ప్రదేశాలకు వెళ్ళారు; మఱునాఁడు= ఆ మరుసటి దినం; అరుణ+ఉదయంబునన్= సూర్యోదయవేళ; కృష్ణుండు; కాల+ఉచిత కృత్యంబులు= ప్రాతఃకాలానికి తగిన పనులు; నిర్వర్తించి= చేసి; సూర్య+ ఉపాస్తి+చేసి= సూర్యోపాసన కావించి; అగ్ని సమారాధనంబు+ ఆచరించి= అగ్నికార్యం నెరవేర్చి; ధరణిసురులన్= బ్రాహ్మణులను; ప్రణామ పూర్వకంబు గాన్= నమస్కార పురస్సరంగా; ప్రయాణ దాన ప్రముఖ పూజా విశేషంబులన్= ప్రయాణకాలంలో చేసే దానాలు అర్చనలు మొదలైన వాటిచే; ప్రీతులన్+ కావించి= సంతోషింపజేసి; వారల+ఇచ్చు= ఆ బ్రాహ్మణు లిచ్చే; ఆశీర్వాదం బులును= దీవనలును; సమంత్ర+అక్షత దూర్వా+ అంకుర+ఆదులున్= మంత్ర పూర్వకాక్షతలు, గరికపోచలు మున్నగువాటిని; కైకొని= గ్రహించి; ఉచిత ప్రదేశంబునన్+ఉండి= తగిన తావులో నిల్చినవాడై; సాత్యకిన్ రావించి= సాత్యకిని రప్పించి.

తాత్పర్యం: ధర్మజుడు కృష్ణుడిని కౌరవసభకు పంపటానికి తీర్మానించి రేపు మంచి రోజని తెల్పి, 'నారాయణా! నీ జన్మనక్షత్రం రోహిణి; వృషభరాశి. రేపు రేవతీ నక్షత్రం గనుక చంద్రుడు మీనరాశిలో ఏకాదశ స్థానంలో శుభుడై ఉన్నాడు. కావున చంద్ర బలమునూ, రేవతి నీకు సాధన తార అగుటచే తారాబలమున్నూ చక్కగా కుదిరి ఉన్నవి. ప్రయాణానికి రేపు ఉదయమే అనుకూలం' అని చెప్పాడు. మాధవుడు ధర్మజుడి పలుకులను సగౌరవంగా అంగీకరించాడు. పిదప ధర్మపుత్రుడు కొలువు నలువంకలా కలయచూచి అందరూ వింటుండగా 'ఇదే మన నిర్ణయం' అని చెప్పాడు. తరువాత ధర్మరాజు, అతడి తమ్ములు, ద్రౌపది, పరివారం తగిన విధాల తమ తమ నివాస స్థానాలకు తరలి వెళ్ళిపోయారు. మరుసటి దినం శ్రీకృష్ణుడు సూర్యోదయం కాగానే కాలోచిత కృత్యాలు సలిపి, సూర్యోపాసన చేశాడు. అగ్నిని ఆరాధించాడు. బ్రాహ్మణులకు నమస్కారాలు చేసి, ప్రయాణ కాలంలో చేయవలసిన దానాలు, పూజలు సల్పి, వారిని సంతోషపరిచాడు. బ్రాహ్మణుల దీవనలను, వారు మంత్ర పురస్సరంగా ఇచ్చిన అక్షతలను, దూర్వాంకురాలను స్వీకరించాడు. ఉచిత ప్రదేశంలో ఉండి, దామోదరుడు సాత్యకిని పిలిపించాడు.

విశేషం: 1. ప్రయాణాలకు తారాబలం చంద్రబలం చూడటం పరిపాటి. 'శుక్లే పక్షే శీతరశ్మి ర్బలీయాన్' అని జ్యోతిశ్శాస్త్రం (రత్నమాల). కాబట్టి చంద్ర బలం ఉన్నది. శ్రీకృష్ణుడి జన్మనక్షత్రం రోహిణి. ప్రయాణ నక్షత్రం రేవతి. రోహిణికి రేవతి సాధన తార ఔతుంది. రేవతి ప్రయాణానికి శుభ నక్షత్రం. ధర్మజుడు భావించినట్లు శ్రీకృష్ణ దౌత్యం సాధించబడుతుంది- అని ధ్వని.

2. వేదోచితమైన సంస్కారం కలవాడు ప్రయాణారంభంలో నిర్వహించే పుణ్య విధులు ఇందులో చెప్పబడ్డాయి. ఇవి తిక్కననాటి ఆచారాలు కూడా కావచ్చును. ఆతడు కూడా వైదిక మార్గ నిష్ఠుడగు వర్తనం కలవాడు కదా! (సంపా.)

క. 'మన ప్రజలోఁ గరిపురికిం ।
జనుదేరఁగ వలయువారి సవరణతో రం
డని యేర్పడ నియమింపు ప ।
యనమై యేతెమ్ము నీవు' నని తగ మఱియున్. 129

ప్రతిపదార్థం: మన ప్రజలోన్= మన యాదవులలో; కరిపురికిన్= హస్తినా నగరానికి; చనుదేరఁగన్ వలయువారిన్= రావలసిన వారిని; సవరణతోన్= సన్నాహంతో; రండు+అని= రావలసిందని; ఏర్పడన్= స్పష్టముగా; నియమింపు= నిర్ణయించుము; నీవున్= నీవుకూడా; పయనము+ఐ+ఏతెమ్ము= ప్రయాణమై నా వెంట రావలసింది; అని= అని చెప్పి; తగన్= ఒప్పిదంగా; మఱియున్= ఇంకను ఇట్లాఅన్నాడు;

తాత్పర్యం: 'మన యాదవులలో హస్తినాపురానికి రావలసిన వారినందరినీ, సన్నాహాలతో రావలసిందిగా స్పష్టంగా చెప్పుము. నీవు కూడా నా వెంట ప్రయాణమై రమ్ము' అంటూ ఇంకా ఇట్లా చెప్పాడు:

వ. 'దుర్యోధనుండు దుష్టాత్మకుం; డతని మన్నించు మానుసులునుం గుటిలబుద్ధులు గావునఁ జక్రగదా ద్యాయుధంబులు రథంబునం బెట్టింపవలయు' నని చెప్పి పనిచి సమయజ్ఞతం బొడసూపి నిలుచున్న దారుకుం జూచి తేరు పూన్ప నియోగించిన, నతండును మణిగణ ప్రభాపటల జటిలంబగు నరదంబు వన్ని శైబ్య సుగ్రీవ మేఘపుష్ప వలాహకంబు లనంబరఁగు తురంగంబులం బూన్చి గరుడధ్వజం బెత్తి తెచ్చినం దానునుం బయనంపుఁ జందంబునఁ గట్టాయితంబై జనంబుల చూడ్కులకుం బండు వగుచుఁ బుండరీకాక్షుండు మంగళ తూర్యంబులు సెలంగఁ జామరంబు లుల్లసిల్ల రథం బెక్కిన యవసరంబున యాదవ పరివారంబుతో నరుగుదెంచిన సాత్యకిం దన రథం బెక్కించుకొని యాంగికంబులైన శుభ సూచకంబులు గైకొనుచుఁ బూర్ణ కలశ వృషభాది

భద్రపదార్థంబుల నవలోకించుచుఁ బుణ్యాంగనలు సేసలొలుకఁ జిత్తంబు ప్రసన్నతం బొంద వెడలునప్పుడు. 130

ప్రతిపదార్థం: దుర్యోధనుండు; దుష్ట+ఆత్మకుండు= చెడు మనస్సు కలవాడు; అతని మన్నించు= అతడు ఆదరించు; మానుసులునున్= మనుష్యులు కూడ; కుటిలబుద్ధులు= వక్రబుద్ధికలవారు; కావునన్= కనుక; చక్ర గదా+ఆది+ఆయుధంబులు= సుదర్శన మనే చక్రం, కౌమోదకి అనే గద మొదలైన యుద్ధోపకరణాలను; రథంబునన్+పెట్టింపన్+వలయున్= రథములో నుంచవలసినది; అని చెప్పి; పనిచి= పంపి; సమయజ్ఞతన్+ పొడచూపి= సమయము నెఱిగినవాడై కన్పించి; నిలుచున్న దారుకున్+చూచి= నిలబడియున్న దారుకుడనే తన సారథినిగాంచి; తేరు పూన్పన్+ నియోగించినన్= రథమును ఆయత్తం కావించుమని ఆజ్ఞాపించగా; అతండును= సారథియైన దారుకుడు కూడా; మణిగణ ప్రభా పటలజటిలంబు= మణుల సమూహము యొక్క కాంతిపుంజముచే సాంద్రమైనది, అగు+అరదంబు+పన్ని= అయినట్టి రథమును సిద్ధపరిచి; శైబ్యసుగ్రీవ మేఘపుష్ప వలాహకంబులు= శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము; అనన్+పరఁగు= అను పేర్లతో ఒప్పుతున్న; తురంగంబులన్+ పూన్చి= గుఱ్ఱాలను కట్టి; గరుడ ధ్వజంబు+ఎత్తి= రథముపై గరుడుని జెండా నిలిపి; తెచ్చినన్= తన సన్నిధికి కొనిరాగా; పుండరీక+అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులుగల శ్రీకృష్ణమూర్తి; పయనంపుఁ జందంబునన్= ప్రయాణ విధానంతో; కడు+ఆయితంబు+ఐ= మిక్కిలి సంసిద్ధుడై; జనంబుల చూడ్కులకున్= ప్రజల యొక్క నేత్రాలకు; పండువు+ అగుచున్= ఉత్సవం చేస్తూ; మంగళ తూర్యంబులు= మంగళ వాద్యాలు; చెలంగన్= మ్రోయగా; చామరంబులు+ఉల్లసిల్లన్= వింజామరలు విలసిల్లగా; రథంబు+ ఎక్కిన+అవసరంబునన్= రథారోహణం కావించిన సమయంలో; యాదవ పరివారంబుతోన్= యదువంశమునకు చెందిన బలగంతో; అరుగుదెంచిన=

వచ్చినట్టి; సాత్యకిన్; తన రథంబు; ఎక్కించుకొని; ఆంగికంబులు+ఐన= అంగములందు ఏర్పడిన; శుభసూచనంబులు+కైకొనుచున్= శుభ శకునాలను స్వీకరిస్తూ; పూర్ణకలశ వృషభ+ఆది= జలముతో నిండిన కలశము, ఎద్దు మొదలైన; భద్ర పదార్థంబులన్= శుభ ప్రదాలైన వస్తువులను; అవలోకించుచున్= చూస్తూ; పుణ్య+అంగనలు= ముత్తైదువలు; సేసలు+ఒలుకన్= అక్షతలు చల్లగా; చిత్తంబు= తన మనస్సు; ప్రసన్నతన్+పొందన్= శాంతమై ఉండగా; వెడలు+అప్పుడు= బయలుదేరే వేళలో.

తాత్పర్యం: 'దుర్యోధనుడు దుష్టచిత్తుడు. అతడు ఆదరించే మనుషులంతా వంకరబుద్ధి గలవారు. కాబట్టి నీవు చక్రం, గద మొదలైన ఆయుధాలను రథంలో పెట్టించు' అని శ్రీకృష్ణుడు సాత్యకితో చెప్పి పంపాడు. సమయం గుర్తించి దారుకుడు అనే సారథి ఎదుటికి వచ్చి నిలబడగా అతడిని కనుగొని శ్రీకృష్ణుఁడు 'నీవు రథాన్ని ఆయత్తం కావించుము' అని ఆజ్ఞాపించాడు. మణి సమూహాల కాంతిపుంజంతో నిండిన రథానికి శైబ్యం, సుగ్రీవం, మేఘ పుష్పం, వలాహకం అనే గుర్రాలను కట్టి, రథంమీద గరుడకేతనం నిలిపి దారుకుడు అరదం తీసికొనివచ్చాడు. అంతట కృష్ణుడు ప్రయాణ సన్నాహంతో ప్రజలకు కన్నుల పండువు కావిస్తూ, మంగళ వాద్యాలు మ్రోగుతుండగా, వింజామరలు వీస్తుండగా రథారోహణం చేశాడు. సాత్యకి యాదవ పరిజనంతో ఎదుటికి రాగా అతడిని తన రథ మెక్కించుకొని కుడి కన్ను అదరటం మొదలైన ఆంగికాలైన శుభ నిమిత్తాలకు ప్రీతి చెందుతూ, పూర్ణ కుంభం, వృషభం మొదలైన క్షేమకర పదార్థాలను చూస్తూ, ముత్తయిదువలు అక్షతలు చల్లుతుండగా ప్రసన్నమైన మనస్సుతో కృష్ణుడు బయలుదేరాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 1. రాజపురుషులు యాత్రకు బయలుదేరేటప్పుడు భద్రతకు తీసికొనే రక్షణ చర్యలను శ్రీకృష్ణుడు నిశితంగా పాటించటం ఆతడి కార్యదక్షతకు నిదర్శనం. చిన్న విషయంలో కూడా పెద్ద జాగ్రత్త అవసరమని తాత్పర్యం.

2. ప్రయాణం సాగించేటప్పుడు మంగళవాద్యాలు మ్రోయించటం, శుభశకునాలు దర్శించటం, శుభ చిహ్నాలను తమ శరీరాల మీద తోచటాన్ని గమనించటం, పూర్ణకుంభ వృషభ దర్శనాలను చేయటం, వనితలు అక్షతలూ పూలూ చల్లటం మొదలైన దేశీయాచారాలను వర్ణించటం జాతి వార్తా విశేషకథనం. (సంపా.)

సీ. పాండవ యాదవ పాంచాల కేకయ ।
పాండ్య మాత్స్యాదులు భద్రదంతి
హయరథంబులతోడ నతికుతూహలమున ।
వచ్చినఁ గనుఁగొని వారినెల్ల
సంభావనంబుల సంభాషణంబుల ।
నాదరించుచుఁ దగ నల్ల నల్ల
విభవంబు మెఱయంగ విడిదల పఱపెల్లఁ ।
గడచిన యత్తఱిఁ గరము శుభము

ఆ. లైన శకునములకు నందఱుఁ బ్రియమంద ।
నరుగుచున్నయట్టి యవసరమున
రథము రథముఁ గదియ రా నిచ్చి ధర్మనం ।
దనుఁడు నెమ్మి నిట్టు లనియె హరికి. 131

ప్రతిపదార్థం: పాండవ, యాదవ, పాంచాల, కేకయ, పాండ్య, మాత్స్య+ఆదులు= పాండవులు, యాదవులు, పాంచాల విభుడు - ద్రుపదుడు, కేకయ రాజు, పాండ్య భూపతి, మత్స్య దేశాధీశుడు విరాటరాజు మొదలైనవారు; భద్ర దంతి హయరథంబుల తోడన్= భద్రజాతికి చెందిన ఏనుగులు, గుర్రాలు, రథాలతో; అతి కుతూహలమునన్= మిక్కిలి అభిలాషతో; వచ్చినన్= రాగా; కనుఁగొని= శ్రీకృష్ణుడు చూచి; వారిన్+ఎల్లన్= వారినందరినీ; సంభావనంబులన్= మన్ననలతో; సంభాషణంబులన్= చక్కని మాటలతో; ఆదరించుచున్= గౌరవిస్తూ; తగన్= ఒప్పిదంగా; అల్లన్+అల్లన్= మెల్ల

మెల్లగా; విభవంబు+మెఱయంగన్= వైభవం ప్రకాశించగా; విడిదల పఱపు+ఎల్లన్= సేనలు విడిసిన ప్రదేశమంతా; కడచిన+ఆ+తఱిన్= దాటిన తరుణంలో; కరము= మిక్కిలి; శుభములు+ఐన+శకునములకున్= మంగళకరాలైన శకునాలకు; అందఱున్= అచటి వారెల్లరూ; ప్రియము+ అందన్= సంతోషపడగా; అరుగుచున్న+అట్టి అవసరమునన్= వెళ్ళుతున్న వేళలో; రథమున్= తన రథాన్ని; రథమున్+కదియన్+ రాన్+ఇచ్చి= శ్రీకృష్ణుడి రథాన్ని వెంబడించేటట్లు కావించి; ధర్మనందనుఁడు; హరికిన్= గోవిందుడికి; నెమ్మిన్= ప్రీతితో; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: పాండవులు, యాదవులు, పాంచాల విభుడైన ద్రుపదుడు, కేకయరాజు, పాండ్య వల్లభుడు, విరాట మహారాజు మొదలైనవారు భద్రజాతికి చెందిన ఏనుగులు, గుర్రాలు, రథాలతో మిక్కిలి ఆసక్తితో వచ్చారు. వారిని వీక్షించి శ్రీకృష్ణుడు ఆదరణలతో సంభాషణలతో గౌరవించాడు. వైభవంతో మెల్ల మెల్లగా సేనలు నిలిచి ఉన్న తావు లన్నిటినీ దాటగానే శుభ శకునాలు గోచరించాయి. అందరూ ఎంతో హర్షించారు. అలా శ్రీకృష్ణుడు వెళ్ళుతున్న సమయంలో తన రథం అతడి రథం దగ్గరకు పోనిచ్చి ధర్మపుత్రుడు శ్రీహరితో ఇట్లా అన్నాడు.

ఉ. ‘వచ్చె జనార్దనుం డనిన వార్తకుఁ బ్రాణము మేనికంతకున్
వచ్చిన సేదఁ దేఱుఁ గురువంశ పవిత్రచరిత్ర గొంతి నీ
వచ్చటి కేఁగి పాండవుల యందఱ మాఱనిచెప్పి మ్రొక్కుచున్
గ్రుచ్చియ కౌఁగిలించుకొని కుందిన చిత్తము నొప్పి దీర్పుమీ! 132

ప్రతిపదార్థం: కురువంశ పవిత్ర చరిత్ర= కురువంశమును పావనము చేయు నడవడిగల; గొంతి= కుంతీదేవి; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; వచ్చెన్= వచ్చాడు; అనిన వార్తకున్= అనినట్టి వృత్తాంతానికి; ప్రాణము= ఊపిరి; మేనికిన్+అంతకున్= శరీరాని కంతటికినీ; వచ్చినన్= రాగా; సేద తేఱున్= బడలిక నుండి తేరుకొంటుంది; నీవు+అచ్చటికిన్+ఏఁగి= నీవు ఆమె ఉన్న తావునకు పోయి; పాండవుల+అందఱ మాఱు+అని చెప్పి= పాండవులందరికీ బదులు అని పలికి; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; గ్రుచ్చి+అ కౌఁగిలించుకొని= గట్టిగా కౌగిలించుకొని; కుందిన చిత్తము నొప్పిన్= క్రుంగిపోయిన మనసులోని బాధను; తీర్పుమీ!= పోగొట్టుము.

తాత్పర్యం: ‘మా తల్లి కుంతీదేవి కురువంశాన్ని పవిత్రం చేసే ప్రవర్తన కలది. మధుసూదనుడు వచ్చాడన్న సంగతి చెవి సోకగానే ఆమె శరీరమంతటికినీ చైతన్యం వచ్చినట్లుంటుంది. (ప్రాణం లేచి వచ్చినట్లుంటుంది.) ఆమె శ్రమ తొలగిపోతుంది. నీవు మా తల్లి కడకేగి మా అందరికి మారుగా నమస్కరించి, గట్టిగా కౌగిలించుకొని, కుప్పకూలిన ఆమె మనసులోని బాధను నివారించుము.

చ. అడవికి నేఁగునాఁడు మము నంపఁగ నెంతయు దవ్వు వచ్చిన
ప్పుడు దనమోము దైన్యమునఁ బొందెడు నశ్రులుఁ జూచి చూచి య
ట్లొడఁబడి డించిపోవలసె నుమ్మలికమ్మున గొంతి యింతకుం
బడుగయి పాలలోఁ బడిన బల్లి విధంబున నుండకుండునే? 133

ప్రతిపదార్థం: అడవికిన్+ఏఁగునాఁడు= అరణ్యవాసానికి వెళ్ళే వేళలో; మమున్+అంపఁగన్= మమ్ము పంపటానికి; ఎంతయున్ దవ్వు= మిక్కిలి దూరం; వచ్చిన+అప్పుడు= వచ్చిన సమయాన; తన మోము= తన ముఖం; దైన్యమునన్= దీనత్వంచేత; పొందెడు+అశ్రులు= పొందుతున్న దుఃఖబాష్పాలు; చూచి చూచి= ఆ విధంగా కనులతో చూస్తూ కూడ; అట్లు ఒడఁబడి= ఆ రీతిగా సమ్మతించి; డించిపోన్+వలసెన్= వదలిపెట్టి వెళ్ళవలసి వచ్చింది; ఉమ్మలికమ్మునన్= శోకంతో; గొంతి= (మా జనని) కుంతీదేవి; ఇంతకున్= ఇప్పటికి; బడుగు+అయి= శుష్కించినదై; పాలలోన్ పడిన= పాలలో పడిన; బల్లి విధంబునన్= బల్లివలె; ఉండక+ఉండునే?= ఉండక ఉంటుందా? (ఉండి ఉంటుంది.)

తాత్పర్యం: అడవులకు పోయేటప్పుడు మమ్ములను పంపటానికి చాలా దూరం నడచి వచ్చింది. ముఖంలో దైన్యం నెలకొన్నది. కన్నులలో దుఃఖబాష్పాలు నిండాయి. అట్టి మా తల్లిని చూస్తూ చూస్తూ సమ్మతించి హస్తినలో విడిచిపెట్టి వెళ్ళవలసి వచ్చింది. పాలలో పడిన బల్లివలె ఆమె దుఃఖంతో ఈపాటి కెంతో శుష్కించిపోయి ఉంటుంది.

విశేషం: 1. అలం: ఉపమ, లోకోక్తి.

2. ధర్మజుడు కుంతీదేవిని గురించి చెప్పిన మాటలు వత్సల, ప్రేయోరస ముద్రితాలు. తల్లిని కలిసికొని తమ పక్షాన ఆమెను ప్రేమతో కౌగిలించుకొని మనోవేదన తొలగేటట్లుగా శ్రీకృష్ణుడిని మాట్లాడుమన్నాడు. అడవికి పంపేనాడు ఆమె దైన్యంతో కన్నీరు మున్నీరయిన ఆనాటి దృశ్యం ఇంకా కళ్ళల్లో మెదలుతున్నదని ధర్మజుడు జ్ఞాపకం చేసికొన్నాడు. విధిలేక ఆమెను హస్తినలో వదలవలసి వచ్చింది. ఇన్నేళ్ళుగా ఆమె దిగులుతో వరుగై పోయి ఉంటుందని అంటూ 'పాలలో బడ్డ బల్లి' వలె అనే ఉపమానం వాడాడు. పాలు రుచిగా ఉండేవయినా, దానిలో పడి బల్లి ప్రాణాంతకంగా భావిస్తుంది. హస్తినలో విదురుడింట ఆమె సుఖంగా ఉన్నా పుత్ర వియోగతాపంతో వేడిపాలలోని బల్లివలె మగ్గిపోతూ ఉంటుందని సార్థకంగా చెప్పాడు. లోకోక్తిని ఉపమానంగా తీసికొని చెప్పటం దేశీయం. (సంపా.)

క. లక్కయిలు కాలినది మొద।
లక్కట! మా తల్లి మాకునై నెవ్వగతోఁ
బెక్కిడుమలఁ బడుచున్నది।
దిక్కెవ్వరు లేనియట్లు దీనత్వమునన్. 134

ప్రతిపదార్థం: అక్కట!= అయ్యో!; లక్క ఇలు కాలినది మొదలు= లాక్షాగృహ దహనం జరిగినప్పటి నుండి; మా తల్లి= మా జనని; మాకున్+ఐ= మా కొఱకు; నెఱ+వగతోన్= నిండు దుఃఖంతో; ఎవ్వరు దిక్కులేని అట్లు= ఎవరూ తనకు ఆధారం లేనివిధంగా; దీనత్వమునన్= దైన్యంతో; పెక్కు+ఇడుమలన్+పడుచున్+ఉన్నది= పలు కష్టాలు అనుభవిస్తున్నది.

తాత్పర్యం: అయ్యో! లాక్షాగృహదహనం జరిగినది మొదలు దిక్కుమాలిన దానివలె మా తల్లి దైన్యంతో మా కొరకు పలు కష్టాలు అనుభవిస్తూ ఉన్నది.

క. ఏ ననుట గాఁగ దుఃఖము।
లైనవి దెగు సమయ మయ్యె నని చెప్పుము; మీ
మేనత్త నూఱడింపుము;।
దా నెప్పుడు నీవు గలవు తన కనుచుండున్.' 135

ప్రతిపదార్థం: ఏన్+అనుట+కాఁగన్= నేను చెప్పినట్లుగా; దుఃఖములు+ఐనవి= దుఃఖాలనునట్టివి; తెగు సమయము+అయ్యెన్= తొలగేవేళ సమీపించింది; అని చెప్పుము= అని చెప్పవలసింది; మీ మేనత్తన్+ఊరడింపుము= మీ మేనత్త అగు కుంతీదేవిని ఓదార్చ వలసింది; తాన్= మా అమ్మ; ఎప్పుడున్= ఎల్లవేళలందు; తనకున్= తనకు; నీవు కలవు+అని= నీవు(ఆధారమని) ఉన్నావని; అనుచున్+ఉండున్= పలుకుతుంటుంది.

తాత్పర్యం: దుఃఖాలు అనుభవించటం ఐనది, కష్టాలు తొలగే సమయం వచ్చింది - అని మా అమ్మతో నేను చెప్పినట్లుగా చెప్పవలసింది. కృష్ణా! మీ మేనత్తను ఊరడించ వలసింది. నీవు తన కెప్పుడూ ఆధారమని ఆమె పలుకుతుంటుంది.'

వ. అని చెప్పి వెండియు. 136

తాత్పర్యం: ధర్మజుడిట్లా చెప్పి, మరల ఇట్లా అన్నాడు. (తరువాతి పద్యంతో అన్వయం)

ఆ. 'గురుఁడు బాహ్లికాది కురువృద్ధులును సుహృ।
ద్బాంధవులు నశేష ధరణిపతులుఁ

బ్రీతిఁ బొంద నెవ్వరికి నేది దగుఁ బ్రణా ।
మాది విధుల నడపు నాదుపలుకు. 137

ప్రతిపదార్థం: గురుఁడు= ద్రోణుడు; బాహ్లిక+ఆది= శంతన మహారాజు తమ్ముడైన బాహ్లికుడు మున్నగు; కురువృద్ధులును= కురు వంశములోని పెద్దలును; సుహృత్+ బాంధవులును= చెలికాండ్రు, చుట్టాలును; అశేష ధరణి పతులున్= సకల రాజులున్నూ; ప్రీతిన్+పొందన్= సంతోషం చెందేటట్లు; ఎవ్వరికిన్+ఏది, తగున్= ఎవరి యెడల ఏది ఉచితమో; ప్రణామ+ఆది విధులన్= నమస్కారాలు మొదలైన ఉపచారాల చేత; నాదు పలుకున్= నా మాటను; నడపు(ము)= వారికి అందజేయవలసింది.

తాత్పర్యం: 'గురువగు ద్రోణాచార్యులు, బాహ్లికుడు మొదలైన కురువంశంలోని పెద్దలు, చెలికాండ్రు, చుట్టాలు, సకల భూపతులు సంతసించేటట్లు ఎవరి పట్ల ఏది ఉచితమో, ఆ విధంగా నమస్కారాది విధులొనర్చినానని నా మాటగా వారికి చెప్పుము.

క. పరమ ప్రియమున నాకై ।
పరిరంభణ సేసి గాఢ బాంధవ సాంద్రా
దరమున సంభాషింపు వి ।
దురుతోఁ; మధ్యస్థుఁడగు హితుం డతఁడనఘా!' 138

ప్రతిపదార్థం: అనఘా!= దోషరహితుడా!; నాకై= నాకు మారుగా; పరమ ప్రియమునన్= మిక్కిలి ప్రేమతో; పరిరంభణ చేసి= కౌగిలించుకొని, గాఢ బాంధవ= దృఢమైన చుట్టరికంచేత కలిగిన; సాంద్ర= నిబిడమైన; ఆదరమునన్= గౌరవంచేత; విదురుతోన్; సంభాషింపు(ము)= మాట్లాడుము; అతఁడు= ఆ మహనీయుడు; మధ్యస్థుఁడు+అగు హితుఁడు= పక్షపాతం లేక ఉభయ వర్గాల మేలు కోరేవాడు.

తాత్పర్యం: మిక్కిలి ప్రేమతో నాకు బదులుగా విదురుడిని కౌగిలించుకొని గాఢమైన బాంధవాదరంతో ఆయనను గౌరవించి మాటాడుము. అతడు పక్షపాతం లేకుండా కురు పాండవుల మేలుకోరే మహనీయుడు.'

వ. అనియెఁ దదనంతరంబ యర్జునుండు. 139

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తర్వాతనే.

తాత్పర్యం: అని ధర్మరాజు చెప్పినాడు. అటు తర్వాత అర్జునుడిలా అన్నాడు.

చ. 'జనులు వినంగ రాజ్యమున సాము గొనంగలవారమన్న యీ
జనపతి కార్యనిశ్చయము సమ్మతి గైకొని చేసినన్ సుయో
ధనుఁడును దమ్ములున్ సఖులు దానికి నేమును నియ్యకొందు మొం
డనిన సపుత్త్రమిత్త్రముగ నద్దెస నందఱ గ్రొచ్చి పాఁతుదున్.' 140

ప్రతిపదార్థం: జనులు వినంగన్= ప్రజలందరూ వింటుండగా; రాజ్యమునన్= హస్తినాపుర సామ్రాజ్యంలో; సాము= సగపాలు; కొనన్+కలవారము= తీసికొనగలం; అన్న= అని నుడివిన; ఈ జనపతి కార్య నిశ్చయమున్= విభుడగు ధర్మజుడి కార్య నిర్ణయాన్ని; సుయోధనుఁడును= దుర్యోధనుడూ; తమ్ములున్= అతడి సహోదరులూ; సఖులున్= అతని చెలికాండ్రూ; సమ్మతిన్= అంగీకారంతో; కైకొని= అతని మాట స్వీకరించి; చేసినన్= ఆచరిస్తే; దానికిన్= అర్ధ రాజ్యం తీసుకొనటానికి; ఏమును= మేమున్నూ; ఇయ్యకొందుము= ఒప్పుకొంటాం; ఒండు+అనినన్= వేరు విధంగా పలికితే; సపుత్త్ర మిత్త్రముగన్= సుతులతో, హితులతో కూడా; ఆ+దెసన్+అందఱన్= ఆ పక్షంలోఉన్న వారినందరినీ, గ్రొచ్చి పాఁతుదున్= గోయి త్రవ్వి పూడ్చిపెడతాను.

తాత్పర్యం: 'జనులంతా వింటుండగా రాజ్యంలో సగభాగం మేము తీసికొంటాం'. అని ధర్మజుడు తీర్మానించాడు. ఆ తీర్మానానికి సమ్మతించి దుర్యోధనుడూ, అతడి తమ్ములూ, అతడి స్నేహితులూ అర్ధరాజ్యమిస్తే

మేము అందుకు అంగీకరిస్తాము. ఇందుకు మరో విధంగా చెపితే కౌరవపక్షంలో ఉన్నవారినందరినీ సుతులతో హితులతో కూడ గోతులు త్రవ్వి పూడ్చిపెడతాను.'

విశేషం: 'అందఱ గ్రొచ్చి పాఁతుదున్' - అన్నది తెలుగు జాతీయం. కోపం వచ్చినప్పుడు ఎదుటివారిని (గొయ్యితీసి) పాతిపెడతాననటం తెలుగువారికి అలవాటు. కాగా, యుద్ధ రంగాలలో కుప్పలు కుప్పలుగా పడి ఉన్న శవాలను పెద్ద పెద్ద గోతులు తవ్వి మూక ఉమ్మడిగా పూడ్చటం కూడా సహజం. ఏమైనా ఈ వాక్యం అర్జునుడికి కౌరవులమీదగల తీవ్రకోపాన్ని వ్యక్తం చేస్తున్నది. (సంపా.)

మ. అనినన్ మెచ్చి వృకోదరుం డితఁడు కార్యం బింత దెల్లంబుగాఁ
బొనరం బల్కునె?' యంచుఁ బేరెలుఁగు సొంపుం బొంద వక్త్రంబు పొ
ల్పున దర్పం బొలయంగ నంగములునుం బొంగార నుద్బృంహిత
ధ్వనియై పొల్చు మహోగ్ర సింధురము చందం బొంది యొప్పెం గడున్.141

ప్రతిపదార్థం: అనినన్= అని పార్థుడు పలుకగా; మెచ్చి= మెచ్చుకొని; వృకోదరుండు= భీమసేనుడు; ఇతఁడు= అర్జునుడు; కార్యంబున్= చేయదగిన పనిని; ఇంత తెల్లంబుగాన్= ఇంత విస్పష్టంగా; పొనరన్+పల్కునె?= ఒప్పుగ చెప్పుతాడా?; అంచున్= అంటూ; పేరు+ఎలుఁగు= గొప్ప కంఠధ్వని; సొంపున్+పొందన్= అందగించగా; వక్త్రంబు పొల్పునన్= ముఖ సౌందర్యం చేత; దర్పంబు= గర్వం; ఒలయంగన్= వ్యాపించగా; అంగములునున్= అవయవాలు కూడా; పొంగు+ఆరన్= పొంగగా, ఉబ్బగా; ఉత్+బృంహితధ్వని+ఐ= గొప్ప ఘీంకార శబ్దంకలదై; పొల్చు= శోభిల్లు; మహా+ఉగ్ర సింధురము చందంబున్+ఒంది= మహా భయంకరమైన ఏనుగు తీరై; కడున్= మిక్కిలి; ఒప్పెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: అర్జునుడి పలుకులు శ్లాఘిస్తూ 'ఇతడు చేయవలసిన పనిని గూర్చి ఎంతో విస్పష్టంగా చెప్పాడు అంటూ తన గంభీర కంఠస్వరం

అందం చిందగా, ముఖ సౌందర్యంచేత గరువం వ్యాపించగా, అవయవాలు పొంగగా, గొప్ప ఘీంకార ధ్వనితో చెలువారు మత్తగజంవలె భీముడు ప్రకాశించాడు.

విశేషం: భీముడు గొప్ప సహృదయుడు. అర్జునుడు వీరవాక్యం మాట్లాడగా విని తానే ఆ మాటలన్నంత ఉప్పొంగిపోయాడు. ఆ అన్నదమ్ముల ఆత్మీయత కూడా అటువంటిదే. వీరోల్లాసంతో సంతోషించే భీముడు ప్రదర్శించే ఆంగికాభినయం ఇందులో సుందర గంభీరం. మాటలు శ్రావ్య గంభీరంగా వెలువడ్డాయి. ముఖం గర్వంతో అందంగా వెలిగిపోయింది. ఒడలు ఉప్పొంగింది. పెద్ద పెట్టున ఘీంకారం చేసే మత్తేభంవలె మనోహరంగా ఉన్నాడు. మదేభం వలె ఉన్న భీముడిని మత్తేభవిక్రీడితంలో వర్ణించటం ఛందశ్శిల్పం. (సంపా.)

క. నకుల సహదేవులును దా ।
నికి సంతసమంది 'యిట్లు నెయ్యము కయ్యం
బొక తెఱఁగు సేసికొని తడ ।
యక ర మ్మని పలికి రప్పు డచ్యుతుతోడన్. 142

ప్రతిపదార్థం: నకుల సహదేవులును= నకులుడూ; సహదేవుడూ; దానికిన్= అర్జునుడి పలుకులకు; సంతసము+అంది= సంతోషపడి; ఇట్లు= ఈ ప్రకారంగా; నెయ్యము= స్నేహమో; కయ్యము= యుద్ధమో; ఒక తెఱఁగు+చేసికొని= రెంటిలో ఒక దానిని నిశ్చయించి; తడయక రమ్ము+అని= ఆలసింపక రమ్మని; అచ్యుతు తోడన్= శ్రీకృష్ణుడితో; అప్పుడు= ఆ సమయాన; పలికిరి= చెప్పారు.

తాత్పర్యం: నకుల సహదేవులు అందుకు సంతసించి పొత్తో లేక పోరో ఏదో ఒకటి తీర్మానించుకొని వెంటనే రావలసినదని శ్రీకృష్ణుడితో చెప్పారు.

శ్రీకృష్ణుఁడు నారదాది మహామునులం గని సంభాషించుట (సం. 5-81-58)

వ. ఇవ్విధంబునం బాండునందను లందఱును గోవిందునకు వలయు మాటలు సెప్పి 'యతనిఁ గౌఁగిలించికొని యథోచిత ప్రకారంబుల వీడుకొని వలగొని మగిడిరి; తక్కినవారలు నర్హంబులగు తెఱంగుల నామంత్రితులై మరలిరి; మాధవుండును బ్రయాణ సర్వ సంభార నిర్వాహకులం గలయం గనుంగొని తగిన సల్లాపంబులు సేసి, కరినగరంబు పెం దెరువుఁ గైకొని దారుకుని చతురత్వంబునఁ దురంగంబుల పటుత్వంబున నత్యంత సమీచీనంబైన యానంబున మనం బలరం జనిచని, యొక్కయెడ నారద జమదగ్ని కణ్వాదులగు మహామునులం గొందఱం గని రథంబు డిగ్గి నమస్కరించి సభక్తి తాత్పర్యంబునఁ గుశలం బడిగి, మీ రిక్కడకు, విజయంచేయుటకుఁ గతం బేమి? సేయంగల పని యెయ్యది? నా కానతిం' డనిన నారాయణునకు నారదుం డిట్లనియె. 143

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈతీరున; పాండునందనులు; అందఱును; గోవిందునకున్= కృష్ణుడికి; వలయు మాటలు+ చెప్పి= చెప్పవలసిన మాటలు చెప్పి; అతనిన్; కౌఁగిలించికొని; యథా+ఉచిత ప్రకారంబులన్= అర్హమైన విధానాలతో; వీడుకొని= వెళ్ళి వస్తామని చెప్పి; వలగొని= ప్రదక్షిణంచేసి; మగిడిరి= మరలారు; తక్కినవారలు; అర్హంబులు+ అగు తెఱంగులన్= తగిన విధాల; ఆమంత్రితులు+ఐ= ఆ కృష్ణుడిచేత అనుమతి కొన్నవారై; మరలిరి= తిరిగి వెళ్ళారు; మాధవుండును; ప్రయాణ సర్వ సంభార నిర్వాహకులన్= పయనానికి కావలసిన సమస్త వస్తువులు సమకూర్చేవారిని; కలయన్+కనుంగొని= తేరిపార చూచి; తగిన సల్లాపంబులు+ చేసి= తగు ముచ్చటలు ఆడి; కరినగరంబు పెను+తెరువు+కైకొని= హస్తినాపురికి పోయే పెద్దబాట ననుసరించి; దారుకుని చతురత్వంబునన్= దారుకుని నేర్పు చేతను; తురంగంబుల-పటుత్వంబునన్= గుర్రాలయొక్క దృఢత్వం చేతను; అత్యంత సమీచీనంబు+ఐన= మిక్కిలి యుక్తమైన; యానంబునన్= గమనంచేత; మనంబు+ అలరన్= హృదయ మానందించగా; చని చని= వెళ్లి వెళ్లి; ఒక్క+ఎడన్= ఆ వెళుతున్న దారిలో; నారద, జమదగ్ని; కణ్వ+ఆదులు+అగు= నారదుడు, జమదగ్ని, కణ్వుడు మొదలైన; మహామునులన్= మహర్షులను; కొందఱున్; కని= చూచి; రథంబు; డిగ్గి= దిగి; నమస్కరించి; సభక్తి తాత్పర్యంబునన్= భక్తితోడి తత్పరత్వంతో; కుశలంబు+అడిగి= క్షేమం విచారించి; మీరు; ఇక్కడకున్; విజయం చేయుటకున్= రావటానికి; కతంబు+ఏమి?= కారణమేమిటి?; చేయన్+ కలపని+ఎయ్యది?= తమకు నేనేకార్యం చేయాలి?; నాకున్; ఆనతి+ఇండు= సెలవియ్యండి; అనినన్; నారాయణునకున్; నారదుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈ విధంగా పాండవు లందరూ శ్రీకృష్ణుడికి చెప్పవలసిన మాటలన్నీ చెప్పి, ఆలింగనం చేసికొని అర్హ ప్రకారంగా సెలవు పుచ్చుకొని ప్రదక్షిణం చేసి వెనుకకు మరలారు. యాదవులు, పాంచాలురు మొదలైన వారంతా తగు విధాల కృష్ణుడి అనుమతి పొంది అక్కడ నిల్చిపోయారు. తరువాత శౌరి ప్రయాణానికి కావలసిన పదార్థాలు సమకూర్చినవా రందరినీ కనుగొని వారితో ముచ్చటించాడు. హస్తినానగరికి వెళ్ళే విశాల మార్గంలో దారుకుని నైపుణ్యం, గుర్రాల పటుత్వం కారణంగా సాగిన చక్కని రథగమనం ఆయన మనస్సును ఆహ్లాదపరిచింది. కృష్ణుడు వెళ్ళుతుండగా దారిలో ఒకచోట నారదుడు, జమదగ్ని, కణ్వుడు మొదలైన మహర్షులు కొందరు కనిపించారు. వెంటనే గోవిందుడు రథం దిగి వారికి నమస్కరించాడు. మాధవుడు భక్తితత్పరుడై వారి క్షేమం విచారించి, 'మీరిక్కడికి విచ్చేయటానికి హేతువేమిటి? నేను తమకు చేయవలసిన పనులేమి?' సెలవియ్యం'డని అడిగాడు. అప్పుడు నారదుడు నారాయణుడితో ఇట్లా అన్నాడు:

సీ. 'అనఘ! పుణ్యాత్ముఁడ వగు నిన్నుఁ గనుఁగొనఁ, ।

గౌరవసభ నీవు గారవమునఁ

బలికెడి పలుకుల భంగు లాకర్ణింప, ।
విదుర భీష్మాదులు విను తెఱంగు
నుత్తరం బిచ్చు కార్యోక్తులు నెఱుఁగంగ ।
వేడుక వచ్చిరి వీరలెల్ల'
నని చెప్ప విని 'లెస్స, యట్ల చేయుదురుగా' ।
కని హరి వల్కిన నమ్మునీంద్రు

తే. లతని దీవించి 'నీవు పొ; మ్మచటి కేము ।
నరుగుదెంచెద'మని ప్రీతి ననుప నరిగి
యొక్క పుణ్యాశ్రమంబున యొద్ది యేట ।
విడిసి దివస ప్రవర్తన విధులు నడిపి. 144

ప్రతిపదార్థం: అనఘ!= దోషరహితుడా!; పుణ్య+ఆత్ముఁడవు+అగు నిన్నున్= సుకృతాత్ముఁడవైన నిన్ను; కనుఁగొనన్= చూడటానికి; కౌరవ సభన్= ధృతరాష్ట్రుని కొలువులో; నీవు; గారవమునన్= ఆదరంతో; పలికెడి పలుకుల భంగులు= మాటాడే మాటల తీరులు; ఆకర్ణింపన్= వినటానికీ; విదుర భీష్మ+ఆదులు= విదురుడు, భీష్ముడు మొదలైనవారు; విను తెఱంగు= వినే విధం; ఉత్తరంబు+ఇచ్చు కార్య+ఉక్తులు= కార్యానికి సంబంధించి వారు సమాధాన మిచ్చే మాటలు; ఎఱుఁగంగన్= తెలియటానికి; వీరలు+ఎల్లన్= ఈ మునీశ్వరులందరు; వేడుకన్= కుతూహలంతో; వచ్చిరి= వచ్చారు; అని; చెప్పన్; విని; లెస్స= మంచిది; అట్ల చేయుదురు గాక= అట్లే వచ్చి విందురుగాక; అని; హరి; పల్కినన్; ఆ+ముని+ఇంద్రులు= ఆ మౌనిశ్రేష్ఠులు; అతనిన్ దీవించి= కృష్ణుడిని ఆశీర్వదించి; నీవు; అచటికిన్= కురుసభకు పొమ్ము; ఏము= మేము; అరుగుదెంచెదము= వస్తాం; అని; ప్రీతిన్= సంతోషంతో; అనుపన్+అరిగి= వారు సాగనంపగా వెళ్ళి; ఒక్క+పుణ్య+

ఆశ్రమంబున+ఒద్ది+ఏటన్= ఒక పావనాశ్రమం చెంతగల నది ఒడ్డున; విడిసి= దిగి; దివసప్రవర్తన విధులు+నడిపి= ఆహ్నికాలైన వేదవిహిత కార్యాలు ఆచరించి.

తాత్పర్యం: 'వాసుదేవా! పుణ్యచిత్తుడవైన నిన్ను చూడటానికి కౌరవ సభలో నీవు ఆదరంతో చెప్పే మాటలు వినటానికీ, విదురుడు భీష్ముడు మొదలైనవారు వినే విధమూ, విని వారిచ్చే సమాధానాలూ తెలిసికొనటానికీ కుతూహలపడి ఈ మునీశ్వరులంతా వచ్చారు' అని చెప్పగా శ్రీకృష్ణుడు ఆలకించి 'మంచిది అలాగే చేయండి' అని అనుమతించాడు. మహర్షులు ఆయనను ఆశీర్వదించి 'నారాయణా! నీవు హస్తినాపురికి వెళ్ళుము. మే మక్కడికి వస్తాము' అని సంతోషంతో పంపగా, కృష్ణుడు బయలుదేరి ఒక పావనాశ్రమం చెంత గల ఏటి ఒడ్డున విడిది చేశాడు. అక్కడ శాస్త్ర విహితాలైన ఆహ్నికాలు నిర్వర్తించాడు.

వ. కమలనాభుండు గదలిపోయి సూర్యాస్తమయ సమయంబునఁ గుశస్థలంబు సేరం జనునప్పు డందలి విప్రు లెదురు వచ్చి కాంచి నిజనివాసంబులకుం బిలిచినం బ్రసన్నవదనుండగుచు సమ్మర్దంబు వలవదని పలికి విశాల రమణీయంబైన బహిరంగణంబునం బటకుటీర ప్రకరం బెత్తించి విడిసి, తగువారును దానును వారల గృహంబుల కరిగి యభ్యాగత పూజలు గైకొని వారిని సంభావించి విడిదలకుం జని సమయ సముచిత వృత్తిం బ్రవర్తిల్లుచుండె; నంత నక్కడ; 145

ప్రతిపదార్థం: కమలనాభుండు= కమలం నాభియందు కల శ్రీకృష్ణుడు; కదలిపోయి= పయనం సమకట్టి; సూర్య+అస్తమయ సమయంబునన్= ప్రొద్దు గ్రుంకువేళకు; కుశస్థలంబు చేరన్+చను+అప్పుడు= కుశస్థలమనే ప్రదేశాన్ని సమీపించే సమయంలో; అందలి విప్రులు= కుశస్థల వాసులైన బ్రాహ్మణులు; ఎదురు వచ్చి= కృష్ణుడికి ఎదురుగా వెళ్ళి; కాంచి= చూచి; నిజనివాసం బులకున్= తమ ఇండ్లకు; పిలిచినన్= రండని ఆహ్వానింపగా; ప్రసన్న

వదనుండు+అగుచున్= అనుగ్రహంతో కూడిన మోముకలవాడై; సమ్మర్దంబు వలవదు= సందడి పనికిరాదు; అని పలికి; విశాల రమణీయంబు+ఐన= విరివి ఐనది సుందరమైనది అగు; బహిః+అంగణంబునన్= మైదానంలో; పట కుటీర ప్రకరంబు+ఎత్తించి= పెక్కు గుడారాలు వేయించి; విడిసి= వాటిలో దిగి; తగువారును= తగిన మనుష్యులును; తానును; వారల గృహంబులకున్; అరిగి; అభ్యాగత పూజలు+కైకొని= భోజనమప్పుడు వచ్చిన వారికి చేసే సత్కారాలు స్వీకరించి; వారిని సంభావించి= ఆ బ్రాహ్మణులను ఆదరించి; విడిదలకున్+చని= తాము విడిసిన పట కుటీరాలకు వెళ్ళి; సమయ సముచిత వృత్తిన్= ఆ వేళకు దగిన పనిపాటులలో; ప్రవర్తిల్లుచున్+ఉండెన్= మెలగుతూ ఉన్నాడు; అంతన్= అటు పిమ్మట; అక్కడ= హస్తినాపురంలో.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు బయలుదేరి ప్రొద్దుగ్రుంకే వేళకు కుశస్థలం సమీపించాడు. అక్కడి బ్రాహ్మణులు నారాయణునకు ఎదురువచ్చి తమ గృహాలకు రమ్మని ఆహ్వానించారు. శౌరి ప్రశాంత ముఖంతో వారిని చూచి, ఇంత మంది పరిజనంతో రావటం లేదు, అని చెప్పి అక్కడొక విశాలమైన సుందరమైన మైదానంలో గుడారాలు వేయించాడు. పరిజనమంతా ఆ శిబిరాలలో ఉండగా తాను, అర్హులైన కొద్దిమందితో మాత్రం ముకుందుడు ఆ విప్రుల నిలయాలకు వెళ్ళాడు. అక్కడ వారిచ్చే అతిథి సపర్యలు స్వీకరించాడు. భూసురులను ఆదరించి తిరిగి తమ విడిది పట్టులకు చేరి, ఆ సమయానికి తగిన పనులలో నిమగ్నుడైనాడు. ఇక హస్తినాపురంలో. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. వార్త విని యాక్షణమ కౌరవక్షితీశ్వ।
రుండు గాంగేయ గురు విదురులను బుత్త్రు
సంజయునిఁ గర్ణు సైంధవు శకునిఁ బిలువఁ।
బనిచి తా నిట్టు లనియె నందనునితోడ. 146

ప్రతిపదార్థం: కౌరవక్షితి+ఈశ్వరుండు= ధృతరాష్ట్ర మహారాజు; వార్తన్ విని= కృష్ణుడు వస్తున్న సమాచారం తెలిసి; ఆ క్షణమ= అప్పుడే; గాంగేయ గురు విదురులను= గంగా పుత్రుడైన భీష్ముడిని, ఆచార్యుడైన ద్రోణుడిని, సచివుడైన విదురుడిని; పుత్త్రున్= కుమారుడైన దుర్యోధనుడిని; సంజయునిన్= చెలికాడగు సంజయుడిని; కర్ణున్= రాధేయుడిని; సైంధవున్= అల్లుడైన సైంధవుడిని; శకునిన్= మరిదిఅయిన శకునినీ; పిలువన్+పనిచి= దగ్గరకు రప్పించుకొని; నందనునితోడన్= కుమారుడితో; తాన్= తాను (ఆ ధృతరాష్ట్రుడు); ఇట్టులు+అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

తాత్పర్యం: కురువంశ విభుడగు ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడు తమకడకు వస్తున్నాడనే సమాచారం విని, వెంటనే తన దగ్గరికి భీష్ముడిని, ద్రోణుడిని, విదురుడిని, దుర్యోధనుడిని, కర్ణుడిని, సైంధవుడిని, శకునినీ పిలిపించాడు. దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

వ. 'కృష్ణుఁడు పాండవ కార్యార్థంబుగా మనయొద్దకు వచ్చుచున్నవాఁడు; నేఁడు కుశస్థలంబున విడిసె రేపిందులకు వచ్చునని వింటి; మిట్టి యాశ్చర్యంబునుం గలదే! సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యుల మైతిమి; మన కింతకంటెను బెంపెయ్యది? యతం డెవ్వరివలన సంతుష్టుండయ్యె వారికి శుభంబును, నెవ్వరిదెస ననాదరంబు సేసె వారికి నశుభంబు నగుటదప్ప; దతనికి వలయు పూజ లాచరించుటకు సంవిధానంబు సేయుము; గృహాలంకరణాది మంగళప్రకారంబు లనుష్ఠింప నియమింపు; మతని చిత్తంబునకు నీ విభవంబును దనమీఁది ప్రియంబునుం దోఁచునట్టి తెఱంగున సమస్తంబును సమకట్టుము. 147

ప్రతిపదార్థం: కృష్ణుఁడు; పాండవ కార్య+అర్థంబుగాన్= పాండవుల పని కొరకై; మన+ఒద్దకున్; వచ్చుచున్+ఉన్నవాఁడు; నేఁడు; కుశస్థలంబునన్; విడిసెన్; రేపు; ఇందులకున్; వచ్చున్; అని; వింటిమి; ఇట్టి ఆశ్చర్యం

బునున్+కలదే?= ఇంతటి వింత ఉన్నదా?; సర్వలోక+అభిగమ్యుండు= సమస్త లోకములకు పొందదగినవాడు; అగు+అ+ మహానుభావునకున్; మనము; అభిగమ్యులము+ఐతిమి= పొందదగిన వారమైనాము; మనకున్; ఇంతకంటెను; పెంపు+ఎయ్యది?= భాగ్యమేముంది?; అతండు; ఎవ్వరివలనన్; సంతుష్టుండు+అయ్యెన్= మిక్కిలి సంతోషం పొందిన వాడాయెనో; వారికిన్; శుభంబును; ఎవ్వరి దెసన్= ఎవరి విషయమున; అనాదరంబు+చేసెన్= మన్నన చూపడో; వారికిన్; అశుభంబున్= అమంగళమూ; అగుట; తప్పదు; వలయు= కావలసిన; పూజలు= సపర్యలు; ఆచరించుటకున్= కావించటానికి; సంవిధానంబు+చేయుము= ఏర్పాటు చేయుము; గృహ+అలంకరణ+ఆది= ఇండ్లు అలంకరించటం మున్నగు; మంగళ ప్రకారంబులు= శోభన కార్యాలు; అనుష్ఠింపన్= ఆచరించటానికి; నియమింపుము= ఆజ్ఞాపించుము; అతని చిత్తంబునకున్= శౌరి మనస్సునకు; నీ విభవంబును= నీ ప్రాభవం; తన మీఁది ప్రియంబునున్= తన యెడ నీకు గల ఇష్టం; తోఁచునట్టి తెఱంగునన్= గోచరించే విధంగా; సమస్తంబును సమకట్టుము= అన్ని ఏర్పాట్లు చేయుము.

తాత్పర్యం: ‘శ్రీకృష్ణుడు పాండవుల పనిమీద మన దగ్గరకు వస్తున్నాడు. ఈ రోజు కుశస్థలంలో నిలిచాడు. ఇక్కడకు రేపు వస్తాడని విన్నాను. ఇంతటి అద్భుత విషయం ఉన్నదా? లోకులందరు ఎవడి చెంతకు చేరవలెనని ఉవ్విళ్ళూరుతారో అట్టి మహానుభావుడు మనకడకు వస్తున్నాడు. మన కింతకంటే అదృష్టముందా? ఎవ్వరు అతడిని సంతోష పెట్టుతారో వారికి శుభాలూ, ఎవరు అతడిని ఆదరించరో వారికి అశుభాలూ జరగటం తథ్యం. కావున ఆయనకు సర్వ సపర్యలు చేయటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చక్కగా కావించుము. భవనాలు అలంకరించటం మొదలైన మంగళ కార్యాలకు వెంటనే ఆదేశాలివ్వవలసింది. అతడి హృదయం సంతోషించేటట్లు, నీ ప్రాభవానికి తగ్గట్లు, తనమీద నీకున్న ప్రేమ వెల్లడి అయ్యేటట్లు సర్వమూ సంసిద్ధ మొనర్చుము.’

విశేషం: 1. అలం: ప్రహర్షణం. “ఉత్కంఠితార్థ సంసిద్ధి ర్వినా యత్నం ప్రహర్షణమ్’. ప్రయత్నం లేకుండానే అభిమతార్థం సిద్ధించినట్లు చెప్పితే ప్రహర్షణాలంకారం. ధృతరాష్ట్రుడి వాక్యాలు ఈ అలంకారానికే అలంకారం.

2. ధృతరాష్ట్రుడు గుడ్డివాడు. కాని, లోవెలుగుతో శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గుర్తించి ‘సర్వలోకాభిగమ్యుండగు నమ్మహానుభావునకు మన మభిగమ్యులమైతిమి. మన కింతకన్నకు ‘బెం పెయ్యది?’ అని ఉప్పొంగిపోయాడు. ఇది సహజమైన ఆత్మానందోల్లాసం. ఇక్కడ ఈ వాక్యం కీలకం. పాండవుల కొరకైనా పరమాత్ముడు కౌరవసభకు వస్తున్నాడని గుర్తించి ధృతరాష్ట్రుడు నిండుసభలో విశ్వరూపదర్శనం చేయదగిన అంతస్సంస్కారం, లోచూపు కలవాడని వస్తుధ్వని.

3. కన్నులు లేకపోయినా కమలనాభుడిని అంతర్నేత్రంతో చూడగల ధృతరాష్ట్రుడు కన్నులున్నా పద్మాక్షుడిని కనుగొనలేని గర్వాంధుడైన దుర్యోధనుడికి ఆ మహాత్ముడిని ఆరాధించుమని చెప్పటం విశేషం. గర్భశిలవంటి వాడు ధృతరాష్ట్రుడు.

4. శ్రీకృష్ణుడు సాక్షాత్ నారాయణుడని భావించిన ధృతరాష్ట్రుడు ఆయన ఆదరణం పొందగలగటం శుభప్రదం. అనాదరణం పొందటం అశుభం- అని నిర్దేశించాడు. ఇది భావికథార్థ సూచిక అయిన పతాక.

5. అపూర్వాహ్వాన సంభారాలు చేయండని ఉప్పొంగుతూ ధృతరాష్ట్రుడు ఆదేశాలిచ్చాడు. ఆ మాటలన్నీ దుర్యోధనుడు వింటాడని అతడూ భ్రమించలేదు. అందుకే మెళకువగా అన్నాడు - దుర్యోధనుడి వైభవ మొకవైపూ, ప్రీతి మరొక వైపూ ప్రదర్శితమయ్యేటట్లుగా స్వాగత సన్నాహాలు చేయుమన్నాడు.

6. పరమాత్మయొక్క భావనం, దర్శన స్పర్శన సంభాషణ సౌముఖ్యాల సమ్మోదం, అనుగ్రహాశీర్వాద ప్రసాద లాభం మొదలైన వాటి వలన కలిగే ప్రహర్షణం తెచ్చిపెట్టుకొనేది కాదు. అంతఃప్రబోధంతో ఆవిర్భవించే ప్రహర్షణం. (సంపా.)

క. అనిన ధృతరాష్ట్రు పలుకులు।
గొనియాడిరి సంతసిల్లి గురుఁడును భీష్ముం

డును నౌఁగాకని దుర్యో ।

ధనుడుం బరిచారక ప్రతతిఁ బిలిపించెన్. 148

ప్రతిపదార్థం: అనిన ధృతరాష్ట్రు పలుకులు= అని చెప్పిన ధృతరాష్ట్రుడి మాటలు; గురుఁడును= ద్రోణుడును; భీష్ముండును= భీష్ముడూ; సంతసిల్లి= ఆనందించి; ఔన్+కాక+అని= మంచిదే అని; కొనియాడిరి= మెచ్చారు; దుర్యోధనుఁడున్= సుయోధనుడూ; పరిచారక ప్రతతిన్= సేవకుల సమూహాన్ని; పిలిపించెన్= రావించాడు.

తాత్పర్యం: ద్రోణుడు, భీష్ముడు ధృతరాష్ట్రుడి మాటలకు సంతోషించి ఇది యుక్తమే అని మెచ్చారు. అంతట దుర్యోధనుడు సేవకులను పిలిపించాడు.

వ. ఇట్లుచిత పరివారంబు రావించి యతండు. 149

తాత్పర్యం: ఈ విధంగా దుర్యోధనుడు తగిన పరిచారకులను పిలిపించి ఇట్లన్నాడు:

క. 'అలుకుఁడు మృగమదమున, ము ।

గ్గులు వెట్టుఁడు గప్పురమునఁ, గుంకుమమున గో

డలు పూయుఁడు' మణిదామక ।

ములు గట్టుఁడు పెద్ద కూటమున సొంపారన్. 150

ప్రతిపదార్థం: పెద్ద కూటమునన్= సభాసదనంలో; సొంపు+ఆరన్= కనుల కింపుగా; మృగమదమునన్= కస్తూరితో; అలుకుఁడు= నేల నలకండి; కప్పురమునన్= కర్పూరంతో; ముగ్గులు+పెట్టుఁడు= రంగవల్లికలు తీర్చండి; గోడలు= గోడలు; కుంకుమమునన్= కుంకుమ ద్రవ్యంతో; పూయుఁడు= మెత్తండి; మణిదామకములు+కట్టుఁడు= మణుల దండలు ద్వారాలకు కట్టండి.

తాత్పర్యం: సభా సదనంలో నేలను కస్తూరితో అలకండి. కర్పూరంతో రంగవల్లికలు తీర్చండి. గోడలు కుంకుమ పంకంతో మెత్తండి. ద్వారదేశాలకు మణుల దండలు వ్రేలాడదీయండి.

విశేషం: విశేషం: అలం: ఉదాత్తం.

వ. మఱియు నగరెల్లను శోభిల్ల నలంకారంబు సేయుండు. 151

తాత్పర్యం: ఒక్క కొలువు కూటమునేకాక నగరమంతా అలంకరించండి.

క. పెనుపుం జతురత మెఱయఁగ ।

మన యింటను దుస్సేను మందిరమున శో

భనశిల్పము లొనరింపుఁడు ।

చనుఁడు వృకస్థలమునందుఁ జప్పరము లిడన్. 152

ప్రతిపదార్థం: పెనుపున్= పెంపును; చతురత= నేర్పు; మెఱయఁగన్= వెల్లడి అయ్యేటట్లు; మన+ఇంటను= మన భవనంలో; దుస్సేను మందిరమునన్= దుశ్శాసనుడి సౌధంలో; శోభన శిల్పములు+ఒనరింపుఁడు= మంగళకరమైన చిత్తరువులు వ్రాయించండి; వృకస్థలమునందున్= వృకస్థలం అనేచోట; చప్పరములు+ఇడన్+చనుఁడు= పందిళ్ళు వేయటానికి పొండి.

తాత్పర్యం: మీ కళాచాతుర్యము వెల్లడి యగునట్లు మన భవనంలో, దుశ్శాసనుడి భవనంలో మనోహరాలైన చిత్తరువులు చిత్రించండి. వృకస్థలంలో చలువ పందిళ్ళు వేయించండి.

వ. అది విడి పట్టు గాఁదగియెడు ప' ట్టని పలికి 'వాసుదేవుండు రేపకడయ వచ్చునంతకుమున్న యింతయుం గావింపవలయు' నని పనిచి పురంబున నుత్సవంబు సాటుండని నియోగించి వివిధ గంధ మహిత మాల్యంబులు సంపాదింపను మణిభూషణ చిత్రాంబరంబులు సమకట్టను సరసాన్నస్వాదు పాన ద్రవ్యంబు లొడఁగూర్పను నేర్పరులగు తద్జ్ఞుల నియమించె; నట్టి యెడ నాంబికేయుండు విదురున కిట్లనియె: 153

ప్రతిపదార్థం: అది= వృకస్థలము; విడిపట్టు= విడిది; కాన్+తగియెడు పట్టు= కాదగిన చోటు; అని పలికి; వాసుదేవుండు; రేపకడయ వచ్చున్= ఉదయమే రాగలడు; అంతకున్ మున్ను+అ= అతడి రాకకు మునుపే; ఇంతయున్

కావింపన్ వలయున్= ఈ పనులన్నీ చేయవలె; అని పనిచి= అని సేవకులను నియమించి; పురంబునన్= పట్టణంలో; ఉత్సవంబు+ చాటుండు= సంబరాన్ని చాటండి; అని నియోగించి= అని భృత్యుల నాజ్ఞాపించి; వివిధ గంధ మహిత మాల్యంబులు= పలు విధాలైన సువాసనలతో గొప్పవైన పూలదండలు; సంపాదింపను= కొనివచ్చుటకు; మణి భూషణ చిత్ర+ అంబరంబులు= మణుల నగలు, వింత గొలుపు వస్త్రాలు; సమకట్టను= సమకూర్చటానికి; సరస+అన్న= రససంపన్నాలైన అన్నాలు; స్వాదు పానద్రవ్యంబులు= రుచికరమైన పానీయాలు; ఒడఁగూర్పను= లభింప జేయుటకు; నేర్పరులు+అగు= సమర్థులైన; తద్‌జ్ఞులన్= తెలిసినవారిని; నియమించెన్= నియోగించాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; ఆంబికేయుండు= అంబిక కొడుకు- ధృతరాష్ట్రుడు; విదురునకున్; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: వృక్షస్థలం లం విడిది చేయటానికి తగిన చోటు 'అని పరిచారకులతో పలికి దుర్యోధనుడు మళ్ళీ ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు ఉదయమే ఇచటికి రాగలడు. రావటానికి మునుపే అన్ని పనులు చేయాలి సుమా' అని వారిని పంపివేశాడు. 'హస్తినాపురంలో ఉత్సవం చాటండి' అని మరి కొందరిని ఆజ్ఞాపించాడు. 'రకరకాల సుగంధ ద్రవ్యాలు, పూలదండలు, రత్నాల నగలు, చిత్ర, విచిత్రాలైన వస్త్రాలు సమకూర్చండి. రుచికరాలైన వంటకాలు, కమ్మని పానీయాలు సిద్ధం చేయండి' అంటూ ఆయా పనులలో ప్రవీణులైనవారిని నియమించాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుడు విదురుడితో ఇట్లా అన్నాడు:

ధృతరాష్ట్రుండు విదురుతో శ్రీకృష్ణ రాక సెప్పి సంతోషించుట(సం. 5-84-20)

క. 'వివిధ మణిమయ రథంబులు।
జవనాశ్వంబులును భద్రసామజములు ర
త్న విభూషణములు దాసీ।
నివహంబులుఁ జాలఁ గృష్ణునికి నే నిత్తున్. 154

ప్రతిపదార్థం: వివిధ మణిమయ రథంబులున్= రకరకాల రతనాల రథాలను; జవన+అశ్వంబులును= వడిగల గుఱ్ఱలను; భద్ర సామజములున్= భద్రజాతికి చెందిన ఏనుగులను; రత్న విభూషణములున్= రతనాల ఆభరణాలను; దాసీ నివహంబులున్= పనికత్తెల గుంపును; చాలన్= ఎక్కువగా; నేను; కృష్ణునకున్; ఇత్తున్= ఇస్తాను.

తాత్పర్యం: 'నేను శ్రీకృష్ణుడికి మణులు పొదిగిన రకరకాల రథాలను, వేగంగా పరుగెత్తగల గుర్రాలను, భద్రజాతికి చెందిన గజాలనూ, రతనాల సొమ్ములనూ, పెక్కుమంది పరిచారికలను ఇస్తాను.

క. మన యింట సుయోధను గృహ।
మున దుశ్శాసను నికేతమున నెయ్యది యా
తని చూడ్కి కించు నదియె।
ల్లను గౌరవమొప్ప నీవలయు మన మనఘా!' 155

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యాత్ముడా!; మన+ఇంటన్= మన గృహంలో; సుయోధను గృహమునన్= దుర్యోధనుడి మందిరంలో; దుశ్శాసను నికేతమునన్= దుశ్శాసనుడి సౌధంలో; ఎయ్యది= ఏ వస్తువు; ఆతని చూడ్కికిన్+ఇంచున్= ఆయన చూపునకు ఇంపు గొలుపుతుందో; అది+ ఎల్లను= దాని నంతయు; గౌరవము+ఒప్పన్= ఆదర మతిశయించునట్లు; మనము= మనం; ఈన్+వలయున్= (కృష్ణుడికి) ఇవ్వాలి.

తాత్పర్యం: విదురా! మన గృహంలో కాని, సుయోధనుడి మందిరంలోగాని; దుశ్శాసనుడి భవనంలోగాని గోవిందుడి చూపులకు ఏ వస్తువు ఇంపు కలిగిస్తుందో ఆ వస్తువును మన మెంతో ఆదరంతో ఆయనకు సమర్పించాలి.'

విశేషం: శ్రీకృష్ణు డేది కోరితే అది కానుకగా ఇచ్చి, అతడిని తన వాడిగా చేసికొని, పాండవులలో భేదాన్ని తీసికొనిరావాలని ధృతరాష్ట్రుడి రాజకీయ వ్యూహం. ఇది శత్రువుల పట్ల ప్రచ్ఛన్న భేదోపాయం. (సంపా.)

చ. అన విని యాతఁ డిట్లనియె 'నంబుజనాభునిఁ బ్రీతుఁ జేయు కం
టెను హితమైన కృత్య మొకటిం గలదే? యది మేలు; పాండునం
దనులకు నైదయూళ్ళు లుచితస్థితి నిచ్చుట కోపమన్న యు
న్కిన యిటు లోపు కల్మి ధరణీవర! యేమిట వచ్చెఁ జెప్పుమా! 156

ప్రతిపదార్థం: అనన్ విని= ధృతరాష్ట్రుడు అట్లు పల్కగా విని; ఆతఁడు+ ఇట్లు+అనియెన్= విదురుడిట్లా చెప్పాడు; అంబుజ నాభునిన్= కమలము నాభియందుగల నారాయణుడిని; ప్రీతున్ చేయు కంటెను= సంతుష్టుడిని చేయుటంకంటే; హితము+ఐన; కృత్యము= శ్రేయస్కరమైనపని; ఒకటిన్+కలదే!= మరొక టున్నదా?; అది మేలు= అట్లా చేయటం మంచిది; పాండునందనులకున్= నీ తమ్ముని కొడుకులకు; ఐదు+అ+ఊళ్ళు= కేవలం ఐదు గ్రామాలు; ఉచితస్థితిన్= న్యాయమైన రీతిలో; ఇచ్చుటకున్= ఇవ్వటానికి; ఓపము= సహించలేము; అన్న+ఉన్కిన్+అ= అనెడు స్థితిలో; ఇటులు+ఓపు+ కల్మి= వాసుదేవునకు నచ్చినవెల్లా ఇచ్చుటకు చాలిన సిరి; ధరణీవర!= ఓరాజా!; ఏమిటన్ వచ్చెన్= ఏవిధంగా లభించింది; చెప్పుమా!= తెలుపుము.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడిట్లా పలికిన పలుకులు విని విదురుడు ఇట్లా బదులు పలికాడు: 'మహారాజా! పరమాత్ముడైన శ్రీకృష్ణుడిని సంతుష్టుని చేయటంకన్న మంచిపని మరొక్కటి ఉంటుందా? అది మన కెంతో శ్రేయస్కరం. కాని, పాండు కుమారులకు న్యాయపద్ధతిలో కేవలం ఐదు గ్రామాలు ఇవ్వటానికి తగినశక్తిలేని మనకు శ్రీహరి కిష్టమైనవాటిని సమర్పించటానికి చాలినంత సంపద ఉన్నట్లుండి ఎట్లా లభించిందోచెప్పు.

విశేషం: ధృతరాష్ట్రుడి లోభగుణాన్ని వ్యంగ్యంగా అధిక్షేపించటం ఇందులో ధ్వని. అయినవాళ్ళకు అయిదూళ్ళివ్వలేని పీనాసి ఆ భగవంతుడికి సమర్పించగల సంపదను ఇవ్వగలడా? అని ప్రశ్న. 'భక్తి కలుగుకూడు పట్టెడైనను చాలు' అనే వేమన సూక్తి జ్ఞాపకం వచ్చేటట్లు మాటలాడాడు విదురుడు. (సంపా.)

ఉ. నీ తలఁ పేను గంటి నొకనేర్పున శౌరికి లంచమిచ్చి సం
ప్రీతునిఁ జేసి, కార్యగతి భేదము సేయఁగఁ జూచె; దింత బే
లైతిగదే! సుమేరు సదృశార్థముఁ జూచియుఁ బార్థుఁ బాయునే?
యాతఁడు? క్రీడి భక్తియును నచ్యుతు పెంపును నీ వెఱుంగవే?157

ప్రతిపదార్థం: నీ తలఁపు= నీ ఉద్దేశం; ఏను= నేను; కంటిన్= తెలిసికొన్నాను; ఒక నేర్పునన్= ఒక చాతుర్యంతో; శౌరికిన్= శ్రీకృష్ణుడికి; లంచము+ఇచ్చి= లంచమిచ్చి; సంప్రీతునిన్+చేసి= సంతుష్టుడిని చేసి; కార్యగతిన్= రాయబారం విషయంలో; భేదము+చేయఁగన్+చూచెదు= భేదబుద్ధి పుట్టించాలని ఆలోచిస్తున్నావు; ఇంత బేల+ఐతి+కదే!= ఇంత మూఢుడవైనావు గదా! ఆతఁడు= కృష్ణుడు; సుమేరుసదృశ+అర్థమున్= మేరుపర్వతమంత ధనాన్ని; చూచియున్= చూచికూడా; పార్థున్= అర్జునుడిని; పాయునే?= విడుస్తాడా?; క్రీడిభక్తియును= అర్జునుడి పరమప్రేమనూ; అచ్యుతు పెంపును= గోవిందుడి గొప్పతనమునూ; నీవు; ఎఱుంగవే?= తెలియవా?

తాత్పర్యం: మహారాజా! నీ ఉద్దేశం నేను గ్రహించాను. ఏవో కానుకలు సమర్పించే మిషతో శ్రీకృష్ణుడికి లంచమిచ్చి, తృప్తిపరిచి పాండవుల విషయమై కార్యవిధానంలో భేదబుద్ధి కల్పించవలెనని యత్నిస్తున్నావు. నీ వెంత తెలివిమాలినవాడవో చెప్పలేను. నీవు మేరుపర్వతంతో సమానమైన ధనం సమర్పించినప్పటికీ, ఆయన అర్జునుడిని విడువడు. వాసుదేవుడిపై, పార్థుడికున్న భక్తి ప్రపత్తు లెటువంటివో, గోపాలదేవుడి గొప్పతన మెటువంటిదో తెలియని వాడవా నీవు?

విశేషం: ధృతరాష్ట్రుడు లోభి. శ్రీకృష్ణుడిని లోభపెట్టి వశం చేసికొనవలెనని యత్నించటం ఎంత అవివేకమో విదురుడు హెచ్చరించాడు. నరనారాయణుల సంబంధం విభజించలేని భక్తి ప్రేమ సూత్రాలతో కట్టబడి ఉన్నది. దానిని మేరు పర్వతమంత ధనాన్నిచ్చినా భేదించ లేవని హెచ్చరించాడు. వారిది అర్థార్థ

సంబంధం కాదని తెల్పాడు. శ్రీకృష్ణుడు భక్తికి వశమవుతాడు కాని, లంచాలతో కాదని తేల్చి చెప్పాడు. ధృతరాష్ట్రుడి నైచ్యం ఈ భేదోపాయంలో తేటపడుతుంది. (సంపా.)

తే. అర్జునుఁడు ప్రాణతుల్యుండు హరికి నట్లు।
గాన జలపూర్ణ మంగళ కలశమునకుఁ
బాద్యమునకును గుశలసంప్రశ్నమునకు।
మిగుల నొండు జనార్దను మెచ్చుగాదు. 158

ప్రతిపదార్థం: హరికిన్= శ్రీకృష్ణునికి; అర్జునుఁడు; ప్రాణతుల్యుండు= ప్రాణంతో సమానమైనవాడు; అట్లు+కానన్= అందువలన; జలపూర్ణ మంగళ కలశమునకున్= మంగళార్థమై నీటితో నిండిన కుంభమునకును; పాద్యమునకును= కాళ్ళు కడుగుకొనే నీళ్ళకును; కుశల సంప్రశ్నమునకున్= యోగక్షేమాలు అడుగుటకంటెను; మిగులన్= మించి; ఒండు= మరొక్కటి; జనార్దను మెచ్చు+కాదు= శౌరికి ప్రీతిని కలిగించదు.

తాత్పర్యం: అర్జునుడు శ్రీకృష్ణుడికి ప్రాణసమానుడు కనుక మంగళాచారానికైన జలపూర్ణ కుంభానికి మించి, కాళ్ళు కడుగుకొనే నీళ్ళకు మించి, యోగక్షేమాలు పరామర్శించటానికి మించి మరేదీ అతడికి ప్రీతికరంకాదు.

క. మన కడకు నేమి కార్యం।
బునకై యాతండు వచ్చెఁ బూనికిమెయి నా
పని వంచింపక చేయుట।
విను మతనికిఁ బ్రియము; తక్కువేయును నేలా?' 159

ప్రతిపదార్థం: వినుము; ఆతండు= శ్రీకృష్ణుడు; మన కడకున్= మన దగ్గరకు; ఏమి కార్యంబునకై= ఏ పని మీద; వచ్చెన్= వచ్చాడో; పూనికి మెయిన్= శ్రద్ధతో; ఆ పనిన్= ఆ కార్యాన్ని; వంచింపక= మోసగించక; చేయుట= చేయటం; అతనికిన్= హరికి; ప్రియము= ఇష్టం; తక్కు= ఇతరములు; వేయునున్+ఏలా?= వేయి చేయట మెందుకు?

తాత్పర్యం: మహారాజా! నా మాటలు వినుము. శ్రీకృష్ణుడు మన దగ్గరకు ఏ పని మీద వస్తున్నాడో ఆ పనిని మోసగించక నెరవేర్చటం అతడికి ఇష్టం. ఆ పనిని కాదని మనం ఎన్ని చేసినా ఏమి లాభం?' (ఏమీ లాభం లేదని భావం).

వ. అనిన విని దుర్యోధనుండు దండ్రి కిట్లనియె: 160

తాత్పర్యం: విదురుడి మాటలు విని సుయోధనుడు జనకుడితో ఇట్లా అన్నాడు:

క. 'అది విదురు చెప్పినట్టిద।
తుదిఁ గృష్ణుఁడు పాండుసుతులతో వేఱగునే?
పదనెఱుఁగ కీఁగియిచ్చిన।
బెదరి రనరె యొచ్చెమైనఁ బిమ్మట నగరే! 161

ప్రతిపదార్థం: అది విదురు చెప్పిన+అట్టిది+అ= విదురుడు చెప్పిన ఆ మాట వాస్తవం; తుదిన్= కడకు; కృష్ణుఁడు; పాండుసుతులతోన్= పాండవుల నుండి; వేఱు+అగునే?= విడివడునా?; పదను+ఎఱుఁగక= మనసు యొక్క పాకం తెలియక; ఈఁగి+ఇచ్చినన్= కానుకలు(దానాలు) ఇస్తే; బెదరిరి+ అనరె?= కౌరవులు భయపడినా రనరా?; ఒచ్చెము+ఐనన్= న్యూనత కలిగితే; పిమ్మటన్= పిదప; నగరె?= పరిహసింపరా?

తాత్పర్యం: 'కృష్ణుడి తత్త్వ మెట్టిదో విదురుడు చెప్పాడు. అతడు పాండవులను ఎన్నటికీ విడువడు. అతడి మనః పరిపాకం తెలియక కానుకలిస్తే మనం భయపడ్డామని అంటారు. కార్యంలో న్యూనత కలిగితే పిదప మనలను అందరూ పరిహసిస్తారు.

ఆ. అతఁడు పూజనీయుఁ డగు; నే నెఱుంగుదు; ।
నైన ధనము లీఁగి యనదతనము
వచ్చుఁ; బెచ్చు పెరిఁగి వైరులు గర్వింతు; ।
రేల పగ యడంగు నిట్టులైన?' 162

ప్రతిపదార్థం: అతఁడు= శ్రీకృష్ణుడు; పూజనీయుఁడు+అగున్= పూజించదగిన వాడే ఔతాడు; ఏన్+ఎఱుంగుదున్= నాకు తెలుసు; ఐనన్= కాని; ధనములు+ఈఁగిన్= ధనావళి ఇవ్వటంచేత; అనదతనము+వచ్చున్= మనకు అల్పత్వం కలుగుతుంది; పెచ్చుపెరిఁగి= అంతకంతకు విజృంభించి; వైరులు= మన విరోధులు; గర్వింతురు= అహంకరిస్తారు; ఇట్టులు+ఐనన్= ఇట్లు కావిస్తే; పగ+ఏల+అడంగున్?= శత్రుత్వం ఎట్లా అణగిపోతుంది?

తాత్పర్యం: శ్రీకృష్ణుడు పూజించటానికి తగినవాడని నాకు తెలుసు. కాని, అతడికి మనం ధనాలిస్తే మన అల్పత్వం బయటపడుతుంది. వైరులు అంతకంతకూ అహంకరిస్తారు. ఇందువలన విరోధం శమించదు.'

క. అనవుడు భీష్ముఁడు ధృతరా ।
ష్ట్రున కిట్లను 'నీవునుం గొడుకు నేమే ని
చ్చిన నొకటి యీఁగి లేకు ।
న్నను వేఱొక్కటి దలంచునా కేశవుఁడున్. 163

ప్రతిపదార్థం: అనవుడున్= దుర్యోధనుడు అట్లా పలుకగనే; భీష్ముడు; ధృతరాష్ట్రునకున్; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; నీవునున్; కొడుకున్; ఏమేన్= ఏవైనను; ఇచ్చినన్+ఒకటి= ఇస్తే ఒకవిధంగా; ఈఁగి లేకున్నను= ఇవ్వక పోయిననూ; వేఱు+ ఒక్కటి= మరొక్కటి; కేశవుఁడున్= శ్రీకృష్ణుడు కూడా; తలంచునా?= భావిస్తాడా?

తాత్పర్యం: సుయోధనుడు పలికిన తర్వాత భీష్ముడు ధృతరాష్ట్రుడిని జూచి 'నీవూ, నీ కొడుకూ ఏమైనా ఇస్తే ఒక విధంగానూ, ఇవ్వకపోతే మరొక విధంగానూ ఆ శ్రీకృష్ణుడుకూడా భావిస్తాడా?

క. విను, మతఁడు సేయఁబూనిన ।
పని దప్పింపంగరాదు పాండవులం దే
ర్పను గృష్ణుఁడు వెరవుగఁ జొ ।
చ్చిన మే లాపురుషు పనుపు సేయుము పుత్రా! 164

ప్రతిపదార్థం: పుత్రా!= వత్సా!; వినుము= నా మాటలు వినుము; అతఁడు= కృష్ణుఁడు; చేయన్+పూనిన పనిన్= చేయటానికి నిర్ణయించిన కార్యాన్ని; తప్పింపంగన్ రాదు= తొలగద్రోయటానికి శక్యం కాదు; పాండవులన్= పాండవులను; తేర్పను= ప్రసన్నులను కావించటానికి; కృష్ణుఁడు= పురుషోత్తముడు; వెరవుగన్+చొచ్చినన్= యుక్తంగా ఇందు ప్రవేశించిన; మేలు= మంచిది; ఆ పురుషు పనుపు చేయుము= ఆ మహానుభావుడి ఆజ్ఞ నిర్వర్తించుము.

తాత్పర్యం: కుమారా! నారాయణుడు చేయదలచిన పనిని తప్పించటానికి మన తరం కాదు. ఆయన పాండవుల నుద్ధరించటానికి ఇక్కడికి రావటం సమంజసమే. ఆ మహాత్ముడి ఆజ్ఞ శిరసావహించుము.

క. నారాయణుండు ధర్మా ।
ర్థారూఢము గాఁగఁ బలుకు నది నీవును నీ
వారును గైకొని యెంతయు ।
గారవమునఁ జేయ నెల్ల కార్యంబు నగున్.' 165

ప్రతిపదార్థం: నారాయణుండు= శ్రీకృష్ణుడు; ధర్మ+అర్థ+అరూఢము కాఁగన్= ధర్మార్థాలతో ప్రసిద్ధమయ్యేటట్లుగా; పలుకునది= చెప్పునట్టిదానిని; నీవును; నీ వారును= నీ మిత్రులును; కైకొని= స్వీకరించి; ఎంతయున్= మిక్కిలి; గారవమునన్+చేయన్= ఆదరంతో చేస్తే; ఎల్లకార్యంబున్+అగున్= పనులన్నీ చక్కబడతాయి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధర్మార్థయుక్తంగా చెప్పే మాటలు నీవూ, నీవారూ గ్రహించి మిక్కిలి ఆదరంతో ఆ ప్రకారంగా చేస్తే పనులన్నీ సఫలమౌతాయి.'

క. అనుటయు సుయోధనుఁడు భీ।
ష్మున కిట్లనుఁ 'బాండురాజు సుతులకు నిమ్మే
దిని హరి సగపా లీఁ దగు।
ననుఁ బో, యే నీను, గాని యది యట్లుండెన్. 166

ప్రతిపదార్థం: అనుటయున్= అని పితామహుడు చెప్పగా; సుయోధనుఁడు= దుర్యోధనుడు; భీష్మునకున్= భీష్ముడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; హరి= శ్రీకృష్ణుడు; పాండురాజ సుతులకున్= పాండురాజు కుమారులకు; ఈ+మేదినిన్= ఈ భూమిలో; సగపాలు= అర్ధ భాగం; ఈన్+తగున్+అనున్+పో= ఇవ్వటం యోగ్యం అని అంటాడు; ఏన్= నేను; ఈను= ఇవ్వను; కాని; అది+అట్లు+ఉండెన్= ఆ విషయమంతే.

తాత్పర్యం: భీష్ముడి మాటలు విని దుర్యోధనుడు ఆయనతో ఇట్లా అన్నాడు: 'శ్రీకృష్ణుడు పాండవులకు అర్ధరాజ్య మిమ్మని చెపుతాడు; నేను ఇవ్వను. ఆ విషయం వదలిపెట్టండి.

విశేషం: పాండవులకు రాజ్యభాగం ఇవ్వనని దుర్యోధనుడు ఉత్తర గోగ్రహణ సమయంలో భీష్ముడికి చెప్పాడు. (విరా. 4-236) అతడా మాట మీదనే ఉన్నాడు. (సంపా.)

వ. వేఱొక కార్యంబు సేయం దలంచితి; నది వినుము! పాండవులకు నేడుగడయు జనార్దనుం; డతనింబట్టి బంధించిన ఱెక్కలు విఱిగిన పులుఁ గులుం బోలె వారు నాకు విధేయు లగుదురు; పాంచాల యాదవాదులైన తదీయ బంధు మిత్రులు నా వశంబున వర్తిల్లుదురు; సమస్త దేశంబులు నేన యేలుదు; దీనికిం దగిన యుపాయ సహాయంబు లనువు సేసెద; నీవింక నేమి సెప్పెదవు చెప్పుమనిన విని యతిఘోరంబగు నవ్విచారం బునకు నమాత్య సహితంబుగా సంతప్తచిత్తుండై వైచిత్రవీర్యుండు కొడుకున కిట్లనియె: 167

ప్రతిపదార్థం: వేఱు+ఒక కార్యంబు= మరొక పని; చేయన్+తలంచితిన్= చేయటానికి సంకల్పించాను; అది వినుము= ఆ పని ఏమిటో వినుము; జనార్దనుండు= శ్రీకృష్ణుడు; పాండవులకున్; ఏడు+కడయున్= గురువు, తల్లి, తండ్రి, పురుషుడు, విద్య, దైవం, దాత అని సప్త ప్రకారాలుగా రక్షకమైఉన్నవాడు; అతనిన్ పట్టి బంధించినన్= అతడిని పట్టుకొని కట్టివేస్తే; వారు= పాండవులు; ఱెక్కలు విఱిగిన= రెక్కలు తెగిన; పులుఁగులున్+పోలెన్= పక్షుల మాదిరిగా; నాకున్; విధేయులు+అగుదురు= అణగి మణగి ఉంటారు; పాంచాల యాదవ+ఆదులు+ఐన= ద్రుపదుడు, యాదవులు మొదలైన; తదీయ బంధు మిత్రులు= పాండవులయొక్క చుట్టాలు, హితులు; నా వశంబునన్+ వర్తిల్లుదురు= నా అధీనంలో మెలగుతారు; సమస్త దేశంబులు; నేను+అ= నేనే; ఏలుదున్= పాలిస్తాను; దీనికిన్ తగిన; ఉపాయ సహాయంబులు= ఉపాయం, తోడ్పాటు; అనువు+చేసెదన్= సిద్ధపరుచుకొంటాను; నీవు; ఇంకన్; ఏమి చెప్పెదవు చెప్పుము; అనినన్+విని= దుర్యోధనుడనగా విని; అతి ఘోరంబు+అగు= మిక్కిలి దారుణమైన; ఆ+విచారంబునకున్= అతడి ఆలోచనకు; అమాత్య సహితంబుగాన్= మంత్రులతో కూడ; సంతప్త చిత్తుండు+ఐ= ఉడుకుతున్న మనస్సు కలవాడై; వైచిత్రవీర్యుండు= విచిత్రవీర్యుడి కొడుకైన ధృతరాష్ట్రుడు; కొడుకునకున్= దుర్యోధనుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: మరొక పని చేయదలచాను. అదేమిటో వినుము. పాండవులకు గురువు, తల్లీ, తండ్రీ, పురుషుడూ, విద్యా, దైవం, దాత అయి సర్వ విధాల రక్షిస్తున్న ఆ శ్రీకృష్ణుడిని పట్టి బంధిస్తే వారు రెక్కలు విరిగిన పక్షులై నాకు అణగి మణగి ఉంటారు. పాంచాలపతి, యాదవులు మొదలైన వారి చుట్టపక్కాలు, మిత్రులు నేను చెప్పినట్లు మెలగుతారు. దేశాలన్నీ నేనే ఏలుతాను. ఇందుకు తగిన ఉపాయం, తోడ్పాటు సిద్ధం చేసికొంటాను. ఇక నీవేమి చెప్పదలచావో చెప్పుము' అన్నాడు. మిక్కిలి దారుణమైన అతడి

ఆలోచనకు మంత్రులతో కూడిన ధృతరాష్ట్రుడు తన హృదయం ఉడికిపోగా సుయోధనుడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. శ్రీకృష్ణుడు దూరమైతే పాండవులు రెక్కలు తెగిన పక్షులవలె విలవిలలాడి తనకు వశమవుతారని దుర్యోధనుడి వ్యూహం. ఇది భేదం కాదు ద్రోహం. ఇది కుటిలోపాయం. దుష్టనీతి. ధర్మనీతి ఈ ఉపాయాన్ని అంగీకరించదు. పైపెచ్చు గర్హిస్తుంది.

2. దుర్యోధనుడు బరి తెగించి తన దుర్వినీతిని అందరి ముందూ ప్రకటించి, ఎవరేమన్నా తన యత్నం కొనసాగుతుందని ప్రకటించి ఉద్ధతుడివలె వ్యవహరించాడు. (సంపా.)

క. ‘ఓహో! యిట్లనుట జగ।
ద్ద్రోహం; బిమ్మాట మఱవు; దూతత్వంబున్
మాహాత్మ్యంబును ధర్మో।
త్సాహంబును విను మబాధ్యతకుఁ గారణముల్. 168

ప్రతిపదార్థం: ఓహో!= ఔరా!; ఇట్లు+అనుట= శ్రీకృష్ణుడిని బంధిస్తానని పలకటం; జగత్+ద్రోహంబు= లోకానికి కీడు చేయటం; ఈ+మాట= ఇపుడు నీవన్నమాట; మఱవు= మరచిపొమ్ము; వినుము= నా మాట వినుము; దూతత్వంబున్= రాయబారి తనం; మాహాత్మ్యంబున్= మహానుభావత్వం; ధర్మ+ఉత్సాహంబును= ధర్మానికై పాటువడటం; అబాధ్యతకున్= బాధించబడ కుండుటకు; కారణముల్= హేతువులై ఉన్నవి.

తాత్పర్యం: ‘ఔరా! శ్రీకృష్ణుడిని బంధిస్తాననటం లోకానికంతటికీ కీడు చేసినట్లేకదా! ఈ దురాలోచన మానుము. రాయబారిగా వచ్చినవాడిని, మహాత్ముడిని, న్యాయంకొరకు పాటువడేవాడిని బాధించకూడదు.

విశేషం: ఊహించని విషయాన్ని ఒక్కసారిగా విన్నప్పుడు కలిగే ఆశ్చర్యభావం, వినకూడని విషయం విన్నప్పుడు కలిగే ఉద్వేగం ఈ పద్యంలోని చిత్తవృత్తి.

దుర్యోధనుడి వ్యూహం బాధ్యతారహితమైనదని ధృతరాష్ట్రుడు ఉద్వేగంతో పేర్కొన్నాడు. దానికి కారణాలు మూడింటిని చెప్పాడు. 1. శ్రీకృష్ణుడు దూత. అతడిని బంధించరాదు. 2. అతడు మహాత్ముడు. మహాత్ములకు కీడు చేస్తే హాని కలుగుతుంది. 3. అతడు ధర్మసాధనోత్సాహంతో వస్తున్న పుణ్యాత్ముడు. అతడికి కీడు చేయటం అధర్మం. అందువలన శ్రీకృష్ణ నిర్బంధం సర్వత్రా నిరసించతగిందని తెలిపాడు. (సంపా.)

క. ఈ కారణములు గలవను।
నా కొలఁదియె వాసుదేవుఁ? డదిగాకయుఁ గీ
డే కురువంశమున కతని।
రాక? యతం డేమి సేసెరా పాపాత్మా!’ 169

ప్రతిపదార్థం: ఈ కారణములు గలవు= ఈ హేతువులన్నీ శ్రీకృష్ణుడి విషయంలో ఉన్నవి; అను+ఆ కొలఁదియె?= అన్నంత మాత్రమేనా?; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు (అతడు జగద్వ్యాపకుడైన భగవంతుడు); అదికాకయున్= అంతేకాక; అతనిరాక= ఆ మహనీయుడి ఆగమనం; కురువంశమునకున్= కురుకులానికి; కీడే?= హానికరమా?; అతండు= కృష్ణుడు; ఏమి చేసెరా?= ఏమి తప్పు చేశాడురా?; పాప+ఆత్మా?= పాపచిత్తుడా!

తాత్పర్యం: దౌత్యం నెరపుటకు వస్తున్నవాడు, గొప్పవాడు, ధర్మం నిలపటానికి పాటుపడేవాడు అయిన గోపాలదేవుడిని నొప్పించరాదు. అతడు సామాన్యుడనుకొన్నావా? సకల జగద్వ్యాపకుడైన శ్రీమన్నారాయణుడు. ఇంతేకాదు. అతడిరాకవలన మన కురువంశానికి ఏమి హాని? పాపీ! పట్టి బంధించటానికి అతడు చేసిన తప్పేమిటి?’

విశేషం: 1. శ్రీకృష్ణుడిని బంధించటం ఎంత అధర్మమో, అంత అసంబద్ధం. సామాన్యుడైతే బంధించవచ్చు ననుకొంటే శ్రీకృష్ణుడు అసామాన్యుడు. కీడు చేసిన వాడైతే అతడికి కీడు తలపెట్టటం లోకన్యాయం. కాని, కురువంశానికి

హితం కోరి వచ్చేవాడిని బంధించటం దరిచేరిన అదృష్టాన్ని దూరం చేసికొనటమే. ఈ మాటలన్న తరువాత ధృతరాష్ట్రుడు నిగ్రహించుకొనలేక బావురుమన్నట్లు 'పాపాత్మా! శ్రీకృష్ణుడు నీకేం అపకారం చేశాడురా?' అని ఎలుగెత్తి ఆక్రోశించాడు.

2. ఇది చిత్తశుద్ధితో అన్న మాటలుగానూ ఉన్నాయి, అందరి ముందు కొడుకును మందలిస్తున్నట్లూ ఉన్నాయి. తండ్రిమాట కొడుకు లెక్కచేయడని చెప్పుకొంటాడు. ఎవరైనా చెప్పగలిగితే చెప్పి దుర్యోధనుడిని మార్చండని పిలుపునిస్తాడు. పైకి ఎన్ని పలికినా లోన పుత్రుడి పక్షంవాడే ధృతరాష్ట్రుడు. అతడి నీతివాక్యాలు నీటి బుడగలు. (సంపా.)

వ. అని యదల్చె నప్పుడు గాంగేయుం డాంబికేయున కిట్లను 'నీ కొడుకు ప్రాణగొడ్డంబైన కార్యంబు సేయందలంచె దామోదరు నిట్లు సేయం జూచెనేనిం దానును దనవారును వినాశంబుఁ బొందుదు; రింతియ; యిది సేసిరి సేయరైరి యమ్మహాత్మునెడ నీయపరాధంబు విచారించిన దుష్టాత్ములు నష్టాత్ముల కాక, యని పలికి యేనిట్టిదాని వినంజాల' ననుచు మొగంబు గంటువెట్టుకొని దిగ్గన లేచిపోయె, ధృతరాష్ట్రుండును దుర్యోధనునితో 'నిటువంటి కొఱగాములు మనంబునం దలంచినప్పుడు సేయంగలవాఁడవు గావున దీనం జేటువచ్చు నుడుగుమయ్య' యనిచెప్పి యతనిం దక్కినవారినిం బోవంబనిచి తగిన వర్తనంబున నుండె; మఱునాఁడు. 170

ప్రతిపదార్థం: అని+అదల్చెన్= అని కోపంతో ధృతరాష్ట్రుడు గద్దించాడు; అప్పుడు; గాంగేయుండు= గంగాపుత్రుడగు భీష్మడు; ఆంబికేయునకున్= అంబ కొడుకైన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; నీ కొడుకు; ప్రాణగొడ్డంబు+ఐన= ప్రాణసంకటం కలిగించే; కార్యంబు చేయన్+తలంచెన్; పని చేయటానికి తలపెట్టాడు; దామోదరున్= వనమాలా విరాజితుడైన శ్రీకృష్ణుడిని; ఇట్లు; చేయన్+చూచెన్+ఏనిన్= చేయటానికి యత్నిస్తే; తానును= అతడూ; తనవారును= అతడికి సంబంధించిన వాళ్ళూ; వినాశంబున్ పొందుదురు= నాశనాన్ని పొందుతారు; ఇంతి+అ= ఇది నిశ్చయం; ఇది చేసిరి+చేయరు+ఐరి= ఈ పని చేసినా; చేయకమానినా; ఆ+మహాత్ము+ ఎడన్= ఆ మహానుభావుడి విషయమై; ఈ+అపరాధంబు= ఈ దోషం; విచారించిన= సంకల్పించిన; దుష్ట+ఆత్ములు= పాపహృదయులు; నష్ట+ఆత్ములు+అ కాక= నాశనమై పోతారు పో; అని పలికి= అంటూ భీష్మడు వచించి; ఏను= నేను; ఇట్టిదానిన్= ఇటువంటి పాపపు మాటను; వినన్+చాలన్= విని భరించలేను; అనుచున్; మొగంబు= ముఖం; గంటు+పెట్టుకొని= ముడుచుకొని; దిగ్గనన్= శీఘ్రంగా; లేచిపోయెన్= ఆ చోటు విడిచి వెళ్ళిపోయాడు; ధృతరాష్ట్రుండును; దుర్యోధనుడితో; ఇటువంటి, కొఱగాములు= అకార్యములు; మనంబునన్= మనస్సులో; తలంచిన+ అప్పుడు= అనుకొన్న వెంటనే; చేయన్+కలవాఁడవు= చేసే స్వభావం కలవాడివి; కావునన్= కాబట్టి; దీనన్= ఈ పాపకార్యాచరణంవలన; చేటువచ్చున్= కీడు మూడుతుంది; ఉడుగుము+ అయ్య!= నాయనా, ఈ చెడుపని చేయవద్దు; అని చెప్పి; అతనిన్; తక్కినవారినిన్= మిగిలిన వారిని; పోవన్+పనిచి= వెళ్ళిపొండని చెప్పి; తగిన వర్తనంబునన్+ఉండెన్= ధృతరాష్ట్రుడు తన పనిలో తాను ఉన్నాడు; మఱునాఁడు= ఆ మరుసటి రోజు.

తాత్పర్యం: అని ధృతరాష్ట్రుడు తన కుమారుడిని కసరినాడు. అప్పుడు భీష్మడు ధృతరాష్ట్రుడితో 'నీ కుమారుడు ప్రాణసంకటమైన పనికి పూనుకొన్నాడు. గోవిందుడికి ఇట్లా కీడు చేయటానికి యత్నిస్తే తానూ తనవారూ నాశనమైపోతారు. ఈ పని చేసినా చేయకున్నా ఆ మహాపురుషుడి యెడ ఇట్టి అపకారం తలపెట్టిన దుష్టులు నష్టమై పోతారు. నేనిటువంటి మాటలు వినలేను' అని పలికి ముఖం ముడుచుకొని అక్కడనుండి వెంటనే లేచివెళ్ళాడు. ధృతరాష్ట్రుడు కొడుకుతో 'ఇటువంటి అకార్యాలను ఎప్పుడు

మనసులో అనుకుంటావో అప్పుడే వాటిని చేసి తీరుతావు. నాయనా! ఇట్లాంటి పాడుపని చేస్తే కీడుమూడుతుంది. కనుక ఈ పని విరమించుకొనుము' అని చెప్పి అతడినీ, తక్కినవారినీ వెళ్ళండని చెప్పి, తన పాటికి తాను ఉండిపోయాడు. ఆ మరునాడు.

విశేషం: 1. దుర్యోధనుడి దుష్టవ్యూహానికి భీష్ముడు అసమ్మతి తెలియజేయటమే కాక, దానివలన కలిగే దుష్పరిణామాలను కూడా తెలియజెప్పాడు. 'వినాశకాలే విపరీత బుద్ధిః' అని భావించి సభనుండి తొలగిపోయాడు. పాండవులలో భేదాన్ని కలిగించాలని తలంచిన ధృతరాష్ట్ర దుర్యోధనుల పన్నాగాలు విఫలమై, వారి పక్షంలోనే భేదోపాయం ప్రవర్తిల్లింది. మహాత్ముడైన శ్రీకృష్ణుడి రాకయే ఇన్ని కలతలకు కారణమైతే, ఆయన దౌత్యం ఎంతటి విపరీత పరిణామాలకు దారితీస్తుందో చెప్పలేమన్న భావం ధ్వని.

2. 'అకార్యాలను అనుకొన్నప్పుడే ఆచరణలో పెట్టటం దుర్యోధనుడి స్వభావం'- అని ధృతరాష్ట్రుడి వ్యాఖ్య. దానిని వారించాడు. కాని, దుర్యోధనుడు వినడని తెలుసు. ధృతరాష్ట్రుడు తన అధికారాన్ని వినియోగించి కొడుకును దండించడు. అదుపులేని అవినీతికి ప్రభువుగా ఉన్న ధృతరాష్ట్రుడి ద్వంద్వనీతికి ఈ సన్నివేశం ఉదాహరణం. (సంపా.)

సీ. కాలోచితములగు కరణీయములు దీర్చి ।
కమలనాభుఁడు రేపకడయ కదలి
తనుఁ గుశస్థలవాసు లనుప రా నందఱ ।
నాదరంబున నిల్పి యరుగునపుడు
గజ్జంబులును బండ్లు గంధమాల్యంబులు ।
ధృతరాష్ట్ర సుతుఁడు పుత్తేరఁ బ్రీతి
నెడ నెడఁ గొనివచ్చి యిచ్చిన వాని నె ।
ల్లను వేడ్క ననుభవించిన విధంబు

తే. సలిపి, యనుభవ మొల్లక చనఁగ, నెదుర ।
బాహ్లిక ద్రోణ భీష్మాది బంధుమిత్ర
గణము సర్వభూపాల లోకంబుఁ గురుకు ।
మార వర్గంబుఁ బుత్తెంచె మనుజవిభుఁడు. 171

ప్రతిపదార్థం: కమలనాభుఁడు= పద్మము బొడ్డునగల శ్రీహరి; కాల+ ఉచితములు+ఐన= వేళకు తగినట్టి; కరణీయములు తీర్చి= చేయదగిన పనులు చేసి; రేపకడ+అ= ప్రాతఃకాలంలోనే; కదలి= బయలుదేరి; తనున్= తనను; కుశస్థలవాసులు= కుశస్థలంలో ఉన్నవారు; అనుపన్+రాన్= సాగనంపటానికిరాగా; అందఱన్= వారినందరినీ; ఆదరంబునన్= మన్ననతో; నిల్పి= ఆగండని చెప్పి; అరుగు+అపుడున్= వెళ్ళేసమయంలో; కజ్జంబులును= భక్ష్యాలను; పండ్లన్= ఫలాలను; గంధమాల్యంబులున్= చందనం; పూలదండలు; ధృతరాష్ట్ర సుతుఁడు= దుర్యోధనుడు; పుత్తేరన్= పంపగా; ప్రీతిన్= సంతోషంతో; ఎడన్+ఎడన్= అక్కడక్కడ; కొనివచ్చి= తీసికొనివచ్చి; ఇచ్చినవానిన్+ఎల్లను= తన కిచ్చిన వాటినన్నిటినీ; వేడ్కన్= అభిలాషతో; అనుభవించిన విధంబు సలిపి= అనుభవించినట్లుగా నటించి; అనుభవము+ఒల్లక= నిజంగా ఆయా పదార్థాలను అనుభవించక; చనఁగన్= వెళ్ళుతుండగా; మనుజవిభుఁడు= నరపతి అయిన ధృతరాష్ట్రుడు; బాహ్లిక ద్రోణ భీష్మ+ఆది= బాహ్లికుడు, ద్రోణుడు, భీష్ముడు మొదలైన; బంధు మిత్ర గణమున్= చుట్టాలయొక్క హితుల యొక్క సముదాయాన్ని; సర్వభూపాల లోకంబున్= సమస్త రాజ సమూహాన్ని; కురుకుమార వర్గంబున్= తన కొడుకుల యొక్క మొత్తమును; ఎదురన్ పుత్తెంచెన్= శ్రీకృష్ణుడికి ఎదురుకోలు జరపటానికి పంపాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ప్రాతఃకాల విధు లన్నిటినీ నెరవేర్చి ఉదయమే హస్తినాపురికి బయలుదేరనుండగా కుశస్థల నివాసులు తనను సాగనంపటానికై దగ్గరకు వచ్చారు. వారినందరినీ ఆగండని నిల్పి శౌరి బయలుదేరాడు. అతడు వెళ్ళుతున్నప్పుడు దుర్యోధనుడు పంపగా పిండివంటలు, పండ్లు,

చందనము, పూలదండలు దారిలో అక్కడక్కడా ప్రీతితో ఆయనకు తెచ్చి ఇచ్చారు. ఇచ్చినవాటినెల్ల నారాయణుడు అభిలాషతో అనుభవించినవానివలె నటించాడు. నిజానికి వాటి నతడు అనుభవించలేదు. ఇట్లా శ్రీహరి హస్తినాపురికి వస్తుండగా ధృతరాష్ట్ర మహారాజు- బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణుడు మొదలైన బంధు మిత్ర కోటిని, సకల రాజ సమూహాన్ని, తన పుత్రులను ఆయనకు ఎదురుకోలు సల్పటానికి పంపాడు.

శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రుని మందిరంబునకుఁ బోవుట (సం. 5-87-1)

వ. ఇట్లు దుర్యోధనుం డొక్కరుండు దక్కనెల్లవారిం దూర్యాది శోభన పదార్థంబులు సమకట్టి ధృతరాష్ట్రుండు వనుప నెదుర్కొనిన వాసుదేవుండు వారల నందఱ నయ్యైతెఱంగుల సంభావించి, కృతవర్మ దమవాఁడు గావున నతనికి సవిశేష స్నేహంబు సేసి, యతండు సేరువరా సమస్త జనంబులుం బరివేష్టింపం జని తన రాకకు నలంకృతంబును బ్రమోద చాపల సుభగ జనంబును నైన పురంబు సొచ్చి, రాజమార్గంబున నరుగు నవసరంబున మౌక్తిక మిళితంబులు బహుగంధ లుళితంబులు నగు నక్షత ప్రకరంబులును బుష్ప నికరంబులునుం జల్లుచు సంతసిల్లుచు మ్రొక్కుచుఁ జొక్కుచు నిరుగెలంకుల రమ్యహర్మ్యంబు లపై నిలిచి పాలిచి కనుంగొను నంగనాజనంబులు తమలోన. 172

ప్రతిపదార్థం: ఇట్లు; దుర్యోధనుండు; ఒక్కరుండు తక్కన్= ఒకడు తప్ప; ఎల్లవారిన్= అందరినీ; తూర్య+ఆది శోభన పదార్థంబులు= వాద్యాలు మొదలైన మంగళ వస్తువులు; సమకట్టి= సిద్ధపరిచి; ధృతరాష్ట్రుండు; పనుపన్= పంపగా; ఎదుర్కొనినన్= ఎదురురాగా; వాసుదేవుండు; వారలన్+అందఱన్= వారినందరినీ; అయ్యై తెఱంగులన్ సంభావించి= ఆయా విధాల ఆదరించి; కృతవర్మ; తమవాఁడు కావునన్= తమ భోజ వంశస్థుడగుటచేత; అతనికిన్+ సవిశేష స్నేహంబు+చేసి= ఆతనిపై మిక్కుటమైన స్నేహం కనబరిచి; అతండు= ఆ కృతవర్మ; చేరువన్ రాన్= వెంట వస్తుండగా; సమస్త జనంబులున్+ పరివేష్టింపన్= జనులందరూ తన చుట్టూ బలిసిఉండగా; చని= వెడలి; తన రాకకున్; అలంకృతంబును= అలంకరించబడినదిన్నీ; ప్రమోదచాపల సుభగ జనంబును= సంతోషంచేత సంచలిస్తున్న సుందర జనములు కలది; ఐన= ఐనట్టి; పురంబు చొచ్చి= హస్తినాపురం ప్రవేశించి; రాజమార్గంబునన్; అరుగు+అవసరంబున్= వెళుతున్న సమయంలో; మౌక్తిక మిళితంబులు= ముత్యాలతో చేరినవియు; బహుగంధ లుళితంబులు= పెక్కు సువాసనలతో కూడినవి; అగు= ఐనట్టి; అక్షత ప్రకరంబులును= అక్షతల సమూహాలును; పుష్పనికరంబులును= పువ్వుల యొక్క మొత్తములును; చల్లుచున్; సంతసిల్లుచున్= సంతోషిస్తూ; మ్రొక్కుచున్= నమస్కరిస్తూ; చొక్కుచున్= ఒడలు మరుస్తూ; ఇరు+కెలంకున్= రాజమార్గానికి రెండు వైపుల; రమ్యహర్మ్యంబు లపైన్= అందమైన మేడల మీద; నిలిచి= నిలువబడి; పొలిచి= ప్రకాశించి; కనుంగొని= చూస్తున్న; అంగనాజనంబులు= ఆడువారు; తమలోనన్= తమలో తాము.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజు ఒక్క దుర్యోధనుడిని తప్ప తక్కిన వారినెల్ల వాసుదేవుని మంగళ వాద్యాలతో ఎదుర్కొనడానికి పంపించాడు. శ్రీకృష్ణుడు తనను ఆహ్వానించటానికి ఎదురుగా వచ్చిన వారినందరినీ ఆయా రీతుల గౌరవించాడు. కృతవర్మ తమవాడు గనుక అతడిని ప్రత్యేకంగా ఆదరించాడు. కృతవర్మ తన వెంబడి వస్తుండగా, జనులందరూ తన చుట్టూ బలసిరాగా, తనరాక సందర్భంగా చక్కగా అలంకరించబడినట్టిదీ, సంతోషంచేత కళకళలాడుతున్న ప్రజలు గలదీ అయిన హస్తినాపురంలో ప్రవేశించాడు. అతడు రాజమార్గంలో వెళుతుండగా రకరకాల సువాసనలు విరజిమ్ముతున్న ముత్యాలు కలిపిన తలంబ్రాలు, పూల మొత్తాలు శౌరిమీద చల్లుతూ, సంతసిస్తూ, నమస్కరిస్తూ, పరవశిస్తూ మార్గానికి ఇరువైపుల నున్న అందమైన మేడలపై నిలిచి కనుగొంటున్న వనితలు తమలో తాము ఇట్లా అనుకొన్నారు:

విశేషం: 1. మూర్ధాభిషిక్తులైన ధృతరాష్ట్ర దుర్యోధనులు తప్ప మిగిలిన పెద్దలూ, పిన్నలూ అందరూ శ్రీకృష్ణుడిని ఆహ్వానించటానికి వెళ్ళారు. అది రాచమర్యాదలలో శ్రేష్ఠమైన పద్ధతి. శ్రీకృష్ణుడిని దూతగానే కాక మహాత్ముడుగా భావించిన వైఖరి ధ్వని.

2. ఆ వేడుకలో దుర్యోధనుడు పాల్గొంటే జరుగరానిది జరుగవచ్చునని కూడ ధృతరాష్ట్రుడు భావించి, అతడిని పంపకపోయి ఉండవచ్చును.

3. శ్రీకృష్ణుడి దివ్యతేజం జీవులనందరినీ ఆకర్షించింది. ప్రజలందరూ ఆ పరమాత్ముడిని దర్శించుకొనటానికి ఉత్సాహ పడ్డారు. సముచితంగా ఆరాధిస్తూ ఆహ్వానించారు. (సంపా.)

సీ. 'ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నుల ।
పాలు ద్రావిన ప్రౌఢబాలుఁ డితఁడె!
వ్రేల్మిడిఁ జాణూరు విఱిచి లోకముల మె ।
చ్చించిన యా జగజెట్టి యితఁడె!
దుర్వృత్తుఁడగు కంసుఁ దునిమి యాతని తండ్రిఁ ।
బట్టంబు గట్టిన ప్రభు వితండె!
సత్యభామకుఁ బారిజాతంబుపైఁ గల ।
కోర్కిఁ దీర్చిన రసికుం డితండె!

తే. వెన్నలును గోపికాచిత్త వృత్తములును ।
నరసి ముచ్చిల నేర్చిన హరి యితండె!
శ్రుతిశిరోభాగములఁ దన సుభగచరణ ।
సరిసిజామోదమును గూర్చు చతురుఁ డితఁడె! 173

ప్రతిపదార్థం: ప్రాణంబుతోన్+కూడన్= అసువులతో కూడ; రక్కసి చన్నుల పాలు= రాక్షసిఅయిన పూతన చనుబాలు; త్రావిన= క్రోలిన; ప్రౌఢబాలుఁడు= గడుసరి పిల్లవాడు; ఇతఁడె!= ఈతఁడే సుమా!; వ్రేల్మిడిన్= చిటిక వేసినంతలో; చాణూరున్= కంసుడి మల్లవీరుడైన చాణూరుడిని; విఱిచి= భంజించి; లోకములన్= జగాలను; మెచ్చించిన= మెప్పించినట్టి; ఆ జగజెట్టి+ ఇతఁడె!= ఆ మేటివీరు డితడే సుమా!; దుర్వృత్తుఁడు+అగు= చెడు నడవడి గల్గినట్టి; కంసున్+తునిమి= కంసుడిని సంహరించి; ఆతని తండ్రిన్= అతని తండ్రియగు ఉగ్రసేనుడిని; పట్టంబు+కట్టిన= పట్టాభిషిక్తుడిని చేసిన; ప్రభువు+ ఇతండె!= దొర యితడే సుమా!; సత్యభామకున్= సత్యాదేవికి; పారిజాతంబుపైన్+కల= ఇంద్రుడి నందనోద్యానంలోని పారిజాత వృక్షం మీద నున్న; కోర్కిన్= కాంక్షను; తీర్చిన రసికుండు+ఇతండె!= నెరవేర్చిన సరసు డితడేసుమా!; వెన్నలును= నవనీతపు ముద్దలు; గోపికా చిత్త వృత్తములును= గోపికల యొక్క మనోవ్యాపారాలనూ; అరసి= తెలిసికొని; ముచ్చిలన్+నేర్చిన= దొంగిలించనేర్చిన; హరి= దోషాలను హరించే నారాయణుడు; ఇతండె!= ఇతడే సుమా!; శ్రుతి శిరస్+భాగములన్= వేద శీర్ష ప్రదేశాలందు - ఉపనిషత్తులందు; తన సుభగ చరణ సరసిజ+ ఆమోదమును= తన యొక్క మనోహరమైన పాదపద్మాలయొక్క పరిమళాన్ని, కూర్చు= సంధించు; చతురుఁడు= నేర్పరి; ఇతఁడె!= ఇతడే సుమా!

తాత్పర్యం: ప్రాణాలతోపాటు రాక్షస కాంత అయిన పూతన చనుబాలు పానం చేసిన గడుసరి పిల్లడు ఇతడే. చిటికెలో మల్లవీరుడైన చాణూరుడిని విరిచి ప్రోగులుపెట్టి లోకాలను మెప్పించిన మేటి శూరు డితడే సుమా! దుష్టవర్తనుడైన కంసుడిని నిర్మూలించి, అతడి జనకుడైన ఉగ్రసేనుడికి మధురా రాజ్యపట్టం కట్టబెట్టిన ప్రభు వితడే సుమా! పారిజాతవృక్షంపై సత్యభామకు గల కోర్కి తీర్చిన రసికవల్లభు డితడే సుమా! వెన్నలతో పాటు గొల్ల చేడెల చిత్తాలను అపహరించ నేర్చిన శ్రీహరి ఇతడే సుమా! ఉపనిషత్తులకు తన పాదపద్మ పరీమళాన్ని సంధింప జాలు జాణ ఇతడే సుమా!

విశేషం: 1. అలం: ఉల్లేఖం, ఉదాత్తం. 'బహుభి ర్బహుధోల్లేఖా దేకస్యోల్లేఖ ఇష్యతే''. ఒకే వస్తువు అనేకుల చేత అనేకవిధాలుగా వర్ణించబడితే ఉల్లేఖాలంకారం. "ఉదాత్త మృద్ధిశ్చరితం శ్లాఘ్యం వాన్యోపలక్షణమ్'' శ్లాఘనీయమైన సమృద్ధిని వర్ణించినా, మహాపురుషుల చరిత్రాన్ని ఉపలక్షణంగా వర్ణించినా ఉదాత్తం. హస్తినాపురంలో పిల్లల నుండి వృద్ధుల వరకు శ్రీకృష్ణుడిని పరిపరివిధాల ప్రశంసించిన ఘట్టమిది. ప్రశంసలకు సీసం కుదురైన ఛందం. ఒక్కొక్క చరణం ఒక్కొక్క ప్రశంసకు అనువై ఆరు ప్రశంసలకు ఆలవాలమై అందగిస్తుంది. శ్రీకృష్ణుడు ఉదాత్తుడు కావటంతో ఉదాత్తాలంకారం సార్థకం.

2. ఉల్లేఖంలో ఆరు ప్రశంసలున్నాయి. అవి- 1. ప్రౌఢ బాలుడు 2. జగజెట్టి 3. ప్రభువు 4. రసికుడు 5. హరి 6. చతురుడు. ఆ ఆరు ప్రశంసలూ క్రమంగా శైశవంలో, బాల్యంలో, యౌవనంలో, ప్రౌఢ దశలో, వార్ధక్య దశలో, ముముక్షు దశలో ఉన్నవారు ప్రశంసించే వాక్యాలు. వారి వారి మనస్తత్త్వాలకు అనుగుణమైన ప్రశంసలివి. సహృదయులు గమనించటం సులభం. పసిబాలుడి నుండి పరమాత్మ వరకు సాగిన ఈ దశలు భాగవత కృష్ణుడి దివ్యమహిమలుగా విజ్ఞులు భావిస్తున్నారు. శ్రీకృష్ణుడు పరమాత్మ అని నిర్ధారించటానికి తోడ్పడే షడ్లింగాలు ఇవి. ఉపనిషత్తులపై నిలచిన ఉజ్జ్వలతత్త్వం శ్రీకృష్ణతత్త్వం. (సంపా.)

వ. అనుచు నతి కుతూహలంబున నవలోకింప నాబాలవృద్ధంబగు పౌరలోకం బాలోకన కౌతుకంబునఁ దన రథంబు గదిసిన సందడి జడియు వేత్రహస్తుల వారించుచు నారాయణుండు సమ్మర్ద మందగమనంబునం జని మణితోరణ సుందరం బగు రాజమందిర ద్వారంబు ప్రవేశించి కక్ష్యాంతరంబులు గడచి యేనుంగు మొగసాలఁ జొచ్చి యరదంబు డిగ్గి యల్లన నడచునప్పు డంతకు మున్నయరిగి భీష్మద్రోణ ప్రముఖులగు తగు వారలు ధృతరాష్ట్రునిం బొదువ నతండుఁ బ్రత్యుత్థానంబు సేసి విదుర సంజయ సహితంబుగా నెదుర్కొనం జేరి. 174

ప్రతిపదార్థం: అనుచున్; అతి కుతూహలంబునన్= మిక్కిలి వేడ్కతో; అవలోకింపన్= కనుగొనటానికి; ఆబాలవృద్ధంబు+అగు= పిల్లలు మొదలు ముదుసళ్ళ వరకుగల; పౌరలోకంబు= పురప్రజలు; ఆలోకన కౌతుకంబునన్= తనను చూచుటయందలి అభిలాషతో; తన రథంబున్= తన తేరిని; కదిసిన సందడిన్= సమీపించటం వలన ఏర్పడిన రద్దిని; జడియు= నివారించే; వేత్రహస్తులన్= బెత్తాలవారిని; వారించుచున్= వలదని పలుకుతూ; నారాయణుండు; సమ్మర్ద మందగమనంబునన్+చని= జనుల రాయిడివలన మెల్లని గమనంతో వెళ్ళి; మణితోరణ సుందరంబు+అగు= రత్నాల తోరణముచే అందమైన; రాజమందిర ద్వారంబు= రాజభవనం యొక్క వాకిలి; ప్రవేశించి= చొచ్చి; కక్ష్యా+అంతరంబులు+కడచి= లోగిళ్ళు దాటి; ఏనుంగు మొగసాలన్+చొచ్చి= ఏనుగులను కట్టివేసే చావడిలో ప్రవేశించి; అరదంబు+డిగ్గి= రథంనుండి దిగి; అల్లన= తిన్నగా; నడచునప్పుడు= నడిచేవేళ; అంతకున్+మున్ను+అ= అంతకు మునుపే; అరిగి= వెళ్ళి; భీష్మ ద్రోణ ప్రముఖులు+అగువారలు= భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు; ధృతరాష్ట్రునిన్+పొదువన్= ధృతరాష్ట్రుడిని పట్టుకొనగా; అతండున్= ఆంబికేయుడు; ప్రత్యుత్థానంబు+చేసి= ఎదుర్కొనుటకు లేచినవాడై; విదుర సంజయ సహితంబుగాన్= విదురుడితో సంజయుడితో; ఎదుర్కొనన్+ చేరి= నారాయణుడిని ఎదుర్కొనటానికి సమీపించి. (క్రింది పద్యంతో అన్వయం)

తాత్పర్యం: అంటూ మిక్కిలి అభిలాషతో శౌరిని దర్శించటానికి పిల్లలు మొదలు ముసలివారివరకు హస్తినాపురిలోని ప్రజలంతా వేడ్కపడి ఆయన రథం చుట్టూ గుమిగూడారు. ఆ జనుల రాయిడిని తొలగించటానికై వేత్రహస్తులు బెత్తాలు జళిపించగా, వలదని వారిని వారిస్తూ నారాయణుడు ఆ సందడిలో మెల్లని గమనంతో మణితోరణంతో విరాజిల్లే రాజమందిర

ద్వార ప్రవేశం చేశాడు. తొట్టికట్లు దాటుతూ పోయి ఏనుగుల చావడిలో ప్రవేశించి అక్కడ రథం దిగాడు. అక్కడ నుండి గోవిందుడు తిన్నగా నడిచివస్తుండగా అంతకుమునుపే వెళ్ళినవారై భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు ధృతరాష్ట్రుడిని పొదివి పట్టుకొన్నారు. ధృతరాష్ట్రుడు విదుర సంజయులతో నడచి వచ్చి ముకుందుడిని ఎదుర్కొన్నాడు.

ఆ. అతనిఁ గౌఁగిలించి యచ్చటఁ గల విదు ।
రాది శిష్టజనుల నాదరార్ద్ర
బంధు దృష్టిఁ జూచి పరిరంభ సంభావ ।
నము లొనర్చి శౌరి ప్రమద మెసఁగ. 175

ప్రతిపదార్థం: శౌరి= శ్రీకృష్ణుడు; అతనిన్+కౌఁగిలించి= ధృతరాష్ట్ర మహారాజును ఆలింగనం చేసికొని; అచ్చటన్+కల= అక్కడున్న; విదుర+ ఆది+శిష్టజనులన్= విదురుడు మొదలైన పెద్దలను; ఆదర+ఆర్ద్ర+ బంధుదృష్టిన్= ఆదరంచేత మృదువైన చుట్టపు చూపుతో; చూచి= కనుగొని; పరిరంభ సంభావనములు= ఆలింగనాదికమైన మన్ననలు; ఒనర్చి= చేసి; ప్రమదము+ ఎసఁగన్= సంతోష మొప్పగా. (మీది వచనంతో అన్వయం)

తాత్పర్యం: మాధవుడు ధృతరాష్ట్ర మహారాజును కౌఁగిలించుకొని, విదురుడు మొదలైన పెద్దలను ఆదరమేదురమైన చుట్టపు చూపులతో చూచి, మన్ననతో వారిని ఆలింగన మొనర్చుకొన్నాడు.

వ. వార లందఱకును సాత్యకిని దగిన సమాచారంబులు నడపం బనిచె; నటమున్న ధృతరాష్ట్రు పనుపునం దెచ్చి పెట్టిన నచ్చోటన యున్న యున్నత కనకాసనంబున నతండునుప నాసీనుం డయ్యె; నవ్వాసుదేవునకు విహితానుష్ఠాన పరాయణు లగు నగరి పురోహితులు రాజానుమతంబున నర్ఘ్యపాద్య మధుపర్కాద్యుప చారంబు లాచరించి యతని తమ్ముని నర్ఘ్యపీఠంబున నునిచి యర్చించిరి; నరనాథుండును దొరలును నిజోచితా

సనంబుల నుండిరి; కొలువెల్లను సూర్యోదయ సమయంబునఁ గమలా కరంబు విధంబున వికసించి యుండె నయ్యవసరంబునఁ గృష్ణుండు ధర్మనందను వచనంబులుగా నాంబికేయునకుం దగువారలకుం బ్రణామ పరిరంభణ ప్రముఖ సముచిత సంభావనంబులు వలికి సంభాషణం బులకుం జొచ్చి. 176

ప్రతిపదార్థం: వారలందఱకును; సాత్యకిని తగిన సమాచారంబులు+ నడపన్= తగిన వార్తలు అందించటానికి; పనిచెన్= నియమించాడు; అటమున్న+అ= అంతకు మునుపే; ధృతరాష్ట్రు పనుపునన్+తెచ్చిపెట్టిన= ధృతరాష్ట్రుడి ఆదేశంవలన తెచ్చిఉంచిన; ఆ+ చోటన్+అ+ఉన్న= అక్కడేఉన్న; ఉన్నత+కనక+ఆసనంబునన్= ఎత్తయిన బంగారు పీఠమునందు; అతండు= ధృతరాష్ట్రుడు; ఉనుపన్= కూర్చుండ బెట్టగా; ఆసీనుండు+ అయ్యెన్= కూర్చున్నాడు; ఆ వాసుదేవునకున్= గోపాలదేవుడికి; విహిత+అనుష్ఠాన+ పరాయణులు+అగు= శాస్త్రోక్తమైన ఆచారమునందు శ్రద్ధగలవారైన; నగరి పురోహితులు= రాజపురోహితులు; రాజ+అనుమతంబునన్= ధృతరాష్ట్రుడి సమ్మతితో; అర్ఘ్యపాద్య మధుపర్క+ఆది+ ఉపచారంబులు= చేతులకు కాళ్ళకు నీళ్ళు ఇచ్చుట, పాలలో కలిపిన తేనె ఇవ్వటం మొదలైన సమ్మానాలు; ఆచరించి= చేసి; అతని తమ్మునిన్= శ్రీకృష్ణుడి అనుజుడైన సాత్యకిని; అర్ఘ్యపీఠంబునన్+ఉనిచి= తగిన పీఠముపై కూర్చుండ బెట్టి; అర్చించిరి= పూజించారు; నరనాథుండును= ధృతరాష్ట్రుడును; దొరలును= ఇతర రాజులును; నిజ+ఉచిత+ఆసనంబులన్+ఉండిరి= తమకు తగిన పీఠాలపై తాము కూర్చున్నారు; కొలువు+ఎల్లను= సభ అంతా; సూర్య+ఉదయ సమయంబునన్= భానుడు దయించిన వేళలో; కమల+ఆకరంబు విధంబునన్= తామర కొలనువలె; వికసించి+ఉండెన్= ప్రకాశిస్తున్నది; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో; కృష్ణుండు; ధర్మనందను వచనంబులు గాన్= ధర్మరాజు చెప్పిన మాటలుగా; ఆంబికేయునకున్= అంబిక

కుమారుడైన ధృతరాష్ట్రుడికీ; తగువారలకున్= తగినట్టివారికినీ; ప్రణామ= నమస్కారాలు; పరిరంభణ= ఆలింగనాలు; ప్రముఖ= మొదలైన; సముచిత సంభావనంబులు= తగిన మన్ననలు; పలికి= తెలిపి; సంభాషణంబులకున్= మాటలకు; చొచ్చి= ఉపక్రమించి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అందరి యోగక్షేమాలు విచారించటానికై సాత్యకిని నియమించాడు. అంతకుమునుపే అచ్చటికి ధృతరాష్ట్ర మహారాజు ఆజ్ఞ చేత ఎత్తయిన బంగారు పీఠాన్ని తెచ్చి ఉంచారు. ఆ పీఠంపై ధృతరాష్ట్రుడు కూర్చుండ బెట్టగా శౌరి కూర్చున్నాడు. అప్పుడు శాస్త్ర విహితమైన ఆచారమునందు శ్రద్ధ గల రాజపురోహితులు రాజుగారి అనుమతితో వాసుదేవుడికి అర్ఘ్యం పాద్యం మధుపర్కం మొదలైన మర్యాదలు జరిపారు. గోవిందుడి తమ్ముడగు సాత్యకిని కూడా తగిన పీఠంమీద కూర్చుండ బెట్టి పూజించారు. ఆ తరువాత ధృతరాష్ట్రుడూ, తక్కిన రాజులూ తమ తమ గద్దెలపై ఉన్నారు. సూర్యోదయ కాలంలో పద్మసరస్సువలె సభ అంతా కళకళలాడుతూ ఉండింది. అప్పుడు శ్రీకృష్ణుడు ఆంబికేయునకూ, అర్హులైనవారికీ ధర్మరాజు మాటలుగా ఆతడి నమస్కారాలు, ఆలింగనాలు మొదలైన మన్ననలు అందజేసి సంభాషించటానికి ఉపక్రమించాడు.

విశేషం: 1. అలం: ఉపమ. సూర్యోదయ సమయంలో వికసించిన కమలాలతో ఒప్పారే సరోవరం వలె కౌరవసభ కృష్ణ దర్శనంతో కళకళలాడిందని భావం. చక్కని ఉపమానం. శ్రీకృష్ణ దివ్యత్వదీపకం.

2. ఈ సన్నివేశంలో అతిథులు వచ్చినప్పుడు ఆయా సందర్భాలలో సాగే రాజమర్యాదలను సవిస్తరంగా, సముచితంగా వర్ణించి తిక్కన రంగ మర్యాదలను నాటకీయంగా చిత్రించాడు. (సంపా.)

క. రాజునకుఁ దియ్య మెసఁగెడు।
పూజా వచనముల నెయ్యపుంబలుకులఁబే

రోజ మెయి బంధుమిత్ర స।
మాజములకు మేలములఁ గుమారులకుఁ దగన్. 177

ప్రతిపదార్థం: రాజునకున్= ధృతరాష్ట్రునకు; తియ్యము+ఎసఁగెడు= ప్రియమొప్పు; పూజావచనములన్= గౌరవ వాక్యాలతోను; పేరు+ఓజమెయిన్= మహోత్సాహంతో; బంధుమిత్ర సమాజములకున్= చుట్టముల యొక్క హితుల యొక్క సమూహమునకు; నెయ్యపున్+పలుకులన్= స్నేహ వచనాలతోడనూ; తగన్= ఒప్పిదముగా; కుమారులకున్= ధృతరాష్ట్రుడి కొడుకులకు, మేలములన్= పరిహాసాలతోడను.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడికి ప్రీతి కలిగించే గౌరవ వచనాలతో; బంధు మిత్ర సమూహానికి మహోత్సాహమొప్పే ప్రేమవచనాలతో, కురుకుమార వర్గానికి పరియాచకపు మాటలతో. (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: శ్రీకృష్ణుడు సభలో సంభాషణ ప్రారంభించాడు. సంభాషణం రాయబారపు ఉపన్యాసం కాదు. పలు హోదాలలో ఉన్నవారిని ఆయా పద్ధతులలో పలుకరించే మర్యాద. శ్రీకృష్ణుడి ప్రవర్తనలోని ప్రతి చిన్న అంశాన్ని కూడా వదలకుండా తిక్కన జాతి వార్తా చమత్కారయుతంగా వర్ణించాడు. ఈ పద్యంలో మొదట రాజును పలుకరించాడు. ఆ మాటలతో రాజుకు సంతోషం కలిగించాడు. ఆయనకు సాక్షాత్తు (వాక్పుష్పాలతో) పూజిస్తున్నట్లు, గౌరవిస్తున్నట్లు మర్యాదను నడిపాడు. రాజును ఒక్కడినీ పలకరించే తీరొకటి. ఆ తరువాత బంధువులు, మిత్రులు మొదలైన వారు సభలో ఆయాచోట్ల కలిసి కూర్చుండి ఉంటారు. వారిని సామూహికంగా పలకరించాడు. స్నేహంగా ఉత్సాహంగా మాట్లాడాడు. తరువాత కురుకుమార వర్గాన్ని గుంపుగా పలకరించాడు. వారితో పరిహాసా లాడుతూ చనువును స్నేహాన్నీ ప్రకటించాడు. సంభాషణ వైవిధ్యం వర్ణన శిల్పం. (సంపా.)

వ. ఇంపు పుట్టించుచుఁ గొండొకసేపు నిలిచి పుండరీకాక్షుండు విదురు సదనంబునకుం జనియెద మఱియుఁ బోవలయు నెడలకుం బోయి వచ్చెద'

నని పలికి యాంబికేయుననుమతి వడసి యరుగ, విదురుండు ససంభ్రమంబునం గడచిచని మంగళోపచార సహితంబుగా నెదుర్కొని భయ భక్తి వినయ స్నేహానందంబులఁ గందళితుం డగుచు గోవిందునకు దేవోపచారంబుల ననేక ప్రకారంబుల నర్చన లిచ్చి, కౌంతేయుల కుశలం బడిగిన నతనికి వారలవృత్తాంతంబు సమస్తంబును సవిస్తరంబుగాఁ జెప్పిన యనంతరంబ. 178

ప్రతిపదార్థం: ఇంపు పుట్టించుచున్= ఆనందం కలిగిస్తూ; కొండొకసేపు= కొంత తడవు; నిలిచి= ఆగి; పుండరీక+అక్షుండు= తెల్లదామరల వంటి కన్నులు గల గోవిందుడు; విదురు సదనంబునకున్= విదురుడి గృహానికి; చనియెదన్= వెళ్ళుతాను; మఱియున్= ఇంకను; పోవలయు+ఎడలకున్= పోవలసిన చోట్లకు; పోయివచ్చెదన్; అని పలికి; ఆంబికేయు+అనుమతి+పడసి= ధృతరాష్ట్రుడి అంగీకారం పొంది; అరుగన్= వెళ్ళగా; విదురుండు; ససంభ్రమంబునన్= వేగిరపాటుతో; కడచిచని= దాటుకొని వెళ్ళి; మంగళ+ఉపచార+సహితంబుగాన్= శుభకరాలైన సేవలతో కూడునట్లుగా; ఎదుర్కొని= స్వాగతం చెప్పి; భయభక్తి వినయ స్నేహ+ఆనందంబులన్= భయం, భక్తి, అణకువ, ప్రేమ, సంతోషం అనే గుణాలతో; కందళితుండు+ అగుచున్= వికాసం పొందినవాడై; గోవిందునకున్= శ్రీ కృష్ణుడిని; దేవ+ఉపచారంబులన్= దేవతలకు కావించే మన్ననలతో; అనేక ప్రకారంబులన్= పలు విధముల; అర్చనలు+ఇచ్చి= పూజ లొసగి; కౌంతేయుల కుశలంబు= పాండవుల క్షేమం; అడిగినన్= ప్రశ్నించగా; అతనికిన్= విదురుడికి; వారల వృత్తాంతంబు= పాండవుల యొక్క సమాచారం; సమస్తంబును= అంతయూ; సవిస్తరంబుగన్= విపులంగా; చెప్పిన+అనంతరంబు+అ= చెప్పిన తరువాత.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కొంతసేపు అక్కడ ఆగి, విదురుడి గృహానికీ, ఇంకా వెళ్ళవలసిన చోట్లకూ వెళ్ళి వస్తాను' అని ధృతరాష్ట్రుడి అంగీకారం పొంది బయలుదేరాడు. విదురుడు గబగబ ముందువెళ్ళి తన యింటి దగ్గర ఎదుర్కొని శ్రీహరికి స్వాగతం పలికాడు. భయం, భక్తి, వినయం, స్నేహం, సంతోషం పెల్లుబుకగా గోవిందుడికి దేవతోపచారాలతో, బహువిధాల పూజలు చేశాడు. కుంతీపుత్రుల యోగక్షేమాలు అడిగాడు. అతడికి కమలాక్షుడు పాండవుల సంగతి అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. ఆ తరువాత.

విశేషం: 1. సభలో సంభాషించే వారితో మాట్లాడి, సభాసదులైన వారందరికీ సంతోషం కలిగేటట్లుగా తన దివ్య మంగళ విగ్రహ దర్శనాన్ని ప్రసాదిస్తూ కొంతసేపు నిలవటం రాజసభలో పెద్దల మర్యాద. శ్రీకృష్ణుడు దివ్యుడు కావటం చేత అతడి దర్శనానికి ప్రత్యేకత ఉన్నది. 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా!' అన్న వేమన సూక్తి ఇక్కడ నిజమనిపిస్తుంది.

2. ఒకసారి రాజసభలో ప్రవేశించిన దూత రాజానుమతితోనే బయటకు వెళ్ళాలి. దౌత్యం మొదలు కాకపోయినా కృష్ణుడు సభామర్యాదను పాటించాడు. ధృతరాష్ట్రుడికి తన కార్యక్రమం చెప్పి అనుమతి వేడాడు.

3. విదురుడు శ్రీకృష్ణుడిని దివ్యుడిగా భావించి షోడశోపచార విధులతో దేవతార్చన విధితో పూజించాడు. భయభక్తి, వినయ వందనా లాచరిస్తూ పులకించాడు. విదురుడు భక్తుడు. శ్రీకృష్ణుడు భగవంతుడు. అందుకే భక్తుడి ఇంటికి వెళ్ళాడు భగవంతుడు. లౌకిక ఆధ్యాత్మిక భావాల తారతమ్య మిక్కడ స్పష్టం. (సంపా.)

క. ముదమునఁ గృష్ణుఁడు కుంతీ।
సదనమునకుఁ జనియె; నపుడు సమ్మదమున న
వ్విదురుం 'డోగిర మొనరిం।
చెద' నని తన్నడుగ 'నట్ల చేయుం' డనుచున్. 179

ప్రతిపదార్థం: కృష్ణుఁడు, ముదమునన్= సంతోషంతో; కుంతీ-సదనమునకున్= కుంతి యింటికి; చనియెన్= వెళ్ళాడు; అపుడు; ఆ+విదురుండు= ఆ విదురుడు; సమ్మదమునన్= హర్షంతో; ఓగిరము+

ఒనరించెదన్= వంట చేయిస్తాను; అని; తన్నున్+ అడుగన్= తనతో చెప్పగా; అట్ల చేయుండు+అనుచున్= అట్లాగే చేయించం డని చెప్పి.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు సంతోషంతో కుంతీ గృహానికి వెళ్ళాడు. అప్పుడు విదురుడు హర్షించి 'వంట చేయిస్తాను' అని శ్రీహరితో అన్నాడు. అట్లాగే చేయించండి' అని చెప్పి కృష్ణుడు.

వ. చని కాంచిన నద్దేవియు నతని తోడు నీడయుంబోని తన కొడుకులం దలంచి యడలు పుట్టిన నమ్మాధవు మెడ వట్టికొని యెలుంగెత్తి యేడ్చిన, నతండు సంబోధించి యూరార్ప నెట్టకేలకు నుడిగి యాతనికి నాసన విన్యాసనాద్యుప చారంబులు చేయించి తత్సమీపంబున నుచిత పీఠంబునం గూర్చుండి గద్గద కంఠంబుతో నిట్లనియె. 180

ప్రతిపదార్థం: చని= కుంతీదేవి నివాసానికి ఏగి; కాంచినన్= ఆమెను చూడగా; ఆ+ దేవియున్= ఆ కుంతీదేవికూడ; అతని తోడు నీడయున్+ పోని= అతని వెన్నంటి వచ్చు నీడల వంటివారైన; తన కొడుకులన్+తలంచి= తన కుమారులను జ్ఞప్తికి తెచ్చు కొని; అడలు+పుట్టినన్= దుఃఖం జనించగా; ఆ+మాధవు మెడ పట్టుకొని= కృష్ణుడి కంఠం పట్టుకొని; ఎలుంగు+ఎత్తి= గొంతెత్తి; ఏడ్చినన్= విలపించగా; అతండు= హరి; సంబోధించి= అత్తా అని హెచ్చరించుకొని; ఊరార్పన్= ఓదార్చగా; ఎట్టకేలకున్= తుదకు; ఉడిగి= ఏడ్పుమాని; అతనికిన్= మేనల్లుడికి; ఆసన+విన్యాసన+ ఆది+ ఉపచారములు చేయించి= పీఠముంచటం మొదలైన మన్ననలు కావించి; తద్+ సమీపంబునన్= అతడి చెంగట; ఉచిత పీఠంబునన్+కూర్చుండి= తగిన పీఠం మీద కూర్చొని; గద్గద కంఠంబుతోన్= డగ్గుత్తికతో; ఇట్లు+ అనియెన్= ఇట్లా పలికింది:

తాత్పర్యం: శ్రీకృష్ణుడు కుంతీదేవి గృహానికి వెళ్ళి ఆమెను దర్శించాడు. ఆమె అతడి వెన్నంటే నీడల వంటి తన కొడుకులు జ్ఞప్తికి రాగా దుఃఖంతో

మేనల్లుడి మెడపట్టుకొని గొంతెత్తి విలపించింది. ముకుందుడు అత్తా అని సంబోధించి ఊరడించాడు. హరి ఊరడింపుతో ఆమె ఏడ్పుమాని అతడికి కూర్చుండ పీఠం వేయించటం మొదలైన ఉపచారాలు చేయించింది. తాను ఆయన చెంత అర్హపీఠంమీద ఆసీనురాలై ఎలుగురాలుపడ ఇట్లా అన్నది.

విశేషం: కుంతీదేవికి ఎదుట శ్రీకృష్ణుడు కనపడగానే అతడికి తోడునీడలవలె ఉండే పాండవులు జ్ఞాపకం రావటం వలన ఆమెకు దుఃఖం పొంగివచ్చింది. శ్రీకృష్ణుడు పాండవుల కెంత ఆత్మీయుడో కుంతీదేవి కంత ఆత్మీయుడు. వత్సల భావద్యోతకమైన చేష్ట - అప్యాయంగా మెడను కౌగిలించుకొనటం. మనసులో బాధను కొన్నేళ్ళుగా అణచుకొని ఉండటంచేత దానిని ఒక్కసారిగా వెలువరించే సాత్త్విక భావం వంటి అభినయ విశేషం ఎలుగెత్తి ఏడ్వటం. కుంతికి శ్రీకృష్ణుడన్నా, తన బిడ్డలన్నా ఉన్న అభేద వాత్సల్య భావం ఇందులో వ్యంగ్యం. స్వయంగానూ, ధర్మజుడి ప్రార్థన వలననూ ఆమెను దర్శింప వచ్చాడు శ్రీకృష్ణుడు. సాక్షాత్తు తన పుత్రులను చూచిన సంతృప్తి ఆమెకు కలిగించాలని వచ్చాడు. అందువలననే ఈ సన్నివేశంలో ఆ ఆర్ద్రత. (సంపా.)

సీ. 'నీ శిక్షఁ బెరుఁగుట నీతిమంతులుఁ బుణ్య।
పరులు శూరులు గదా పాండుసుతులు
సుఖవృత్తిఁ బెక్కండ్రు సూరెలఁ గొలువ నుం।
డెడువార లిడుమలఁ బడుచు నిర్జ
నంబైన కానలోనన యెట్లు నిలిచిరి?।
ననుఁ బెట్టి నాయెదఁ గొనుచుఁ జనిరి
యేను వడ్డింపంగ నింపారఁ గుడిచి మె।
త్తని సెజ్జ నిద్రించి వినుతభద్ర

తే. గాన కరి బృంహితముల మేల్కాంచునట్టి।
వారు కందమూలంబు లాహారములుగఁ

బొదలc బుట్టలcబడి యుండి పులుcగు మెకము ।
లఱవ మేల్కనుచుండిరే యక్కటకట! 181

ప్రతిపదార్థం: నీ శిక్షన్= నీ అభ్యాసంలో; పెరుcగుటన్= పెరిగినవారగుటచేత; పాండుసుతులు= పాండుపుత్రులు; నీతిమంతులున్= న్యాయంతో కూడినవారు; పుణ్యపరులు= సుకృతమునందు ఆసక్తికలవారు; శూరులుగదా= వీరులు గదా!; పెక్కండ్రు= పలువురు; సూరెలన్= కుడి యెడమ పార్శ్వములందు; కొలువన్= సేవిస్తుండగా; సుఖవృత్తిన్= సుఖ జీవనోపాయంతో; ఉండెడివారలు= ఉన్నట్టివారు; ఇడుమలన్+పడుచున్= కష్టాలనుభవిస్తూ; నిర్జనంబు+ఐన= మనుష్యులులేని; కానలోనన్+అ= అడవులలోనే; ఎట్లు నిలిచిరి?= ఎట్లున్నారు?; ననున్+పెట్టి= నన్నిక్కడ వదలిపెట్టి; నా+ఎదన్+కొనుచున్+చనిరి= నా హృదయాన్ని తమ వెంట తీసికొని వెళ్ళారు; ఏను వడ్డింపంగన్= నేను వడ్డన చేయగా; ఇంపు+ఆరన్+కుడిచి= కమ్మగా కడుపార భుజించి; మెత్తని సెజ్జన్= మృదువైన పాన్పుల మీద; నిద్రించి= నిదురపోయి; వినుత= కొనియాడదగిన; భద్రగాన= మంగళ గానాల చేతను; కరిబృంహితములన్= ఏనుగుల ఘీంకార ధ్వనుల చేతను; మేల్కాంచునట్టివారు= కనులు తెరచునట్టివారు; కందమూలంబులు= గడ్డలు; వేళ్ళు; ఆహారములుగన్= భోజనంకాగా; పొదలన్= పొదలలో; పుట్టలన్= పుట్టలమీద; పడియుండి= నివసిస్తూ; పులుcగు మెకములు= పక్షులు, జంతువులు; అఱవన్= అరవగా; మేల్కనుచున్+ఉండిరే?= మేల్కొను చున్నారా?; అక్కట+అకట!= అయ్యయ్యో! (వారికెన్ని కష్టాలు వచ్చాయి.)

తాత్పర్యం: 'కృష్ణా! నీ కట్టుబాటులో పెరిగిన వారగుటచే పాండవులు నీతిమంతులు, పుణ్యపరులు, వీరులు అయినారు. వారు ఇరుగెలంకులజేరి పెక్కుమంది సేవిస్తుండగా సుఖంగా నుండవలసినవారు కష్టాలనుభవిస్తూ నిర్మానుష్యాలైన అరణ్యాలలో ఎట్లా నివసించారో! నన్నిక్కడ విడిచిపెట్టి నా

హృదయాన్ని తమవెంట కొనిపోయారు. నేను వడ్డిస్తుంటే కడుపారా కమ్మగా తిని మెత్తని పాన్పుల మీద నిదురించి మాగధుల మంగళ గానాలతో, భద్రగజాల ఘీంకార ధ్వనులతో మేల్కొనునట్టి నా బిడ్డలు పొదలలో గుట్టలలో పడియుండి పక్షుల కూతలకు, జంతువుల అరపులకు మేల్కొంటున్నారు గదా! అయ్యో, వారి కెన్ని కష్టాలువచ్చాయి?

విశేషం: అలం: విషమం. కుంతీదేవి వేసిన కుశల ప్రశ్నలలో ఒక మర్యాద. సంస్కృతి, మాతృప్రేమావిష్కార క్రమం గోచరిస్తుంది. కొడుకుల శీలం వీరమాతకు ప్రథమ గణ్యమైన కుశలాంశం. ఆ తరువాత వారి సుఖజీవన విధానాన్ని గురించిన విశేషం తెలిసికొనగోరుతుంది. ఆ తరువాత తన పెంపకంలో తాను చూపిన వాత్సల్యం. వారు పొందిన సుఖాలను గురించి సంస్మరణం తల్లి అడుగుతుంది. తల్లి లాలించటం, అన్నం పెట్టటం, నిద్రపుచ్చటం, నిద్రలేపటం మొదలైన సేవలు చేసి పిల్లలను పెంచుతుంది. వాత్సల్యపూర్ణంగా అవన్నీ పిల్లలు కలకాలం అనుభవించాలని ఆశిస్తుంది. కుంతి ఈ పద్యంలో వీటిని ప్రస్తావించటం సహజం. కుశల ప్రశ్నలలో తొలుత నిలిచే చల్లని మాటలివి. (సంపా.)

ఆ. తండ్రిలేని ప్రజలు తల్లిని బాసి పె ।
ద్దయునుగాల మివ్విధమునc బడిరి
భంగపాటు దుఃఖపాటును సంకట ।
పాటు గలిగె విరటు పాలc బిదప.' 182

ప్రతిపదార్థం: తండ్రి లేని ప్రజలు= తండ్రిని కోల్పోయిన బిడ్డలు; తల్లినిన్+పాసి= తల్లిని గూడా విడిచి; పెద్దయును+కాలము= చాలా కాలము; ఈ+విధమునన్= ఈ రీతిగా; పడిరి= కష్టాలనుభవించారు; పిదపన్= అరణ్యవాస మైన తరువాత; విరటుపాలన్= విరటుడి దగ్గర; భంగపాటు= అవమానం; దుఃఖపాటు= దుఃఖాలనుభవించటం; సంకటపాటు= చిక్కులలో పడటం; కలిగెన్= సంభవించాయి.

తాత్పర్యం: తండ్రి లేని పాండవులు తల్లినైన నన్ను కూడా విడిచి చాలా కాలం ఈ విధంగా అడవులలో కష్టాలు అనుభవించారు. ఆ పిదప విరటుడికడ వారికి భంగపాటు, దుఃఖపాటు, సంకటపాటు కలిగాయి.'

విశేషం: పాండవులు పొందిన కష్టాలను మూడంచెలుగా భావించిందా తల్లి. 1. తండ్రి పోయిన తరువాత పాండవులు భంగపాటు పొందారు. రాజ్యభాగ ప్రసక్తిగాని, రాజ్యాన్ని కోల్పోయే ప్రసక్తిగాని, దుర్యోధనాదుల వలన కలిగే అవమానాలుగాని పాండురాజు బ్రతికి ఉంటే జరిగేవి కావు. కాబట్టి, తండ్రిలేని పిల్లలు కాబట్టే రాజ్యాన్ని కోల్పోయి అరణ్యాజ్ఞాతవాసాలు చేసే అవమానం కలిగింది.

2. పాండవులు తల్లిని వదలి ఎన్నడూ లేరు. కాని, అరణ్యవాసానికి వెళ్లుతూ ఆమెను వదలి వెళ్ళవలసి వచ్చింది. ఆ వియోగం తల్లికీ, బిడ్డలకూ దుః ఖతీవ్రతను కలిగించింది.

3. ఇక అజ్ఞాతవాసకాలంలో విరాటనగరంలో పాండవులు ఎన్నో చిక్కులు పడవలసి వచ్చింది. తండ్రి లేని పిల్లలు అందరికీ లోకువ. తల్లికి దూరమైన పిల్లలు ఆదరానికి దూరమైనవారు. అజ్ఞాతవాసంలో దినదినగండంగా బ్రదుకవలసి వస్తుంది. ఆ అవస్థలను తలచుకొన్న తల్లి- కుంతి తల్లడిల్లిపోయింది. (సంపా.)

వ. అని వెండియు. 183

తాత్పర్యం: అని, మరల.

ఉ. 'దానదయాపరుం డయిన ధర్మతనూభవు సేమ మెట్లు? పం
చాననవిక్రముం డగు బకారికి భద్రమె? యస్త్ర శస్త్ర వి
ద్యానిపుణుండు క్రీడి సుఖియా? వినయాభరణుల్ గవల్ సమా
ధాన సమేతులే? యకట! ద్రౌపది సాధ్వి; సుఖంబె దానికిన్? 184

ప్రతిపదార్థం: దానదయాపరుండు+అయిన= దానదయా గుణాలలో శ్రద్ధ గల్గిన; ధర్మ తనూభవు= ధర్మజుడియొక్క; సేమము+ఎట్లు?= క్షేమమెట్లా ఉన్నది?; పంచ+ఆనన విక్రముండు+అగు= సింహపరాక్రమంతో సమానమైన పరాక్రమం కల్గిన; బక+అరికిన్= బకాసురుడిని సంహరించిన భీమసేనుడికి; భద్రమె?= కుశలమా?; అస్త్ర శస్త్ర విద్యానిపుణుండు= బాణవిద్యలలో ఆయుధ విద్యలలో నేర్పరి అయిన; క్రీడి= అర్జునుడు; సుఖియా?= హాయిగానున్నాడా?; వినయ+ఆభరణుల్= అడకువయే సొమ్ములుగా గల్గిన; కవల్= అమడలు - నకుల సహదేవులు; సమాధాన సమేతులు+ఏ= శాంతితో కూడిఉన్నారా?; అకట!= అయ్యో! ద్రౌపది= ద్రుపద పుత్రి; సాధ్వి= పతివ్రత; దానికిన్+ సుఖంబె?= ఆమెకు సౌఖ్యమేనా?

తాత్పర్యం: దానదయాగుణాలుగల ధర్మజునకు క్షేమమా? సింహపరాక్రము డైన భీమసేనుడికి కుశలమా? అస్త్రశస్త్ర విద్యలందు ఆరితేరిన అర్జునుడు హాయిగా ఉన్నాడా? వినయాలంకృతులైన నకుల సహదేవులు నెమ్మదిగా ఉన్నారా? అయ్యో! పాంచాలి పరమ సాధ్వి- ఆమె సుఖంగా ఉన్నదా?

విశేషం: పిల్లల క్షేమం గురించి అడిగేటప్పుడు తల్లి వారి అసలు పేర్లు పేర్కొనకుండా, ముద్దుపేర్లుకాని, బిరుదనామాలుకానీ, ఆత్మీయముద్రతో పిలిచే పిలుపులు గాని పలకటం లోకసహజం. దాని కనుగుణంగా ధర్మతనూభవుడు, బకారి, క్రీడి, కవలు - అనటం గమనించదగింది. వారిని ఆమెకు నచ్చిన, ఆమె మెచ్చిన గుణాలతో విశేషించి పేర్కొనటం ఆమె అభిమానానికి నిదర్శనం. వీరమాతలు పిల్లల యోగక్షేమాల నడిగే నమూనా పద్యమిది. కోడలిని పేరు పెట్టి పిలిచి, సాధ్విగా గౌరవించటం ఆదరాభిమానాలకు సాక్ష్యం. దాదాపు 25 శ్లోకాలలో కొడుకులను గురించి అడిగిన మూలంలోని కుంతి బావురుమన్న ట్లుంటుంది. తిక్కన తీర్చిదిద్దిన కుంతి నిర్వేదాన్ని కూడా నిబ్బరంగా ప్రదర్శించ గలిగింది. (సంపా.)

చ. కొడుకుల కంటె నయ్యనుఁగుఁ గోడలి కెక్కుడు గూర్తుఁ గోడలుం
గొడుకులు సేయు భక్తి కట కోటి మడుంగులు భక్తి నాకు నె
ప్పుడుఁ దగఁ జేయుచుండు నది పుణ్యచరిత్ర కులాగ్రగణ్య క్రొ
త్తడి సకలంబుఁ జూడ సభ దైన్యముఁ బొందుట సూచి పొక్కితిన్. 185

ప్రతిపదార్థం: కొడుకుల కంటెన్= కుమారుల కంటెను; ఆ+అనుఁగు కోడలికిన్= ఆ కూర్మి కోడలికి; ఎక్కుడు కూర్తున్= నేను మిక్కిలి ప్రియపడుదును; కొడుకులు చేయు భక్తికిన్= కుమారులు కనబరచే పరమప్రేమకు; అట కోటి మడుంగులు భక్తిన్= అంతకు కోటి రెట్లు భక్తిని; నాకున్= నాకు; ఎప్పుడున్= ఎల్లవేళలందును; తగన్= చక్కగా; చేయుచున్+ ఉండున్= ఆమె సలుపుతుంటుంది; అది పుణ్యచరిత్ర= ఆమె పవిత్రమైన నడవడి గలది; కుల+అగ్రగణ్య= వంశములో తొలుత లెక్కించ దగినది; క్రొత్తడి= మగనాలు; సకలంబున్+చూడన్= అందరూ చూస్తూఉండగా; సభన్= కురుసభలో; దైన్యమున్+ పొందుట చూచి= దీన దశ పొలవటం చూచి; పొక్కితిన్= దుఃఖించాను.

తాత్పర్యం: కొడుకుల కంటె కోడలు అంటే నాకు చాలా ఇష్టం. కుమారులు చూపు ప్రేమ కంటె కోటి రెట్లు భక్తితో ఆమె నాకు సేవలు చేస్తుంది. పాంచాలి పవిత్రమైన నడవడి కలది. కులంలో ఎన్నె కెక్కింది. ఆ మగనాలు అందరు చూస్తుండగా కురుసభలో అంతటి దైన్యం పొందటం చూచి దుఃఖపడ్డాను.

విశేషం: కోడలిని మెచ్చుకొనే అత్త గుణవంతురాలు. కుంతి కోడలిని ఉత్తమురాలని ప్రశంసించింది. ఆమెను మనసారా ప్రేమించింది. కొడుకులకంటె ఆమెకు కోడలే ప్రీతిపాత్రురాలట! ద్రౌపది కుంతిని భక్తితో సేవించేదట! ఆమె పుణ్యచరిత్రట! కులాగ్రగణ్యట! మగనాలట! అంతటి అనురాగవతికి అంతటి అవమానం జరిగినందుకు ఆవేదన పడింది. ఈ పద్యం ఒక సత్యాన్ని బైటపెట్టింది. పాండవపక్షం వారందరిలో అగ్నివలె గుండెలను మండిస్తున్నది- కురుసభలో ద్రౌపది పొందిన అవమాన దుఃఖం. ద్రౌపది ఒకవైపు గర్వకారణం. మరొకవైపు జాలికి తావలం. (సంపా.)

తే. నాఁడు ద్రౌపది వడిన బన్నములు సూడ ।
నోర్చినప్పుడ యెంతకు నోర్వఁజెపుమ

యంత గడచిన దుఃఖంబు లనుభవింపఁ ।
గలవె లోకంబువారికిఁగమలనాభ! 186

ప్రతిపదార్థం: కమలనాభ!= పద్మం నాభియందుగలవాడా!; కృష్ణా; నాఁడు= ఆనాడు; ద్రౌపది+పడిన బన్నములు= ద్రౌపది పొందిన అవమానాలను; చూడన్+ఓర్చిన+ అప్పుడు+అ= చూచి సహించ జాలినప్పుడే; ఎంతకున్+ ఓర్వన్?= ఎంతకైనా భరించలేనో; చెపుమ= పల్కుమా!; (ఎన్నిటినైన భరింపగలనని అర్థం); లోకంబు వారికిన్= లోకులకు; అంత+కడచిన దుఃఖంబులు= ఆమె అనుభవించిన దుఃఖాల కంటె మించిన దుఃఖాలు; కలవె!= ఉన్నవా? (లేవని భావం.)

తాత్పర్యం: ఆనాడు పాంచాలి పొందిన అవమానాలు చూచి సహింపజాలిన నేను ఎంతకైనా ఓర్చుకోగలను. ఆమె అనుభవించిన కష్టాలను మించిన కష్టాలు లోకంలోని వారెవ్వరూ అనుభవించి ఉండరు.

విశేషం: ద్రౌపది పొందిన కష్టాలు మరెవ్వరూ లోకంలో అనుభవించి ఉండరని చెపుతూనే ఆ కష్టాలను చూచి సహించి ఇంకా బ్రతికి ఉన్న తాను మరెన్ని కష్టాలనైనా ఓర్చుకొనగలనని తన దుర్భర మనోవేదనను ధ్వనిమయంగా వ్యక్తం చేసింది కుంతి. సంధి మాటలలో శాంతి ప్రసంగాలలో కూడా మరువ లేని బడబాగ్ని వంటి బాధ ద్రౌపది మీది సానుభూతి. (సంపా.)

వ. అట్టి యెడ. 187

తాత్పర్యం: ఆ సమయాన.

క. విదురుం డొక్కఁడు దక్కఁగ ।
సదస్యు లెవ్వరును ధర్మసంక్షయ మిది కూ
డదు నార; యతని శీలమ ।
కుదు రీ లోకమున కింతకుం దలఁపంగన్." 188

ప్రతిపదార్థం: విదురుండు+ఒక్కఁడు+తక్కఁగన్= విదురు డొక్కడు తప్ప; సదస్యులు= సభలో ఉన్నవారు; ఎవ్వరును= ఒక్కరైనను కూడ; ఇది ధర్మ సంక్షయము= ద్రౌపదీ వస్త్రాపహరణం ధర్మమును నశింపజేస్తుంది; కూడదు= ఇట్టి నీచపు పని తగదు; నారు+అ= అనరు; తలఁపంగన్= ఆలోచించగా; ఈ లోకమునకున్+ఇంతకున్= ఈ జగమున కంతటికినీ; అతని శీలము+అ= ఆతడి వర్తనమే; కుదురు= ఆధారం.

తాత్పర్యం: విదురు డొక్కడు దప్ప నాటి సభలోని వారిలో ఒక్కరైనా పాంచాలిని పరాభవించటం ధర్మ వినాశక కృత్యం; ఇది తగదు అని పల్కినవారు కారు. ఆలోచించగా విదురుడి సత్స్వభావమే ఈ జగత్తుకంతా ఆదర్శప్రాయం.

వ. అని యివ్విధంబునఁ గృష్ణుతోడఁ దన యుమ్మలికంబు లన్నియుఁ ద్రవ్వికొని శోకంబు వెల్లిగొనఁ గొండొక దిగం బాటెడు చిత్తంబుతో మఱియు నిట్లనియె; 189

ప్రతిపదార్థం: అని; ఈ+విధంబునన్; కృష్ణుతోడన్; తన+ఉమ్మలికంబులు= తన దుఃఖాలు; అన్నియున్+త్రవ్వికొని= అన్నింటినీ స్మృతికి తెచ్చుకొని; శోకంబు= దుఃఖం; వెల్లిగొనన్= పొంగిప్రవహించగా; కొండొక దిగన్+పాటెడు చిత్తంబుతోన్= కొంచెం క్రుంగిపోతున్న మనస్సుతో; మఱియున్; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: కుంతీదేవి ఈ విధంగా మేనల్లుడైన శ్రీకృష్ణుడితో తన దుఃఖాలన్నింటినీ జ్ఞప్తికి తెచ్చుకొని శోకం వెల్లివిరియగా కొంచెం క్రుంగిన మనస్సుతో మళ్ళీ ఇట్లా అన్నది:

క. 'ఇది యెల్లను నొకతల; యీ।
పదు మూఁ డేఁడులును నాకు బావకొడుకుచే
నదయమగు కూడుగుడుచుట।
యది యొక తలయయ్యెఁ; నేమి యనఁగల దనఘా! 190

ప్రతిపదార్థం: అనఘా!= పుణ్యపురుషా!; ఇది+ఎల్లను+ఒకతల= ఈ కష్టాలన్నీ ఒక ఎత్తు; ఈ పదుమూఁడు+ఏఁడులును= ఈ పదమూడు సంవత్సరాలూ; నాకున్= నాకు; బావకొడుకుచేన్= బావ కుమారుడైన దుర్యోధనుడిచేత; అదయము+అగు కూడు= దయలేని అన్నం; కుడుచుట+అది= తినటంఅన్నది; ఒక తల+అయ్యెను= ఒక యెత్తైనది; ఏమి+అనన్+కలదు?= చెప్పటాని కింకే మున్నది?

తాత్పర్యం: కృష్ణా! ఈ పడిన కష్టాలు, అనుభవించిన దుఃఖాలు అన్నీ ఒక యెత్తు. ఈ పదమూడేళ్ళూ నాకు బావ కొడుకు పెట్టే దయమాలిన తిండి తినటం ఒక యెత్తుగా ఉన్నది. నే నేమి చెప్పగలనయ్యా?

విశేషం: కుంతి అభిమానవతి. అందుకే పదమూడేళ్ళు పరాయి పంచలో ఉండటంతోపాటు బావ కొడుకైన దుర్యోధనుడు నిర్దయగా, పరుషంగా వ్యవహరిస్తూ పెట్టుతున్న తిండి తినటం ఆమె భరించలేకపోయింది. 'ఏమి యనగలదు అనఘా!' అనే వాక్యం ఆమె దైన్యావస్థ యొక్క పరాకాష్ఠ! 'బావకొడుకు' అనే మాట సార్థకం. సొంత కొడుకులుండి కూడా బావగారి కొడుకు పెట్టే తిండి తినవలసి వచ్చిందని ఒక దైన్య భావం. 'దుర్యోధనుడి' పేరుచ్చరించని అనిష్టం అందులో వ్యంగ్యం. (సంపా.)

క. తన్నుఁ దన తమ్ములను నా।
కన్న కొడుకు లట్ల తలఁతుఁ గాని విభేదం
బెన్నఁడు నా మది లేమికి।
వెన్నుఁడ దైవంబు సాక్షి వినుము పలికెదన్. 191

ప్రతిపదార్థం: తన్నున్= ఆ దుర్యోధనుడినీ; తన తమ్ములను= అతడి సహోదరులనూ; నా కన్నకొడుకులు+అట్ల+తలఁతున్+కాని= నా కడుపున గన్నబిడ్డలైన పాండవులవలెనే భావిస్తానుగాని; విభేదంబు= వ్యత్యాసం; ఎన్నఁడున్= ఎప్పుడూ; నా మదిన్+లేమికిన్= నా మనసులో లేనందుకు; వెన్నుఁ

డ= ఓ విష్ణుమూర్తీ!- కృష్ణుడా!; (దైవంబు సాక్షి= ఇందుకు దేవుడే సాక్షి.) పలికెదన్ వినుము= చెప్పుతున్నాను వినుము.

తాత్పర్యం: కృష్ణా! దుర్యోధనుడినీ, అతని తోబుట్టువులనూ నా కడుపున గన్న కొడుకులవలెనే చూస్తాను గాని భిన్నంగా చూడను. నాకు భేదబుద్ధి లేనందుకు ఆ దేవుడే సాక్షి అని చెపుతున్నాను వినుము.

విశేషం: కుంతీదేవి పాండవ కౌరవులను సమదృష్టితో చూచేది. కాని, కౌరవులు మాత్రం తననూ, తన బిడ్డలనూ వేరుగా చూచారని మనోవేదన. ఆమె చిత్తశుద్ధికి దైవం సాక్ష్యం- అనటం జాతీయం. (సంపా.)

క. ఇది నిక్కం బగునేనియుఁ ।
దుది నీవుం బాండవులను దురితరహితులై
ముదమందఁ జూడఁగనియెద; ।
నది దీనికి మందు సువ్వె యంబుజనాభా! 192

ప్రతిపదార్థం: అంబుజనాభా!= పద్మము నాభియందు గలవాడా!; ఇది నిక్కంబు+అగున్+ఏనియున్= ఈ మాటలే నిజమైతే; తుదిన్= చివరకు; నీవున్= నీవున్నూ; పాండవులును= పాండవులున్నూ; దురితరహితులు+ఐ= పాపంలేనివారై; ముదము+ అందన్= సంతోషం పొందగా; చూడన్+కనియెదన్= చూడటానికి నోచుకొంటాను; అది= అట్లా మీరు ఆనందంతో ఉండటం; దీనికిన్+మందు+చువ్వె!= నా ఇప్పటి మనోవ్యథకు ఔషధం ఔతుంది సుమా!

తాత్పర్యం: కృష్ణా! నా మాట సత్యమైతే కడపటికి నీవూ పాండవులూ దోషాలంటనివారై ఆనందించగా చూడనోచెదను. ఇప్పటి నా హృదయ వ్యథకు మీరు పరమానందంతో ఉండగా చూడటమే ఔషధం సుమా!

విశేషం: 1. పాండవులను కౌరవులను సమంగా చూడటం అనేది నిజమే అయితే పాండవులు నిందలపాల్గాక, విజయులై తిరిగి వస్తారని ప్రమాణం చేసింది. ఇదీ దేశీయాచారమే.

2. అన్ని బాధలకూ నివారణశక్తి శ్రీకృష్ణుడే అని నమ్మి భక్తి విశ్వాసాలను ప్రదర్శించే కుంతీస్వభావం ఇందులో విశదం. (సంపా.)

సీ. బావ యొప్పం దనుపలుకుల నేమగు? ।
నాతని కొడుకుఁ గీడాడనేల?
కురువృద్ధుఁడగు బాహ్లికుని దూఱ నేటికి? ।
భీష్మునిపైఁబ్రయి వెట్టనగునె?
యిట్టి క్రూరుల యింటి కిచ్చిన మనవారి ।
నందుఁగా కట్లు దాననుటమేలె?
యర్జును పుట్టిన యప్పుడు 'వీఁడు లో ।
కము లెల్ల గెల్చు పొగడ్త మొగులు

తే. ముట్టు నట్టిద యగు, రణమున జయించు ।
గౌరవుల; సోదరులుఁ, దాను భూరి రాజ్య
గౌరవముఁ బొందు' నని యశరీరవాణి ।
వలికె; నది తిట్టువడుఁగాక వలయునేని. 193

ప్రతిపదార్థం: బావ+ఒప్పండు+అనుపలుకులన్= ధృతరాష్ట్రుడు మా మేలు సహించలేడు అనే మాటల వలన; ఏమి+అగున్?= ఏమి ప్రయోజనం?; ఆతని కొడుకున్= అతడి పుత్రుడైన దుర్యోధనుడిని; కీడు+ఆడన్+ఏల?= నిందించటమెందుకు?; కురువృద్ధుఁడు+అగు= కౌరవులలో పెద్దవాడైన; బాహ్లికునిన్= బాహ్లికుడిని; దూఱన్+ ఏటికిన్?= తిట్టటం ఎందులకు?; భీష్మునిపైన్= పితామహుడిమీద; ప్రయి+పెట్టన్+అగునె?= నింద మోపవచ్చునా?; ఇట్టి క్రూరులు+ఇంటికిన్= ఇట్టి కఠినాత్ముల యొక్క గృహానికి; ఇచ్చిన= నన్ను కోడలిగా చేసిన; మనవారిన్= పుట్టింటివారిని; అందున్+కాక= అంటానే అనుకో; అట్లు= ఆ విధంగా; తాన్= నేను; అనుట మేలె?= నిందించటం న్యాయమా? (కాదని భావం); అర్జును పుట్టిన+అప్పుడు= అర్జునుడు

జన్మించిన సమయంలో; వీడు= పార్థుడు; లోకములు+ఎల్లన్= జగము లన్నిటిని; గెల్చు= జయిస్తాడనే; పొగడ్త= ప్రశంస; మొగులు ముట్టినట్టిది+అ+అగున్= మేఘమండలం తాకునటువంటి దౌతుంది; రణమునన్= కదనంలో; కౌరవులన్+జయించున్= దుర్యోధనాదులను గెలుస్తాడు; సోదరులున్= తోబుట్టువులూ; తానున్= తానూ; భూరి రాజ్యగౌరవమున్+పొందున్= గొప్ప రాజ్యం ఏలుట వలని గొప్పతనమును పొందుతాడు; అని= అంటూ; అశరీరవాణి= అశరీరవాక్కు; పలికెన్= పల్కింది; వలయున్+ఏనిన్= కావలసివస్తే; అది= అశరీరవాణి; తిట్టుపడున్+కాక!= నిందించబడు గాక!

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు పాండవుల మేలోర్చువాడు కాడని అనటంవలన ఏమి లాభం? అతని కొడుకు దుర్యోధనుడిని తిట్టటం వలన ప్రయోజనమేముంది? కౌరవులలో పెద్దవాడగు బాహ్లికుడిని నిందించడం దేనికి? భీష్ముడి మీద తప్పు మోపటం న్యాయమా? ఇట్లాంటి కఠినచిత్తుల ఇంటికి నన్ను కోడలిని చేసిన నా పుట్టింటివారినే దూషించాలి. అట్లా దూషించటం కూడా సమంజసం ఔతుందా? పార్థుడు జన్మించినవేళ 'ఇతడు లోకాలన్నీ జయిస్తాడనే కీర్తి మేఘమండల మంటుతుంది. ఇతడు కౌరవులను యుద్ధంలో గెలుస్తాడు. తానూ, తన తోబుట్టువులూ భూరి సామ్రాజ్యాధిపత్య గౌరవం పొందుతారు' అని అశరీరవాణి పలికింది. అవసరమైతే ఇట్లా నుడివిన ఆ అశరీరవాణినే నిందించాలి. మరెవ్వరినీ కాదు.

విశేషం: కుంతీదేవి మెత్తని హృదయం గల తల్లియే కాదు, కడుపులోని బాధను గడుసుదనంతో చెప్పగల గడుసరి కూడా. శ్రీకృష్ణుడి బహిఃప్రాణమైన అర్జునుడు పుట్టినప్పుడు ఆకాశవాణి పలికిన పలుకుల వైపు శ్రోత మనస్సును మళ్ళించి గ్రుచ్చుకొనేటట్లు చెప్పటానికి. 'నేతినేతివాదం' వలె- ధృతరాష్ట్రుడిని అనటం ఎందుకు? దుర్యోధనుడిని అనటం ఎందుకు? అని వరుస మొదలు పెట్టింది. ఆ మాట నిజానికి శ్రీకృష్ణుడి మనస్సుకు గ్రుచ్చుకొనాలని అన్నదే. (సంపా.)

వ. ధర్మంబు గలుగునే నది నిక్కంబయ్యెడు; దాని కెల్లను నిర్వాహకుండవు నీవు గలవు గాదె! నీ మన్నించు నెచ్చెలులకుం జెప్పెడు మాటలు గలవు వినుము; మయ్యుధిష్ఠిరునితో నిట్లనుము; 194

ప్రతిపదార్థం: ధర్మంబు కలుగునేన్= లోకంలో ధర్మమున్నట్లయితే; అది నిక్కంబు+అయ్యెడున్= అశరీరవాణి మాటలు యథార్థాలవుతాయి; దానికిన్+ఎల్లను= ఆ ధర్మానికంతటికినీ; నిర్వాహకుండవు= ప్రవర్తిల్ల చేసేవాడవు; నీవు+కలవు+కాదె!= నీవున్నావు గదా!; నీ మన్నించు నెచ్చెలులకున్= నీ వాదరించే నీ ప్రియమిత్రులైన పాండునందనులకు; చెప్పెడు మాటలు+కలవు= చెప్పవలసిన మాట లున్నాయి; వినుము= ఆలింపుము; ఆ+యుధిష్ఠిరునితోన్= ఆ ధర్మరాజుతో; ఇట్లు+అనుము= ఈ విధంగా చెప్పు.

తాత్పర్యం: లోకంలో ధర్మ మున్నట్లయితే అశరీరవాణి చెప్పినదే సత్య మవుతుంది. కృష్ణా! ధర్మోద్ధారకుడవు నీవున్నావు. నీవు మన్నించే నీ అనుగు నెచ్చెలికాండ్రకు చెప్పవలసిన మాట లున్నాయి. వినవలసింది. ముందుగా ధర్మతనయుడితో ఇట్లా చెప్పుము:

విశేషం: 1. ధర్మముంటే దేవతల మాటలు నిజమౌతాయట! అన్నిటికీ నిర్వాహకుడైన శ్రీకృష్ణుడే ఉన్నాడట! ఈ దృఢ నిశ్చయమే ఆమెను ధర్మశీలనుగా నిలిపింది. ఆమె కొడుకులను ధర్మమార్గంలో నడిపింది.

2. కొడుకుల స్వభావాలను బట్టి ఎవరెవరికి ఎటువంటి సందేశమివ్వాలో తెలిసిన వివేకవతి అయిన వీరమాత కుంతి.

3. ఉపప్లావ్యంనుండి వచ్చిన కృష్ణుడు పాండవ దూత. హస్తినాపురంనుండి తిరిగి వెళ్ళే శ్రీకృష్ణుడు కుంతీదూత. (సంపా.)

క. వేఁడికొని కృపణులై కను ।
పోఁడిమి యది యేల రాజపుత్రులు దమ మై

వాఁడిమి దప్పిన నిప్పులు ।

వేఁడిమి సెడినట్లు జనులు విని యులుకుదురే? 195

ప్రతిపదార్థం: కృపణులు+ఐ= దీనులై; వేఁడికొని= ప్రార్థించి; కనుపోఁడిమి= పొందునట్టి సంపద; అది+ఏల?= అదెందుకు?; రాజపుత్రులు= క్షత్రియకుమారులు; తమ= తమయొక్క; మైవాఁడిమి= శరీరమందలి ప్రతాపం; తప్పినన్= విడిచినయెడల; నిప్పులు= అగ్నులు; వేఁడిమి చెడిన+ అట్లు= వేడిమిని గోల్పోయినట్లే అగును; జనులు విని= ప్రజలు అట్టి ప్రతాపహీనుల ఆజ్ఞ లాలించి; ఉలుకుదురే?= జంకుదురా? (జంకరని అర్థము.)

తాత్పర్యం: దీనులై యాచించి గడించిన సంపద లెందుకు? క్షత్రియ కుమారులు ఒడలిలో తేజం కోల్పడితే నిప్పులు వేడిమిని విడిచినట్లే అవుతుంది. మగటిమి లేనివారి మాటలకు జనులు జంకుతారా?

విశేషం: అలం: ఉపమ. ఇది ధర్మరాజున కిచ్చిన సందేశం. అతడిని మూడు విధాల మందలించింది కుంతి. 1. నీకు రావలసిన రాజ్యభాగాన్ని దీనుడివలె యాచించటం తప్పు. అట్లా భిక్షాదానంగా వచ్చే రాజ్యాన్ని స్వీకరించటం తప్పు- అని మొదటి హెచ్చరిక. కపట ద్యూతంలో రాజ్యసంపద కోల్పోయినప్పుడు ద్రౌపదికి వరంగా ధృతరాష్ట్రుడు దానిని తిరిగి ఇచ్చాడు. అరణ్యాజ్ఞాతవాసాలు ముగిసిన తరువాత కూడ మరల ధృతరాష్ట్రుడి దయ కొరకు, దుర్యోధనుడి సుముఖత కొరకు ఇంత దీనంగా అడగటం అవమానం. అడగటంలో కూడా ఆత్మగౌరవం ఉండాలి. రాజ్యభాగం ఇవ్వకపోయినా అయిదూళ్ళు ఇస్తే చాలని కోరటం మరీ అవమానం- అని హెచ్చరించింది.

2. క్షత్రియులు ప్రతాపాన్ని విడిచిపెడితే వేడిలేని అగ్నులవలె మారి శత్రువులను తపింపచేసే శక్తిని కోల్పోతారు. కాబట్టి యుద్ధంలో పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాన్ని పొందండి. క్షత్రియ ధర్మాన్ని రక్షించండి. యుద్ధం కంటె శాంతి మేలు అని భావిస్తున్న ధర్మజుడిని యుద్ధోన్ముఖుడిగా చేయాలన్న వీరమాత ప్రబోధ మిది.

3. ఒకవేళ ప్రతాపరహితులై యాచించి, రాజ్యాన్ని పొందినా జనులు ఆ రాజులను గౌరవించరు. కాబట్టి అటువంటి రాజ్యసంపదను పొందినా ప్రభుత్వాన్ని నిలుపుకొనటం కష్టం.

4. తాత్పర్య మేమంటే- 'దైన్యాన్ని వదులు. క్షత్రియోచిత పరాక్రమాన్ని ప్రదర్శించి రాజ్యాన్ని సాధించు. ప్రజల ఆదరాభిమానాలను పొందు.' ఈ మూడూ పరస్పరాశ్రితాలైన గుణాలు. ఏ ఒకటి లేకపోయినా మిగిలినవి దక్కవు అని శాంతికాముకుడైన ధర్మజుడు పౌరుషాగ్నితో ప్రజ్వలించేటట్లు పలికింది. అయితే, ధర్మజుడు సూక్ష్మగ్రాహి కాబట్టి సందేశాన్ని మృదువుగా, వ్యంగ్యంగా, మనసు నొవ్వకుండా చెప్పింది.

5. కుంతి మనసులో పడుతున్న వేదనకు ఈ మాటలు అక్షరదీపికలు. వీరులను కన్న రాజమాత తన కొడుకులు వీరులుగానే బ్రతికి తనకు గౌరవం తేవాలని అనుకొనటం సహజం. కాని, ధర్మజుడు ధర్మనీతిలో భాగంగా చతుర్విధోపాయాలను ప్రదర్శిస్తూ సంధియత్నం చేస్తున్నాడే కాని, పౌరుషహీనుడై కాదన్న సత్యం గమనార్హం. (సంపా.)

వ. భీమార్జునుల కిట్లని చెప్పుము: 196

తాత్పర్యం: భీముడికి, అర్జునుడికి ఇట్లా చెప్పుము:

ఆ. కొడుకుఁ గాంచు రాచకూఁతు రెద్దానికి? ।

నట్టిపనికి నుచితమైన సమయ

మొదవెఁ; దడయుటింక నొప్పదు; జనములు ।

నట్లుగాని పురుషు లనరు మిమ్ము. 197

ప్రతిపదార్థం: రాచకూఁతురు= క్షత్రియపుత్రి; ఏ+దానికిన్= దేనికొరకు; కొడుకున్+కాంచున్= కుమారుడిని కంటుందో; అట్టిపనికిన్= అట్లాంటి యుద్ధ కార్యానికి; ఉచితము+ఐన+సమయము+ఒదవెన్= తగిన వేళ వచ్చింది; ఇంకన్= ఇటమీదట; తడయుట= ఆలసించటం; ఒప్పదు= తగదు; అట్లు+కాని= అప్పుడు తప్పు; జనములు= ప్రజలు; మిమ్మున్= మిమ్ములను; పురుషులు+అనరు= మగవారని చెప్పరు.

తాత్పర్యం: క్షత్రియకన్య పెండ్లాడి కొడుకును ఏ కార్యానికై కంటుందో, అట్టి ప్రతాపప్రదర్శనకు తగిన అదను సంప్రాప్తించింది. ఇక ఆలసించటం తగదు. అప్పుడుగాని మిమ్మల్ని ప్రజలు మగవారని అనరు సుమా!

విశేషం: 1. కుంతీదేవి తన కొడుకులలో ధర్మజుడిని ప్రత్యేకంగా, ప్రజ్ఞావంతుడైన మనీషిగా భావించి గౌరవిస్తుంది. ఆ తరువాత భీమార్జునులను ఒక జంటగా, నకుల సహదేవులను ఒక జంటగా భావిస్తుంది. ద్రౌపదిని ప్రత్యేకంగా సంభావిస్తుంది. ఈ స్వభావం ఈ సందర్భంలో స్పష్టమౌతున్నది.

2. ధర్మజుడు నీతిజ్ఞుడు కాగా, భీమార్జునులు గదాగాండీవాలతో ప్రసిద్ధి కెక్కిన శస్త్రజీవులు. నిజానికి క్షత్రియ వనిత యుద్ధంలో సాటిలేని మేటి వీరులను కనాలనీ, వారు రణరంగంలో తమ మగతనం ప్రదర్శించి తమకు, తనకు పేరు తేవాలనీ అనుకొంటుంది. తల్లి కలలు కని కన్న వీరసంతానం భీమార్జునులు. ఆ కలలు నిజం చేయటం వారి ధర్మమని హెచ్చరిక. ఆమె కోర్కెను తీర్చకపోతే వారు వీరులు కాదు, ఆమె వీరమాత కాజాలదు- అని నిష్ఠురం.

3. యుద్ధం చేసి పౌరుషాన్ని ప్రదర్శించకపోతే వారిని పురుషులని లోకం గుర్తించదట! ఇది చాలా నిష్ఠురమైన మాట. మరీ, బృహన్నలగా అజ్ఞాతవాసం చేసిన అర్జునుడికి గుచ్చుకొనే మాట! తెలుగులో 'మిమ్మలిని మగవా రనరు' అనే తిట్టు జాతీయం. బలపరాక్రమమే తమ అస్తిత్వంగా బ్రతికే కొడుకులను ఉత్తేజపరిచే వాఙ్మయ శిల్పం తెలిసిన వీరమాత కుంతి.

4. భీమార్జునులు కీచకవధలోనూ, దక్షిణ ఉత్తర గోగ్రహణ ఘట్టంలోనూ తమ పౌరుషాన్ని ప్రదర్శించే ఉన్నారు. కాని, ఆమె వాటిని గుర్తించినట్లు చెప్పకపోవటం గడుసుదనం. ఆ యుద్ధాలు పాండవులు ఆత్మరక్షణ కొరకు చేసినవి. కాని, మాతృమూర్తిని వీరమాతగా చేయాలంటే కౌరవులపై యుద్ధం చేసి తమ శస్త్రాస్త్రబల సంపదను ప్రదర్శించి పురుషులనిపించుకొన్నప్పుడే సాధ్యమౌతుందని హెచ్చరిక చేసింది. ఆలసించవద్దని ప్రేరేపించింది.

5. భీమార్జునులకు ధర్మరాజుకు వలె సున్నితంగా చెప్పలేదు. బాణంతో గుచ్చినట్లు మాట్లాడింది. మగతనం- అనే మాట వారి మనసులపై దెబ్బకొట్టుతుంది. ఆకలి తెలిసి అన్నం పెట్టేదీ, అదనెరిగి ఆగ్రహించేదీ, అనువుగా మందలించేదీ, ఆదర్శంతో తీర్చిదిద్దేదీ తల్లి, కుంతి వీరమాత. (సంపా.)

క. భుజ బలమున జీవించుట ।
నిజధర్మము మెత్తఁబడుట నింద్యము; మాద్రీ
ప్రజలకుఁ జెప్పుము ద్రుపదా ।
త్మజఁ గార్యం బడుగుమనుము తగనందఱతోన్. 198

ప్రతిపదార్థం: భుజబలమునన్= బాహు విక్రమంతో; జీవించుట= బ్రతకటం; నిజధర్మము= క్షత్రియ ధర్మం; మెత్తఁబడుట= అణగిపోవటం; నింద్యము= దూషింప దగింది అని; మాద్రీప్రజలకున్= మాద్రి కుమారులకు; చెప్పుము= తెలుపుము; ద్రుపద+ ఆత్మజన్= ద్రౌపదిని; తగన్= ఒప్పిదంగా; అందఱతోన్= పాండవులందరితో; కార్యంబు+అడుగుము+అనుము= కర్తవ్యం గురించి అడుగుమని చెప్పుము.

తాత్పర్యం: మాద్రీనందనులైన నకుల సహదేవులతో- బాహుబలంతో బ్రదకటం క్షత్రియధర్మమనీ, అణగిమణగి ఉండటం దూషింపదగిన విషయమనీ చెప్పుము. తన కర్తవ్యమేమిటో ద్రౌపది నడిగి తెలిసికొనండని పాండవులందరితో చెప్పుము.

విశేషం: 1. కవలలు నకుల సహదేవులు. వారిద్దరికీ కలిపి సందేశం ఇవ్వటం ఔచిత్యం. అందులోనూ క్రమాన్ని పాటించి అన్వయించుకొంటే నకులుడికి భుజబలంతో జీవించుమని హెచ్చరిక. సహదేవుడికి క్షత్రియ ధర్మంలో మెత్తబడటం నింద్యమని గట్టిగా చెప్పింది. శ్రీకృష్ణుడితో వారిరువురు మాట్లాడిన తీరులు గమనిస్తే ఈ సందేశాలు వారి మనఃప్రవృత్తులకు అచ్చంగా అతికినట్లున్నాయని స్పష్టమవుతుంది.

2. పాండవులలో పరాక్రమాన్ని ప్రేరేపించే ప్రధానశక్తిగా ద్రౌపదిని కుంతి గుర్తించి, సమయోచితంగా వారిలో యుద్ధోత్సాహాన్ని ప్రజ్వలింపజేస్తూ ఉండుమని కోరింది. ద్రౌపది కాంతాసమ్మితంగా కార్యాన్ని చక్కదిద్దగలదని ఆమె విశ్వాసం. అది సహజం కూడా. (సంపా.)

చ. అలిగిన భీమ ఫల్గునుల కడ్డము లేమి యెఱుంగు; దంతలం
తలు వడి వాని నీఁగవలదా? విను మాపని కెల్లఁ బాండుపు
త్రులె కలవారు; నీ కెటుల దోఁచిన నట్టులు సేయువారు గా;
కలఘువిచార! నా యలఁత యార్పుము; నన్ గడతేర్పు మెమ్మెయిన్.'199

ప్రతిపదార్థం: అలిగినన్= కోపగిస్తే; భీమఫల్గునులకున్= భీమార్జునులకు; అడ్డము లేమిన్= అవరోధం లేకుండటం; ఎఱుంగుదున్= తెలియుదును; అంతలు+ అంతలు+పడి= అంతలేసి అవమానాల పాలై; వానిన్= ఆ పరాభవాలను; ఈఁగన్ వలదా= తీర్చుకొనవద్దా; వినుము= ఆలింపుము; ఆ పనికిన్+ఎల్లన్= పరాభవ దుఃఖాలను బాపుకొనే పనికంతా; పాండుపుత్త్రులె కలవారు= పాండు నందనులే సంసిద్ధంగా ఉన్నారు; నీకున్= నీకు; ఎటులు తోఁచినన్= ఏ విధమైన అభిప్రాయం కల్గుతుందో; అట్టులు+చేయువారు+కాక= ఆ విధంగా సల్పగలరు; అలఘువిచార!= గొప్ప ఆలోచనగలవాఁడా! కృష్ణా!; నా+ అలఁత= నా శోకం; ఆర్పుము= తొలగించుము; నన్= నన్ను; ఏ+మెయిన్= ఏ విధం గానైనా; కడతేర్పుము= ఉద్ధరించుము.

తాత్పర్యం: అలుక వహిస్తే భీమార్జునులకు అడ్డం లేదని నాకు తెలుసు. అంతంత అవమానాలు పొంది ఆ కసి తీర్చుకొనవద్దా? ఆ పని పాండునందనులు చేయగలరు. నీవెట్లా చెపితే వారట్లా చేస్తారు. గొప్ప ఆలోచనగల నీవు నా బాధ తీర్చవలసినది. నన్ను ఎట్లయినా దుఃఖాల నుండి కడతేర్చవలె.'

విశేషం: 1. ఈ మాటలు కుంతీదేవి శ్రీకృష్ణుడితో అంటున్నవి. ఆమె ఆయనను కోరింది రెండంశాలు: 1. నా దుఃఖం (అనే అగ్నిని) ఆర్పుము. 2. నన్ను ఉద్ధరించుము. ఈ రెండూ పరమాత్మరూపుడైన శ్రీకృష్ణుడి దివ్యత్వాన్ని గుర్తించి అన్నవే. 'కడతేర్పుము' అనే క్రియ తెలుగు జాతీయం. దానికి అనేకార్థాలున్నా ఇక్కడ కష్టాలనుండి గట్టెక్కించుమని భావం.

2. కుంతి విజ్ఞురాలు. ఒక కార్యం సాధించబడాలంటే ఇచ్ఛాక్రియా జ్ఞానశక్తుల సమన్వయ వినియోగాలు అవసరం. ఇక్కడ ఇచ్ఛాశక్తులు భీమార్జునులు. వారు కోపిస్తే చాలు ఆ కార్యానికి అడ్డం ఉండదు. ఆ సంగతి శ్రీకృష్ణుడికి కూడా తెలుసుననటం కుంతీదేవి గడుసుదనం. అవమానాల పాలైన పాండవులు వాటికి ప్రతీకారం తీర్చికొనే ప్రయత్నం చేయాలి. ఇది కార్యశక్తి. పాండవులు సంఘటితంగా కూడి యుద్ధకార్యాన్ని స్వయంగా నిర్వహించగలరని కుంతీదేవి కొడుకుల పౌరుషంమీద ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించింది.

3. ఇక పాండవ పక్షంలో ఇచ్ఛాక్రియాశక్తులకు మూలమైనదీ, చోదకమైనదీ, వాటిని నియంత్రించగలిగినదీ. ఫలాగమందాకా ముందుకు నడిపించేదీ జ్ఞానశక్తి. అదే శ్రీకృష్ణుడు. ఆ అర్థం వ్యంగ్యంగా స్ఫురించేటట్లు 'అలఘువిచార!' అని సంబోధించింది. నీ కెట్లా తోస్తే అట్లా పాండవులను నియోగించు మని కోరింది. కార్యచక్రం తిప్పుమని వేడింది. ఫలితం మాత్రం- కుంతి వంత తీరాలి. ఆమె ఉద్ధరించబడాలి.

4. కుంతి మనోదుఃఖం అగ్నివంటిదని 'ఆర్పు' అనే క్రియతో ధ్వనింపజేశాడు తిక్కన. అది శత్రుసంహారంవలన సాధ్యం. ఇక ఉద్ధరించుమంటే- పరుల పంచలో

ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి దైన్యంతో బ్రతికే అప్పటి దురవస్థ నుండి ఉద్ధరించటమే, పాండవులు పరాక్రమంతో రాజ్యాన్ని జయించి, తనను రాజమాతగా గౌరవపదంలో నిలపటమే. ఈ పని చేసే వారు పాండవులైనా చేయించే దైవీసంకల్పశక్తి శ్రీకృష్ణు డని ఆమె తాత్పర్యం. కార్యసాధకమైన మాటల పొందికలో అర్థవ్యక్తి అనే గుణం రాణించి వస్తు స్వభావ స్ఫుటత్వాన్ని కలిగిస్తున్నది. (సంపా.)

వ. అనినఁ గృష్ణుండు గొంతి ననునయించి యిట్లనియె: 200

తాత్పర్యం: కుంతి అట్లా తన మనోబాధను వెల్లడించగా కృష్ణుడు ఆమె నోదార్చి ఇట్లా చెప్పాడు:

శ్రీకృష్ణుఁడు కుంతీదేవి నూఱడించుట (సం. 5-88-89)

చ. 'సుగుణవు, పుట్టినింటికిని జొచ్చినయింటికిఁ దేజ మెక్కఁగాఁ
దగుచరితంబునన్ నడచు ధన్యవు, ధీరవు, దేవి! నీ వెడ
న్వగ లడఁగింపకున్న భువనంబుల నింకిట నెవ్వ రోర్చువా
రు గలఁక దక్కుమీ హృదయ రోగము లన్నియుఁ బుచ్చివైచెదన్. 201

ప్రతిపదార్థం: దేవి!= కుంతీమహాదేవీ!; సుగుణవు= మంచి గుణములు కలదానివి; పుట్టిన+ఇంటికిని= పుట్టింటికినీ; చొచ్చిన+ ఇంటికిన్= అత్త యింటికినీ; తేజము+ఎక్కఁగాన్= వన్నె మీరగా; తగుచరితంబునన్= యోగ్యమైన నడవడితో; నడచుధన్యవు= ప్రవర్తించే పుణ్యాత్మురాలవు; ధీరవు= ధైర్యముగలదానవు; నీవు= అట్టి నీవు; ఎడన్= హృదయంలో; వగల్= చింతలు; అడగింపక+ఉన్నన్= అణచకపోయినచో; ఇంకన్= మరి; ఇటన్= ఇక్కడ; భువనంబులన్= లోకాలలో; ఓర్చువారు= దుఃఖాలను సహించే వారు; ఎవ్వరు?= ఎవరు గలరు?; కలఁక+తక్కుమీ= సంక్షోభం మానుము; హృదయ రోగములు+అన్నియున్= నీ మనోవ్యాధు లన్నింటినీ; పుచ్చివైచెదన్= తొలగించివేస్తాను.

తాత్పర్యం: 'అత్తా! నీవు గుణవంతురాలివి. పుట్టినింటికీ, మెట్టినింటికీ వన్నె వాసి ఏర్పడగా ఒప్పిదమైన నడవడితో ప్రవర్తించే పుణ్యాత్మురాలివి. ధైర్యంగలదానివి. ఇట్టి నీవు మనస్సులోని చింతలను అణచుకొనకుంటే మరి ఈ లోకంలో దుఃఖాలను సహించేవారు ఎవరుంటారు? అమ్మా! కలత మానుము. నీ మనోవ్యాధులన్నిటినీ తొలగిస్తాను.

విశేషం: 1. యోగ్యుడైన భక్తుడు ఆర్తితో అడుగుతుంటే కరుణారసం పొంగగా అభయహస్తం ఇస్తున్న భగవంతుడివలె శ్రీకృష్ణుడు పలుకుతూ ఉండటం పరిపాటి. 2. ద్రౌపది కెట్లా అభయహస్త మిచ్చాడో, కుంతికీ అట్లాగే అభయహస్త మిచ్చాడు. సంధి కాదు, యుద్ధం ఆగదు. విజయం సిద్ధించక మానదు, మనశ్శాంతి కుదరక తీరదు- అన్నట్లు ధైర్యం చెప్పాడు.

3. కుంతీ మనోవేదనను రోగంగా చెప్పి రూపకాలంకార శోభను కలిగించాడు తిక్కన. ఇక్కడ బహువచనం చెప్పటం మరొక విశేషం. కుంతి మనసులో పాండవుల బెంగ ఒక ప్రక్క. తనకు కన్యాత్వంలో సూర్యుడి వరం వలన కలిగిన కర్ణుడి బెంగ మరొక ప్రక్క బాధిస్తున్నాయి. ఒక దానిని చెప్పగలిగింది. మరొకటి చెప్పలేనిదిగా దాచుకొన్నది. శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడు. ఆ దుఃఖాన్ని కూడా మానుస్తానన్నాడు. ఎట్లా? అది భావికథలోగాని ప్రసన్నం కాదు. శ్రీకృష్ణుడిని దివ్యుడిగా భావిస్తే అతడు దివ్యమహిమలనే ప్రసాదించగలడు. (సంపా.)

క. తనయులుఁ గోడలు సేమం।
బున నున్నా; రధిక భక్తిపూర్వముగా దం
డనమస్కారంబులు నీ।
కొనరించిరి, కౌఁగిలించి రుల్లములఁ దగన్. 202

ప్రతిపదార్థం: తనయులున్= నీ కుమారులును; కోడలున్= నీ కోడలుకూడా; సేమంబునన్+ఉన్నారు= సుఖంగా ఉన్నారు; అధిక భక్తిపూర్వముగాన్=

మిక్కుటమైన భక్తి పురస్సరంగా; నీకున్= నీకు; దండ నమస్కారంబులు+ ఒనరించిరి= నీకు సాగిలపడి మ్రొక్కారు; తగన్= చక్కగా; ఉల్లములన్= తమ మనసులందు; కౌఁగిలించిరి= నిన్ను కౌగిలించుకొన్నారు.

తాత్పర్యం: అత్తా! నీ కొడుకులు కోడలు క్షేమంగా ఉన్నారు. మిక్కిలి భక్తితో నీకు సాగిలపడి మ్రొక్కులు సమర్పించారు. మనసులందే నిన్ను కౌగిలించుకొన్నారు.

క. నీ కొడుకు లొండు సుఖములు ।
చేకొన; రవ్వీరసుఖము చిత్తములఁ గరం
బాకాంక్షింతు; రలంతులఁ ।
బోక గలుగు నెట్టు? లల్పబుద్ధులె వారల్? 203

ప్రతిపదార్థం: నీ కొడుకులు= నీ కుమారులు; ఒండు సుఖములు= ఇతర సౌఖ్యాలు; చేకొనరు= గ్రహించరు; ఆ+వీరసుఖము+అ= శౌర్యవృత్తి వలన చేకూరు సౌఖ్యమే; చిత్తములన్= హృదయములందు; కరంబు= మిక్కిలి; ఆకాంక్షింతురు= కోరుకొంటారు; అలంతులన్+పోక= అల్పమార్గాలలో వెళ్ళటం; ఎట్టులు+కలుగున్?= వారికెట్లా అల వడుతుంది?; వారల్= నీ కుమారులు; అల్పబుద్ధులె?= నీచస్వభావులా?- కారు సుమా!

తాత్పర్యం: అత్తా! నీ కుమారులు లోక సాధారణమైన సౌఖ్యాలు అనుభవించటానికి అంగీకరించరు. వీర ధర్మాన లభించే సౌఖ్యమే తమ మనస్సులో కోరుకొంటారు. వారు తుచ్ఛమార్గాలు అనుసరించేటంత నీచబుద్ధులు కారు సుమా!

క. ఉత్సాహంబున శత్రు కు ।
లోత్సాదన విధి యొనర్చి యున్నత సామ్రా
జ్యోత్సవము నొందు పుత్త్రుల । 7
నుత్సుకతం జూతుగాక; యూఱడు మింకన్.' 204

ప్రతిపదార్థం: ఉత్సాహంబునన్= పూనికతో; శత్రుకుల+ఉత్సాదన విధి+ఒనర్చి= విరోధి వంశాన్ని పెల్లగించి వేయటం అనే కార్యం నిర్వహించి; ఉన్నత సామ్రాజ్య+ఉత్సవము= దొడ్డ ప్రభుత్వం అనే పండుగను; ఒందు= పొందే; పుత్త్రులన్= కొడుకులను; ఉత్సుకతన్= ఉబలాటంతో; చూతు+కాక= చూచెదవు లెమ్ము; ఇంకన్= ఇక; ఊఱడుము= ఊరడిల్లుము.

తాత్పర్యం: పాండవులు విరోధివంశాన్ని కూకటివేళ్ళతో పెల్లగించి వేసి,; ఉన్నత సామ్రాజ్యాధిపత్యమనే పండుగను జరుపుకుంటుంటే నీవు ఉత్సాహంతో కనుగొనగలవు. ఇంక ఊరట వహించుము.'

చ. అన విని మోము విచ్చుచు మురారికి నిట్లనుఁ గుంతి 'పాండు నం
దనులకుఁ దండ్రియున్ గురువు దైవము నారయ నీవ కావె! నీ
మనమున ధర్మమున్ హితము మంచిగఁ జూచి విధించినట్ల చే
సి నెగడువారు గాక నినుఁ జేరిన నాపద లొంద నేర్చునే? 205

ప్రతిపదార్థం: అనన్+విని= శ్రీకృష్ణుడు చెప్పిన మాటలు విని; కుంతి= కుంతీదేవి; మోము విచ్చుచున్= మొగం వికసింప చేస్తూ; ముర+అరికిన్= ఆ మురవైరికి; ఇట్లు+ అనున్= ఈ రీతిగా చెప్పింది; పాండునందనులకున్= పాండుకుమారులకు; తండ్రియున్= జనకుడును; గురువు= ఒజ్జయును; దైవమున్= దైవతమును; ఆరయన్= పరికించగా; నీవు+అ+కావె!= నీవేగదా!; నీ మనమునన్= నీ చిత్తంలో; ధర్మమున్= న్యాయాన్ని; హితమున్= మేలును; మంచిగన్+చూచి= చక్కగ తలపోసి; విధించిన+ అట్లు+అ= నీవు నిర్ణయించిన విధాన; చేసి= ఆచరించి; నెగడువారు+కాక= వృద్ధి పొందుతారు లెమ్ము; నినున్+చేరినన్= నిన్నాశ్రయించు కొన్నచో; ఆపదలు= కష్టాలు; ఒందన్+నేర్చునే= కలుగ గలవా? (కలుగవని అర్థం.)

తాత్పర్యం: కృష్ణుడి మాటలు వినేసరికి కుంతీదేవి ముఖం వికసించింది. ఆమె మురవిధ్వంసకుడైన మేనల్లుడితో ఇట్లా అన్నది. 'పాండుకుమారులకు

తండ్రి, గురువు, దైవం నీవేకదా! నీ మనస్సులో ఏది న్యాయమో, ఏది హితమో మంచిగా నీవే చూచి ఇట్లా చేయండి అని నిర్దేశిస్తే వారు అట్లా చేసి బాగుపడగలరు. నిన్ను ఆశ్రయించు కొన్నవారికి ఎట్టి ఆపదలు రావుగదా!

విశేషం: 1. అలం: మాలారూపకం. 2.పాండవులకు శ్రీకృష్ణుడు వరుసగా తండ్రి, గురువు, దైవం అని నివేదించుకొన్నది. ముగ్గురూ ఒకరిలోనే ఉన్నారు. తండ్రిగా ధర్మాన్ని నిర్దేశిస్తాడు. గురువుగా హితాన్ని బోధిస్తాడు, దైవంగా 'మంచిగ చూస్తాడు' అంటే యోగక్షేమం వహిస్తాడు అని క్రమాన్వయం. 'నిను చేరిన నాపద లొంద నేర్చునే!' అన్నది విశ్వాసంతో కూడుకొన్న శరణాగత భక్తి భావ ప్రకటనం. భగవంతుడి రక్షణలో ఉన్నవారి దరికి ఆపదలు చేరవు అన్నది విశ్వాసం. పాండవులు శ్రీకృష్ణుడిని శరణు వేడి అటువంటి భద్రస్థితిలో ఉన్నారని ధ్వని. (సంపా.)

క. వారలక యేల మాధవ! ।
కౌరవులకు మఱియు నీజగంబులకెల్లం
జేరుగడ నీవ; నీ పలు ।
కారయ వేదంబ కాదె యఖిలంబునకున్.' 206

ప్రతిపదార్థం: మాధవ!= శ్రీకృష్ణా!; వారలకున్+అ+ఏల?= పాండవులకు మాత్రమే అననేల?; కౌరవులకున్= కౌరవులకుకూడా; మఱియున్= ఇంకను; ఈ జగంబులకున్+ ఎల్లన్= ఈ లోకాలన్నింటికినీ; చేరుగడ= శరణం; నీవు+అ= నీవే సుమా!; అఖిలం బునకున్= సమస్తము నకునూ; ఆరయన్= విచారించగా; నీ పలుకు= నీ వచనం; వేదంబు+అ కాదె!= వేదమే గదా!

తాత్పర్యం: మాధవా! ఒక్క పాండుకుమారులకే అననేల? కౌరవులకునూ; ఈ లోకము లన్నింటికినీ నీవేదిక్కు. సమస్త జగాలకూ పరికించగా నీ పలుకే వేదం కదా!'

విశేషం: 1. అలం: రూపకం. శ్రీకృష్ణుడి మాట వేదం.

2. భగవంతుడు జగద్రక్షకుడనీ, పాండవ కౌరవులందరికీ ఆయన సముడనీ భావించే కుంతీభావంలో సమత్వం స్ఫురిస్తున్నది.

3. అఖిలలోకాలకూ శ్రీకృష్ణుడి వాక్కులు వేదంకాగా ఆ మాటలు విన్నవారు ధర్మమూర్తు లౌతారు. విననివారు పతితులౌతారని ధ్వని. (సంపా.)

వ. అనినం బ్రసన్నవదనుం డగుచు నద్దేవి గారవించి యామంత్రణంబు సేసి తదావాసంబు వెలువడి తనరాకకు నలంకృతంబైన దుర్యోధను మందిరంబునకుఁ గృతవర్మ సాత్యకి సమేతుండయి పోవు గోవిందునిం గని తదీయ ద్వారపాలకులు సంభ్రమంబునం బఱచి యతని కెఱిఁగించి తదనుమతంబునం బఱతెంచి యెదుర్కొని కక్ష్యాంతరంబుల సందడి నెడగలుగ జడియుచు వినయంబునం దోడ్కొనిచన నమ్మనుజవిభుండు కైలాస శిఖరాకారంబగు సౌధంబున బాహ్లిక భీష్మ ద్రోణ ప్రభృతులును, గర్ణశకుని సైంధవాదులును, దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును మఱియు ననేక దేశాధీశులునుం బరివేష్టింపఁ బేరోలగంబున సింహాసనాసీనుండై యున్న యెడకుం జను నప్పు డాసుయోధనుండు సపరివారంబుగాఁ బ్రత్యుత్థానంబు సేయం జేర నరిగి యతనికిం దగువారలకు నాలింగనాద్యుపచారంబులు తానుం దమ్ముండును నాచరించి. 207

ప్రతిపదార్థం: అనినన్; ప్రసన్న వదనుండు+అగుచున్= అనుగ్రహంతో కూడిన ముఖం కలవాడై; ఆ+దేవిన్= ఆ కుంతిని; గారవించి= గౌరవించి; ఆమంత్రణంబు+చేసి= ఆమె నుండి వీడ్కోలు పడసి; తద్+ఆవాసంబు+ వెలువడి= ఆమె గృహం నుంచి బయటకువచ్చి; తన రాకకున్= తన ఆగమనమునకై; అలంకృతంబు+ఐన= అలం కరించబడిన; దుర్యోధను మందిరంబునకున్= సుయోధనుడి సౌధానికి; కృతవర్మ సాత్యకి సమేతుండు+ అయి= కృతవర్మ, సాత్యకి అనే వారితో కూడినవాడై; పోవు గోవిందునిన్; కని= చూచి; తదీయ ద్వారపాలకులు= ఆ దుర్యోధనుడి వాకిలిగాచువారు;

సంభ్రమంబునన్+ పఱచి= తొట్రుపాటుతో పరుగెత్తిపోయి; అతనికిన్+ఎఱిఁగించి= సుయోధనుడికి కృష్ణుడి రాక తెలిపి; తద్+అనుమతంబునన్= సుయోధనుడి అంగీకారంతో; పఱతెంచి= మరలివచ్చి; ఎదుర్కొని= శ్రీకృష్ణుడికి ఎదురుగా వచ్చి; కక్ష్యా+అంతరంబుల సందడిన్= లోగిళ్ళ లోపల కలిగిన సమ్మర్దమును; ఎడ కలుగన్= దారి ఏర్పడేటట్లు; జడియుచున్= తొలగిస్తూ; వినయమునన్= అణకువతో; తోడ్కొని చనన్= వెంట బెట్టుకొని వెళ్ళగా; ఆ+మనుజ విభుండు= ఆ నరనాథుడైన సుయోధనుడు; కైలాస శిఖర+ఆకారంబు+అగు= కైలాస పర్వత శిఖరం మాదిరి ఉన్న; సౌధంబునన్= భవనంలో; బాహ్లిక భీష్మ ద్రోణ ప్రభృతులును= బాహ్లికుడు, భీష్ముడు, ద్రోణాచార్యులు మొదలైనవారున్నూ; కర్ణ శకుని సైంధవ+ఆదులును= కర్ణుడు శకుని సైంధవుడు మొదలైనవారున్నూ; దుశ్శాసన వికర్ణ దుర్ముఖ ప్రముఖులును= దుశ్శాసనుడు, వికర్ణుడు, దుర్ముఖుడు మొదలైనవారున్నూ; మఱియున్= ఇంకను; అనేక దేశ+అధీశులునున్= పెక్కు దేశాల రాజులున్నూ; పరివేష్టింపన్= చుట్టుచేరిఉండగా; పేరు+ ఓలగంబునన్= గొప్ప కొలువు కూటంలో; సింహ+ఆసన+ఆసీనుండు+ఐ= సింగపు గద్దె మీద కూర్చుండిన వాడై; ఉన్న+ఎడకున్= ఉన్న తావుకు; చను+అప్పుడు= వెళ్ళుతున్న సమయంలో; ఆ సుయోధనుండు= ఆ దుర్యోధనుడు; సపరివారంబుగన్= పరిజనులతో కూడ; ప్రత్యుత్థానంబు+చేయన్= ఎదుర్కోలు జరుపుటకై; చేరన్+అరిగి= శ్రీకృష్ణుడి సమీపానికి వెళ్ళి; అతనికిన్= శ్రీకృష్ణుడికి; తగువారలకున్= అతని వెంట వచ్చిన అర్హులైన వారందరికీ; ఆలింగన+ ఆది+ఉపచారంబులు= కౌగిలించుకొనటం మున్నగు మన్ననలు; తానున్= తానును; తమ్ముండును= తన అనుజుడైన దుశ్శాసనుడును; ఆచరించి= కావించి.

తాత్పర్యం: కుంతీదేవి మాటలు విని శ్రీకృష్ణుడు ప్రశాంత ముఖపద్మంతో ఆ దేవిని మన్నించి, సెలవు పుచ్చుకొని, ఆమె నివాసం నుండి వెలుపలికి వచ్చాడు, తన ఆగమనానికై అలంకరించబడిన దుర్యోధనుడి భవనానికి హరి కృతవర్మతో సాత్యకితో కలిసి బయలుదేరాడు. కృష్ణస్వామి రాకనుగాంచి

వాకిటి కావలివాండ్రు సత్వరంగా వెళ్ళి దుర్యోధనుడికి ఆ వార్త తెలిపారు. ఆయన ఆదేశంతో వారు వచ్చి శౌరి నెదుర్కొని లోగిళ్ళలోని సమ్మర్దం తొలగిస్తూ దారి నేర్పరచి వినయంతో తోడ్కొనిపోయారు. సుయోధనుడు కైలాస శిఖరంవలె ఉన్న ఉన్నత సౌధంలో బాహ్లికుడు భీష్ముడు ద్రోణుడు మున్నగువారూ, కర్ణుడు శకుని సైంధవుడు మొదలైనవారూ, దుశ్శాసనుడు వికర్ణుడు దుర్ముఖుడు ఆదిగాగలవారూ, ఇంకా పలు దేశముల ప్రభువులూ తన చుట్టూ చేరి ఉండగా, సింహాసనాసీనుడై కొలువుదీరి ఉన్నాడు. అక్కడికి శ్రీకృష్ణుడు వస్తుండగా దుర్యోధనుడు పరిజనులతో కూడ ఎదుర్కోలు జరపటానికై మురారిని చేరవచ్చి ఆయనకూ, తగినవారలకూ తానూ తన తమ్ముడు దుశ్శాసనుడూ ఆలింగనాదులైన మన్ననలు చేశారు.

విశేషం: అలం: ఉపమ. 1. దుర్యోధనుడి భవనం శిఖరాకారంవలె ఉన్నదనటంలో ఉపమ.

2. శ్రీకృష్ణుడు ప్రసన్నవదనుడై కుంతిని గౌరవించాడంటే దైవానుగ్రహం ఆమె పట్ల ఉంటుందని ధ్వనింపజేశాడు.

3. దుర్యోధనుడి మందిరంలో ప్రవేశించేటప్పుడు శ్రీకృష్ణుడికి భద్రతా సేనానులవలె కృతవర్మ, సాత్యకి ఇరువైపుల నడవటం గమనార్హం. అది మిత్రమందిరంగా కంటె శత్రుమందిరంగానే శ్రీకృష్ణుడు భావిస్తున్నాడని ధ్వని.

4. మందిరంలో కక్ష్యలన్నీ దాటి సభాభవన కక్ష్యలో ప్రవేశించిన తరువాత దుర్యోధనుడు పరివారంతో ఎదుర్కోలివ్వటం రాజమందిర మర్యాద. తనను ఆహ్వానించటానికి వస్తున్న దుర్యోధన దుశ్శాసనాదులను స్నేహపూర్వకమైన ఆలింగనాదులతో సమ్మానించటం స్నేహ మర్యాద. ఆసనాదు లిచ్చి అతిథిని గౌరవించటం అతిథి మర్యాద. దూతకిచ్చే మర్యాదలకంటె ఉన్నతమైన వాటిని కౌరవులు శ్రీకృష్ణుడికి అందచేస్తున్నారు. అది వారి వ్యూహంలో ఒక భాగం, గౌరవించి, కానుకలిచ్చి శ్రీకృష్ణుడిని పాండవులనుండి వేరు చేయాలన్న భేదోపాయం. (సంపా.)

క. అతఁ డునుపఁగఁ గనక మయో ।
న్నత పర్యంకంబునందు నారాయణుఁ డూ
ర్జిత మహిమ నుండి యభ్య ।
ర్చితుఁ డయ్యెఁ దగంగ నతనిచే సత్కృతులన్. 208

ప్రతిపదార్థం: అతఁడు+ఉనుపఁగన్= సుయోధనుడు కూర్చుండ బెట్టగా; కనకమయ= సువర్ణమయమైన; ఉన్నత పర్యంకంబు+అందున్= ఎత్తయిన మంచం మీద; నారాయణుఁడు= వాసుదేవుడు; ఊర్జిత మహిమన్+ఉండి= గొప్ప ప్రభావంతో అధివసించి, తగంగన్= ఒప్పుగా; అతనిచేన్= దుర్యోధనుడి చేత; సత్కృతులన్= సత్కారాలతో; అభ్యర్చితుఁడు+అయ్యెన్= లెస్సగా పూజించబడ్డాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు కూర్చుండ బెట్టగా సమున్నతమైన బంగరు మంచం మీద గొప్ప విభూతితో వాసుదేవుడు కూర్చుండి అత డొనర్చే సత్కారాలతో మిక్కిలి పూజించబడ్డాడు.

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో సంభాషించుట (సం. 5-89-1)

వ. సాత్యకియును సముచిత ప్రకారంబునం బూజితుండయ్యెఁ; దదనంతరంబు నిజాసనాసీనులయి తన మొగంబునం జూడ్కి నిలిపి యున్న దుర్యోధ నాదులతో మాధవుండు మధురసంభాషణంబులు సేయుచుండె; నట్టియెడ. 209

ప్రతిపదార్థం: సాత్యకియును, సముచిత ప్రకారంబునన్= తగు విధంగా, పూజితుండు+అయ్యెన్= పూజించబడ్డాడు, తద్+అనంతరంబు= అటుపిమ్మట, నిజ+ఆసన+ ఆసీనులు+అయి= తమ పీఠాలమీద కూర్చుండినవారై, తన మొగంబునన్= తన ముఖంమీద, చూడ్కిన్= దృష్టిని, నిలిపి+ఉన్న= ప్రసరింపజేస్తున్న, దుర్యోధన+ ఆదులతోన్= సుయోధనుడు

మొదలైన వారితో, మాధవుండు= లక్ష్మీవల్లభుడు, శ్రీకృష్ణుడు; మధుర సంభాషణంబులు+చేయుచున్+ ఉండెన్= ఇంపైన మాటలాడుతూ ఉన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో.

తాత్పర్యం: సాత్యకికూడ తగు విధంగా పూజించబడ్డాడు. పిదప తమ తమ పీఠాలమీద కూర్చుండి తన వదనం మీద చూపులు సారించిఉన్న దుర్యోధనుడు మొదలైనవారితో గోవిందుడు ఇంపైన మాటలు మాట్లాడుతుండినాడు. ఆ సమయంలో - (తరువాతి పద్యంతో అన్వయం).

తే. సముచితంబుగఁ గూరలచంద ముగ్గ ।
డించి కుడుపు తెఱంగు పుట్టించి పలుకు
నా సుయోధనుతోఁ గృష్ణుఁ డచటఁ దాను ।
గుడువ నొల్లక యునికి యేర్పడఁగఁ జెప్పె. 210

ప్రతిపదార్థం: సముచితంబుగన్= మిక్కిలి యుక్తంగా; కూరలచందము= కూరల విధం- శాకపాకాల రీతి; ఉగ్గడించి= పలికి; కుడుపు తెఱంగు పుట్టించి= భోజన విషయం ప్రస్తావనకు దెచ్చి; పలుకు= మాట్లాడుతున్న; ఆ సుయోధనుతోన్= ఆ దుర్యోధనుడితో; కృష్ణుఁడు= శ్రీ కృష్ణుడు; అచటన్= దుర్యోధనుడి గృహంలో; తాను= తాను; కుడువన్+ఒల్లక+ఉనికి= భుజించటాని కిష్టపడని స్థితి; ఏర్పడఁగన్+చెప్పెన్= స్పష్టంగా తెలిపాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తగు విధాన తన ఇంటిలో వండిన శాకపాకాల వివరాలు తెలిపి, భోజన విషయం ప్రస్తావనకు తేగా, శ్రీకృష్ణుడు అక్కడ తాను భుజించటానికి ఇష్టపడకుండటం స్పష్టంగా చెప్పివేశాడు.

విశేషం: ఇంటికి వచ్చిన అతిథిని భోజనానికి ఆహ్వానించటం గృహస్థుడి మర్యాద. దానిని దుర్యోధనుడు నిర్వహించినట్లుగా పైకి కనపడుతున్నాడు. అప్యాయతతో, భక్తితో, వినయంతో పిలిచేవారు కూరల రుచిని గురించి అంతగా గొప్పలు చెప్పుకోరు. భోజనంమీద మోహం కలిగేటట్లు మాట్లాడరు. ఆ వైఖరిలో సహజత్వం

కొరవడినట్లు ఎదుటివారికి స్పష్టం ఔతున్నది. అన్నంలో విషం పెట్టటానికి పన్నాగం వేశాడా? అన్నంత అనుమానం కలుగుతుంది. అందువలననే శ్రీకృష్ణుడు 'అన్నం తినజాలను' అన్నాడు. 'తినను' అనలేదు. తినను అంటే తిరస్కార మౌతుంది. 'తినజాలను' అంటే పరిస్థితుల ప్రభావమౌతుంది. అడుగడుగున సమస్యలు సృష్టించి శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతిగా, కౌరవ విరోధిగా, కపట వర్తనుడుగా నిరూపించాలని దుర్యోధనుడు ప్రయత్నించటం ఇక్కడే ప్రారంభ మయింది. విందు నొక సమస్య చేశాడు దుర్యోధనుడు. (సంపా.)

వ. చెప్పిన విని దుర్యోధనుండు సూర్యసూను వదనం బవలోకించి యల్లన యిట్లనియె: 211

ప్రతిపదార్థం: చెప్పినన్+విని; దుర్యోధనుండు; సూర్యసూనువదనంబు= సూర్యుని పుత్రుడైన కర్ణుడి ముఖం; అవలోకించి= చూచి; అల్లన= నెమ్మదిగా; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని సుయోధనుడు రవితనయుడైన కర్ణుడి ముఖం వైపు చూచి నెమ్మదిగా ఇట్లా అన్నాడు:

క. 'హరి వలికిన విధ మెంతయు।
నెరవై యున్నయది వింటె యిమ్మాట తెఱం
గరయుదము తొలుత; నీ పెను।
పరిచందం బెల్ల నెఱుకపడియెడుఁ బిదపన్.' 212

ప్రతిపదార్థం: హరిపలికిన విధము= కృష్ణుడు మాటాడిన తీరు; ఎంతయున్= మిక్కిలి; ఎరవై+ఉన్న+అది= భేదబుద్ధితో కూడిఉన్నది; వింటె!= వింటివిగదా!; ఈ+మాట తెఱంగు= ఈ పలుకుల విధ మెట్టిదో; తొలుతన్= మొదట; అరయుదము= పరిశీలిద్దాం; పిదపన్= తరువాత; ఈ పెనుపరిచందంబు+ ఎల్లన్= ఈ పెద్దమనిషి వైనమంతా; ఎఱుకపడియెడున్= బయటపడుతుంది.

తాత్పర్యం: 'కర్ణా! శ్రీకృష్ణు డాడినమాట మిక్కిలి భేదబుద్ధితో కూడి ఉంది. నీవు విన్నావుకదా! మొదట అతడిమాటతీరు పరిశీలిద్దాం. అవతల ఆ పెద్దమనిషి పద్ధతి అంతా తేటతెల్లమవుతుంది.'

విశేషం: దుర్యోధనుడి నీతిని తీర్చిదిద్దే ఆప్తమిత్రుడు కర్ణుడని మొదట్లోనే బైటపెట్టుకొన్నాడు దుర్యోధనుడు. భోజనానికి రాని కారణం అడిగితే పాండవ పక్షపాతం బయటపడుతుంది. ఆ తరువాత శ్రీకృష్ణుడి చర్యలన్నీ పక్షపాతంతో, శత్రుత్వంతో కూడినవే అని నిరూపించవచ్చునని దుర్యోధనుడి వ్యూహం. (సంపా.)

వ. అని పలికి యచ్యుతున కిట్లనియె: 213

తాత్పర్యం: అని చెప్పి దుర్యోధనుడు శ్రీకృష్ణుడితో ఈ విధంగా అన్నాడు:

తే. 'వలయు నన్నపానంబులు పలు దెఱఁగుల।
నేర్చు విధముల నే మొడఁ గూర్చి వేడ్క
నున్న నీ వుపయోగింప నొల్లకునికి।
బాంధవమునకు నీతికి బాహిరంబు. 214

ప్రతిపదార్థం: వలయు+అన్నపానంబులు= కావలసిన అన్నం, పానీయాలు; పలు+తెఱఁగులన్= అనేకరీతుల; నేర్చు విధములన్= మాకు తెలిసినంతలో; ఏము= మేము; ఒడఁగూర్చి= సిద్ధపరిచి; వేడ్కన్+ఉన్నన్= అభిలాషతో ఉండగా; నీవు= నీవు; ఉపయోగింపన్+ ఒల్లక+ఉనికి= భుజించటాని కిష్టపడకుండటం; బాంధవమునకున్= చుట్టరికానికి; నీతికిన్= న్యాయానికి; బాహిరంబు= వెలియైన విషయం.

తాత్పర్యం: 'కృష్ణా! కావలసిన అన్నపానీయాలు పలురీతుల మాకు తెలిసినంతలో సిద్ధపరిచి మేము ఆశతో ఉండగా, నీవు వాటిని భుజించటానికి ఇష్టపడకపోవటం మన చుట్టరికానికి, న్యాయానికి విరుద్ధమైన విషయం.

క. కౌరవులకుఁ బాండవులకు ।
నారయ నీ వొక్క రూప; యసదృశ ధర్మా
చారుండవు రాజునకుం ।
గూరుతు? కతమేమి యిట్లగుటకుం జెపుమా'. 215

ప్రతిపదార్థం: కౌరవులకున్= ధృతరాష్ట్రుడి కుమారులమైన మాకూ; పాండవులకున్= పాండురాజు కొడుకులకున్నూ; ఆరయన్= పరికింపగా; నీవు; ఒక్కరూపు+అ= సమానమైనవాడివే; అసదృశ+ధర్మ+ఆచారుండవు= సాటిలేని న్యాయాచరణం గలవాడివి; రాజునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; కూరుతు(వు)= ప్రియమైనవాడివి; ఇట్లు+అగుటకున్= నీ విట్లా మారిపోవటానికి; కతము+ఏమి?= కారణ మేమి? చెపుమా= చెప్పుము.

తాత్పర్యం: ఆలోచించగా కురుపాండవులకు నీవు ఒకే విధమైనవాడవు. అంతేకాదు. సాటిలేని ధర్మశీలుడవు. ధృతరాష్ట్ర మహారాజుకు ఇష్టుడవు. ఇట్లాంటివాడివి మా యింట భుజించను అనటానికి హేతువేమో చెప్పుము.'

క. అనుడు నుపేంద్రుఁడు మనుజేం ।
ద్రుని కిట్లను 'దూత లెందుఁ దొలిదొలి గుడువం
గొనఁ గట్టఁ దొడఁగుదురె? వ ।
చ్చిన కార్యము దీర్చి పిదపఁ జేయుదు రెల్లన్.' 216

ప్రతిపదార్థం: అనుడున్= అని దుర్యోధనుడు ప్రశ్నించగా; ఉపేంద్రుఁడు= దేవేంద్రుడికి అనుజన్ముడైన శ్రీకృష్ణుడు; మనుజ+ఇంద్రునికిన్= నరేశ్వరుడైన దుర్యోధనుడికి; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; దూతలు= రాయబారులు; ఎందున్= ఎక్కడైనా; తొలి+తొలిన్= దౌత్యానికి మునుముందే; కుడువన్= భుజించటానికి; కొనన్= సత్కారములందుకొనటానికి; కట్టన్= నూతన వస్త్రాలు స్వీకరించి ధరించటానికి; తొడఁగుదురె= పూనుకొందురా? (పూనుకొనరని అర్థము;) వచ్చిన కార్యమున్= ఏ పనిమీద వచ్చిరో ఆ పనిని; తీర్చి= నెరవేర్చి; పిదపన్= తరువాత; ఎల్లన్+చేయుదురు= అన్ని మన్ననలను స్వీకరిస్తారు.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడు దుర్యోధనుడికి ఇట్లా ప్రత్యుత్తరమిచ్చాడు: 'రాయబారులు వచ్చినపని చూడకుండ మున్ముందుగా భుజించటం, వస్తువులను గైకొనటం, ఉడుపులు చేకొని ధరించటం కూడదు. వచ్చిన పని నెరవేర్చిన తరువాత అన్ని మర్యాదలు అంగీకరిస్తారు.'

విశేషం: దుర్యోధనుడు శ్రీకృష్ణుడిని అందరికీ కావలసిన బంధువుగా ఆహ్వానించి చెప్పాడు. అందువలన విందుకు అంగీకరించకపోవటం శ్రీకృష్ణుడి దోషంగా పేర్కొన్నాడు. శ్రీకృష్ణుడు తాను విందుకు రాకపోవటానికి రాయబారి ధర్మాన్ని కారణంగా పేర్కొన్నాడు. రాయబారి వచ్చినపని ముగించకుండా భుజించటం, కానుకలు తీసికొనటం, నూతన వస్త్రాలు తీసికొని ధరించటం నిషేధమనే రాజనీతిని పేర్కొని తాను వచ్చినపని ముగించిన తరువాత మర్యాదలన్నీ స్వీకరిస్తానని చెప్పాడు. బంధుత్వంకంటె బాధ్యత ప్రథమగణ్యం. (సంపా.)

వ. అనిన గాంధారీనందనుండు దేవకీనందనున కిట్లనియె: 217

ప్రతిపదార్థం: అనినన్= అని కృష్ణుడు పలుకగా; గాంధారీనందనుండు= గాంధారి కుమారుడైన సుయోధనుడు; దేవకీనందనునకున్= దేవకీదేవి తనయుడైన శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా బదులు పలికాడు.

తాత్పర్యం: మాధవుని మాటలకు సుయోధను డిలా బదులు చెప్పాడు:

ఆ. 'వేగపడుట మేలె? వినుము; కార్యము దీఱుఁ ।
దీఱకుండు దాని తెఱఁగు దగిన
యప్పు డాడరాదె? యిప్పుడు ముకుఁ ద్రాటఁ ।
గాలు గ్రువ్వనేల కమలనాభ! 218

ప్రతిపదార్థం: కమలనాభ!= కమలము నాభియందు గల వాడా కృష్ణా!; వేగపడుట మేలె?= త్వరపడటం మంచిదా?; వినుము= నా మాటలు వినుము; కార్యము తీఱున్= పని నెరవేరవచ్చును; తీఱక+ఉండున్= నెరవేరక పోవచ్చును; దాని తెఱఁగు= ఆ విషయం; అప్పుడు+ఆడన్‌రాదె= అప్పుడు పలుకవచ్చును కదా!; ఇప్పుడు= ఈ సమయంలో; ముకుఁద్రాటన్= ముక్కునకు గ్రుచ్చిన త్రాటియందు; కాలు+ క్రువ్వన్+ఏల?= కాలిని దూర్చుటెందుకు?

తాత్పర్యం: పద్మనాభా! తొందరపడటం అంత మంచిదికాదు. నా మాట వినుము. పని అవుతుంది, కాకపోతుంది. అవసరం వచ్చినపుడు ఆ సంగతి మాటాడవచ్చును గదా! ముక్కుకు గ్రుచ్చిన త్రాటిలో కాలు దూర్చట మెందుకు?

విశేషం: 1. అలం: లోకోక్తి. లోకోక్తితో కలిపి చెప్పటం లోకోక్తి అలంకారం. 2. శ్రీకృష్ణుఁడు విందుకూ రాయబారం పూర్తికావటానికీ లంకె పెట్టాడు. దానిని దుర్యోధనుడు నిపుణంగా పరిహసిస్తున్నాడు. శ్రీకృష్ణుడు తొందర పడుతున్నాడని ఒక అభియోగం చేశాడు. రాయబారానికీ విందుకూ సంబంధం లేదని చెప్పాడు. ఒకవేళ రాయబారం సఫలం కావచ్చును, కాకపోవచ్చును. దానికీ విందుకూ ముడిపెట్టటం తొందరపాటు అని హెచ్చరించాడు. చివరకు 'ముక్కుత్రాటిలో కాలుదూర్చటం ఎందుకు?' అనే లోకోక్తితో ఎత్తిపొడిచాడు. పని మొదలు కాకపోగా ముగింపు సంగతి ఎందుకు అప్పుడే తెస్తావు? అని భావం. మరొక మాటలో చెప్పాలంటే- సంధి కుదురుతుందంటేనే నేను విందు చేస్తా' నన్నట్లున్నదని భావం. ముక్కుత్రాడు - మొదటి మర్యాదలకూ, కాలు - చివరి ముగింపుకూ ఆ సూక్తిలో స్ఫూర్తినిస్తాయి. శ్రీకృష్ణుడి వక్రనీతిని బయటపెట్టాలని పలికిన మాట లివి. (సంపా.)

వ. నీవు వచ్చినవాఁడవు మా యింటఁ గుడిచి కూర్చుండి యెల్లపనులుం జెప్పుట యొప్పుఁగాక; కుడువనొల్ల ననం దగునె? దీనికిం గారణంబు నా

యెఱింగిన యది లేదు; విచారింపక పలికి' తనిన మందరధరుండు మందస్మితంబుతో నందఱం గలయం గనుంగొని ధార్తరాష్ట్రకరంబు గజంబు పల్లవం బల్లన తెమల్చు లీలం గేల నమర్చి 'యిట్టి మాటలు తేటపఱుపవలయునేని విను'మని యతని కిట్లనియె: 219

ప్రతిపదార్థం: వచ్చినవాడవు నీవు; మా యింటన్= మా గృహంలో; కుడిచి= భుజించి; కూర్చుండి; ఎల్లపనులన్= అన్ని కార్యాలూ; చెప్పుట; ఒప్పున్+కాక= తగునుగాని; కుడువన్+ఒల్లన్+అనన్+తగునె?= భుజించటాని కిష్టపడను అని చెప్పటం యుక్తమా?; దీనికిన్= ఇట్లు తిననని చెప్పటానికి; కారణంబు; నా+ఎఱిఁగిన+అది= నాకు తెలిసినట్టిది; లేదు; విచారింపక పలికితి(వి)= ఆలోచించక మాట్లాడావు; అనినన్; మందరధరుండు= క్షీరసాగర మథన కాలంలో మందరగిరిని మూపున దాల్చిన మహాకూర్మ స్వరూపుడైన శ్రీకృష్ణుడు; మందస్మితంబుతోన్= చిరునవ్వుతో; అందఱన్+కలయన్+కనుంగొని= అక్కడున్నవారినెల్ల తేరిపారజూచి; ధార్త రాష్ట్రకరంబు= దుర్యోధనుడి చేతిని; గజంబు= ఏనుగు; పల్లవంబున్= చిగురుటాకును; అల్లన= మెల్లగా; తెమల్చులీలన్= చలింప జేయు విధాన; కేలన్+అమర్చి= తన చేతిలో ఇమిడ్చి; ఇట్టిమాటలు= ఇటువంటి పలుకులు; తేటపఱుపన్+వలయున్+ఏనిన్= విశదం చేయవలసి వస్తే; వినుము= చెప్పుచున్నాను ఆలకించు; అని; ఆతనికిన్; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా అన్నాడు.

తాత్పర్యం: కృష్ణా! వచ్చినవాడివి వచ్చినట్లు మా ఇంటిలో కమ్మగా భుజించి, హాయిగా కూర్చుండి, అన్ని పనులు చెప్పటం తగును గాని భుజించటానికి సమ్మతించనని చెప్పవచ్చునా? ఇందుకు కారణం నా యెరిగినంతలో ఏదీలేదు. ఆలోచించక ఇట్లా పలికావు' అని దుర్యోధను డన్నాడు. అప్పుడు వెన్నుడు చిరునవ్వు నవ్వుతూ అక్కడున్న వారినంతా కలయజూచి ఏనుగు చిగురుటాకును తొండంతో పట్టుకొని కదల్చేరీతిగా దుర్యోధనుడి చేతిని తన హస్తంతో పట్టుకొని కదల్చుతూ ఇట్లాంటి విషయాలు వివరించవలసిన అవసరముంటే వెల్లడిస్తాను. విను'మంటూ అతడితో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. తన ఇంట విందు చేయనన్న శ్రీకృష్ణుడి వర్తనానికి కారణ మేమిటో రారాజుకు బోధపడలేదు. సూటిగా అతడినే అడిగాడు. అట్లా అడిగితే శ్రీకృష్ణుడి బండారం బైటపడుతుందని దుర్యోధనుడి తలపు. అడిగితే దుర్యోధనుడి బండారం బైట పెడదామని గోవిందుడి మనసు. ఇద్దరికీ అవకాశం దొరికింది.

2. ఇక్కడ శ్రీకృష్ణుడి అభినయం అమోఘం. క్షీరసాగర మథనంలో మందరపర్వతాన్ని మోసిన ఆదికూర్మ రూపుడు శ్రీకృష్ణుడు. ఈ సమస్య ఒక లెక్కా? మందహాసం చేస్తూ అందరినీ చూచాడు. తాను చెప్పబోయే అంశం దుర్యోధనుడే కాదు అందరూ వినదగింది అని హెచ్చరిక. దుర్యోధనుడి దుర్వివేకంపై ఒక పరిహాస హేల. అంతటితో ఆగక ఏనుగు తన తొండంతో ఒక చిగురాకును అవలీలగా పైకి లేపినట్లు దుర్యోధనుడి చేతితో కరచాలనం చేస్తూ పలికాడు. (చక్కని ఉపమాలంకారం.) దీనిభావ మేమి? 'దుర్యోధనా! నీ సంగతి నీవే త్రవ్వుకొని అడుగుతున్నావు. నేను చెప్పే మాటల కన్నిటికీ నీవే బాధ్యుడవు. ఇందులో నా తప్పేమీ ఉండదు. తరువాత నన్ను లాభం లేదు' - అని ఆ అభినయానికి అర్థం. 'వివరించమంటే వివరిస్తాను వినండి' అని హుందాగా హుంకరించాడు. దుర్యోధనుడు కదిలించాడు. శ్రీహరి విజృంభించాడు. (సంపా.)

చ. ప్రియమెసఁగం దగం బిలిచి పెట్టెడు కూ డది లెస్సకూడు; ద
క్కయనయహీనతం దమకు నాపద యైనెడ నిట్టునట్టు నే
మియు ననలేని కూ డదియు మేవడియై చను; నీవు మా దెసం
బ్రియుఁడవు గావు; మాకు ధృతి పెంపఁ నాపదలే దొకింతయున్. 220

ప్రతిపదార్థం: ప్రియము+ఎసఁగన్= ప్రేమ అతిశయించగా; తగన్+పిలిచి= హృదయ పూర్వకంగా ఆహ్వానించి; పెట్టెడుకూడు= పెట్టే అన్నం; అది లెస్సకూడు+తక్క= అది మంచి అన్నం దప్ప; అయనయహీనతన్= శుభం, న్యాయం లేకుండా; తమకున్= తమకు; ఆపద+ఐన+ఎడన్= విపత్తు సంభవించిన చోట; ఇట్టున్+అట్టున్= ఇట్టిట్టని; ఏమియున్+అనలేని= సంకటస్థితిలో ఇంచుకకూడా బదులాడటానికి వీలుగాని; కూడు+ అదియున్= భోజనం కూడా; మేవడి+ఐ+చనున్= ఉచితమైనదే ఔతుంది.; నీవు; మా దెసన్= మా యెడ; ప్రియుఁడవు కావు= ప్రేమకలవాడవు కావు; మాకున్= మాకు; ధృతిపెంపు+అఱన్= ధైర్యసమృద్ధి చెడేటట్లుగా; ఒకింతయున్= రవంతైనా; ఆపద లేదు= కీడు వాటిల్లలేదు.

తాత్పర్యం: ప్రేమతో తన ఇంటికి పిలిచి పెట్టే భోజనం మంచి భోజనం. విపత్తు కలిగినచోట ఔను కాదని బదులేమీ పలకటానికి వీలుగాని సంకట స్థితిలో అయనయములు లేక తినే కూడు కూడా ఉచితమైన కూడే అవుతుంది. దుర్యోధనా! నీవు మా ఎడ ప్రేమకలవాడవు కావు. మాకు ధైర్యం నశించగా ఇప్పుడు ముంచుకొని వచ్చిన ఆపద కొంచెం కూడా లేదు. అందువలన నీ ఇంటిలో భుజించటానికి ఇష్టపడను.

విశేషం: 1.ప్రీతితో పిలిచి పెట్టే విందు ప్రియమైనది. లేదా 'భక్తి గలుగుకూడు పట్టెడైనను చాలు'. అంటే దుర్యోధనుడు ఇంటికి వచ్చిన తరువాత శ్రీకృష్ణుడిని విందుకు పిలిచాడు. అయినా అచ్చమైనా స్వచ్ఛమైన ప్రీతితో పిలువలేదు. మరొకమాటలో చెప్పాలంటే రాజకీయమైన దురుద్దేశంతో పిలిచాడని భావం.

2. ఏదైనా తీరని ఆపద కలిగితే, కాదనలేక కటకటపడుతూ తప్పనిసరిగా తినే మిగిలిన కూడు కూడా తినదగిందే. ప్రీతితో పెట్టే భోజనం ఒకటి, ఆపదలో చేసే భోజనం ఒకటి- ఈ రెండే సబబైన విందులు.

3. ఈ రెండు ప్రమాణాలూ దుర్యోధనుడి పట్ల వర్తించవు. అతడు పాండవులకు హితుడు కాడు; పాండవుల కిప్పు డంతటి ఆపద ఏమీ రాలేదు అన్నాడు కృష్ణుడు. ఇది ముక్కుపై గుద్దినట్లు చెప్పిన సమాధానం. మూర్ఖంగా వేసిన ప్రశ్నకు ఇటువంటి జవాబే తగింది.

4. ఈ పద్యానికి మూలం:

'సంప్రీతి భోజ్యా న్యన్నాని ఆపద్భోజ్యాని వా పునః
నచ సంప్రీయసే రాజన్ నీచైవా సద్గతా వయమ్' (సం. 5-89-25)

తిక్కన దీనిని చక్కని తెలుగు పద్యంగా మార్చాడు. (సంపా.)

వ. అట్లుంగాక. 221

తాత్పర్యం: అంతేకాదు.

క. పగవారి యింటఁ గుడిచిన ।
నగుఁ దమ కనుమాన; మమృత మైనను దారుం
బగతురకుఁ గుడువఁ బెట్టఁగఁ ।
దగ; దొడళుల కెప్పు డెవ్విధము వాటిలునో? 222

ప్రతిపదార్థం: పగవారి+ఇంటన్= శత్రు గృహంలో; కుడిచినన్= భుజిస్తే; తమకున్= తమకు; అనుమానము+అగున్= సందేహం కలుగుతుంది; అమృతము+ఐనను= సుధా రసమైనప్పటికిన్నీ; తారున్= గృహస్థులు; పగతురకున్= తమ విరోధులకు; కుడువన్+పెట్టగన్+తగదు= తినబెట్టరాదు; ఒడళులకున్= దేహాలకు; ఎప్పుడు= ఏ సమయంలో; ఏ+విధము+పాటిలునో!= ఏమి జరుగుతుందో తెలియదుకదా!

తాత్పర్యం: శత్రుగృహాలలో భుజించేటప్పుడు వారు తన కేమి పెడతారో అని సందేహం కలుగుతుంది. అమృతమైనప్పటికినీ యజమానులు తమ శత్రువులకు తినబెట్టటం కూడదు. క్షణభంగురాలైన ఈ శరీరాలకు ఎప్పుడు ఏ విధంగా చేటు మూడుతుందో చెప్పలేము కదా!

విశేషం: ఇది చక్కని సూక్తి. ఈ పద్యం లోకధర్మనీతిగా కనపడుతున్నా దుర్యోధనుడి దురాలోచనను ధ్వనింపచేసే నిపుణోక్తి. శత్రువు విషాహారం పెట్టకపోయినా, తినినవాడికి సహజంగా ఏదయినా హాని జరిగితే, అతడు శత్రువు పెట్టినకూడు తినటంవలన అనే అనుమానం కలుగుతుంది. (సంపా.)

వ. నేను పగతుండనె యంటేని. 223

ప్రతిపదార్థం: నేను; పగతుండనె?= శత్రువునా?; అంటి(వి)+ఏని= అంటావేమో!

తాత్పర్యం: నేను నీకు విరోధినా? అని ప్రశ్నిస్తావేమో - వినుము.

క. అలుగుదు పాండవులకు వా ।
రలు నాకుం బ్రాణములు ధరావల్లభ! యి
ట్టలముగఁ దమ ప్రాణములకు ।
నలుగు జనులు పగతు రగుట యనుమానంబే? 224

ప్రతిపదార్థం: ధరావల్లభ!= రాజా!; పాండవులకున్= పాండవులపై; అలుగుదు (వు)= నీవు కోపం వహిస్తావు; వారలు= కౌంతేయులు; నాకున్ ప్రాణములు= నాకు అసువుల వంటివారు; ఇట్టలముగన్= అధికంగా; తమ ప్రాణములకున్= తమ ప్రాణాలపై; అలుగు జనులు= కినుక వహించినవారు; పగతురు+అగుట= విరోధులు కావటం; అనుమానంబే?= సందేహమా?

తాత్పర్యం: దుర్యోధనా! పాండవులంటే నీకు కోపం. వారు నాకు పంచప్రాణాలు. తమ ప్రాణాలకు ఎసరుపెట్టేవారు తమకు విరోధులు కావటంలో సంశయ మేముంది?

విశేషం: 1. పాండవులనుండి కృష్ణుడిని వేరు చేయాలనీ, లేదా బంధించాలనీ, లేదా చంపాలనీ దుర్యోధనుడు ప్రకటించిన పన్నాగం. విందు ప్రాణాలు తీసే ప్రయోగం. ఆ సంగతిని శ్రీకృష్ణుడు ధ్వనిమయంగా చెప్పాడు.

2. పాండవులు తన పంచప్రాణాలని ప్రకటించిన శ్రీకృష్ణుడు వారు ఆయనకంటె అభిన్నులని స్పష్టం చేశాడు. కృష్ణుడికి దుర్యోధనుడు నేరుగా శత్రువు కాకపోయినా, అతడికి ప్రాణసములైన పాండవులకు శత్రువు కాబట్టి, అతడు తనకూ శత్రువే. శ్రీకృష్ణుడి హేతుబద్ధ వాఙ్నైపుణ్యం ప్రశంసనీయం. (సంపా.)

ఆ. కారణంబు లేక కౌంతేయులకు బాల్య।
మాదిగాఁగఁ గీడె యాచరింతు;
పుణ్యపరులు తోడఁబుట్టువు లార్యులు।
వైర మెత్తఁదగునె వారితోడ? 225

ప్రతిపదార్థం: కారణంబులేక= నిమిత్తంలేక; కౌంతేయులకున్= కుంతీ పుత్రులకు; బాల్యము+ఆది కాఁగన్= చిన్నతనంనుండి; కీడె= అపకారమే; ఆచరింతు(వు)= చేస్తుంటావు; పుణ్యపరులు= పుణ్యకార్యాలు సల్పటంలో శ్రద్ధకలవారు; తోడఁబుట్టువులు= సహోదరులు; ఆర్యులు= పూజ్యులు ఐన; వారితోడన్= పాండవులతో; వైరము+ ఎత్తన్+తగునె?= కలహించవచ్చునా?

తాత్పర్యం: వైర కారణమేమీ లేకుండా చిన్నతనం నుండీ నీవు పాండవులకు అపకారమే చేస్తున్నావు. వారు నీకు సహోదరులు, పుణ్య కార్యాలందు ఆసక్తి గలవారు, పూజ్యులు. అట్టివారితో నీవు విరోధం కలిగి ఉండవచ్చునా?

వ. ఇట్లున్న మీ యందఱ యన్నంబులు దుష్టాన్నంబులు; విదురుం డొక్కని యన్నంబు భోక్తవ్యంబని నిశ్చయించితిఁ గావున నందుఁ బోయెద'నని చెప్పి యజ్జనపతి యనుమతి సేయఁ జనునప్పుడు తోడన బాహ్లిక భీష్మాది కౌరవులును గుంభసంభవ ప్రముఖులైన మాన్యులును జని మాధవుతోడ 'మా యిండ్ల నెల్లను గానిక లాయి తంబులు చేసికొని నీవు విజయం చేయుటకు నెదురు చూచుచున్న వార'మని పల్కి ప్రార్థించిన 'నే నన్ని చోట్లకు వచ్చిన వాఁడన; యందఱ యర్చనలుం గైకొంటిన; మీరు నిలువుం'డని వారల నిలిపి విదురు గృహంబునకుం బోయిన. 226

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్న= పుణ్యపురుషులను; పూజ్యులను బాధిస్తున్న; మీ+అందఱ+అన్నంబులు= మీ అందరియొక్క భోజనాలు; దుష్ట+ అన్నంబులు= పాపపు కూళ్ళు; విదురుండు+ఒక్కని+అన్నంబు= ఒక్క విదురుడి అన్నం మాత్రం; భోక్తవ్యంబు= భుజించదగింది; అని నిశ్చయించితిన్= అని నిర్ణయించుకొన్నాను; కావునన్= కనుక; అందున్+ పోయెదన్= అతడి ఇంటికి వెళ్ళుతాను; అని చెప్పి; ఆ+జనపతి+ అనుమతి+ చేయన్= రాజగు దుర్యోధనుడు సమ్మతించగా; చను+అప్పుడు= వెళ్ళేటప్పుడు; తోడన్+ అ= అతడివెంటనే; బాహ్లిక భీష్మ+ఆది కౌరవులును= బాహ్లికుడు భీష్ముడు మున్నగు కురువంశస్థులును; కుంభసంభవ ప్రముఖులు+ఐన మాన్యులును= కలశంనుండి ఉద్భవించిన ద్రోణుడు మున్నుగా గల పెద్దలూ; చని= వెళ్ళి; మాధవుతోడన్= కృష్ణుడితో; మా+ఇండ్లన్+ఎల్లను= మా అందరి ఇళ్ళలో; కానికలు= బహుమతులు; ఆయితంబులు చేసికొని= సిద్ధపరచుకొని; నీవు విజయం చేయుటకున్= నీవు విచ్చేయటానికి; ఎదురు చూచుచున్+ ఉన్నవారము= ప్రతీక్షిస్తున్నాం; అని పల్కి= అని నుడివి; ప్రార్థించినన్= వేడుకోగా; నేను; అన్నిచోట్లకున్+వచ్చినవాఁడను+అ= వచ్చినట్లే; అందఱ+ అర్చనలున్= మీ అందరి పూజలు; కైకొంటిన్+అ= స్వీకరించినట్లే; మీరు నిలువుండు= మీరు ఆగండి; అని; వారలన్ నిలిపి= వారిని తన వెంట రాకుండ అక్కడే ఆగేటట్లు చేసి; విదురు గృహంబునకున్; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: పుణ్యాత్ములను బాధిస్తున్న మీ అందరి అన్నాలు చెడుతిండ్లు. ఒక్క విదురుడి అన్నమే భుజించదగినది అని నిర్ణయించుకొన్నాను. కావున అక్కడికి వెళ్ళుతాను' అని చెప్పి దుర్యోధనుడు పంపగా వెళ్ళుతున్న సమయంలో శ్రీకృష్ణుడిని బాహ్లికుడు భీష్ముడు మొదలైన కురువృద్ధులున్నూ, ద్రోణాచార్యులు మొదలైన పూజ్యులున్నూ, వెంబడించి 'మా ఇళ్ళలో నీ కోసం కానుకలు సిద్ధపరచుకొని ఉన్నాము. నీ రాకకు ఎదురు చూస్తున్నాము. మా ఇళ్ళకు దయచేయండని వేడుకొన్నారు. 'నేను మీ అందరి ఇళ్ళకు వచ్చినట్లే, మీ పూజలన్నీ అందుకొన్నట్లే అని భావించండి. ఇక ఆగండి' అని వాళ్ళను నిలిపి, విదురుడి మందిరానికి వెళ్ళాడు.

విశేషం: 1. కౌరవుల ఇండ్లలోని విందులు పాపపుకూళ్ళు అని నిందించాడు. 2. విదురు డొక్కడే హితుడనీ, అతడి విందే హితమైన భోజనమనీ ప్రకటించాడు.

3. భీష్మాదు లెందరో తమ ఇండ్లకు పిలిచారు. 'అందరూ పిలిచినట్లే, నేను వచ్చినట్లే, మీ పూజలందు కొన్నట్లే' అని అనునయించాడు. నిజానికి భీష్మాదులతో పలికిన మాటలు సర్వవ్యాపకుడైన సర్వేశ్వరుడు అనదగిన మాటలు. ఆధ్యాత్మిక మైన అర్థంలో మీ అందరి ఇండ్లకూ భౌతికంగా రాకపోయినా మీ అందరి పూజలూ మానసికంగా అందుకొన్నానని అర్థం. లౌకికంగా- మీరందరూ కౌరవుల నాశ్రయించి ఉన్నారు కాబట్టి మీకూళ్ళు నాకు పొసగవు అని చెప్పినట్లు తాత్పర్యం. (సంపా.)

సీ. సంభ్రమ స్నేహ నిశ్చల భక్తియుక్తిఁ బ ।
విత్ర మజ్జనము గావించి విదురుఁ
డెల్లవంటకమును నేర్పడ బోనాలు ।
వేర్పింప, నెంతయుఁ బ్రీతి ముంద
రోజమై బ్రాహ్మణభోజనం బొనరించి ।
సపరివారముగ విశాల రమ్య
పూత స్థలంబునఁ బుండరీకాక్షుండు ।
దమ్ముండు దాను నుత్సవ మెలర్ప

తే. సరస రంజక మహనీయ సంప్రయోగ ।
మగు చతుర్విధ హృద్యాన్న మారగించె
లలిత సంభావనా మంజులంబు లైన ।
పలుకు లెడనెడ విదురున కెలమి యొసఁగ. 227

ప్రతిపదార్థం: విదురుఁడు; సంభ్రమస్నేహ నిశ్చలభక్తియుక్తిన్= ఆదరం, స్నేహం, నిలుకడఐన భక్తి అనేవాటితో కూడినవాడై; పవిత్ర మజ్జనము+ కావించి= శౌరికి పావనమైన స్నానం చేయించి; ఎల్లవంటకమును= పలు తెరగులైన వంటకములు అన్నీ; ఏర్పడన్= విశదంకాగా; బోనాలు+పేర్పింపన్= భోజనపదార్థములు పేర్పించగా; ఎంతయున్+ ప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ముందర= తాను భుజించటానికి మునుపే; ఓజమైన్= క్రమ ప్రకారం; బ్రాహ్మణభోజనంబు+ఒనరించి= బ్రాహ్మణులకు భోజనం పెట్టి; పుండరీక+ అక్షుండు= తెల్లదామరలవంటి కన్నులుగల నారాయణుడు-శ్రీకృష్ణుడు; విశాల రమ్య పూత స్థలంబునన్= విశాలమైన, సుందరమైన, పవిత్రమైన ప్రదేశంలో; సపరి వారముగన్= సహచరులతోకూడ; తానున్= తానున్నూ; తమ్ముండున్= అనుజుడైన సాత్యకియున్నూ; ఉత్సవము+ఎలర్పన్= వేడుకమీరగా; సరస= రసవంతమూ; రంజక= మదికింపు గొల్పేది; మహనీయ సంప్రయోగము+ అగు= గొప్పగా చేయించబడింది ఐన; చతుర్విధ= భక్ష్య భోజ్య లేహ్య చోష్యములు అనే నాల్గు విధాలైన; హృద్య+అన్నము= ఆత్మకింపైన భోజనం; ఎడన్+ఎడన్= మధ్య మధ్య; లలిత సంభావనా మంజులంబులు+ ఐన= మృదులములైన ప్రశంసలచేత ఒప్పుతున్నట్టి; పలుకులు= మాటలు; విదురునకున్= విదురుడికి; ఎలమి+ఒసఁగన్= సంతోషం కలిగించగా; ఆరగించెన్= భుజించాడు.

తాత్పర్యం: విదురుడు ఆదరం, స్నేహం, నిలుకడ గల భక్తి అనే గుణాలతో కూడినవాడై శౌరికి మంగళస్నానం చేయించాడు. ఆ తరువాత వండిన వంటకాలన్నింటినీ వరుసగా వడ్డన చేయించాడు. శ్రీకృష్ణుడు ఆచారక్రమాన్ని అనుసరించి బ్రాహ్మణులు ముందు భుజించిన తరువాత తానూ, తన తమ్ముడూ, సహచరులూ పవిత్రమైన విశాల సుందర ప్రదేశంలో సంతోషంగా భోజనాలకు కూర్చున్నారు. నడుమ నడుమ మృదుల సమ్మాన వాక్యాలతో విదురుడికి ఆనందం కలిగిస్తూ, మహనీయంగా, కమనీయంగా తయారు చేసిన రసవంతాలు, ఆత్మ కింపైనవీ అయిన భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యాలనే నాలుగు విధాలైన భోజన పదార్థాలను శ్రీకృష్ణుడు ఆరగించాడు.

వ. ఆతండును. 228

తాత్పర్యం: ఆ విదురుడు కూడ.

క. 'గోవింద! సంభ్రమము సం।
భావింపుము మాకు నిదియ పరమధనం; బొం
దే విధమున నీ కర్చన।
గావింపం జాలువాఁడు కలఁడే యెందున్?' 229

ప్రతిపదార్థం: గోవింద!= శ్రీకృష్ణా!; సంభ్రమము సంభావింపుము= మా ఆదరపూర్వకమైన ఆతిథ్యం మన్నించవలసింది. మాకున్+ఇదియ= మా ఆతిథ్యం నీవు స్వీకరించటమే; పరమ ధనంబు= గొప్పధనం; ఒండు+ఏ విధమునన్= మరే విధంగానూ; నీకున్+అర్చన+ కావింపన్+చాలువాఁడు= నీకు పూజలు చేయగలిగినవాడు; ఎందున్+కలఁడే?= ఎక్కడైనను ఉన్నాడా? (లేడని అర్థం.)

తాత్పర్యం: 'పురుషోత్తమా! నా ఆతిథ్యం మన్నించుము. నీకు ఆతిథ్యమివ్వటమే మాకు పరమ సంపద. వేరొక విధంగా నిన్ను అర్చించగలవాడు ఎక్కడా లేడు.'

విశేషం: మానవాకారంలో వచ్చిన మాధవుడికి భక్తి కలుగుకూడు పెట్టి భజించటానికి విదురుడి విందు ఉదాహరణం. (సంపా.)

వ. అని మఱియు నత్యంత వినయ వాక్యమ్ముల నారాధించుచుండె; నిట్లు కృతాహారుండైన హరికి చందన చర్చా ద్యుపచారంబు లాచరించి యవ్విదురుండు కృతార్థుండై యుండఁ; గవి గాయక ప్రముఖ నిఖిల విద్వజ్జనంబులు పాఠక వాంశిక వైణికాది వినోద పాత్రంబులు నప్పర మేశ్వరుం గానవచ్చి ప్రొద్దుపుచ్చి యభిమతార్థంబులు వడసి చనిరి; రాత్రి యగుటయుం దగిన యభ్యంతర మందిరంబున హంసతూలికా తల్పం బున భుజంగ తల్పు నునిచి యతనికడ నుచితాసనంబున నుండి. 230

ప్రతిపదార్థం: అని, మఱియున్= ఇంకను; అత్యంత వినయ వాక్యమ్ములన్= మిక్కిలి అణకువతో కూడిన మాటలచేత; ఆరాధించుచున్+ఉండెన్= శ్రీకృష్ణుడిని పూజిస్తూ ఉన్నాడు. ఇట్లు= ఈ రీతిగా; కృత+ఆహారుండు+ఐన= స్వీకరించిన భోజనంకలవాడైన; హరికిన్= కృష్ణుడికి; చందనచర్చా+ఆది= గంధం పూయటం మున్నగు; ఉపచారంబులు+ ఆచరించి= సేవలుచేసి; ఆ+ విదురుండు; కృతార్థుండు+ఐ+ఉండన్= మనోరథం ఫలించినవాడై-ధన్యుడై ఉండగా; కవిగాయక ప్రముఖ= కవులు, గానం చేసేవారు మొదలుగా గల; నిఖిల విద్వత్+జనంబులు= సమస్త పండితులు; పాఠక= స్తుతి పాఠకులూ; వాంశిక= పిల్లన గ్రోవులూదేవారూ (మురళివాయించేవారూ); వైణిక= వీణ వాయించేవారూ; ఆది= మున్నుగా గల; వినోద పాత్రంబులు= వేడుక కలిగించే కళాకారులు; ఆ+పరమ+ ఈశ్వరున్= భగవంతుడైన శ్రీకృష్ణుడిని; కానన్+వచ్చి= దర్శించి; ప్రొద్దు+పుచ్చి= కాలక్షేపం చేసి; అభిమత+అర్థంబులు+పడసి= ఇష్ట ప్రయోజనాలను పొంది; చనిరి= తమ నివాసాలకు వెళ్ళారు; రాత్రి; అగుటయున్= కాగా; తగిన; అభ్యంతర మందిరంబునన్= లోపలి సౌధంలో; హంసతూలికా తల్పంబునన్= అంచ రెక్కలతో తయారుచేసిన మెత్తని పరుపుమీద; భుజంగ తల్పున్= శేషశాయియైన శ్రీమహావిష్ణువును; ఉనిచి= అధివసింపజేసి; అతని కడన్= ఆ పరమ పురుషుడి చెంత; ఉచిత+ఆసనంబునన్= తగిన పీఠంమీద; ఉండి= కూర్చున్నవాడై.

తాత్పర్యం: విదురుడు మిక్కిలి వినయ వచనాలతో స్వామిని ఆదరించాడు. భోజనమైన తరువాత శ్రీహరికి గంధం పూయటం మొదలైన సపర్యలన్నీ చేసి విదురుడు ధన్యుడైనాడు. ఆ తరువాత కవులు గాయకులు మొదలైన సకల విద్వాంసులు, స్తుతిపాఠకులు, వేణువు లూదేవారు, వీణ వాయించేవారు- ఇట్లా వివిధ విద్యలలో ప్రవీణులై వినోదాన్ని కలిగించే కళాకారులందరూ ఆ జగన్నాయకుని దర్శించి కాలక్షేపం కావించి ఇష్టార్థాలు పడసి తమ తమ నివాసాలకు వెళ్ళారు. రాత్రికాగానే విదురుడు లోపలి సౌధంలో హంసతూలికా

తల్పంమీద గోవిందుడిని శయింపజేసి ఆయన దగ్గర తగిన పీఠంమీద తాను కూర్చుండి.

ఆ. 'విదురుఁ డిట్టు లనియె నిది యొక కార్యంబు।
గాఁగఁ బూని యిందు రాఁగఁ దగునె?
దుష్టబుద్ధి నీచు దుర్యోధనుండు నీ।
మాట వినునె? దురభిమాన ఘనుఁడు. 231

ప్రతిపదార్థం: విదురుఁడు, ఇట్టులు+అనియెన్; ఇది+ఒక కార్యంబు కాఁగన్+పూని= ఇది ఒక చేయవలసిన పనిగా భావించి పనిగట్టుకొని; ఇందున్= ఇక్కడికి; రాఁగన్+తగునె?= మీరు రావచ్చునా?; దుర్యోధనుండు; దుష్టబుద్ధి= చెడు తలంపుకలవాడు; నీచు= అల్పుడు; దుర్+అభిమాన ఘనుఁడు= దురహంకారంలో దొడ్డవాడు; నీ మాట వినునె?= నీ హితవు వింటాడా?

తాత్పర్యం: పడుకపైనున్న పరమేశ్వరుడితో విదురు డిట్లా పలికాడు: 'స్వామీ! ఇదొక పనిగా పనిగట్టుకొని ఇక్కడికి నీవు రావచ్చునా? దుర్యోధనుడు దురాత్ముడు. నీచుడు. దురహంకార పూరితుడు. అతడు నీ మాటలను వింటాడా?

క. వచ్చిన సైన్యంబులఁ గని।
పెచ్చు పెరిఁగినాఁడు; ద్రోణ భీష్ముల లావుల్
నచ్చియుఁ గర్ణుం డొక్కఁడ।
యిచ్చుఁ దనకు విజయ మనియు నెంతయుఁ బొంగున్. 232

ప్రతిపదార్థం: వచ్చిన సైన్యంబులన్+కని= తన చెంతకు జేరిన పదకొండక్షౌహిణుల సేనలను చూచి; పెచ్చు+పెరిఁగినాఁడు= విర్రవీగుతున్నాడు; ద్రోణ భీష్ముల లావుల్= ద్రోణ భీష్ముల యొక్క శక్తులు; నచ్చియున్= నమ్మికూడ; కర్ణుండు+ఒక్కఁడు+అ= రాధేయు డొకడే; తనకున్= తనకు; విజయము+ఇచ్చున్+అనియున్= గెలుపు నొసగ గలడనియు; ఎంతయున్= మిక్కిలి; పొంగున్= మిడిసిపడుతుంటాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు తన పక్షాన చేరిన పదకొండక్షౌహిణుల సేనలను చూచుకొని విర్రవీగుతున్నాడు. ద్రోణభీష్ముల శక్తిపై విశ్వాసమున్నప్పటికీ ఒక్క కర్ణుడే తనకు జయం కలిగిస్తాడని మిడిసిపడుతుంటాడు.

వ. నీ విట వచ్చుట వినిన యప్పుడు ధార్త రాష్ట్రులందఱుం గూడంబాటి తమలో నిశ్చయించిన తెఱంగు నీ శాసనం బుల్లంఘింపం గలవారు 'పాండు నందనులకు నేమియు నీకుండువారు' తార యీ ధాత్రియంతయు బీఱువోవ కుండ నేలువారు; వారింగూడిన రాజులెల్లను దిగ్విజయంబునాఁడు పాండవులచేత భంగపడినవారు గావునఁ గర్ణుతో నేకార్థులమై చత్తుము గెలుతు; మింతియ కాని యొండు లేదని నిశ్చయించికొని యున్నవా; ర ట్లగుటంజేసి దుర్యోధనుండు గండు మిగిలి యున్నవాఁడు; సంధి గానేరదు; వారల కందఱకు నిది ప్రాప్తకాలంబై యున్నయది; యెట్లును నుడుగ నేర్చినవారు గాఁ;రిట్లు తమ్మెఱుంగని దుష్టాత్ముల నడుమం గూర్చుండుటయు నవ్వెంగలివిత్తు లఱచు వీఱిఁడి యఱపులకు వంకలొత్తి మాఱుసెప్పుటయు నొప్పకయుండు వెడంగు లగుటం గార్యవచనంబు లెఱుంగరు; మొఱకులగుటం బ్రతాపభాషణం బులకు వెఱవరు; వారల తలంపులు కీడు; నీ మహనీయ ప్రభావబుద్ధి పౌరుషంబు లే నెఱుంగుదు; నయినను బాండవేయులపై స్నేహంబునను నీమీఁది భక్తినిం జెప్పెద; నందుఁ బో వలవ' దనిన వాసుదేవుం డతని కిట్లనియె: 233

ప్రతిపదార్థం: నీవు, ఇటవచ్చుట= ఇక్కడికి రావటం; వినిన+అప్పుడు= విన్నవెంటనే; ధార్తరాష్ట్రులు+అందఱున్= కౌరవులందరూ; కూడన్+పాటి= గుంపుగా చేరి; తమలోన్= తమలో తాము; నిశ్చయించిన తెఱంగు= నిర్ణయించుకొన్న విధం ఏమిటంటే; నీ శాసనంబు= నీ ఆజ్ఞ; ఉల్లంఘింపన్+

కలవారు= అతిక్రమిస్తారు; పాండునందనులకున్; ఏమియున్+ఈక+ ఉండువారు= ఏమి కూడ ఇవ్వరు; తారు+అ= తామే; ఈ ధాత్రి+ అంతయున్= ఈ పుడమి నంతటినీ; బీఱుపోవక+ఉండన్= బెత్తెడు చోటుకూడ వదలకుండా; ఏలువారు= పాలించదలచారు; వారిన్ కూడిన రాజులు+ఎల్లను= వారి పక్షం అవలంబించిన రాజులంతా; దిక్+విజయంబు నాఁడు= (కౌంతేయులు) దిగ్విజయం చేసేటప్పుడు; పాండవుల చేతన్; భంగపడినవారు= ఓడించబడినవారు; కావునన్= అట్లగుటచేత; కర్ణుతోన్= రాధేయుడితోపాటు; ఏక+అర్థులము+ఐ= ఒకే ప్రయోజనం ఆశించినవారమై; చత్తుము= యుద్ధంలో చావనైనా చస్తాము; గెలుతుము= గెలువనైనా గెలుస్తాము; ఇంతి+అకాని= ఇంతే తప్ప; ఒండు లేదు= మరో మార్గం మాకు లేదు; అని నిశ్చయించుకొని ఉన్నవారు= అని తీర్మానించుకొని ఉన్నారు; అట్లు+అగుటన్+చేసి= వారల నిర్ణయం ఇట్లా ఉండటం వలన- అనగా కదనానికి వారు కాలు ద్రవ్వటం వలన; దుర్యోధనుండు; గండు మిగిలి+ఉన్నవాఁడు= పౌరుషం వహించి(పొగరుబట్టి) ఉన్నాడు; సంధి, కానేరదు= జరుగబోదు; వారలకున్, అందఱకున్, ఇది ప్రాప్తకాలంబు+ ఐ+ఉన్నఅది= వినాశకాలం దాపురించి ఉన్నది; ఎట్లును= ఏ విధంగానైనా; ఉడుగన్ నేర్చినవారు కారు= యుద్ధం చేయవలెననే సంకల్పం మానుకొనేవారు కారు; ఇట్లు= ఈ ప్రకారంగా; తమ్ము+ఎఱుంగని= తమ హాని వృద్ధులే తమకు తెలియనట్టి; దుష్ట+ఆత్ముల+నడుమన్= చెడు మనసులుకలవారి మధ్య; కూర్చుండుటయున్= మీరు కూర్చొనటం; ఆ+వెంగలి విత్తులు= ఆ మూర్ఖ శిరోమణులు; అఱచు; వీఁటిఁడి+అఱపులకున్= అవివేకపు కూతలకు; వంకలు+ఒత్తి= వంకరలు సరిదిద్ది; మాఱు చెప్పుటయున్= బదులాడుటయు; ఒప్పక+ఉండున్= యుక్తంగా నుండదు; వెడంగులు+ అగుటన్= అవివేకులు కావడంవలన; కార్యవచనంబులు+ఎఱుంగరు= ప్రయోజన కరమైన మాటలు వినరు; మొఱకులు+అగుటన్= మూర్ఖులు కావటంవలన; ప్రతాప

భాషణంబులకున్= వేడిమాటలకు; వెఱవరు= భయపడరు; వారల తలంపులు కీడు= వారి ఆలోచనలు చెడ్డవి; నీ మహనీయ ప్రభావ బుద్ధి పౌరుషంబులు= నీ గొప్ప మహిమ, బుద్ధి, మగటిమి; ఏన్+ఎఱుంగుదున్= నాకు తెలుసు; అయినను, పాండవేయులపైన్+స్నేహంబునను= పాండవులమీద గల ప్రేమచేతను; నీమీఁది భక్తినిన్= నీయందుగల భక్తిచేతను; చెప్పెదన్; అందున్+పోవలదు= కురుసభకు వెళ్ళవద్దు; అనినన్; వాసుదేవుండు; అతనికిన్; ఇట్లు+ అనియెన్= ఇట్లా చెప్పాడు.

తాత్పర్యం: నారాయణా! నీ విక్కడికి వస్తున్నావని వినినప్పుడు కౌరవులందరూ చేరి తమలో నిర్ణయించుకొన్న సంగతులు మనవి చేస్తాను. వారు నీ ఆజ్ఞ నతిక్రమిస్తారు. పాండవులకు ఏమీ పంచి ఇవ్వరు. తామే ఈ భూమినంతటినీ ఏలుకో దలచారు. వారితో చేరిన రాజులంతా పాండవులు దిగ్విజయం చేసినప్పుడు వారిచేతిలో అవమానం పొందినవారు గనుక తామూ పాండవులతో యుద్ధం చేసి (కర్ణుడితో పాటు) చస్తాం లేదా గెలుస్తాం తప్ప మరో మార్గం అనుసరించమని నిర్ణయించుకొని ఉన్నారు. కాబట్టి దుర్యోధనుడు అహంకరించి ఉన్నాడు. కనుక సంధి జరగదు. కౌరవులకు వినాశకాలం దాపురించింది. అందువలన వారు కదనానికి కాలు ద్రవ్వుతున్నారు. ఇట్లా ఒళ్ళెరుగక త్రుళ్ళిపడుతున్న ఆ దుష్టచిత్తుల మధ్య నీవు కూర్చొని, ఆ మూఢాగ్రేసరులు కూసే అవివేకపు కూతలకు సర్ది సర్ది బదులుమాటలు పల్కటం బాగుండదు. వారందరూ తెలివిమాలినవారు. కనుక ప్రయోజనకరమైన పలుకుల విలువ వారికి తెలియదు. పరమ మూర్ఖులు గనుక చురుకుపుట్టించు మాటలకు చలించరు. వారివి చెడు తలంపులు, స్వామీ! నీ మహామహిమ, నీ ప్రజ్ఞాపాటవం, నీ పౌరుషం నేనెఱుగుదు. అయిననూ పాండు పుత్రులపై గల ప్రేమచేతనూ, నీ యెడగల భక్తిచేతనూ చెపుతున్నాను. నీవు వారున్న సభకు వెళ్ళవద్దు' అని పల్కగా విని పురుషోత్తముడు విదురుడితో ఇట్లాఅన్నాడు:

తే. 'నీ వివేకంబు నాప్తియు నెఱపితీవు ।
తల్లిదండ్రుల మాడ్కి హితంబు సెప్పి
తేను నా రాక తెఱఁగెల్ల నేర్పరించి ।
చెప్ప విని యేమి సెప్పినఁజేయువాఁడ. 234

ప్రతిపదార్థం: నీ వివేకంబు= నీ జ్ఞానము; ఆప్తియున్= ఆప్తత్వము; ఈవు= నీవు; నెఱపితి(వి)= ఉపయోగపరచావు; తల్లిదండ్రులమాడ్కిన్= జననీ జనకులవలె; హితంబు+ చెప్పితి(వి)= ఏదిమేలు కలిగిస్తుందో తెలిపినావు; ఏను= నేను; నా రాక తెఱఁగు+ఎల్లన్= నేను ఎందుకు వచ్చానో అదంతయు; ఏర్పరించి+చెప్పన్= తేటతెల్లమొనర్పగా; విని= ఆలకించి; ఏమి చెప్పినన్ చేయువాఁడన్= ఏమి చెపుతావో ఆ ప్రకారమే చేస్తాను.

తాత్పర్యం: 'నీ వివేకం, ఆత్మీయత నాయెడ కనబరచి, తల్లిదండ్రులకైవడి హితం చెప్పావు. నేనిచటికి వచ్చిన దెందుకో వారికి తెలియజెప్పి, అందుకు వారేమంటారో తెలిసికొని అందుకు అనుగుణంగా చేయవలసింది చేస్తాను.

శ్రీకృష్ణుఁడు విదురుతో సంభాషించుట (సం. 5-91-3)

క. ఎఱుఁగుదు నేను సుయోధను ।
కొఱగామియు నతనితోడఁ గూడిన నృపు లం
దఱుఁ బగ మనమున నిడికొని ।
యఱుమటయును సంధి పొసఁగదనియు మహాత్మా! 235

ప్రతిపదార్థం: మహాత్మా!= దొడ్డబుద్ధిగలవాడా!; నేను; సుయోధను కొఱగామియున్= దుర్యోధనుడి చెడ్డతనాన్ని; అతని తోడన్+కూడిన= అతడితో జేరిన; నృపులు+ అందఱున్= రాజులంతా; పగ= వైరం; మనమునన్+ఇడికొని= మనసులో ఉంచుకొని; అఱుమటయును= ప్రతిఘటించటమూ; సంధి పొసఁగదు+అనియున్= సొత్తుకుదరదనీ; ఎఱుఁగుదున్= తెలియుదును.

తాత్పర్యం: 'నాకు దుర్యోధనుడి దౌష్ట్యమంతా తెలుసు. అతడితో చేరిన రాజులందరూ పాండవుల మీద పగగొని ఎదిరించటానికి సిద్ధంగా ఉన్నారనీ తెలుసు. సంధి సమకూడదనీ తెలుసు.

ఆ. పుడమియెల్ల నొడ్డగెడవయి గజవాజి ।
యుతముగాఁ గడంగి యుగ్ర మృత్యు
ముఖము సొరఁగఁ దివురు మూర్ఖత మాన్పుట ।
యధికమైన పుణ్య మనఘచరిత! 236

ప్రతిపదార్థం: అనఘచరిత!= దోషరహితమైన నడవడి గలవాడా!; పుడమి+ఎల్లన్= భూమండలమంతా; ఒడ్డగెడవు+అయి= భారంతో ఒక ప్రక్క కొరగి; గజ వాజియుతము గాన్= ఏనుగులు గుర్రాలు అనువాటితో కూడ; కడంగి= పూనుకొని; ఉగ్రమృత్యు ముఖము+చొరఁగన్= దారుణమైన మిత్తియొక్క నోటిలో ప్రవేశించటానికి; తివురు= త్వరపడుతున్న; మూర్ఖతన్= మొండితనాన్ని; మాన్పుట= తొలగించటం; అధికము+ఐన పుణ్యము= మిక్కిలి పుణ్యకార్యం.

తాత్పర్యం: భూ మండలమంతా భారముతో ఒక ప్రక్కకొరగి ఏనుగులతో, గుర్రాలతో కూడ భీకరమైన మృత్యువు నోటిలో ప్రవేశించటానికి వేగిరపడు తున్నది. ఇట్టి మూర్ఖత్వాన్ని తొలగించుట మిక్కిలి పుణ్య కార్యం.

వ. మానుప వచ్చునే యంటేని. 237

తాత్పర్యం: భూమండలం మృత్యువు నోటిలో ప్రవేశించకుండ ఆపటం శక్యమాఅంటే.

క. దొరకొని పుణ్యముఁ బాపము ।
నరుఁ దర్థిం జేయుచుండ నడుమ నొకట న
వ్వెర వెడలి తప్పినను ద ।
త్పరిణతి ఫలమొందునండ్రు ధర్మవిధిజ్ఞుల్. 238

ప్రతిపదార్థం: దొరకొని= పూనిక వహించి; పుణ్యమున్= సుకృత కర్మలనూ, పాపమున్= దురిత కర్మలనూ; నరుఁడు= మానవుడు; అర్థిన్= ఆసక్తితో; చేయుచున్+ఉండన్= కావిస్తున్నప్పుడు; నడుమన్= మధ్యలో; ఒకటన్= ఒకానొక కారణంచేత; ఆ+వెరవు+ ఎడలి= ఉపాయము చెడి; తప్పినను= ఆ కార్యము నెరవేరకపోయిననూ; ధర్మవిధిజ్ఞుల్= ధర్మస్వరూపమెరిగిన పెద్దలు; తద్+పరిణతి= ఆ పనులయొక్క పరిణామం; ఫలము+ ఒందున్+ అంద్రు= ఫలం చెందుతుందని చెప్తుతారు.

తాత్పర్యం: ఒకడు పూనికతో పుణ్యమో, పాపమో చేస్తూ ఉండగా నడుమ ఏదో ఒక కారణంచేత ఆ పని వెరవు తప్పి నెరవేరకపోయినా చేసిన ప్రయత్నం మాత్రం ఫలాన్ని పొందియే తీరుతుంది - అని ధర్మస్వరూపం తెలిసిన పెద్దలు చెపుతారు. విదురా! ఇక్కడ నా మాట ఫలించినా ఫలించకపోయినా చేసిన పుణ్యయత్నఫలం మాత్రం నాకు దక్కుతుంది.

విశేషం: దీనికి మూలం:

> **"ధర్మకార్యం యతన్ శక్త్యా నచేచ్ఛక్నోతి మానవః**
> **ప్రాప్తో భవతి తత్పుణ్య మత్ర మే నాస్తి సంశయః." (సం. 5-91-6)**

మానవుడు తన శక్తిలోపం లేకుండా ధర్మకార్యాన్ని చేయటానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ అతడు దానిని పూర్తి చేయలేక, ఫలం పొందకపోయినా, దాని పుణ్యాన్ని తప్పక పొందుతాడు. అందులో నాకు సంశయం లేదు. ఈ శ్లోకం భారత కథాసందేశంగా వినిపిస్తున్నది. (సంపా.)

వ. అట్లుంగాక. 239

తాత్పర్యం: అంతే కాకుండా.

తే. చుట్టములలోన నొప్పమి పుట్టినప్పు।
డడ్డపడి వారితోడఁ గొట్లాడియైన
దాని నుడుపంగఁ జొరకున్నవానిఁ గ్రూర।
కర్ముఁడని చెప్పుదురు కర్మకాండవిదులు. 240

ప్రతిపదార్థం: చుట్టములలోనన్= బంధువులలోపల; ఒప్పమి పుట్టినపుడు= ద్వేషం కలిగినప్పుడు; అడ్డపడి= అడ్డం వచ్చి; వారితోడన్= ఆ చుట్టాలతో; కొట్లాడి+ఐనన్= తగవులాడి అయినా; దానిన్= ఏర్పడిన విరోధాన్ని; ఉడుపంగన్= మాన్పటానికి చొరక+ ఉన్నన్= పూనుకోకపోతే; వానిన్= అట్టివాడిని; కర్మకాండ విదులు= కార్యస్వరూపం తెలిసిన పెద్దలు; క్రూరకర్ముఁడు+అని= ఘాతుకుడని; చెప్పుదురు= చెప్తుతారు.

తాత్పర్యం: బంధువులలో పరస్పరం వైరమేర్పడితే అడ్డం వచ్చి వారితో తగవులాడి అయినా ఆ పగను మాన్పకుంటే అలాంటివాడిని క్రూరకర్ముడని కర్మకాండయొక్క తత్త్వం తెలిసిన పెద్దలు చెపుతారు.

వ. కావున నీ రెండు దెఱంగులవారికి శాంతిగావింపం బ్రయత్నంబు సేసెద; ధర్మార్థ సహితంబైన తెఱంగు మాటలు మంత్రి జన సహితుండైన సుయోధనునకుం జెప్పెదఁ దనకుం బాండునందనులకు లోకంబులకు హితంబయిన విధంబు వంచన లేక చెప్పెడు నన్ను పాండవులవాఁడని శంకించి యతండు నామాట వినండయ్యె నేనియు మేలకాక యిట్లు సొచ్చి చెప్పకున్న నన్నదమ్ములు దమలోనం బోరఁ గృష్ణుండు వారింపక యుపేక్షించెఁ దనచేతఁ జక్కంబడదా? యని యజ్ఞులైన జను లాడుదు; రెల్లభంగులం గార్యం బార్యు లియ్యకొనం జెప్పుదు; ధార్త రాష్ట్రులుం దమకు బ్రదుకు తెరువైన నా పలుకులు వట్టుదురు; పట్టక నీ తలంచిన చందమునం దులువలై కలఁగం బాటినవారు నా ముందర నిలువం జాలుదురే యని పలికిన విదురుం డట్లకాక యని సమ్మతించి యామంత్రణంబు సేసి నిజ శయన స్థానంబునకుం జనియె; ననంతరంబ. 241

ప్రతిపదార్థం: కావునన్; ఈ రెండు తెఱంగుల వారికిన్= ఈ కురు పాండవులకు; శాంతి కావింపన్= సంధి చేయటానికి; ప్రయత్నంబు చేసెదన్= ప్రయత్నం చేస్తాను; ధర్మ+అర్థ సహితంబు= ధర్మార్థాలతో కూడిన; తెఱంగు మాటలు= సంధి వచనాలు; మంత్రిజన సహితుండు+ఐన= మంత్రులతో కూడిన; సుయోధనునకున్; చెప్పెదన్; తనకున్, పాండునందనులకున్= పాండురాజు కుమారులకు; లోకంబునకున్; హితంబు+అయిన విధంబు= మేలు కలిగించే మార్గం; వంచనలేక= కపటం లేక; చెప్పెడు నన్నున్; పాండవులవాఁడు+అని= పాండవ పక్షపాతి అని; శంకించి= అను మానించి; అతఁడు; నా మాట; వినండు+ అయ్యెన్+ఏనియున్= పెడచెవిని బెట్టినచో; మేలకాక= మంచిదే పొమ్ము; ఇట్లు చొచ్చి చెప్పక+ఉన్నన్= ఇట్లు కార్యరంగంలో ప్రవేశించి చెప్పదగిన మాటలు నేను చెప్పకపోతే; అన్నదమ్ములు; తమలోనన్; పోరన్= కలహించుకొంటుండగా; కృష్ణుండు; వారింపక= అడ్డుపడక; ఉపేక్షించెన్= అశ్రద్ధ చేశాడు; తన చేతన్= తన వల్ల; చక్కంబడదా= కార్యము నెరవేరదా; అని, అజ్ఞులు+ఐన జనులు= ఏమీ తెలియని మనుష్యులు; ఆడుదురు= పలుకుతారు; ఎల్ల భంగులన్= అన్ని విధాలా; కార్యంబు; ఆర్యులు= పెద్దలు; ఇయ్యకొనన్= సమ్మతించగా; చెప్పుదున్; ధార్తరాష్ట్రులున్= దుర్యోధనాదులుకూడ; తమకున్= తమకు; బ్రదుకు, తెరువు+ఐన= జీవనాధారమైన; నా పలుకులు= నా మాటలు; పట్టుదురు= చేకొందురు గాక; పట్టక= నా మాటలు ఆదరింపక; నీ తలంచిన చందంబునన్= నీవు భావించిన విధాన; తులువలు+ఐ= కుత్సితులై; కలఁగన్+పాఱినన్= చిత్తసంక్షోభము పొందినయెడల; వారు; నా ముందరన్= నా యెదుట; నిలువన్+చాలుదురే?= ధైర్యంతో నిలబడగలరా?; అని పల్కినన్; విదురుండు; అట్లు+అ కాక= నీవు సంకల్పించినట్లే; అని సమ్మతించి; ఆమంత్రణంబు+చేసి= హరి దగ్గర పోయి రమ్మనిపించుకొని; నిజశయన స్థానంబు నకున్= తాను పరుండే ప్రదేశానికి; చనియెన్= వెళ్ళాడు; అనంతరంబు+అ= అటుతరువాత.

తాత్పర్యం: కురుపాండవుల పొత్తుకొరకు ప్రయత్నం చేస్తాను. ధర్మార్థ యుక్తంగా ఒద్దిక మాటలు మంత్రి సహితుడైన దుర్యోధనుడికి చెపుతాను. అతడికీ, పాండుకుమారులకూ, సర్వజనులకూ మేలు కలిగించే మార్గమేదో మోసం లేకుండా తెలుపుతాను. ఇట్లా చెపుతున్న నన్ను పాండవ పక్షపాతి అని, దుర్యోధనుడు సందేహపడి నా మాటలు వినకపోతే పోనీ. అదీ ఒకందుకు మంచిదే. ఇట్లా నేను ఈ రెండు కుటుంబాలవిషయంలో జోక్యం కలిగించుకొనకుంటే అన్నదమ్ములు తమలో తాము పోట్లాడుకొంటుంటే కృష్ణుఁడు వారించక తన కేమీ పట్టనట్లు ఊరక ఉండిపోయాడు; తాను అనుకుంటే కార్యం చక్కదిద్దలేడా? అని అవివేకులు నన్ను ఆడిపోసుకొంటారు. అందుచేత పెద్దలు సమ్మతించేటట్లు అన్ని విధాలా కార్యం చక్కబెట్టటానికి అనుకూలమైన మాటలు వారికి చెపుతాను. దుర్యోధనాదులు తాము బ్రదకటానికి దారి కల్పించే నా మాటలు మన్నిస్తే బాగుపడతారు. అట్లా నా పలుకులు ఆదరించక నీవు భావించినట్లు కుత్సితులై మనసులు చెరుచుకొని తిరగబడితే వారు నాముందు నిలువ గల్గుతారా?' అని వాసుదేవుడు విదురుడితో పలికాడు. విదురుడు 'అట్లాగే స్వామీ అని ఆయన మాటలకు సమ్మతి తెల్పి' శౌరికడ సెలవు తీసికొని తాను పరుండేచోటికి వెళ్ళి పోయాడు.

ఆ. ఆతని వచన రచన యాత్మలోఁదలపోసి ।
యిట్టివాఁడు గలఁడె యెందు?' ననుచుఁ
బాలకడలి కడల పాటియై యొప్పు న ।
ప్పాన్పునందు శౌరి పవ్వడించె. 242

ప్రతిపదార్థం: శౌరి= శూరుడి మనుమడైన శ్రీకృష్ణుడు; అతని వచన రచన= ఆ విదురుడి మాటలయొక్క పొంకమును; ఆత్మలోన్= తన మదిలో; తలపోసి= స్మరించి; ఇట్టివాఁడు= ఇంతటి మహనీయుడు; ఎందున్= ఎచ్చటైనా; కలఁడు+ఎ?= ఉన్నాడా?; అనుచున్= అనుకొంటూ; పాలకడలి కడలపాటి+ఐ= క్షీర సాగర తరంగాలకు సమానమై; ఒప్పు= ప్రకాశించే; ఆ+ పాన్పునందున్= ఆ పరుపుమీద; పవ్వడించెన్= పండుకొన్నాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు విదురుడి మాటల పొందికను తన మదిలో స్మరించి, ఇంతటి మహనీయు డెక్కడైనా ఉన్నాడా అని అనుకొంటూ క్షీరసముద్ర తరంగాలవలె విశాలమైన ఆ తెల్లని పరుపుమీద పవ్వళించాడు.

విశేషం: అలం: ఉపమ. శ్రీకృష్ణుడియందు విష్ణుత్వం అలంకార ధ్వని. (సంపా.)

వ. ఇట్లు సుఖనిద్రసేసి వేగుంబోకట మాగధమంగళగానంబుల మేలుకాంచి సమయ కర్తవ్యంబులు సలిపె; నట్టియెడఁ గృతవర్మయు సాత్యకియు వచ్చి పొడసూపినం బురుషోత్తముండ వారలు మొదలుగాఁ గల యిష్ట జనంబులు పరివేష్టింప నుచిత ప్రదేశంబున నున్నంత. 243

ప్రతిపదార్థం: ఇట్లు సుఖనిద్ర+చేసి= ఇట్లా విదురుడి గృహంలో హాయిగా నిదురించి; వేగుంబోకటన్= తెల్లవారే సమయంలో; మాగధ మంగళగానం బులన్= మేలుకొలుపువారి యొక్క శుభకరాలైన గానములచేత; మేలుకాంచి= నిదుర లేచి; సమయ కర్తవ్యంబులు= ప్రాతఃకాలకృత్యాలు; సలిపెన్; అట్టియెడన్= అట్టివేళలో; కృతవర్మయున్; సాత్యకియున్; వచ్చి; పొడచూపినన్= కనబడగా; పురుషోత్తముండు= శ్రీకృష్ణుడు; వారలు మొదలుగాన్ కల= కృతవర్మ సాత్యకి ప్రభృతులైన; ఇష్టజనంబులు= ప్రియమైన వారు; పరివేష్టింపన్= తన చుట్టు చేరగా; ఉచిత ప్రదేశంబునన్= తగిన చోట; ఉన్న+అంతన్= ఉండగా.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు విదురుడి గృహంలో సుఖంగా నిద్రించి వేగుజామున వైతాళికులు వచ్చి మేలు కొలుపు పాటలు పాడగా మేల్కొని, ప్రాతఃకాల కృత్యములన్నీ నెరవేర్చాడు. ఇంతలో కృతవర్మ, సాత్యకి వచ్చి కనిపించుకొన్నారు. నారాయణుడు వారితోపాటు, మరికొంతమంది ఇష్టులు తన చుట్టూ చేరి కొల్చుచుండగా తగిన చోట ఆసీనుడై ఉన్నాడు. అప్పుడు.

క. ఇనతనయ శకుని దుశ్శాసన సహితము ।
గాఁగ నెలమిఁ జనుదెంచి సుయో
ధనుఁడు ప్రియోక్తులఁ దగు వా ।
రును దానును వారిజోదరుం గొనియాడెన్. 244

ప్రతిపదార్థం: సుయోధనుఁడు= దుర్యోధనుడు; ఇన తనయ= సూర్య పుత్త్రుడైన కర్ణుడు; శకుని= శకుని; దుశ్శాసన సహితము కాఁగన్= దుశ్శాసనునితో కూడ; ఎలమిన్= సంతోషంతో; చనుదెంచి= వచ్చి; ప్రియ+ ఉక్తులన్= ఇంపైన మాటలతో; తగువారును= అర్హులైనవారున్నూ; తానును= తానున్నూ; వారిజ+ఉదరున్= కమలనాభుడిని; కొనియాడెన్= శ్లాఘించాడు.

తాత్పర్యం: దుర్యోధనుడు రాధేయుడితో శకునితో దుశ్శాసనుడితో కలసి సంతోషంతో వచ్చి, మది కింపైన మాటలతో తగినవారూ, తానూ మధుసూదనుడిని వినుతించాడు.

వ. అతండును మధుర సంభాషణంబులు చేయ వార లతనికి ధృతరాష్ట్రుండు బంధుమిత్త్రాది సమస్త పరిజన సమన్వితుండయి పేరోలగంబున నునికి యెఱిఁగించినఁ బ్రియంబునఁ గట్టాయితంబైన తేరెక్కి భేరీశంఖచామర ప్రముఖ భద్ర చిహ్నంబులతో వెడలి గరుడధ్వజంబు గ్రాలఁ గృతవర్మ సాత్యకు లొక్క రథంబునను, దుర్యోధనాది దుష్టచతుష్టయం బొక్క రథంబునను బార్శ్వంబుల రాఁ బౌరులకుఁ గన్నుల పండువగుచు రాజమందిర ద్వారంబు సేర నరుగునప్పటి యులివునకుఁ గొలువువారెల్ల నత్యుత్సుకులై యెదురుచూడ రథోత్తమంబు నవతరించి యరవింద నాభుండు. 245

ప్రతిపదార్థం: అతండును= శ్రీకృష్ణుడున్నూ; మధుర సంభాషణంబులు చేయన్= ప్రియమైన పలుకులు పలుకగా; వారలు= ఆ వచ్చిన దుర్యోధనాదులు; అతనికిన్= శ్రీకృష్ణుడికి; ధృతరాష్ట్రుండు; బంధుమిత్త్ర+ ఆది+సమస్త పరిజన సమన్వితుండు+అయి= చుట్టాలు, స్నేహితులు మున్నగు పరివారంతో కూడివున్నవాడై; పేరు+ఓలగంబునన్+ ఉనికి= నిండుకొలువున

ఉండటం; ఎఱిఁగించినన్= తెలుపగా; ప్రియంబునన్= ఇష్టంతో; కడు+ ఆయితంబు+ఐన= సర్వ సంసిద్ధమై ఉన్న; తేరు+ఎక్కి= రథమెక్కి; భేరీ శంఖ చామర ప్రముఖ భద్ర చిహ్నంబులతోన్= భేరులు, శంఖములు, వింజామరలు మొదలైన మంగళ లాంఛనాలతో; వెడలి= బయలుదేరి; గరుడధ్వజంబు+క్రాలన్= రథంపై గరుత్మంతుడి టెక్కెం ప్రకాశించగా; కృతవర్మసాత్యకులు; ఒక్క రథంబునను; దుర్యోధన+ఆది+దుష్ట చతుష్టయంబు= దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని అనే దుర్మార్గులు నలుగురు; ఒక్క రథంబుననూ; పార్శ్వంబులన్+రాన్= తన రథానికి కుడియెడమ ప్రక్కల వస్తూ ఉండగా; పౌరులకున్= పురజనులకు; కన్నుల పండువు+ అగుచున్= కన్నుల విందుచేస్తూ; రాజమందిర ద్వారంబు= ధృతరాష్ట్రుడి సభాభవనం యొక్క వాకిలి; చేరన్+అరుగు+అప్పటి+ ఉలివునకున్= సమీపించే వేళలో ఏర్పడిన సద్దునకు; కొలువువారు+ఎల్లన్= సభలో ఉన్నవారందరూ; అతి+ఉత్సుకులు+ఐ= మిక్కిలి ఉత్సాహం కలవారై; ఎదురుచూడన్= ప్రతీక్షిస్తుండగా; రథ+ఉత్తమంబున్= శ్రేష్ఠమైన తేరును; అవతరించి= దిగి; అరవిందనాభుండు= పద్మం నాభియందుగల శ్రీకృష్ణుడు.

తాత్పర్యం: దుర్యోధనాదులతో శౌరికూడా ప్రియమైన మాటలు మాట్లాడాడు. అప్పుడు సుయోధనాదులు శ్రీకృష్ణుడితో 'ధృతరాష్ట్రమహారాజు బంధుమిత్రులతో పరిజనులతో కొలువుదీరి ఉన్నారు' అని చెప్పారు. ఆ మాటలతో సంతోషించి శ్రీహరి సంసిద్ధంగా ఉన్న రథమెక్కాడు. భేరులు, శంఖాలు, వింజామరలు మొదలైన మంగళ లాంఛనాలతో, గరుడకేతనం ప్రకాశిస్తుండగా రథంపై బయలుదేరాడు. తన అరదానికి ఒకవైపు సాత్యకి కృతవర్మలు ఎక్కిన రథం, మరోవైపు దుర్యోధన దుశ్శాసన కర్ణ శకునులనే నలుగురు దుర్మార్గులెక్కిన రథం వస్తుండగా స్వామి పురజనుల కన్నులకు విందు గావిస్తూ రాజభవనద్వారం సమీపించాడు. స్వామి తేరు మందిర ద్వారం సమీపిస్తుండగా కలిగిన సందడికి కొలువు కూటంలోని వారంతా రాజీవలోచనుడి రాకకు పరమో త్సాహంతో ఎదురుచూడసాగారు.

శ్రీమన్నారాయణుడు శ్రేష్ఠమైన రథం నుండి క్రిందికి దిగాడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

తే. ఎదురు వచ్చిన విదురుని యిచ్చు కరముఁ ।
దమ్ము చేయును రెండు హస్తములఁబట్టి
నడచె ముందటఁ గదియు సందడిఁ గడంగి ।
కర్ణ దుర్యోధనులు దొలఁగంగ జడియ. 246

ప్రతిపదార్థం: ఎదురువచ్చిన= తన కెదురుగా వచ్చిన; విదురుని+ ఇచ్చుకరమున్= విదురుడం దిచ్చిన హస్తాన్నీ; తమ్ము చేయును= తమ్ముడైన సాత్యకి హస్తాన్నీ; రెండు చేతులన్+పట్టి= తన రెండు బాహువులతో ఊతగా గ్రహించి; ముందటన్= ఎదుట; కదియు సందడిన్= ఏర్పడిన సమ్మర్దాన్ని; కడంగి= పూని; కర్ణ దుర్యోధనులు= కర్ణుడూ, దుర్యోధనుడునూ; తొలఁ గంగన్= దూరమయ్యేటట్లు; జడియన్= తోలగా; నడచెన్= నారాయణుడు సాగాడు.

తాత్పర్యం: తన కెదురుగా వచ్చి విదురు డందించిన హస్తాన్నీ; తమ్ముడైన సాత్యకి చేతినీ తన రెండు చేతులతో ఊతగా గ్రహించి శ్రీకృష్ణుడు నడుస్తూండగా ఎదుట ఏర్పడిన జన సమ్మర్దాన్ని కర్ణ దుర్యోధనులు దవ్వులకు తొలగద్రోశారు.

వ. కృత వర్మాది యాదవులు లోనుగాఁగల యభ్యంతరులైన బలు మానుసులు పొదివి కొని పోవఁదన సమీపంబునఁ గౌరవులు రవి సన్నిధి తారాగ్రహంబుల చందం బగుచుండం దేజోరాజియగు రాజీవాక్షుండు చని తనకుఁ బ్రత్యుత్థానంబు సేసిన కురురాజును దొరలను నభినం దించుచు. 247

ప్రతిపదార్థం: కృతవర్మ+ఆది యాదవులు= కృతవర్మ మొదలైన యదు వంశస్థులు; లోనుగాన్+కల= మొదలుగా కలిగిన; అభ్యంతరులు+ఐన=

సన్నిహితులైన; బలు+ మానుసులు= దొడ్డమనుష్యులు; పొదివి కొనిపోవన్= కూడికొనిపోగా; తన సమీపంబునన్= తన దగ్గర; కౌరవులు; రవి సన్నిధిన్= సూర్యుడి ముందు; తారాగ్రహంబుల చందంబు+ అగుచుండన్= నక్షత్రాల గ్రహాల వలె వెలవెల పోతూ ఉండగా; తేజోరాశి+ అగు= వెలుగుల ప్రోగైన; రాజీవ+అక్షుండు= కమల నేత్రుడు; చని= సభలో ప్రవేశించి; తనకున్= తనకు; ప్రత్యుత్థానంబు+చేసిన= ఎదురుగా వచ్చిన; కురురాజును= ధృతరాష్ట్రుడినీ; దొరలను= ఇతర రాజులను; అభినందించుచున్= మెచ్చుకొంటూ.

తాత్పర్యం: బలసంపన్నులు, సన్నిహితులు అయిన కృతవర్మ మొదలైన యాదవులు తనను అలముకొని వెంటరాగా, తన సన్నిధిలో కౌరవులందరూ భాస్కరుడి మ్రోల తారలవలె, గ్రహములవలె వెలవెల పోతుండగా, వెలుగుల ముద్దఅయిన పుండరీకాక్షుడు కొలువుకూటం లోనికి వచ్చాడు. ధృతరాష్ట్రుడూ, ఇతర ధరాపతులూ శౌరికి ఎదురు వచ్చి ఆహ్వానించారు. శ్రీకృష్ణుడు వారిని అభినందిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: ఉపమ. ధృతరాష్ట్రుడి సభలో ప్రవేశించిన కృష్ణుడు సూర్యుడివలె వెలుగు ముద్దగా వెలిగిపోయాడట. కౌరవులు తారకలవలె, గ్రహాల వలె వెలవెల పోయారట! త్వరలో శ్రీకృష్ణుడు చూపబోయే విశ్వరూపానికి ఈ అలంకారం ధ్వనిసంకేతం. (సంపా.)

క. **తన కని పెట్టిన మణిమయ ।**
కనకోన్నత పీఠమునఁ బ్రకాశంబున ని
ల్చిన యెడఁ దోఁచిరి నారద ।
ముని ప్రముఖు లంతరిక్షమున నుజ్జ్వలులై. 248

ప్రతిపదార్థం: తనకున్+అని= తనకొరకని; పెట్టిన= ఉంచిన; మణిమయ+ కనక+ ఉన్నతపీఠమునన్= రతనాలు చెక్కిన, ఎత్తయిన బంగరు గద్దెపై; ప్రకాశంబునన్= కాంతితో; నిల్చిన+ఎడన్= నిలిచినవేళలో; అంతరిక్షమునన్= ఆకాశమునందు; ఉజ్జ్వలులు+ఐ= దీప్తి మంతులై; నారదముని ప్రముఖులు= నారదుడు మున్నగు మునిపుంగవులు; తోఁచిరి= కనబడ్డారు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు తన కొరకై అక్కడనుంచిన రత్నఖచితమగు ఎత్తయిన బంగారు గద్దెమీద వెలుగులు వెదచల్లుతూ నిలిచి ఉండగా ప్రకాశమానులై నారదుడు మొదలగు మునీశ్వరులు గగనతలంలో కాన్పించారు.

విశేషం: కౌరవ సభలో శ్రీకృష్ణుడిని నిలిపి అతడి చుట్టూ ఒక దివ్య వాతావరణాన్ని ధ్వనింపజేయటం ఈ వర్ణన పరమార్థం. ఎత్తైన చోట మణుల కాంతులతో మెరుస్తున్న బంగారు గద్దె. ఆ గద్దెకే ప్రకాశాన్ని కలిగించే దివ్యతేజోమూర్తి శ్రీకృష్ణుడు. దానికితోడు ఆయన దర్శనం కొరకు వచ్చిన నారదాది దివ్యమునీంద్రులు. నేల శ్రీకృష్ణుడితో ఆకాశానికి అంటింది. నారదాదుల ఆగమనంతో నింగి నేలకు దిగింది. ఇహపరాల అద్భుత సమ్మేళనం శ్రీకృష్ణ సందర్శనం. (సంపా.)

వ. **ఇవ్విధంబున సన్నిహితులయిన యమ్మహామునులం గురుపితా మహునకుం జూపి నారాయణుం డిట్లనియె. 249**

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్= ఈ రీతిగా; సన్నిహితులు+అయిన= అచటికి చనుదెంచిన; ఆ+మహామునులన్= ఆ మహర్షులను; కురుపితా మహునకున్= కౌరవులకు తాత అయిన భీష్ముడికి; చూపి= కనబరిచి; నారాయణుండు; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు అచటికి వచ్చిన మహామునులను కౌరవులకు తాతఅయిన భీష్ముడికి చూపి ఇట్లా అన్నాడు:

ఆ. **మనలఁ జూచువేడ్కఁ జనుదెంచినారు మ ।**
హాత్ములైన నారదాది మునులు;
వీరి కర్ఘ్యపాద్య విధు లొనరించి యా ।
సనము లిడఁగఁ బనుపు సత్వరముగ. 250

ప్రతిపదార్థం: మనలన్= మనలను; చూచువేడ్కన్= చూడవలెననే అభిలాషతో; మహా+ఆత్ములు+ఐన= మహానుభావులైన; నారద+ఆది మునులు= నారదుడు మొదలైన మునీశ్వరులు; చనుదెంచినారు= విచ్చేశారు; వీరికిన్= ఈ మహాపురుషులకు; అర్ఘ్య+పాద్య విధులు= అర్ఘ్యమివ్వటం, పాద్యమివ్వటం అనే ఉపచారాలు; ఒనరించి= చేసి; సత్వరముగన్= తొందరగా; ఆసనములు+ ఇడఁగన్= పీఠాలు వేయటానికి; పనుపుము= పంపుము.

తాత్పర్యం: మనలను చూడవలెననే కుతూహలంతో మహనీయులైన నారదాది మహర్షులు విచ్చేశారు. వీరికి అర్ఘ్య పాద్యాదులైన ఉపచారాలు చేయించు, వారు కూర్చుండటానికి వెంటనే పీఠాలు వేయించు.

వ. వీరలు సముచితాసనంబుల నుండక మనకుఁ గూర్చుండుట తగవుగా'దనినం గొలువువారెల్ల సంభ్రమాశ్చర్యంబులతో మునుల వలనుజూచుచుండ భీష్ముండు పరిచారకులం బనిచి కనక మణిమయాసనంబులనేకంబులు దెప్పింప వార లరుగుదెంచిన వారలకు నమస్కరించి యాసనార్ఘ్య పాద్యాది విధులం బూజలు సేయించి కృష్ణుండు గూర్చున్న యనంతరంబ ధృతరాష్ట్రుండునుం దక్కటివారును నుచిత ప్రకారంబుల నమ్మునీంద్రులకు నభివందనంబులు సేసి నిజాసనా సీనులైరి; దుశ్శాసనుండును వివింశతియును గద్దియ లిడ సాత్యకియుఁ గృతవర్మయుఁ గృష్ణుం గదిసి యిరువంకలం గూర్చుండిరి. కర్ణ దుర్యోధనులుం జేరువ నొక్క గద్దియ నుండిరి. విదురుండును మణిపీఠంబునఁ గృష్ణుని వెనుక దెసఁ దదీయోన్నత పీఠంబునఁ గరంబత్తమిల్లి యుండె; గాంధార రాజు నిజపుత్త్ర పరివృతుండై యొక్క దిక్కున నుచిత పీఠాసీనుండయ్యెఁ; నట్టి సమయంబున. **251**

ప్రతిపదార్థం: వీరలు= నారదాది మునులు; సముచిత+ఆసనంబులన్+ ఉండక= తగిన పీఠాలపై కూర్చుండక; మనకున్; కూర్చుండుట; తగవు+ కాదు= ధర్మంకాదు; అనినన్= అని శ్రీకృష్ణుడు పలుకగా; కొలువువారు+ ఎల్లన్= సదస్యులందరూ; సంభ్రమ+ ఆశ్చర్యములతోన్= సంతోషాద్భుతములతో; మునుల వలను= ఆ మునీశ్వరులవైపు; చూచుచున్+ఉండన్; భీష్ముండు; పరిచారకులన్+పనిచి= సేవకులను పంపి; కనకమణిమయ+ అసనంబులు= బంగారు రత్నాలు తాపిన పీఠాలు; అనేకంబులు= పెక్కు; తెప్పింపన్; వారలు= ఆ నారదాదులు; అరుగుదెంచినన్= (సభకు)రాగా; వారలకున్; నమస్కరించి; ఆసన+అర్ఘ్య పాద్య+ఆదివిధులన్= ఆసనాలివ్వటం; అర్ఘ్యమివ్వటం; పాద్యమొసగటం మొదలైన ఉపచారాల చేత; పూజలు= అర్చనలు; చేయించి; కృష్ణుఁడు; కూర్చున్న+ అనంతరంబు+అ= కూర్చున్న తరువాతనే; ధృతరాష్ట్రుండునున్; తక్కటివారును= మిగిలినవారున్నూ; ఉచిత ప్రకారంబులన్= తగురీతుల; ఆ+ముని+ఇంద్రులకున్= ఆ నారదాది ముని పుంగవులకు; అభివందనంబులు చేసి= ప్రణామాలు సలిపి; నిజ+ ఆసన+ ఆసీనులు+ఐరి= తమ తమ పీఠాలందు కూర్చున్నారు; దుశ్శాసనుండును, వివింశతియును; గద్దియలు+ఇడన్= పీఠాలుంచగా; సాత్యకియున్; కృతవర్మయున్; కృష్ణున్, కదిసి= ఆనుకొని; ఇరువంకలన్= రెండువైపుల; కూర్చుండిరి; కర్ణ దుర్యోధనులున్; చేరువన్= చెంతనే; ఒక్క గద్దియన్; ఉండిరి; విదురుండును; మణిపీఠంబునన్; కృష్ణుని; వెనుకదెసన్= వెనుకవైపున; తదీయ+ఉన్నత పీఠంబునన్= ఎత్తైన గద్దియమీద; కరంబు= మిక్కిలి; అత్తమిల్లి= ఒరిగి; ఉండెన్= ఉన్నాడు; గాంధార రాజు= శకుని; నిజపుత్త్ర పరివృతుండు+ఐ= శకుని తన కుమారులతో చుట్టబడినవాడై; ఒక్క దిక్కునన్= ఒక దెస; ఉచితపీఠ+ఆసీనుండు+అయ్యెన్= తగిన గద్దెపై ఉన్నాడు; అట్టి సమయంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: 'నారదాది మహామునులు తగిన పీఠాలపై కూర్చుండకుండా మనం కూర్చుండటం న్యాయం కాదు' అని శ్రీకృష్ణుడు భీష్ముడితో చెప్పాడు. సదస్యులంతా తొట్రుపాటుతో ఆశ్చర్యపడి ఆ మునులవైపే చూస్తుండి

పోయారు. భీష్ముడు సేవకులను పంపి మణులు తాపిన బంగారు గద్దెలు పెక్కింటిని తెప్పించాడు. ఇంతలో మునీశ్వరు లచటికి విచ్చేయగా పరమాత్ముడు వారికి నమస్కరించి, ఆసనమివ్వటం, అర్ఘ్య పాద్యాదు లొసంగటం మొదలైన దివ్యోపచారాలతో పూజలు చేయించాడు. వాసుదేవుడు కూర్చున్న పిదప ధృతరాష్ట్రుడున్నూ, మిగిలిన వారున్నూ తగిన రీతుల ఆ మునిపుంగవులకు నమస్కారాలు చేసి తమ తమ పీఠాలపై ఆసీనులయ్యారు. దుశ్శాసనుడు, ధార్తరాష్ట్రులలో పదిహేడవవాడగు వివింశతి అనే అతడు గద్దె లిడగా సాత్యకి, కృతవర్మ శ్రీకృష్ణుడికి రెండువైపులా ఆనుకొని కూర్చున్నారు. కర్ణుడు, దుర్యోధనుడు ఆ సమీపంలో ఒకే పీఠాన ఉండినారు. విదురుడు వెనుక తట్టుగా మురారి యొక్క ఎత్తైన గద్దెమీదికి వ్రాలి మణిపీఠంమీద కూర్చున్నాడు. గాంధార రాజైన శకుని తన కొడుకులతో ఒక తట్టు తగిన గద్దెమీద తానుండినాడు. ఇట్టిసమయంలో.

విశేషం: 1. శ్రీకృష్ణుడు నిలిచిన సభ లౌకికత్వం మీద దివ్యత్వం ఆవేశించిన ట్లుంటుంది. కురువీరులందరూ లేచి దివ్యమునులకు ఆసనాలిచ్చి కూర్చొనబెట్టారు. శ్రీకృష్ణుడి దివ్య సందేశం వినటానికై వచ్చిన మహర్షులు వారు. శ్రీకృష్ణుడి సందేశం యొక్క గొప్పదనాన్ని మునిగణం మౌనంగా వ్యాఖ్యానించి చెపుతున్నట్లున్నది.

2. దేవర్షులు కూర్చున్న తరువాత శ్రీకృష్ణుడు కూర్చున్నాడు. ఆ తరువాత ధృతరాష్ట్రుడు, ఆ తరువాత సభ్యులు కూర్చున్నారు. సభ నంతా శ్రీకృష్ణాధీనమైన ఒక దివ్యానుభూతి వాతావరణం అలముకొన్నది.

3. సభలో భద్రతా విశేషాలు ప్రత్యేకంగా గమనించదగినవి. అవి ఆసనాలు అమర్చటంలో స్పష్టమౌతున్నది. శ్రీకృష్ణుడి భద్రత అత్యంత ముఖ్యం. అందుకే ఆయన కిరుప్రక్కల సాత్యకీ, కృతవర్మా కూర్చున్నారు - అంగరక్షకులవలె. విదురుడు వెనుకభాగంలో ఒదిగి కూర్చున్నాడు. అంటే మూడు దిక్కులా

నమ్మిన బంటులవంటి వారు శ్రీకృష్ణుడికి రక్షా కవచంవలె వ్యాపించి కూర్చున్నారు. శ్రీకృష్ణుడికి ఎదురు బడి ఎవరూ నిలవలేరని ధ్వని.

4. శ్రీకృష్ణుడికి కొద్ది దూరంలో ఒక ప్రక్కన కర్ణదుర్యోధనులు ఒకే సింహాసనం మీద కూర్చున్నారు. తనువులు వేరైనా మనసులు ఒకటే సుమా! అని వారి నేస్తం ఆ కూర్చోటంలో ధ్వనించబడుతున్నది. వారిద్దరూ శ్రీకృష్ణుడిని బంధించటానికి అనువైన దూరంలో కూర్చున్నారు. శకుని సకుటుంబంగా ఆ సమీపంలో ఉన్నాడు. దుశ్శాసనుడు అన్నకు నీడగా ఉంటాడు. దుష్టచతుష్టయం దాడికి అనువుగా సభలో కూర్చున్నది. ఈ విధంగా సభాసదులు కూర్చొనటంలో కూడా వ్యూహరచన మున్నట్లు చిత్రించటం రాజకీయ సభ ప్రాశస్త్యాన్ని తెలుపుతున్నది. ఉద్యోగపర్వ సభలో ఇది అన్ని విధాలా ఉన్నతమైన రాజ్య (రాజకీయ) సభ. (సంపా.)

క. అంబుద శుభగాత్రుం బీ।
తాంబరధరుఁ గమలదళ నిభాక్షున్ హరిఁ జూ
డం బడసి లోచనము లమృ।
తం బానిన మాడ్కి సమ్మదంబునఁ దేలన్. 252

ప్రతిపదార్థం: అంబుద శుభగాత్రున్= మేఘం వంటి మంగళకరమైన శరీరం కలవాడును; పీత+అంబరధరున్= పచ్చని పట్టు పుట్టం కట్టినవాడును; కమలదళ నిభ+అక్షున్= తామర రేకులతో సమానమైన కన్నులు కలవాడును; అగు; హరిన్= శ్రీకృష్ణుడిని; చూడన్+పడసి= చూచే భాగ్యంపొంది; లోచనములు= నేత్రాలు; అమృతంబు+ఆనినమాడ్కిన్= సుధారసమును గ్రోలిన విధాన; సమ్మదంబునన్= ఆనందమునందు; తేలన్= తేలగా.

తాత్పర్యం: మేఘవర్ణంవలె సుందరమైన దేహవర్ణం కలవాడూ, పచ్చని పట్టుపుట్టం ధరించినవాడూ, తామర రేకులతో సమానమైన నయనాలు కలవాడూ, అయిన శ్రీహరిని చూడనోచినందులకు సభలోనివారి కన్నులు

అమృతరసాన్ని గ్రోలినట్లు ఆనందంలో ఓలలాడాయి.

విశేషం: అలం: ఉపమ. 1. రాజనీతికి ఈ రాయబారపు ఘట్టం శిఖరాయమాణం. అందులో శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం మకుటాయమానం. ఈ ఘట్టాన్ని అటు వ్యాసమహర్షి, ఇటు తిక్కన సోమయాజీ అద్భుతంగా చిత్రించారు.

2. సభలో అందరినీ ఆకర్షించేది వక్త యొక్క రూపవైభవం. అంటే ఆంగిక, ఆహార్య అభినయ సంపద. శ్రీకృష్ణుడు కన్నుల పండుగ కలిగించే మధురాకృతి కలవాడు. వ్యాసమహర్షి మాటలలో.

'అతసీ పుష్ప సంకాశః పీతవాసా జనార్దనః
వ్యభ్రాజత సభామధ్యే హేమ్నీవోపహితో మణిః' (సం. 5-92-52)

నల్లని అవిసెపూవు వంటి మేనికాంతి కలవాడూ, పచ్చని పట్టువస్త్రం ధరించినవాడూ అయిన శ్రీకృష్ణుడు సభామధ్యంలో బంగారంలో పొదిగిన ఇంద్రనీలమణివలె ప్రకాశించాడు- అని వ్యాసుడు వర్ణించాడు. తిక్కన శ్రీకృష్ణుడిని అంబుదశుభగాత్రుడుగా మొదట పేర్కొన్నాడు. సర్వజనుల కన్నులనూ, హృదయాలనూ ఆకర్షించేది శ్రావణమేఘం. పచ్చని పట్టువస్త్రం కట్టటం శ్రీకృష్ణుడి నైజం. ఆ రంగు చూచేవారికి శాంతిని ప్రసాదిస్తుంది. ఆ తరువాత తిక్కన-మూలంలో ప్రస్తావించబడని కమలదళనిభాక్షులను వర్ణించాడు. విశాలాక్షుడని విష్ణువుకు పెట్టింది పేరు. ప్రకృతి నుండి పురుషోత్తముడి వరకు, భౌతికం నుండి ఆధ్యాత్మికం వరకు, సౌందర్యం నుండి కారుణ్యం వరకు వ్యాపించి ఉన్న ఒక దివ్యచైతన్యం రూపుతాల్చిన అనుభవం. గాత్రం ఇంద్రియాలను, అంబరం మనస్సును, కమలాక్ష దృష్టి ఆత్మను ఆకట్టుకొనే స్వభావం కలవి. వీటన్నిటినీ తిక్కన ఒకచోట కూర్చాడు.

3. శ్రీకృష్ణుడు ఒక దివ్యాదివ్యవిభావం. ఆయనను చూచిన సభాసదులు మూడంచెల అనుభూతిని పొందారు. క్రమంగా అన్వయించుకొంటే 'అంబుదనిభ గాత్రుడి'ని చూచి కన్నులు ఆనందించాయి. పీతాంబరధరుడిని చూచి మనస్సులు అమృతం త్రాగిన అనుభూతిని పొందాయి. కమలదళాక్షుని కరుణామయ విశాలదృక్కులను చూచి ఆత్మలు ఆనందాంబుధిలో తేలినట్లున్నవి. తిక్కన అలంకారధ్వని ఇక్కడ గమ్యమానం. మూడు రకాల అనుభవాన్ని ఒక ఉపమాలంకారంలో సూచించాడు. కన్నులు అమృతరసాన్ని గ్రోలి ఆనందంలో తేలాయట! ఇది అలంకారాన్ని మించిన ధ్వనిమయ భావచిత్రం.

4. సభలో అందరినీ ఆకర్షించే రూపం, వేషం, అభినయం (దృష్టి) అనే మూడంశాలు ముప్పిరిగొని ముచ్చట కొలపటం నాటకీయత. (సంపా.)

క. ఆ కొలువువారు కర మచ
లాకృతి నొక పలుకులేక యందఱు వింజం
బాఁకిడిన కరణి నవశ ము
దాకారిత చిత్తవృత్తులై యుండంగన్. 253

ప్రతిపదార్థం: ఆ కొలువువారు= ధృతరాష్ట్రుడి కొలువుకూటంలో ఉన్నవారు; కరము= మిక్కిలి; అచల+ఆకృతిన్= కదలని రూపాలతో; ఒక పలుకులేక= ఏమియు మాటాడక; అందఱున్= ఎల్లరు; వింజంబు= వింధ్య పర్వతం; ఆఁక+ఇడిన కరణిన్= అడ్డపడిన తీరున; అవశ+ముద్+ఆకారిత+చిత్తవృత్తులు+ఐ= పారవశ్యం, సంతోషం రూపుగొన్న మనోవ్యాపారం కలవారై; ఉండంగన్= ఉండగా. (తరువాతి పద్యంతో అన్వయం)

తాత్పర్యం: మేరుగిరి చుట్టూ ప్రదక్షిణం చేస్తున్న సూర్యుడి భ్రమణాన్ని వింధ్యపర్వతం నిరోధించిన వేళ సృష్టి నిశ్చలమైనట్లు ధృతరాష్ట్రుడి కొలువు కూటంలోని వారందరూ శ్రీకృష్ణ సందర్శనంతో తమ మనస్సులు సంతోష పరవశాలు కాగా ఇట్టట్టు చలింపక నోట మాటలేక అట్లే స్తంభించిపోయారు.

విశేషం: అలం: ఉపమ. 1. శ్రీకృష్ణుడి దివ్య దర్శనం చేసికొంటున్న సభాసదుల స్థితిని తిక్కన ఉపమాలంకార సుందరంగా వర్ణించాడు. తెలుగుదనం ఒలకపోశాడు.

2. సభాసదుల అవస్థలన్నీ సాత్త్వికాభినయ విశేషాలు కావటం చేత అవి తెచ్చిపెట్టుకొన్నవి కాక శ్రీకృష్ణ దర్శనం వలన పొంగిన సాత్త్వికచిత్తవృత్తి జన్యమైన సహజాభినయ విశేషాలని స్పష్టం.

3. ఇందులో మూడు రకాలైన అవస్థలు వర్ణించబడ్డాయి. 1. 'కరమచలాకృతి' అవస్థ. మిక్కిలి కదలని ఆకృతితో ఉన్నారట! లేదా, శ్రేష్ఠమైన పర్వతంవలె స్థిరమైన ఆకృతితో సభ్యులున్నారట. అంటే ఆశ్చర్యజన్యమైన స్తంభావస్థలో ఆంగికాభినయాన్ని ప్రదర్శిస్తున్నారన్న మాట. స్తంభావస్థలో వాచికాభినయం ఉండకపోవటం సహజం. అందుకే 'ఒక పలుకు లేక' ఉండిపోయారు. ఇవి అభినయావస్థలు.

4. ఇక వారి చిత్తవృత్తులు 'వింజం బాకిడిన కరణి' నవశముదాకారిత చిత్తవృత్తులై ఉన్నట్లు తిక్కన విశేషంగా వర్ణించాడు. వింధ్యపర్వతం అడ్డుపడితే జనులు సూర్యచంద్రుల గతిని గమనించలేక కాలజ్ఞానాన్ని కోల్పోయారట. ఆ అనుభవాన్ని తెలుగులో జాతీయంగా భద్రపరచుకొన్నారు తెలుగువారు. అంటే, శ్రీకృష్ణుడి దివ్యాకారాన్ని చూస్తూ కాలాన్ని మరచిపోయారు. దానికి కారణం- వారందరూ పారవశ్యంతో కూడుకొన్న ఆనందమే ఆకారంగా రూపుదాల్చిన చిత్తవృత్తులు కలవారయ్యారు. ఇది తన్మయావస్థ. (సంపా.)

శ్రీకృష్ణుఁడు ధృతరాష్ట్రునితో సంభాషించుట (సం. 5-93-1)

క. జలదస్వన గంభీరత।
నెలుఁగొప్పఁగ దంత దీప్తు లెసఁగ ముకుందుం
డలరుచు సభ నఖిల జనం।
బులు విన ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్. 254

ప్రతిపదార్థం: ముకుందుఁడు= శ్రీకృష్ణుడు; జలదస్వన గంభీరతన్= మేఘధ్వనియొక్క గాంభీర్యంతో; ఎలుఁగు+ఒప్పఁగన్= తన కంఠధ్వని

సొంపారగా; దంత దీప్తులు+ ఎసఁగన్= దంతాల యొక్క కాంతులు అతిశయించగా; సభన్= సభలో; అలరుచున్= ప్రకాశిస్తూ; అఖిలజనంబులు= ధృతరాష్ట్రుడి కొలువులోనున్న సమస్త ప్రజలు; వినన్= ఆలకించగా; ధృతరాష్ట్ర భూవిభునకున్= ధృతరాష్ట్ర మహారాజునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా వచించాడు.

తాత్పర్యం: శ్రీకృష్ణుడు మేఘధ్వనివలె గంభీరమైన తన కంఠధ్వనితో, దంతాల కాంతులు ప్రసరిస్తూ ఉండగా సభలో వెలుగొందుతూ సదస్యులందరూ చెవులు నిక్కించుకొని ఆలకిస్తుండగా ధృతరాష్ట్ర మహారాజుతో ఇట్లా అన్నాడు:

విశేషం: 1. అలం: ఉపమ. శ్రీకృష్ణుడి కంఠస్వరం మేఘ గర్జనవలె గంభీరంగానూ, హృదయంగమంగానూ ఉన్నది. దానికి తోడు ఆయన దంతకాంతులు మెరుపుల వలె మెరిసిపోతున్నాయి. వర్షాకాల ప్రకృతి రామణీయకం కాల్పనిక సౌందర్యంతో శ్రీకృష్ణుడియందు దర్శనమిస్తున్నట్లు తిక్కన చిత్రించి, సందేశ ఘట్టానికి పూర్వరంగ ప్రక్రియను నిర్వహించాడు. చెప్పేవాడు గొప్పవాడైతే చెప్పేది గొప్పగా రాణిస్తుంది. (సంపా.)

క. 'జననాథ! నీ యెఱుంగని।
పనులు గలవె? యైనఁ దగవుఁ బరమహితంబుం
దనవారికిఁ జెప్పన తగు।
నని వచ్చితి భారతాన్వయము ప్రియమొందన్. 255

ప్రతిపదార్థం: జననాథ!= రాజా ధృతరాష్ట్రా!; నీ+ఎఱుంగని+పనులుకలవె?= నీకు తెలియని కార్యాలున్నాయా?; ఐనన్= అయినప్పటికీ; తగవున్= న్యాయాన్ని; పరమ హితంబున్= మిక్కిలి శ్రేయస్కరమైనదానిని; భారత+ అన్వయము= భరతుడు జన్మించిన కురువంశము; ప్రియము+ఒందన్= సంతోషపడగా; తనవారికిన్= నా వారికి; చెప్పన్+ అ+తగున్+అని= చెప్పటమే ఉచితమని; వచ్చితిన్= ఇక్కడికి వచ్చాను.

తాత్పర్యం: 'మహారాజా! నీ వెరుగని కార్యా లేమున్నాయి? ఐనప్పటికీ, భరతవంశం సంతోషించేటట్లు నా ఇరుకుటుంబాలవారికీ న్యాయమూ, పరమహితమూ చెప్పటం ఉచితమని నేనిక్కడికి వచ్చాను.

విశేషం: 1. శ్రీకృష్ణుడి గంభీరోపన్యాసం ఇక్కడి నుండి ప్రారంభమౌతున్నది. ఉపన్యాసానికి ఉపక్రమణిక ఊపిరి. ఎత్తుగడలోనే వక్త శ్రోతల చిత్తాలను ఆకర్షించాలి. అందుకై శ్రీకృష్ణుడు నాలుగంశాలను తొలి పలుకులలో తోచేటట్లు చెప్పాడు. అవి-(1) సంబుద్ధి (2) వినయవచనం (3) వక్త లక్ష్యం (4) ప్రయోజనం.

2. 'జననాథ!' అన్న సంబుద్ధి సార్థకం. ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడి మాటలను కౌరవులకు తండ్రిగా కాక, ప్రజలకు ప్రభువుగా వినాలని ధ్వని. ఇందులో వంశం కంటె ప్రజల యోగక్షేమం ముఖ్యమని సూచన. లోకక్షేమం కొరకే శ్రీకృష్ణుడి బోధ అని ధ్వని.

3. పెద్దల ముందు ఉపన్యసించేటప్పుడు వివేకవంతుడు వినయోక్తులతో మొదలు పెట్టాలి. దాని వలన వక్త యొక్క నిరహంకార ప్రవృత్తి వ్యక్తమై శ్రోతల ఆభిముఖ్యం ఏర్పడుతుంది. శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి ఆభిముఖ్యాన్ని సాధించ యత్నించాడు రెండవ అంశంలో.

4. శ్రీకృష్ణుడు తన ఉపన్యాసానికి లక్ష్యాన్ని వివరించాడు మూడవ అంశంగా. కౌరవులందరూ తనవారని అనుకొని వారితో తన అభిప్రాయం చెప్పటం న్యాయమని భావించి శ్రీకృష్ణుడు హస్తినకు వచ్చాడట! ఆ మాటలలో రెండు లక్ష్యాలున్నాయి. 1. న్యాయం 2. పరమహితం ఏర్పడేటట్లు చెప్పటం.

5. ఆ చెప్పటం వలన భారతాన్వయమంతా సంతోషించే ప్రయోజనం సాధించబడుతుందని సూచించాడు. లక్ష్య ప్రయోజనాల నిర్దేశం వలన వక్తవ్యాంశం మీద ఆసక్తి అంకురిస్తుంది.

6. అవధాన సాధనమే ఈ పద్య ప్రయోజనం. ప్రసాద గుణభూయిష్ఠమైన రచన దీనికి ప్రాణం. (సంపా.)

క. క్షీరోదక గతిఁ బాండవ ।
కౌరవు లొడఁగూడి మనికి కార్యం బది నీ
వారసి నడపుము వా రన ।
వీ రనఁ గురుముఖ్య! నీకు వేఱుంగలదే? 256

ప్రతిపదార్థం: కురుముఖ్య!= కురువంశంలో ప్రధానమైనవాడా!; క్షీర+ఉదకగతిన్= పాలూ, నీరూవలె; పాండవ కౌరవులు= పాండవులున్నూ కౌరవులున్నూ; ఒడన్+కూడి= ఒద్దిక కలిగి; మనికి= జీవించటం; కార్యంబు= చేయదగినపని; అది= దానిని; నీవు= నీవు; ఆరసి= పరికించి; నడపుము= సాగించుము; నీకున్= నీకు; వారు+అనన్= పాండవులనగా; వీరు+అనన్= కౌరవులనగా; వేఱున్+కలదే= భేదమున్నదా? (లేదని అర్థం.)

తాత్పర్యం: కురునాథా! పాండవ కౌరవులు పాలూ నీరూ వలె కలసి మెలసి జీవించటం మంచిపని. వారు అట్లా ఒద్దికతో ఉండేటట్లు నీవు వారిని నడపించవలసింది. పాండవులు వేరు, కౌరవులు వేరు అనే భేదబుద్ధి నీకు లేదు కదా!

విశేషం: అలం: ఉపమ, యథాసంఖ్యం. కురుముఖ్యుడుగా ధృతరాష్ట్రుడు చేయవలసిన బాధ్యతను ఇక్కడ శ్రీకృష్ణుడు చెప్తున్నాడు. 1. పాండవ కౌరవులు పాలూనీరువలె కలిసి ఉండటం కాదగిన కార్యం. 2. అట్లా జరగాలంటే ధృతరాష్ట్రుడు కౌరవపాండవులను సమంగా చూడాలి. ఇందులో మొదటిది న్యాయం. రెండవది హితం.

2. కౌరవ పాండవులు కలిసి ఉండాలి అన్నప్పుడు చాలవరకు ఈ ఘట్టంలో అందరూ క్షీరోదక సామ్యాన్నే స్వీకరించారు. అయితే ధృతరాష్ట్రుడు కౌరవపాండవులు క్షీరోదకాల వంటివారన్నాడు. (1.263), భీముడు పాండవ కౌరవులను క్షీరోదకా లన్నాడు. (3.47). శ్రీకృష్ణుడు పాండవ పక్షం వాడే కాబట్టే వారు పాలవలె బలవంతులనీ, కౌరవులు నీరువలె బలహీనులనీ, పాండవుల నాశ్రయించి బ్రతకటమే ధార్తరాష్ట్రులకు క్షేమమనీ భావించాడు. (సంపా.)

చ. భరతకులంబు ధర్మమును బాడియు సత్యముఁ బొత్తుఁ బెంపునుం
గరుణయుఁ గల్గి యుండు ననఁగా నుతిఁ గన్నది; యందు సద్గుణో
త్తరులరు నీవు నీ యనుఁగుఁ దమ్ముఁడు; నీ తనయుల్ యశోధురం
ధర శుభ శీలు; రీ సుచరిత క్రమ మిప్పుడుఁ దప్పనేటికిన్? 257

ప్రతిపదార్థం: భరతకులంబు= భరతుడు జన్మించిన కురువంశం; ధర్మమును= ధర్మమూ; పాడియున్= న్యాయమూ; సత్యమున్= సూనృతమూ; పొత్తున్= ఐకమత్యమూ; పెంపునున్= గొప్పతనమూ; కరుణయున్= కృపయూ; కల్గి+ఉండున్+ అనఁగాన్= కల్గియుంటుందని; నుతిన్+కన్నది= ప్రఖ్యాతి వహించింది; అందున్= అట్టి వంశంలో; నీవున్= నీవూ; నీ+అనుఁగుఁ దమ్ముఁడున్= నీ ప్రియమైన తమ్ముడు పాండురాజూ; సద్గుణ+ఉత్తరులరు= మంచి గుణాలచేత శ్రేష్ఠులు; నీ తనయుల్= నీ కొడుకులున్నూ నీ తమ్ముడి కొడుకులున్నూ; యశోధురంధర శుభశీలురు= కీర్తి భారాన్ని వహిస్తున్న మంచి స్వభావం కలవారు; ఈ సుచరితక్రమము= పరంపరగా వస్తున్న ఈ మంచి నడవళ్ళతీరును; ఇప్పుడున్= ఇప్పుడుకూడా; తప్పన్+ఏటికిన్?= విడుచుట ఎందులకు?

తాత్పర్యం: మహారాజా! మీ భరతవంశం ధర్మం న్యాయం సత్యం ఐకమత్యం గౌరవం కారుణ్యం మొదలైన సద్గుణాలు గలిగి పొగడ్త కెక్కింది. అట్టి వంశంలో నీవూ, నీ ప్రియ సహోదరుడు పాండురాజూ, సద్గుణాలయందు శ్రేష్ఠులు, మరి నీ కుమారులో కీర్తి భారం వహించజాలినవారు, కళ్యాణ స్వభావులు. ఇంత మంచి నడవడిగల వంశసంప్రదాయం ఇపుడు కూడా తప్పించటమెందుకు?

విశేషం: 1. వెనుకటి పద్యంలో ధృతరాష్ట్రుడు నిర్వహించవలసిన బాధ్యతలు అవశ్య కర్తవ్యాలని చెప్పటానికి శ్రీకృష్ణుడు ఉపపత్తులను ఏకరువు పెట్టుతున్నాడు. వాటిల్లో మొదటిది వంశగౌరవ సంప్రదాయ పరిరక్షణ. దానిని వివరించా డీ పద్యంలో.

2. భరతవంశం ఆరు గుణాలకు ప్రసిద్ధి. వాటిని ఈ క్రమంలో చెప్పుకొనాలి. (1) ధర్మం - వేదశాస్త్రాదులలో ప్రతిపాదించిన విధి. (2) న్యాయం - లోకహితాన్ని కలిగించే సాంఘిక మర్యాద. (3) సత్యం - నిజం మాట్లాడటం, నిజం భావించటం, నిజం పాటించటం (4) పొత్తు - అరమరికలు లేక ఒకరి మేలు ఒకరు కోరుతూ కలసి మెలసి ఉండటం. (5) గౌరవం - వ్యక్తిసుఖం కంటె వంశానికి కళంకం రాకుండా గౌరవం కలిగేటట్లు వర్తించటం (6) కరుణ - సర్వజీవ హితభావం.

3. భరతవంశంలో కొందరు కొన్ని కొన్ని గుణాలు ఆచరించి ఉండవచ్చును. కాని, పాండురాజూ, ధృతరాష్ట్రుడూ అన్ని గుణాలను ఆచరించేవారిలో అగ్రగణ్యులుగా పరిగణించబడతారు. ఈ మాట ధృతరాష్ట్రుడి యందు సత్యం కాకపోయినా ముందుకాళ్ళకు బంధంగా శ్రీకృష్ణుడు అట్లా పొగిడాడు. 'నీతనయుల్' అనే మాట పాండవ కౌరవుల కిద్దరికీ వర్తిస్తుంది. తండ్రి లేని పాండవులను ధృతరాష్ట్రుడే తండ్రిగా పెంచి పెద్దవాళ్ళను చేశాడని తాత్పర్యం. కౌరవ పాండవులు యశోధురంధర శుభశీలురట! యశస్సు, వంశ గౌరవ పరిరక్షణ వలననే కలుగుతుందని ధ్వని. ఆ మంచి వంశ సంప్రదాయాన్ని మానవద్దని హితవు చెప్పాడు. ఈ పద్యం హితోక్తి. (సంపా.)

శా. ఈ వంశంబున కెల్ల నీవ కుదు; రిం దెవ్వారి చందంబు లె
ట్లై వర్తిల్లినఁ గీడు మేలుఁ దుది నీయం దొందెడుం గాన స
ద్భావం బారసి లోనిపొత్తు వెలివృత్తంబున్ జనస్తుత్యముల్
గావింపం దగు నీక యెవ్విధమునం గౌరవ్యవంశాగ్రణీ! 258

ప్రతిపదార్థం: కౌరవ్యవంశ+అగ్రణీ!= కురువంశంవారిలో శ్రేష్ఠుడా!; ఈ వంశంబు నకున్+ఎల్లన్= ఈ కురుకులాని కంతటికీ; నీవు+అ= నీవే; కుదురు= ఆశ్రయం; ఇందున్= ఈ కురు వంశస్థులలో; ఎవ్వారి చందంబులు= ఎవ్వరి నడవడులు; ఎట్లు+ఐ వర్తిల్లినన్= ఏ విధంగా ఉండునో

వాటిననుసరించి, కీడు= హాని, మేలు= వృద్ధి; తుదిన్= కడపటికి; నీఅందున్+ ఒందెడున్= నీకే చెందగలవు; కానన్= కనుక; సద్భావంబు+ఆరసి= మంచి తలంపునకు వచ్చి; లోనిపొత్తు= అంతరంగంలో ఒద్దిక; వెలివృత్తంబున్= బహిరంగ ప్రవర్తన; జనస్తుత్యముల్= ప్రజలచేత మెచ్చదగినవిగా; కావింపన్= చేయటానికి; నీకున్+అ= నీకే; ఏ విధమునన్= ఏ విధంగానైనా; తగున్= యోగ్యం.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! నీవు కురువంశస్థులలో అగ్రేసరుడివి. ఈ వంశాని కంతటికీ నీవే ఆధారం. నీ కుటుంబంలో ఎవ్వరెవ్వరి నడవడికలు ఎట్టెట్లుగా ఉంటాయో వాటినిబట్టి కలిగే మేలు కీళ్ళు నీకే చెందుతాయి. కాబట్టి నీవు ఇరు కుటుంబాల వారి శ్రేయస్సు నూహించి అంతరంగ స్నేహం, బహిరంగ ప్రవర్తన జనులు మెచ్చేటట్లుగా ఏవిధంగానైనా వారిని చక్కదిద్దవలసి ఉంటుంది.

విశేషం: కౌరవ్య వంశాగ్రణీ! అనే పిలుపు సాభిప్రాయం. ధృతరాష్ట్రుడు కౌరవవంశరాజులలో అగ్రగణ్యుడు కావాలంటే ఈ తగవు (న్యాయం) పాటించాలని శ్రీకృష్ణుడు నిర్దేశించాడు. 1. ఇప్పుడు ఈ వంశానికంతా నీవే ఆధారం. అతడు న్యాయంగా వ్యవహరిస్తే వంశం నిలుస్తుంది. లేదా వంశం అతడితోనే అంతమౌతుంది. అంతటి కీలకమైనది ఆయన వర్తనం.

2. వంశంలో ఇతరులు అతడిని కాదని ఏమి చేసినా, దానివలన కలిగే కీడుగాని, మేలుగాని ధృతరాష్ట్రుడే అనుభవించవలసి వస్తుంది.

3. కాబట్టి కుటుంబ శ్రేయస్సును భావించి, మనసూ మాటా ఒకటిగా తలంచి, జనులు మెచ్చేటట్లు వ్యవహరించాలి.

4. ఏ విధంగా చూచినా ఈ బాధ్యత మరెవ్వరిదీ కాదు. ధృతరాష్ట్రుడిదే. కాదని తప్పించుకొనటం న్యాయం కాదు- అని శ్రీకృష్ణుడు స్పష్టపరిచాడు. తరతరాల వంశ సంప్రదాయ గౌరవం ఒక్క ధృతరాష్ట్రుడి వర్తనం మీదనే ఆధారపడి

ఉన్నదనీ, వంశ చరిత్రలో ధృతరాష్ట్రుడు కీలకమైన పాత్ర నిర్వహించవలసి వచ్చిందనీ, న్యాయంగా వ్యవహరించి కౌరవ్యవంశాగ్రణి కావాలనీ శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. (సంపా.)

చ. వినుము! సుయోధనాదులగు వీరు సధర్ములు గాక కార్యము
ల్గొనక మహార్థసిద్ధి యెడలుం దమ కిట్లన కన్వయంబు వ
ర్తనమిది గాదు నాక బెడిదంపుఁదనంబున బంధుకోటికి
న్మనసులు నొవ్వఁగా నవగుణంబులకుం బుయిలోడ రేమియున్.259

ప్రతిపదార్థం: వినుము= మహారాజా, నామాటలాలకించవలసింది; సుయోధన+ఆదులు+ అగు+వీరు= దుర్యోధనుడు మొదలుగా గల్గిన నీ కుమారులు; సధర్ములు కాక= ధర్మము ననుసరించే వారుకాక; కార్యముల్+ కొనక= చేయదగిన మంచి పనులు చేయక; ఇట్లు= ఈ రీతిగా మెలగితే; తమకున్= తమకు; మహా+అర్థసిద్ధి= గొప్ప ప్రయోజనాలు చేకూరుట; ఎడలున్+అనక= తొలగిపోవునని తలంచక; అన్వయంబు వర్తనము= వంశపు నడవడి; ఇది కాదు= ఇటువంటిది కాదు; నాక= అనక; బెడిదంపుఁ దనంబునన్= దారుణ స్వభావంతో; బంధుకోటికిన్= బంధువర్గానికి; మనసులు నొవ్వఁగాన్:= హృదయాలు వ్యథ చెందేటట్లు; అవగుణంబులకున్= దుర్గుణాలకు; ఏమియున్= ఇంచుకయు; పుయిలోడరు= వెనుదీయరు.

తాత్పర్యం: రాజా! వినుము. దుర్యోధనాదులైన వీరు ధర్మపరులుగాక, సత్కార్యాలాచరించక, ఇట్లా ఉంటే మహార్థసిద్ధికి దూరమవుతామని తలంచక, వంశపునడవడి ఇట్టిది కాదనక, దారుణ బుద్ధితో బంధువుల మనస్సులు బాధచెందేటట్లుగా దుష్టచేష్టలు చేయటానికి ఏమాత్రం వెనుదీయకున్నారు.

విశేషం: భరతవంశం సద్గుణాలకు నిలయం. మరి ధృతరాష్ట్రుడి కొడుకులు అవగుణాలకు ఆశ్రయాలు. కాబట్టి దుశ్చేష్టలు చేయటానికి వెనుకాడరు.

వంశపురుషులకు కౌరవులకూ ఉన్న భేదాన్ని శ్రీకృష్ణుడు చక్కగా విశ్లేషించాడు. వారు సధర్ములు- వీరు అధర్ములు. వారు న్యాయవర్తనులు - వీరు మంచి పనులు చేపట్టరు. వారు సత్యనిష్ఠులు - వీరు మహార్థసిద్ధిని లెక్కచేయని అసత్యనిష్ఠులు. వారు వంశజులందరూ కలసి మెలసి ఉండాలనేవారు. వీరు అన్వయ వర్తనాన్ని గౌరవించనివారు; వారు వంశౌన్నత్యానికి కృషి చేశారు. వీరు బంధుకోటి మనసులను బాధపెట్టి వంశగౌరవాన్ని మట్టి కలిపారు. వారు కరుణామూర్తులు - వీరు పాపకర్మలకు వెనుకాడని కఠినాత్ములు. ఈ విధంగా కౌరవులు భరత వంశ సంప్రదాయాన్ని చట్టుబండలు చేశారని స్పష్టంగా చెప్పాడు. వీరివలననే వంశ క్షయం కలుగుతుందని ధ్వనింపచేశాడు. (సంపా.)

ఉ. కౌరవ పాండవుల్ తెఅఁగు గైకొని శాంతతఁ బొందియున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు నీ నృపకోటి కుర్వికిం
బోరితమైన నింతకును బుట్టు మహాపద గావునన్ ధరి
త్రీ రమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొం దొనర్పవే! 260

ప్రతిపదార్థం: ధరిత్రీ రమణ+అగ్రగణ్య!= రాజులలో ఉత్తముడా!; కౌరవ పాండవుల్= కౌరవులూ, పాండవులూ; తెఅఁగు+ కైకొని= సంధి నిర్ణయానికి వచ్చి; శాంతతన్+ పొంది= ప్రసన్నత్వం వహించి; ఉన్కి= ఉండటం; ఆరయన్= పరికించగా; నాకున్= నాకును; నీకున్= నీకును; కులము+ అంతకున్= కురువంశాని కంతటికీ; ఈ నృపకోటికిన్= ఈ రాజ సమూహానికి; ఉర్వికిన్= ఈ జగత్తునకూ; మేలు= శ్రేయం; పోరితము+ ఐనన్= యుద్ధం జరిగితే; ఇంతకును= ఈ సమస్తమునకునూ; మహా+ ఆపద+పుట్టున్= గొప్ప విపత్తు సంభవిస్తుంది; కావునన్= అట్లగుటచేత; గణుతించి= నా మాటలు లెక్కించి; అవశ్యమున్= తప్పక; పొందు+ఒనర్పవే= సంధి కావించవలసింది.

తాత్పర్యం: కౌరవులు పాండవులు ఒక మంచి నిర్ణయానికి వచ్చి, శాంతం వహించి, జీవించటం మంచిది. ఇట్లు వారు ప్రసన్నచిత్తులై ఉండటం నాకూ, నీకూ, కురువంశానికీ, ఈ రాజ సమూహానికీ, ఈ భూ మండలానికి శ్రేయం. అట్లాకాక యుద్ధమే సంభవిస్తే మనందరికీ మహా విపత్తు కలుగుతుంది. కనుక రాజోత్తమా! నా మాటలపై విశ్వాసముంచి తప్పక సంధి జరిపించవలసింది.

విశేషం: 1. శ్రీకృష్ణుడు తనవారని భావించేవారికి తెలిపే పరమహితం ఈ పద్యతాత్పర్యం.

2. కౌరవ పాండవు లేదో ఒక పద్ధతితో శాంతి కుదుర్చుకొంటే మేలయ్యేది శ్రీకృష్ణుడికి, ధృతరాష్ట్రుడికి, వంశంలో ఉన్నవారి కందరికీ, ఆ సభలో ఉన్న రాజులందరికీ, చివరకు సమస్త భూమికీ అని పేర్కొనటం సఖ్యత వలన ఎంతటి సౌఖ్యమేర్పడుతుందో భావనా రమణీయంగా ప్రసన్నమౌతున్నది.

3. యుద్ధమైతే అందరికీ మహాపద కలుగుతుంది - దాన్ని లెక్కలోనికి తీసికొనుమన్నాడు. పాండవ యాదవ కుటుంబ సభ్యులు కొందరైనా పోవటం శ్రీకృష్ణుడి కేర్పడే ఆపద. కొడుకులందరూ మరణించి తర్పణాలు ఇవ్వటానికి కూడా ఎవ్వరూ మిగలని మహాపద ధృతరాష్ట్రుడిది. కౌరవులందరూ నశించటం వంశజుల కేర్పడే మహాపద. యుద్ధంలో సహాయపడే రాజులు ప్రాణాలు కోల్పోతారు. దానివలన భూమి వీరులను కోల్పోతుంది. రక్తంతో తడుస్తుంది. జననాశం ఏర్పడుతుంది. వితంతువుల విషాదం పెల్లుబుకుతుంది. ఇవన్నీ లోకాని కేర్పడే ఆపదలు. వీటిని పరిగణించి తప్పక సంధి చేయుమని హితవు చెప్పి హెచ్చరించాడు శ్రీకృష్ణుడు. (సంపా.)

తే. నీకు వలసినఁ దీర్పంగ నేరవచ్చు
నధిప! తెఅఁగు నీ వశమున యదియ కాన
నీకు వీరలఁ దేర్చుట నెఱియ కాదె
సిద్ధ మెవ్వారిఁ దెలిపొందఁ జేయనేర్తు. 261

ప్రతిపదార్థం: అధిప!= ధృతరాష్ట్ర మహారాజా!; తెఅఁగు= సంధి; నీ వశమున+అదియ+కానన్= నీ అధీనంలో ఉన్నట్టిదే కావటం చేత; నీకున్+

వలసినన్= నీకు అవసరమని తోస్తే; తీర్పంగన్+నేరన్+వచ్చున్= కార్యం సరిదిద్దవచ్చు; నీకున్= నీకు; వీరలన్+తేర్చుట= కురుపాండవుల కలతలు మాన్పి ప్రసన్నులను చేయటం; నెఱియకాదె?= న్యాయంగదా!; సిద్ధము= ఇది నీ వశము లోనిది; ఏ+వారిన్= ఎవ్వరినైనను; తెలివి+ఒందన్= వివేకం పొందేటట్లు; చేయన్+నేర్తు(వు)= చేయటానికి నీవు సమర్థుడివి.

తాత్పర్యం: రాజా! సంధికార్యం నీ చేతిలో ఉన్నది. అవసరమైతే పని చక్కబెట్టగలవు. కురుపాండవులను ప్రసన్నులను చేయుట న్యాయం. ఎవ్వరికైనా వివేకం కల్గించటానికి నీవు సమర్థుడవు. ఇది నిజం.

విశేషం: 1. సంధి అవశ్యం జరగవలసిన కార్యం. అది ధృతరాష్ట్రుడిపై ఆధారపడి ఉన్నది. ఆ సంధి జరిపే పద్ధతి కూడ ధృతరాష్ట్రుడి అధీనంలోనే ఉన్నది. కాబట్టి కౌరవ పాండవులను సంధి కంగీకరించేటట్లు ప్రసన్న మనస్కులను చేయటం కర్తవ్యం. అది చేయగలవాడు ధృతరాష్ట్ర డొక్కడే - ఇది శ్రీకృష్ణుడి మాటల ఫలితాంశం. ప్రతిపాద్యాంశ తాత్పర్యాన్ని స్పష్టంగా చెప్పటం ఉపన్యాస ఉపసంహారాంశం ఔతుంది.

2. ఇంతవరకు వంశగౌరవానికి తగ్గట్లుగా ధృతరాష్ట్రుడూ, అతడి కొడుకులూ నడచుకొనవలసిన అంశాన్నీ, సంధి అవసరాన్నీ విడమరచి చెప్పాడు. సంధి చేయటం న్యాయమన్నాడు. ధృతరాష్ట్రుడే ఆ నిర్ణయం తీసికొనటం పరమహితమన్నాడు శ్రీకృష్ణుడు. 257వ పద్యంలో ఆరంభించిన విశ్లేషణను ఇక్కడివరకు హేతుబద్ధంగా కొనసాగించటం తిక్కన సంభాషణ శిల్పం. (సంపా.)

ఉ. అందు వృకోదరార్జునుల నాహవ రంగమునందు మీఱువా
రెందఱొ యెన్నుమా యిచట; నీ గురుభీష్ముల౦ గ్రేణిసేయువా
రెందఱొ; వారు వీరు నని నీల్గుటకంటె భవద్బలంబులై
యందఱుఁగూడు టొప్పదె జనాధిప! శాంతి యొనర్పు మెమ్మెయిన్.262

ప్రతిపదార్థం: అందున్= అక్కడఉన్న; వృకోదర+అర్జునులన్= భీమార్జునులను; ఆహవరంగమునందున్= యుద్ధరంగంలో; మీఱువారు= మించగలవారు;

ఎందఱొ+ ఎన్నుమా= ఇక్కడ ఎందరున్నారో నీవే లెక్కించు; ఇచటన్= ఇక్కడఉన్న; ఈ గురుభీష్ములన్= ఈ ద్రోణుడిని; భీష్ముడిని; క్రేణి+చేయువారు= పరి హసించగలవారు; ఎందఱొ?= అక్కడెందరున్నారు?; వారున్, వీరున్= అక్కడివారూ, ఇక్కడివారూ; అనిన్= యుద్ధంలో; ఈల్గుట కంటెన్= చావటంకంటె; భవత్+బలంబులు+ఐ= నీ బలగాలై; అందఱున్= వీరందరూ; కూడుట+ఒప్పదె?= కలసిమెలసి వర్తించటం తగదా?; ఏ+మెయిన్= ఏ విధంగానైనా; శాంతి+ఒనర్పుము= సంధిచేయుము.

తాత్పర్యం: అక్కడున్న భీమార్జునులను యుద్ధరంగంలో మించేవారు ఇక్కడెంద రున్నారో చెపుము? ఇక్కడున్న ద్రోణభీష్ముల పరాక్రమాన్ని లక్ష్యపెట్టక పరిహసించ గలవారు అక్కడ కూడా లేరు. ఇట్లా ఉభయ పక్షాలలోని వీరులు యుద్ధంలో చావటం కన్న నీ బలగాలై కలసి మెలసి వర్తించటం మంచిది. మహారాజా! ఏవిధంగానైనా వీరిని శాంతింపజేయుము.

విశేషం: 1. భరతవంశ సంప్రదాయం నిలపగలిగిన కీలకస్థానంలో ధృతరాష్ట్రుడున్నాడని చెప్పి కౌరవ పాండవులు కలసి ఉంటే కలిగే లాభాలను వివరిస్తున్నాడు శ్రీకృష్ణుడు. వాటిలో మొదట సంఘటిత బలశక్తిని ప్రస్తావిస్తున్నా డీ పద్యంలో. పాండవ పక్షంలో భీమార్జునులూ, కౌరవ పక్షంలో గురు భీష్ములూ కలిసి ఉంటే ధృతరాష్ట్రుడి రాజ్యం శత్రుదుర్భేద్యంగా ఉంటుందని చెప్పాడు. రాజ్యానికీ, రాజుకూ మొదట కావలసింది రక్ష. ఆ అంశాన్ని ఇందులో ఒత్తి చెప్పాడు.

2. మూలంలో ఇరుపక్షాలలో ఉన్న పెక్కు వీరుల పేర్లు చెప్పబడ్డాయి. కాని, పై నలుగురూ సంగ్రామంలో ఓడడం దుర్లభం. మిగిలినవారి కా ప్రతిపత్తి లేదు. అందువలన తిక్కన ఈ మార్పు చేశాడు. దుర్యోధనుడు ఇటువంటి మహావీరులలో ఒకడని శ్రీకృష్ణుడు చెప్పకుండా ఉండటం గమనింపదగిన అంశం. ఆ సత్యాన్ని గుర్తించుమని ధృతరాష్ట్రుడికి వ్యంగ్యంగా హితవు పలికాడు శ్రీకృష్ణుడు.

3. ఏ విధంగానైనా శాంతిని స్థాపించుము- అన్నది పద్యంలోని వాద తాత్పర్యం. తిక్కన ఒక్కొక్క పద్యాన్ని ఒక వాదాంశానికి ప్రతినిధిగా నిలపటం వాదన కళ.

కార్యకారణ సంబద్ధమైన తాత్పర్య ప్రతిపాదనం అందులోని వాక్యకళ. వస్తువు కనుగుణమైన పద్య రచనా శైలిని సంఘటించటం కావ్యకళ. బంధ శైథిల్యం, అర్థవైమల్యం గల ప్రసాదగుణం ఈ రచనలోని జీవకళ. (సంపా.)

తే. జగతిఁగల జనపతులు నీ చరణపీఠ।
మర్థిఁ గొలువ సముద్ర వేలావృతోర్వి
యెల్ల నేలుట యొప్పదే?। తల్లి ప్రజల।
యెడ విరోధంబు వాటించు టెంత మేలు? 263

ప్రతిపదార్థం: జగతిన్+కల= లోకంలో ఉన్న; జనపతులు= రాజులు; నీ చరణ పీఠము= నీ పాద పీఠం; అర్థిన్= ప్రీతితో; కొలువన్= సేవిస్తుండగా; సముద్ర వేలా+ ఆవృత= సాగరం యొక్క చెలియలికట్టచేత చుట్టబడిన; ఉర్వి+ఎల్లన్= పుడమి నంతయు; ఏలుట= నీవు పాలించటం; ఒప్పదే?= తగదా?; తల్లి= జనని; ప్రజల+ఎడన్= తన బిడ్డల విషయంలో; విరోధంబు పాటించుట= వైరం వహించటం; ఎంత మేలు?= ఏపాటి శ్రేయం?

తాత్పర్యం: లోకంలోని రాజులందరూ నీ పాదపీఠాన్ని ప్రీతితో సేవిస్తుండగా సముద్రపు చెలియలికట్టచేత చుట్టబడిన పుడమినంతటినీ నీవే ఏకచ్ఛత్రంగా పరిపాలించటం తగును. తల్లి తన బిడ్డలపట్ల శత్రుత్వం వహించటం ఎంత సమంజసమో నీవే యోచించుము.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం, నిదర్శన. 1.ఇందులో సర్వసామ్రాజ్యాధిపత్యం ధృతారాష్ట్రుడిదే అని హెచ్చరించటం ముఖ్యాంశం. కాని, ధృతరాష్ట్రుడు ఆ అధికారం తన కుమారుడిదిగా ప్రజలు భావించేటట్లు వ్యవహరిస్తాడు. దానిని మానుకొమ్మని శ్రీకృష్ణుడి హితవు. పాండవులను కూడ ఉత్తరాధికారులుగా గుర్తించుమని హెచ్చరిక.

2. ఆ అంశాన్ని (విశేషాన్ని) లోకన్యాయంతో (సామాన్యంతో) సమర్థించాడు ఈ పద్యంలో. తల్లికి బిడ్డలుంటారు. వారినందరినీ సమభావంతో ప్రేమతో చూడటమే

వాత్సల్యం. అట్లాకాక పక్షపాత వైఖరి ప్రకటించటం అన్యాయం- అని చెప్పి పాండవుల పట్ల విరోధం ప్రదర్శించటం అన్యాయమని శ్రీకృష్ణుడు హెచ్చరించాడు. 'ప్రజలు' అనే శబ్దం సార్థకం. పిల్లలనీ, ప్రజలనీ రెండర్థాలు. ధృతరాష్ట్రుడు రాజకుమారులకూ ప్రజలకూ తల్లివంటివాడనీ ధ్వని. ఏలుట - అనే క్రియ సాభిప్రాయం. కొడుకులను అదుపులో ఉంచటం, ప్రజలను పాలించటం అనే అర్థాలేర్పడతాయి. 'విరోధంబు పాటించు టెంత మేలు?' అని ప్రశ్నార్థక వాక్యాన్ని చివర ఉంచటం సాభిప్రాయం. ఒక హితాన్ని చెప్పి దాని బాగోగులను గురించి ఎదుటివారి చేతనే ఆలోచింపచేయటానికి తోడ్పడే శక్తిమంతమైన పద్ధతి ప్రశ్నార్థక వాక్య ప్రయోగం. సంభాషణ శిల్పి తిక్కన తెలిసివాడిన సంభాషణ శిల్పమిది.

3. రచనలో అర్థవ్యక్తి అనేగుణం సార్థకంగా పోషించబడింది. (సంపా.)

క. నరనాథ! నీవుపేక్షా।
పరుఁడ వయినఁ గౌరవులక పాండవులక కా
దరయఁగ భూ ప్రజకెల్లను।
దురితం బొనరించి నట్ల తుదిఁ గీడు సుమీ! 264

ప్రతిపదార్థం: నరనాథ!= రాజా!; నీవు; ఉపేక్షాపరుఁడవు+అయినన్= ఈ విషయంలో అశ్రద్ధ వహిస్తే; కౌరవులకున్+అ పాండవులకున్+అ+కాదు= కురుపాండవులకే కాదు; అరయఁగన్= ఆలోచిస్తే; భూప్రజకున్+ఎల్లను= పుడమి యందలి జనుల కందరికినీ; దురితంబు+ఒనరించిన+అట్లు+అ= పాపం చేసినట్లే ఔతుంది; తుదిన్= చివరకు; కీడు+చుమీ!= నీకే అపకారం సుమా!

తాత్పర్యం: రాజా! నీవు కురుపాండవుల విషయంలో శ్రద్ధ వహించకుంటే ఈ ఉభయ వర్గాలకే కాదు, పుడమిలోని జనులందరికీ పాపం చేసినట్లే ఔతుంది. చివరకు నీకే హాని కలుగుతుంది.

విశేషం: ధృతరాష్ట్రుడు తల్లివలె తన ధర్మాన్ని నిర్వహించకుండా ఉపేక్ష వహిస్తే కలిగే నష్టాన్ని ఈ పద్యంలో పేర్కొన్నాడు శ్రీకృష్ణుడు. ఉపేక్ష వలన మొదట కౌరవులకే హాని జరుగుతుంది. పాండవులకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు అపద కలుగుతుంది. 'దురిత' శబ్దం నానార్థ వ్యంజకం. చివరికి ధృతరాష్ట్రుడికే కీడు మూడుతుంది. ఉపేక్ష వలన కులనాశనం, ప్రజాక్షయం, చివరకు ఆత్మహాని చేసికొన్న వాడవుతాడని ధృతరాష్ట్రుడిని శ్రీకృష్ణుడు హెచ్చరించి, పరమ హితాన్ని బోధించాడు. లోకంలో ఆత్మనాశన కారకమైన చర్యను చేపట్టటానికి ఎవరైనా జంకుతారు. ధృతరాష్ట్రుడు ఆ విషయంలో కూడా గ్రుడ్డిరాజే. (సంపా.)

క. కౌరవ పాండవులం దె।
వ్వారలకుం జావు నొవ్వు వచ్చిన మే లు
ర్వీరమణ! చిత్తమున నె।
ట్లారయుమా నీకు దుఃఖమగు నెట్లయినన్. 265

ప్రతిపదార్థం: ఉర్వీరమణ!= భూనాథా!; కౌరవ పాండవులందున్= కౌరవులలో పాండవులలో; ఏ+వారలకున్= ఎవరికైనా; చావు= మరణం; నొవ్వు= బాధ; వచ్చినన్= కలిగినా; చిత్తమునన్= మనస్సులో; ఎట్లు మేలు= ఏ విధంగా మేలవుతుందో; ఆరయుమా= పరిశీలించుము; ఎట్లు+అయినన్= వారికి ఏలాగైనా; నీకున్= నీకు; దుఃఖము+అగున్= విషాదం కలుగుతుంది.

తాత్పర్యం: రాజా! కురు పాండవులలో ఎవరికి మరణం సంప్రాప్తించినా, బాధలు కలిగినా నీకు ఎట్లా మేలవుతుందో మనస్సులో ఆలోచించుము. వారికి చావు నోవులు వస్తే నీకే ఏ విధంగానైనా దుఃఖం కలుగుతుంది.

విశేషం: 1. అలం: యథాసంఖ్యం. గుణం: అర్థవ్యక్తి.

2. ఉపేక్ష వలన యుద్ధం వస్తుంది. కౌరవ పాండవులకు రణంలో చావు కలుగవచ్చును, లేదా బాధ కలుగవచ్చును. ఈ వాక్యంలో యథాసంఖ్యాలంకారం వాక్యశిల్పంలో భాగం. అంటే కౌరవులకు చావు, పాండవులకు బాధ కలుగుతాయని ధ్వని.

3. ఇది ఫలితాంశమని గట్టిగా చెప్పాడు శ్రీకృష్ణుడు. అదే నిజమైతే ధృతరాష్ట్రుడి స్థితి ఏ విధంగా ఉంటుంది? ఆలోచించు కొనుమంటున్నాడు శ్రీకృష్ణుడు. ప్రస్తుతం ధృతరాష్ట్రుడు ఉర్వీరమణుడు (రాజు). కౌరవులు చనిపోతే అతడి రాచరికం చిక్కులలో పడుతుంది. ఉపేక్ష వలన ధృతరాష్ట్రుడి రాచరికం మరుక్షణమే అపాయస్థితిలో పడుతుంది. నైతికంగా అతడు భూరమణుడుగా ఉండలేడు. పదవీభ్రష్టుడు కావటం ఒక విధమైన దుఃఖం. ఒకవేళ పాండవులు ధృతరాష్ట్రుడి పెద్దరికాన్ని గౌరవించినా వారు ఎత్తిపొడుపు మాటలలో వేధించక మానరు. అప్పుడూ అతడికి దుఃఖమే మిగులుతుంది. యుద్ధంలో పాండవపక్షంలో కూడా కొందరు చనిపోవచ్చును. వారు అందుకు మనసు నొచ్చుకొనవచ్చును. ఆ విపత్తుకు కారణం ధృతరాష్ట్రుడి ఉపేక్షయే అని భావించి గ్రుడ్డిరాజును వేధించవచ్చును. అదీ అతడికి దుఃఖహేతువే. అందువలననే శ్రీకృష్ణుడు 'ధృతరాష్ట్రా! నీ మనసులో ఎన్నిరకాలుగా ఆలోచించినా ఉపేక్ష వలన చివరకు నీకు మిగిలేది దుఃఖమే సుమా!' అని విషయాన్ని విశ్లేషించి చెప్పాడు. (సంపా.)

ఉ. వీరును వారుఁ బండితులు, విక్రమవంతులు, బాహుగర్వదు
ర్వారులు; పూని రిత్త బవరంబున నాఱడిఁ జావఁబోవ నె
ట్లూరక యుండవచ్చుఁ? గడు నొప్పెడు మేనులు వాఁడి కైదువుల్
గూరఁగ నాటినం బుడమిఁ గూలుట కక్కట! యోర్వవచ్చునే? 266

ప్రతిపదార్థం: వీరును= ఈ కౌరవులున్నూ; వారున్= ఆ పాండవులున్నూ; పండితులు= చదువు సాములు నేర్చినవారు; విక్రమవంతులు= పరాక్రమం కలవారు; బాహుగర్వ దుర్వారులు= భుజబలంచేత అడ్డగించరానివారు; పూని= ఉద్యమించి; రిత్తబవరంబునన్= తమలో తమకు ఏర్పడిన వ్యర్థమైన కలహంవల్ల; ఆఱడిన్= వ్యర్థంగా; చావన్+పోవన్= మరణించటానికి సిద్ధపడగా; ఎట్లు+ఊరక+ఉండన్+వచ్చున్?= నివారించక మౌనంగా ఎట్లుండదగును?; వాఁడి కైదువుల్= పదునైన ఆయుధాలు- బాణాలు; కూరఁ గన్ నాటినన్= దూసుకొనిపోయేటట్లు గ్రుచ్చుకొనగా; కడున్= మిక్కిలి;

ఒప్పెడు మేనులు= సుకుమారమైన శరీరాలు; పుడమిన్+కూలుటకున్= నేలపై త్రెళ్ళుటకు; అక్కట!= అయ్యో!; ఓర్వన్+వచ్చునే?= సహింపశక్యమగునా? (శక్యం కాదని భావం.)

తాత్పర్యం: కౌరవులూ పాండవులూ మంచి చదువరులు, పరాక్రమవంతులు. భుజదర్పం గలవారు గనుక ఎవ్వరూ వీరి నడ్డగించలేరు. ఇట్లాంటివారు తమలో తమ కేర్పడిన కొరమాలిన యుద్ధంలో ఊరక మరణించటానికి సిద్ధపడుతుండగా అడ్డపడక చూస్తూ ఊరకుండటం యుక్తం కాదు. ఇంత కోమలమైన శరీరాలు వాడి బాణాలు ఆవలికి దూసుకొని వెళ్ళేటట్లు గ్రుచ్చుకోగా నేలమీద కూలటం చూచి సహించటానికి శక్యం కాదు.

విశేషం: 1. యుద్ధంలో నిరర్థకంగా వీరులు చనిపోయే పరిస్థితి వస్తే ఉపేక్షతో ఊరుకొనటం ఏమి న్యాయం? అని ప్రశ్నిస్తున్నాడు శ్రీకృష్ణుడు. తాను ఉపేక్ష విడనాడి శాంతి కొరకు యత్నించటానికి కారణ మదే అని సూచిస్తున్నాడు. తన ప్రబోధంతో ధృతరాష్ట్రుడిని కూడా తనవలె స్పందించుమని హితవు చెప్పుతున్నాడు.

2. చనిపోయేవారు వ్యర్థులు కారు. చదువుకొన్నవారు, పరాక్రమవంతులు. పైపెచ్చు తమ భుజబలాలమీద ఉన్న నమ్మకంతో యుద్ధానికి వెనుకాడనివారు, వారిని నిష్కారణంగా కొల్పోతే దేశంలో జ్ఞానేచ్ఛాక్రియా వృత్తులలో సుశిక్షితులైన వీరులు తరుగౌతారు. దేశం అన్ని విధాలా దివాలా తీస్తుంది అని హెచ్చరించాడు.

3. దేశానికి మానవ సంపదగా పేరొందే వీరులు యుద్ధంలో ఆయుధాల బారిపడి చనిపోతే ఆ దృశ్యం చూడటానికీ, భావించటానికీ దుర్భరం. నిష్కారణ హింసను సహించవచ్చునా? అని ప్రశ్నించి ధృతరాష్ట్రుడిని ఆలోచించుమని హెచ్చరించాడు శ్రీకృష్ణుడు.

4. తిని కూర్చుండి సంపదను నిష్కారణంగా నాశనం చేసికొనే వాడు జాతికి ద్రోహి. ధృతరాష్ట్రుడు ఉపేక్ష వహిస్తే అటువంటి నిందపడతాడు. అర్థవ్యక్తి

గుణ ప్రధాన రచనలో తిక్కన వస్తుస్వభావాన్ని స్ఫుటంగా వ్యక్తీకరించా డీపద్యంలో. (సంపా.)

ఆ. ఇట్లు గాక యుండ నీ రెండు దెఱఁగుల।
వారి గాచికొనుము వసుమతీశ !
నీదు ప్రాభవంబు నీతియు శాంతియు।
నఖిల జనులుఁ బొగడునట్లుగాఁగ.' 267

ప్రతిపదార్థం: వసుమతీ+ఈశ!= భూవల్లభా! ధృతరాష్ట్రా! నీదు ప్రాభవంబు= నీ యొక్క దొరతనం; నీతియున్= రాజనీతీ; శాంతియున్= కామక్రోధాది రాహిత్యమూ; అఖిల జనులు= సమస్త ప్రజలు; పొగడునట్లు కాఁగన్= ప్రశంసించునట్టి తీరులో; ఇట్లు+కాక+ఉండన్= ఇట్లా చావు నొవ్వుల పాలుగాకుండా; ఈ రెండు తెఱఁగులవారిన్= ఈ ఉభయ పక్షాల వారిని; కాచికొనుము= రక్షించుకొమ్ము.

తాత్పర్యం: రాజా! నీ విభుత్వమునూ, రాజనీతినీ, శాంతినీ సమస్త ప్రజలు మెచ్చుకొనేటట్లు కురుపాండవులు సంగ్రామంలో నశించకుండా సంరక్షించుకొనుము'.

విశేషం: యుద్ధం రాకుండా చేసి, రెండు వైపులవారినీ చావు నొవ్వుల నుండి రక్షించుకొంటే ధృతరాష్ట్రుడికి నాలుగు ప్రయోజనాలు కలుగుతాయని శ్రీకృష్ణుడు చెప్పాడు. 1. ప్రభుత్వం నిలుస్తుంది. 2. లోకనీతి, రాజనీతి, ధర్మనీతి ఫలించి ప్రభునీతి ప్రకాశిస్తుంది. 3. శాంతి ఏర్పడి రక్తపాతం లేని స్నేహభావం చిగురిస్తుంది. 4. ప్రజలందరూ ధృతరాష్ట్రుడి వర్తనాన్ని నోరారా కీర్తిస్తారు. ఉపేక్షాభావంతో పక్షపాత వైఖరి అనుసరిస్తే రాజ్యం పోతుంది. అవినీతిపరుడనే అపకీర్తి వస్తుంది. బ్రతుకంతా అశాంతితో గడపవలసి వస్తుంది. ప్రజలు చీకొట్టి నిందిస్తారు. తులనాత్మకంగా ఆలోచించి హితమైన పద్ధతి నాశ్రయించుమని పేర్కొన్నాడు. 5. వంశగౌరవం కొరకు కౌరవ పాండవుల నడుమ సంధి

కుదిరించటంలో ఉపేక్ష వహిస్తే కలిగే విషపరిణామాల గురించి ఇంతవరకు శ్రీకృష్ణుడు వివరించాడు. ఈ అంశం తరువాత మరొక అంశాన్ని ఎత్తుకొంటున్న దానికి సూచనగా 'అని చెప్పి వెండియు' అని తరువాతి వచనం వాడటం తిక్కన ఉపన్యాస శిల్పంలో భాగం. (సంపా.)

వ. అని చెప్పి వెండియు. 268

తాత్పర్యం: అనిచెప్పి శ్రీకృష్ణుడు మళ్ళీ (ఇట్లా అన్నాడు:)

శ్రీకృష్ణుఁడు పాండవులు సెప్పిన మాటలు ధృతరాష్ట్రునితోఁ జెప్పుట (సం. 5-93-36)

తే. పాండవులు తండ్రి సచ్చిన ప్రజలు వారి।
నరసి ప్రోచితి శైశవ మాదిగాఁగ
నడుమ నిష్కారణమ దిగవిడువఁ దగునె?।
పారమొందంగ రక్షింపు గారవమున. 269

ప్రతిపదార్థం: పాండవులు= ధర్మజాదులు; తండ్రి చచ్చిన ప్రజలు= తండ్రి లేని బిడ్డలు; వారిన్= వారలను; శైశవము+ ఆదిగాఁగన్= చిన్నప్పటినుంచి; అరసి ప్రోచితి(వి)= చక్కగ విచారించి కాపాడావు; నడుమన్= మధ్యలో; నిష్కారణము+అ= హేతువు లేకుండా; దిగన్+విడువన్+తగునె?= వదలి వేయవచ్చునా?; పారము+ ఒందంగన్= ఆవలిగట్టు చేరువరకూ; గారవమునన్= ఆదరంతో; రక్షింపు(ము)= కాపాడుము.

తాత్పర్యం: 'పాండవులు తండ్రిలేని పిల్లలు. వారిని పసితనంనుంచి చల్లగా కాపాడావు. ఇప్పుడు వారిని కారణం లేకుండా మధ్యలోనే విడిచిపెట్టటం న్యాయం కాదు. కడపటివరకు నీవు ప్రేమతో వారిని కాపాడవలసిందే.

విశేషం: 1. 'పాండవులు తండ్రి లేనివారు' అనే మాట ఉద్యోగపర్వంలో బాగా వినబడుతుంది. ధర్మరాజే పాండురాజు పోతూ శ్రీకృష్ణుడిని చూపి వెళ్ళాడని పేర్కొన్నాడు. (ఉద్యో. 3.6) కొడుకులను ఆపదనుండి రక్షించటం, వారికి శుభాలు కలిగించటం తండ్రి బాధ్యత. వంశపారంపర్యంగా వచ్చిన బాధ్యత

ధృతరాష్ట్రుడి మీద ఉన్నది. కన్నతండ్రి పోతే వంశంలో పెంపుడు తండ్రిగా వ్యవహరించే పెద్దవాడు ఆ బాధ్యతలు నిర్వహించాలి. ఇది ఉమ్మడి కుటుంబ ధర్మం. దానిని ధృతరాష్ట్రుడికి జ్ఞాపకం చేశాడు శ్రీకృష్ణుడు. కొందరు భావించి నట్లు ఈ వాక్యం పాండవుల పట్ల సానుభూతి కలిగించటానికి అన్నది కాదు.

2. ఆ బాధ్యతను ధృతరాష్ట్రుడు ఇదివరలో నిర్వహించాడు. పాండవులను పెంచి పెద్దవారిగా చేశాడు. అయితే ఆరంభించి మధ్యలో కార్యాన్ని దిగవిడవటం ఉత్తముల స్వభావం కాదు. అందువలన ఆ బాధ్యతను అతడి జీవితం ఉండేంత వరకూ కొనసాగించటం న్యాయమని శ్రీకృష్ణుడు ప్రబోధించాడు. (సంపా.)

వ. పాండుకుమారులు నీకుం బరమభక్తిం బ్రణమిల్లి యందఱు నొక్కమాటగా నీతోఁ జెప్పుమని నాకుం జెప్పిన విధంబు వినుము: తన పంపునం బన్డ్రెండు వత్సరంబులు వనంబున వసియించితిమి. పదుమూఁ డగునేఁడు జనపదంబున నజ్ఞాతవాసంబునుం జలిపితిమి; మా తండ్రి సమయంబు పరిపాలించి యే మర్ధరాజ్యం బెట్లునుం బడయుదు మని కృతనిశ్చయులమై పడితిమి; తల్లియుఁ దండ్రియు నెల్ల చుట్టంబులు నేడుగడయును మాకుఁ దాన; మావలన నేరమి గల్గినం గినిసి యిట్లుగా దట్లని చక్కం బెట్టునది; తనగల పది వేలేండ్లకుం దన్నకాని మఱియెఱుంగ మెట్టివారమైనను మమ్మును దుర్యోధనాదులనుం దలంపరు తనయందుఁ దెఱంగు గలిగిన నెవ్వరు గొఱగాకున్నను గులంబుపాడి సెడక చెల్లునని' రని పలికి మఱియు నిట్లనియె: 270

ప్రతిపదార్థం: పాండు కుమారులు; నీకున్; పరమభక్తిన్= మిక్కిలి భక్తితో; ప్రణమిల్లి= నమస్కరించి; అందఱున్; ఒక్కమాటగా= ఏకవాక్యంగా; నీతోన్; చెప్పుము+అని; నాకున్; చెప్పిన విధంబు; వినుము; తన పంపునన్= తన ఆజ్ఞచేత; పండ్రెండు వత్సరంబులు= పన్నెండేళ్ళు; వనంబునన్;

వసియించితిమి; పదుమూఁడగు+ఏఁడు; జనపదంబునన్= జనులుండే తావున; అజ్ఞాతవాసంబునున్+చలిపితిమి= ఇతరులు మమ్మెరుగకుండే టట్లుగా నివాసం చేశాము; మా తండ్రి సమయంబు పరిపాలించి= మా తండ్రి ఏర్పరచిన ఒడంబడికను నెరవేర్చి; ఏము= మేము; అర్ధరాజ్యంబు; ఎట్టును= ఏ విధంగానైనా; పడయుదుము= పొందగలం; అని, కృతనిశ్చయులము+ఐ= తీర్మానించుకొన్నవారమై; పడితిమి= కష్టాలు అనుభవించాం; తల్లియున్; తండ్రియున్; ఎల్లచుట్టంబులున్, ఏడుగడయును= సర్వవిధాల రక్షించేవాడు; మాకున్, తాన్+అ= అతఁడే; మా వలనన్; నేరమి+కల్గినన్= దోషముంటే; కినిసి= కోపించి; ఇట్లుకాదు; అట్లు+అని; చక్కన్+పెట్టునది= సరిదిద్దవలెను; తన కల పదివేల+ఏండ్లకున్= తాను జీవించిన పదివేల సంవత్సరాలకైనా; తన్నున్+అకాని= తన్నేతప్ప; మఱి+ఎఱుంగము= ఇతరుల నాశ్రయించం; ఎట్టివారము+ఐనను= మే మెటువంటివాళ్ళమైనా; మమ్మును; దుర్యోధన+ఆదులను; తలంపరు= లోకులు భావింపరు; తనయందున్+తెఱంగు+కల్గినన్= తనకు కార్యం సరిదిద్దవలెనన్న తలంపుఉంటే; ఎవ్వరు కొఱ+కాకున్నను= ఎవరు పనికిమాలిన వారైనా; కులంబుపాడి= వంశధర్మం; చెడక; చెల్లును= సాగును; అనిరి; అని పలికి; మఱియున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ధృతరాష్ట్ర మహారాజా! పాండునందనులు నీకు పరమభక్తితో నమస్కరించి ఒకే గొంతుతో చెప్పుమని నాతో చెప్పి పంపిన మాటలు చెపుతాను, వినుము. 'తండ్రీ! నీ ఇష్టప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యాలలో నివసించాము. పదమూడవ సంవత్సరం విరటుడి పట్టణంలో అజ్ఞాతవాసం కావించాము. ఈ విధంగా ఒడంబడికను నెరవేర్చి మేము రాజ్యంలో సగపాలు పొందగలమని దృఢనిశ్చయంతో ఉన్నాము. మాకు తల్లి, తండ్రి, చుట్టములు- వెయ్యేల సర్వవిధ రక్షకులు మీరే. మా వలన ఏమైనా అపరాధముంటే కోపించి ఇట్లా కాదు అట్లా నడచుకొనండని చెప్పి

చక్కబెట్టండి. నీవు పదివేలేండ్లు జీవించినప్పటికినీ నిన్ను దప్ప మరెవ్వరినీ ఎరుగము. ఎట్టివాళ్ళమైననూ, మమ్మూ, దుర్యోధనాదులనూ లోకులు అనుకోరు. నీకు సదభిప్రాయముంటే మాలో ఎవరు కొరగాకపోయినా వంశ ధర్మం చెడక నిలుస్తుంది అని నీతో చెప్పుమన్నారు' అంటూ శ్రీకృష్ణుడు ఆయనతో ఇంకా ఇట్లా అన్నాడు:

విశేషం: 1. తండ్రిలేని పాండవులు ధృతరాష్ట్రుడే తమ తండ్రిగా భావించి, భక్తి ప్రపత్తులతో పలికిన మాటల పద్ధతిని గమనించుమని శ్రీకృష్ణుడు వివరించటం ఇందులో ప్రధానాంశం. 'మాటల పద్ధతి' రచనలోని విశేషాంశం.

2. అరణ్యాజ్ఞాత వాసాలు నిర్వహించండని ఆజ్ఞ ఇచ్చింది ధృతరాష్ట్రుడే నట. ఇది ఎట్లా? దుర్యోధనుడి ప్రవర్తనను అడ్డుకొనకుండా ఉపేక్షతో అతడి చర్యలకు రాజముద్ర గౌరవాన్ని కలిగించినవాడు ధృతరాష్ట్రుడు. ప్రవర్తన దుర్యోధనుడిదైనా బాధ్యత ధృతరాష్ట్రుడిదే. అందువలన అతడికి నివేదించుకొనటం.

3. ధృతరాష్ట్రుడు పాండవులకు అర్ధరాజ్యం ఆధికారికంగా ఇచ్చి ఉన్నాడు. అనుద్యూతంలో రాజ్యాన్ని వారు కోల్పోలేదు. ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరంగా ఇచ్చిన రాజ్యభాగం న్యాయంగా పాండవులదే ఔతుందికదా! ఈ విధంగా రెండుసార్లు ధృతరాష్ట్రుడే అర్ధరాజ్యాన్ని పాండవులకు దత్తం చేసి ఉండగా, అరణ్యాజ్ఞాత వాసాల తరువాత వారి కా భాగం సహజంగా చెందుతుంది అని నిర్ధారించి చెప్పి, ఆ భాగాన్ని ఒప్పచెప్పవలసింది ధృతరాష్ట్రుడు. కాని, విచిత్రమేమంటే అతడు తన బాధ్యతను దుర్యోధనుడికి బదిలీ చేశాడు. అట్లని తన ప్రభుత్వాన్ని వదలు కొన్నాడా? లేదు. ప్రభువు తానై ఉండి ప్రభుత్వం కొడుకు దనే ద్వంద్వ వైఖరిని పాండవులు గుర్తించటం లేదు. సమస్య అంతా అక్కడే ఉన్నది. శ్రీకృష్ణుడు కూడా ధృతరాష్ట్రుడి ద్వంద్వ వైఖరిని వ్యంగ్యంగా నిరసిస్తున్నాడు.

4. పాండవులు అన్నివిధాలుగా రక్షకుడు ధృతరాష్ట్రుడని నమ్మి ఉన్నారు కాబట్టి అర్ధరాజ్యం ఎట్లాగూ వస్తుందనే విశ్వాసంతో ఉన్నారు.

5. ఒకవేళ పాండవులవలన ఏవైనా లోపాలుకాని, పొరపాట్లుకానీ ఉంటే వాటిని సరిజేసి కార్యం చక్కబెట్టవలసిన కర్తవ్యం కూడా ధృతరాష్ట్రుడిదే అని ధ్రువపరుస్తున్నారు.

6. పాండవులు ధృతరాష్ట్రుడికి జీవితాంతం కృతజ్ఞులమై ఉంటామంటున్నారు. తమను దుర్యోధనాదులతో సమంగా చూడమంటున్నారు.

7. వంశధర్మం పాటించే న్యాయాన్ని ధృతరాష్ట్రుడు మన్నిస్తే ఎవరు పనికి వచ్చినా, పనికి రాకపోయినా పుత్రులందరూ బాగుపడతారు. కులం వర్ధిల్లుతుంది.

8. తండ్రి చచ్చిన పాండవులు ధృతరాష్ట్రుడిని తండ్రిగా భావించి పలకటంలో విశేషం గమనార్హం. పాండురాజే బ్రతికి ఉంటే కురుపాండవ భేదం ఉండేది కాదు. కలసి ఉండే కుటుంబం కొరకు ఆయన తన సర్వస్వాన్ని ధారపోశాడు. ఆయన గతించటం వలన ధృతరాష్ట్రుడిని తండ్రిగా గౌరవించవలసి వచ్చింది. అయితే పాండవులు త్రికరణశుద్ధిగా పితృభక్తిని పచరిస్తున్నారు. ఇక దాని కనుగుణంగా వ్యవహరించవలసిన న్యాయం ధృతరాష్ట్రుడి మీదే ఉన్నదని శ్రీకృష్ణుడు నిర్దేశిస్తున్నాడు.

9. సంజయుడు 'ధర్మసూతి మెత్తని పులి', 'ఎల్లవారలు నధర్మము నీపయి బెట్టునంతకు న్వినడును, గానడుం; బిదప నీకును నాకు మరల్ప వచ్చునే?' (2.14) అన్న మాటలు ఇక్కడ స్మరణీయాలు.

10. ధర్మజుడి ధర్మనీతి పద్మవ్యూహం వంటిది. మాటలు తేటలుగా ఉన్నా, అందులో నీతి సుడిగుండాలుగా మెలికలు తిరుగుతూ ఉంటుంది. సామోపాయంతో సానబెట్టిన చతురవచనా లివి. (సంపా.)

ఉ. 'సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపముచేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడఁ బాటినదైన యవస్థ దక్షు లె

వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁగాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభ దాయక మయ్యును దైవ ముండెడున్.'271

ప్రతిపదార్థం: సారపుధర్మమున్= శ్రేష్ఠమైన ధర్మమును; విమల సత్యమున్= నిర్మలమైన సత్యమును; పాపముచేతన్= దురితం చేతనూ; బొంకుచేన్= అబద్ధం చేతనూ; పారమున్+పొందన్+లేక= గట్టు చేరలేక; చెడన్ పాటినది+ ఐన+అవస్థన్= చెడటానికి సిద్ధంగా ఉన్న దుర్దశలో; దక్షులు= చక్కదిద్దటానికి సమర్థులు; ఏ+వారలు= ఎవరు; ఉపేక్ష+చేసిరి= అశ్రద్ధ వహిస్తారో; అది= అట్లా ఒప్పరికించటం; వారలచేటు+అగున్= వారికే హాని కలిగిస్తుంది; కాని= కాని; ధర్మనిస్తారకము+అయ్యున్= ధర్మమునుద్ధరించేదిగానూ; సత్య శుభదాయకము+అయ్యును= సత్యానికి మేలు కల్గించేదిగాను; దైవము+ ఉండెడున్= దైవం ఆధారంగా ఉంటుంది.

తాత్పర్యం: 'ఉత్తమమైన ధర్మం, నిర్మలమైన సత్యం పాపంచేతను, అబద్ధం చేతనూ దరి చేరలేక చెడటానికి సంసిద్ధంగా ఉన్న స్థితిలో వాటిని రక్షించే శక్తి ఉన్నా ఎవరు అడ్డుపడక అశ్రద్ధ వహిస్తారో అది వారలకే హానికరమవుతుంది. ఆ స్థితిలో భగవంతుడు ధర్మమును ఉద్ధరించటానికీ, సత్యమునకు శుభం కలిగించటానికీ ముందుకు వస్తాడు.

విశేషం: అలం: యథాసంఖ్యం.

1. పాండవులు సభాసదుల నుద్దేశించి చెప్పుమన్న సందేశ మిది. ఉద్యోగపర్వ తాత్పర్యానికీ, మహాభారత కథాతత్త్వానికీ ఈ పద్యం ఆత్మవంటిది. తెలుగువారు క్లిష్టపరిస్థితులలో భగవంతుడు ధర్మాన్నీ ధర్మాత్ములనూ రక్షిస్తాడనీ, అధర్మాన్నీ, అధర్మాత్ములనూ శిక్షిస్తాడనీ తమ విశ్వాసాన్ని ఈ పద్యం చదివి వ్యక్తం చేస్తూ ఉంటారు. అందువలన తెలుగు సాహిత్యంలో ఈ పద్యం ఒక ధర్మదీపం.

2. మూల తాత్పర్యాన్ని తిక్కన చికిలిపెట్టి తెలుగులో నిర్మించాడు. మూలం-

"యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః ॥

విద్ధో ధర్మో హ్యధర్మేణ సభాం యత్ర ప్రపద్యతే
న చాస్య శల్యం కృన్తన్తి విద్ధా స్తత్ర సభాసదః
ధర్మ ఏతా నారుజతి యథా నద్యనుకూలజాన్ ॥

యే ధర్మ మనుపశ్యన్త స్తూష్ణీం ధ్యాయన్త ఆసతే
తే సత్య మాహుర్ధర్మం చ న్యాయ్యం చ భరతర్షభ!" (సం. 5.93.48-50)

ధర్మం అధర్మం చేతా, సత్యం అసత్యం చేతా నశిస్తున్నప్పుడు చూస్తూ ఊరకుంటే సభాసదులకే చేటు మూడుతుంది. ధర్మం అధర్మం చేతిలో దెబ్బతిని సభలోకి ప్రవేశిస్తే దాని బాధను (ముల్లును) తొలగించకపోతే ఆ సభాసదులే దెబ్బతింటారు. అటువంటి వారిని నది తన ఒడ్డున పుట్టిన చెట్లను ప్రవాహంతో పెకలించి వేసినట్లుగా, ధర్మం వారిని ఉన్మూలించివేస్తుంది. కాబట్టి, ధర్మాన్ని సదా పరిశీలిస్తూ, పరిరక్షిస్తూ దానినే ధ్యానిస్తూ కాలం గడిపేవారు సత్యాన్నీ, ధర్మాన్నీ, న్యాయాన్నీ మాత్రమే పలుకుతారు - అని పై శ్లోకాల తాత్పర్యం. వ్యాసుడు మహర్షి, తిక్కన మహాకవి. ఋషివాక్కు ఇతిహాసంలో అర్థప్రధానం, కవి వాక్కు కావ్యేతిహాసంలో శబ్దార్థోభయప్రధానం. మూలానికీ తెలుగుకూ ఈ తారతమ్యం గమ్యం.

3. సారవంతమైన ధర్మం, నిర్మలమైన సత్యం - అంటున్న తిక్కన మాటలలో ఆ విశేషణాలు ఆ విశేషాలకు నిత్యధర్మాలుగా పేర్కొనటం గమనార్హం. ధర్మం ఎప్పుడూ సారవంతమైనదే. శక్తిమంతమైనదే, సత్యం ఎల్లప్పుడూ కల్మషం లేనిదే, నిర్మలమైనదే, స్వచ్ఛమైనదే. అవి రెండు స్వయం సమర్థములైనవే. అయితే వాటిని వ్యతిరేకించేవీ, కలతపెట్టేవీ, నశింపజేయ యత్నించేవి పాపం, బొంకు కాని, అవి (వరుసగా) సారవంతం, నిర్మలం కాకపోవటం చేత ధర్మసత్యాలను నశింపచేయలేవు. అయితే, సత్యధర్మాలు ఫలవంతమయ్యే తరుణంలో అవి ఫలించకుండా అడ్డుపడి చెరిచే యత్నాలు చేస్తాయి. అప్పుడు ధర్మసత్యాలు చెడబారే పరిస్థితులు ఏర్పడతాయి. కాని, అవి చెడిపోవు. 'ధర్మో రక్షతి రక్షితః ' అనే న్యాయాన్ని అనుసరించి ధర్మాత్ములు, సత్యశీలురు వాటిని తమ శక్తియుక్తులతో రక్షించే యత్నం చేస్తారు. పాపం చేసేవారూ, అబద్ధా లాడేవారూ మానవులే; ధర్మాన్ని రక్షించేవారూ సత్యాన్ని కాపాడేవారూ మానవులే. అయితే ధర్మాన్ని రక్షించేవారు దానికొరకు తమ శక్తిని ధారపోయాలి. సత్యాన్ని రక్షించేవారు సత్యాచరణంలోని అసంబద్ధతను తొలగించి త్రికరణశుద్ధిని ప్రదర్శించాలి. అప్పుడు ధర్మసత్యాలు తమ సార నిర్మలత్వాలను రక్షించుకొనగలుగుతాయి. ఎందుకంటే - ధర్మం సత్యం ఎంతటి గుణాలో అంతటి ఆచరణాలు. ఆచరణలోపం వలననే ధర్మం బలాన్ని కోల్పోయినట్లు, సత్యం మలినమైనట్లు కనపడతాయి. దీనిని తెలిసిన విజ్ఞులు తమ బాధ్యతను తెలిసికొని వాటిని రక్షించి తమను తాము రక్షించుకొనాలి. ఆ విషయంలో ఉపేక్ష చేస్తే వారి చరిత్రలకు ధర్మసత్య కవచాలు తొలగిపోయి బలహీనులై పాపాలకూ, అసత్యాలకూ బలి అయిపోతారు. దక్షులై కూడా తమ ధర్మాన్ని నిజాయితీతో నిర్వహించని వారికి చేటు రాకతప్పదని ఈ సందేశం.

4. మానవులు తమ ధర్మాన్ని నిర్వర్తించకపోతే ధర్మ, సత్యాలు నశించిపోవు. ఎట్లాగంటే వేదాన్ని రక్షించవలసింది బ్రాహ్మణుడు. కాని, అతడు వేద ధర్మాన్ని ఆచరించకపోతే వేదం వెనకబడినట్లుంటుందేమో కాని నశించిపోదు. వేదాన్ని రక్షించిన వాడే బ్రాహ్మణుడన బడతాడు. వేదాన్ని పరమాత్ముడు రక్షించగలడు, ఉద్ధరించగలడు. అట్లాగే ధర్మాన్ని సత్యాన్ని కూడా, అందుకే భగవంతుడు ధర్మోద్ధారకుడు, సత్యశుభదాయకుడు అని ప్రశంసించబడతాడు. ధర్మంలోని సారం, సత్యంలోని విమలత్వం దైవం.

5. ఈ మాటలంటున్న శ్రీకృష్ణుడే పాండవుల దృక్పథంలో దైవం. ధర్మరాజు సత్యశీలుడు. అతడు వంచితుడూ, రాజ్యాన్ని కోల్పోయి బలహీనుడై ధర్మసత్య ఫలాన్ని పూర్తిగా పొందలేని దురవస్థలో ఉన్నట్లు ఇప్పుడు కనపడుతున్నాడు. పాపానికీ, అబద్ధానికీ ప్రతినిధులైన కౌరవుల వలన పాండవులు తమ ప్రయత్నంలో పారం ముట్టలేక నశించిపోతారని తెలుస్తున్నప్పుడు దక్షులైన సభాసదులు ఆ పరిస్థితిని చక్కబెట్టాలి. అది వారి విధ్యుక్తధర్మం. అక్కడ విఫలులైతే వారి ముప్పు వారే కొని తెచ్చుకొంటారని ధ్వని.

6. ఉదాత్తమైన ఈ పద్యాన్ని పెక్కురు పండితులు వ్యాఖ్యానించారు. వారి వాక్యాలలో కొన్ని - శ్రీ భూపతి లక్ష్మీనారాయణ రావుగారి వ్యాఖ్య.

"ఈ పలుకులు గంభీరభావ ప్రధానములైనవి. సత్యధర్మములను భావించుచున్న పాండవు లెట్లును దైవముచే రక్షితు లగుదు రనియుఁ, గౌరవుల వలనఁ గలిగిన యాపదనుండి సత్యధర్మముల నుద్ధరింప సమర్థులయ్యు, నుపేక్ష వహించిన భీష్మాదులు చెడుదురనియు, నీవాక్యములు తెలుపుచున్నవి. భీష్మద్రోణాదులకుఁ గూడ స్వధర్మస్మృతిఁ గలుగఁ జేయుట కృష్ణుని యుద్దేశము. 'ద్రోణ భీష్మ లీ దిక్కు సుమ్ము' అని దుర్యోధనుడు పల్కినట్లు కౌరవుల యుద్ధోత్సాహమంతయు నీయిరువురపైఁ బడియున్నదని కృష్ణుఁ డెఱుఁగును. వారిని యధర్మ ప్రయత్నమునకు విముఖులఁ గావించి, యుద్ధమునఁ బాల్గొనకుండునట్లు చేసినచో కోరలూడ్చిన త్రాచులై, కౌరవులు సంధి కొప్పుకొందురని కృష్ణుని యాశయము. కనుక, ధర్మనాశము నెడ నౌదాసీన్యము కూడ నధర్మమే యగునని భీష్మాదులు కీవాక్యములు సూచించుచున్నవి." (భారతము: తిక్కన రచన. పు. 57-58).

7. డా. పాటిబండ మాధవశర్మగారి వ్యాఖ్య:- "ఈ సందేశమున కురుక్షేత్ర సంగ్రామ పర్యవసానము వ్యంగ్యముగా సూచింపబడినది. ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమున ధర్మసత్యములకు అధర్మ+అసత్యములతో సంఘర్షణ తటస్థించినది. అధర్మాసత్యములే బలవత్తరములై ధర్మసత్యములు గట్టెక్కజాలని యవస్థ వచ్చినది. ధర్మము గమ్యము చేరలేక చెడబారుట లోకవినాశమునకు హేతువగును. లోకకల్యాణము నభిలషించువారెల్లరును ధర్మవిజయమునకు తోడ్పడవలయును. అధర్మ విజృంభణమును నిరోధింపవలయును. అట్లు చేయుటకు దక్షత కలిగియుండియు ఉదాసీన భావముచేత గాని, పక్షపాతముచేత గాని సత్యధర్మ నాశనమును కనులారా చూచుచు ఎవ్వ రుపేక్షింతురో వారి వినాశనమునకే ఆ యుపేక్ష కారణ మగును. ఉపేక్షాభావమున వారు తమ కర్తవ్యము నిర్వర్తింపనంత మాత్రమున సత్యధర్మముల కెట్టి క్షతియు కలుగదు. ధర్మమునకు, సత్యమునకు దైవము ఎప్పుడును అండగా నుండును. ధర్మమును ఒడ్డెక్కించును. సత్యమునకు శుభము కూర్చును. అట్టి దైవమైన శ్రీకృష్ణుడు తమకు రక్షగా నున్నాడనియు, సమర్థులైన భీష్మద్రోణాదులు

ఉదాసీనత వహించినను, కౌరవపక్షమున నిల్చినను వారు నశించుట తప్పదనియు పాండవుల సందేశమందలి వ్యంగ్యార్థము." (తిక్కన కవితా వైభవము: యువభారతి ప్రచురణ. పు. 27-28)

8. ప్రసాదగుణంలో పర్యవసించే గుణం అర్థవ్యక్తి ఇందులో పోషించబడింది. ఝుటిత్యర్థ ప్రతిపత్తి హేతుత్వం శబ్దగుణమైన అర్థవ్యక్తి లక్షణం. వస్తు స్వభావ స్ఫుటత్వం అర్థగుణమైన అర్థవ్యక్తి. నన్నయ తిక్కనలకు అర్థవ్యక్తి అంటే అలవిమాలిన అభిమానం. నన్నయలో శబ్దగుణమైన అభివ్యక్తి. తిక్కన రచనలో అర్థగుణమైన అర్థవ్యక్తి బలంగా ఉన్న అనర్ఘరత్నాలవంటి పద్యాలు వెలువడ్డాయి. తిక్కన రచనలో ఈ పద్యం ఉజ్జ్వ లోదాహరణం. ధర్మరక్షాదక్షమైన దైవం యొక్క స్వభావాన్ని వ్యాఖ్యానించే వాక్యసముదాయం ఇందులో ప్రసన్నంగా ప్రకాశిస్తున్నది కాబట్టి అర్థవ్యక్తి అర్థవంతంగా అవతరించింది. (సంపా.)

వ. అని యీ సభ్యులకుం జెప్పుమనిరి; నీవును సభాసదులైన రాజులు నేమనియెద రనుం; దేను ధర్మంబును నీతియుఁ జుట్టఱికంబును మున్నిడుకొని మనోవాక్ప్రకారంబు లేక రూపంబైన సత్యంబకాఁ జెప్పితి; నిత్తెఱంగు మీకు మేలు; క్రోధమాన మత్సరంబులు విడిచి యిట్లు సేయుండు.

272

ప్రతిపదార్థం: అని; ఈ సభ్యులకున్= సభలోని పెద్దలకు; చెప్పుము+అనిరి= చెప్ప వలసినదిగా పాండవులు నన్ను కోరారు. నీవును; సభాసదులు+ఐన రాజులు= సభలో ఉన్న దొరలు; ఏమి+అనియెదరు+అనుండు= ఏమిచెపుతారో చెప్పండి; ఏను= నేను; ధర్మంబును= న్యాయమును; నీతియును= రాజనీతిని; చుట్టఱికంబును= బాంధవమును; మున్ను+ఇడుకొని= ముందుంచుకొని; మనః వాక్+ప్రకారంబులు= మనసు యొక్క వాక్కు యొక్క వైఖరులు; ఏకరూపంబు+ఐన= ఒకే విధమైన; సత్యంబకాన్= సత్యమునే;చెప్పితిన్; ఈ+తెఱంగు= ఈ విధం; మీకున్; మేలు= మంచిని కలిగిస్తుంది; క్రోధ

మానమత్సరంబులు= కోపం, గర్వం, ద్వేషం; విడిచి; ఇట్లు+చేయుండు= నేను చెప్పిన రీతిని ఆచరించండి.

తాత్పర్యం: పాండవులు సభలోని పెద్దలకు నన్ను చెప్పుమని కోరినమాటలు చెప్పాను. మహారాజా! నీవూ, సభలోని రాజులూ ఇందుకు బదు లేమి చెపుతారో చెప్పండి. నేను నీతి ధర్మాలనూ, బాంధవాన్నీ ముందుంచుకొని మనో వాక్కులు ఏకరూపంగాఉన్న సత్యమునే చెప్పాను. నే చెప్పిన పద్ధతి మీకు మేలు గలిగిస్తుంది. కోపం గర్వం ద్వేషం వదలి, నేను చెప్పినట్లు చేయండి.

విశేషం: 1. శ్రీకృష్ణుడి సందేశంలో ధర్మం, నీతి చుట్టరికం అనే అంశాల మేళవింపు కనబడుతుంది. ధర్మం విశ్వవ్యాప్తం, నీతి కార్యవ్యాప్తం, చుట్టరికం వ్యక్తి సంబంధి - ఈ మూడూ పరస్పరం విరుద్ధం కాకుండా ఉండటం ధర్మనీతివర్తనం. శ్రీకృష్ణుడి సందేశం దానికుదాహరణం.

2.మనోవాక్కాయ కర్మలు ఏకమై వ్యక్తమైన వాక్కు సత్యం. శ్రీకృష్ణుడు త్రికరణ శుద్ధిగా పలికిన ఈ సందేశం సత్యం. అంటే నిజాయితీతో కూడుకొన్న నిజం.

3. శ్రీకృష్ణుడి సత్యవాక్కును గుర్తించాలంటే క్రోధం, అభిమానం, మాత్సర్యం అనే గుణాలు మాని ఆలోచించాలి. క్రోధం వలన ధర్మం దర్శనమివ్వదు. అభిమానం వలన నీతి యొక్క నిజస్థితి స్ఫురించదు. మాత్సర్యం వలన చుట్టరికపు ప్రేమ మనసులో మోసులెత్తదు. ఆ మూడు అవగుణాలను వదలితే శ్రీకృష్ణుడి సందేశంలోని నిజస్థితి గోచరిస్తుంది. క్రోధ మాన మత్సరాలకు పుట్టినిల్లు దుర్యోధనుడు. అతడి అంశలుగా క్రోధంతో దుశ్శాసనుడు, మానంతో కర్ణుడు, మత్సరంతో శకుని ఎప్పుడూ మసలుతుంటారు. వారికి శ్రీకృష్ణుడి సందేశ తాత్పర్యం సవ్యంగా స్ఫురించదని ధ్వని. (సంపా.)

ఆ. పాండవులకుఁ దగిన పాలు మేదిని బంచి।
యిచ్చుకంటెఁ గార్య మెద్ది గలదు?
ధర్మమెద్ది? సముచితంబగు విధమెద్ది?।
శక్యమెద్ది? చెపుఁడ వాక్యవిదులు! 273

ప్రతిపదార్థం: పాండవులకున్= పాండుపుత్రులకు; మేదినిన్= పుడమిలో; తగినపాలు= రా దగిన భాగం; పంచి+ఇచ్చుకంటెన్= పంచి ఇవ్వటం కంటె; కార్యము+ఎద్ది+కలదు?= చేయదగిన పని మరేముంది?; ధర్మము+ఎద్ది?= ఇంతకంటె న్యాయమేముంది?; సముచితంబు+అగు విధము+ఎద్ది?= మిక్కిలి తగిన తెఱంగు వేరొక టేముంది?; శక్యము+ఎద్ది?= మీకు వీలైన పని ఇంకొకటి ఏమున్నది?; వాక్య విదులు= మాటల తీరెరింగిన పెద్దలారా!; చెపుఁడ= చెప్పండి.

తాత్పర్యం: కౌంతేయులకు పుడమిలో తగిన భాగం పంచి ఇవ్వటంకంటె మంచి పని మరొక టేముంది? ధర్మం వేరేముంది? ఇంతకంటె తగిన తెరగు అన్యమేముంది? మీకు శక్యమైనది ఇంతకన్న ఏముంది? వాక్య పద్ధతి నెరింగిన పెద్దలు మీరే చెప్పండి.'

విశేషం: ఇంతవరకు నాలుగంచెలుగా సాగిన శ్రీకృష్ణ సందేశంలో ధర్మశాస్త్ర తర్కశాస్త్ర పండితులు పరిశీలిస్తే నాలుగు నిర్ణయాలకు రాకతప్పదనే హెచ్చరిక ఇందులో ఉన్నది. 1. పాండవులకు రాజ్యభాగ మీయటమే కార్యం. 2. అదే ధర్మం. 3. అదే సముచితమైన నీతి. 4. అదే ప్రస్తుతం సాధ్యమైన పని. శ్రీకృష్ణుడే సభాభిప్రాయాన్ని ఏకోన్ముఖం చేసి వారిచేత ఒప్పించేటట్లు ధ్రువీకరిస్తూ మాట్లాడాడు. సమర్థుడైన వక్త సాధించే ప్రబోధఫల మిది. (సంపా.)

క. అని పలికి మహారాజా।
వినుమని ధృత రాష్ట్రు తోడ వెండియుఁ దా ని
ట్లని చెప్పె వాసుదేవుఁడు।
తనమది నఱలేక కార్యదశ దెలియంగన్. 274

ప్రతిపదార్థం: అని పలికి= అని చెప్పి; మహారాజా!= భూవల్లభా ధృతరాష్ట్రా!; వినుము+అని; ధృతరాష్ట్రుతోడన్; వెండియున్= మరల; కార్యదశ

తెలియంగన్= కార్య పద్ధతి విశదమయ్యేటట్లు; వాసుదేవుఁడు= శ్రీకృష్ణుడు; తన మదిన్= తన హృదయంలో; అఱలేక= మర్మంలేక; తాన్+ఇట్లు+అని చెప్పెన్= తా నీ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఇట్లా వచించి శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో రాజా! నా మాటలు విను' మంటూ మనసులో మర్మం ఉంచుకోక కార్యపద్ధతి తేటతెల్లమయ్యేటట్లు మళ్ళీ ఈ విధంగా పలికాడు:

ఆ. 'వారి తండ్రిపాలు వారికి నిచ్చి నీ।
పాలు నీవుఁ బుత్త్ర పౌత్త్ర చయము
ననుభవించి సుఖులరై యుండుఁ డిది బంధు।
మిత్త్ర సుజనకోటి మెచ్చు తెఱఁగు. 275

ప్రతిపదార్థం: వారి తండ్రిపాలు= పాండవుల తండ్రి భాగం; వారికిన్+ఇచ్చి= పాండవులకు ఇచ్చి; నీ పాలు= నీ రాజ్యభాగం; నీవున్= నీవూ; పుత్త్రపౌత్ర చయమున్= నీ కొడుకులయొక్క మనుమలయొక్క సమూహం; అనుభవించి= కుడిచి; సుఖులరు+ ఐ+ ఉండుఁడు= హాయిగా జీవించండి; ఇది= ఇట్లా ఉండటం; బంధుమిత్ర సుజనకోటి= చుట్టముల స్నేహితుల సత్పురుషుల యొక్క సముదాయం; మెచ్చుతెఱఁగు= కొనియాడువిధమై ఉన్నది.

తాత్పర్యం: 'రాజా! పాండవుల తండ్రి భాగం పాండవుల కిచ్చి; నీ రాజ్యభాగం నీ కుమారులు, నీ మనుమళ్ళూ హాయిగా అనుభవిస్తూ ఉంటే చుట్టాలూ, స్నేహితులూ, సత్పురుషులూ మిమ్మ కొనియాడుతారు.

విశేషం: ఈ పద్యంలో శ్రీకృష్ణుడు పాండవ పక్షంగానే కాక బంధుమిత్ర సుజనకోటిపక్షాన, వారందరి ఏకగ్రీవాంగీకారంగా, ఫలితాంశాన్ని ప్రకటించటం గమనిస్తే, ధృతరాష్ట్రుడిని ఏకాకి చేసి, అంగీకరించక తప్పనిదైన ఒత్తిడి స్థితిని కల్పించే నీతి వలె కనపడుతుంది. అయినా, అది న్యాయమని అందరికీ

అనిపిస్తుంది. ధర్మజుడు ఆశించిన ఫలితాన్ని శ్రీకృష్ణు డింతవరకు విజయవంతంగా సాగించాడు. (సంపా.)

క. ఎఱుఁగవె యజాతశత్రుని।
నెఱియును ధర్మంబు సత్యనిష్ఠయు మిము నె
త్తెఱఁగున ననువర్తించెనొ।
యెఱుఁగవె? తగు చేవ గలుగు టెఱుఁగవె? యధిపా! 276

ప్రతిపదార్థం: అధిపా!= రాజా!; అజాతశత్రుని= ధర్మజుడియొక్క; నెఱియును= న్యాయమును; ధర్మంబున్= ధర్మమును; సత్యనిష్ఠయున్= సత్యమునందలి ఉనికియు; ఎఱుఁగవె?= తెలియవా? మిమున్= మిమ్ము; ఏ+తెఱఁగునన్= ఏ విధంగా; అనువర్తించెనొ= అనుసరించిమెలగెనో; ఎఱుఁగవె= తెలియవా?; తగుచేవ= తగిన శక్తి; కలుగుట= ఆతడు కల్గియుండటం; ఎఱుఁగవె?= తెలియవా?

తాత్పర్యం: మహారాజా! ధర్మజుడి న్యాయమూ, ధర్మమూ, సత్యప్రవృత్తీ నీకు తెలుసు. అతడు మిమ్మాశ్రయించుకొని ఎట్లా ఉండినదీ నీకు తెలుసు. తగినశక్తి కలిగి ఉండటం కూడ నీకు తెలుసు.

విశేషం: ఇది ధర్మరాజ ప్రశంస. ఆరుగుణాల చేత అతడు అగ్రగణ్యుడు.

1. అజాతశత్రుత్వం-ఎదుటివారు అతడిని శత్రువనుకొనవచ్చునేమో కాని అతడు ఎదుటివారిని ఎప్పుడూ శత్రువని భావించడు. ఇది అపూర్వగుణం. మహాభారత చక్రవర్తులలో ధర్మరాజుకే చెల్లింది. 2. న్యాయం తప్పని లోకనీతి. 3. ధర్మం తప్పని వేదనీతి. 4. సత్యం తప్పని వ్యక్తి నీతి. 5. పెద్దల మాట తప్పని వంశనీతి. 6. రాజ్యం పాలించగలిగిన శక్తి - ప్రభునీతి. ఈ ఆరుగుణాలు ఉత్తమ వంశకర్తకుండే లక్షణాలు. సారపు ధర్మం, విమలసత్యం ధర్మజుడి జీవిత రథచక్రాలు. (సంపా.)

వ. అది యెల్ల నీ వెఱుంగు; దైనను దెలియఁ జెప్పెద విను; మింద్రప్రస్థ పురంబున నుండి పాండవాగ్రజుండు నీకుం బెంపునుం బేరునుం జేయం గోరి. 277

ప్రతిపదార్థం: అది+ఎల్లన్= అది అంతయూ; నీవు+ఎఱుంగుదు= నీకు తెలియును; ఐనను; తెలియన్+చెప్పెదన్+వినుము= తేటతెల్లంగా తెలుపుతాను వినుము; ఇంద్ర ప్రస్థపురంబునన్+ఉండి; పాండవ+అగ్రజుండు= పాండవులలో తొలుత జన్మించిన ధర్మజుడు; నీకున్; పెంపునన్= గౌరవమును; పేరునున్= ప్రఖ్యాతిని; చేయన్+కోరి= కలిగింపనెంచి.

తాత్పర్యం: ధర్మజు డెటువంటివాడో నీ వెరుగుదువు. అయినప్పటికీ స్పష్టంగా చెపుతాను, విను. అతడు ఇంద్ర ప్రస్థపురంలో ఉంటూ నీకు గౌరవఖ్యాతులు కలిగింప నెంచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

చ. మద మడఁగించి భూపతిసమాజము నెల్లను నిన్నుఁ గొల్వఁజే
యుదునని పూని దిగ్విజయ మున్నతిఁజేసి మహావిభూతితో
మదిమదినుండ నీ సుతుఁడు మంత్రులు సౌబలు జూదమార్చి సం
పద గొని యంతఁ బోవక సభన్ ద్రుపదాత్మజ భంగపెట్టరే. 278

ప్రతిపదార్థం: మదము+అడఁగించి= గర్వాన్ని తొలఁగించి; భూపతి సమాజమున్+ఎల్లను= రాజలోకమంతటినీ; నిన్నున్= నిన్ను; కొల్వన్+చేయుదున్+అని= సేవించేటట్లు చేయుదునుగాక అని; పూని= పూనుకొని; దిగ్విజయము= దిగ్జయమును; ఉన్నతిన్+చేసి= గొప్పగా కావించి; మహావిభూతితోన్= గొప్ప ఐశ్వర్యంతో; మది మదిన్+ఉండన్= నెమ్మదిగా ఉండగా; నీ సుతుఁడు= నీ కుమారుడైన దుర్యోధనుడు; మంత్రులు= అతడికి ఆలోచనచెప్పే కర్ణదుశ్శాసనులు; సౌబలున్= సుబలుని పుత్రుడైన శకునిని; జూదము+ఆర్చి= జూదమాడించి; సంపదన్+కొని= సిరిని హరించి; అంతన్+పోవక= అంతటితో విడువక; ద్రుపద+ఆత్మజన్= ద్రౌపదిని; సభన్= కొలువులో; భంగపెట్టరే= అవమానించినారు గదా!

తాత్పర్యం: రాజుల దర్పమడచి వారందరు నిన్ను కొలిచేటట్లు చేయటానికై ధర్మనందనుడు గొప్పగా దిగ్విజయం చేసి మిక్కుటమైన సిరిసంపదలతో తులతూగుతూ నిమ్మళంగా ఉన్నాడు. అప్పుడు నీ తనయుడూ, అతని మంత్రులూ చేరి శకునిచే జూదమాడించి ధర్మజుడి సంపదనెల్ల హరించారు. అంతటితో తృప్తిపడక నిండుసభలో ద్రౌపదిని పరాభవించారు.

విశేషం: 1. ధర్మరాజు దిగ్విజయం చేయటం ధృతరాష్ట్రుడి ఔన్నత్యాన్ని పెంచటానికే అన్నాడు కృష్ణుడు.

2. దిగ్విజయంలో ఓడిన రాజులు దుర్యోధనుడికి సాయం చేస్తున్నారు. వారి నుద్దేశించి చెప్పిన మాట ఇది. దిగ్విజయం చేసింది ధర్మరాజు; దాని ఫలితాన్ని అనుభవిస్తున్నది ధృతరాష్ట్రుడు. ఆ యుద్ధాలన్నీ ధృతరాష్ట్రుడి సంపదను పెంచటానికే అని వారు గ్రహించి పాండవులయందు సౌముఖ్యాన్ని వహించాలని శ్రీకృష్ణుడి అభిప్రాయం.

3. ధర్మజుడు తండ్రిపెంపుగోరి సంపద గడిస్తే, దుర్యోధనుడు తండ్రికి కళంకం తెచ్చేటట్లు సంపద హరించాడు. అంతేకాదు ద్రౌపదిని నిండుసభలో భంగపరచి తండ్రికి తలవంపులు తెచ్చాడు. తులనాత్మక విచారంతో ఎవరు యోగ్యులో తేల్చుకొనుమని సూచన. తండ్రి పెంపుకు కృషి చేసిన కొడుకుకు కీడు తలపెట్టటం తగదని హితవు. (సంపా.)

ఉ. దానికి నీ వొడంబడితి; ధర్మజుఁ డంతయుఁ జూచి సత్యముం
బూని వృకోదరార్జునులు భుగ్నులుగాఁ బెడచేతఁ గన్ను నీ
రూనఁగ నొత్తుకొంచుఁ జని యుగ్ర వనంబున దుఃఖమగ్నుఁడై
దీనత నుండి పూన్కి దగఁ దీర్చియుఁ గూడి మనంగఁ గోరెడిన్. 279

ప్రతిపదార్థం: దానికిన్= దుర్యోధనుడి దుష్టచేష్టకు; నీవు+ఒడంబడితి(వి)= నీవు సమ్మతించావు; ధర్మజుఁడు= ధర్మరాజు; అంతయున్+చూచి= పరిస్థితి నాకళించుకొని; సత్యమున్+పూని= సత్యం అవలంబించి; వృకోదర+

అర్జునులు= భీమార్జునులు; భుగ్నులుగాన్= విఱిగినవారు కాగా, క్రుంగినవారు కాగా; కన్ను= నేత్రములు; నీరు+ ఊనఁగన్= కన్నీరు వహించగా; పెడచేతన్= వెనుక చెయ్యితో; ఒత్తుకొంచున్= తుడుచు కొంటూ; చని= వెళ్ళి; ఉగ్రవనంబునన్= ఘోరారణ్యంలో; దుఃఖమగ్నుఁడు+ఐ= శోకము నందు మునిగినవాడై; దీనతన్+ఉండి= దైన్యంతో పడియుండి; పూన్కిన్= ప్రతిజ్ఞను; తగన్+తీర్చియున్= సక్రమంగా నిర్వహించికూడా; కూడి= మీతో కలిసిమెలిసి; మనంగన్= జీవించాలని; కోరెడిన్= కోరుకొంటున్నాడు.

తాత్పర్యం: దుర్యోధనుడి దుష్కృత్యాలకు నీవు సమ్మతించావు. ధర్మరాజు తనకేర్పడిన సంకటాన్ని గమనించి సత్యం తప్పక తన ఆజ్ఞచేత భీమార్జునులు బలముడిగి క్రుంగిపోగా కంటినుండి కారుకన్నీటిని పెడచేతితో తుడిచికొంటూ ఘోరారణ్యాలకు వెళ్ళాడు. అక్కడ దుఃఖాలలో మునిగి దైన్యం అనుభవిస్తూ ప్రతిజ్ఞను సక్రమంగా నెరవేర్చికూడా నేడు మీతో ఒద్దికగా జీవించవలెనని కోరుకుంటున్నాడు.

విశేషం: 1. దుర్యోధనుడు చేసిన దుర్నయం క్షమార్హం కానిది. అయినా, దానికి ధృతరాష్ట్రుడు అంగీకరించి ఆ పాపభారాన్నంతా తన తలమీద వేసికొన్నాడు. అందుచేత పాండవులు అరణ్య అజ్ఞాతవాసాలు ఆయాసపడుతూనే సత్యవ్రతంగా నిర్వహించారు. అడవులలో అన్ని యాతనలు పడికూడా పగ సాధించే క్రౌర్యానికి పోకుండా, అన్ని అపకారాలు చేసినా కౌరవులతో కలిసి జీవించాలని కోరుతున్నారు. అజాతశత్రువు శీలానికి ఇంతకంటె నిదర్శన మేముంటుంది? - అని ధర్మజుడి ధీరోదాత్తతను, శాంతికాముకత్వాన్నీ బంధుప్రీతిని సమర్థవంతంగా సభలో తెలియచెప్పాడు.

2. భీమార్జునులు కన్నీరొత్తుకొంటూ వెళ్ళినట్లు చెప్పిన అంశం సాభిప్రాయం. వారు క్రోధమూర్తులు. యుద్ధాన్నే కోరుతున్నారు. అయినా, వారిని తగిన విధంగా నియంత్రించి సత్యధర్మాలను పాటిస్తున్నాడు ధర్మరాజు. అతడివలె ధృతరాష్ట్రుడు కూడ తన పుత్రులను అదుపులో పెట్టి పాండవులకు న్యాయం చేయాలని హెచ్చరిక. (సంపా.)

క. తనుఁ దాన పోలుఁగా కే।
మనవచ్చు? నజాతశత్రు నతిశాంతతయున్
వినయము సత్యము ము న్నే।
జనపతులకుఁ గలవు సెపుమ? సౌజన్యనిధీ! 280

ప్రతిపదార్థం: సౌజన్యనిధీ!= మంచితనానికి స్థానమైనవాఁడా!; తనున్+తాను+అ+పోలున్+కాక= ఆతడికి అతడే సాటిఅగును; ఏమి+అనన్+వచ్చున్?= అతడిని ఎంతని కొనియాడగలము?; అజాతశత్రు= ధర్మజుడియొక్క; అతి= మిక్కుటమైన; శాంతతయున్= శాంతస్వభావమూ; వినయమున్= అణకువా; సత్యమున్= సత్యమూ; మున్ను= పూర్వం; ఏ జనపతులకున్+కలవు= ఏ రాజులకున్నాయో; చెపుము+అ= చెప్పుము.

తాత్పర్యం: ధర్మపుత్రుడికి సాటి ధర్మపుత్రుడే. అతడిని ఎంతని కొనయాడ గలం? ఆయన శాంతస్వభావం, అణకువ, సత్యనిష్ఠ ఇంతకుమునుపు ఏ రాజులకున్నవో చెప్పు.

విశేషం: 1. అలం: అనన్వయం, కావ్యలింగం. "ఉపమానోపమేయత్వం యదేక స్యైవ వస్తుతః". ఒకే వస్తువుకు ఉపమానత్వం, ఉపమేయత్వం కూడా చెప్పితే అనన్వయం. ధర్మజుడు తనకు తానే పోలినవాడు అనటం అనన్వయం. సాటి లేని మేటి వ్యక్తిత్వం ధ్వని. మహాభారత పురుషులలో శ్రీకృష్ణుడిని మించిన మహాపురుషుడు లేడని ప్రసిద్ధి. అతడి ప్రశంస పొందిన ధర్మరాజు ధన్యజీవి.

2. "సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనమ్" అని కావ్యలింగాలంకార లక్షణం. అతడి కతడే సాటి అయిన ధర్మరాజును ప్రశంసించటానికి మాటలు లేవట! శాంతవినయ సత్యగుణాలలో అతడివంటివారు అంతవరకు లేరట! ఇది అతిశయోక్తిగా ఉన్నా ధర్మజుడి అనన్యత్వాన్ని సమర్థించే వాక్యమే- అందుకు కావ్యలింగం.

3. ధర్మజుడి వంటి రాజులు అంత వరకు పుట్టలేదన్న ప్రశంస సమకాలీనులైన ప్రభువులలో గల అతడి నిరుపమాన వ్యక్తిత్వాన్ని ధ్వనిస్తున్నది. (సంపా.)

క. ఏ నిం తాడితి నీ సం।
తానం బిరుదెఱఁగునకు హితము గోరి భవ
త్సూనుని మతి యతిలోభము।
మానిచి పాండవులఁ దెమ్ము మనుజాధీశా! 281

ప్రతిపదార్థం: మనుజ+అధి+ఈశా!= నరనాథా!; నీ సంతానంబు= నీ బిడ్డలైన; ఇరు+తెఱఁగునకున్= రెండు పక్షాల వారికి; హితమున్+కోరి= మేలు దలచి; ఏను= నేను; ఇంత+ఆడితిన్= ఇన్నిమాటలు చెప్పాను; భవత్+సూనుని= నీ కొడుకైన దుర్యోధనుడియొక్క; మతి+అతిలోభమున్= మనస్సునందలి మిక్కిలి దురాశను; మానిచి= తొలగించి; పాండవులన్+తెమ్ము= పాండవులను నీ కడకు రప్పించుకొనుము.

తాత్పర్యం: మంచితనంగల ధృతరాష్ట్ర మహారాజా! నీ బిడ్డలైన కురుపాండవుల మేలు గోరి నే నిన్నిమాటలు చెప్పవలసి వచ్చింది. నీ పుత్త్రుడైన దుర్యోధనుడి మనసులో ఉన్న పరమ దురాశను తొలగించి, పాండవులను నీ చెంతకు పిలిపించుకొనుము.

విశేషం: ధర్మరాజ ప్రశంస ప్రయోజనం అతడిని పిలిపించటం కొరకే. దానికి ప్రతిబంధకంగా నిలిచే దుర్యోధనుడి లోభాన్ని నియమించటం కొరకే. (సంపా.)

ఉ. వారలు శాంతశూరులు; భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నారటుఁగాక మీ కది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు; భూవర! రెండు దెఱంగులందు నీ
కారయఁ బథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!' 282

ప్రతిపదార్థం: వారలు= కౌంతేయులు; శాంతశూరులు= శాంతస్వభావులున్నూ, పరాక్రమవంతులున్నూ; భవత్+చరణంబులు= నీ పాదాలు; కొల్వన్= సేవించటానికి; పూని+ఉన్నారు= సంసిద్ధంగా ఉన్నారు; అటున్+కాక= అట్లాకాక; మీకున్= మీకు; అది= పాండవుల పొత్తు; మనంబునకున్= మీ మనస్సులకు; అప్రియము+ఏనిన్= ఇష్టంకానిచో; ఇంతకున్= ఈపాటికి; పోరికిన్= యుద్ధానికి; వచ్చుచున్+ఉండుదురు= వస్తూ ఉంటారు; భూవర!= రాజా!; రెండు తెఱంగులందున్= సంధి సంగ్రామాలలో; నీకున్= నీకు; ఆరయన్= ఆలోచించగా; ఏది పథ్యము+అగున్= ఏది హితమౌతుందో; ఆ+విధము= ఆ తెఱగు; ఏర్పడన్+నిశ్చయింపుమా!= తేటపడేటట్లు తీర్మానించుము.

తాత్పర్యం: మహారాజా! పాండవులు ఎంతటి శాంత స్వభావులో అంతటి వీరాగ్రేసరులు. వారు నీ పాదసేవ చేయటానికి సంసిద్ధంగా ఉన్నారు. వా రట్లా మీతో కలసి మెలసి వర్తించటం మీకు ఇష్టంకాకపోతే ఈ పాటికి కదనం కావించటానికి బయలుదేరి వస్తుంటారు. సంధి, సంగ్రామం - ఈ రెండింటిలో మీ కేది హితమని తోస్తుందో దానిని నిర్ణయించి వెల్లడించండి.'

విశేషం: 1. అలం: విషమం. "విషమం వర్ణ్యతే యత్ర ఘటనాననురూపయోః " అననురూపాలైన వాటికి సంబంధం వర్ణిస్తే విషమాలంకారం. పాండవులు శాంతశూరులు - అనే వాక్యం చక్కని ఉదాహరణం. శాంత శూరత్వాలు అననురూపాలైన గుణాలు. పాండవులు అట్టి గుణాలు కలవారని భావం. తిక్కన ధర్మరాజును - 'మెత్తనిపులి' అని అన్నాడు. పాండవులను 'శాంతశూరులు' అని పేర్కొన్నాడు. తెలుగు సాహిత్యంలో ఈ బిరుద విశేషణాలు తిక్కన ప్రతిభావైభవానికి కీర్తి పతాకలు.

2. శాంతులు కాబట్టి ధృతరాష్ట్రుడిని సేవించాలని భావిస్తున్నారు. ధృతరాష్ట్రుడు వారికి రాజ్యభాగమిచ్చి మన్నించకపోతే శూరులవలె యుద్ధానికి సిద్ధమౌతారు. సహజంగా వారు శాంతులు, అవసరం వస్తే వారు శూరులు. ధృతరాష్ట్రుడు పాండవుల నెట్లా ప్రవర్తించవలెనని కోరుకొంటున్నాడో తేల్చిచెప్పాలని సభలో నిలదీసి అడిగాడు కృష్ణుడు. ఇది సందేశంలోని తారాస్థాయి (క్లైమాక్స్). (సంపా.)

చ. అనవుడు రోమహర్షణము లంగములం బొడమన్ సదస్యు లె
ల్లను బ్రియమంది నెమ్మనములం 'బురుషోత్తముఁ డింత యొప్పఁ బ
ల్కునె? మఱుమాటలాడ నయకోవిదుఁ డెవ్వఁడు? ధీరుఁడెవ్వఁ? డిం
దనువరి యెవ్వఁ' డంచు నచలాకృతులై నెఱి నూరకుండఁగన్. 283

ప్రతిపదార్థం: అనవుడున్= శ్రీకృష్ణుడు అట్లా పలుకగా; అంగములన్= శరీరములందు; రోమహర్షణములు= గగుర్పాటు; పొడమన్= కలుగగా; సదస్యులు+ఎల్లను= కొలువులోని వారంతా; ప్రియము+అంది= హర్షించి; నెమ్మనములన్= తమ నిండు మనసులలో; పురుషోత్తముఁడు= శ్రీ కృష్ణుడు; ఇంత+ఒప్పన్+పల్కునె= ఇంత బాగా మాట్లాడుతాడా? (ఎంతబాగా మాట్లాడాడు? అని భావం); మఱుమాటలు+ఆడన్= ఆ మాటలకు బదులు పలకటానికి; ఇందున్= ఈ సభలో; నయకోవిదుఁడు+ఎవ్వఁడు?= నీతిశాస్త్ర నిపుణుడు ఎవడున్నాడు?; ధీరుఁడు+ఎవ్వఁడు?= ధైర్యశాలి ఎవడున్నాడు?; అనువరి+ఎవ్వఁడు?= ఉపాయశాలి ఎవడున్నాడు?; అంచున్= అని పలుకుతూ; అచల+ఆకృతులు+ఐ= చలించని ఆకారాలు గలవారై; నెఱిన్= ఒప్పుగా; ఊరక+ఉండఁగన్= మిన్నకుండగా.

తాత్పర్యం: శ్రీ కృష్ణుడి మాటలు వినగానే సభ్యులందరి శరీరాలు గగుర్పాటు వహించాయి. వారు మనస్సులలో ఎంతో సంతోషించి, 'నారాయణు డెంత ఒప్పిదంగా మాటాడాడు! శౌరి మాటలకు ప్రతివచనాలు పల్కగల నీతి నిపుణుడు, ధీరుడు, ఉపాయశాలి ఈ కొలువులో ఎవడున్నాడు' అని కదలక మెదలక నోరు విప్పక అట్లాగే ఉండిపోగా, (తరువాతి వచనంతో అన్వయం.)

విశేషం: ఒక మహావక్త ఉపన్యసించినప్పుడు సభాసదులు ఎట్లా సమ్మోహితు లౌతారో వర్ణించిన పద్యమిది.

1. అందరి శరీరాల మీద పులకలు నిలిచాయి. ఇది సాత్త్వికభావం. అప్రయత్నకృతమైన సాత్త్విక చేష్ట అవ్యక్తమైన ఆనందానికి గుర్తు.

2. మనస్సులు సంతోషించాయి- ఇది పద్యఃపరనిర్వృతి వంటిది.

3.'ఇంత ఒప్పఁ బల్కునె?' - అనే మాట ఆశ్చర్య ప్రకటనం. శ్రీకృష్ణ సందేశంలోని వస్తువుకు శ్రోతలు అబ్బురపాటు పడిన వైఖరి.

4. 'మారుమాటాడే నీతికోవిదు డెవ్వడున్నాడు?' అన్నది ఆశ్చర్యజనకమైన ప్రతిస్పందన. శ్రీకృష్ణుడి సందేశోపన్యాసంలో చెప్పిన దెంత బాగుందో, చెప్పినతీరు అంతకంటె బాగుంది. దానికి తిరుగుచెప్పే పండితులు లేరని భావం. ఇది బుద్ధిమంతుల ప్రశంస.

5. 'ధీరు డెవ్వడు' - అట్లా చెప్పగలిగిన ధైర్యం ఉన్న వాడెవడు? ధృతరాష్ట్రుడి నిండు కొలువులో అతడి ఉపేక్షయే ప్రళయ హేతువని ప్రకటించి, రాజ్యభాగమివ్వటం కంటె గత్యంతరం మరొకటి లేదని సూటిగా, ఘాటుగా చెప్పగల మొనగాడు శ్రీకృష్ణు డొక్కడే అని తెగువరుల ప్రశంస.

6. 'అనువరి ఎవ్వడు?' అన్న ప్రశ్న రాజనీతిజ్ఞులు వేసేది. శ్రీకృష్ణుడి మాటలు పైకి నీతులు. లోన సామదానభేదోపాయ బృంహితాలు. ధర్మనీతి మార్గంలో ఉపాయాలు ప్రయోగించ బడతాయి. కౌరవులు దుర్నీతి మార్గగాములు కాబట్టి ఉపాయ నైపుణ్యం ఉండదు. యుద్ధ పిపాస మాత్రమే కనపడుతుంది.

7. 'అచలాకృతులై ఊరకుండటం' సాత్త్వికాభినయం. కదలకుండా కొండవలె (ఉపమాలంకారం) కొయ్యబారి కూర్చుండిపోయారు. అందుకే కాబోలు జమదగ్న్యాది మహర్షులు తేరుకొని మాట్లాడటం మొదలు పెట్టారు.

8. శ్రీకృష్ణుడు కౌరవసభలో గాలినంతా తనవైపు మళ్ళించుకొన్నాడు. ధర్మజుడి ఉపాయంలోని తొలిఘట్టం విజయవంతంగా ముగించాడు. (సంపా.)

వ. జామదగ్న్య మహాముని సుయోధనునితో నిట్లనియె : 284

ప్రతిపదార్థం: జామదగ్న్య మహాముని= జామదగ్న్యుడనే మహర్షి; సుయోధనునితోన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: జామదగ్న్యుడు అనే మహర్షి దుర్యోధనుడితో ఇట్లా చెప్పాడు :

సీ. వినుము దంభోద్భవుం డనురాజు దన కెదు।
రెవ్వరు లేరంచు గ్రొవ్వి నరుఁడు
నారాయణుం డనువారలు గంధమా।
దనమను నగమునఁ దపము సేయ
వారిపైఁ జని యాహవమునకుఁ బిలిచిన।
నమ్మునీంద్రులు వలదని యనేక
విధములఁ జెప్పంగ వెండియుఁ బోకున్నఁ।
గుశముష్టి నుజ్జ్వల విశిఖవృష్టిఁ

ఆ. గురిసి నరుఁడు సేనఁ గూల్చి యాతని భంగ।
పెట్టి పట్టి విడిచె నట్టి యమ్మ
హాత్ము లిపుడు పార్థుఁడనఁ గృష్ణుఁడనఁగ లీ।
లార్థ కలిత జన్ములైరి సూవె! 285

ప్రతిపదార్థం: వినుము= సుయోధనా! నా మాటలు వినుము; దంభోద్భవుండు+అను రాజు= దంభోద్భవుఁడనే ప్రభువు; తనకున్+ఎదురు+ఎవ్వరున్+లేరు+అంచున్= తనకు అడ్డమెవ్వరూ లేరని; క్రొవ్వి= గర్వించి; నరుఁడు; నారాయణుండు; అనువారలు= అనునట్టివారు; గంధమాదనము+అను నగమునన్= గంధమాదనము అనే పేరుగల పర్వతంమీద; తపము+చేయన్= తపసు చేస్తుండగా; వారిపైన్+చని= వారిమీదికి వెళ్ళి; ఆహవమునకున్+పిలిచినన్= యుద్ధానికి ఆహ్వానించగా; ఆ+ముని+ ఇంద్రులు= ఆ మునీశ్వరులు; వలదు+అని= వద్దని; అనేక విధములన్= పలు రీతుల; చెప్పంగన్= పలుకగా; వెండియున్= మరల; పోక+ఉన్నన్= అతడు తొలగకున్నప్పుడు; నరుఁడు= నరుడనే ఋషి; కుశముష్టిన్= దర్భలు ధరించిన పిడికిటితో; ఉజ్జ్వల విశిఖ వృష్టిన్= వాడియైన బాణాలు అనే వర్షమును; కురిసి= వర్షించి; సేనన్+కూల్చి= దంభోద్భవుడి సైన్యాన్ని హతంచేసి; ఆతనిన్= అతడిని; భంగపెట్టి= పరాభవించి; పట్టి= బంధించి; విడిచెన్= ఆ తరువాత కరుణతో వదలివేశాడు; అట్టి= అటువంటి; ఆ+మహా+ఆత్ములు= ఆ మహనీయులు; ఇప్పుడు= ఈవేళ; పార్థుఁడు+అనన్= అర్జునుడనగా; కృష్ణుఁడు+అనఁగన్= శ్రీకృష్ణుడనగా; లీలా+అర్థ+కలిత జన్ములు+ఐరి+చూవె!= విలాసం కొరకు పుట్టుకలను స్వీకరించారు సుమా!

తాత్పర్యం: దుర్యోధనా! వినుము. దంభోద్భవుడనే రాజు తనకు ఎదురెవ్వరూ లేరని గర్వంతో విర్రవీగుతూ, నరనారాయణులనే దేవర్షులు గంధమాదన పర్వతంమీద తపస్సు చేసికొంటుంటే వారిపైకి వెళ్ళి యుద్ధానికి ఆహ్వానించాడు. ఆ మహామునులు యుద్ధం వద్దని ఎన్నో విధాల చెప్పిచూచారు. అతడు మొండికి పడి అక్కడి నుండి కదలకుంటే నరుడు దర్భలు ధరించిన పిడికిటితో వాడియైన బాణాల వాన కురిపించి దంభోద్భవుడి సేనలను హతం చేశాడు. అతడిని పట్టి పరాభవించి చివరికి దయదలచి వదలివేశాడు. ఆ మహానుభావు లిద్దరూ ఇప్పుడు పార్థుడనే పేరుతో శ్రీకృష్ణుడనే పేరుతో క్రీడార్థమై ఈ భువిలో అవతరించారు సుమా!

వ. కావున నీవా దంభోద్భవు చందంబున నుద్ధతి వాటించుటయు, నరనారాయణులతోడఁ దొడరుటయు మీఁద మేలయి యుండదు; పాండవులతోడి పొందు మేలనిన యనంతరంబ కణ్వుండు దుర్యోధనున కిట్లనియె: 286

ప్రతిపదార్థం: కావునన్= కనుక; నీవు; ఆ దంభోద్భవు చందంబునన్= ఆ దంభోద్భవుడి మాదిరి; ఉద్ధతి+పాటించుటయున్= గర్వం వహించటమూ; నరనారాయణులతోడన్; తొడరు టయున్= ఎదిరించటమూ; మీఁదన్= ముందు; మేలు+అయి+ఉండదు= శ్రేయం కలిగించదు; పాండవులతోడి పొందు= పాండవులతో కలిసి ఉండటం; మేలు= మంచిది; అనిన+అనంతరంబు+అ= అని జామదగ్న్యుడు చెప్పిన పిదప; కణ్వుండు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కాబట్టి ఆ దంభోద్భవుడి విధంగా గర్వం వహించటం, నరనారాయణులను ఎదిరించటం మేలుకాదు. పాండవులతోడి పొందు మేలు' అని జామదగ్న్యుడు చెప్పిన పిదప కణ్వుడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు:

కణ్వుండు దుర్యోధనునితో గరుత్మంతుని వృత్తాంతంబు సెప్పుట (సం.5-95-1)

ఆ. అదివోలుఁ; దన్ను నెదిరిని।
మది నెఱుఁగక నిగ్రహించి మదమెత్తుట యొ
ప్పు; దహంకారం బొనరిం।
పదె పౌరుషహానిఁ దొల్లి పక్షీంద్రునకున్. 287

ప్రతిపదార్థం: అది+పోలున్= జామదగ్న్యుడు చెప్పినమాటలు తగిఉన్నవి; తన్నున్= తనను; ఎదిరినిన్= ఎదుటివానిని; మదిన్= మనస్సులో; ఎఱుఁగక= తెలియలేక; నిగ్రహించి= త్రోసివేసి; మదము+ఎత్తుట= గర్వపడటం; ఒప్పదు= తగదు; తొల్లి= మునుపు; పక్షి+ఇంద్రునకున్= పక్షులకు రాజైన గరుత్మంతుడికి; అహంకారంబు= గర్వం; పౌరుషహానిన్= పరాక్రమానికి చేటు; ఒనరింపదె?= కలిగింపలేదా? (కలిగించినదని అర్థం.)

తాత్పర్యం: 'జామదగ్న్య మహాముని చెప్పిన మాటలు సమంజసాలు. తన శక్తినీ, ఎదిరి శక్తినీ గమనించక గర్వంతో ధిక్కరించటం యుక్తం కాదు. పూర్వం అహంకారం గరుత్మంతుడికి శౌర్యహానిని కలిగించింది సుమా!

వ. అది యెట్లనిన. 288

తాత్పర్యం: ఆ కథ యేమిటంటే.

సీ. అమరేంద్రరథసూతుఁడైన మాతలి దన।
సుత గుణకేశికిఁ బతిఁ దగంగ
నారసి యార్యకుండను భుజంగాధిపు।
మనుమనిఁ జికురుని తనయు సుముఖు

నర్థిమైఁ గోరిన నార్యకుం డుమ్మలి।
కంబుతో నిట్లను "గరుడుఁ డితని
తండ్రి వధించి యెంతయు నల్కమై వీని।
నింకిట నెల సమయించువాఁడు

ఆ. గాఁగఁ బూనిపోయెఁ గావున నే మియ్య।
కొనఁగనేర" మనిన విని 'బలారి
నడిగి పడసి యిత్తు నాయువు రం' డని।
వారిఁగొనుచు నరిగె సారథియును. 289

ప్రతిపదార్థం: అమర+ఇంద్ర= దేవేంద్రుడియొక్క; రథసూతుఁడు+ఐన= రథసారథి ఐన; మాతలి= మాతలి అనేవాడు; తనసుత= తన కొమార్తెఅయిన; గుణకేశికిన్= గుణకేశి అనేదానికి; పతిన్= భర్తను; తగంగన్= చక్కగా; ఆరసి= విచారించి; ఆర్యకుండు+అను= ఆర్యకుడనే పేరుగల; భుజంగ+అధిపు మనుమనిన్= సర్పరాజు యొక్క మనుమడూ; చికురుని తనయున్= చికురుడనే వాడి కుమారుడూ అయిన; సుముఖున్= సుముఖుడనే పేరుగల వాడిని; అర్థిమైన్= ఆసక్తితో; కోరినన్= వేడగా; ఆర్యకుండు= ఆర్యకుడు; ఉమ్మలికంబుతోన్= దుఃఖంతో; ఇట్లు+అనున్= ఇట్లా చెప్పాడు; గరుడుఁడు= గరుత్మంతుడు; ఇతని తండ్రిన్= ఈతడి జనకుడిని; వధించి= చంపి; ఎంతయున్= మిక్కిలి; అల్కమైన్= కోపంతో; వీనిన్= సుముఖుడిని; ఇంకన్+ఇటన్= ఇంకనిక్కడ; నెలన్= నెలరోజులలో; సమయించువాఁడు+కాఁగన్= చంపేటట్లుగా; పూని= నిశ్చయించి; పోయెన్= వెళ్ళాడు; కావునన్= కనుక; ఏము= మేము; ఇయ్యకొనఁగన్+నేరము= పెండ్లికి అంగీకరించలేము; అనినన్+విని= అని ఆర్యకుడు చెప్పగా ఆలించి; సారథియును= ఇంద్ర రథ సారథి అయిన మాతలియు; బల+అరిన్= బలుడనే రాక్షసుడికి విరోధి అయిన దేవేంద్రుడిని; అడిగి= అర్థించి; ఆయువున్= ఆయుర్దాయాన్ని; పడసి+ఇత్తున్= పొంది సుముఖుడికిస్తాను; రండు= మీరు నావెంట రండి;

అని= అనుచు; వారిన్+కొనుచున్+అరిగెన్= వారిని తన వెంట తీసికొనివెళ్ళాడు.

తాత్పర్యం: దేవేంద్రుడి రథసారథి అయిన మాతలి గుణకేశి అనే తన కొమార్తెకు విచారించుకొని, ఆర్యకుడు అనే సర్పనాయకుడి మనుమడున్నూ, చికురుడనే వాడి తనయుడున్నూ అయిన సుముఖుడిని భర్తగా నిర్ణయించాడు. అట్లా నిర్ణయించుకొని ఆర్యకుడి దగ్గరకు వెళ్ళి ప్రీతితో సుముఖుడిని కోరాడు. అప్పుడు ఆర్యకుడు దుఃఖంతో 'గరుత్మంతుడు వీని తండ్రియైన చికురుడిని చంపివేసి, నెలరోజులలో సుముఖుడిని కూడ సంహరిస్తానని కోపంతో పంతగించి పలికి వెళ్ళాడు. ఇట్టి దశలో మేము సుముఖుడి వివాహానికి సమ్మతించలేము' అని చెప్పాడు. ఆ మాటలు విని మాతలి 'దేవేంద్రుడి నడిగి సుముఖుడికి ఆయుస్సు తీసి యిస్తాను రం'డని వారిని తన వెంటబెట్టుకొని ఇంద్రుడి కడకు వెళ్ళాడు.

వ. వారల భాగ్యంబున నప్పు డింద్రుండును, నుపేంద్రుండును, నొక్కచో నుండం గని మాతలి యక్కార్యంబు విన్నవించినం గరుణించి జిష్ణుండు విష్ణునకుం జెప్పి చేయించువాఁడై వైనతేయు దెసకుం దాన చాలి సుముఖుం జిరాయు రుపేతుం జేసిన 290

ప్రతిపదార్థం: వారల భాగ్యంబునన్= వారి అదృష్టంచేత; అప్పుడు; ఇంద్రుండును; ఉపేంద్రుండును= విష్ణువు; ఒక్కచోన్= ఒక్కచోట; ఉండన్+కని= ఉండటం చూచి; మాతలి; ఆ కార్యంబు విన్నవించినన్= తాను వచ్చినపని మనవి చేయగా; కరుణించి; జిష్ణుండు= దేవేంద్రుడు; విష్ణునకున్+చెప్పి చేయించువాఁడు+ఐ= మహావిష్ణువునకు దెలిపి చేయించే వాడై; వైనతేయు దెసకున్= వినతా పుత్రుడైన గరుత్మంతుడి దిక్కునకు; తాను+అ= తానే; చాలి= శక్తి గల్గినవాఁడై; సుముఖున్= సుముఖుడిని; చిర+ఆయుః+ఉపేతున్+చేసినన్= దీర్ఘాయుష్యంతో కూడిన వాడిని చేయగా.

తాత్పర్యం: వారి అదృష్టంవలన అప్పుడు ఇంద్రుడూ ఉపేంద్రుడూ ఒకే చోట ఉన్నారు. మాతలి వారిని చూచి వచ్చిన కార్యం నివేదించాడు. అందుకు సురపతి కరుణించి విష్ణుదేవుడికి చెప్పి చేయించదలచి, గరుత్మంతుడి విషయంలో తాను చాలుదునని ఎంచి సుముఖుడిని దీర్ఘాయుష్మంతుణ్ణి చేశాడు.

క. మాతలి పాణిగ్రహణం ।
బాతనిఁ జేయించియున్న నంతయు విని తా
నేతెంచి గరుడుఁ డతి కో ।
పాతురుఁడై రేఁగి పెలుచ నమరాధిపుతోన్. 291

వ. వాసుదేవ సన్నిధి నిట్లనియె. 292

ప్రతిపదార్థం: మాతలి= ఇంద్ర సారథి; ఆతనిన్= సుముఖుడిని; పాణిగ్రహణంబు చేయించి= పెండ్లి చేయించి; ఉన్నన్= సుఖంగా ఉండగా; అంతయున్+విని= ఆ విషయమంతా తెలిసి; గరుడుఁడు= గరుత్మంతుఁడు; తాన్+ఏతెంచి= తా నచ్చటికి వచ్చి; అతికోప+ఆతురుఁడు+ఐ= మిక్కిలి కోపంతో ఒడలు తెలియనివాడై; పెలుచన్+రేఁగి= మిక్కిలి చెలరేగి; అమర+అధిపుతోన్= దేవతలకు రాజైన ఇంద్రుడితో; వాసుదేవ సన్నిధిన్= నారాయణుడి సముఖంలో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: మాతలి తన పుత్రికను సుముఖుడి కిచ్చి వివాహం జరిపించి ఉండగా ఆ సంగతి విని గరుత్మంతుడు అక్కడికి వచ్చి క్రోధపరవశుడై ఇంద్రుడితో నారాయణుడి సమక్షంలో ఇట్లా అన్నాడు:

క. 'విను నీ వదితిసుతుండవు ।
వినత కొడుక నేను; విట్టివీఁగెడు మనకున్
జనకుఁడు గ శ్యపుఁ డొక్కఁడ; ।
దనుజుల శోధించి చంపుదమ యిరువురమున్. 293

ప్రతిపదార్థం: విను= వినుము; నీవు; అదితిసుతుండవు= అదితియొక్క కొడుకవు; నేను; వినత కొడుకన్= వినతయొక్క కొడుకును; విఱ్ఱవీఁగెడు మనకున్= మిక్కిలిఒప్పుతున్న మనకు; జనకుఁడు= తండ్రి; కశ్యపుఁడు+ఒక్కఁడు+అ= కశ్యపుడొకడే; ఇరువురమున్= మనమిద్దరమునూ; దనుజులన్= రక్కసులను; శోధించి= వెదకి; చంపుదము+అ= చంపుదామా?

తాత్పర్యం: 'అదితిపుత్రుడవు నీవు. వినతా పుత్రుడను నేను. వైభవాతిశయంగల మన కిద్దరికీ కశ్యపు డొక్కడే తండ్రి. ఇద్దరం కలిసి రాక్షసులను వెదకి వెదకి చంపుదామా?

క. ఏమిట నీకేఁ దక్కువ।
నా మేరకు నడ్డపడితి 'నావుడు నింద్రుం
డీ మహనీయ మహిమకును।
ధామము విష్ణుండుగాక తక్కొరుఁ డగునే?' 294

ప్రతిపదార్థం: నీకున్= నీకు; ఏన్= నేను; ఏమిటన్= ఏ విషయంలో; తక్కువ?= లొచ్చు?; నా మేరకున్= నా నిర్ణయానికి; అడ్డపడితి(వి)= అడ్డం వచ్చావు; నావుడున్= అని గరుత్మంతుడనగా; ఇంద్రుండు= ఇంద్రుడు; ఈ మహనీయ మహిమకును= ఈ నీ గొప్ప ప్రభావానికి; ధామము= ఆశ్రయం; విష్ణుండు+కాక= విష్ణుదేవుడే తప్ప; తక్కు+ఒరుఁడు+అగునే?= మరొక్కడు కాడు.

తాత్పర్యం: ఇంద్రా! ఏ విషయంలో నేను నీ కంటె తక్కువ? నా నిర్ణయానికి నీవెందుకు అడ్డుపడ్డావు? అని గరుత్మంతుడు ప్రశ్నించగా సురనాథుడు ఈ నీ గొప్ప ప్రభావానికి అంతటికీ విష్ణుదేవుడు తప్ప మరొక్కడు కారణం కాదు.'

వ. అనిన విని గటకటం బడి గరుత్మంతుం డిట్లనియె: 295

ప్రతిపదార్థం: అనినన్; విని; కటకటంబడి= విచారపడి; గరుత్మంతుండు= గరుత్మంతుడు; ఇట్లు+అనియెన్= ఇట్లాఅన్నాడు.

తాత్పర్యం: ఇంద్రుడి మాటలకు విచారపడి గరుత్మంతు డిట్లా అన్నాడు :

ఉ. 'తమ్ముఁడ! నీవు నా కొలఁది తథ్యమెఱుంగక నాకు నీచభా
వమ్మగు భంగిఁ జేసితివి; వాసవ! యి య్యదితి ప్రసూత వం
శ మ్మఖిలమ్ముఁ దాల్తు నొక సన్నపు టీఁకన; యిట్టి నన్ను నీ
విమ్మెయి దూలపుత్తె! యని యీక్షణరోచులఁ గెంపె పెలర్పఁగన్. 296

ప్రతిపదార్థం: తమ్ముఁడ!= తమ్ముడవైన ఇంద్రుడా!; నీవు= నీవు; నా కొలఁది= నా శక్తి యొక్క పరిమాణం; తథ్యము= వాస్తవంగా; ఎఱుంగక= తెలియజాలక; నాకున్= నాకు; నీచభావమ్ము+అగుభంగిన్+చేసితివి= అల్పస్థితి కలిగేటట్లు వ్యవహరించావు; వాసవ!= ఇంద్రా! ఈ+అదితి ప్రసూత వంశమ్ము+అఖిలమ్మున్= ఈ అదితికి జన్మించిన దేవతాకులం అంతటినీ; ఒక సన్నము+ ఈఁకన్+అ= ఒక సన్నపాటి ఈకమీదే; తాల్తున్= ధరించగలను; ఇట్టి నన్నున్= ఇట్లాంటి బలాఢ్యుడనైన నన్ను; నీవు= నీవు; ఈ+మెయిన్= ఈ విధంగా; తూల+పుత్తె?= చిన్నబుచ్చుతావా?; అని= అంటూ; ఈక్షణరోచులన్= కన్నుల కాంతులందు; కెంపు+ఎలర్పఁగన్= ఎఱ్ఱదనం అతిశయించగా.

తాత్పర్యం: 'తమ్ముడా! నీవు నా శక్తి సామర్థ్యాలు ఎట్లాంటివో వాస్తవంగా గ్రహించలేక నాకు హీనత్వమేర్పడేటట్లుగా ప్రవర్తించావు. అదితిగన్న సమస్త దేవతాకులాన్ని ఒక సన్నని ఈకపై ధరించగలను సుమా! ఇంతటి బలాఢ్యుడిని నన్ను నీవీరకంగా చిన్నబుచ్చుతావా?' అని నేత్రకాంతులలో ఎఱ్ఱదనం నిండగా.

వ. ఉన్నం గనుంగొని కోపించి వాసుదేవుండు వెడనవ్వు నవ్వుచు. 297

ప్రతిపదార్థం: ఉన్నన్= అక్కడుండగా; కనుంగొని= చూచి; కోపించి= అలుకపూని; వాసుదేవుండు= నారాయణుడు; వెడనవ్వు+ నవ్వుచున్= వెటకారంగా నవ్వుతూ.

తాత్పర్యం: ఇంద్రుడిపై గ్రుడ్లురుముతూ అక్కడున్న గరుత్మంతుడిని చూచి నారాయణుడు వెటకారంగా నవ్వుతూ.

క. 'నీవేటి మోపుకాఁడవు? ।
నా వెరవున నిన్ను నడపినను గర్వం బే
లా వెడఁగ' యంచుఁ దనముం ।
జే వీఁపున నిడ సురేంద్రజిత్తు వికలుఁడై. 298

ప్రతిపదార్థం: వెడఁగ!= వివేకహీనుడా!; నీవు+ఏటి మోపుకాఁడవు?= నీవేపాటి బరువు మోయగలవాడవు?; నా వెరవునన్= నా చాతుర్యంచేత; నిన్నున్+నడపినను= నిన్ను ప్రవర్తింపజేస్తుంటే; గర్వంబు+ఏలా?= నీ కింతటి పొగరెందుకు?; అంచున్= అని; తనముంజే= తనయొక్క ముంజేతిని; వీఁపునన్+ఇడన్= అతడి వీపుమీద ఉంచగా; సురేంద్రజిత్తు= ఇంద్రుడిని జయించిన గరుత్మంతుడు; వికలుఁడు+ఐ= బెదరినవాఁడై.

తాత్పర్యం: 'అవివేకీ! నీవు ఏపాటి భారం మోయగలవురా? నా సామర్థ్యంతో నిన్ను నడుపుకొనివస్తుంటే నీకు పొగరెందుకు?' అంటూ పరమపురుషుడు తన ముంజేతిని అతడి వీపుమీద మోపాడు. ఆ భారానికి గరుత్మంతుడు బెదరిపోయాడు.

క. ఎఱకలు విచ్చుచుఁ దుండము ।
దెఱచుచు వ్రేఁగడరి సొగసి త్రెళ్ళి వివశుఁడై
యఱచిన నోడకుమని హరి ।
నెఱి సక్కఁగఁ ద్రోచి యెత్తె నెగయంగఁ గృపన్. 299

ప్రతిపదార్థం: ఎఱకలు= రెక్కలు; విచ్చుచున్= చాస్తూ; తుండము+ తెఱచుచున్= నోరు (ముక్కు పుటాలు) తెరుస్తూ; వ్రేఁగు+అడరి= బరువు అతిశయించటం చేత; సొగసి= మూర్ఛిల్లి; త్రెళ్ళి= క్రిందపడి; వివశుఁడు+ఐ= ఒడ లెరుగనివాడై; అఱచినన్= ఆక్రోశించగా; హరి= విష్ణుమూర్తి; ఓడకుము+ అని= భయపడవద్దని; నెగయంగన్= ఎగురుటకు; నెఱిన్= ఈకలచిక్కును; చక్కఁగన్+త్రోచి= బాగుగా సవరించి; కృపన్= దయతో; ఎత్తెన్= పైకెత్తాడు.

తాత్పర్యం: పుండరీకాక్షుడు తన వీపుమీద చేయి మోపగానే ఆ బరువునకు గరుత్మంతుడు రెక్కలు చాస్తూ, నోరు తెరుస్తూ నొచ్చి నేలమీద కూలి ఒడలు తెలియక ఆక్రందనం చేశాడు. అంతట శ్రీహరి 'గరుడా! భయపడవ' ద్దని ఆతడి ఈకల చిక్కు చక్కగా సవరించి ఎగరటానికి కరుణతో అతడిని పైకెత్తాడు.

వ. ఇవ్విధంబునం గేశవుండు గరుణించి గరుడని ననునయించి 'యింక నవుదానికి నుద్ధతి మాని బుద్ధిగలిగి యుండు' మని వీడ్కొలిపి పుచ్చినం బోయెం; గావున గర్వంబు గొఱగా'; దింతయు నీ మహానుభావుం డెఱుంగునని నారదుం జూపియితండు మాతలి కన్యా కార్యంబునకుఁ దోడైనడచె; నడుగు; మదియకాదు సర్వేశ్వరుం డగు మాధవు మాహాత్మ్యం బితనికిం గరతలా మలకం బయి యుండు; బ్రభవిష్ణుండగు నాదివిష్ణుండు గదా యీ కృష్ణుం డీతని సహాయత్వంబు గల కౌంతేయులతోడం గూడి మనికి కార్యం' బనిన నారదుండు ధార్తరాష్ట్రు నాలోకించి.' 300

ప్రతిపదార్థం: ఈ+విధంబునన్; కేశవుండు= శ్రీహరి; కరుణించి= దయచూపి; గరుడనిన్= గరుత్మంతుడిని; అనునయించి= ఓదార్చి; ఇంకన్= ఇటుపై; అవుదానికిన్= జరుగనున్న దానికి; ఉద్ధతిన్‌మాని= గర్వం వదలి; బుద్ధి+కలిగి+ఉండుము; అని; వీడ్కొలిపి= సెలవొసగి; పుచ్చినన్= పంపగా; పోయెన్= వెళ్ళాడు; కావునన్; గర్వంబు; కొఱగాదు= పనికిరాదు; ఇంతయున్= ఈ సంగతిఅంతా; ఈ+మహా+అనుభావుండు= ఈ మహాత్ముడు; ఎఱుంగన్+అని; నారదున్+చూపి; ఇతండు= ఈ నారదమహర్షి; మాతలి కన్యా కార్యంబునకున్= మాతలి కొమార్తె పనికై; తోడు+ఐ నడచెన్= సాయంగా వెంట వెళ్ళాడు; అడుగుము= నారదుడిని ప్రశ్నించుము; అది+అ కాదు= అంతమాత్రమే కాదు; సర్వ+ఈశ్వరుండు+

అగు= విశ్వానికి ప్రభువైన; మాధవు మాహాత్మ్యంబు= లక్ష్మీవల్లభుడి ప్రభావం; ఇతనికిన్= నారదుడికి; కరతల+ఆమలకంబు+అయి+ఉండున్= చేతిలోని ఉసిరిక కాయవలె స్పష్టంగా తోస్తూ ఉంటుంది; ఈ కృష్ణుండు= ఈ కృష్ణమూర్తి; ప్రభవిష్ణుండు+అగు= ప్రభావశీలుడైన; ఆదివిష్ణుండు+కదా!= ఆదినారాయణమూర్తికదా!; ఈతని సహాయత్వంబు+కల= ఈతని తోడ్పాటు కలిగిఉన్న; కౌంతేయుల తోడన్= కుంతీ కుమారులతో; కూడి మనికి= కలసి జీవించటం; కార్యంబు= చేయదగిన పని; అనినన్= అని కణ్వమహాముని పలుకగా; నారదుండు; ధార్తరాష్ట్రున్= ధృతరాష్ట్రుడి కుమారుడైన దుర్యోధనుడిని; ఆలోకించి= చూచి.

తాత్పర్యం: ఈ విధంగా విష్ణుదేవుడు దయచూపి గరుత్మంతుడిని ఊరడించి, 'ఇక మీదట నీవు గర్వం విడిచి బుద్ధిగలిగి ఉండు'మని సెలవిచ్చి పంపగా, అతడు వెళ్ళిపోయాడు. కావున గర్వం పనికి రాదు. ఇదంతయు మహాత్ముడైన ఈ నారద మహర్షికి తెలుసు' అని దుర్యోధనుడికి నారదుడిని చూపి 'ఈయన మాతలి కొమార్తె పనికై వారి వెంట వెళ్ళాడు. ఈయనను అడిగిచూడుము. ఇంతేకాదు, సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుడి మహిమ ఇతడికి అరచేతిలోని ఉసిరిక కాయ సుమా! ప్రభావశీలుడైన ఆదినారాయణమూర్తియే ఈ దేవకీనందనుడని గ్రహించుము. ఈయన తోడ్పాటు గల కుంతీ పుత్రులతో నీవు పొత్తుగలిగి ఉండటం చేయదగిన పని' అని కణ్వమహర్షి పలికాడు. అప్పుడు నారద మునీంద్రుడు సుయోధనుడిని చూచి.

క. 'బలవంతుల బలములు న।
నగ్గలమగు బల మెదురఁ గలుగఁగాఁ గీడ్పడు నే
కొలఁదుల వారికి గర్వము।
నిలుచునె నయమార్గ వృత్తి నిలిచిన భంగిన్.' 301

ప్రతిపదార్థం: బలవంతుల బలములు= బలశాలులయొక్క శక్తులు; ఎదురన్= తమముందు; అగ్గలము+అగు+బలము= అధికమైన బలం; కలుగఁగాన్= ఏర్పడగా; కీడ్పడున్= తక్కువయిపోతుంది; ఏ కొలఁదుల వారికిన్= ఎంతటి శక్తి సంపన్నులకైనా; నయమార్గవృత్తి= న్యాయమార్గ ప్రవర్తనం; నిలిచిన భంగిన్= నిలబడినట్లుగా; గర్వము= పొగరు; నిలుచునె?= నిలబడగలదా?;

తాత్పర్యం: 'బలవంతుల బలాలు అంతకంటె మిక్కుటమైన బలం ఎదురైనపుడు అవి క్రిందైపోతాయి. ఎంతటి శక్తిసంపన్నులకయినా ధర్మమార్గ ప్రవర్తనం తలయెత్తి నిలబడినట్లుగా అహంకారం నిలబడలేదు.'

వ. అని పలికి వెండియు నిట్లనియె: 302

తాత్పర్యం: అని పలికి మరల నారదు డిట్లా వచించాడు :

ఆ. 'ఇదియకాని చేయ నెద్ది యే ననుచు।
నిర్బంధవృత్తిఁ దలఁపు వట్టికొనిన
నట్టి వాని కెందు నలజడి వాటిల్లు।
గాలవుండు గుటియ కాఁడె మనకు? 303

ప్రతిపదార్థం: ఇదియకాని= ఈ పని దప్ప; ఎద్దియేన్= మరేపనిని; చేయన్+అనుచున్= నేను చేయనని; నిర్బంధవృత్తిన్= కదలమెదలగూడని పట్టుదలయందు; తలఁపు పట్టుకొనినన్= తన అభిప్రాయం నిల్పితే; అట్టివానికిన్= అట్లాంటి మొండి పట్టుపట్టినవాడికి; ఎందున్= ఎచ్చటకూడ; అలజడి= క్లేశం; పాటిల్లున్= కల్గుతుంది; గాలవుండు= గాలవుడనే ముని కుమారుడు; మనకున్= మనకు; గుటి+అ కాఁడె= ఇందుకు సాక్షి కాడా?

తాత్పర్యం: 'నేనీ పనిదప్ప మరే పనీ చేయను - అని మొండిపట్టుపట్టినవాడికి ఎక్కడ కూడా ఆపదలే కల్గుతాయి. గాలవుడనే ముని కుమారుడు ఇందుకు ఉదాహరణం.

వ. వినుము విశ్వామిత్రు పాల విద్యాభ్యాసంబు సేసి గాలవుండను మునికుమారుండు 'గురుదక్షిణ యేమి సమర్పింతు' నని యడిగిన,

నతం'డేమియు నేల?'యని యుడిపిన, నుడుగక యెన్ని సెప్పిన నన్నింటికి నన్నిసెప్పి నిర్బంధించినఁ, గటకటంబడి యత్తపోధనవర్యుం 'డట్లేని శుద్ధ ధవళవర్ణంబులై యొక్క కర్ణంబు నీలంబైన యుత్తమాశ్వంబు లెనమన్నూఱు దెచ్చి యి'మ్మని పలికినం బోయి. 304

ప్రతిపదార్థం: వినుము; విశ్వామిత్రుపాలన్= విశ్వామిత్రుడి దగ్గర; విద్యా+ అభ్యాసంబు చేసి= విద్యను నేర్చి; గాలవుండు అను ముని కుమారుండు; గురుదక్షిణ; ఏమి; సమర్పింతున్?= ఇచ్చికొనేది?; అని+అడిగినన్; అతండు= విశ్వామిత్రుడు; ఏమియున్; ఏల; అని; ఉడిపినన్= మాన్పగా; ఉడుగక= మానక; ఎన్ని చెప్పినన్; అన్నింటికిన్; అన్ని చెప్పి; నిర్బంధించినన్= బలాత్కారం చేయగా; కటకటంబడి= కోపించి; ఆ+తపోధన+వర్యుండు= తపమే ధనంగా గల మునులలో శ్రేష్ఠుడు విశ్వామిత్రుడు; అట్లు+ఏనిన్= అట్లా అయితే; శుద్ధ ధవళ వర్ణంబులై= కేవలం తెల్లని రంగు కలిగినవై; ఒక్క కర్ణంబు= ఒక చెవి; నీలంబు+ఐన= నల్లనిరంగు కలిగిన; ఉత్తమ+అశ్వంబులు= మేలుజాతి గుర్రాలు; ఎనమన్నూఱు= ఎనిమిది వందలు; తెచ్చి+ఇమ్ము; అని; పలికినన్; పోయెన్= తేవటానికి గాలవుడు వెళ్ళాడు.

తాత్పర్యం: దుర్యోధనా! ఆ గాలవుడి వృత్తాంతం వినుము. గాలవుడనే ముని కుమారుడు విశ్వామిత్రుడి దగ్గర విద్యలు అభ్యసించి 'తమకు గురుదక్షిణ నేనేమి సమర్పించుకొనవలెనో సెలవివ్వండి' అని గాధేయుడిని అడిగాడు. అందుకు విశ్వామిత్రుడు 'ఏమీ వద్దు' అన్నాడు. అన్నప్పటికీ గాలవుడు మానక గురువు చెప్పిన ప్రతిమాటకూ బదులు చెపుతూ గురుదక్షిణ చెప్పితీరవలెనని బాధించాడు. విశ్వామిత్రుడికి కోపం వచ్చింది. అట్లాగయితే శరీరమంతా తెల్లగా ఉండి, ఒక చెవిమాత్రం నల్లగా ఉండే మేలుజాతి గుర్రాలు ఎనిమిదివందలు తెచ్చి ఇవ్వవలసిందని అడిగాడు. అట్లాగే అని గాలవుడు అశ్వాలకోసం అక్కడినుంచి బయలుదేరివెళ్ళాడు.

తే. గాలవుం డవ్విధము ఘోటకముల నెందుఁ ।
బడయలేక చింతాభరభ్రాంతుఁడగుచు
వెడలి యాహార నిద్రలు విడిచి తా మ ।
హాపథముఁ బోదుఁగాకని యరిగి యరిగి. 305

ప్రతిపదార్థం: గాలవుండు= గాలవుడు; ఆ+విధము ఘోటకములన్= ఆ రకమైన గుర్రాలను; ఎందున్= ఎక్కడా; పడయన్‌లేక= సంపాదించలేక; చింతాభర+భ్రాంతుఁడు+అగుచున్= విచారభారంచేత మనసు చలించినవాడు ఔతూ; వెడలి= పయనమై; ఆహారనిద్రలు విడిచి; తాన్= తాను; మహా పథమునన్+పోదున్+కాక= ప్రాణాంతం కావించుకుంటాను గాక; అని; నిశ్చయించుకొని; అరిగి అరిగి= వెళ్ళి వెళ్ళి.

తాత్పర్యం: దేహమంతా తెలుపు, ఒక చెవి మాత్రం నలుపు కలిగిన గుర్రాలను గాలవుడు ఎక్కడా సంపాదించలేక పోయాడు. విచారభారం చేత భ్రమచెంది ఆహారనిద్రలు కూడ మాని వేశాడు. ప్రాణాంతం చేసుకుంటానని నిర్ణయించుకొని గాలవుడు అట్లా వెళ్ళి వెళ్ళి.

వ. ఒక్కచో గరుడునిం గని బాలసఖుండు గావున నతనికిం దన వృత్తాంతంబు సెప్పిన నతండు కరుణా భరితుండై 306

ప్రతిపదార్థం: ఒక్కచోన్= ఒకచోట; గరుడునిన్+కని; బాలసఖుండు కావునన్= చిననాటి చెలికాడు గనుక; అతనికిన్; తన వృత్తాంతంబు= తన సమాచారం; చెప్పినన్; కరుణా భరితుండు+ఐ= గరుత్మంతుడు దయతో నిండినవాడై

తాత్పర్యం: దైవికంగా ఒకచోట గరుత్మంతుడిని చూశాడు. గరుత్మంతుడు తనకు చిననాటి చెలికాడుగనుక అతనికి సంగతి అంతా చెప్పాడు. గరుడుడు దయతో నిండిన మనసు కలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. 'దేవతలు గాని యిట్టివి ।
గావింపం జాల రీ సకల దిక్కులలో
దేవేంద్రు దిక్కు బహు దివి ।
జావాసం బందుఁ బోద మని మునిపుత్త్రున్.' 307

ప్రతిపదార్థం: దేవతలు+కాని= వేల్పులు తప్ప; ఇట్టివి= ఇటువంటి పనులు; కావింపన్+చాలరు= చేయలేరు; ఈ సకల దిక్కులలోన్= ఈ దిక్కులన్నింటిలో; దేవేంద్రు దిక్కు= తూర్పు; బహు దివిజ+ఆవాసంబు= పలు దేవతలకు నిలయం; అందున్+పోదము+అని= అక్కడికి వెళ్ళుదామని; మునిపుత్రున్= గాలవుడిని.

తాత్పర్యం: దేవతలు తప్ప ఇలాంటి కార్యాలు ఇతరులు సాధించలేరు. అన్ని దిక్కులలో తూర్పు దిక్కు వేల్పులకు నిలయం కనుక అక్కడకి వెళదామని గరుత్మంతుడు గాలవుడితో. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. అఱకడ నిడి ప్రాఙ్ముఖుఁడై ।
పఱచి జలధిలోనఁ జదలఁ బాఱెడునెడఁ జె
య్వఱి దప్పి నిలువఁ జాలక ।
యొఱగిన గాలవుని డించె నొక గిరి మీఁదన్. 308

ప్రతిపదార్థం: అఱకడన్+ఇడి= భుజస్కంధంపై పెట్టుకొని; ప్రాక్+ముఖుఁడు+ఐ= తూరుపు మొగమైనవాడై; పఱచి= పరువెత్తి; జలధిలోనన్= సముద్రంమీద; చదలన్= ఆకాశంలో; పాఱెడు+ఎడన్= ఎగిరిపోయేటప్పుడు; చెయ్వు+అఱి= చేష్టలుడిగి; దప్పిన్= శ్రమచేత; నిలువన్+చాలక= స్కంధ ప్రదేశంమీద ఉండలేక; ఒఱగిన గాలవునిన్= ప్రక్కకు వ్రాలిన గాలవుడిని; ఒక గిరిమీఁదన్= ఒక కొండమీద; డించెన్= గరుత్మంతుడు దించాడు.

తాత్పర్యం: గరుత్మంతుడు గాలవుడిని తన భుజస్కంధమీద కూర్చుండబెట్టుకొని, తూర్పు ముఖంగా బయలుదేరి సముద్రంమీద ఆకాశవీధిలో

ఎగిరిపోతూ ఉండగా గాలవుడు చేష్టలుడిగి, శ్రమచేత నిలువలేక ప్రక్కకొరుగుతుండగా అతడిని ఒక కొండ మీద దించాడు.

వ. ఇట్లు డించి డప్పిదేర్చి యందుఁ గశ్యప నందనుండు శాండిలి యను నొక్క తపస్విశాపంబునఁ బక్షంబులు డుల్లి యనుగ్రహంబునం గ్రమ్మఱ వచ్చిన విషాదమోదంబు లనుభవించి యట ననుట సాలించి మగుడ మహీతలంబునకు మునికుమారుం దెచ్చి యయాతి తన నెచ్చెలియని ప్రతిష్ఠానపురనాథుండగు నతని కడకు నాతనిం దోడ్కొని చని, యగ్గాలవు తెఱం గెఱింగించిన నతండు. 309

ప్రతిపదార్థం: ఇట్లు; డించి= దించి; డప్పి+తేర్చి= శ్రమను పోగొట్టి; అందున్= ఆ గిరిమీద; కశ్యపనందనుండు= కశ్యపప్రజాపతి కుమారుడైన గరుత్మంతుడు; శాండిలి+ అను+ఒక్క తపస్వి శాపంబునన్= శాండిలి అనే పేరుగల ఒకానొక ముని శాపం వలన; పక్షంబులు= రెక్కలు; డుల్లి= రాలి; అనుగ్రహంబునన్= ఆ ముని కృపవలన; క్రమ్మఱన్= మరల; వచ్చినన్= మొలవగా; విషాద+మోదంబులు= రెక్కలు రాలినందుకు దుఃఖమును, మరల మొలచినందుకు సంతోషమును; అనుభవించి; అటచనుట= అలా తూర్పు దెసకు వెళ్ళటం; చాలించి= మాని; మగుడన్= మరల; మహీతలంబునకున్= భూస్థలికి; మునికుమారున్+తెచ్చి; యయాతి= యయాతి అనే పేరుగల రాజు; తన నెచ్చెలి+అని= తన ప్రియమిత్రుడని; ప్రతిష్ఠాన పురనాథుండు+ అగు= ప్రతిష్ఠాన పట్టణానికి అధిపతిఅయిన; అతని కడకున్= యయాతి దగ్గరకు; అతనిన్= గాలవుడిని; తోడ్కొని చని= తీసికొని వెళ్ళి; ఆ+గాలవు తెఱంగు= ఆ గాలవుని వృత్తాంతం. ఎఱింగించినన్= చెప్పగా; అతండు= ఆ యయాతి మహారాజు.

తాత్పర్యం: గరుత్మంతుడు గాలవుడిని కొండమీద దించి బడలిక పోగొట్టాడు. అక్కడ శాండిలి అనే పేరుగల ఒక మునీశ్వరుడి శాపంవలన

తన రెక్కలు రాలి పడగా దుఃఖించి ఆ ముని అనుగ్రహంతో మరల మొలవగా సంతోషించి తూర్పు దెసగా ప్రయాణం సమకట్టటం మానివేశాడు. గరుడుడు మరల గాలవుని భూమండలానికి కొనివచ్చాడు. ప్రతిష్ఠాన పురాధీశ్వరుడు యయాతి తనకు అనుగు చెలికాడగుటవల్ల అతడి చెంతకు గాలవుడిని తోడ్కొని వెళ్ళి ఆతడి వృత్తాంతమంతా చెప్పాడు.

క. తన కట్టి గుఱ్ఱములు లే।
కునికిని మాధవి యనంగ నొప్పెడు పుత్రిన్
ముని కొసఁగె దీనికై యే।
మనుజేశుఁడు నీఁడె హయసమాజము ననుచున్. 310

ప్రతిపదార్థం: తనకున్= తనకు; అట్టి గుఱ్ఱములు= అట్లాంటి గుఱ్రాలు; లేక+ఉనికిని= లేకుండుటవలన; మాధవి+అనంగన్+ఒప్పెడు= మాధవి అనే పేరుతో ప్రకాశించే; పుత్రిన్= కొమార్తెను; దీనికై= ఈ కన్యకకై; ఏ మనుజ+ఈశుఁడు= ఏ రాజైనను; హయసమాజమున్= అశ్వాల సమూహాన్ని; ఈఁడె?= ఇవ్వకుంటాడా?; అనుచున్= అని భావించి; మునికిన్+ఒసఁగెన్= గాలవుడికి సమర్పించాడు.

తాత్పర్యం: యయాతి మహారాజు తనకు అట్లాంటి గుఱ్రాలు లేనందున మాధవి అనే తన పుత్రికను - ఈ కన్యక కొరకై ఏ రాజైనను గుఱ్రాల నివ్వకపోతాడా అని భావించి గాలవుడికి ఆమెను సమర్పించాడు.

వ. ఇట్లొసంగినం దోడుకొని. 311

తాత్పర్యం: ఇట్లా ఇవ్వగా ఆమెను (మాధవిని) వెంటబెట్టుకొని.

తే. ఇట్టి హయములుగల రాజు లెవ్వరొక్కొ!।
యనుచుఁ దిరిగి యయోధ్యకుఁజని తదీయ
నాథు నిక్ష్వాకుఁ గనిన నన్నరవరుండు।
దనకు నిన్నూఱు కాని లేవనియె హరులు. 312

ప్రతిపదార్థం: ఇట్టి హయములు= ఇట్లాంటి గుఱ్రాలు; కలరాజులు= కలిగిన భూపతులు; ఎవ్వరు+ఒక్కొ!= ఎవరున్నారో!; అనుచున్= అని తలస్తూ; తిరిగి= సంచరించి; అయోధ్యకున్+చని= అయోధ్యానగరానికి వెళ్ళి; తదీయ నాథున్= ఆ పట్టణ ప్రభువైన; ఇక్ష్వాకున్+కనినన్= ఇక్ష్వాకు భూపాలుడిని దర్శించగా; ఆ+నరవరుండు= ఆ మనుజేశ్వరుడు; తనకున్= తనకు; ఇన్నూఱు+అ+కాని= రెండువందలే తప్ప (అంతకుమించి); హరులు= గుఱ్రాలు; లేవు+ అనియెన్= లేవని చెప్పాడు.

తాత్పర్యం: యయాతి మహారాజు తనకిచ్చిన మాధవిని వెంటబెట్టుకొని, గాలవుడు విశ్వామిత్రుడు చెప్పిన లక్షణాలు కల గుఱ్రాలు కలిగిన రాజు లెవరా అంటూ సంచారం చేసి, ఇక్ష్వాకు మహారాజు ఏలుతున్న అయోధ్యా నగరానికి వచ్చాడు. ఆయనను సందర్శించాడు. ఆయన తనకు అట్లాంటి గుఱ్రాలు రెండువందలు తప్ప అంతకుమించి లేవని చెప్పాడు.

క. అన విని మాధవి ఋషికి।
ట్లను నొక్క మహానుభావు నతుల వరమునం
దనయవతి నయ్యు నేఁ గ।
న్యన యగుదుంగాన నిమ్ము నన్నీతనికిన్. 313

ప్రతిపదార్థం: అనన్+విని= ఇక్ష్వాకు మహారాజు అట్లా చెప్పగా విని; మాధవి= యయాతి పుత్రి; ఋషికిన్= మునిఅయిన గాలవుడికి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నది; ఒక్క మహానుభావు+అతులవరమునన్= ఒకానొక మహనీయుడి సాటిలేని వరంచేత; తనయవతిన్+అయ్యున్= బిడ్డలు కన్నదాననైనప్పటికిన్నీ, నేన్= నేను; కన్యన్+అ+ అగుదున్= పెండ్లికాని కన్యకగానే ఉంటాను; కానన్= కాబట్టి; నన్నున్= నన్ను; ఈతనికిన్= ఈ ఇక్ష్వాకు మహారాజునకు; ఇమ్ము= అర్పించుము.

తాత్పర్యం: ఇక్ష్వాకు విభుడి మాట లాలకించి మాధవి గాలవుడితో ఇట్లా చెప్పింది. 'ఒకానొక మహాత్ముడి వరప్రభావం వలన నేను బిడ్డలను కన్నప్పటికీ, కన్యకగానే ఉంటాను. కనుక నన్ను ఈతడికి భార్యగా సమర్పించండి.

వ. ఒక్క సమయంబు సేసికొని యిచ్చి గుఱ్ఱంబులు వచ్చినవి యెల్లరాఁ బుచ్చి కొమ్మనిన గాలవుండు నవ్విధంబునకు సమ్మతించె; నపత్యార్థియై యిక్ష్వాకుండును నయ్యుంకువునకు భార్య యగుట పుత్త్రజన్మావధిగా నొడివి యశ్వంబుల నొసంగి కన్యకం బరిగ్రహించి దానియందు వసుమనస్సుండను కొడుకుం బడసి గాలవునకు నమ్మగువను మగుడ సమర్పించినఁ జూచి యబ్భంగిం గలచోట్ల నెల్ల నరసి తురంగంబులం గావించికొమ్మని యతనికిం జెప్పి సుపర్ణుండు సనియె; మఱియు మహీతలంబునం గ్రుమ్మరి యమ్ముని కుమారుండు గందువ లెఱింగి పోవంబోవ. 314

ప్రతిపదార్థం: ఒక్క సమయంబు+చేసికొని= ఒక ఒడంబడిక కావించుకొని; ఇచ్చి= పత్నిగా నన్నొసగి; గుఱ్ఱంబులు వచ్చినవి+ ఎల్లన్= వచ్చిన గుర్రాల నన్నింటిని; రాన్+పుచ్చికొమ్ము= వచ్చినట్లుగా తీసికొమ్ము; అనినన్= అని మాధవి చెప్పగా; గాలవుండు; ఆ విధంబునకున్; సమ్మతించెన్= అంగీకరించాడు; ఇక్ష్వాకుండును; అపత్య+అర్థిఐ= సంతానాన్ని అభిలషిస్తున్న వాడై; ఆ+ఉంకువునకున్= ఆ శుల్కానికి (అల్లుడు కన్యకార్థం మామకిచ్చే ద్రవ్యం); భార్య+అగుట= మాధవి తనకు పెండ్లమగుట; పుత్త్రజన్మ+ అవధిగాన్+నొడివి= కుమారుడు కలుగునంతవరకే గడువుగా చెప్పి; అశ్వంబులన్; ఒసంగి= గాలవున కిచ్చి; కన్యకన్; పరిగ్రహించి= స్వీకరించి; దానియందున్= మాధవియందు; వసుమనస్సుండు, అను కొడుకున్; పడసి= పొంది; గాలవునకున్; ఆ+మగువను= ఆ కాంతను; మగుడన్ సమర్పించినన్= తిరిగి ఇచ్చివేయగా; సుపర్ణుండు= గరుత్మంతుడు; చూచి= ఆ విధమంతా

చూచి; ఆ+భంగిన్= ఆరీతిగా; కలచోట్లన్+ఎల్లన్+అరసి= గుర్రాలున్న తావులన్నిటిని చూచి; తురం గంబులన్= అశ్వములను; కావించికొమ్ము= సంపాదించుకొమ్ము; అని; అతనికిన్= గాలవునకు; చెప్పి; చనియెన్= తన దారిని తానే వెళ్ళాడు; మఱియున్; మహీతలం బునన్= భూ ప్రదేశంలో; క్రుమ్మరి= సంచరించి; ఆ+ముని కుమారుండు; కందువలు+ఎఱింగి= గుర్రాలున్న జాడలు దెలిసి; పోవన్+పోవన్= పోతూ పోతూ ఉండగా.

తాత్పర్యం: ఒక ఒడంబడిక చేసుకొని నన్ను ఇక్ష్వాకుడికి పత్నిగా నిచ్చి వచ్చిన గుర్రాలను వచ్చినట్లుగా పుచ్చుకొమ్మని మాధవి చెప్పింది. అందుకు గాలవుడు సమ్మతించాడు. సంతానం అభిలషిస్తున్న ఇక్ష్వాకు చక్రవర్తి, ఒక కుమారుడు కలుగునంత వరకే మాధవి తనకు భార్యగా ఉంటుందని పల్కి, కన్యాశుల్కంగా ఇన్నూరు గుర్రాలను గాలవుడికి సమర్పించాడు. ఇక్ష్వాకువు మాధవి యందు వసుమనస్సుడు అనే కొడుకును పొంది తిరిగి ఆమె నతని కిచ్చివేశాడు. ఇదంతయు గమనించిన గరుత్మంతుడు ఈ పద్ధతిలోనే గుర్రాలను సంపాదించుకొమ్మని మునిపుత్త్రుడికి చెప్పి వెళ్ళిపోయాడు. గాలవుడు గుర్రాల కొరకు అవనీతలంలో తిరుగుతున్నాడు.

క. ఆ సమయంబునను దివో।
దాసుఁడు నౌశీనరుండుఁ దరుణికి నిన్నూ
ఱేసి హయంబుల నిచ్చి మ।
హాసత్త్వుల సుతులఁ బడసి రధికప్రీతిన్. 315

ప్రతిపదార్థం: ఆ సమయంబునను= అట్టితరి; దివోదాసుఁడున్= కాశీనగరాధిపతి అయిన దివోదాసుఁడు; ఔశీనరుండున్= భోజపుర ప్రభువైన ఔశీనరుడును; తరుణికిన్= చెలువమైన మాధవికి; ఇన్నూఱు+ఏసి= రెండేసి వందలు; హయంబులన్+ఇచ్చి= గుర్రాల నొసగి; అధికప్రీతిన్= మిక్కుటమైన సంతోషంతో; మహాసత్త్వులన్= మిక్కిలి బలశాలులైన; సుతులన్+పడసిరి= కొడుకులను కన్నారు.

తాత్పర్యం: అట్టి సమయంలో కాశీశ్వరుడైన దివోదాసుడు, భోజపురాధీశ్వరుడైన ఔశీనరుడు మాధవికి రెండేసి వందల గుర్రాల నిచ్చి అధిక బలవంతులైన కుమారులను పరమసంతోషంతో పొందారు.

వ. ఇట్లు క్రమంబునఁ గాశీశ్వరునకుఁ బ్రతర్దనుని భోజపురనాథునకు శిబిం గనిన యక్కన్యకఁ గొని వెండియు వసుంధరం దిరుగుచుండ గరుత్మంతుండు గ్రమ్మఱ వచ్చి యమ్మునితో నీ వింక జాలింబడ వలవ; దొక్క కారణంబున నీ రాజులు ముప్పురకు నివ్వాజులు గలిగె; నింతియకాని యొండెడ నీచందంబున మొత్తంబులై దొరకనేర; వియ్యాఱునూఱు గుఱ్ఱంబులను గురువునకు సమర్పింపు; మొక్కటి సెప్పెద వినుమని యిట్లనియె. 316

ప్రతిపదార్థం: ఇట్లు; క్రమంబునన్= వరుసగా; కాశీశ్వరునకున్= కాశీపట్టణ ప్రభువైన దివోదాసునకు; ప్రతర్దనునిన్= ప్రతర్దనుడనే కుమారుడినీ; భోజపుర నాథునకున్= భోజపట్టణానికి భర్తఅయిన ఔశీనరునకు; శిబిన్= శిబిఅనే పుత్రుడినీ; కనిన= కనినట్టి; ఆ+కన్యకన్= బిడ్డలను కనికూడ కన్యాత్వం పాయని మాధవిని; కొని= గాలవుడు వెంటబెట్టుకొని; వెండియున్= మరల; వసుంధరన్= భూమిలో; తిరుగుచున్; ఉండన్; గరుత్మంతుండు; క్రమ్మఱివచ్చి= మరలివచ్చి; ఆ+మునితోన్= గాలవుడితో; నీవు; ఇంకన్; జాలిన్+పడన్+వలవదు= శ్రమపడవద్దు; ఒక్క కారణంబునన్= ఒక హేతువు చేత; ఈ రాజులు ముప్పురకున్= ఇక్ష్వాకువు, దివోదాసుడు, ఔశీనరుడు అనే ఈ ముగ్గురు ప్రభువులకు; ఈ+వాజులు+కలిగెన్= ఈ గుర్రాలు లభించాయి; ఇంతియకాని= ఇంతేతప్ప; ఒండు+ఎడన్= మరొక్కచోట; ఈ చందంబునన్= ఈ మాదిరి; మొత్తంబులు+ఐ= గుంపులుగా; దొరకన్+నేరవు= లభించ జాలవు; ఈ+ఆఱునూఱు గుఱ్ఱంబులను= నీవు సంపాదించిన ఈ ఆరు వందల గుర్రాలను; గురువునకున్= గురువైన విశ్వామిత్రుడికి; సమర్పింపుము; ఒక్కటి చెప్పెదన్; వినుము; అని; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఇట్లా కాశీశ్వరుడైన దివోదాసుడికి ప్రతర్దనుడు అనే కుమారుడిని, భోజ పట్టణాధీశ్వరుడైన ఔశీనరునకు శిబి అనే తనయుడిని క్రమంగా మాధవి కన్నది. కనికూడా కన్యాత్వం కోల్పోని ఆమెను వెంటబెట్టుకొని మళ్ళీ గుర్రాలకై గాలవుడు భూ సంచారం చేస్తుండగా గరుత్మంతుడు మరల వచ్చి అతడితో- 'నీవిక శ్రమపడవద్దు. ఒకానొక కారణం చేత ఈ ముగ్గురు రాజులకు ఇట్లాంటి గుర్రాలు లభించాయి. అంతేకాని లోకంలో మరెక్కడా ఈ విధంగా ఇన్ని గుర్రాలు దొరకవు. ఈ ఆరువందల అశ్వాలను నీ గురుడైన విశ్వామిత్రుడికి సమర్పించుము. ఒక మాట చెపుతాను, వినుము.

క. ఈ ముప్పుర తెఱఁగునఁ దగ।
నా మునియుం గొడుకుఁ బడయునట్లుగ నిమ్మీ
కోమలిని గొఱంతకు వి।
శ్వామిత్రున కెట్టులైన సంప్రార్థనతోన్. 317

ప్రతిపదార్థం: ఈ ముప్పుర తెఱఁగునన్= ఈ ముగ్గురు రాజులవలెనే; తగన్= యుక్తంగా; ఆ+మునియున్= మౌనిఐన ఆ విశ్వామిత్రుడున్నూ; కొడుకున్= కుమారుడిని; పడయునట్లుగన్= పొందేటట్లుగా; కొఱంతకున్= తక్కువపడిన ఇన్నూరు గుర్రాల కొరకు; ఎట్టులు+ఐనన్= ఏవిధంగా నైనా; సంప్రార్థనతోన్= వేడికోలుతో; ఈ కోమలినిన్= సుకుమారిఅయిన ఈ మాధవిని; ఇమ్ము= గురుదక్షిణగా సమర్పించుము.

తాత్పర్యం: ఈ ముగ్గురు రాజుల వలెనే మౌనిఅయిన విశ్వామిత్రుడు కూడ కుమారుడిని కనే విధంగా తక్కువ పడిన ఆ రెండువందల గుఱ్ఱాలకొరకై ఎట్లాగైనా వేడుకొని విశ్వామిత్రుడికి తరుణిఅయిన మాధవిని సమర్పించ వలసింది.'

వ. అని తానునుఁ దోడుసని యత్తపస్విపాలికింబోయి యత్తెఱం గెఱింగించి, గాలవుం గానిపించి, 'యీతండు బాలుండు, నీవు

దయాళుండ' వితనిం గృతార్థుం జేయవలయు నని ప్రార్థించి పక్షిరా జక్కార్యంబు చక్కంజేసి పోయిన. 318

ప్రతిపదార్థం: అని; తానును; తోడు+చని= సహాయంగా బయలుదేరి; ఆ+తపస్వి పాలికిన్+పోయి=ఆ మునీంద్రుడి చెంతకుపోయి; ఆ+తెఱంగు+ ఎఱింగించి= గాలవుడు ఆరువందల గుర్రాలను సంపాదించినవైనమూ, మరెక్కడా అలాంటి గుర్రాలు దొరకని స్థితీ తెలిపి; గాలవున్; కానిపించి= చూపి; ఈతండు; బాలుండు= పసివాడు; నీవు; దయాళుండవు= కరుణా స్వభావుడవు; ఇతనిన్; కృతార్థున్+చేయన్+వలయున్= కోరిక నెరవేరిన వాడినిగా కావించవలెను; అని ప్రార్థించి= అని వేడుకొని; పక్షిరాజు= ఖగనాథుడైన గరుత్మంతుడు; ఆ+కార్యంబు; చక్కన్+చేసి= సరిపరచి; పోయినన్= వెళ్ళగా.

తాత్పర్యం: గరుత్మంతుడు తాను కూడ గాలవుడికి తోడుగా విశ్వామిత్ర మునీంద్రుడి పాలికి వెళ్ళి గాలవుడిని చూపి, అతడు ఆరువందల అశ్వాలను సంపాదించిన వైన మెరింగించి 'ఇతడు పసివాడు; నీవు కృపాస్వభావుడివి. ఇతడిని గురు ఋణంనుండి విముక్తుణ్ణి కావించు'మని వేడుకొని, పని చక్కబెట్టి వెళ్ళిపోగా.

క. మునివరుఁ డష్టకుఁ డనియెడు ।
తనయుఁ బడసి శిష్యునకు సుదతి నొప్పించెన్;
వనితయుఁ దపంబు సేయం ।
జనియెను; గాలవున కిట్టి చరితము గలిగెన్. 319

ప్రతిపదార్థం: మునివరుఁడు= మునులలో శ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు, అష్టకుఁడు+ అనియెడు= అష్టకుడనే పేరుగల; తనయున్+పడసి= కుమారుడిని పొంది; శిష్యునకున్= ఛాత్రుడైన గాలవుడికి; సుదతిన్= చక్కని దంతాలుగల మాధవిని; ఒప్పించెన్= అతడికి అప్పజెప్పాడు; వనితయున్= మాధవియు; తపంబుచేయన్+చనియెన్= తపస్సు చేయటానికి వెళ్ళింది; గాలవునకున్= గాలవుడికి; ఇట్టి చరితము= ఇట్టి వర్తనం; కలిగెన్= సంప్రాప్తమైనది.

తాత్పర్యం: మునిపుంగవుడైన విశ్వామిత్రుడు అష్టకుడనే కుమారుడిని కని శిష్యుడికి మాధవిని అప్పగించాడు. మాధవి కూడ తపస్సు చేసికొనటానికి వెళ్ళిపోయింది. గాలవుడి కథ ఇట్లా జరిగింది.

వ. కావున నెట్టివారికి నిర్బంధము దగదు; దుర్మానంబు దుర్దశ నాపాదించు; నయ్యయాతి దుర్మానంబునంగాదె పుణ్యలోక పరిభ్రష్టుండై మాధవీ పుత్త్రులగు నన్నలువురు దౌహిత్రులకతంబున నూర్ధ్వగతిం గనియె; నట్లగుటం జేసి. 320

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఎట్టివారికిన్= ఎటువంటివారికైనను; నిర్బంధము తగదు= బలాత్కారం కూడదు; దుర్మానంబు= దురహంకారం; దుర్దశన్= దుఃస్థితిని; ఆపాదించున్= కలిగిస్తుంది; ఆ యయాతి; దుర్మానంబునన్+కాదె= దుర్గర్వం వల్లనే కదా; పుణ్యలోక పరిభ్రష్టుండు+ఐ= ఉత్తమలోకాలనుండి జారినవాడై; మాధవీపుత్త్రులు+ అగు= మాధవి అనే తన కొమార్తె కొడుకులైన; ఆ+నలువురు దౌహిత్రుల కతంబునన్= ఆ నలుగురు మనుమళ్ళ మూలాన (దుహిత= కూతురు; దౌహిత్రుడు= దుహితయొక్క పుత్త్రుడు- మనుమడు); ఊర్ధ్వగతిన్+కనియెన్= ఉత్తమలోక ప్రాప్తినందాడు; అట్లు+ అగుటన్+చేసి= అందువలన.

తాత్పర్యం: దుర్యోధనా! ఎట్టివారికైనా నిర్బంధం పనికిరాదు. దురహంకారం దుఃస్థితి కలిగిస్తుంది. యయాతి మహారాజు దురహంకారం చేతనే పుణ్యలోకాలనుండి దిగజారి కొమార్తె మాధవియొక్క నలుగురు తనయుల మూలాన ఊర్ధ్వలోక ప్రాప్తి నందాడు. కాబట్టి- (తరువాతి పద్యంతో అన్వయం.)

క. నిర్బంధము దుర్మానము ।
దుర్బుద్ధికిఁ గాక తగునె? దుర్యోధన! నీ

మార్బలమె పాండవులకున్ ।

దౌర్బల్యము వాయు శుభము దలఁకొను సంధిన్. 321

ప్రతిపదార్థం: దుర్యోధన!= సుయోధనా!; నిర్బంధము= కదలమెదలగూడని కట్టుబాటూ; దుర్మానము= దురహంకారమూ; దుర్బుద్ధికిన్+కాక= దుష్టచిత్తుడికి తప్ప; తగునె?= నీకు తగునా? (తగవని అర్థం); నీ మార్బలమె?= పాండవులు నీకు శత్రుబలమా? (కారనుట); పాండవులకున్= కౌంతేయులకు; సంధిన్= పొత్తువలన; దౌర్బల్యము+ పాయున్= దుర్బలత్వం తొలగుతుంది; శుభము= మేలు; తలఁకొనున్= కలుగుతుంది.

తాత్పర్యం: సుయోధనా! పరులను నిర్బంధించటం, దురహంకారం పూనటం దుష్టాత్ముడికి తప్ప నీకు తగవు. నీవు ప్రతిఘటించడం పాండవుల దౌర్బల్యాన్ని తొలగిస్తుంది. సంధివల్ల నీకు మేలు కల్గుతుంది.

విశేషం: సూర్యరాయాంధ్ర నిఘంటువులో ఈ పద్యమిట్లు పేర్కొనబడింది: **"క. నిర్బంధము దుర్మానము । దుర్బుద్ధికిఁ గాక తగునె? దుర్యోధన! నీ । మార్బలమె పాండవేయులు? దౌర్బల్యము వాయు, శుభముదలఁకొను సంధిన్."** ప్రతిపదార్థం: నిర్బంధమున్= బలాత్కారమూ; దుర్మానమున్= దురహంకారమూ; దుర్బుద్ధికిన్+కాక= దుష్టబుద్ధికి కాక; తగునె= తగునా?; దుర్యోధన!; పాండవేయులు= పాండవులు; నీ-మార్బలమె?= నీ శత్రుబలమా?; సంధిన్= సంధిచేత; దౌర్బల్యము+పాయున్= దుర్బలత్వము పోతుంది; శుభము= మంచి; తలఁకొనున్= కలుగుతుంది. (సంపా.)

వ. కృష్ణుని మాట విని నీ విక్కౌరవాన్వయంబు రక్షింపు' మనియె; నివ్విధంబున నమ్మువ్వురు మునీంద్రులు సెప్పిన హితోపదేశంబుల దెస ననాదరంబు సేసి గాంధారేయుండు రాధేయుం గనుంగొని చేయప్పళించి నవ్వి 'వీర లింత వెఱ్ఱు లగుదురే?' యని పలికి వారల నవలోకించి. 322

ప్రతిపదార్థం: కృష్ణునిమాటన్; విని; నీవు; ఈ+కౌరవ+అన్వయంబున్= ఈ కురు వంశమును; రక్షింపుము= కాపాడుము; అనియెన్; ఈ+ విధంబునన్; ఆ+మువ్వురు; ముని+ఇంద్రులు= మునిశ్రేష్ఠులు, చెప్పిన; హిత+ఉపదేశంబుల దెసన్= హితబోధలపట్ల; అనాదరంబు+చేసి= అసమ్మతి చూపి; గాంధారేయుండు= గాంధారి కుమారుడైన దుర్యోధనుడు; రాధేయున్= కర్ణుడిని; కనుంగొని= చూచి; చేఁ+అప్పళించి= చప్పట్లు చరచి; నవ్వి= పరిహసించి; వీరలు= ఈ మునులు; ఇంత వెఱ్ఱులు+అగుదురే?= ఇంత పిచ్చివారా? అని పలికి; వారలన్= ఆ మునీశ్వరులను; అవలోకించి= కనుగొని.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి మాటలు విని నీవు ఈ కురువంశాన్ని కాపాడుము'. అని నారదుడు పలికాడు. ఆ విధంగా ఆ ముగ్గురు మునిపుంగవులు చెప్పిన హితవాక్యాలను మన్నించక దుర్యోధనుడు కర్ణుడిని చూచి, చేయి చరుస్తూ, నవ్వి 'ఈ మునీశ్వరు లెంత పిచ్చివారు? అని పలికి, వారిని చూచి. (తరువాతి పద్యంతో అన్వయం.)

దుర్యోధనుఁడు నారదాది మునుల మాటలు వినక నిరాకరించుట
(సం. 5-122-1)

క. 'మునులార! నన్ను విధి యే ।
మని మును పుట్టించె నట్టులయ్యెడుఁ గా కీ
వినఁ జవి గాని పలుకులకుఁ ।
బని గలదే యుడుగుఁ డింక బహు భాషణముల్. 323

ప్రతిపదార్థం: మునులార!= ఓ మునీశ్వరులారా!; నన్నున్= నన్ను; విధి= బ్రహ్మదేవుఁడు; ఏమి+అని= ఎట్లు కమ్మని; మును= తొలుత; పుట్టించెన్= జన్మింపజేశాడో; అట్టులు+అయ్యెడున్+కాక= అట్లాగే జరుగుతుంది పొండు; ఈ+వినన్+చవికాని+ పలుకులకున్= వినుటకు రుచించని మీ మాటలవలన; పనికలదే?= ప్రయోజనముందా?; ఇంకన్= ఇక; బహుభాషణముల్= పలుమాటలు; ఉడుగుఁడు= మానండి.

తాత్పర్యం: 'ఓ మునీశ్వరులారా! బ్రహ్మదేవుఁడు నన్ను ఏమి కమ్మని పుట్టించాడో అట్లానే జరుగుతుంది. వినటానికి రుచించని మీ మాటలవలన ఏమి ప్రయోజనం? ఇక పలుమాటలాడటం చాలించండి.'

వ. అనిన విని ధృతరాష్ట్రుం డమ్మహామునులతో నిట్లనియె. 324

ప్రతిపదార్థం: అనినన్; విని; ధృతరాష్ట్రుండు; ఆ+ మహామునులతోన్; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: కుమారుని పలుకులు విని ధృతరాష్ట్రుడు ఆ మహర్షులతో ఇట్లా అన్నాడు:

తే. 'మీరు చెప్పిన బుద్ధులు గారవమునఁ ।
జేయఁ గాంచినఁ బుణ్యంబు సేయ నెట్లు
నా ముఖంబునఁ గార్యంబు నడవ దేమి ।
సేయువాఁడ నొం డెద్దియుఁ జెప్పలేదు. 325

ప్రతిపదార్థం: మీరు చెప్పిన బుద్ధులు= మీరు చేసిన హితోపదేశాలు; గారవమునన్= ఆదరంతో; చేయన్+కాంచినన్= చేయుటకు నోచియున్నచో; పుణ్యంబున్+ఎట్లు+ చేయన్= సుకృతం చేసినవాడనే అగుదును గదా!; నా ముఖంబునన్= నా చేతిమీదుగా; కార్యంబు నడవదు= పని జరుగదు; ఏమి చేయువాఁడన్?= నేనేమి చేయగలను?; చెప్పన్= ఇంతకుమించి నుడువుటకు; ఒండు+ఎద్దియున్+లేదు= మరేమియూ లేదు.

తాత్పర్యం: 'మునిపుంగవులారా! మీరు చేసిన హితోపదేశాన్ని ఆదరంతో అనుసరించగలిగితే నేను పుణ్యం చేసినవాడనే ఔతాను గదా! కాని నావల్ల ఏ పనీ కాదు. నే నేమి చేయగలను? ఇంతకుమించి చెప్పవలసినదేమీ లేదు.'

క. అని యతఁడు శౌరితో ని ।
ట్లను 'నిహముం బరముఁ గలుగునట్టి విధము నీ

వనఘా! చెప్పితి; నాకుం ।
జన వేదియు లేదు దీన సమ్మతి నడపన్. 326

ప్రతిపదార్థం: అని= అనుచు; అతఁడు= ధృతరాష్ట్రుడు; శౌరితోన్= శ్రీకృష్ణుడితో; ఇట్లు+అనున్= ఈ లాగున అన్నాడు; అనఘా= పుణ్యాత్ముఁడా!; నీవు ఇహమున్= ఈ లోకమందు సుఖము; పరమున్= ఆలోకమందు సుఖము; కలుగు+అట్టివిధమున్= లభించే మార్గాన్ని; చెప్పితి(వి)= వచించావు; దీనిన్= నీవు చెప్పిన హితమును; సమ్మతిన్= అంగీకారముతో; నడపన్= ఆచరణలోనుంచుటకు; నాకున్= నాకు; చనవు= చొరవ, ఏదియున్+లేదు= ఏ మాత్రం లేదు.

తాత్పర్యం: మునులతో అట్లా పల్కి ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుడితో ఇట్లాఅన్నాడు. 'పుణ్యపురుషా! ఇహపరాలు రెండూ సమకూడే విధమేదో నీవు చెప్పావు. కాని, నీవు చెప్పినట్లుగా కార్యం నిర్వర్తించటానికి నాకు ఏ మాత్రం చొరవ లేదు.

ఆ. మందబుద్ధి నాదు నందనుఁ డీవు పో ।
రాని చుట్టమవు మహానుభావుఁ
డవు దయార్ద్రచిత్తుఁడవు; వీనిఁ దేర్పవే ।
యనునయించి యెట్టులైనఁ గృష్ణ!' 327

ప్రతిపదార్థం: కృష్ణ!= గోవిందా!; నాదు నందనుఁడు= నా కుమారుఁడు; మందబుద్ధి= మూఢచిత్తుడు; ఈవు= నీవు; పోరానిచుట్టమవు= త్రోసివేయ రాని బాంధవుడవు; మహానుభావుఁడవు= మహాత్ముఁడివి; దయా+ఆర్ద్ర చిత్తుఁడవు= కృపచేత తడిసిన మనస్సుకలవాడవు; వీనిన్= దుర్యోధనుడిని; అనునయించి= బుజ్జగించి; ఎట్టులు+ఐనన్= ఏ విధంగానైనను; తేర్పవే!= ప్రసన్నుడిని కావించుమయ్యా!

తాత్పర్యం: కృష్ణా! నా కుమారుడు మూఢచిత్తుడు. నీవో త్రోసిరాజనని బాంధవుడవు. మహాత్ముడవు. కారుణ్య కలిత హృదయుడివి. వీని నెట్లాగయినా శాంతింపజేయు మని వేడుకొంటున్నాను.'

క. అనిన ముకుందుఁడు దుర్యో ।
ధనుతో నిట్లనియె 'విమల తర వంశమునన్
జనియించి తెల్లగుణముల ।
ననూనుఁడవు నీకు నా దురాగ్రహ మేలా? 328

ప్రతిపదార్థం: అనినన్= అని ధృతరాష్ట్రుడు కోరగా; ముకుందుఁడు= కృష్ణుడు; దుర్యోధనుతోన్= సుయోధనుడితో; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నాడు; విమలతర వంశమునన్= పరమ స్వచ్ఛమైన కురుకులంలో; జనియించితి(వి)= పుట్టావు; ఎల్లగుణములన్= అన్నిగుణాలచేత; అనూనుఁడవు= అధికుడవు; నీకున్= ఇట్టి నీకు; ఈ+దుర్+ఆగ్రహము+ఏలా?= ఈ మొండిపట్టుదల ఎందుకు?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు తనను ఆ రీతిని కోరగా కృష్ణు డిట్లా పలికాడు: 'సుయోధనా! నీవు మిక్కిలి నిర్మలమైన వంశంలో జన్మించావు. అన్ని సద్గుణాలచే గొప్పవాడివి. ఇట్లాంటి నీకు ఈ మొండిపట్టుదల తగునటయ్యా!'

చ. తులువలు గాక యిట్టిదొర దుర్ణయవృత్తికిఁ జొచ్చునయ్య? పు
త్రులు ననుజన్ములుం జెలులు దుష్టపథంబునఁ బోవకుండఁ జు
ట్టలుఁ దగువారుఁ దండ్రియు నొడంబడఁ జేయుము కార్య; మల్పబు
ద్ధుల వెడమాట లూఁకొనకు; దోసము సేగియు వచ్చు నమ్మెయిన్.329

ప్రతిపదార్థం: తులువలు+కాక= కుచ్చితులు తప్ప; ఇట్టిదొర= నీవంటి ప్రభువు; దుర్ణయవృత్తికిన్= అన్యాయకార్యాలకు; చొచ్చును+అయ్య?= పాల్పడునా; పుత్రులున్= నీ కుమారులును; అనుజన్ములున్= తమ్ముళ్ళు; చెలులున్= మిత్రులు; దుష్టపథంబునన్= చెడుదారిలో; పోవక+ఉండన్= నడవకుండునట్లు; చుట్టలున్= బంధువులును; తగువారున్= పెద్దలు; తండ్రియున్= నీ జనకుడును; ఒడంబడన్= సమ్మతించగా; కార్యమున్+ చేయుము= పని నిర్వహించుము; అల్పబుద్ధుల= నీచ మనస్కులయొక్క; వెడమాటలు= తుచ్ఛవాక్యాలు; ఊఁకొనకు(ము)= అంగీ కరించకుము; ఆ+మెయిన్= అట్లు అంగీకరించినయెడల; దోసమున్= పాపం; సేగియున్= కీడును; వచ్చున్= వస్తాయి.

తాత్పర్యం: సుయోధనా! ఎవరో కుచ్చితులు తప్ప నీవంటి ఉత్తమ ప్రభువు ఇట్లాంటి అన్యాయ కార్యాలకు పాల్పడవచ్చునా? నీ కుమారులు, తమ్ములు, స్నేహితులు చెడుదారిలో నడవకుండా చూచుకో. నీ బంధువులు, పెద్దలు, జనకుడు సమ్మతించేటట్లుగా పాండవులతో పొత్తు కావించుకొనుము. అల్పబుద్ధిగలవారి చెడుమాటలు వినవద్దు. వారి మాటలకు తల ఒగ్గితే నీకు పాపం సంభవిస్తుంది. ఆపద మూడుతుంది.

క. పాండిత్య శౌర్య నిత్యులు ।
పాండుసుతులు వారిఁగూడి బ్రదుకుట ధృతరా
ష్ట్రుండును బాహ్లికుఁడును భీ ।
ష్మండు గురుఁడు కోరు తెఱఁగు సూవె నరేంద్రా! 330

ప్రతిపదార్థం: నర+ఇంద్రా!= మనుజేశ్వరా!; పాండుసుతులు= పాండురాజు కుమారులు; పాండిత్య శౌర్య నిత్యులు= వివేకం పరాక్రమం అనేవాటిచే స్థిరులు; వారిన్+కూడి= వారితో చేరి; బ్రదుకుట= మనటం; ధృతరాష్ట్రుండును= ధృతరాష్ట్రుడూ; బాహ్లికుడూ, భీష్మండున్= భీష్ముడూ; గురుఁడున్= ద్రోణుఁడూ; కోరు తెఱఁగు+చూవె= కోరుకొనే తీరు సుమా!

తాత్పర్యం: పాండవులు పాండిత్య పరాక్రమ సమగ్రులు. వీరితో కలసి మెలసి మీరు జీవించవలెనని ధృతరాష్ట్ర బాహ్లిక భీష్మ ద్రోణులు కోరుకొంటున్నారు సుమా!

ఆ. విను మసత్య లోభమున సిరియగునె యాఁ।
కొని ముసిండి దినినఁ గ్రొవ్వు లావుఁ
గలుగునయ్య? శకుని కర్ణ దుశ్శాసన।
మంత్రితంబు కార్య తంత్ర మగునె? 331

ప్రతిపదార్థం: వినుము= ఆలింపుము; అసత్యలోభమునన్= అసత్యమందలి దురాశచేత; సిరి+అగునె?= సంపద సమకూడగలదా? ఆఁకొని= ఆకలిగొని; ముసిండి+తినినన్= ముసిడి పండ్లను భుజిస్తే; క్రొవ్వులావు+కలుగును+ అయ్య?= కండ బలిమి లభిస్తుందా?; శకుని కర్ణ దుశ్శాసన మంత్రితంబు= శకుని కర్ణ దుశ్శాసనులచే చెప్పబడిన సలహా; కార్య తంత్రము+అగునె?= పనిని సాధించటానికి సాధనం కాగలదా? (కాదని భావం).

తాత్పర్యం: దుర్యోధనా! విను. అసత్యలోభం వల్ల సంపద సమకూడదు. ఆకలి వేసినపుడు మిసమిసలాడుతూ భ్రాంతి గొలిపే ముష్టిచెట్టుపండ్లను తింటే శరీరానికి పుష్టి తుష్టి ఏర్పడుతుందా? అందుకు మారుగా ఆ పండ్లు ప్రాణాంతక మవుతాయి. అట్లాగే శకుని కర్ణ దుశ్శాసనుల చెడు సలహాలు కార్యకారులు ఔతాయా?

విశేషం: అలం: నిదర్శన.

శా. తోడంబుట్టిన భీమపార్థుల మహా దోర్దర్పముల్ లాఁతులై
తో డంచుం బెఱవారి దుర్బలుల నెందుం జొచ్చి దైన్యంబునం
గూడం బెట్టెదు; నీవ పాండుసుతులం గుందింపఁగా సత్యముం
బాడిం దప్ప రొకప్పుడుం గినియ రా బంధుత్వ మే లొల్లవో? 332

ప్రతిపదార్థం: తోడన్+పుట్టిన= సోదరులుగా జన్మించిన; భీమపార్థుల= భీమార్జునుల యొక్క; మహా+దోః +దర్పముల్= గొప్ప భుజశౌర్యాలు; లాఁతులు+ఐ= అన్యములై; పాండుసుతులన్= పాండవులను; కుందింపఁగాన్= బాధించటానికి; నీవు+అ= నీవే; పెఱవారిన్= పరాయివారైన; దుర్బలులన్= శక్తిహీనులను; తోడు+అంచున్= సహాయులని; ఎందున్+చొచ్చి= ఎక్కడెక్కడికో వెళ్ళి; దైన్యంబునన్= కృపణత్వంతో; కూడన్+పెట్టెదు= గుంపుగా చేర్చుకొంటున్నావు; సత్యమున్= నిజమును; పాడిన్= న్యాయమును; తప్పరు= కౌంతేయులు విడిచినవారుకారు; ఒకప్పుడున్= ఏనాడుకూడా; కినియరు= నీపై క్రోధం వహించరు; ఆ బంధుత్వమున్= ఆ చుట్టరికమును; ఏల+ ఒల్లవో?= ఎందుకు ఇష్టపడవో తెలియదు.

తాత్పర్యం: సహోదరులైన భీమార్జునులు గొప్ప భుజపరాక్రమాలు కలవారు. వారు నీకు పరాయివారైనారు. వారిని నొప్పించటానికి సాయపడగలరని శక్తిహీనులను పరాయివారిని ఎక్కడెక్కడికో వెళ్ళి కృపణత్వంతో వేడుకొని అందరినీ గుంపుగా చెంతకు చేర్చుకొంటున్నావు. పాండవులు సత్యాన్నీ, న్యాయాన్నీ వీడనివారు. ఎన్నడూ నీమీద క్రోధం వహించినవారు కాదు. అట్లాంటివారి చుట్టరికం నీ కెందుకు గిట్టదో తెలియదు.

ఉ. వారును మీరుఁ బొంది జనవల్లభు లెల్లను భృత్యభావనం
జేర సమస్త వస్తువులుఁ జేకుఱఁగా బ్రదుకొప్పఁగాక నీ;
కీరస మెత్తికోల్ గఱపి యిప్పుడు కార్యము దప్పఁజూచు నీ
వారలు ముట్టవచ్చిన నవశ్యము నంతకుఁ జాలరుం జుమీ! 333

ప్రతిపదార్థం: వారును= ఆ పాండవులూ; మీరున్= కౌరవులైన మీరూ; పొంది= ఒద్దికగా ఉండి; జనవల్లభులు+ఎల్లను= రాజులందరూ; భృత్యభావనన్= సేవాబుద్ధితో; చేరన్= మిమ్మాశ్రయించగా; సమస్త వస్తువులున్= ఎల్లపదార్థాలును; చేకుఱఁగాన్= మీకు లభించగా; బ్రదుకు= జీవించటం; ఒప్పున్+కాక= తగి ఉండగలదుగాని; నీకున్= నీకు; ఈరసము+ఎత్తికోల్+ కఱపి= ద్వేషం వహించేట్లు బోధించి; ఇప్పుడు= ఈ సమయాన; కార్యమున్+తప్పన్+చూచి= పని చెడిపోయేటట్లు చేసే; నీ వారలు= నీ పక్షంలో ఉన్నవారు; ముట్టన్+వచ్చినన్= పాండవులు మీపై దండెత్తి వచ్చినపుడు; అవశ్యము= నిశ్చయంగా; అంతకున్+చాలరున్+చుమీ!= వారి నెదిరించటానికి సమర్థులు కాలేరు సుమా!

తాత్పర్యం: పాండవులూ మీరూ పొత్తుకూడి ఉండగా, రాజులందరూ తాము సేవకుల మనే తలంపుతో మిమ్ముచేరి కొలుస్తుండగా, అన్ని పదార్థాలు మీకు సమకూడగా హాయిగా జీవించటం మంచిది. అంతేకాని, నీకు కౌంతేయులపై ద్వేషం కల్పించి ఇప్పుడు పనిచెరచటానికి కంకణం కట్టుకొన్న నీ మనుషులు, పాండవులు మీపై యుద్ధానికి తరలివచ్చిన సమయంలో వారి నెదిరించటానికి ఏమాత్రం కొరగారు సుమా!

ఆ. వీరు కారు పాండవేయులఁబోర మా।
ర్కొన సురాసురులకుఁ గొలఁది గాదు
కాన వారితోడి కయ్యంబునకు నిర్ణ।
యింపవలదు। సంధి పెంపుఁ జేయు. 334

ప్రతిపదార్థం: వీరు+అ+కాదు= నీవు విశ్వసించిన కర్ణాదులే కాదు; పాండవేయులన్= పాండుపుత్రులను; పోరన్= యుద్ధంలో; మార్కొనన్= ఎదిరించటానికి; సుర+ అసురులకున్= దేవదానవులకు కూడ; కొలఁది+కాదు= శక్యం కాదు; కానన్= కాబట్టి; వారి తోడి కయ్యంబునకున్= కౌంతేయుల తోడి కలహానికి; నిర్ణయింపన్+ వలదు= నిశ్చయించవద్దు; సంధి= పొత్తు; పెంపున్+చేయున్= వృద్ధిని కల్గిస్తుంది.

తాత్పర్యం: కర్ణాదులకే కాదు, దేవదానవులకు కూడ కౌంతేయులను ఎదుర్కొనటం శక్యంకాదు. కనుక పాండవులతో పోరాటానికి నిర్ణయం చేయవద్దు. సంధియే అభివృద్ధి కలిగిస్తుంది.

విశేషం: అలం: అనన్వయం.

క. ఈయున్న రాజులందఱు।
వాయుసుతున కొక్క యెత్తు; వాఁ డలిగిన శూ
లాయుధుఁడు వడఁకు; నా కౌం।
తేయులతోఁ బెనఁగు టుడుగు ధీరవిచారా! 335

ప్రతిపదార్థం: ధీర విచారా!= ధైర్యాలోచన కలవాడా!; ఈ+ఉన్న రాజులు+ అందఱున్= నీ పక్షంలో చేరి ఉన్న ఈ దొరలంతా; వాయుసుతునకున్= గాడ్పుపట్టి ఐన భీమసేనుడికి; ఒక్క+ఎత్తు= సమానం; వాఁడు+అలిగినన్= అతడు కోపిస్తే; శూల+ ఆయుధుఁడున్= శూలం ఆయుధంగా గలిగిన పరమేశ్వరుడుకూడా; వడఁకున్= గడగడలాడుతాడు; ఆ కౌంతేయులతోన్= ఆ కుంతీదేవి కుమారులతో; పెనఁగుట+ఉడుగు(ము)= పోరు సల్పటం మానుము.

తాత్పర్యం: ఇక్కడున్న ఈ దొరలంతా చేరి భీమసేనుడికి ఒక యెత్తు. భీముడు గనుక కినుకవహిస్తే త్రిశూలపాణి అయిన ఈశ్వరుడే భయంతో కంపించిపోతాడు. కాబట్టి కౌంతేయులతో కలహించటం మానుకో!

క. ఒక కార్యము సెప్పెద మీ।
సకల బలమునందు సవ్యసాచి కెదురుగా
నొకరుఁడు గలిగినఁ గయ్యము।
నకుఁ బూనుఁడు; రిత్త బహుజనక్షయ మేలా? 336

ప్రతిపదార్థం: ఒక కార్యము+చెప్పెదన్= ఒక కర్తవ్యం నీకు చెపుతాను; మీ సకలబలమునందున్= మీకున్న సమస్త సైన్యంలో; సవ్యసాచికిన్= అర్జునుడికి; ఎదురుగాన్= ఎదిరించటానికి సమర్థుడుగా; ఒకరుఁడు= ఒక్కడు; కలిగినన్= ఉంటే; కయ్యమునకున్= యుద్ధానికి; పూనుఁడు= సిద్ధపడండి; రిత్త= వ్యర్థంగా; బహుజన క్షయము+ఏలా?= అనేక ప్రజా వినాశం ఎందుకు?

తాత్పర్యం: సుయోధనా! ఒక సంగతి చెపుతాను విను. మీ సమస్త సైన్యంలో అర్జునుడిని ఎదిరించగల వీరుడొక్కడుంటే యుద్ధానికి నడుంకట్టుము. నిరుపయోగంగా బహుజన వినాశం ఎందుకు చేస్తావు?

క. పెక్కండ్రు గోవులంగొని।
యుక్కు మిగిలి నడవ వెనుక నుద్దవిడిం దా

నొక్కఁడ నరుఁ డేతెంచినఁ ।
జిక్కె సమస్తంబు నది ప్రసిద్ధమ కాదే? 337

ప్రతిపదార్థం: పెక్కండ్రు= పలువురు వీరులు; గోవులన్+కొని= ఆవులను తోలుకొని; ఉక్కుమిగిలి నడవన్= శౌర్యంతో చెలరేగి ముందుకు సాగుతుండగా; వెనుకన్= వారి వెనుక; ఉద్దవిడిన్= పూనికతో; తాన్+ఒక్కఁడు+అ= తానొక్కడే; నరుఁడు= అర్జునుడు; ఏతెంచినన్= రాగా; సమస్తంబు చిక్కెన్= ఆవులన్నీ దొరకిపోయాయి; అది= ఆ గోవులను మరలించుకొనివచ్చిన విషయం; ప్రసిద్ధమ కాదే!= అందరికీ తెలిసినదేగదా!

తాత్పర్యం: పెక్కుమంది వీరులు విరటుడి గోవులను తోలుకొని శౌర్యంతో హస్తినాపురికి వెళ్ళుతుండగా వెనకనే వేగంగా వచ్చి, అర్జునుడు తా నొక్కడే ఆవులన్నింటినీ మత్స్యపురికి మరలించుకు వచ్చిన సంగతి ప్రఖ్యాతమే కదా!

క. తోడు దొనలేనియప్పటి ।
క్రీడి కొలఁది యట్టి దధిప! కినియక విను మేఁ
దోడై రా నెదురుట గడుఁ ।
గీడు; వలవ దుడుగవయ్య గెలు పరిది సుమీ! 338

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; తోడుదొన= తనకు ఎట్టి సహాయం, అమ్ములపొదులు; లేని= లేనటువంటి; అప్పటి క్రీడి కొలఁది+అట్టిది= అజ్ఞాతవాస దీక్షలో ఉన్న ఫల్గునుడి పరాక్రమం అటువంటిది; కినియక వినుము= కోపపడక నా మాటలు వినుము; ఏన్= నేను; తోడు+ఐ రాన్= సహాయంగా రాగా; ఎదురుట= అర్జునుడిని మార్కొనటం; కడున్+కీడు= మిక్కిలి హానికరం; వలవదు= తగదు; ఉడుగవు+అయ్య!= వారితో పోరు సల్పటం మానవయ్యా; గెలుపు= విజయం; అరిదిసుమీ!= దుర్లభం సుమా!

తాత్పర్యం: తనకు ఎటువంటి సహాయమూ, అమ్ముల పొదులూ లేని అజ్ఞాతవాసకాలంనాటి అర్జునుడి విక్రమం అటువంటిది. రాజా! నే చెప్పేది కోపగించక

విను. నేనే తనకు సహాయుడనై రాగా పార్థుడితో ప్రతిఘటించటం చేటునకు మూలం. ఆ ఆలోచన మానుకో. యుద్ధంలో నీకు విజయం అశక్యం సుమా!

తే. అనుజ తనుజులుఁ జెలులు వియ్యములు నడుగు ।
మాలి పోదురు నీకుఁగా మనుజనాథ!
దొరకుఁ గులనాశనుండను దూఱు మేలె? ।
పాండవుతోడ నొడఁగూడి బ్రదుకవయ్య! 339

ప్రతిపదార్థం: మనుజనాథ!= రాజా!; అనుజతనుజులున్= తమ్ములూ, కుమారులూ; చెలులున్= మిత్రులూ; వియ్యములున్= వివాహ సంబంధులున్నూ; నీకున్+కాన్= నీ కొరకై; అడుగుమాలిపోదురు= అణగారిపోతారు; దొరకున్= ప్రభువునకు; కులనాశనుండు= వంశవిధ్వంసకుడు; అను+దూఱు= అనునట్టి నింద; మేలె?= మంచిదా? పాండవులతోడన్= పాండుకుమారులతో; ఒడన్+కూడి= పొత్తుకూడి; బ్రదుకవు+అయ్య!= జీవించవయ్యా!

తాత్పర్యం: సుయోధనా! నీ తమ్ములూ, కుమారులూ, స్నేహితులూ, పిల్లనిచ్చినవారూ, పిల్లను చేసికొన్నవారూ నీమూలంగా నాశనమవుతారు. నీవంటి ప్రభువుకు కులవినాశకుడు అనే నింద పొందటం మంచిదికాదు. పాండవులతో కలిసి మెలసి జీవించు.

ఉ. రాజ్యముభారమెల్ల ధృతరాష్ట్రునియంద వెలుంగుచుండఁ, ద
త్పూజ్య కుమార పట్టమునఁ బొల్చి చరింపఁగ నీవు, పాండవుల్
సజ్జతఁ దండ్రి చిత్తము ప్రసన్నతఁ బొందఁగఁ గొల్చి యున్కి సా
మ్రాజ్యముగాఁ దలంతు రనురక్తమతిం దమకున్ ధరాధిపా! 340

ప్రతిపదార్థం: ధరా+అధిపా!= రాజా!; రాజ్యము భారము+ఎల్లన్= రాజ్యమేలే బరువంతా; ధృతరాష్ట్రుని యందున్+అ= ధృతరాష్ట్రుడియందే;

వెలుంగుచున్+ఉండన్= ప్రకాశిస్తుండగా; నీవు; తద్+పూజ్యకుమార పట్టమునన్= మాననీయమైన యౌవరాజ్య పదవిలో; పొల్చి= ఒప్పుచు; చరింపఁగన్= మెలగుతుండగా; పాండవుల్= పాండు కుమారులు; సజ్యతన్= వింద్లనెక్కువెట్టి; తండ్రి చిత్తము= జనకుడైన ధృతరాష్ట్రుడి మనస్సు; ప్రసన్నతన్+పొందఁగన్= శాంతితో కూడి ఉండగా కొల్చి+ఉన్కి= సేవిస్తూ ఉండటం; తమకున్= తమకు; అనురక్తమతిన్= అనురాగముతో నిండిన హృదయంతో; సామ్రాజ్యముగాన్+తలంతురు= చక్రవర్తిత్వం వచ్చినట్లుగా భావిస్తారు.

తాత్పర్యం: రాజా! రాజ్య భారమంతా ధృతరాష్ట్రుడే వహించి ప్రకాశిస్తుంటే, నీవు యౌవరాజ్య పట్టాభిషిక్తుడవై రాచకార్యాలు చూచుకొంటుంటే, పాండవులు వింద్లెక్కు పెట్టుకొని రాజ్యరక్షణ గావిస్తూ జనకుడైన ఆంబికేయుడి మనస్సు ఎట్టి కలతలు లేక ప్రశాంతంగా ఉండగా, ఆయనకు సేవలు చెయ్యటమే తమకు చక్రవర్తిత్వమని అనురాగం గల హృదయాలతో భావిస్తారు.

క. కౌరవనాయక! పాండుకు ।
మారులు నీ తోడి పొత్తు మనియెద మనఁగా
శ్రీ రా మోకా లొడ్డిన ।
వారి విధమ కాదె నీవు వలదను టెల్లన్.' 341

ప్రతిపదార్థం: కౌరవనాయక!= కురురాజా!; పాండుకుమారులు= పాండునందనులు; నీతోడి పొత్తు మనియెదము= నీతో ఒద్దికగా ఉండి జీవిస్తామని; అనఁగాన్= అంటుంటే; నీవు; వలదు+అనుట+ఎల్లన్= వద్దని చెప్పడం; శ్రీరాన్= సిరివస్తుంటే; మోకాలు+ ఒడ్డినవారి విధమకాదె!= మోకాలు అడ్డంపెట్టే వారి చందంగా ఉండదా?

తాత్పర్యం: కురునాథా! పాండునందనులు నీతో సంధి చేసికొని జీవిస్తామని ఆశతో ఉంటే, నీవు వారి పొత్తు నాకు వద్దని నిరాకరించటం- లక్ష్మి తానై నడచి ఇంటికి వస్తుంటే రావద్దని మోకాలు అడ్డంపెట్టేవారి చందంగా ఉన్నది.

విశేషం: అలం: లోకోక్తి.

భీష్మద్రోణులు దుర్యోధనునకు హితంబు సెప్పుట (సం. 5-123-1)

చ. అన విని భీష్ముఁ డిట్లనియె నాధృతరాష్ట్ర తనూజుతోడ 'నీ
జనకుని మాట వట్టుము ప్రసన్నమతిన్ । మనవంశ మెల్లఁ బా
వనముగ నిందు వచ్చి బుధవత్సలుఁ డీ హరి యిట్లు సెప్పఁగా
వినమిఁ గడుం జెడుం దెరువు;। వీరల పం పొనరింపు పెంపుగన్. 342

ప్రతిపదార్థం: అనన్ విని= అని శ్రీకృష్ణుడు పలుకగా విని; భీష్ముఁడు; ఆ ధృతరాష్ట్ర తనూజు తోడన్= ఆ ధృతరాష్ట్రుడి కుమారుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు; ప్రసన్నమతిన్= ప్రశాంతమైన మనస్సుతో; నీ జనకునిమాట+ పట్టుము= నీ తండ్రిమాట గ్రహించుము; మన వంశము+ఎల్లన్= మన కురు కుల మంతయూ; పావనముగన్= పవిత్రముకాగా; ఇందున్+వచ్చి= ఇక్కడికి విచ్చేసి; బుధవత్సలుఁడు= విద్వాంసుల యందు ప్రేమ కలిగిన వాడైన; ఈ హరి= ఈ శ్రీకృష్ణుడు; ఇట్లు చెప్పఁగాన్= ఇంత హితం బోధించగా; వినమిన్= వినకుండుట; కడున్= మిక్కిలి; చెడున్+తెరువు= పెడత్రోవ; వీరల పంపు= నీ తండ్రి యొక్క, నారాయణుడికి యొక్క ఆనతి; పెంపుగన్= వృద్ధికరంగా; ఒనరింపు(ము)= ఆచరించుము.

తాత్పర్యం: శ్రీకృష్ణుడి పలుకులు విని భీష్ముడు దుర్యోధనుడితో ఇట్లా అన్నాడు: నీ తండ్రిమాట ప్రశాంత హృదయంతో స్వీకరించు. మన కురుకులం పవిత్రమయేటట్లు పండితుల యందు ప్రేమగల నారాయణుడు ఇక్కడికి విచ్చేసి నీకు హితం తెలిపాడు. ఆయన వచనాలు వినకపోవటం వినాశనానికి మార్గం. వీరందరూ ఆజ్ఞాపించిన పని అభ్యుదయకరంగా ఆచరించు.

క. మానక ధృతరాష్ట్రుఁడు ప్రా ।
ణానం గలుగంగ బంధునాశము రాజ్య

శ్రీనాశము నుద్దామయ।
శోనాశముఁ జేయనేల చూచెద చెపుమా! 343

ప్రతిపదార్థం: ధృతరాష్ట్రుఁడు= ధృతరాష్ట్ర మహారాజు; ప్రాణానన్+కలుగంగన్= ప్రాణాలతో ఉండగా; మానక= వదలక; బంధునాశమున్= చుట్టాల యొక్క వినాశనాన్నీ; రాజ్యశ్రీ నాశమున్= రాజ్యలక్ష్మియొక్క వినాశనాన్నీ; ఉద్దామ యశోనాశమున్= గొప్పదైన కీర్తియొక్క వినాశనాన్ని; ఏల= ఎందుకు; చేయన్+చూచెదు+చెపుమా!= చేయడానికి సంకల్పించావో చెప్పుము.

తాత్పర్యం: 'సుయోధనా! నీ తండ్రి ధృతరాష్ట్రుడు ప్రాణాలతో ఉండగానే' విడువకుండా చుట్టాలనూ, రాజ్యాన్నీ, హద్దులేని కీర్తినీ ఎందుకు నాశనం చేయాలని యత్నిస్తావో చెప్పు.

విశేషం: అలం: సముచ్చయం.

వ. కృష్ణార్జునులతోడి విరోధం బీ బంధులోకంబునక కాదు లోకంబున నెవ్వరికినిం జూడం బోలదు లోకంబులు రెంటికిని హానిం జేయక కూడి బ్రదుకుట మే'లనినఁ దదనంతరంబ ద్రోణాచార్యుండు దుర్యోధనున కిట్లనియె: 344

ప్రతిపదార్థం: కృష్ణ+అర్జునుల తోడి విరోధంబు= శ్రీ కృష్ణార్జునులతోడి వైరం; ఈ బంధులోకంబునకున్+అ+కాదు= ఈ చుట్టాల సమూహానికే కాదు; లోకంబునన్= జగత్తులో; ఎవ్వరికినిన్= ఎట్టివారికిన్నీ; చూడన్+పోలదు= చూచి సహించటానికి శక్యం కాదు; లోకంబులు రెంటికిని= ఇహపరాలు రెంటికిన్నీ; హానిన్+చేయక= చేటు కలిగించక; కూడి= పాండవులతో చేరి; బ్రదుకుట మేలు= జీవించటం మంచిది; అనినన్= అని భీష్ముడు పలుకగా; తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; ద్రోణ+ఆచార్యుండు= గురువైన ద్రోణుడు; దుర్యోధనునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: కృష్ణార్జునులతో పెట్టుకొనే శత్రుత్వం ఈ సమస్త బంధువులకే కాదు, పుడమిలో ఎవ్వరికినీ చూచి సహించరానిదే అవుతుంది. నీవు ఇహపరాలకు కీడు కలిగించక పాండవులతో కలసిమెలసి జీవించటం మంచిది' అని చెప్పాడు. తరువాత గురువైన ద్రోణుడు సుయోధనుడితో ఇట్లా అన్నాడు :

తే. 'పితృ పితామహ గురులమై ప్రీతిఁగోరు।
చున్న యట్టి మా పరమ హితోపదేశ
వాక్యములు విని దుర్జన వచన రచనఁ।
గొనక బంధులతో నొడఁగూడి మనుము. 345

ప్రతిపదార్థం: పితృపితామహ గురులము+ఐ= తండ్రి, తాత గురువులము అయి; ప్రీతిన్= మీకు సంతోషం; కోరుచున్+ఉన్న+ అట్టి= వాంఛిస్తున్నట్టి; మా పరమ హిత+ఉపదేశ వాక్యములు= మిక్కిలిమేలు సమకూర్చే మా హిత వచనాలు; విని= ఆలించి; దుర్జన వచన రచనన్= దుర్మార్గుల పలుకులయొక్క కల్పనను; కొనక= ఆదరించక; బంధులతోన్= చుట్టాలతో; ఒడఁగూడి= చేరి; మనుము= జీవించుము.

తాత్పర్యం: 'సుయోధనా! మీ తండ్రియైన ధృతరాష్ట్రుడు, తాత భీష్ముడూ, గురుడనైన నేనూ మీకు సుఖం కోరుతున్న వాళ్ళం. మేలు కలిగించే మా మంచి మాటలు విను. దుర్మార్గుల పల్కులు ఆదరించక బంధువులైన పాండుపుత్రులతో కలసిమెలసి జీవించు.

ఉ. వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన సవిస్తర వాక్ప్రచయంబు త్రోవఁ బో
వన్న కుమార! యట్లయిన వాయువు శ్రీయును నీకుఁ గల్గు మా
కన్నులు సల్లఁగా నకట గన్గొనుచుండుదు మేము; నట్లుగా
కున్నను నీవ నేర్తు నొండన నేరము నిండు కొల్వునన్. 346

ప్రతిపదార్థం: కుమార!= వత్సా!; సుయోధనా!; వెన్నుఁడు= విష్ణుమూర్తి - కృష్ణుడు; ప్రీతిన్= ప్రేమతో; చెప్పిన= వచించిన; సవిస్తర వాక్+ప్రచయంబు

త్రోవన్= విపులమైన మాటల సమూహం చొప్పున; పోవు+అన్న!= పోగదవయ్యా!; అట్లు+అయినన్= శ్రీకృష్ణుడు బోధించిన మార్గాన్ని అనుసరిస్తే; ఆయువున్= ఆయుష్యం; శ్రీయును= సంపదా; నీకున్+కల్గున్= నీకు లభించగలవు; మా కన్నులు చల్లఁగాన్= మా కన్నులు చల్లబడగా; అకట!= ఆహా! మేము= మేమందరం; కన్గొనుచున్+ఉండుదుము= చూస్తూ ఉండగలం; అట్లు+కాక+ఉన్నను= నీవు శౌరియొక్క వాక్య పద్ధతి ననుసరించ కుంటే; నీవు+అ నేర్తు(వు)= నీవే తత్ఫల మనుభవించగలవు; నిండు కొల్వునన్= అందరున్న సభలో; నినున్= నిన్ను; ఒండు+అనన్+నేరము= ఇంతకు మించి ఏమీ పల్కలేము.

తాత్పర్యం: వత్సా! గోవిందుడు ప్రేమతో నుడివిన విపులమైన హితవాక్యాలు విన్నావు. ఆ దారిలో మెలగవలసింది. అట్లయితే నీకు ఆయుష్యం, సిరి సంపదలు సమకూడుతాయి. మా కన్నులతో చల్లగా మిమ్ము చూస్తూ హాయిగా ఉంటాము. అట్లా నీవు శౌరి వాక్యపద్ధతి ననుసరించకుంటే తత్ఫలం నీవే అనుభవిస్తావు. ఇంతకుమించి నిండుసభలో నిన్ను ఏమీ అనలేము.'

చ. అనవుడు నాంబికేయుఁడు నిజాత్మజుదిక్కు మొగంబుచేసి యి
ట్లను 'హరి నాశ్రయించి భవదగ్రజుఁ బుణ్యు నజాతశత్రునిం
గను మటవోయి దీన మన కార్యము లన్నియు సిద్ధిఁబొందు; నీ
తనిపలు కాదరింపమిఁ బదంపడి పాటిలు నెల్ల చేటులున్. 347

ప్రతిపదార్థం: అనవుడున్= అట్లా ద్రోణాచార్యుడు పల్కినమీదట; ఆంబికేయుఁడు= ధృతరాష్ట్రుడు; నిజ+ఆత్మజు దిక్కు= తన కుమారుడి వైపు; మొగంబుచేసి= ముఖం త్రిప్పి; ఇట్లు+అనున్= ఇట్లా అన్నాడు; హరిన్+ఆశ్రయించి= శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసికొని; భవత్+అగ్రజున్= నీ అన్నగారిని; పుణ్యున్= సుకృతశాలి అయిన; అజాత శత్రునిన్= ధర్మజుడిని; అటవోయి= ఉపప్లావ్య పురికలిగి; కనుము= దర్శించుము; దీనన్= ఆయనను కలిసికొనటంచేత; మన కార్యములు+అన్నియున్= మన పనులన్నీ; సిద్ధిన్+పొందున్= నెరవేరుతాయి; ఈతని పలుకున్+ఆదరింపమిన్= మాధవుడి మాటలు మన్నించకుంటే; పదంపడి= తరువాత; ఎల్లచేటులున్= అన్ని ఆపదలు; పాటిలున్= కలుగుతాయి.

తాత్పర్యం: ద్రోణాచార్యులు అట్లా హితం ఉపదేశించిన తరువాత ధృతరాష్ట్రుడు తన కుమారుడి వైపు ముఖం త్రిప్పి ఇట్లా అన్నాడు: నీవు శ్రీకృష్ణుడిని ఆధారంగా చేసికొని అక్కడికి వెళ్ళి నీకు అన్నగారున్నూ, పుణ్యాత్ముడున్నూ అయిన ధర్మపుత్రుడిని చూడు. అందువల్ల మన పనులన్నీ సఫలమవుతాయి. నారాయణుడి మాటలు ఆదరించకుంటే ఆ తరువాత ఎన్నో కష్టాలు కలుగుతాయి.'

వ. అనియె; నట్టియెడ గురుభీష్ము లొత్తి చెప్పం దలంచి గాంధారేయున కిట్లనిరి: 348

ప్రతిపదార్థం: అనియెన్= అని ధృతరాష్ట్ర డన్నాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; గురుభీష్ములు; ఒత్తిచెప్పన్+తలంచి= నొక్కిచెప్పతలచినవారై; గాంధారేయునకున్= గాంధారి కుమారుడైన దుర్యోధనుడికి; ఇట్లు+అనిరి= ఇట్లా అన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు కుమారుడికి చెప్పిన తరువాత ఇంకా నొక్కి చెప్పదలచి ద్రోణభీష్ములు సుయోధనుడితో ఇట్లా అన్నారు:

క. 'ఈ కృష్ణుని సారథ్యము ।
నా కృష్ణుని గాండివంబునై తోఁపక ము
న్నీ కొలఁదిఁ జక్కఁబడి నీ ।
వీ కురువంశంబు గావు మిభపురనాథా!' 349

ప్రతిపదార్థం: ఇభపురనాథా!= హస్తిపురాధీశ్వరా!; ఈ కృష్ణుని సారథ్యమున్= ఈ గోపాలకృష్ణుడి రథచోదకత్వమూ; ఆ కృష్ణుని= పాండవమధ్యముడైన

అర్జునుడి; గాండివంబున్+ఐ= గాండివమనే ధనుస్సు కలదై; తోఁపకమున్న= యుద్ధం ఏర్పడక మునుపే; ఈ కొలఁదిన్+చక్కఁబడి= ఈ పాటి ఉపదేశాలతో మనసు సవరించుకొని; నీవు; ఈ+కురువంశంబున్= ఈ కౌరవ వంశాన్ని; కావుము= రక్షించుము.

తాత్పర్యం: 'రాజా! ఈ శ్రీకృష్ణుడు రథసారథ్యం సల్పుతుండగా, గాండివం చేత ధరించి అర్జునుడు యుద్ధ రంగంలో ప్రత్యక్షం కాకమునుపే నీవు ధర్మజుడిని సందర్శించి కార్యం చక్కదిద్దుకొని కౌరవవంశమంతటినీ కాపాడు.'

వ. అని పలికి మఱియు. 350

తాత్పర్యం: అంటూ భీష్మ ద్రోణులు మళ్ళీ. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. 'ధర్మపుత్త్రుని పద ద్వయమున కతిభక్తి ।
నెఱఁగిన నతఁడు ని న్నెత్తి గ్రుచ్చి
నిడుఁ గేలఁ బెద్దయుఁ దడవుగాఁ గౌఁగిలింపఁగ
భీముఁడును నీవుఁబరమహర్ష
మునఁ జారుతర వక్షములు సంగతములుగాఁ ।
బరిరంభణం బొనర్పంగ నరుఁడుఁ
గవలును మ్రొక్కినఁ గరమర్థిఁ దిగిచి నీ ।
వాలింగనంబు సేయంగ, నిట్లు

తే. వారు మీరును దగ బాంధవమునఁ బొదలి ।
యింపు దళుకొత్తఁదామరతంపరైనఁ
జెలులుఁ జుట్టలుఁ గలసి పేరెలమిఁ బొంది ।
యుల్లసిల్లంగఁ గులమెంత యొప్పునొక్కొ! 351

ప్రతిపదార్థం: ధర్మపుత్త్రుని పదద్వయమునకున్= ధర్మజుడి యొక్క పాదాల జంటకు; అతిభక్తిన్= మిక్కుటమైన భక్తితో; ఎఱఁగినన్= నీవు సాగిలపడి

నమస్కరించగా; అతఁడు= ధర్మజుడు; నిన్నున్ గ్రుచ్చి+ఎత్తి= నిన్ను పట్టి లేవనెత్తి; నిడుఁగేలన్= దీర్ఘ బాహువులతో; పెద్దయున్+తడవుగాన్= చాలసేపు; కౌఁగిలింపఁగన్= ఆలింగనం చేసికొనగా; భీముఁడును నీవున్= భీమసేనుడూ, నీవూ; పరమహర్షమునన్= మిక్కిలి సంతోషంతో; చారుతరవక్షములు= మిక్కిలి అందమైన రొమ్ములు; సంగతములు కాన్= హత్తుకొనేటట్లు; పరిరంభణంబు+ఒనర్పంగన్= కౌగిలించుకొనగా; నరుఁడున్= అర్జునుడూ; కవలును= నకులసహదేవులూ; మ్రొక్కినన్= నీకు వందనం చేయగా; కరము+అర్థిన్= మిక్కిలి ప్రీతితో; తిగిచి= వారిని చెంతకు లాగికొని; నీవు; ఆలిం గనంబు+చేయంగన్= వారిని కవుగిలించుకొనగా; ఇట్లు= ఈ ప్రకారం; వారున్ మీరును= పాండవులున్నూ, మీరున్నూ; తగన్= ఒప్పుగా; బాంధవమునన్+పొదలి= చుట్టరికంతో ఏపారి; ఇంపు తళుకొత్తన్= ప్రియ మతిశయించగా; తామరతంపర+ఐనన్= మిక్కిలి అభివృద్ధి గాంచగా; చెలులున్= స్నేహితులు; చుట్టలున్= బంధువులు; కలసి= కూడి; పేరు+ఎలమిన్+పొంది= పరమానందం చెంది; ఉల్లసిల్లంగన్= ప్రకాశించగా; కులము= కురువంశం; ఎంత+ఒప్పున్+ఒక్కొ= ఎంతగా సొంపారునోగదా!

తాత్పర్యం: సుయోధనా! నీవు ధర్మజుడి అడుగుల జంటకు అత్యంత భక్తితో ప్రణమిల్లినప్పుడు అతడు నిన్ను పట్టి లేవనెత్తి దీర్ఘ బాహువులతో చాలసేపు కౌగిలించు కొనగా, భీముడూ నీవూ మీ సుందర వక్షఃస్థలాలు హత్తుకొనేటట్లు మిక్కిలి సంతోషంతో ఆలింగనం చేయగా, అర్జునుడూ నకుల సహదేవులూ నీకు ప్రణామం కావించినపుడు నీవు వారిని దగ్గరకు చేరదీసి కవుగిలించుకోగా- ఇట్లా వారూ మీరూ పరస్పరం వందనాలింగనాలతో, చుట్టరికంతో పెంపారుతూ ప్రియమతిశయిల్ల అభివృద్ధి చెందుతుండగా, స్నేహితులు బంధువులు ఇట్లా ఉన్న మిమ్ము చూచి మిక్కిలి హర్షించగా మీ కురువంశం ఎంత చక్కగా ఉంటుందో ఊహించు.

క. సమరమునకు వచ్చిన భూ ।
రమణు లుభయకటకములను బ్రమదం బెసఁ గం

దమతమ పురములకుం బో ।

వ మహీ జను లెట్టి యుత్సవముఁబొందుదురో!' 352

ప్రతిపదార్థం: సమరమునకున్ వచ్చిన= యుద్ధం చేయటానికి వచ్చిన; భూరమణులు= రాజులు; ఉభయ కటకములను= రెండు సేనాశిబిరాలలో; ప్రమదంబు+ఎసఁగన్= హర్షం అతిశయించగా; తమ తమ పురములకున్+ పోవన్= తమ తమ నగరాలకు తరలివెళ్ళగా; మహీజనులు= పుడమిలోని ప్రజలు; ఎట్టి+ఉత్సవమున్= ఎంతటి సంతోషాన్ని; పొందుదురో!= పొందుతారో కదా!

తాత్పర్యం: యుద్ధం చేయటానికి వచ్చిన రాజులు రెండు సేనా శిబిరాలలో ఆనందం విస్తరిల్లగా తాము తమ తమ పట్టణాలకు తరలివెళ్ళుతుంటే పుడమిలోని ప్రజలు ఎంత ఆనందిస్తారో చెప్పటానికి శక్యం కాదు.'

వ. అని వెండియు ననేక విధంబులం జెప్పి యీ రెండు దెఱంగుల వారును బంచి కుడిచి సుఖంబున్న నఖిల భూ ప్రజకును బ్రమోదం బగుం గావున నట్లుసేసి యందఱచేత దీవనలు వడయవయ్య నీ'వనిన విని దుర్యోధనుం డప్పుండరీకాక్షు వీక్షించి యిట్లనియె: 353

ప్రతిపదార్థం: అని; వెండియున్= ఇంకను; అనేకవిధంబులన్= పలురీతులు; చెప్పి; ఈ రెండు తెఱంగులవారును= ఈ ఉభయ కుటుంబాలవారున్నూ; పంచి= రాజ్యం పంచుకొని; కుడిచి= అనుభవిస్తూ; సుఖంబు+ఉన్నన్= హాయిగా ఉంటే; అఖిల భూ ప్రజలకును= పుడమిలోని జనులందరికినీ; ప్రమోదంబు= సంతోషం; అగున్= కలుగుతుంది; కావునన్; అట్లుచేసి; అందఱచేతన్; నీవు; దీవనలు పడయవయ్యా= ఆశీర్వాదములు పొంద వలసింది; అనినన్= అని ద్రోణ భీష్ములు చెప్పగా; విని; దుర్యోధనుండు; ఆ+పుండరీక+అక్షున్= ఆ కమల నేత్రుడిని శ్రీకృష్ణుడిని; వీక్షించి= చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఇట్లా ఇంకా ద్రోణభీష్ములు పలు విధాలుగా చెప్పి 'మీరెండు కుటుంబాలవారూ రాజ్యం పంచుకొని అనుభవిస్తూ, హాయిగా ఉండటం పుడమిలోని జనులందరికీ సంతోషం కలిగిస్తుంది కనుక మేము చెప్పినట్లు చేసి నీవు అందరివల్ల ఆశీస్సులు పొందు'మని చెప్పారు. వారి మాటలన్నిటినీ విని దుర్యోధనుడు కృష్ణుడితో ఇట్లా అన్నాడు:

క. 'గురుఁడును బితామహుఁడు నీ ।

నరనాథుఁడు నెల్ల ప్రొద్దు నను దూఱుదు; రి

ప్పరుసున నీవును దామో ।

దర! దూఱెదుగాని తగవుఁ దలఁపవు కంటే! 354

ప్రతిపదార్థం: దామోదర!= శ్రీకృష్ణా!; గురుఁడును= ద్రోణాచార్యులూ; పితామహుఁడున్= తాతయైన భీష్ముడూ; ఈ నరనాథుఁడున్= ఈ ధృతరాష్ట్ర మహారాజూ; ఎల్లప్రొద్దున్= ఎల్లప్పుడూ; ననున్= నన్ను; దూఱుదురు= నిందిస్తారు; ఈ పరుసునన్= ఈ విధంగా; నీవును; దూఱెదు(వు)కాని= నన్ను నిందిస్తావే తప్ప; తగవున్+తలఁపవు+కంటే!= న్యాయమాలోచించవుగదా!

తాత్పర్యం: 'గురువైన ద్రోణుడూ, తాతగారు భీష్ముడూ, తండ్రి ధృతరాష్ట్ర మహారాజూ ఎప్పుడూ నన్ను తిడుతుంటారు. నీవున్నూ అదే విధంగా నన్ను నిందిస్తావేగాని న్యాయం ఆలోచించవుగదా!

క. వనితం బఱిచి రరణ్యం ।

బున నిడుమలఁ బడితి మనుచుఁ బోటరులై చం

పను జెఱుపఁదలఁచి మా దెసఁ ।

గనలుదు రప్పాండుసుతు లకారణమ కడున్. 355

ప్రతిపదార్థం: వనితన్= ద్రౌపదిని; పఱిచిరి= అవమానించారు; అరణ్యంబునన్= అడవిలో; ఇడుమలన్+పడితిమి= కష్టాలు అనుభవించాము; అనుచున్= అని పల్కుతూ; పోటరులు+ఐ= శూరులై; ఆ+పాండుసుతులు=

ఆ పాండు రాజు కొడుకులు; అకారణము= నిష్కారణంగా; కడున్= మిక్కిలి; చంపను= చంపటానికీ; చెఱుపన్= నాశనం చేయటానికీ; తలఁచి= భావించి; మా దెసన్= మా యెడ; కనలుదురు= కోపం వహిస్తారు.

తాత్పర్యం: 'ద్రౌపదిని భంగపరిచారు. అడవులలో మేము నానా కష్టాలు అనుభవించాము' అంటూ పాండవులు నిష్కారణంగా మాపై క్రోధం వహించి వీరులై మమ్మల్ని చంపటానికీ, నాశం చేయటానికీ ఆలోచిస్తారు.

మ. అరయం దప్పొకయింత నా వలన లే దా ధర్మపుత్త్రుండు జూ
దరి వెంటం దమకించి సౌబలునిచేతన్ భూమిఁ గోల్పోయి ము
ష్కరుఁడై వెండియు నొడ్డఁగా నతఁడు నక్షప్రౌఢిమై గెల్చె; నే
తెరువైనం దనయిచ్చతోఁ బడియె; నింతేకాక యేఁ బూఁటయే? 356

ప్రతిపదార్థం: అరయన్= పరికించగా; నావలనన్= నావలన; తప్పు= దోషం; ఒక+ ఇంతలేదు= రవ్వంతయినా లేదు; ఆ ధర్మపుత్త్రుండు= ఆ ధర్మరాజు; జూదరి వెంటన్+తమకించి= జూదరితనంతో వేగిరపడి; సౌబలుని చేతన్= శకునిచేత; భూమిన్= పుడమిని; కోల్పోయి= పోగొట్టుకొని; ముష్కరుఁడు+ఐ= మూర్ఖుడై; వెండియున్= మరల; ఒడ్డఁగాన్= పందెం చరచగా; అతఁడు= ఆ శకుని; అక్షప్రౌఢిమైన్= పాచికల ఆటలోని నేర్పుతో; గెల్చెన్= జయించాడు; ఏ తెరువు+ఐనన్= ఏ దారి అయినా; తన+ఇచ్చతోన్+పడియెన్= తన ఇష్టప్రకారమే అనుసరించాడు; ఇంతేకాక= ఇంతదప్ప; ఏన్+పూఁటయే?= అందుకు నేను బాధ్యుడనా?

తాత్పర్యం: కృష్ణా! న్యాయంగా ఆలోచిస్తే నా వలన తప్పేముంది? ధర్మరాజు జూదరి అయి, తానే శకునిని వెంబడించి వేగిరపడి అతడి చేతిలో పుడమినంతా కోలుపోయాడు. అంతటితో ఆట మానక మూర్ఖుడై మరల పందెం చరచగా సౌబలుడు తనకు పాచికల ఆటలో ఉన్న ప్రావీణ్యంతో గెలిచాడు. ఏ తెరువైనా ధర్మజుడు తన ఇష్టప్రకారమే త్రొక్కినాడు. అంతేతప్ప అతని కష్టనష్టాలకు నేను బాధ్యుడనా?

తే. మాత్స్య పాంచాల పాండ్యాది మనుజపతులఁ
గూర్చికొని తార కయ్యంబు గోరి యెత్తి
విడిసి; రింతియ కాక యివ్విధము నుగ్ర
కర్మమున కేము దొడఁగుట గలదె చెపుమ? 357

ప్రతిపదార్థం: మాత్స్య+పాంచాల+పాండ్య+ఆది మనుజపతులన్= మత్స్య దేశం; 'పాంచాల దేశం'; పాండ్య దేశం మున్నగు దేశాలరాజులను; కూర్చికొని= చేర్చుకొని; తారు+అ= తామే; కయ్యంబు+కోరి= యుద్ధం అభిలషించి; ఎత్తి విడిసిరి= మాపై దండెత్తటానికి దిగి ఉన్నారు; ఇంతియకాక= ఇంతేతప్ప; ఈ+విధము+ఉగ్ర కర్మమునకున్= ఇట్లాంటి క్రూరకృత్యానికి; ఏము= మేము; తొడఁగుట+కలదె?= పూనుకొనటం జరిగిందా; చెపుమ!= కృష్ణా!; నీవే వచించు.

తాత్పర్యం: కృష్ణా! మత్స్య పాంచాల పాండ్యాది దేశాల రాజులందరినీ కూర్చుకొని యుద్ధం చేయవలెననే కోరికతో తామే మాపై దండెత్తటానికి సిద్ధంగా ఉన్నారు. ఇట్లాంటి క్రూర కృత్యానికి మేమెప్పుడు పాల్పడినామో నీవే చెప్పు.

క. ఉక్కఱి సురపతి కైనను
మ్రొక్కము నృపధర్మమూఁది మొనతలఁబడినన్
మిక్కిలి పేరును నిట దివి
నక్కజముగఁ బెంపుఁ బడయ నగుట నుపేంద్రా! 358

ప్రతిపదార్థం: ఉప+ఇంద్రా!= కృష్ణా!; నృపధర్మము+ఊఁది= క్షత్రియ ధర్మం అవలంబించి; మొనతలన్= రణాగ్రమునందు; పడినన్= కూలినా; ఇటన్= ఈ లోకంలో; మిక్కిలి పేరును= గొప్ప కీర్తినీ; దివిన్= స్వర్గంలో; అక్కజముగన్= ఆశ్చర్యకరంగా; పెంపున్= వృద్ధినీ; పడయన్+అగుటన్= పొందగలగటంచేత; ఉక్కు+అఱి= పౌరుషాన్ని వీడి; సురపతికిన్+ఐనన్= దేవేంద్రుడికైననూ; మ్రొక్కము= నమస్కరించం.

తాత్పర్యం: కృష్ణా! క్షత్రియధర్మం వహించి యుద్ధం చేస్తూ నేలగూలితే ఇక్కడ వీరుడన్న విఖ్యాతి లభిస్తుంది. అక్కడ వీర స్వర్గ సుఖాలు చేకూరుతాయి. అందువల్ల మేము పౌరుషముడిగి దేవేంద్రుడికైనా నమస్కరించం.

చ. చిఱుతఁదనంబునం దగవు చిత్తమునం దలపోయలేక ముం
దఱ యటు వోవనిచ్చితిఁ । బితామహుఁడున్ జనకుండు నింకఁ గ్ర
చ్చఱ నిలఁ బంచి చక్క సగ మక్కడ నెవ్వరికేని మద్బలం
బెఱుఁగక యీఁదలంచినను నే నది యేటికి సమ్మతించెదన్? 359

ప్రతిపదార్థం: చిఱుతఁదనంబునన్= నేను పసివాడుగా నున్నప్పుడు; తగవు= న్యాయం; చిత్తమునన్= మనసులో; తలపోయన్+ లేక= భావించజాలక; ముందఱ= జరిగిన రోజులలో; అటుపోవన్+ఇచ్చితిన్= అట్లా జరుగనిచ్చాను; పితామహుఁడున్= భీష్ముడూ, జనకుండున్= ధృతరాష్ట్రుడూ; ఇంకన్= ఇకమీదట; క్రచ్చఱన్= అనాలోచితంగా; ఇలన్+పంచి= భూమిని విభజించి; చక్కసగము= సరిగా సగపాలు; అక్కడన్+ఎవ్వరికిన్+ఏనిన్= అక్కడ పాండవులలో ఎవరికైనా; మత్+బలంబు+ఎఱుఁగక= నా శక్తి తెలియక; ఈన్+తలంచినను= ఇవ్వటానికి సంకల్పిస్తే; ఏన్= నేను; అది+ఏటికిన్+ సమ్మతించెదన్?= అట్లా సగపాలు పంచి ఇవ్వటానికి ఎందుకు అంగీకరిస్తాను.

తాత్పర్యం: చిన్నతనంలో న్యాయమేదో తెలియనప్పుడు అట్లా సాగనిచ్చాను. ఇపుడు మా తండ్రి, తాత అనాలోచితంగా నా శక్తి సామర్థ్యాలు గుర్తించక రాజ్యంలో సగపాలు పాండవులలో ఎవ్వరికైనా పంచి ఇవ్వవలెనని సంకల్పిస్తే అందుకు నేను ఎందుకు అంగీకరిస్తాను?

తే. తొంటి చవిగని యిప్పుడుఁ దోఁచి పాండు ।
సుతులు రాజ్యంబు చేయంగఁజూచినారు;
నాకు నీఁ దీఱునే యింక నాఁటి చూఱ ।
లెక్కడివి ద్రోణ భీష్ము లీ దిక్కుసుమ్ము! 360

ప్రతిపదార్థం: తొంటిచవి+కని= మునుపటి రుచి మరగి; ఇప్పుడున్+తోఁచి= ఈ వేళ కూడా ప్రత్యక్షమై; పాండుసుతులు= పాండుకుమారులు; రాజ్యంబు చేయంగన్= రాజ్యమేలటానికి; చూచినారు= వాంఛిస్తున్నారు; నాకున్= నాకు; ఈన్+తీఱునే= ఇవ్వటానికి వీలగునా?; ఇంకన్= ఇక; నాటి చూఱలు= ఆనాటి కొల్లలు; ఎక్కడివి?= ఎక్కడున్నవి?; ద్రోణ భీష్ములు= గురు పితామహులు; ఈ దిక్కు+చుమ్ము!= మా పక్షంలో ఉన్నారు సుమా!

తాత్పర్యం: మునుపటి రుచిమరగి మళ్ళీ ఇప్పుడు ప్రత్యక్షమై కౌంతేయులు రాజ్యమేలుటకు కోరుతున్నారు. కాని, నే నిస్తానా? ఆనాటి దోపిళ్ళు ఇకమీదట సాగవు. ద్రోణభీష్ములు మా పక్షంలో ఉన్నారు.

ఉ. ఏమును వారుఁ బంచికొని యేలుట గల్గదు; పల్కకుండు మిం
కేమియు; వాఁడి సూదిమొన యించుక మోపిన యంతమాత్రయున్
భూమి యొనర్చి పాండునృపపుత్త్రుల కిత్తునె । యెవ్వరైన సం
గ్రామమునన్ జయంబుఁ గొని రాజ్యము సేయుట నిశ్చయించితిన్.361

ప్రతిపదార్థం: ఏమును= మేమూ; వారున్= పాండవులూ; పంచికొని= రాజ్యాన్ని పంచుకొని; ఏలుట+కల్గదు= పరిపాలించటం జరగదు; ఇంకన్+ ఏమియున్= మరేమిన్నీ; పల్కక+ఉండుము= బదులాడవద్దు; వాఁడిసూదిమొన= సన్నని సూదియొక్క కొన; ఇంచుక= కొంచెం; మోపిన+ అంతమాత్రయున్= ఆక్రమించినంత మేర కూడా; భూమి+ఒనర్చి= పుడమిని చీల్చి; పాండునృప పుత్త్రులకున్= పాండురాజు కుమారులకు; ఇత్తునె?= ఇస్తానా? నేనివ్వను; ఎవ్వరు+ఐనన్= అటు వారో; ఇటు మేమో; సంగ్రామమునన్= రణంలో; జయంబు కొని= విజయం పొంది; రాజ్యము చేయుట= రాజ్యము నేలటానికి; నిశ్చయించితిన్= నిర్ణయించుకొన్నాను.

తాత్పర్యం: మేమూ, వారూ పుడమిని పంచుకొని పరిపాలించటం జరగదు. ఇందుకు నీ వేమీ బదులు చెప్పవద్దు. వాడి సూదిమొన మోపినంతమాత్రమైనా

భూమిని పంచి పాండునందనులకు నేనివ్వను. మాలో ఎవరో ఒకరు యుద్ధంలో విజయం పొంది రాజ్యం చేయటానికి నిర్ణయించాను.'

విశేషం: అసలే అది సూది. అదీ వాడియైనది. దాని మొనమాత్రమే, అదికూడా ఎక్కువ మోపక 'ఇంచుక' - పాండవులకు కొంచెం కూడా ఇవ్వననటానికి ఈ కూర్పు. (సంపా.)

తే. అనిన విని కిన్కఁ బూనిన యలఁతి నగవు।
చెలువు మొగమున కొక క్రొత్త పొలు పొనర్పఁ
బుండరీకాక్షుఁడగు టెల్లఁ బోయి యప్పు।
డరుణ కమలాక్షుఁ డగుచు మురాంతకుండు. 362

ప్రతిపదార్థం: అనినన్+విని= దుర్యోధనుడి మాటలు ఆలకించి; కిన్కన్+పూనిన= కోపం వహించిన; అలఁతినగవు చెలువు= చిరునవ్వుయొక్క సొగసు; మొగమునకున్= తన ముఖానికి; ఒక క్రొత్త పొలుపు+ఒనర్పన్= ఒక నూతన సౌందర్యాన్ని ఆపాదించగా; పుండరీక+అక్షుఁడు+అగుట+ఎల్లన్= తెల్ల దామరలవంటి కన్నులుగలవాడగుట అంతా; పోయి= తొలగి; ముర+అంతకుండు= మురాసురుడిని హరించిన శ్రీకృష్ణుడు; అప్పుడు= ఆ సమయంలో; అరుణ+కమల+అక్షుఁడు+అగుచున్= ఎఱ్ఱదామరల వంటి కన్నులు గలవాడై.

తాత్పర్యం: దుర్యోధనుడి మాటలకు కోపం వహించిన చిరునవ్వుసొగసు తన ముఖమునకు ఒక క్రొత్త అందం సంతరించగా; తెల్లదామరలవంటి కన్నులుగలవాడవటం అంతాపోయి మురవిధ్వంసకుడైన వాసుదేవుడు ఎఱ్ఱదామరలవంటి కన్నులు గలవాడై. (తరువాతి పద్యంతో అన్వయం)

విశేషం: అలం: పర్యాయం, ఉపమ. కృష్ణుఁడు సహజంగా పుండరీకాక్షుడు - తెల్ల దామరలవంటి కన్నులు గలవాడు. ఇప్పుడు కోపంవచ్చి కన్నులు ఎఱ్ఱబడ్డాయి.

అందుచేత అరుణ కమలాక్షుడయ్యాడు. ఆరుణ్యం కోపానికి చిహ్నం. శ్రీకృష్ణుడు కుపితుడయ్యాడన్న విషయాన్ని తిక్కన ధ్వనిపూర్వకంగా చెప్పటం ప్రశంసనీయం. పాత్రల మనోభావాలను ఇట్లా బాహ్య వర్ణనలద్వారా చెప్పటం తిక్కన నేర్పు. (సంపా.)

శ్రీకృష్ణుఁడు దుర్యోధనునితో మున్నతండు చేసిన దుర్ణయంబు సెప్పుట(సం.5-126-1)

క. 'మొనతలఁబడియెదు నీచె।
ప్పిన యట్టుల తడవులేదు బిరుదలరై నీ
వును వీరు నిలువుఁ డిదె భం।
డన మెల్లియ వచ్చె నూఱటలు గనుఁడింకన్. 363

ప్రతిపదార్థం: నీ చెప్పిన+అట్టులు+అ= నీవు వచించిన విధంగానే; మొనతలన్+పడియెదు(వు)= రణాగ్రంలో కూలెదవు; తడవు లేదు= ఇందుకు ఆలస్యం లేదు; బిరుదులరు+ఐ= వీరులై; నీవును= నీవూ; వీరున్= నీకు సాయపడవచ్చిన ఈ రాజులూ; నిలువుఁడు= నిలబడండి; భండనము= యుద్ధం; ఎల్లి+అ+వచ్చెన్= రేపే వస్తున్నది; ఇంకన్= ఇక; ఊఱటలు+కనుఁడు= తృప్తి వహించండి; ఉపశమనం పొందండి.

తాత్పర్యం: 'దుర్యోధనా! నీవు చెప్పినట్లే రణాగ్రంలో కూలగలవు. ఇందుకు ఆలస్యం లేదు. శూరులై నీవూ, నీకు సాయపడవచ్చిన ఈ రాజులందరూ నిలబడండి. రేపే యుద్ధం వస్తున్నది. ఇక ఊరడిల్లండి.

సీ. అరయంగఁ దప్పు లేదంటి నీవలనఁ గీ।
డొకనాఁడు సేసియు నొక్కనాఁడు
సేయవె? నీ జనించిన యది యాదిగా।
నుడుగక పాండవేయులకుఁ జాల
నెగ్గు సేసితి విషమిడి, పెనుఁబాములఁ।
గఱపించి, నీరిలోఁ గట్టి త్రోచి,

లక్కయిల్ గాలిచి, పెక్కు భంగులఁ జంపఁ ।
దలఁచినఁ జావక ధర్మరక్షఁ

ఆ. జేసి నెగడి రాచసిరి నొందియున్నఁ జూ ।
పోప కీవు తీవ్ర పాపబుద్ధిఁ
గసలి జూద మొకటి కల్పించి కపటంబు ।
సేయ దాన నెల్ల చేటుఁబుట్టె. 364

ప్రతిపదార్థం: అరయంగన్= విచారించగా; నీ వలనన్= నీయెడ; తప్పులేదు+ అంటి(వి)= దోషం లేదని చెప్పావు; ఒకనాఁడు కీడు చేసియున్= ఒకనాడు పాండవులకు హాని చేసి; ఒక్కనాఁడు చేయవె= ఒకరోజు చేయకున్నావా? (ఎప్పుడూ చేస్తున్నావని అభిప్రాయం), నీ జనించిన అది+ఆదిగాన్= నీవు పుట్టింది మొదలుకొని; ఉడుగక= మానక; పాండవేయులకున్= పాండు పుత్రులకు; చాలన్= మిక్కిలి; ఎగ్గుచేసితి(వి)= కీడు చేశావు; విషము+ఇడి= అన్నంలో విషంపెట్టి; పెనుఁబాములన్+ కఱపించి= నిదురిస్తున్నప్పుడు పెద్ద పెద్ద సర్పాలచేత కరిపించి; లక్క+ఇల్+కాలిచి= లాక్షాగృహదహనం చేయించి; పెక్కుభంగులన్= అనేక రీతుల; చంపన్+తలఁచినన్= చంపటానికి యత్నించగా; చావక= చనిపోక; ధర్మరక్షన్+చేసి= ధర్మం తమను కాపాడటం వలన; ధర్మాన్ని తాము కాపాడటం వలన; నెగడి= వృద్ధికి వచ్చి; రాచసిరిన్= రాజ్యలక్ష్మిని; ఒంది+ఉన్నన్= పాండవులు పొంది సుఖులై ఉండగా; చూపు+ఓపక= చూచి సహించలేక; ఈవు= నీవు; తీవ్ర పాపబుద్ధిన్= దారుణమైన పాపచింతతో; కనలి= కోపించి; జూదము+ఒకటి కల్పించి= ద్యూతక్రీడ ఒకటి ఏర్పాటు చేసి; కపటంబు చేయన్= పాండవులను మోసగించగా; దానన్= అందువలన; ఎల్లచేటున్= ఇంత అనర్థమూ; పుట్టెన్= కల్గింది.

తాత్పర్యం: విచారిస్తే నీవల్ల దోషం లేదని చెప్పావు. సుయోధనా! ఒకనాడు పాండవులకు కీడుచేసి మరొకనాడు చేయకున్నావా? నీవు పుట్టింది మొదలు

మానకుండ వారికి అపకారాలు చేస్తూనే ఉన్నావు. తినే అన్నంలో విషం పెట్టించావు. పెద్ద పెద్ద విషసర్పాల చేత కరిపించావు. కాళ్లూ చేతులు కట్టించి గంగ మడుగులోనికి నెట్టించావు. లక్కయింటిలో నివసిస్తుండగా కాల్పించావు. ఇట్లా అనేక విధాల పాండవులను నీవు చంపటానికి యత్నించావు. కాని, వారి ధర్మం వారి ప్రాణాలను కాపాడింది. వా రెట్లాగో పైకివచ్చి రాజ్యసంపదను పొంది హాయిగా జీవిస్తుంటే నీకు కన్నుకుట్టింది. దారుణమైన పాపహృదయంతో వారిమీద కినుక పూని, జూదమొకటి ఏర్పాటు చేశావు. ధర్మజుని ఆ కపటద్యూతంలో ఓడించగా ఇంత అనర్థం కల్గింది.

విశేషం: ధర్మరక్షఁజేసి - వారు ధర్మాన్ని రక్షించటం చేతా, వాళ్ళని ధర్మం రక్షించటంచేత - అని రెండు విధాల అర్థం చెప్పవచ్చు. 'ధర్మో రక్షతి రక్షితః' అని కదా సూక్తి (సంపా.)

తే. అన్నదమ్ముల నెత్తంబు లాడి సతుల ।
తలలువట్టి సభాస్థలంబులకు నీడ్చి
చీర లొలిపింతురే? యిట్టి వారి నెందుఁ ।
దడవుమా నీ వొకండవు దక్క నధిప! 365

ప్రతిపదార్థం: అధిప!= రాజా!; అన్నదమ్ములన్= తోడబుట్టువులతో; నెత్తంబులు+ ఆడి= పాచికలాడి; సతుల తలలు+పట్టి= ఇల్లాండ్ర తలవెండ్రుకలు పట్టి; సభాస్థలంబులకున్+ ఈడ్చి= కొలువుకూటాలలోనికి ఈడ్చుకొనివచ్చి; చీరలు+ఒలిపింతురే= వలువలు ఊడదీయిస్తారా; నీవు+ఒకండవు+తక్కన్= నీ వొక్కడివేగాని; ఎందున్= ఎక్కడైనా; ఇట్టివారిన్+తడవుమా!= ఇటువంటి వారున్నారేమో చెప్పుము.

తాత్పర్యం: నీ వొకడివి తప్ప లోకంలో ఎక్కడైనా తోడబుట్టువులతో జూదమాడి, మగనాండ్ర శిరోజాలు పట్టుకొని కొలువు కూటాలలోనికి ఈడ్చుకొని వచ్చి, కట్టిన పుట్టాలు తొలగించే వారున్నారేమో నీవే చెప్పు.

ఉ. అప్పుడు నీవు గర్ణుఁడును నాడిన మాటలు కొల్వులోపలం
జెప్పెడునట్టివే? కులము శీలముఁ గల్గిన పుణ్యకాంత క
ట్లొప్పమి చేయుటెల్లఁ గనియున్న జనంబులు వించునుండఁగాఁ
దప్పొక యింత లేదను విధం బది నీక చనున్ సుయోధనా! 366

ప్రతిపదార్థం: సుయోధనా!= దుర్యోధనా!; అప్పుడు= ద్రౌపదీ మానభంగ సమయంలో; నీవున్= నీవూ; కర్ణుడును= కర్ణుడూ; ఆడినమాటలు= పల్కిన పలుకులు; కొల్వులోపలన్= ఈ సభలో; చెప్పెడు+అట్టివే?= వాకొన దగినవా (కావని భావం); కులము= ఉత్తమ వంశాభిజాత్యమూ; శీలము= మంచి నడవడీ; కల్గిన పుణ్యకాంతకున్= కలిగి ఉన్న పవిత్రురాలైన వనితకు; అట్లు+ఒప్పమిచేయుట+ఎల్లన్= ఆ విధంగా పరాభవించట మంతా; కని+ఉన్న= చూచి ఉన్నట్టి; జనంబులు= ఈ సభలో ఉన్న జనులు; వించున్+ ఉండఁగాన్= ఆలకిస్తూండగా; తప్పు+ఒక+ఇంత+లేదు= నావలన ఎట్టి నేరమూ లేదు; అనువిధంబు+ అది= అని చెప్పుచున్నట్టి తీరు, నీకున్+అ+ చనున్= నీకే చెల్లింది.

తాత్పర్యం: సుయోధనా! పాంచాలికి నిండుసభలో పరాభవం జరుగుతు న్నప్పుడు నీవూ, కర్ణుడూ మాట్లాడిన మాటలు ఇపు డీ సభలో చెప్పదగినట్టివి కావు. ఉత్తమ వంశాభిజాత్యం, సత్ప్రవర్తన కల్గిన పరమ పతివ్రతను ఆ విధంగా మీరు పరాభవించటం కనులార చూచిన ఈ జనులందరూ వింటుండగా నా వల్ల ఏ నేరమూ లేదని పల్కటం నీ కొకడికే చెల్లింది.

విశేషం: అట్లొప్పమి చేయుటెల్ల - అట్లు - అనిర్వాచ్యమైన విధంగా, - అట్టి ఘోరమైన అనిభావం. 'అరయం దప్పొకయింత నావలనలే' దన్న దుర్యోధనుడి మాటకిది యెత్తిపొడుపు. (సంపా.)

తే. ఎత్తి విడిసిన వారని యెల్ల తప్పుఁ।
బాండవుల మీఁదఁ బెట్టిన బ్రదుకుగలదె?

ద్రోణ భీష్ములుఁ దండ్రియుఁ దోడుతోడఁ।
జెప్ప తగుమాట లేమియుఁ జెవులు సొరవు. 367

ప్రతిపదార్థం: ఎత్తి విడిసినవారు+అని= దండెత్తటానికి చేరి ఉన్నారని; ఎల్లతప్పున్= దోషమంతటినీ; పాండవుల మీఁదన్; పెట్టినన్= మోపినచో; బ్రదుకు+కలదె?= మీకు ఆయువు దక్కుతుందా? ద్రోణ భీష్ములు, తండ్రియున్= జనకుడును; తోడుతోడన్= ఒకరి తరువాత మరొక్కరు; చెప్పు= బోధించే; తగుమాటలు= హితవాక్యాలు; ఏమియున్= ఒక్కటి కూడా; చెవులు+చొరవు= నీ చెవులలో దూరవు గదా!

తాత్పర్యం: మాపైకి దండెత్తి రావటానికి సిద్ధంగా ఉన్నారని నేరమంతటినీ పాండవులమీద మోపితే మీకు ఆయువు దక్కుతుందా? ద్రోణుడు, భీష్ముడు, నీ తండ్రి ధృతరాష్ట్రుడు ఒకరి తరువాత మరొకరు చెప్పే హితవచనాలు నీవు వినటమే లేదు.

క. శాంతిం బొందుట నీకుం।
గుంతీ పుత్త్రులకు మేలగున్; దానిక యే
నింతయు నాడెద; నది నీ।
కెంతయు రుచియింపకునికి యెఱిఁగి యెఱిఁగియున్. 368

ప్రతిపదార్థం: శాంతిన్+పొందుట= క్రోధాదులు విడిచి ఒద్దికగా మెలగటం; నీకున్= నీకూ; కుంతీపుత్రులకున్= పాండవులకూ; మేలు+అగున్= శ్రేయోదాయకం; నీకున్= నీకు; అది+ఎంతయున్= అదేమాత్రం; రుచియింపక+ఉనికి= ఇష్టం కాకుండటం; ఎఱిఁగి+ఎఱిఁగియున్= బాగా తెలిసికూడా; దానికిన్+అ= మీరు శాంతితో జీవించటం కొరకే; ఏను= నేను; ఇంతయున్+ఆడెదన్= ఇంతగా చెపుతున్నాను.

తాత్పర్యం: శాంతి వహించటం నీకూ, పాండవులకూ మిక్కిలి మంచిది. పాండవులతో పొత్తు నీకు బొత్తిగా గిట్టదని తెలిసికూడా శాంతికోసం నేనింతగా నీకు నొక్కి చెపుతున్నాను.

వ. అని యిట్లు నారాయణుండు నానా ప్రకారంబులం జెప్పుటకుఁ గటకటం బడియెడు దుర్యోధనునకు దుశ్శాసనుం డిట్లనియె: 369

ప్రతిపదార్థం: అని+ఇట్లు; నారాయణుండు; నానా ప్రకారంబులన్= పలురకాలుగా; చెప్పుటకు; కటకటంబడియెడు= బాధపడుతున్న; దుర్యోధనునకున్; దుశ్శాసనుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: ఈ రకంగా నారాయణుడు బహు విధాల హితవాక్యాలు పలుకుతుంటే వినటానికి బాధపడుతున్న దుర్యోధనుడితో దుశ్శాసనుడు ఇట్లా అన్నాడు:

మ. 'జనకుండున్ గురుభీష్ములుం దగిన కర్జం బాప్తులై నీకుఁ బ్రీ
తి నెఱింగించు తెఱంగు గాదు తమబుద్ధిం బోయి సంధాన మి
ట్లొనరం జేయకయున్నఁ గృష్ణుకు నిన్నొప్పించు వా; రింతవ
ట్టు నిజం; బిచ్చట నింక నీయునికి నెట్లుం గీడు పుట్టుం జుమీ! 370

ప్రతిపదార్థం: జనకుండున్= మన తండ్రీ; గురుభీష్ములున్= ద్రోణుడూ; భీష్ముడూ; తగిన కర్జంబు= యోగ్యమైన పని; ఆప్తులు+ఐ= ఇష్టులై; నీకున్= నీకు; ప్రీతిన్= ప్రేమతో; ఎఱింగించు తెఱంగు కాదు= తెలిపే తీరు కానేకాదు; తమ బుద్ధిన్+ పోయి= తాము చెప్పిన త్రోవ ననుసరించి; సంధానము= సంధి; ఇట్లు= వారు చెప్పినట్లు; ఒనరన్= సముచితంగా; చేయక+ ఉన్నన్= నీవు చేయకపోతే; కృష్ణునకున్= వాసుదేవుడికి; నిన్నున్= నిన్ను; ఒప్పించువారు= అప్పగిస్తారు; ఇంతవట్టు నిజంబు= నేను చెప్పుచున్నది వాస్తవం; ఇచ్చటన్= ఇక్కడ; ఇంకన్= ఇటుమీద; నీ+ఉనికిన్= నీవుండుటవలన; ఎట్లున్= ఏవిధంగానైనా; కీడు+పుట్టున్+చుమీ!= హాని కల్గుతుంది సుమా!

తాత్పర్యం: మన తండ్రీ, ద్రోణాచార్యులూ, పితామహుడూ నీ మేలు కోరి కర్తవ్యం ప్రేమతో నీకు చెప్పేవిధం ఇది కానేకాదు. తాము చెప్పినట్లుగా విని

నీవు పాండవులతో పొత్తు కుదుర్చుకొనకుంటే నిన్ను వీరు శ్రీకృష్ణుడికి వశం చేస్తారు. ఈ మాట నిజం. ఇక ఇక్కడ నీ వుండటం చేత ఏ విధంగానైనా హాని కలుగుతుంది సుమా!

ఆ. అనిన బాహ్లికాదులగు కురువృద్ధుల।
నాత్మజనకుఁ గృష్ణు నాదరింప
కతఁడు రాజసమున నప్పుడు దిగ్గన।
లేచిపోయె సంచలించెఁ గొలువు. 371

ప్రతిపదార్థం: అనినన్= అని దుస్ససేనుడు చెప్పగా; బాహ్లిక+ఆదులు+ అగు= శంతనుడి తమ్ముడైన బాహ్లికుడు మొదలైన; కురువృద్ధులన్= కౌరవులలో వయసు మళ్ళినవారినీ; ఆత్మజనకున్= తన తండ్రినీ; కృష్ణున్= నారాయణుడినీ; ఆదరింపక= గౌరవించక; అతఁడు= దుర్యోధనుడు; రాజసమునన్= దురహంకారంతో; అప్పుడు= ఆ సమయాన; దిగ్గనన్= శీఘ్రంగా; లేచిపోయెన్= సభనుంచి నిష్క్రమించాడు; కొలువు= సభ; సంచలించెన్= కలవరపడింది.

తాత్పర్యం: దుశ్శాసనుడు అట్లా చెప్పగానే బాహ్లికుడు మొదలైన కురువంశ వృద్ధులనూ, తమ తండ్రినీ, వాసుదేవుడినీ లెక్కించకుండ దుర్గర్వంతో దుర్యోధనుడు సభనుంచి వెంటనే లేచి వెళ్ళాడు. కొలువంతా కలవరపాటు చెందింది.

తే. అతని వెనుకన కర్ణుండు ననుజగణము।
శకునియును వారి పొందైన జనపతులును
బోయి రమ్మెయిఁ జని యొక్క ప్రోవుగట్టి।
వేఱ యంతంత నుండిరి గోఱడమున. 372

ప్రతిపదార్థం: అతని వెనుకన్+అ= దుర్యోధనుడి వెంబడే; కర్ణుండున్= రాధేయుడూ; అనుజగణమున్= తమ్ముళ్ళ గుంపూ; శకునియును=

సౌబలుడూ; వారిపొందు+ఐన= వారికి అనుకూలురైన; జనపతులును= రాజులున్నూ; పోయిరి= వెళ్ళారు; ఆ+మెయిన్+ చని= ఆ విధంగా వారు వెళ్ళి; ఒక్క ప్రోవు+కట్టి= ఒక గుంపుగా చేరి; కోఁడమునన్= క్రోధంతో; వేఱ= ప్రత్యేకంగా; అంతంతన్+ఉండిరి= కొంతదూరంలో ఉన్నారు.

తాత్పర్యం: దుర్యోధనుడి వెంట కర్ణుడు, సహోదరుల సమూహం, శకుని, మిత్రులైన రాజులు సభనుండి ఆ విధంగా లేచిపోయి గుంపుగట్టి క్రోధంతో వేఱుగా కొంచెం దూరంలో ఉండిపోయారు.

వ. ఇ ట్లున్నం గనుంగొని గాంగేయుండు. 373

ప్రతిపదార్థం: ఇట్లు+ఉన్నన్= వారిట్లుండగా; కనుంగొని= చూచి; గాంగేయుండు= గంగకొడుకైన భీష్ముడు.

తాత్పర్యం: దుర్యోధనాదులు సభనుంచి అట్లా లేచిపోయి ఒకచోట గుంపుగా చేరి ఉండగా చూచి గంగా పుత్రుడిట్లా అన్నాడు:

చ. 'ఇతఁ డిదియేల క్రొవ్వి ధరణీశుఁడ నంచు వృథాభిమానియై
మతిచెడి లోభమోహ మదమత్సరముల్ దనుఁ ద్రిప్ప ని ట్లసం
గతమునఁ బోయె; వీని వెనుకం జని రేమి దలంచియో మహీ
పతులును; వీరు గొంద అతి పౌరుష మానసు లేమిచేయుదున్?'374

ప్రతిపదార్థం: ఇతఁడు= దుర్యోధనుఁడు; ఇది+ఏల= ఇట్లెందుకు; క్రొవ్వి= మదించి; ధరణీ+ఈశుఁడన్+అంచున్= భూపతిననుచు; వృథా+అభిమాని+ఐ= వ్యర్థమైన అహంకారం కలవాడై; మతిచెడి= బుద్ధిలేక; లోభమోహమద మత్సరముల్= దురాశ, అజ్ఞానం; పొగరు, ద్వేషం అనే దుర్గుణాలు; తనున్= తనను; త్రిప్పన్= పట్టి ఆడించగా; ఇట్లు= ఈ ప్రకారంగా; అసంగతమునన్+పోయెన్= అమర్యాదగా వెళ్ళాడు; వీని వెనుకన్= ఈ దుర్యోధనుని వెనుకనే; ఏమి తలంచియో= ఏమి భావించిరోగాని; మహీపతులును= రాజులును; చనిరి= వెళ్ళారు; వీరు కొందఱు= వీరిలో కొంతమంది; అతి పౌరుష

మానసులు= మిక్కిలి పౌరుషంతో కూడిన మనస్సులు కలవారు; ఏమి చేయుదున్?= ఏమి చేసేది? (ఏమి చేయటానికీ తోచటం లేదని భావం).

తాత్పర్యం: 'ఈ దుర్యోధనుడు తానూ ఒక రాజునని కొరమాలిన అహంకారంతో పొగరెక్కి, బుద్ధిలేక, అత్యాశ, అజ్ఞానం, మదం, ఈర్ష్య అనే దుర్గుణాలకులోనై, అమర్యాదగా సభనుండి లేచివెళ్ళాడు. ఏ ఉద్దేశంతోనో వీని వెంబడి మరికొందరు రాజులు కూడా వెళ్ళిపోయారు. వీరు కొంతమంది మిక్కిలి పౌరుషంతో కూడిన మనసులు కలవారు. ఇప్పుడేమి చేయవలెనో తోచటం లేదు.'

విశేషం: అలం: సముచ్చయం.

తే. అని జనార్దనుఁ గనుఁగొని 'యకట' కాల
పక్వమయ్యె నీ నరపతి ప్రతతి కెల్ల!
ననుడుఁ దగువారి దెసఁ గలయంగఁ జూచి
తగవు మెయి నిట్టులనియె నన్నగధరుండు. 375

ప్రతిపదార్థం: అని; జనార్దనున్+కనుఁగొని= అంటూ శ్రీకృష్ణుడిని చూచి; అకట!= అయ్యో!; ఈ నరపతి ప్రతతికిన్+ఎల్లన్= ఈ రాజసమూహాని కంతకూ; కాలపక్వము+ అయ్యెన్= కాలం పండింది సుమా; అనుడున్= అని పల్కగా; ఆ+ నగధరుండు= ఆ గోవర్ధనగిరినెత్తిన గోవిందుడు; తగు వారిదెసన్= యోగ్యులైన వారివైపు; కలయంగన్+చూచి= తేరిపార చూచి; తగవు మెయిన్= ధర్మయుక్తంగా; ఇట్టులు+ అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: భీష్ముడు శ్రీకృష్ణుడి వంక చూచి ఈ రాజులందరికీ వినాశకాలం దాపురించినట్లుంది అని అనగానే శ్రీకృష్ణుడు సభలో యోగ్యులైనవారి వైపు చూచి న్యాయసమ్మతంగా ఇట్లా ప్రసంగించాడు.

శా. 'ఈ దుర్యోధనుఁ డింత గర్వియగునే! యీ యున్నవారెల్ల నా
చే దైన్యంబునఁ బొందు టొప్పదని చర్చింపండ; యీ భంగికిన్

లేదే యొండు దెఱంగు? సత్కులముఁ బాలింపంగ వర్జింపరా
దే? దుష్టాత్మకు నీచు నొక్కరునిఁ? బోదే భేద మీ జాతికిన్? 376

ప్రతిపదార్థం: ఈ దుర్యోధనుఁడు= ఈ సుయోధనుడు; ఇంత గర్వి+అగునే= ఇంతటి పొగరుబోతు అవుతాడా? ఈ+ఉన్నవారు+ ఎల్లన్= ఇక్కడున్న రాజులంతా; నాచేన్= నావలన; దైన్యంబునన్+పొందుట= దీనత్వం పాలుకావడం; ఒప్పదు+అని= తగదని; చర్చింపండ?= ఎందుకు ఆలోచించడు?; ఈ భంగికిన్= దుర్యోధనుడి ఈ రీతి వ్యవహారానికి; ఒండు తెఱంగు లేదే?= మరొక మార్గం ఏదీ లేదా?; సత్కులమున్= సద్వంశమును; పాలింపఁగన్= కాపాడటానికి; దుష్టాత్మకున్= చెడుబుద్ధిగలవాడిని; నీచున్= అల్పుడిని; ఒక్కరునిన్= ఒక్కడిని; వర్జింపన్‌రాదే?= పరిత్యజించ తగదా? ఈ జాతికిన్= ఈ కౌరవజాతికి; భేదము పోదే!= ఈ చీలిక తొలగదా?

తాత్పర్యం: 'ఈ సుయోధనుడి కింత పొగరా? ఈ సభలో ఉన్న రాజులందరూ 'నా చేత దైన్యం అనుభవించటం తగ'దని ఆలోచించకున్నారు. ఈతడి అనుచిత ప్రవృత్తి మాన్పటానికి మరో మార్గ మేదీ లేదా? సద్వంశాన్ని సంరక్షించటానికి ఆ కుటుంబంలో పుట్టిన దుష్టచిత్తుడు, అల్పుడు అయిన ఒకే ఒకడిని పరిత్యజించటం తగదా? ఈ కౌరవ జాతి కేర్పడిన పీడ తొలగదా?

ఉ. కంసుఁడు నిట్ల తండ్రి మది గందెడు చంద మొనర్చి ధర్మ వి
ధ్వంసము సేసినం గులమువారలు నా కెఱిఁగింప నేను దు
ర్మాంసము గోయు వైద్యుని క్రమంబున నాతనిఁ ద్రుంచి యన్వయో
త్తంసముఁ జేయనే జనకుఁ; దద్విధ మొప్పదె మీరుఁ జేసినన్? 377

ప్రతిపదార్థం: కంసుఁడున్= కంసుడుకూడ; ఇట్లు+అ= ఈ దుర్యోధనుడి వలెనే; తండ్రి మది= జనకుడైన ఉగ్రసేన మహారాజు చిత్తం; కందెడు చందము+ఒనర్చి= కుమిలి పోయేటట్లు చేసి; ధర్మ విధ్వంసమున్+చేసినన్= ధర్మాన్ని నిర్మూలించగా; కులము వారలు= భోజవంశంలో పుట్టినవారు; నాకున్= నాకు; ఎఱిఁగింపన్= తెలుపగా; నేను= నేను; దుర్మాంసమున్= చెడుమాంసాన్ని; కోయు= ఖండించే; వైద్యుని క్రమంబునన్= చికిత్సకుడి విధాన; ఆతనిన్= కంసుడిని; త్రుంచి= సంహరించి; జనకున్= అతని తండ్రి అయిన ఉగ్రసేనుడిని; అన్వయ+ఉత్తంసమున్+చేయనే?= కులమునకు పెద్దగా చేయలేదా?; తద్+విధము= ఆ రీతి; మీరున్ చేసినన్= మీరు కూడా సల్పినచో; ఒప్పదె?= బాగుండదా?

తాత్పర్యం: కంసుడు ఈ విధంగానే తండ్రి మనసు నొప్పించి ధర్మాన్ని నశింపజేస్తుంటే కులబంధువులు వచ్చి నాకు చెప్పుకొన్నారు. చెడుమాంసాన్ని కోసివైచే వైద్యుడివలె నేను ఆ దుష్టుడిని సంహరించి అతడి జనకుడైన ఉగ్రసేనుడికి రాజ్యపట్టం కట్టి కులానికి మేటిగా చేశాను. మీరున్నూ అట్లా చేయటం సముచితంగా ఉండదా?

విశేషం: అలం: ఉపమ.

ఆ. అంతతోడ నెల్ల యాపదలును దీఱు।
వంశ మధిక గౌరవంబు నొందుఁ
గూడి మనుట గలుగుఁ గురు పాండవులకు ని।
త్తెఱఁగు సూడ మీకు నుఱవకాదె? 378

ప్రతిపదార్థం: అంతతోడన్= అంతటితో; ఎల్ల+ఆపదలును= అన్నికష్టాలూ; తీఱున్= తొలగిపోతాయి; వంశము= కౌరవ వంశం; అధికగౌరవంబున్+ ఒందున్= మిక్కిలి ఆదరణ పొందుతుంది; కురుపాండవులకున్= కౌరవులకూ, పాండవులకూ; కూడిమనుట+కలుగున్= కలసి జీవించటం సమకూడుతుంది; ఈ తెఱఁగు చూడన్= ఆలోచిస్తే ఈ ప్రక్రియ; మీకున్= మీకు; ఉఱవు+అ కాదె!= ఉచితమే కదా!

తాత్పర్యం: దుర్యోధనుడి పీడ విరగడ కావటంతో అన్ని కష్టాలు తీరుతాయి. కురువంశం మిక్కిలి గౌరవం పొందుతుంది. కురుపాండవులకు కలసి జీవించే భాగ్యం లభిస్తుంది. కనుక నే చెప్పిన మార్గం మీకు సముచితమైనది కదా!'

వ. అనిన విని ధృతరాష్ట్రుం డదరిపడి విదురున కిట్లనియె: 379

ప్రతిపదార్థం: అనినన్+విని= శ్రీకృష్ణుడట్లా చెప్పగా ఆలించి; అదరిపడి= భయపడి; ధృతరాష్ట్రుండు; విదురునకున్; ఇట్లు+ అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సదస్యులతో శ్రీకృష్ణు డన్న మాటలు విని ధృతరాష్ట్రుడు బెదరిపోయి విదురుడితో ఇట్లా అన్నాడు:

ఆ. 'బుద్ధిమంతురాలు పొందుగఁ బలుకంగ।
నేర్చు; వచ్చి కొడుకుఁ దేర్చిపోవుఁ
గాన వేగ నీవు గాంధారిఁ దోడితె'।
మ్మనుడు నరిగి యతఁడు నట్లచేసె. 380

ప్రతిపదార్థం: బుద్ధిమంతురాలు= తెలివిగలది; పొందుగన్= తగినట్లు; పలుకంగన్+నేర్చున్= మాటలాడటం తెలిసినట్టిది; వచ్చి= ఇక్కడికి వచ్చి; కొడుకున్= కుమారుడిని; తేర్చిపోవున్= ప్రసన్నుడిని చేసి వెళ్ళుతుంది; కానన్= కాబట్టి; వేగ= శీఘ్రమే; నీవు= నీవు; గాంధారిన్= గాంధారీదేవిని; తోడితెమ్ము= పిలుచుకొనిరమ్ము; అనుడున్= అని ధృతరాష్ట్రుడు చెప్పగా; అరిగి= వెళ్ళి; అతఁడు= విదురుడు; అట్ల చేసెన్= ఆమెను సభకు వెంట బెట్టుకొని వచ్చాడు.

తాత్పర్యం: 'గాంధారి తెలివిగలది. తగినట్లు మాట్లాడే నేర్పున్నది. ఇక్కడికి వచ్చి తన కుమారుడిని శాంతింపజేస్తుంది. నీవు త్వరగా వెళ్ళి ఆమెను సభకు తోడ్కొనిరమ్ము' అని ధృతరాష్ట్రుడు చెప్పగా విదురుడు వెళ్ళి ఆమెను వెంటబెట్టుకొని వచ్చాడు.

వ. అద్దేవియు. 381

తాత్పర్యం: ఆ గాంధారీ దేవియును.

క. చనుదెంచి యుచిత పీఠం।
బున నున్నం గురువిభుండు పొలఁతుకతో ని
ట్లను; నీ తనూభవుఁడు దు।
ర్వినయంబునఁ జనియె; నిట్టి వెంగలి గలఁడే? 382

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ఉచిత పీఠంబునన్+ఉన్నన్= తగిన ఆసనంపై ఉండగా; కురువిభుండు= కురు రాజైన ధృతరాష్ట్రుడు; పొలఁతుక తోన్= పత్ని అయిన గాంధారితో; ఇట్లు+అనున్= ఈ విధంగా పలికాడు; నీ తనూభవుఁడు= నీ కుమారుడు; దుర్వినయంబునన్= అవిధేయతతో; చనియెన్= సభనుంచి లేచి వెళ్ళాడు; ఇట్టి వెంగలి+కలఁడే?= ఇటువంటి మూర్ఖుడున్నాడా?

తాత్పర్యం: గాంధారి విదురుడి వెంట వచ్చి తగిన పీఠంమీద కూర్చున్నది. అప్పుడు ధృతరాష్ట్రుడు. ఆమెతో ఇట్లా అన్నాడు. 'నీ కుమారుడు అవిధేయుడై సభనుంచి వెళ్ళిపోయాడు. ఇట్లాంటి మూర్ఖుడు ఎక్కడైనా ఉన్నాడా?'

విశేషం: దుర్యోధనుడు తనకూ కొడుకైనప్పటికీ, భార్యయైన గాంధారితో మన తనూభవుడనక 'నీ తనూభవుఁ' డనటం లోక సహజం. (సంపా.)

క. నీవైనఁ జెప్పి శాంతుం।
గావింపఁగ నోపుదేనిఁ గౌరవకుల మీ
గోవిందు శాసనము సం।
భావింపం గాంచి చెడక బ్రదుకుంజుమ్మీ! 383

ప్రతిపదార్థం: నీవు+ఐనన్+చెప్పి= నీవైనా తెలిపి; శాంతున్+కావింపఁగన్= ప్రసన్నుడిని కావించటానికి; ఓపుదు(వు)+ఏనిన్= చాలి ఉంటే; కౌరవకులము= కురువంశం; ఈ గోవిందుశాసనమున్= ఈ ముకుందుడి యొక్క ఆజ్ఞను;

సంభావింపన్+కాంచి= ఆదరించగల్గినదై; చెడక= నశించక; బ్రదుకున్+ చుమ్మీ!= జీవించును సుమా!

తాత్పర్యం: 'నీవైననూ చెప్పి దుర్యోధనుడిని శాంతింపజేయగలిగితే శ్రీకృష్ణుడి ఆజ్ఞ ఆదరించబడినదై, ఈ కురువంశం నశించక బ్రతికి ఉంటుంది.'

తే. అనుడు 'నీ పుత్త్రుఁ డవినీతుఁ డగుట యెఱిఁగి ।
యెఱిఁగి వాని వశంబున నేలపోయె
దీవు పాండవులకు నేమియిచ్చితేని ।
నడ్డపడ నెవ్వరికి వచ్చు నధిప! చెపుమ.' 384

ప్రతిపదార్థం: అనుడున్= అని ధృతరాష్ట్రుడు పలుకగా; నీ పుత్త్రుఁడు= నీ కుమారుడు; అవినీతుఁడు= అణకువ లేనివాడు; అగుట= అయి యుండుట; ఎఱిఁగి+ఎఱిఁగి= తెలిసి తెలిసికూడ; వాని వశంబునన్+ఏల పోయెదు(వు)?= వాడికి లోబడి ఎందుకు మెలగుతావు?; ఈవు= నీవు; పాండవులకున్= పాండు కుమారులకు; ఏమి+ ఇచ్చితి+ ఏనిన్= ఏమిచ్చినప్పటికినీ; అధిప!= రాజా!; ఎవ్వరికిన్+అడ్డపడన్ వచ్చున్?= కాదని చెప్పటానికి ఎవరితరం?; చెపుమ= నీవే చెప్పుము.

తాత్పర్యం: 'రాజా! నీ కొడుకు అవిధేయుడని తెలిసి తెలిసి వాని ఇష్ట ప్రకారం ఎందుకు వ్యవహరిస్తావు? నీవు పాండుకుమారులకు ఏమిచ్చినా వద్దని నీకు అడ్డుపడే వారెవరో నీవే చెప్పు.'

విశేషం: ధృతరాష్ట్రుడు గాంధారితో 'నీ తనూభవు' డంటే, ఆమెకూడా తదనుగుణంగానే 'నీ పుత్త్రు' డనటం గమనించదగింది. లోకంలో కొడుకు చెడ్డవాడైతే తల్లి దండ్రులిట్లా ఎవరిమట్టుకు వారు అతడిని తన కొడుకు కాడనటం పరిపాటి. 'నీ కొడుకని అంటావేమి? నీకు మాత్రం కొడుకు కాడా?' అని యెత్తిపొడుపు. 'అధిప' అనే సంబోధనం కూడా సాభిప్రాయం. నీవు అధిపుడవు. ఏమయినా చేయగల సమర్థుడివి. పాండవులకు ఏమి ఇస్తే నిన్ను

వారించగలిగే వారెవరున్నారు? నీవు రాజువు కదా! అందుచే తప్పంతా నీదే అంటోంది గాంధారి. (సంపా.)

క. అని గాంధారి పతియుఁ దా ।
నును విదురుం బనిచె నందనుం బిలువ; నతం
డును మొగము జేవుఱింపఁగఁ ।
జనుదెంచెను సభకు విదుర సంప్రార్థితుఁడై. 385

ప్రతిపదార్థం: అని గాంధారి= అని గాంధారి పలికి; పతియున్= తనభర్త అగు ధృతరాష్ట్రుడూ; తానును= తానూ; నందనున్= కుమారుడైన దుర్యోధనుడిని; పిలువన్= పిలుచుకొని రావటానికి; విదురున్= విదురుడిని; పనిచెన్= పంపారు; విదుర సంప్రార్థితుఁడు+ఐ= విదురుడిచే వేయబడినవాడై; అతండును= ఆ దుర్యోధనుడూ; మొగము జేవుఱింపఁగన్= ముఖం క్రోధంతో ఎఱ్ఱబడగా; సభకున్= కొలువులోనికి; చనుదెంచెను= వచ్చాడు.

తాత్పర్యం: అట్లా గాంధారి వచించి తానూ ధృతరాష్ట్రుడూ దుర్యోధనుడిని సభకు పిలుచుకొనిరమ్మని విదురుడిని పంపారు. విదురుడు వెళ్ళి రమ్మని చెప్పగా సుయోధనుడు కోపంతో ముఖం ఎఱ్ఱపడగా సభకు వచ్చాడు.

వ. మున్ను దనతోడం జనిన వార లందఱు నచ్చోటన నిలువ నిట్లువచ్చి సుయోధనుండు నిజాసనాసీనుండై యున్నఁజూచి తల్లి చిత్తంబున గర్వించుచు నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుఁ దెరువును నిజశక్తియు సహాయంబు గొలందియుఁ గులజన చిత్త ప్రకారంబున బాండుపుత్త్రుల బలపరాక్రమంబులుఁ దెలియునట్లుగాఁ దెఱంగుపడం జెప్పి, బుజ్జగించియుం గినిసియు ననేక విధంబుల నాడిన నమ్మాటల దెస ననాదరంబు సేసి యుద్ధతిం గ్రమ్మఱం జని యతండు కర్ణాదులం గలిసి వారునుం దానును దుర్మంత్రంబునకుం జొచ్చి. 386

ప్రతిపదార్థం: మున్ను= మునుపు; తనతోడన్‌చనినవారలు= తనతో వెళ్ళినవారు; అందఱున్; ఆ+చోటన్+అ= అక్కడే; నిలువన్; ఇట్లు వచ్చి= ఈ విధంగా వచ్చి సుయోధనుండు; నిజ+ఆసన+ఆసీనుండు+ఐ= తన పీఠంమీద కూర్చున్నవాడై; ఉన్నన్; చూచి; తల్లి; చిత్తంబునన్= మనసులోపల; గర్హించుచున్= నిందిస్తూ; అతనికిన్; ధర్మంబును; నీతియును; చుట్టఱికంబును; బ్రదుకు+తెరువును= జీవనోపాయం; నిజశక్తియున్= అతనిశక్తిని; సహాయంబు కొలఁదియున్= ఆతడికి జరిగేసాయం యొక్క మోతాదు; కులజన చిత్తప్రకారంబును= కుల బంధువుల యొక్క మనోవైఖరి; పాండు పుత్రుల బల పరాక్రమంబులున్; తెలియునట్లుగాన్; తెఱంగుపడన్+చెప్పి= తేటతెల్లంగా తెలిపి; బుజ్జగించియున్= బతిమాలుకొనియూ; కినిసియున్= కోపించియూ; అనేక విధంబులన్= పలు రకాల; ఆడిన= పల్కినట్టి; ఆ+మాటల దెసన్= ఆ పలుకులయెడ; అనాదరంబు+చేసి= ఆదరం చూపక; ఉద్ధతిన్= గర్వంతో; క్రమ్మఱన్+చని= మరల వెళ్ళి; అతండు= దుర్యోధనుడు; కర్ణ+ఆదులన్+కలిసి= కర్ణుడు మొదలైనవారితో చేరి; వారునున్= ఆ కర్ణాదులు; తానును; దుర్మంత్రంబునకున్+చొచ్చి= దురాలోచనకు పూనుకొని.

తాత్పర్యం: మునుపు తనతోపాటు సభనుండి లేచి వచ్చిన వారంతా అక్కడే నిలువగా దుర్యోధనుడు తానొక్కడే వచ్చి తన పీఠంమీద కూర్చున్నాడు. గాంధారి అతడిని గమనించి మనసులో తిట్టుకొంటూ అతనికి ధర్మం, రాజనీతి, బాంధవ్యం, బ్రతికే మార్గం, అతనికున్న శక్తి, సహాయము యొక్క మితి, కురువంశంలోని పెద్దల మనోవైఖరి, పాండవుల శక్తిసామర్థ్యాలు స్పష్టంగా అతడి బుద్ధి కెక్కేటట్లు చెప్పింది. అతడిని బతిమాలి, కోపించి బహువిధాలుగా హితవాక్యాలు పలికింది. కాని, అతడు తల్లిమాటలు నిరాదరించి గర్వంతో మళ్ళీ లేచి వెళ్ళి కర్ణాదులతో చేరి తానూ వారూ దురాలోచనకు పూనుకొన్నారు.

దుర్యోధనాదులు శ్రీకృష్ణునిం బట్టికొని చెఱంబెట్టఁ దలంచుట (సం. 5-128-1)

క. హరి తలఁ పొప్పదు భీష్ముని ।
గురునిం గూర్చికొని మనలఁ గ్రొవ్వఱఁ బట్టం
గర ముత్సహించుచున్నాఁ ।
డరయ నతని వచన రచన నంతయుఁ దెలిసెన్. 387

ప్రతిపదార్థం: హరి తలఁపు+ఒప్పదు= శ్రీకృష్ణుడి సంకల్పం మంచిది కాదు; భీష్మునిన్= గాంగేయుడిని; గురునిన్= ద్రోణుడిని; కూర్చికొని= తనవైపు చేర్చుకొని; మనలన్= మనందరినీ; క్రొవ్వు+అఱన్= పౌరుషం చెడేటట్లు; పట్టన్= బంధించటానికి; కరము= మిక్కిలి; ఉత్సహించుచున్+ఉన్నాఁడు= యత్నిస్తున్నాడు; అరయన్= పరికించగా; అతని వచనరచనన్= శౌరిమాటల తీరును బట్టి; అంతయున్+తెలిసెన్= సమస్తం వెల్లడి ఐనది.

తాత్పర్యం: 'శ్రీకృష్ణుడి ఉద్దేశం మంచిది కాదు. అతడు గురుభీష్ములను తనవైపు కూడ గట్టుకొని, మనందరినీ గర్వమణగేటట్లు పట్టటానికి మిక్కిలి యత్నిస్తున్నాడు. ఇదంతా అతడి మాటల తీరును బట్టి వెల్లడి ఔతున్నది.

విశేషం: నిజానికి కృష్ణుడిని బంధింప జూచేది తానూ తన మిత్రులూ, కృష్ణుడే తనను బంధింపజూస్తున్నాడనటం విడ్డూరం. దుష్టుడైన దుర్యోధనుడు తాను చేయబోయే దౌష్ట్యానికి హేతువును కల్పిస్తున్నాడు. (సంపా.)

క. మును దాఁ గంసునిఁబరి మా ।
ర్చిన చందము వారికెల్లఁ జెప్పెడుఁ; దనకున్
మును మనము గడఁగి వెసఁబ ।
ట్టినఁ గార్యం బగుఁ; జలంబు డింపకుఁ డింకన్. 388

ప్రతిపదార్థం: మును= పూర్వం; తాన్= తాను; కంసునిన్ పరిమార్చిన చందమున్= కంసుడిని చంపిన వైనం; వారికిన్+ఎల్లన్= సభలోని భీష్మ ద్రోణాదులందరికీ; చెప్పెడున్= చెపుతున్నాడు; తనకున్ మును= తాను

మనలను బంధించటానికి పూర్వమే; మనము= మనమందరమూ; కడఁగి= పూనుకొని; వెసన్= శీఘ్రంగా; పట్టినన్= శౌరిని బంధిస్తే; కార్యంబు+అగున్= మనపని నెరవేరుతుంది; ఇంకన్= ఇంక; చలంబు; డింపకుఁడు= పట్టుదల వదలకండి.

తాత్పర్యం: పూర్వం తాను కంసుడిని సంహరించిన విధమెట్టిదో గురు భీష్మాదులైన మనవారి కందరికీ చెప్పుతున్నాడు. తనకంటె మనమే ముందు మిగిలి అతడిని వెంటనే బంధిస్తే మనపని నెరవేరుతుంది. పట్టుదల మానకండి.

తే. పట్టి యీతనిఁ జెఱఁబెట్టి పాండవులకు ।
దిగులు పుట్టింత మంతటఁ దెగక యెత్తి
వచ్చిరేనియు నిర్జింప వచ్చుఁ గోఱ ।
లెల్లఁ బుచ్చిన నురగంబు లేమిసేయు? 389

ప్రతిపదార్థం: ఈతనిన్+పట్టి= శౌరిని పట్టుకొని; చెఱన్+పెట్టి= చెరసాలలో ఉంచి; పాండవు లకున్= పాండునందనులకు; దిగులు పుట్టింతము= జాలికలిగేటట్లు చేద్దాము; అంతటన్= అంతటితో; తెగక= వెనుదీయక; ఎత్తివచ్చిరి+ఏనియున్= మనపై దాడి సలిపితే; నిర్జింపన్+వచ్చున్= వారి నోడించవచ్చు; కోఱలు+ఎల్లన్= కోరలన్నీ; పుచ్చినన్= తీసివేస్తే; ఉరగంబులు= పాములు; ఏమి చేయున్?= ఏమి చెయ్యగలవు?

తాత్పర్యం: కృష్ణుడిని పట్టి చెరలో పెట్టి పాండవులకు దిగులు పుట్టిద్దాము. అంతటితో వారు దారికి వస్తారు. ఒకవేళ దారికి రాక మనపైకి దండెత్తి వస్తే వారిని సులువుగా మనం ఓడించవచ్చు. కోరలు తీసిన పాము లేమి చేస్తాయి?

విశేషం: అలం: నిదర్శన.

వ. అని విచారించె నట్లు దుష్కార్యాలోచనంబు సేసి దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులగు దుష్టచతుష్టయంబు మొదలుగాఁ గల యవినీతులు దైతేయమర్దను మర్దింప నిశ్చయించి; రయ్యవసరంబున. 390

ప్రతిపదార్థం: అని విచారించెన్= అని దుర్యోధనుడు ఆలోచించాడు. అట్లు= ఆ విధంగా; దుష్కార్య+ఆలోచనంబు చేసి= చెడుపని చేయటానికి ఆలోచించి; దుర్యోధన దుశ్శాసన; శకుని కర్ణులు; అగు= అనునట్టి; దుష్టచతుష్టయంబు= నలుగురు దుర్మార్గులు; మొదలుగాన్+కల= మున్నుగా ఉన్నట్టి; అవినీతులు= చెడు నడవడికలవారు; దైతేయ మర్దనున్= రాక్షసులను నలగగొట్టిన నారాయణుడిని; మర్దింపన్ నిశ్చయించిరి= పీడించటానికి నిర్ణయించుకొన్నారు; ఆ+అవసరంబునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: కృష్ణుడిని పట్టవలెనని దుష్కార్యాలోచన చేసి, దుష్టచతుష్టయం అని పిలువబడే దుర్యోధన దుశ్శాసన శకుని కర్ణులు, ఇంకా వారి పక్షంలో ఉన్న చెడు నడత గలిగిన మరికొందరూ రాక్షసాంతకుడైన శౌరిని బంధించాలని నిశ్చయించుకొన్నారు.

చ. అడఁకువ లేమి నల్కి యురియాడుట నొండొరుఁగూడకుండుటన్
బుడిబుడి మాటలాడుటను బోవుచు వచ్చుచుఁ గ్రందు గ్రమ్మఱం
బడుటను దెల్లమైన మును పన్నుగఁ దాఁ బరికించి యున్కి న
ప్పుడు హరిఁ బట్టు సంకులము పుట్టుట సాత్యకి నిశ్చయించుచున్.391

ప్రతిపదార్థం: అడఁకువలేమిన్= వినయం లేకుండటంచేత; అల్కి= శంకించి; ఉరియాడుటన్= కళవళపడటం చేతను; ఒండొరున్+కూడక+ఉండుటన్= ఒకరితో మరొకరు చేరకుండటం చేతను; బుడిబుడి మాటలు+ఆడుటను= గుసగుసలాడు కొనటంచేతను; పోవుచున్ వచ్చుచున్= రాకపోకలు సల్పుతూ; క్రందు= సందడి; క్రమ్మఱన్+పడుటను= మరల నేర్పడుట చేతను; తెల్లము+ఐనన్= స్పష్టంకాగా; మును= ముందే; పన్నుగన్= చక్కగా; తాన్= తాను; పరికించి+ఉన్కిన్= గమనిస్తూ ఉండుటచేత; అప్పుడు= ఆ వేళ; హరిన్= శ్రీకృష్ణుడిని; పట్టు సంకులము= బంధించే సంరంభం; పుట్టుట= జనించటం; సాత్యకి= (కృష్ణుడి సోదరుడు); నిశ్చయించుచున్= నిర్ణయిస్తూ

తాత్పర్యం: దుర్యోధనాదులు వినయరహితులై భయంతో కళవళించటం, ఒకరి నొకరు చేరకుండటం, ఒకరితో ఒకరు గుసగుసలాడుకొనటం, అటునిటు తిరుగు లాడుతుండటంవల్ల సందడి హెచ్చటం - ఈ లక్షణాలవల్ల విషయం విశదమై ముందుగానే అంతా చక్కగా గమనించటం వల్ల శౌరిని బంధించే సంరంభం ఏర్పడిందని అప్పుడు సాత్యకి నిర్ణయిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: అలం: సముచ్చయం.

తే. బఱటి కొనిపోయి కృతవర్మఁ బన్నఁ బనిచె।
నీవు బలమును వాఁకిట నిలువు; మేను
లోపలికి నెల్లఁ జాలుదుఁ; బాపబుద్ధు।
లన్నదెసఁ దప్పిరని నిర్భయమునఁ జెప్పె. 392

ప్రతిపదార్థం: బఱటి= సైగగా గోకి; కొనిపోయి= తనవెంట తీసికొనివెళ్ళి; కృతవర్మన్= కృతవర్మను; పన్నన్+పనిచెన్= యుద్ధానికి తలపడుమని చెప్పాడు; నీవును= నీవూ; బలమును= సేనలూ; వాఁకిటన్= సభాద్వారము నందు; నిలువుము= నిలబడండి; ఏను= నేను; లోపలికిన్+ఎల్లన్= సభలోపలి పని కంతటికీ; చాలుదున్= సరిపోతాను; పాపబుద్ధులు= దురిత చిత్తులైన దుర్యోధనాదులు; అన్నదెసన్+తప్పిరి= అన్నపట్ల దౌష్ట్యానికి దిగారు; అని, నిర్భయమునన్+చెప్పెన్= నిర్భీతితో పలికాడు.

తాత్పర్యం: సాత్యకి సైగచేసి కృతవర్మను తనవెంట కొనిపోయి 'నీవు యుద్ధానికి సంసిద్ధంగా ఉండు. నీవూ, సేనలూ వాకిట నిలబడండి. సభలోని సంగతి నంతా నేను చూచుకొంటాను. దురితచిత్తులై దుర్యోధనాదులు అన్నపట్ల అక్రమ మార్గానికి దిగారు' అంటూ నిర్భయంగా పలికాడు.

వ. ఇట్లు పరమాప్తుండగు హార్దిక్యు నటపుచ్చి సాత్యకి సత్వరంగాఁ జనుదెంచి జనార్దనునకు నత్తెఱంగెల్ల నెఱింగించి, తదనుమతిం గౌరవేశ్వర బాహ్లిక గురు భీష్మ విదురులతో నిట్లనియె. 393

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; పరమ+ఆప్తుండు+అగు= మిక్కిలి హితుడైన; హార్దిక్యున్= కృతవర్మను (హృదికుని కొడుకు); అట+పుచ్చి= సభ వెలుపల ఉండుమని పంపి; సాత్యకి; సత్వరంబుగాన్= వేగంగా; చనుదెంచి= వచ్చి; జనార్దనునకున్= శ్రీకృష్ణుడికి; ఆ+తెఱంగు= ఆ విధమంతయు; ఎఱింగించి; తత్+అనుమతిన్= అచ్యుతుడి అంగీకారంతో; కౌరవేశ్వర; బాహ్లిక గురు; భీష్మ; విదురుల తోన్= ధృతరాష్ట్రుడు, బాహ్లికుడు, ద్రోణుడు, భీష్ముడు, విదురుడు అనువారితో; ఇట్లు+అనియెన్= ఇలా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి ఈ విధంగా పరమహితుడూ యాదవుడూ అయిన కృతవర్మను సభ వాకిట పోరాటానికి సంసిద్ధంగా ఉండుమని పంపి, తాను శీఘ్రంగా కొలువు లోనికి వచ్చాడు. శ్రీకృష్ణుడికి విషయమంతా చెప్పి, ఆయన అంగీకారంతో ధృతరాష్ట్ర బాహ్లిక గురు భీష్మ విదురులతో ఇట్లా అన్నాడు:

మ. 'అదె కౌరవ్యు లశక్తదుర్జనత సేయంబూని పైఁ బాఱఁజూ
చెద రమ్మైఁ దమచేతఁ దీఱునె జయశ్రీకాంతు దైత్యాంతకుం
బొదువం దారు దలంచు టెల్ల ననలంబుం జీర బంధింపఁగా
మది నూహించిన యట్లకాక తమ దుర్మంత్రంబులం బోవునే?' 394

ప్రతిపదార్థం: అదె= అదిగో; కౌరవ్యులు= కురుకుమారులు; అశక్త దుర్జనతన్+ చేయన్+పూని= శక్తి లేనందున దౌర్జన్యం జరుపనెంచి; పైన్+పాఱన్+చూచెదరు= శ్రీకృష్ణుడి మీదికి ఉరుక యత్నిస్తున్నారు; అమ్మైన్= (ఆ+మైన్) ఆ విధంగా గమకించటం; తమచేతన్+తీఱునె?= తమవలన సాధ్యపడుతుందా?; జయశ్రీకాంతున్= జయలక్ష్మీ వల్లభుడూ; దైత్య+అంతకున్= దానవ వినాశకుడూ అయిన శౌరిని; పొదువన్= పట్టటానికి; తారు= తాము; తలంచుట+ఎల్లన్= సంకల్పించటమన్నది; అనలంబున్= అగ్నిని; చీరన్= వస్త్రంలో; బంధింపఁగాన్= మూట గట్టటానికి; మదిన్= మనస్సులో; ఊహించిన+అట్లకాక= తలంచినట్లే అవుతుందిగాని; తమ

దుర్మంత్రంబులన్= తమయొక్క దుష్టాలోచనలతో; పోవునే?= పని నెరవేరుతుందా?

తాత్పర్యం: 'అదుగో! కౌరవులు శక్తిహీనులై దౌర్జన్యం జరుపదలచి శ్రీకృష్ణుడి మీదికి దుముక యత్నిస్తున్నారు. అది తమవల్ల శక్యమవుతుందా? శౌరిని ఏమిగా భావించారో! ఆయన జయలక్ష్మీవల్లభుడు. దైత్య సంహారకుడు, అట్లాంటి పురుషోత్తముడిని పట్టనెంచటం వస్త్రంలో అగ్నిని మూట గట్టటమే అవుతుంది. తమ దురాలోచనల వల్ల పని నెరవేరుతుందా?'

విశేషం: అలం: రూపకం.

వ. అనిన విదురుం డదరిపడి వైచిత్త్రవీర్యున కిట్లనియె: 395

ప్రతిపదార్థం: అనినన్; విదురుండు; అదరిపడి= బెదరిపోయి; వైచిత్త్ర్య వీర్యునకున్= విచిత్రవీర్యుడి కుమారుడైన ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనియెన్= ఇట్లా అన్నాడు.

తాత్పర్యం: సాత్యకి మాటలు విని విదురు డదిరిపడి ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'భూవర! నీ తనూభవులు పుణ్యు నగణ్యపరాక్రమున్ హరిం
గేవల మర్త్యుఁగాఁ దలఁచి కిట్టినఁ బట్టినఁ దారు మంటపై
వావిరిఁ గ్రమ్ము నా శలభ వర్గము చాడ్పున గ్రుందిపోరె? కా
లావధి యయ్యెఁ గావలయు నక్కట! వారికి వారివారికిన్. 396

ప్రతిపదార్థం: భూవర!= రాజా!; నీ తనూభవులు= నీ కుమారులు; పుణ్యున్= కలుష రహితుడూ; అగణ్య పరాక్రమున్= గణింప శక్యంగాని శౌర్యము కలవాడునూ అయిన; హరిన్= శ్రీమన్నారాయణుడిని; కేవల మర్త్యుగాన్+తలఁచి= సామాన్యుడైన మానవమాత్రుడిగా నెంచి; కిట్టినన్= సమీపించినా; పట్టినన్= బంధించినా; తారు= తాము; మంటపైన్= అగ్నిజ్వాలపై; వావిరిన్= వరుసగా; క్రమ్మ= మూగు; ఆ శలభ వర్గము చాడ్పునన్= ఆ మిడుతల దండువలె; గ్రుందిపోరె?= మాడిపోవరా?; అక్కట!= అయ్యో; వారికిన్= కౌరవులకు; వారివారికిన్= వారితో చేరిన వారికందరికినీ; కాల+అవధి+ అయ్యెన్+కావలయున్= ఆయుష్యం యొక్క గడువు తీరింది కాబోలు!

తాత్పర్యం: 'ధృతరాష్ట్ర మహారాజా! నీ కుమారులు సుకృతాత్ముడూ, లెక్కింప శక్యంగాని పరాక్రమం కలవాడూ అయిన శ్రీహరిని సాధారణ నరుడిగా భావించి ఎదుర్కొని బంధించనెంచితే అగ్నిజ్వాలలపై మూగిన మిడుతల దండువలె మాడి మసియైపోతారు. కౌరవులకూ, కౌరవులతో చేరినవారికీ మరణ సమయం ఆసన్నమయిందేమో!'

విశేషం: అలం: ఉపమ.

వ. అనుటయు గోవిందుం డందఱు విన నంబికానందనున కిట్లనియె: 397

ప్రతిపదార్థం: అనుటయున్= అని విదురుడనగా; గోవిందుండు= గోపాలదేవుడు; అందఱువినన్= సభ్యులంతా ఆలకించగా; అంబికా నందనునకున్= ధృతరాష్ట్రుడితో; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: విదురుడట్లా పలికిన మీదట అందరు వింటుండగా శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడితో ఇట్లా అన్నాడు:

ఉ. 'రోషము నాపయిం గలిగి క్రూరతఁ గౌరవు లింతసేఁత సం
తోషమ! నీవు ప్రాభవముతోఁ దగ నాకు ననుజ్ఞయిమ్ము; ని
ర్దోషత నేను నోపుగతి దోర్బల దుర్జయులైన వారి వి
ద్వేషముఁ జక్కఁ బెట్టి జగతీవర! యింతకుఁ బోయివచ్చెదన్.' 398

ప్రతిపదార్థం: జగతీవర!= రాజా!; రోషము= కోపం; నాపయిన్+కలిగి= నామీద జనించి; క్రూరతన్= కర్కశత్వంతో; కౌరవులు= నీ కుమారులు; ఇంతచేఁత= ఇంతపనికి పూనుకొనటం; సంతోషము+అ= నాకు ఆనందమే; నీవు; ప్రాభవముతోన్= రాచరికంతో; తగన్= యుక్తంగా; నాకున్= నాకు;

అనుజ్ఞ+ఇమ్ము= ఉత్తరువు నొసగుము; నిర్దోషతన్= దోషం కలుగకుండా; నేనున్= నేనునూ; ఓవుగతిన్= చాలినంతవరకు; దోర్బలదుర్జయులు+ఐన= భుజ విక్రమంతో సులభంగా జయించ రానట్టి; వారి= దుర్యోధనాదుల యొక్క; విద్వేషమున్= వైరమును; చక్కన్+పెట్టి= సరిదిద్ది; ఇంతకున్= ఇటుపై; పోయివచ్చెదన్= పయనమై వెళ్ళుతాను.

తాత్పర్యం: 'మహారాజా! నామీద కినుక వహించి ద్రోహబుద్ధితో కౌరవులింతపనికి పూనుకొన్నారు. చాలా సంతోషం. నీవు నీ రాజాధికారంతో నాకు ఉత్తరువిస్తే నేను దోషమొదవకుండ నా శక్తికొలది బాహుశక్తితో సులభంగా జయించరాని ఈ కురుకుమారుల విరోధాన్ని చక్కబెట్టి, ఆ తర్వాతనే ఇక్కడనుండి పయనమై వెళ్ళుతాను.'

క. అనుడు ససంభ్రమముగ న ।
జ్జనపతి దుశ్శాసనాది సకల పరిజనం
బును నాదుర్జనునిం దో ।
డ్కొని రమ్మని విదురుఁ బనుచుడుం జని యతఁడున్. 399

ప్రతిపదార్థం: అనుచున్= అని వాసుదేవుడు పలుకగానే; ససంభ్రమముగన్= తొట్రుపాటుతో; ఆ+జనపతి= ఆ నరేశ్వరుడు అయిన ధృతరాష్ట్రుడు; దుశ్శాసన+ఆది+సకల పరిజనంబును= దుశ్శాసనుడు మొదలైన అనుచర వర్గమునూ; ఆ దుర్జనునిన్= ఆ దుర్మార్గుడైన దుర్యోధనుడినీ; తోడ్కొని రమ్ము+అని= ఇచటికి తీసికొని రమ్ము అని; విదురున్ పనుచుడున్= విదురుడిని పంపగా; అతఁడున్= విదురుడునూ; చని= వెళ్ళి

తాత్పర్యం: వాసుదేవుడి మాటలు విని తొట్రుపాటుతో ధృతరాష్ట్రుడు దుశ్శాసనుడు మొదలైన పరిజనంతోపాటు దుర్మార్గుడైన దుర్యోధనుడిని ఇక్కడికి పిలుచుకొని రమ్మని పంపగా విదురుడు వెళ్ళి.

వ. సపరివారంబుగా దుర్యోధనుం దోడ్తెచ్చినం జూచి యతనికి ధృతరాష్ట్రుం డిట్లనియె: 400

ప్రతిపదార్థం: సపరివారంబుగాన్= పరిజనులతో కూడ; దుర్యోధనున్; తోడ్తెచ్చినన్+ చూచి= విదురుడు వెంట బెట్టుక రాగా వీక్షించి; అతనికిన్; ధృతరాష్ట్రుండు; ఇట్లు+ అనియెన్.

తాత్పర్యం: విదురుడు వెళ్ళి పరిజనులతో కూడ దుర్యోధనుడిని సభకు తోడుకొని వచ్చాడు. అపుడు ధృతరాష్ట్రుడు అతడిని చూచి ఇట్లా అన్నాడు :

చ. 'అలవి యెఱుంగ కిట్లు దనుజారికిఁ గీడొనరింప నీవు నీ
తులువలు నుత్సహించితిరి దుర్మతులార! సమీరు మీకుఁ జే
నలవడఁ బట్టవచ్చునె? మహాద్రిఁ గదల్పఁగఁ బోలునే? దవా
నలుఁ జమరంగ శక్యమె? వినాశముఁ బొందెద రేమి సేయుదున్?' 401

ప్రతిపదార్థం: దుర్మతులార!= దుష్టాత్ములారా!; అలవి+ఎఱుంగక= మీ శక్తి ఏపాటిదో గుర్తించక; ఇట్లు= ఈ ప్రకారంగా; దనుజ+అరికిన్= రాక్షస విరోధి అయిన రాజీవాక్షునకు; కీడు+ఒనరింపన్= హాని కల్గించటానికి; నీవున్= నీవూ; ఈ తులువలున్= ఈ తుంటరులూ; ఉత్సహించితిరి= పూనుకొన్నారు; మీకున్= మీకు; సమీరున్= వాయువును; చేన్+అలవడన్+ పట్టన్+వచ్చునే= చేతిలోనికి ఇమిడేటట్లు బంధించటం శక్యమా? మహా+ అద్రిన్= గొప్ప పర్వతాన్ని; కదల్పఁగన్+పోలునే?= పెల్లగించతరమా? దవ+అనలున్= కార్చిచ్చును; చమరంగన్+శక్యమె= చేతితో నలపటానికి వీలౌతుందా? వినాశము పొందెదరు= మీరు నశించిపోతారు; ఏమిచేయుదున్?= ఏమనగలను? ఏం చేయగలను?

తాత్పర్యం: 'దుర్బుద్ధి పుట్టి మీ శక్తి ఏపాటిదో తెలిసికొనక దైత్య మర్దనుడైన నారాయణుడికే హాని కల్గించటానికి నీవూ, ఈ తుంటరులూ పూనిక వహించారు. వాయువును చేతిలో ఇముడ్చటానికి వీలవుతుందా? మహా పర్వతాన్ని పెకలించటం సాధ్యమా? కార్చిచ్చును నలచివేయటానికి

శక్యమవుతుందా? ఊరక నాశనమై పోతారు సుమా! మిమ్ము నే నేమి చేయగలను?

విశేషం: అలం: నిదర్శన.

**ఆ. అనిన విదురుఁ డిట్టులను సుయోధనుతోడ ।
'బాలకేళిఁ దొడఁగి లీలఁ గృష్ణుఁ
డెచట నెచట నెవ్వరెవ్వరి నేమేమి ।
సేసె వినవె? యేల చెడియె దిట్లు?' 402**

ప్రతిపదార్థం: అనినన్= ధృతరాష్ట్రుడట్లా చెప్పగా; సుయోధనుతోడన్= దుర్యోధనునితో; విదురుఁడు+ఇట్టులు+అనున్= విదురు డిట్లా అన్నాడు; కృష్ణుఁడు= భగవంతుడైన శ్రీకృష్ణుడు; బాలకేళిన్+తొడఁగి= బాలక్రీడలు చేయటానికి ఆరంభించినది మొదలు; లీలన్= వినోదంగా; ఎచటన్+ఎచటన్= ఎక్కడెక్కడ; ఎవ్వరిన్+ఎవ్వరిన్= ఎవరెవరిని; ఏమి+ఏమి+చేసెన్= ఏమేమి చేశాడో; వినవె?= నీవు వినలేదా?; ఇట్లు= ఈ విధంగా; ఏల చెడియెదు(వు)?= ఎందుకు చెడిపోతావు?

తాత్పర్యం: ధృతరాష్ట్రుడు దుర్యోధనుడిని చీకొట్టిన తర్వాత విదురు డతనితో ఇట్లా అన్నాడు: శ్రీకృష్ణుడు శైశవక్రీడ లారంభించినప్పటి నుండి ఎక్కడెక్కడ, ఎవ్వరెవ్వరిని, ఏమేమి చేసిందీ నీకు తెలియదా? వృథాగా ఎందుకు నాశనమై పోతావు?

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం.

వ. అనియె నట్టియెడఁ గట్టెదురనున్న యక్కురుపతికుమారుం జక్కం జూచి యేనొక్కరుండన యని తలంచియె దుర్మదంబునం బొదివి పట్ట నుత్సాహంబు సేసితనుచు దరహాసంబు సేయు వాసుదేవుని ఫాల ప్రదేశంబున బ్రహ్మయు, వక్షంబున విరూపాక్షుండును, వదనంబున వహ్నియుఁ, బార్శ్వంబుల నింద్ర యమ వరుణ కుబేరులు నాదిత్య మరుద్విశ్వేదేవాశ్వినులు నుద్భవించిరి హలగాండీవ మండిత బాహులగు బలదేవార్జునులు సవ్య దక్షిణ భుజంబులను, నిజాయుధ హస్తులగు యుధిష్ఠిర భీమ నకుల సహదేవులు వీఁపునను. వివిధ ప్రహరణ పాణులగు యదువృష్ణి భోజాంధక వీరు లూరులను బ్రభవించిరి; జనిత నానాహస్త విన్యస్తంబులయి శంఖచక్ర గదా ఖడ్గ శక్తి శార్ఙ్గ ప్రముఖ నిఖిల సాధనంబులు వెలింగె; నేత్ర శ్రోత్ర నాసా వివరంబుల సధూమ ధూమకేతు జ్వాలా జాలంబులు నిగిడె; రోమకూప కలాపంబులం దరణి కిరణ నిభ ప్రభలు వెడలె; నిట్లు దుర్నిరీక్షంబగు నత్తేజోరూపంబుఁ గనుంగొనం గొలఁ దిగాక సకల జనంబుల నయనంబులు మొగిడ్చి యద్భుత భయానక రసంబుల జొత్తిల్లు చిత్తంబుల తోడం గదలకుండ నప్పుండరీకాక్షుండు నారదాది మహా మునుల వలనను భీష్మవిదుర ద్రోణ సంజయుల యందును గరుణా తరంగితంబగు కటాక్ష వీక్షణం బొలయ వారలకు దివ్య దృష్టి యొసంగిన నా పుణ్యపురుషులు సాంద్రానందంబునం దేలుచుండి; రయ్యవసరంబున. 403

ప్రతిపదార్థం: అనియెన్= అని పలికినాడు; అట్టి+ఎడన్= ఆ సమయంలో; కడు+ఎదురన్+ఉన్న= ఎట్ట ఎదుట ఉండిన; ఆ కురుపతికుమారున్+ చక్కన్+ చూచి= ఆ ధృతరాష్ట్ర పుత్రుని తేరిచూచి; ఏను= నేను; ఒక్కరుండన్+ అ+అని= ఒంటరివాడనని; తలంచియె= భావించియేగదా; దుర్మదంబునన్= దురహంకారంతో; పొదివి+పట్టన్= ఆక్రమించి బంధించటానికి; ఉత్సాహంబు చేసితి(వి)= పూనిక వహించావు; అనుచున్= అని పల్కుతూ; దరహాసంబు చేయు= చిరునవ్వు నవ్వుతున్న; వాసుదేవుని ఫాలప్రదేశంబునన్= శ్రీకృష్ణుని యొక్క నొసటిభాగంలో; బ్రహ్మయున్= బ్రహ్మదేవుడూ; వక్షంబునన్= గుండెమీద; విరూప+అక్షుండును= శంకరుడును; వదనంబునన్=

ముఖమునందు; వహ్నియున్= అగ్నీ; పార్శ్వంబులన్= కుడి యెడమ ప్రక్కలందు; ఇంద్ర= ఇంద్రుడూ, యమ= యముడూ; వరుణ= వరుణుడును; కుబేరులున్= కుబేరుడు అనే దిక్పాలకులున్నూ; ఆదిత్య= ఆదిత్యులు; మరుత్= మరుత్తులు; విశ్వేదేవ= విశ్వేదేవులు; ఆశ్వినులున్= ఆశ్వినులనేవారు; ఉద్భవించిరి= పుట్టారు. హల గాండీవమండిత బాహులు+అగు= నాగలి, గాండీవం అనే ఆయుధాలతో ప్రకాశించే హస్తాలుగల; బలదేవ+అర్జునులు= బలరాముడు, అర్జునుడు; సవ్యదక్షిణ భుజంబుల= ఎడమకుడిచేతులందు; నిజ+ఆయుధ హస్తులు+ అగు= తమ తమ ఆయుధాలు చేతులందు కల్గిన; యుధిష్ఠిర= ధర్మజుడు; భీమనకులసహదేవులు; వీఁపునను= వీపునందును; వివిధ ప్రహరణపాణులు+ అగు= రకరకాలైన ఆయుధాలు చేతులయందు ధరించిన వారైన; యదువృష్ణి భోజ+అంధక వీరులు= యదువృష్ణి భోజ అంధక వంశాలకు చెందిన శూరులు; ఊరులను= తొడలయందును; ప్రభవించిరి= పుట్టారు; జనిత నానాహస్త విన్యస్తంబులు+అయి= కలిగిన పెక్కుచేతులందు ఉంచబడినవై; శంఖచక్రగదా ఖడ్గ శక్తి శార్ఙ్గ ప్రముఖ= శంఖం చక్రం గద ఖడ్గం శక్తి శార్ఙ్గం మొదలైన; నిఖిల సాధనంబులు= సమస్తములైన ఉపకరణములు; వెలింగెన్= ప్రకాశించాయి; నారాయణుడి శంఖం పేరు పాంచజన్యం; సుదర్శనం ఆయన చక్రం; కౌమోదకి గద; ఖడ్గ నామం నందకం; చాపం పేరు శార్ఙ్గం.

నేత్ర శ్రోత్ర నాసా వివరంబులన్= కన్నులు, చెవులు, ముక్కు అనే అవయవాల యొక్క రంధ్రాల నుంచి; సధూమ= పొగతో కూడిన; ధూమకేతు= అగ్నియొక్క; జ్వాలాజాలంబులు= మంటలయొక్క గుంపులు; నిగిడెన్= వ్యాపించాయి; రోమకూప కలాపంబులన్= రోమకూపాల సమూహమునుండి; తరణి కిరణ= సూర్యకిరణాలతో; నిభ= సమానాలైన; ప్రభలు= కాంతులు; వెడలెన్= బయలుదేరాయి; ఇట్లు= ఈ మాదిరి; దుర్నిరీక్షంబు= చూడటానికి శక్యం కానిది; అగు= అయినట్టి; ఆ తేజోరూపంబున్= ఆ తేజోమయమైన స్వరూపాన్ని; కనుంగొనన్= చూడటానికి; కొలఁది+కాక= తరంకాక; సకల జనంబులు; నయనంబులు= కన్నులు; మొగిడ్చి= మూసికొని; అద్భుత భయానక రసంబులన్= ఆశ్చర్యము; భయానకం అనే రసాలతో; జొత్తిల్లు= తడిసిన; చిత్తంబుల తోడన్= మనసులచే; కదలక+ఉండన్= చలించకుండగా; ఆ+పుండరీక+అక్షుండు= ఆ కమల నయనుడు; నారద+ఆది మహామునులవలనను= నారదుడు మొదలైన మహర్షుల వైపునను; భీష్మ విదుర ద్రోణ సంజయులందును; కరుణా తరంగితంబు+అగు= కృపారసమున పొంగి పొరలుతున్న; కటాక్ష వీక్షణంబు+ ఒలయన్= కడకంటి చూపు ప్రసరించగా; వారలకున్= ఆ మహనీయులకు; దివ్యదృష్టి; ఒసంగినన్= ప్రసాదించగా; ఆ పుణ్యపురుషులు= ఆ సుకృతాత్ములు; సాంద్ర+ ఆనందంబునన్= అధికమైన సంతోషము నందు; తేలుచున్+ఉండిరి= ఓలలాడుతూ ఉండిపోయారు; ఆ+అవసరం బునన్= ఆ సమయంలో.

తాత్పర్యం: ఆ సమయంలో శ్రీకృష్ణుడు ఎట్టయెదుటనున్న దుర్యోధనుడిని తేరిపారజూచి 'నేను ఒంటరివాడననే కదా నీవు దుర్గర్వంతో నన్ను పైనబడి బంధించాలని ఉత్సాహపడుతున్నావు అంటూ ఒక చిరునవ్వు నవ్వాడు. అప్పుడు ఆ వాసుదేవుడి నుదుట బ్రహ్మదేవుడు, వక్షఃస్థలంలో రుద్రుడు, ముఖంలో అగ్ని, పార్శ్వ ప్రదేశాలలో ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, ద్వాదశాదిత్యులు, మరుత్తులు, విశ్వేదేవతలు, ఆశ్వినులు జనించారు. నాగలి, గాండీవం చేతులందు ధరించిన బలరాముడు పార్థుడు ఎడమ కుడిచేతుల నుంచి ఉద్భవించారు. వీపునుండి తమ తమ ఆయుధాలు చేతులందు గలిగి ధర్మరాజు, భీమసేనుడు, నకులుడు, సహదేవుడు ఆవిర్భవించారు. అనేకములైన ఆయుధాలు హస్తాలలో ధరించిన యదు, వృష్ణి, భోజక, అంధక వంశాలకు చెందిన తన బంధువులైన వీరు లెందరో శౌరి తొడలనుండి ప్రభవించారు. భగవంతుడైన ఆ పరమ పురుషుడి

నానాహస్తాలలో శంఖం, చక్రం, గద, ఖడ్గం, శక్తి, శార్‌ఙ్గం మొదలైన పలు దివ్యాయుధాలు ప్రకాశించాయి. పురుషోత్తముడి నేత్ర కర్ణ నాసికా రంధ్రాల నుండి పొగతో కూడి అగ్నిజ్వాలల సముదాయం వెలువడి వ్యాపించింది. త్రివిక్రముడి రోమ కూపాలనుండి రవికిరణాలతో సమానమైన కాంతులు వెలువడ్డాయి. ఇట్లా నేత్రాలు మిరుమిట్లు గొలిపే ఆ ముకుందుడి దివ్యతేజ స్స్వరూపం చూడటానికి శక్యం కాక సమస్త జనులు కన్నులు మూసుకొని ఆశ్చర్య భయానక రసాలలో తమ మనస్సులు మునిగి తేలుతుండగా నిశ్చేష్టులయ్యారు. అప్పుడు తెల్ల దామరలవంటి కన్నులు గల ఆ దేవదేవుడు నారదుడు మొదలైన మహర్షుల వైపూ, భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, సంజయుడు అనే వారివైపూ దయతో నిండిన తన కడగంటి చూపులు ప్రసరింపజేసి వారికి తన విశ్వరూపం సందర్శించటానికి దివ్యదృష్టి ప్రసాదించాడు. ఆ పుణ్యపురుషులు నారాయణమూర్తియొక్క విశ్వరూపాన్ని తిలకిస్తూ పరిపూర్ణమైన ఆనందానుభవంలో ఓలలాడుతూ ఉన్నారు. ఆ సమయంలో.

విశేషం: కశ్యప ప్రజాపతికి అదితివలన కల్గినవారు ఆదిత్యులు. వీరు పన్నెండుమంది. ఇంద్రుడు, ధాత, సవితృడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.

మరుత్తులు ఏభైనాల్గుమంది.

ఇంద్రుడు దితిగర్భంలో ప్రవేశించి వజ్రాయుధంతో భ్రూణమును నలభై తొమ్మిది శకలాలు కావించాడు. పంచ ప్రాణాలు తోడుకాగా వీరు యాభై నలుగురయ్యారు.

విశ్వేదేవులు పదిమంది. ధర్మునకు దక్షపుత్రి విశ్వయందు జన్మించినవారు; క్రతువు, దక్షుడు, వసువు, సత్యుడు, కాలరాముడు, ముని, కురజుడు, మనుజుడు, వీజుడు, రోచమానుడు. హవ్య కవ్యాలలో వీరు అర్చితులు.

అశ్వినీ దేవులు ఇద్దరు.

తనరూపం చూడగోరిన అర్జునిడికి శ్రీకృష్ణ పరమాత్మ దివ్య చక్షువు లిచ్చి చూడుమంటూ చూపిన రూపంలో వీరంతా గోచరించారు.

పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రా నశ్వినౌ మరుతస్తథా,
బహూ న్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత. (గీత 11-6)

తే. దేవదుందుభి వ్రాతంబు దివిరెఁ గల్ప।
వృక్ష పుష్ప ధారామయ వృష్టి గురిసె
సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి భక్తి।
నిచ్చు జయజయ శబ్దంబు లెసఁగెఁ జదల. 404

ప్రతిపదార్థం: దేవదుందుభి వ్రాతంబు= వేల్పుల భేరులయొక్క సమూహం; తివిరెన్= మ్రోగింది; కల్పవృక్ష పుష్ప ధారామయవృష్టి= కల్పతరు కుసుమాలు అనే జల్లులతో నిండిన వాన; కురిసెన్= వర్షించింది; సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణి= సిద్ధులు, సాధ్యులు, విద్యాధరులు అనే దేవతాగణం; భక్తిన్= భక్తితో; ఇచ్చు= సలుపునట్టి; జయజయ శబ్దంబులు= జేజే అనే ధ్వనులు; చదలన్= ఆకాశంలో; ఎసఁగెన్= అతిశయించాయి.

తాత్పర్యం: దేవతలయొక్క భేరీ సమూహం మ్రోగింది. కల్పతరు కుసుమాల వానజల్లు కురిసింది. సిద్ధులు సాధ్యులు విద్యాధరులు అనే దేవతా సముదాయం భక్తితో చేసిన జయజయధ్వానాలు అంతరిక్షంలో నిండాయి.

వ. అప్పుడు ధృతరాష్ట్రుం డమ్మహాసంకులంబు విష్ణుని దివ్యవిజృంభణంబు గావలయు నని యూహించి. 405

ప్రతిపదార్థం: అప్పుడు; ధృతరాష్ట్రుండు; ఆ+మహాసంకులంబు= సభయందు ఏర్పడిన కలకల ధ్వని; విష్ణుని దివ్య విజృంభణంబు కావలయున్+అని= వాసుదేవుడి యొక్క విశ్వవ్యాపకత్వ మగునేమో అని; ఊహించి= వితర్కించి.

తాత్పర్యం: అప్పుడు ఆంబికేయుడు కొలువులో ఏర్పడ్డ కలకలధ్వని విని, అది గోపాలదేవుడి యొక్క విశ్వరూప ప్రదర్శనమై ఉంటుందని భావించి.

క. 'కరుణింపుము సంశ్రితభయ ।
హరణ ధురీణా! సహింపు మజ్ఞానంబున్
శరణంబు వేఁడెద భవ ।
చ్చరణంబులు గనుఁగొనం బ్రసాదింపఁగదే! 406

ప్రతిపదార్థం: సంశ్రిత భయహరణధురీణా!= ఆశ్రితులయొక్క భీతిని తొలగించే కార్యభారం వహించేవాడా!; కరుణింపుము= దయచూడుము; అజ్ఞానంబున్= అవివేకాన్ని; సహింపుము= మన్నించు; శరణంబు వేఁడెదన్= నిన్నే రక్షకుడిగా ప్రార్థిస్తున్నాను; భవత్+చరణంబులు= నీ పాదాలు; కనుఁగొనన్= దర్శించటానికి; ప్రసాదింపన్+కదే!= అనుగ్రహించుము.

తాత్పర్యం: 'వాసుదేవా! ఆశ్రితుల భయాన్ని తొలగించేవారిలో అగ్రేసరుడవు. నన్ను దయతో చూడు. నా అజ్ఞానాన్ని మన్నించు. నిన్నే శరణు వేడుతున్నాను. నీ పాదములు దర్శించే భాగ్యం అనుగ్రహించు'.

చ. అనుడు దయార్ద్రచిత్తుఁడగు నప్పరమేశ్వరుఁ డిచ్చె దృష్టి య
జ్జనపతి కద్భుతం బడర సమ్మదపూరము గ్రమ్మ నాతఁడుం
గనుఁగొని భక్తి మ్రొక్కి 'నినుఁగంటిఁ గృతార్థుఁడనైతి; నింక నొ
ల్ల నొరులఁ జూడ లోచనములం బురుషోత్తమ! సంహరింపవే 407

ప్రతిపదార్థం: అనుచున్= అని ఆంబికేయుడు వేడగా; దయా+ఆర్ద్ర చిత్తుఁడు+అగు= దయతో తడిసిన మనస్సుగల ఆ+పరమ+ఈశ్వరుఁడు= ఆ దేవ దేవుఁడు; ఆ+ జనపతికిన్= ఆ నరేశ్వరుడైన ధృతరాష్ట్రుడికి; అద్భుతంబు+అడరన్= ఆశ్చర్య మతిశయిల్లగా; దృష్టిన్+ఇచ్చెన్= చూపు ననుగ్రహించాడు; ఆతఁడున్= అంధరాజైన ధృతరాష్ట్రుడు; సమ్మదపూరము+క్రమ్మన్= ఆనందాశ్రువులు కన్నులలో నిండగా; కనుఁగొని= స్వామి యొక్క విశ్వరూపం సందర్శించి; భక్తిన్= భక్తితో; మ్రొక్కి= నమస్కరించి; పురుషోత్తమ!= గోవిందుడా!; నినున్‌కంటిన్= నిన్ను దర్శించాను; కృతార్థుఁడన్+ఐతిన్= ధన్యుడనయ్యాను; ఇంకన్= ఇటుపై; ఒరులన్+చూడన్+ఒల్లన్= ఇతరులను చూడటానికి ఇష్టపడను; లోచనములన్= నీ విచ్చిన నేత్రాలను; సంహరింపవే= నిరోధించు!

తాత్పర్యం: ధృతరాష్ట్రు డట్లా వేడగా దయారసంతో తడిసిన మనస్సుగల ఆ దేవదేవుడు అంధనృపతికి ఆశ్చర్యం కలిగేటట్లు దివ్యదృష్టి ప్రసాదించాడు. దేవుడిచ్చిన చూపుతో కనులలో ఆనందబాష్పాలు క్రమ్మగా అతడు శ్రీకృష్ణుడి విశ్వరూపం వీక్షించి భక్తితో నమస్కరించి 'పురుషోత్తమా! నిన్ను చూచాను. ధన్యుడనయ్యాను. నిన్ను జూచిన కన్నులతో ఇతరులను చూడటాని కిష్టపడను. నీవిచ్చిన చూపు నీవే వెనుకకు తీసికొమ్ము!'

క. అనిన పలుకులకు నచ్చటి ।
జనులెల్ల నృపాలు సితవిశాలాక్షుఁ గనుం
గొనుచుండి రపుడు తమనె ।
మ్మనమ్ము లాశ్చర్యరస నిమగ్నంబులుగాన్. 408

ప్రతిపదార్థం: అనిన పలుకులకున్= అనిన ధృతరాష్ట్రుడి మాటలకు; అపుడు= ఆ సమయాన; అచ్చటి జనులు+ఎల్లన్= అక్కడున్న జనులంతా; తమ నెమ్మనమ్ములు= తమ నిండు హృదయాలు; ఆశ్చర్య రస నిమగ్నంబులు కాన్= అద్భుత రసంలో మునిగినవి కాగా; సితవిశాల+అక్షున్= తెల్లని వెడదలైన కన్నులు గల; నృపాలున్= ఆ ధృతరాష్ట్ర మహారాజును; కనుంగొనుచున్+ఉండిరి= చూస్తూ ఉన్నారు.

తాత్పర్యం: ధృతరాష్ట్రుని మాటలకు ఆ సభలో ఉన్న జనులందరూ తమ హృదయాలు అద్భుతరసంలో మునిగిపోగా విశాలమైన తెల్లని కన్నులు గల ఆ రాజును చూస్తూ ఉండిపోయారు.

వ. తదనంతరంబ దామోదరుండు ధృతరాష్ట్రు నభిమతం బొడఁగూడ నతని కన్ను లెప్పటియట్ల కావించి, నిజ విశ్వరూప ప్రపంచంబు నుపసంహరించి, మునీంద్రుల నామంత్రణంబు సేయ నమ్మహాత్ము లంతర్ధానంబు సేసిరి; దానును సముత్థానంబు సేసి యంతకుమున్న సన్నిహితులైయున్న కృతవర్మ కరంబును, సాత్యకి హస్తంబును నవలంబించి యూరక వెడలెనని చెప్పిన. 409

ప్రతిపదార్థం: తద్+అనంతరంబు+అ= ఆ తరువాత; దామోదరుండు= శ్రీకృష్ణుడు; ధృతరాష్ట్ర+అభిమతంబు= ధృతరాష్ట్రుడి యొక్క కోరిక; ఒడఁగూడన్= నెరవేరగా; అతని కన్నులు; ఎప్పటి+అట్ల+కావించి= మునుపటి వలె అంధములుగా ఉండేటట్లు చేసి; నిజ విశ్వరూప ప్రపంచంబున్= తన విశ్వవ్యాపకమైన దివ్యరూపాన్ని; ఉపసంహరించి= వెనుకకు తీసికొని; ముని+ ఇంద్రులన్= నారదాది మహర్షులను; ఆమంత్రణంబు+ చేయన్= పోయిరండని సెలవీయగా; ఆ+మహాత్ములు= ఆ మహానుభావులు; అంతర్ధానంబు చేసిరి= మాయమైనారు; తానును= శ్రీకృష్ణుడుకూడా; సముత్థానంబు+చేసి= పీఠంనుండి దిగి; అంతకున్+ మున్న= తాను పీఠం నుండి లేవడానికి మునుపే; సన్నిహితులు+ఐ= సముఖాన నిలిచినవారై; ఉన్న= ఉన్నట్టి; కృతవర్మ కరంబును= కృతవర్మయొక్క చేతిని; సాత్యకి హస్తంబును= సాత్యకియొక్క చేతిని; అవలంబించి= పట్టుకొని; ఊరక వెడలెన్= మౌనంగా బయలుదేరాడు; అని చెప్పినన్= అని వైశంపాయన మహర్షి చెప్పగా.

తాత్పర్యం: ఆ తరువాత శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి కోరిక తీరేటట్లు ఎప్పటివలెనే అతడి కన్నులు గ్రుడ్డివిగా చేసి తన జగద్వ్యాపకమైన మహామూర్తిని ఉపసంహరించాడు. నారదాది మహర్షులకు వెళ్ళిరండని సెలవిచ్చాడు. అంతట ఆ మహనీయులు అదృశ్యమయ్యారు. అప్పుడు వాసుదేవుడు తన పీఠం నుండి దిగాడు. అప్పటికే సముఖంలో నిలిచి ఉన్న సాత్యకి కృతవర్మల హస్తము లూది నారాయణుడు మౌనంగా అక్కడినుండి బయలుదేరాడు అని వైశంపాయన మహర్షి జనమేజయుడికి చెప్పాడు.